తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం -28

# శృంగార సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)

ప్రచురణ

అన్నమాచార్య ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు

1999

T.T.D. Religious Series -

ప్రథమ ముద్రణ : 1999

© తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

ప్రతులు : 2,000

ప్రచురణ :
డా॥ I. V. సుబ్బారావు, I.A.S.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

ముద్రణ :
కీర్తి ఆఫ్‌సెట్
103, ప్రకాశం రోడ్
తిరుపతి - 517 501
ఆంధ్రప్రదేశ్

# విన్నపము

ఇందరికి అభయంబు లిచ్చు చేయి
కందువగు మంచిబంగారు చేయి ॥

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు. ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి. వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు.

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి.

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది. తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు.

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి.

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు.

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి.

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి. ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు. పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి. తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది.

ప్రథమతః తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యుమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A., Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము.

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం.

**M.K.R. వినాయక్**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి ప్రపత్తి, దేహాత్మేశ విచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు; జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు. సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు. శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు. శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు.

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశములో తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు. తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి.

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు. అన్నమయ్య గ్రాంథిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు. జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు.

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు. వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు.

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి.

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం- పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది. మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది.

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి. మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

ప్రమఖ్యయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి.

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింపబడుచున్నాయి. పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి. తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి. సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది.

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది.

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి.

ఈ సంపుటాల ముద్రణకు ఆధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.కె.ఆర్.వినాయక్ I.A.S. గారికి కృతజ్ఞతాంజలి.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A., Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు.

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం. లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి.తి.దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి. సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు.

డా॥ మేడసాని మోహన్ M.A., Ph.D

డైరెక్టర్

తేది : 10-2-98

అన్నమాచార్య ప్రాజెక్ట్

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

## తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి. వివిధ దశలలో 5, 6, 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి. వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

# పీఠిక

## శృంగార నాట్య శిల్పము

విరహము వలవదు రసికులు వినరో చాటుచుఁ జెప్పెద
  తరితీపను చెఱకున నిత్తఱిఁ బండు వండె నిదె    ॥ పల్లవి ॥

బగివాయఁగ రాదిక దంపతులకు నెక్కడ చూచిన
  చిగురుకుఁ జేఁగలు వచ్చెను చిత్తజురాజ్యమున
  తగిలి తగిలి కోవిల కూతలు మొగసాలల కెక్కెను
  జగమున విరసపుఁ బవనుఁడు చల్లని వాఁడాయ    ॥ విరహము॥

పొసఁగంగ నెవ్వరికైనను పొందులె జరపఁగ వలసెను
  పసిమొగ్గలు వాడెక్కెను వసంతకాలమున
  ముసగస లాడెడు తుమ్మిదల మోతల చలములు చెల్లెను
  సుసరము నవె పగరాజును చుట్టము వాఁడాయ    ॥ విరహము॥

కలయికలే కలకాలము కాణాచులుగాఁ బరగెను
  ఇలలో శ్రీ వేంకటపతి యిచ్చిన సంపదను
  యెలమిని పదారువేలకు ఇతఁడే మగఁడై నిలిచెను
  కలగొని మనసనియెడి చెలికాడును దోడాయ    ॥విరహము॥

(ఈ సంపుటం - సంకీర్తన సంఖ్య - 27)

ఇది అన్నమయ్య రసికుల కిచ్చిన సార్వకాలిక సందేశం! రసిక జీవన నాట్య శిల్పాని కిది మూల సూత్రం!! శృంగార సంకీర్తనల రసాస్వాదనానికిది మహాద్వారం !!! ఆ ద్వారం వద్ద, చూత కిసలయాలు తోరణాలుగా కట్టిన ఆమహాద్వారం వద్ద, అన్నమయ్యయే స్వయంగా నిలబడి రసికులకు స్వాగతం పలుకు తున్నాడు. రసిక హృదయులను తన సంగీత సాహిత్య రస విభావరీ చర్వణానికి సమాహ్వానిస్తున్నాడు.

రసికుడనగా శృంగారి. రస్యమానతా హృదయము గలవాడు రసికుడు,

శృంగారి అనబడుతాడు. అంతేతప్ప, రసికుడంటే శృంగార లోలుడు కాడు, శృంగారి అంటే కాముకుడు, కామాతురుడు అంతకంటే కాదు. ఆంగ్ల భాషలో చెప్పాలంటే aesthetic sense గలవాడు రసికుడు. వీనినే భారతీయ అలంకార శాస్త్రం సహృదయుడని, భావుకుడని నిర్దేశించి, కవిని ఉద్దేశించి యిట్లన్నది.

శృంగారీ చేత్ కవిః కావ్యే జాతం రసమయం జగత్।
స ఏవ వీతరాగశ్చేత్ నీరసం జాతమేవ తత్॥ [1]

రసార్ద్రమైన చిత్తవృత్తి గలిగిన కవియే 'శృంగారి' అనబడుతాడు. అతడే రసమయ జగత్తు గల్గిన కావ్యాన్ని సృష్టింపగలడు. ఆ కవియే శుష్క హృదయుడైతే కావ్యం రసహీనమై చతికిల బడుతుంది అని దీని కర్థం. అంటే కావ్యం రసికుల హృదయాన్ని కదిలించదు. స్పందింపనీయదు.

ఈ స్పందనను, కదలికను నిత్యము సాహిత్య మననము చేత జాగ్రత్త పరచుకొన్నవాడే రసికుడు. అట్టివారి నుద్దేశించియే అన్నమయ్య పై కీర్తన వ్రాశాడు. అదొక్కటే కాదు. తన శృంగార సంకీర్తనల భాండాగారాన్ని వారి చేతుల్లో పెట్టాడు. ఈ భావుక పరంపర చేతనే అన్నమయ్య ఈ నాటికీ సజీవంగా ఉన్నాడు.

ఈ రసికులందరూ ఒకే కోవకు చెందినవారే! వీరిలో శృంగార రసికులని, సాహిత్య రసికులనే భేదం లేదు. ఉన్నదని లోకం చెప్పినప్పటికీ, రాసిక్యమన్నది యిరువురికీ సమానమే! రసికత గలవాడు రసికు డన్నాము. సంస్కృతంలో " రసిక జీవన " మనే అలంకార శాస్త్ర గ్రంథమే ఉన్నది. 'రస్యమానత ' ప్రధాన లక్షణముగా గలవి లలిత కళలైన సంగీత సాహిత్యములు!

తెలుగువారిలో సాహిత్య రసికతను ఉజ్జీవింపజేసిన వారు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు. వారు రచించిన సంకీర్తనల 11 సంపుటాలను పరిష్కరించిన

[1] అగ్ని పురాణమ్ 339-11

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి వాక్యాలనిక్కడ స్మరిద్దాం !

" రసికుడనగా భోగి! తన మనస్సున కానందము నిచ్చు భోగము లనుభవించుటలో కష్ట సుఖములుగాని, లాభనష్టములు గాని తుదకు ధర్మా ధర్మములు గాని యెక్కువగా లెక్కపెట్టక పనిచేయువాడు రసికుడు. భోగములు ప్రవృత్తి భోగములని, నివృత్తి భోగములని రెండు విధాలు. ఆనంద మనునది మనోధర్మము గాని వస్తు ధర్మము కాదు. ఏ కారణము చేతగాని, దేనియందు మనస్సు దృఢముగా లగ్నమగునో దాని ననుభవించు నప్పుడు మనకు నిరతిశయానందము గలుగును. అట్టి యానందమును సాధింప ప్రయత్నించుటయే రసికత్వమునకు లక్షణము. రసికత్వ మెంత యుండునో యంత గొప్పతనము మనుష్య జాతి యందుండును. ఇది లేనివారు నడపీనుగులుగా నుందురే గాని బ్రతికినవారి గుంపులో చేరరు."

ఇంతకూ రసికుల నుద్దేశించి వ్రాసిన పై కీర్తనలో అన్నమయ్య ఏమంటున్నాడు? నలుదిక్కుల్లోని రసికుల నాహ్వానిస్తూ - అయ్యా! ఇది రసిక రాజ్యము ! ఇక్కడ యిక మీదట ' విరహ ' మనే మాటకు తావులేదు. ఎందుకంటే, చెఱకు విలుకాని పంట యిప్పుడు పండినది. దంపతుల కిక్కడ ఎడబాటులేదు. విరహ మంతకంటే లేదు, సరికదా - ఒకరి ప్రక్క నొకరు, ఒకరి వెంట నొకరు ఆసుపోసినట్లుగా తిరగవలసిందే ! ఈ మన్మథుని రాజ్యంలో చిగురుకు చేవవచ్చింది. ' అచట బుట్టిన చిగురు కొమ్మైన చేవ' అన్నమాట సార్థకమైంది. కోవిల కూతలు యిండ్ల ముంగిళ్లలోనికి అంటే యౌవన ప్రాంగణంలోని ప్రేయసీ ప్రియుల హృదయాలకు తగిలి తగిలి యింపెక్కాయి. అందాకా వేడి గాలులు వీచిన పవనుడు కాస్తా చల్లని వాడయ్యాడు.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రేయసీ ప్రియుల సమాగమంతప్పదు. ఈ వసంతకాలంలో పసి మొగ్గలు సైతం వాడి యెక్కాయి. అనగా పుష్ప బాణుడైన మన్మథుడు తన పంచబాణాలను వాడిగా యెక్కుపెట్టాడు.

అవ్యక్త మధురంగా మునగసలాడే తుమ్మెదల మోతల సాధింపులకు కాలం చెల్లింది. చాల సులభంగానే, ఒకప్పుడు విరహకాలంలో పగబూనిన చంద్రుడు దగ్గరి చుట్టమయ్యాడు.

ప్రేయసీ ప్రియులైన దంపతుల కలయికయే యిప్పుడు కాణాచిగా గుర్తింపబడింది. పదారు వేల గోపస్త్రీలకు తానొక్కడే మగడై శ్రీ వేంకటపతి ఈ భూమిపై నిలచి సంపదతో వెలుగుతున్నాడు. ఇక రసికులకు వారి మనస్సనే చెలికాడు తోడైవున్నాడు. రసికులకు విరహవ్యధ యిక ముమ్మాటికీ లేదని అన్నమయ్య ఘంటాపథంగా చాటి చెప్పిన కీర్తన యిది.

" రసికరాజ తగువారముకామా ! " అన్నట్లు, ఆ మన్మథుని కన్న తండ్రియైన స్వామిని, అనంతకల్యాణ గుణగణములు గల అఘటనఘటనా సమర్థుడైన స్వామిని పురస్కరించుకొని రసికులకు వాగ్దానం చేస్తున్నాడు అన్నమయ్య !

స్వామివారి తరపున తానొక శృంగార రాయబారియై, తన సాహిత్య సర్వస్వాన్ని స్వామికి సమర్పించి, రసించి, పరవశించి, " ఆడిన మాటెల్ల అమృతకావ్యముగ, పాడిన పాటెల్ల పరమగానముగ " రచించిన శృంగార సంకీర్తనల రసాస్వాదనకు రసికులను సమాయత్త పరుస్తున్నాడు అన్నమయ్య!

అధ్యాత్మపరంగా ఆలోచిస్తే - ఈ జీవుడొక " నిత్య విరహి ! " భగవదైక్యం కోసం నిరంతరం పరితపిస్తున్నవాడు. అన్నమయ్య వాగ్దానంలోని అంతరార్థమే మంటే జ్ఞానవైరాగ్యాలనే కఠిన మార్గాలను అవలంబించి ఎన్నో జన్మలు భగవద్విభూతిని పొందలేక పరితపించే కంటే, అత్యంత సులభమైన మధుర భక్తి మార్గాన్ని, అవలంబించి ప్రేమచే మనస్సును నింపుకోగలిగితే అదే నిజమైన రసికత - అటువంటి వాని జీవితమే ఆనందమయం ! అదే ఆ ఆనంద నిలయుని నిత్య నివాసమైన శ్రీ వేంకటగిరి చేరుకొనేమార్గం ! ఆయన యొక్క శృంగార లీలన్నీ ఈ జగత్తంతా వ్యాపించాయి. ' లోకవత్ తల్లీలా

కైవల్యమ్' అని బ్రహ్మసూత్రములు చెప్పాయి. జగన్నాటకసూత్రధారియైన వేంకటపతి శృంగార లీలా భావన మనేది ఈ జీవుల అంతర్మాలిన్య క్షాళన మొనర్చి రసార్ద్రీ భూతచేతస్కులను చేసి క్రమక్రమంగా బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి యోగ్యులనుగా చేస్తుంది. అందుకే రసాను భవ దశలోనికి రండి, అక్కడ భగవంతునికీ, భక్తునికీ మధ్య విరహము లేదు - ప్రేయసీ ప్రియుల వలె - అను నిత్య విరహులైన రసిక జీవులను శృంగార లీలారసపట్ట భద్రుడైన స్వామి సన్నిధికి ఆహ్వానిస్తున్నాడు అన్నమయ్య !

ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ జీవుడొక గోపిక ! ఎందరు జీవులో అందరు గోపికలు !! స్వామి ఒక్కడే పురుషుడు ! ఈ జీవులందరు గోపికలైన స్త్రీలు ! వీరిరువురి శృంగార లీలావిలాసములే అన్నమయ్య అన్ని ముఖాలుగా, అన్ని విధాలుగా, పుంఖాను పుంఖాలుగా పరవశించి పాడిన శృంగార సంకీర్తనలు! " ఎలమిని పదారువేలకు ఇతఁడే మగడై నిలిచెను ! " అనే మాట వెనుక గల అంతరార్థమిదే ! ధన్యుడు మన అన్నమయ్య ! తన సాహితీ సూత్రాన్నీ, పదకవితా ఆంతర్యాన్నీ మన కొక్క సంకీర్తనలో అందించి మనల్ని చరితార్థుల్ని చేశాడు !

*" ఒక్క సంకీర్తనే చాలు*
*వొద్దికై మమ్ము రక్షించఁగ*
*తక్కినవి భండారాన*
*దాఁచి వుండనీ "*

అని మన తరపున కూడ తానే స్వామికి విన్నవించిన సంకీర్తనాచార్యుడు పదకవితా పితామహుడైన అన్నమయ్య శృంగార సంకీర్తన తత్త్వాన్ని స్థాలీపులాకంగా పరిశీలిద్దాం !

## శృంగార రస స్వరూపము

" శృంగం ప్రాధాన్య మియర్తీతి శృంగారః "

అని సాహిత్యరత్నాకరములో ధర్మసూరి. నవరసాలలో శృంగారం ఉత్తమత్వాన్ని పొందుతూ వుంది కాబట్టి శృంగారమని పిలువబడింది.

శృంగం హి మన్మథోద్భేద స్తదాగమన హేతుకః ।
ఉత్తమ ప్రకృతి ప్రాయో రస శ్శృంగార ఇష్యతే ॥

శృంగమంటే కామోద్రేకం. దానిని కలిగించడానికి కారణమై రత్యాది ప్రధాన ప్రకృతులచే విస్తరించే రసం శృంగార మనబడుతుంది అని విశ్వనాథ కవిరాజు సాహిత్యదర్పణము.

" పురుష ప్రమదా భూమి శ్శృంగార ఇతి గీయతే "

మన్మథోద్రేక కారణమై స్త్రీపురుష నిష్ఠమైన రసం శృంగారమని కావ్య ప్రకాశ వ్యాఖ్యలో భట్టవామనాచార్యుడు.

శృంగార ఏవ మధురః పరః ప్రహ్లాదనో రసః ।
తన్మయం కావ్య మాశ్రిత్య మాధుర్యం ప్రతితిష్ఠతి ॥

శృంగార మొక్కటే నవరసాలలో మధురమైనది. తక్కినవి కేవలం ఆనందాన్ని కలిగించేవి మాత్రమే. శృంగార రసాన్ని ఆశ్రయించిన కావ్యంలోనే మాధుర్య ముంటుంది అని ఆనందవర్ధనుని ధ్వన్యాలోక కారిక (2.7). ఇదే అభినవ గుప్త పాదుల మతం కూడ.

" రస్యతే ఆస్వాద్యతే ఇతి రసః " అనే వ్యుత్పత్తిచే రసశబ్దానికి సుఖాస్వాద రూపమైన శృంగార మనియే అర్థం. సుఖ మొక్కటే ఆస్వాద్యమవడంచే సుఖాస్వాద రహితాలైన కరుణాదులకు రసత్వం ఘటింపదని శృంగార ప్రకాశంలో భోజరాజు వాదించినాడు. " శృంగార ఏక ఏవ రసః " అని ఆయన వాదసారాంశము.

" రతిస్థాయి ప్రభవమై ఉజ్జ్వల వేషాత్మకమైనది శృంగారం. లోకంలో మిక్కిలి పవిత్రమైనది, దర్శనీయమైన వస్తువు శృంగారంతో ఉపమానింప బడుతుంది. ఎవడు మనోహరమైన వేషము గలవాడో వాడు శృంగారవంతుడు. ఉత్తమ యౌవన ప్రకృతి గల యిది స్త్రీ పురుష హేతుక"మైనదని భరతముని నాట్యశాస్త్రం.

అన్నమయ్య శృంగార సంకీర్తనలన్నీ శ్రీవేంకటేశ్వరుడు నాయకుడుగా, అలమేలుమంగమ్మ నాయికగా గలవి. ఇంతకంటె ఉత్తమ ప్రకృతి గల నాయికా నాయకులు లభించడం కష్టం. కాబట్టి, శృంగార రస తత్త్వాన్ని సాకల్యంగా తెలుసుకోవాలనుకోవడం రసాత్మకుడైన పరమపురుషుని తత్త్వం తెలుసుకోవాలని ప్రయత్నించడమే అవుతుంది. అందుకే తైత్తిరీయోపనిషత్తు-

*" రసోవైసః రసగ్ హ్యేవాయం లబ్ధ్వా ఽ ఽ నందీ భవతి "*

అని కీర్తించింది. అద్వయ బ్రహ్మమే రసము. ఈ రసావగతిని పొందినవాడు ఆనందానుభూతిని పొందుచున్నాడు. రసస్వరూపుడే భగవంతుడు.

ఏడు కొండలపై వెలసిన ఆ అయ్యగారి తత్త్వాన్ని అమ్మగారి శృంగారలీలల ద్వారా - సర్వజనానుభవ సాధారణమైన శృంగార రసనిరూపణం ద్వారా - అన్నమయ్య మనకు అరటిపండునొలిచి చేతిలో పెట్టినట్లుగా సహస్రముఖాలుగా వర్ణించినాడు.

ఈ కొండలయ్య సామాన్యుడు కాడు. ఒకనాడు ఒంటరివాడై -

" కామ స్తదగ్రే సమవర్తతాధి మనసోరేతః ప్రథమం యదాసీత్ "

" చంద్రమామనసోజాతః "

అని వేదము చెప్పినట్లు, సృష్టి చేయాలనే కోర్కెతో బ్రహ్మను సృజించాడు. ఆయన ప్రజాపతిని సృష్టించాడు. ఈ ప్రజాపతి ఒంటరివాడై ఊరకే భయాన్ని పొంది తోడుగా ఒక స్త్రీని సృష్టించుకొన్నాడు. ఆమెయే శతరూప !

" సహస్ర పరమాదేవీ శతరూపాశతాంకురా "

అని సకలపురాణాలచే ప్రశంసింపబడిన దేవీతత్త్వమే ఆమె !

" బహుస్యాం ప్రజాయై యేతి "

" తం సృష్ట్వా తదను ప్రావిశత్ "

అనే శ్రుతి వాక్యాలనుబట్టి - "నేను బహురూపుడనయ్యేదను అని సంకల్పించి, ఆ సృష్టింపబడిన ప్రతి జీవిలో తాను వెళ్లి కూర్చున్నాడు.

కాబట్టి దేన్ని మనం " రసో వై సః " అని అంటున్నామో, ఆ రసస్వరూపుడైన భగవంతుడు, ఆ ఆనందనిలయుడైన స్వామి మన అందరిలో ఉన్నాడు. కాని, జీవుడహంకరించి తన లోని స్వామిని, అంతర్యామిని గుర్తించక నానా యాతనలకు గురియగుచున్నాడు. అటువంటి నిద్రాణుడైన జీవుని ప్రబోధింపజేసి - ' జీవేశ్వరుల.సంగమకారణదూతమైన కలహంస ' వలె మన అన్నమయ్య కవిహంస, పరమహంసలా పరవశించి పాటలు పాడి మనకా భాండాగారాన్ని అందించి ధన్యుడైనాడు.

ఇక్కడ ఒక ముఖ్యవిషయం మనవి చేయాలి. కామం వేరు. శృంగారంవేరు. కలుషీకృతమైన దుష్ట చిత్తముతో కూడినది కామము కాగా, పురుషార్థ సాధన కోసం ధార్మికమైన చింతనతో శుచితో ఉజ్జ్వలమైనది శృంగారము. "కామోత్కంఠిత గోపికల్ " అని పోతన అన్నాడు కదా ! " కామయాగము చేసె కలికి " అని అన్నమయ్య పాడాడుకదా ! అని అడుగవచ్చు. ఈ కామ భావన భగవత్సంబంధితమైనప్పుడు అందలి మాలిన్యం క్షాళనం చేయబడి శృంగారంగా పర్యవసిస్తూవుంది. శివుడు కామదహనం చేసిన తర్వాతనే పార్వతిని పెండ్లాడినాడు. అటువంటి శివుని అనుగ్రహం పొందిన తర్వాతనే శ్రీకృష్ణుడు ప్రద్యుమ్నుని కన్నతండ్రి అయ్యాడు. కాబట్టి దివ్య ప్రకృతులైన వారు కామాన్ని మట్టుబెట్టిన తర్వాతనే సత్సంతానాన్ని పొంది దేశ సౌభాగ్యం కోసం వారిని సమర్పిస్తున్నారు. ఇది ప్రాచీన భారతీయ సంప్రదాయం.

ఎక్కడ అభ్యుదయము, నిశ్శ్రేయసము సమప్రాధాన్యాన్ని కల్గివుంటాయో అదే నిజమైన సంప్రదాయం. ఈ భూమిక మీదనే భారతీయ అలంకార శాస్త్రం ప్రవర్తించి శృంగారాది నవరసాలను విస్తరించి చెప్పింది.

## వైష్ణవ మధురభక్తి సంప్రదాయం

వైష్ణవంలో మధురభక్తి సంప్రదాయాన్ని ఆళ్వారులు నాలాయిర దివ్య ప్రబంధంలో స్థాపించగా ఆచార్య పురుషులు దానిని ప్రోదిచేసి యావద్భారత దేశంలో వ్యాపింపజేశారు. వీరిలో పెరియాళ్వారు/వత్సల భక్తికి, ఆయన కుమార్తె ఆండాళ్ తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళ్ళి గ్రంథాలలో శ్రీకృష్ణుడు నాయకుడు - విరహిణియైన మనసాగోపికయైన ఆండాళ్ నాయిక. మధుర భక్తికి ఆండాళ్ ప్రతీక ! ఇక నమ్మాళ్వార్ వ్రాసిన తిరువాయ్‌మొళ్ళిలో ప్రతిపాదింపబడిన విషయం జీవులందరూ స్త్రీలే. ఒక్క పరమేశ్వరుడే పురుషుడు. ఆళ్వారు స్త్రీ. శ్రీకృష్ణుడు భగవంతుడు. ఆళ్వారు తల్లి దూతిక. ఈ లక్షణం మనకు అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో స్పష్టంగా తెలుస్తుంది.

ఈ మధురభక్తి సంప్రదాయం, అన్నమయ్య సంకీర్తనల్లో క్రింది విధాలుగా కనబడుతుంది.

1. స్వామివారిని, అమ్మవారిని ఉద్దేశించి వ్రాసిన శృంగార సంకీర్తనలన్నీ లోకంలో వివిధ జీవుల శృంగార మనోభావాలుగా కనబడుతాయి.

2. ఎన్ని శృంగార భావాలు మనసులో పోటుపొడిచినా, లోకంలోని సర్వజీవుల శృంగారము స్వామియందు పర్యవసిస్తూవుంది. ఈ సర్వవిధ భావాలకు ఆయన ప్రభవ స్థానం. ఎందుకనగా ఆయన మన్మథుని కన్న తండ్రి కనుక.

3. మరొక విధంగా చూస్తే అన్నమయ్యయే విరహిణియైన నాయికయై నాయకుడైన స్వామితో శృంగార లీలారస మనుభవిస్తున్నట్లు

కనబడుతుంది. " భక్తుడు స్త్రీ భగవంతుడొక్కడే పురుషుడ'నే మాట పలుచోట్ల స్ఫురణీయ మౌతూవుంది.

4. మరికొన్ని చోట్ల చెలులలో తానొక చెలియై, గోపికల్లో తానొక గోపికయై అన్నమయ్య శృంగార సంకీర్తనలు పాడినాడా! అనిపిస్తుంది.

5. ఇంకా కొన్ని చోట్ల నాయికయైన అలమేలుమంగకు, నాయకుడైన స్వామికి మధ్య నిలబడి శృంగార రాయబారం నడుపుతున్నట్లు కనబడుతాడు అన్నమయ్య.

6. ఇంతా చేసి, యిన్ని విలక్షణ మనోభూమికల్ని తాదాత్మ్యంతో తన్మయత్వంతో పోషించిన అన్నమయ్య తన పాఠకుల్ని మరచి పోకుండా, 'విరహము వలవదు, వినరో రసికులు చాటుచు ‹ జెప్పెద' అంటూ మనల్ని హెచ్చరికలు, సమాశ్వాసనలు పదాల్లో పొదగడం కన్పిస్తుంది.

పరిశీలిస్తే, ఈ బహుముఖీనమైన భూమికలన్నీ వైష్ణవ మధురభక్తి సంప్రదాయంలో నుండే మొలకెత్తినవని విస్పష్టమౌతుంది.

ఈ విధంగా, తన స్వామిని సర్వస్వంగా భావించి, ఆయన శృంగార లీలారస చర్వణంలోనే రసానందకైవల్యాన్ని పొందిన మహాభక్తాగ్ర గణ్యులైన వాగ్గేయకారులు మనకు లేకపోలేదు. జయదేవుడు, పురందరదాసు, నారాయణ తీర్థులు, సదాశివ బ్రహ్మేంద్రులు, త్యాగరాజు, మీరాబాయి మొదలగువారు. వీరిలో " వేంకట శైల వల్లభరతిక్రీడా రహస్యముల''ను ఆదిశేషుని వలె సహస్రముఖాలుగా వర్ణించిన అన్నమయ్య " పూర్వపదకవి మణితేజో వరహారమున నాయకమణి " యని, ఆయన పదకవితలు " వరకవిత్వ వాణీ వీణానాదంబు'' లని చెప్పక తప్పదు.

శ్రీమద్రామానుజుల (క్రీ॥శ. 1017 - 1137) అనంతరం భక్తి ఉద్యమం బయలుదేరి ఒరిస్సా, బెంగాలు ప్రాంతాలలో విస్తృతంగా వ్యాపించింది.

క్రీ॥శ1490 - 1563 ప్రాంతాలలో ఉన్న శ్రీ రూపగోస్వామి భక్తిరసామృత సింధువు, ఉజ్జ్వలనీలమణి అనే రెండు గ్రంథాలు వ్రాశారు. శ్రీకృష్ణపరమైన భక్తిని ప్రపంచించే గ్రంథాలివి.

శృంగార రసావతారుడైన శ్రీకృష్ణుడే ఉజ్జ్వలనీలమణి. భగవదనుభూతి యోగ్యాలైన శాంతం, ప్రీతి, ప్రేయస్సు, వత్సల, ఉజ్వల రసాలలో శ్రేష్ఠమైంది భక్తిరసం - దీనిలో మధురమైన రతి స్థాయీభావం. విభావాదుల సంయోగవశమున ఈ స్థాయిభావం ఆస్వాద యోగ్యమైనపుడు మధురరసంగా పరిగణింపబడుతుంది. స్నేహ, మాన, ప్రణయ, రాగ, అనురాగ, మహాభావము లనే ఆరు భావాలు ప్రేమాభివ్యక్త రూపాలే. కృష్ణుడు - ఆయన ప్రేయసులైన గోపికలు ఈ రసానికి ఆలంబన విభావాలు. మధుర రతికి ఆశ్రయం కల్పించే వారు. కృష్ణుని గుణాలంకార క్రియాదులు ఉద్దీపన విభావాలు.

మధుర రతియే శృంగారరసంగా పరిణమిస్తుంది. స్థిరమైన రతినే ప్రేమ అంటారు. శృంగారాన్ని వివరించే సందర్భంలో భరతముని ' ఉజ్జ్వల ' శబ్దాన్ని వాడినాడు. భక్తిరస విశేషము మధురరసం. మాధుర్యాన్ని ఉజ్జ్వలరసమని, భక్తి రసరాజమని పిలుస్తారు.

భక్తిని ప్రధానరసంగా భావించి యిందుండి శృంగారాది రసాలు ఉద్భవిస్తాయని శ్రీమధుసూదన సరస్వతీస్వామి ' భక్తి రసాయనం ' లో వివరించారు.

ఆనందవర్ధన, అభినవగుప్తుల శాంతరసమే పై అలంకారికుల రచనల్లో భక్తిరసంగా పరిణమించింది. వైష్ణవ సంప్రదాయంలో భక్తియే శృంగార రసంగా అవతరించింది.

ఈ సంపుటిలో 1801 వ రేకు నుండి 1900 రేకు వరకు అంటే 100 రేకులలోని 592 పాటలు పరిష్కరింపబడి ప్రచురింపబడినాయి. ఈ సంపుటీకరణలో లుప్తమైన రేకులు లేవు. రేకుల సంఖ్య వరుస క్రమంలోనే ఉన్నాయి.

ఒక రేకుకు ఎన్ని పాటల చొప్పున వ్రాయబడివున్నదని పరిశీలిస్తే - 1801, 1809, 1810, 1811, 1812, 1826, 1830, 1855 అనే సంఖ్యలుగల 8 రేకుల్లో

| | |
|---|---|
| రేకుకు ఐదు పాటల చొప్పున వ్రాయబడినవి. | 8 × 5 = 40 |
| తక్కిన 92 రేకులలో రేకుకు ఆరుపాటల చొప్పున వ్రాయబడినవి | 92 × 6 = 552 |
| ఈ సంపుటిలోని మొత్తం పాటల సంఖ్య | 592 |

ఇది ప్రస్తుత సంపుటి యొక్క భౌతిక స్వరూప వర్ణనం.

## ఈ సంపుటిలోని అధ్యాత్మ సంకీర్తనలు

రాగిరేకులపై చెక్కడానికి ముందు వ్రాయసకాడు అధ్యాత్మ, శృంగార సంకీర్తనలనే వింగడింపును సరిగా చేసుకోక పోవడం వల్ల ప్రతి శృంగార సంకీర్తనల సంపుటంలో కొన్ని అధ్యాత్మ సంకీర్తనలు చోటుచేసి కోవడం కనబడుతుంది. ప్రస్తుత సంపుటంలోను ఈ పరిస్థితి తప్పలేదు. ఈ సంపుటిలో అటువంటి 13 అధ్యాత్మ సంకీర్తనలను గుర్తించి పరిష్కర్తలైన శ్రీగౌరిపెద్దివారు 'అధస్సూచిక 'లో సూచించడం జరిగింది. వాటి సంఖ్యలివి. 16, 33, 172, 173, 350, 371, 487, 490, 491, 492, 495, 496, 503.

## అన్నమయ్య శృంగార సంకీర్తనల వింగడింపు

అన్నమయ్య వ్రాసిన శృంగార సంకీర్తనలను ప్రధానంగా నాల్గు విధాలుగా వింగడించవచ్చు.

1. నాయకుని పరంగా వ్రాయబడిన కీర్తనలు 250
2. నాయికా పరంగా వ్రాయబడిన కీర్తనలు 313
   (ఇందులో శృంగార దూతికలు కూడ అంతర్భవిస్తారు)
3. దేవీ దేవర లిద్దరిని కలిపి చెప్పిన కీర్తనలు 19

| | |
|---|---|
| 4. రసికుల నుద్దేశించి వ్రాసిన కీర్తనలు | 10 |
| ఈ సంపుటిలోని మొత్తం కీర్తనలు | 592 |

ఈ నాల్గు విధాలైన లక్షణాలను ప్రస్తుత సంపుటిలో పరిశీలించి సమన్వయింప వచ్చు. ఈ పరిశీలనలో ఆనుషంగిక ఫలంగా మరో రెండు అవాంతర భేదాలను స్పృశించవచ్చు.

1. ఈ సంపుటిలో అన్నమయ్య సంకీర్తించిన వివిధ పుణ్య స్థలాలు - ఆ స్థల దేవతలు
2. భావసాజాత్యం గల కీర్తనలు ( లేదా ) భావపునరుక్తులు గల కీర్తనలు

## నాయకుని పరంగా వ్రాయబడిన కీర్తనలు

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు. సంస్కృతాలంకారికులు నాయకుని గుణాలను అనేక రీతులుగా వింగడించి చూపినారు.

విద్యానాథుని ప్రతాపరుద్రీయం నాయక ప్రకరణంలో తొమ్మిది గుణాలను చెప్పాడు.

1. మహాకులీనత - గొప్ప వంశంలో పుట్టడం మహాకులీనత
2. ఔజ్జ్వల్యం - చక్కని రూప సంపద గలిగి వుండటం
3. మహాభాగ్యం - మహీ చక్రానికి సార్వభౌముడుగా ఉండటం
4. ఔదార్యం - గొప్పదాతయై ఉండటం
5. తేజస్విత - లోకమును ప్రకాశింపజేయుట
6. విదగ్ధత - చేసే పనుల్లో నేర్పరితనం
7. ధార్మికత - ఎల్లప్పుడు ధర్మాన్ని ఆచరించాలనే మనస్సు కలిగి వుండటం.

8. మహామహిమత్వం - దేవుని అంశం కలిగి వుండటం
9. పాండిత్యం - సర్వవిద్యాపారంగత్వము

ఇవి ఒక మహాచక్రవర్తిని ఉద్దేశించి చెప్పబడిన నాయక గుణములు. ఇవి భగవత్పరంగా కూడా చక్కగా అన్వయింపవచ్చు.

భోజరాజు సరస్వతీ కంఠాభరణం ( V - 23, 24) లో పన్నెండుగుణాలను, రుద్రటుడు కావ్యాలంకారం ( XII - 7, 8) లో పదహారు గుణాలను, ధనంజయుడు దశరూపకంలో (II - 1, 2) ఇరవై రెండు గుణాలను, విశ్వనాథుడు సాహిత్యదర్పణం ( III - 89) లో పన్నెండు సామాన్య గుణాలు, ఎనిమిది సాత్త్విక గుణాలు వెరసి ఇరవై గుణాలను నాయకుని పరంగా చెప్పారు.

అలంకారికు లొక మహాసార్వభౌముని దృష్టిలో పెట్టుకొని మనుష్యులలో ఉత్తమ ప్రకృతి గలవాని గుణగణాలు యిలావుండాలని నిర్ణయిస్తే, శ్రీవైష్ణవ సంప్రదాయంలోని ఆళ్వారులు, ఆచార్యులు భగవంతునికి అనంత కల్యాణ గుణ గణములను లెక్కపెట్టి చెప్పారు. అలంకారికులు చెప్పినవి ఇరవై రెండు వరకే పరిమితమైపోగా, శ్రీవైష్ణవ సంప్రదాయం అనంతకల్యాణ గుణాలను చెప్పడం గమనింపదగింది.

శ్రీ మద్రామానుజులవారు 'శరణాగతిగద్య'లో - "స్వాభిమతాను రూపైక రూపా చిన్త్య దివ్యాద్భుత నిత్య నిరవద్య నిరతిశయౌజ్జ్వల్య, సౌందర్య, సౌగంధ్య, సౌకుమార్య, లావణ్య, యౌవనాద్యనంత గుణనిధి దివ్యరూప ! స్వాభావికానవధికాతిశయ జ్ఞాన బలైశ్వర్య వీర్య శక్తి తేజ స్సౌశీల్య వాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్య కారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్యకామ, సత్యసంకల్ప కృతిత్వ కృతజ్ఞతా ద్యసంఖ్యేయ కల్యాణ గుణ గణౌఘ మహార్ణవ!" అని స్వామిని సంస్తుతించినారు. శ్రీమన్నారాయణుడు అనంత కల్యాణ గుణ...ముడు. అందులో కొన్ని వివరించుకొందాం -

| | | |
|---|---|---|
| 1.జ్ఞానము | - | సర్వసాక్షాత్కార రూపత్వం |
| 2. శక్తి | - | అఘటన ఘటనా సామర్థ్యం |
| 3. బలము | - | ధారణ సామర్థ్యం |
| 4. ఐశ్వర్యము | - | నియమన సామర్థ్యం |
| 5. వీర్యం | - | అధికారిత్వం |
| 6. తేజస్సు | - | పరాభి భవన శక్తి |
| 7.సౌశీల్యము | - | మహాత్ములను, సామాన్యులను కౌగలించుకొనే స్వభావం. |
| 8. వాత్సల్యము | - | దోషాన్నిసైతం భోగ్యంగా గ్రహించడం |
| 9. మార్దవం | - | ఆశ్రిత విరహాసత్వం |
| 10. ఆర్జవం | - | ఋజు భావం, త్రికరణశుద్ధి |
| 11. సౌహార్దం | - | తనను విస్మరించి భక్తులను రక్షించడం |
| 12. సామ్యం | - | జన్మాదులతో పనిలేక సర్వులకు ఆశ్రయుడై యుండటం |
| 13. కారుణ్యం | - | పర దుఃఖమును చూచి తల్లడిల్లి పోవుట |
| 14. మాధుర్యం | - | ఉపాధి భేదరహితంగా పాలవలె స్వాదువై ఉండటం |
| 15. గాంభీర్యం | - | ఆశ్రితులకు దురవగాహంగా పనులు నిర్వహించడం |
| 16. ఔదార్యం | - | అపరిమితంగా భక్తులకిచ్చి కూడా తృప్తి లేకుండటం |
| 17. చాతుర్యం | - | ఆశ్రిత దోష గోపనము |
| 18. స్థైర్యం | - | ఎన్ని యిక్కట్లు చుట్టుముట్టినా చలించకుండ ఉండటం |
| 19. ధైర్యం | - | చేసిన ప్రతిజ్ఞకు భంగపాటు |

లేకుండ ప్రవర్తించడం

20. శౌర్యం - శత్రుబలాలలో ప్రవేశించే సామర్థ్యం

21. పరాక్రమం - శత్రు బలాలను అవలీలగా ఆక్రమించడం.

## యతీంద్రమత దీపికలో -

జ్ఞాన శక్త్యాదులు నిరూపిత స్వరూప ధర్మాలనీ,
సర్వజ్ఞత్వ సర్వ శక్తిత్వాదులు సృష్ట్యుపయుక్త ధర్మాలనీ,
వాత్సల్య సౌశీల్య సౌలభ్యాదులు ఆశ్రయణోపయుక్త ధర్మాలనీ
కారుణ్యాదులు రక్షణోపయుక్త ధర్మాలనీ చెప్పబడింది.

ఈ రక్షణోపయుక్తమైన ధర్మం భగవంతునిలో ఉన్నట్లే ఒక మహా చక్రవర్తిలోను ఉండటంవల్లనే అలంకారికుడైన సర్వజ్ఞసింగ భూపాలుడు రసార్ణవసుధాకరంలో - " రక్షితారస్తునేతారః " అని నాయక లక్షణాన్ని నిర్వచించాడు.

భారతీయ మహాకావ్యాలలో రాజు విష్ణ్వంశ సంభూతుడు కాగా, అన్నమయ్య సంకీర్తనల్లో విష్ణువే నాయకుడు. ఇక చెప్పవలసినదేముంది ! రసమార్గాన్ని విడువని మత మార్గనాయక లక్షణాన్ని అన్నమయ్య తన సంకీర్తనలన్నింటిలో నిరూపించాడు. మరో విధంగా చెబితే మత - రస సమన్వయవాది అన్నమయ్య !

## నాయక లక్షణాలు

" నయతి ప్రాప్నోతి, వృత్తం ఫలం చేతినాయకః " అని నాయక పద వ్యుత్పత్తి. కథా శరీరమందంతట వ్యాపించి వుండేవాడు, ముఖ్య ఫలభోక్తయైనవాడు నాయకుడు. ఈ నాయకుడు ఉత్తమ, మధ్యమాధమ భేదముచే త్రివిధుడు. పైన చెప్పబడిన సమస్త సద్గుణాలు గలవాడు, ఫలభోగి, కథావ్యాపియైనవాడు ఉత్తముడు. ఉత్తమ నాయకుని గుణాలలో కొన్ని

లోపించినవాడు మధ్యముడు. పెక్కు గుణాలు లోపించినవాడు అధముడు.

భోజరాజు నాయక విభాగాన్ని యిలా చేశాడు.

I 1) ముఖ్యనాయకుడు 2) ప్రతినాయకుడు 3) ఉపనాయకుడు
4) అనునాయకుడు

II గుణాన్ని బట్టి :- 1) ఉత్తముడు 2) మధ్యముడు
3) అధముడు

III వివాహమాడు పద్ధతిని బట్టి :- 1) సాధారణుడు (బహుభార్యుడు)
2) అనన్యజాని (ఏకపత్నీ వ్రతుడు)

IV ప్రకృతిని బట్టి :- 1) సాత్త్వికుడు 2) రాజసుడు
3) తామసుడు

V ధైర్యవృత్తిని బట్టి :- 1) ధీరోదాత్తుడు 2) ధీరోద్ధతుడు
3) ధీరలలితుడు 4) ధీరశాంతుడు

VI ప్రవర్తనమును బట్టి :- 1) అనుకూలుడు 2) దక్షిణుడు
3) శఠుడు 4) ధృష్టుడు

ధీరోదాత్తాది యితర నాయకుల విషయంలో ఆలంకారికుల నిర్ణయ మొకటి గమనింపదగింది. ఈ నాల్గు విభాగాలు ప్రత్యేకజాతి బోధకములైనవి కావు. ఒక సమయంలో ధీరోద్ధతుడుగా ప్రవర్తించిన వాడే మరొకప్పుడు ధీరోదాత్తుడు కావచ్చును. అవి అవస్థా సూచకములే తప్ప నియత జాతులు కావు. ఒక వ్యక్తియే వయోధర్మ భేదాన్ని బట్టి బాలుడు, యువకుడు, ప్రౌఢుడు వృద్ధుడు అనే పేర్లతో వ్యవహరింప బడేటట్లుగా, ఒక వ్యక్తియే సందర్భాన్ని బట్టి ఒక్కొక విధంగా వ్యవహరించడం చేత నాల్గు విధాలైన పేర్లతో పిలువబడడంలో వింతలేదు. కాబట్టి, పై చెప్పబడిన నాయకుని లక్షణాలు భగవద్విషయంలో వివిధ నాయికలతో ఆతనికి గల సంబంధాన్ని బట్టి భేదిస్తూ ఆయా నామధేయాలతో వ్యవహరింపబడడం అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో

మనం గమనించ వచ్చు.

నాయకుని ఈ నాల్గు లక్షణాలను శ్రీమన్నారాయణుని అవతారాలకు సమన్వయించవచ్చు.

ఆత్మశ్లాఘ లేనివాడు, సహనము గలవాడు, గంభీరుడు, మహాసత్త్వుడు, గూఢమైన కోపము గలవాడు, దృఢవ్రతుడైన వాడు ధీరోదాత్తుడనే లక్షణానికి సరియైన ఉదాహరణము శ్రీరామావతారము. ఇతడు శృంగార వీరరసాలలో నాయకుడు.

మాయలమారితనం, ప్రచండత, చాపల్యం, అహంకారం, ఆత్మశ్లాఘ గలవాడు ధీరోద్ధతుడు. వీర రౌద్ర రసాలలో నాయకుడు వరాహ, నృసింహ, పరశురామ, బలరామావతారములు ధీరోద్ధతములైనవే.

నాయక సామాన్య గుణములు గల కులము, మహాభాగ్యము మొదలైన గుణాలతోపాటు బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యులలో నొకడు ధీర శాంతుడు. వామన, బుద్ధావతారములు, మత్స్య, కూర్మావతారములు యిట్టివే !

" నిశ్చింతో మృదు రనిశం కలాపరో ధీరలలితః స్యాత్ " శత్రువులను జయించి, రాజ్య భారమును సమర్థులగు మంత్రులమీద నుంచుటచే నెట్టి విచారము లేనివాడు నిశ్చింతుడు. కళలు అంటే - లలితకళలు, నృత్యము, గానము, చిత్రకళ, ద్యూతము మొదలైనవి. వీనియందు నిరతుడును, మృదుస్వభావము గలవాడు ధీరలలితుడు. అనగా ధీరస్వభావమును, లలితస్వభావమును గలవాడు ధీరలలితుడు. అంటే పౌరుషం విడిచి స్త్రీలోలుడై ఉండేవాడని అర్థం కాదు. ప్రతాపశాలియై, భోగపరాయణుడైన వాడు ధీరలలితుడు. దీనికి శ్రీకృష్ణావతారము ప్రబలోదాహరణం.

నాయకుల్లోని నాల్గు భేదాలలో 'ధీర' మనే పదం నల్గురికీ అన్వయించి, తక్కిన ఉదాత్తత్వాదులు అసాధారణ గుణాలుగా ఉన్నాయి. కాబట్టి యీ నల్వురు నాయకులు వీరులే. అందుకే హేమచంద్రుడు కావ్యాను శాసనంలో-

1. ధర్మ, యుద్ధ, వీర ప్రధానః ధీరోదాత్తః ।

2. వీర, రౌద్ర ప్రధానః ధీరోద్ధతః ।

3. వీర, శృంగార ప్రధానః ధీరలలితః ।

4. దాన, ధర్మ, వీర ప్రధానః ధీరశాంతః ।

అని పేర్కొన్నాడు. ఇదే చక్కని సమన్వయం. కావున, వీరత్వము ప్రధానముగా తక్కిన గుణములు గలవారు చతుర్విధనాయకులు.

వీర, శృంగార ప్రధానుడైన ధీరలలితుడు శ్రీకృష్ణుడు. ఇతడు శృంగార నాయకుడుగా సాహిత్యములోని సృష్టి సగానికిపైగా ఉన్నది. ఇక్కడనే శృంగారనాయకుల ప్రసక్తి ఏర్పడుతున్నది. ఆ లక్షణాలన్నీ శ్రీకృష్ణుని యందు కనబడుతూవున్నాయి. అర్చావతారమూర్తియైన శ్రీవేంకటేశ్వరస్వామి యిటువంటి వాడే. ఇటువంటి స్వామినే అన్నమయ్య తన శృంగార సంకీర్తనలలో చిత్రించినాడు. ధీరోదాత్తాది లక్షణాలు ఆస్వామిలో లేవని కాదు. ధీరలలిత లక్షణాలను శ్రీవారి చరిత్ర నిరూపిస్తూ వుండడం వల్ల దానినే అభిమానించిన మన అన్నమయ్య ఆస్వామివారి శృంగార రస స్వరూపాన్నే వేయి విధాలుగా వర్ణించినాడు.

## అన్నమయ్య చిత్రించిన శృంగారనాయకుడు ధీరలలితుడు

ఎపుడు వత్తువో యనుచు యెదురు చూచీఁ జెలియ
వుపమించి చెప్పితిమి వువిద ఁ జెందవయ్యా ! ॥ పల్లవి ॥

నెలంత కనుఁగలువలకు నీ మోము ఁ జంద్రుని
నలరంగ ఁ జూప గదవయ్య నేఁడు
కలికి చక్కఁదనంబు కడఁగి ప్రతిబింబించ
తళకు నీ చెక్కుటద్దములు చూపవయ్యా ! ॥ ఎపుడు ॥

నిరతి మెఁఱదీగెకును నీ బాహుశాఖలివి
అరుదుగా ఁ జూప ఁ గదవయ్య నేఁడు
సరిఁజన్నుజక్కవలు జంటవాయక యుండ

తొరల తనుసూర్యకాంతులు చూపవయ్యా ! ॥ ఎపుడు ॥

గళనాద పికములకు కడు నీ జవ్వనమదము
అలమి చోటుగఁ జూపవయ్య నేఁడు
వలచి శ్రీవేంకటేశ్వర యీకె ( గూడితివి
కలకాలమును నిటుల ( గరుణ చూపవయ్యా ! ॥ ఎపుడు ॥

ఈ సంపుటం - సంకీర్తన సంఖ్య - 52

ముఖారిరాగంలోని ఈ కీర్తనలో అన్నమయ్య స్వామివారి ధీరత్వాన్నీ, లలితత్వాన్నీ సమపాళంగా మేళవించి రచించినాడు. శృంగార రసాధిదైవతం స్వామి ! మరి, నాయిక మాత్రం సామాన్యురాలా? ఆమె శృంగార రసావతారిణి! స్వామి లోక రక్షణలో మునిగి ఉన్నాడు. క్షణం తీరుబాటు లేదు. ఇక్కడ ఒక్కొక్క క్షణం ఒక్కొక్క యుగంగా నాయిక స్వామి ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తూవుంది. నాయికయైన అమ్మవారి తరఫున ఒక శృంగార రాయబారిగా అన్నమయ్య ఈ సంకీర్తన స్వామి యెదుట విన్నవించు కొంటున్నాడు. అయ్యగారి ధీరత్వాన్నీ, అమ్మగారి లలితత్వాన్నీ లేదా స్వామివారి ధీరలలిత సౌందర్య సరసిలో అమ్మవారు ప్రతిఫలించిన తీరును ఎంత ఔచితీసహితంగా, అన్వర్థ పదజాలంతో వర్ణించినాడో చూడండి అన్నమయ్య !

అలా, స్వామికోసం విరహంతో వేగిపోతూవున్న నాయికను, ఆయన రాక కోసం ఎదురుతెన్నులు చూసే నాయికను అన్నమయ్య రూపకాలంకారంలో వర్ణిస్తున్నాడు.

కలువలు చంద్రునిచూసే వికసిస్తాయి. అమ్మవారి కనులు అనే కలువలకు స్వామివారి ముఖమనే చంద్ర దర్శనం వికసనహేతువు. కాబట్టి, ఓ స్వామీ ! నీ ముఖ చంద్రుణ్ణి మా అమ్మవారి కనుగలువలకు చూపవయ్యా! అంటున్నాడు అన్నమయ్య ! నునుపెక్కిన స్వామి చెక్కుటద్దాలలో అమ్మ

చక్కదనం ప్రతిబింబించాలట !అలా చేయమంటున్నాడీ శృంగార రాయబారి!

ఆమె శరీరమనే తీగెకు ఈయన బాహువులనే శాఖలు ఆధారంగా అల్లుకొనే స్తంభాలుగావాలట ! ఇక్కడ ' అరడు ' అంటే ' ఏరుదాటే సాధనం' అని అర్థం. ఇది దేశ్యపదం. విశేష్యం. ఇటువంటి అర్థచ్ఛాయలుగల దేశీయ శబ్దజాలాన్ని వాడడంలో అన్నమయ్య అందె వేసిన చేయి కదా ! ' అరడు 'తో ఒక ఏరును మనిషి ఎలా దాటగలుగు తున్నాడో, ' ఆమె తనూలతకు నీ వాధారస్తంభం కావడం చేత ఆ నాయిక జన్మ చరితార్థ మౌతూవుంది ' అన్న ధ్వని కూడ యిక్కడ యిమిడ్చాడు అన్నమయ్య !

జక్కువ పక్షులు సాయంత్రం చీకటి పడే సమయానికి ఏదో తెలియని కారణాన విడిపోయి రాత్రంతా విరహవ్యధను అనుభవించి సూర్యుడుదయించ గానే ఆ వెలుగులో తిరిగి తనజంటతో కలుస్తాయని కవిసమయం. ఈ కవిసమయంపై ఆధారపెట్టి ఈ రూపకాన్ని తీర్చిదిద్దాడు అన్నమయ్య. నాయిక చనుదోయి - జక్కవ పిట్టల జంట. జక్కవల జంటకు ఎడబాటు ఉండవచ్చు, కాని ఈ చన్నుల జంటకు నాయకుని శరీరమనే సూర్యకాంతి యొక్క వెచ్చదనం సోకితేనే విరహవ్యధ తొలగుతుందని అర్థం. 'సూర్యకాంతు' లు అనేమాటచే ' వెచ్చదనాన్నీ' 'చన్ను`జక్కవల జంట' అనే మాటచే, రాత్రి మంచుచే తడిసి చల్లనైన నాయిక స్తనద్వయాన్ని స్ఫురింపజేస్తున్నాడు అన్నమయ్య!

నాయిక గళము నుండి వచ్చే నాదము పికస్వరముతో పోల్చినాడు. 'గళనాదమనే పికములకు ' అని చెప్పినా నాయిక ఒక కోయిల యని, ఆమె గళనాదము పికస్వరముతో సమానమైనదని గ్రహించాలి. అసలు, పికము అనే సంస్కృత శబ్దానికి ' చాటున నుండి కూయునది ' అని అర్థం. ఇక్కడ రెండర్థాలు స్ఫురిస్తున్నాయి.

1. నాయికాపరంగా ' గళనాద పికస్వరము ' - ' మణితము ' ఇది రతి క్రీడలో నాయిక కంఠమునుండి వెలువడు అవ్యక్తమధుర నాదము. దీనిని అన్నమయ్య గళనాద పికములన్నాడు. దీనికి స్వామి జవ్వనమదము తోడైతేనే గాని ఆ ' నాదము ' వెలువడదు. ' అలమి' శబ్దానికి కలిసి, ఆక్రమించి, కౌగిలించి, పరిగ్రహించి అని అర్థాలు! స్వామి జవ్వనమనే మదముతో నాయికను కౌగిలించుకొనగా ఆమె కంఠమనే కోకిల గళమునుండి నాద ముప్పతిల్లినది. ఇది కామశాస్త్రములో ' మణిత ' మని చెప్పబడినది. 'వేంకట శైలవల్లభ రతిక్రీడారహస్య ' మిది !
2. ఇక, కవి పరంగా చూస్తే అన్నమయ్య ఔచిత్యం తెలిసినవాడు కాబట్టి ' నాయికా నాయకుల రతి క్రీడ'ను వాచ్యం చేయక 'పికగళనాదం'తో స్ఫురింప జేశాడు. కవి కోకిల కూడా సరిగ్గా యిటువంటివాడే ! ' ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్' అన్నా, ' ఆకులందున అణిగిమణిగీ కవిత కోకిల పలుకవలెనోయ్' అన్నా 'మామిడి కొమ్మ మీద కలమంత్ర పరాయణుడైన కోకిల స్వామికి మొక్కి ' అన్నా ఒక్కటే. ' కవి ' - కోకిల వంటివాడు ! అనగా కావ్యార్థాన్ని ధ్వనింపజేసేవాడు ! ' నాయిక రతిక్రీడా రహస్య మణితస్వరము ' వలె కావ్యధ్వని, ఆకులచాటున ఒదిగి కనబడకుండా అవ్యక్త మధురంగా కూసే కోకిల ధ్వని వంటిది. ఇది కావ్యౌచిత్యం. ఔచిత్య మెఱిగి చేసిన రసధ్వని రమణీయమైనది. అన్నమయ్య రమణీయ పదకవితా పితామహుడు !

శ్రీవేంకటేశ్వర స్వామీ ! ధీరలలితుడవైన నీవామెను వలచి కలిశావు. ఆ మీ యిద్దరి కలయిక కలకాలం ఉండేట్లు కరుణ చూపవయ్యా అని చివరలో చెప్పడంలో " జీవేశ్వరుల ఐక్యం " కలకాలం వర్ధిల్లేట్లు కరుణ చూపించమని

స్వామిని అన్నమయ్య వేడుకొంటున్నట్లు స్ఫురిస్తోంది ! నేను యితః పూర్వమే చెప్పినట్లు అన్నమయ్య కేవలం శృంగారరాయబారియే కాదు; నాయికా నాయకుల శృంగార మనే మిషతో " జీవేశ్వరుల సంగమ కారణదూతయైన కలహంస " అన్నాను. అది ఈ సంకీర్తనలో ఓతప్రోతముగానున్నది. శృంగార రస చిత్రీకరణను నిరూపణను యింత గూఢంగా, గాఢంగా, రమణీయంగా చెప్పిన మరొక పదకవి లేడంటే ఆశ్చర్య పడవలసిన పనిలేదు. అన్నమయ్యకు పదకవిత 'పితామహ' బిరుదం, కవిత్వంలో పెద్దనకు శ్రీకృష్ణదేవరాయలిచ్చిన ఆంధ్ర కవితా ' పితామహ ' బిరుదంతో సమానమైనది. అన్వర్థము, సార్థకమైనది.

ఎవడు శృంగారరస చిత్రీకరణలో కావ్య జీవనాడియెఱిగి, అనగా ఔచిత్యమెఱిగి కావ్యార్థాన్ని రమణీయంగా ధ్వనింపజేస్తాడో వాడు 'పితామహ' శబ్దవాచ్యుడు ! పద్య కవిత్వంలో పెద్దన, పదకవితలో అన్నమయ్య వీరిద్దరే 'పితామహ' శబ్దవాచ్యులు!

## శృంగార నాయకులు

ధీరోదాత్తాది నాయకులు సర్వరసాలలోను ప్రాతినిధ్యం వహిస్తారు. వారే శృంగార రస విషయాలైనప్పుడు మాత్రం ఒక్కొక్కరు తిరిగి యీ విధంగా అనుకూల, దక్షిణ, ధృష్ట, శఠాభిధానాలను పొందుతారు.

ఒకనాయిక యందే అనురాగము గలవాడు ' అనుకూలుడు. శ్రీరామ చంద్రుడు దీని కుదాహరణము.

పెక్కండ్రు నాయిక లందు సమాన ప్రీతిగలవాడు దక్షిణ నాయకుడు. శ్రీకృష్ణుడు దీనికి చక్కని ఉదాహరణం. తక్కినవి రెండూ ఆయనకే అన్వయిస్తాయి.

వ్యక్తాగాగతభీః ధృష్టః - స్పష్టంగా గోచరించిన అపరాధములు గలవాడును, నిర్భయుడునగు వాడు ధృష్టుడు.

॥ శ్లో ॥ కృతాగా అపి నిశ్శంక స్తర్జితోఽ పి నలజ్జితః ।
దృష్ట దోషోఽ పి మిథ్యావాక్యధితో ధృష్ట నాయకః ॥

అపరాధయయ్యును జంకు గొంకులు లేనివాడు, తర్జింపబడినను లజ్జింపని వాడు, దోషమగపడుచున్నను గల్లలాడు వాడు ధృష్టనాయకుడనబడుతాడు.

ప్రియురాలికి మాత్రము దెలియదగిన యప్రియము సేయువాడు శఠుడు. అనగా నతడు సేయు నప్రియము ప్రియురాలికేగాని పరులకు తెలియదు. పరులకాతడనురక్తుడుగానే గోచరించును.

శ్రీరూప గోస్వామి రచించిన 'ఉజ్జ్వలనీలమణి' వంగదేశపు వైష్ణవ మత శాఖ నుండి బయలుదేరి ఆలంకారిక శాస్త్ర పరిధిని తీర్మానించిన గ్రంథము. ఇందులో శ్రీకృష్ణుడు నాయకుడగుటచే ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరప్రశాంత భేదాలతో పాటు పతి, ఉపపతి అనునాయక భేదాలను కూడ అంగీకరించాలి. ధీరోదాత్తాది చతుర్భేదములలో ప్రతిదానియందును పూర్ణ, పూర్ణతర, పూర్ణతమ భేదాలున్నాయి. పతి, ఉపపతి అనే భేదాలలో ఒక్కొక్కదానిని అనుకూల, దక్షిణ, శఠ, ధృష్ట రూపాలుగా విభజింపవచ్చును. ఈ విధంగా 96 రకముల నాయకులు ఏర్పడుతున్నారు.

## దక్షిణ నాయకుడు

ఎంతని పొగడవచ్చు నింతటి నీదేవులను
సంతోసానఁ గూడితిని జాణవౌదువయ్యా — కీర్తన 23

వాకిటనుండే యేమి యడిగేవు వలవని సుద్దులు
యేకతమాయను యింటిలోనికి యేలుదువు రావయ్యా ॥
— కీర్తన 150

ఆఁడువారి ( గంటే ( జాలు ఆస నీ కెంతైనా ( గద్దు
పోడిమితోఁ మమ్మంటేవు పొద్దువోదా నీకు ॥ — కీర్తన 224

సందు గలిగితే జాలు చంకఁబెట్టేవు
యెందరిఁ బెండ్లాడితివో ఇటువలె నీవు ॥ - కీర్తన 250

పొందు సేయ నేరుచును పూని మెలమెల్లనే
యెందరిని మరిగించెనో యిట్లానే యీతడు ॥ - కీర్తన 280

అలమేలు మంగపతి వని నిన్నెఱఁగదేమో
కలికి చేతలు నీకు గంపలనమ్మీని ॥ - కీర్తన 328

ఆనతియ్యవయ్యా నాతో నక్కడి సుద్దులెల్లాను
పూని నా కాఁగిట నిట్టె భోగించేవు కాని - కీర్తన 337

అలమేలు మంగపతి వన్నిటా నెరజాణవు ॥
చెలరేఁగి చూడవయ్య చేతులెత్తి మొక్కేను - కీర్తన 407

గుఱుతు లెల్లాఁ గంటిమి గుట్టుసేయనిఁకనేల?
మఱఁగులు వెట్టకిఁక మాతోఁజెప్పవయ్యా ॥ - కీర్తన 522

## ధృష్ట నాయకుడు

నీ పొందు లెల్లా గంటిమి నేఁడు నీ పంతాలు చెల్లె
భూపతిచెరువు చెంత భోగింపు చున్నాఁడవు ॥ - కీర్తన 50

అంత నీకు వేడుకైతే నట్టే పెండ్లాడరాదా
ఇంతి సిగ్గులు రచ్చనేల వేసేవు॥ - కిర్తన 70

ఎంత నీపై వలపో ! యెటువంటి కూటములో
వింత వింత వినోదాల విచారాల వెలసె - కీర్తన 109

ఊరకున్న దాని నేల వుబ్బు రేఁచేవు
నేరుచు ( జూమ్మీ యాకె నీ మతి గరఁచను - కీర్తన 242

మనసులో తమకము మాకు నిట్టె కానరాగా
నను నెంత తేలించేవు నాటకుఁడ నీవు॥ - కీర్తన 296

ఎంత పొందోకాని తొల్లి యీపెకు నీకు
వింత లేక చెనకీని వెల్లవిరిగాను॥ - కీర్తన 335

పొద్దు వోనివాఁడుగాక పొలతులాల !
ఇద్దరిలోన నే ఁదన కిరవౌ తెలుఁగఁడా ! - కీర్తన 432

ఉవిదకు నీకు నెట్టి వొడఁబాటులో
జవళి రతుల నీతో సాముసేసీని - కీర్తన 523

## శఠుఁడు

మచ్చి కెంత గలిగినా మఱఁగు మొఱఁగు లేదా
ఇచ్చ యెరిగి లోలోనే యెనయుట గాక ॥ - కీర్తన 24

ఆఁటది యింత కోపునా అంటిమోసు వంటిది
మాఁటలనే లాలించి మరపుకోవయ్యా॥ - కీర్తన 38

ఎంత ఆసోదకాఁడవు యేమి చెప్పేది ॥
బంతిఁ బెట్టి తమకమే పచారించేవు॥ - కీర్తన 120

తరితీపు వలపుల తక్కరీఁడ !
సిరులు ‹ దొలఁక ‹ బై పై ‹ జెనకేవు నన్నును॥ - కీర్తన 122

ఎంత వేగిరకాఁడవు యేమి చెప్పేది ?
మంతనాన బుజ్జగించి మన్నించరాదా॥ - కీర్తన 275

అనుమానించఁగ నేలా అవిగో నీ చేఁతలు
దినదిన కొత్త లెల్లా దిష్టమాయ మాకును॥ - కీర్తన 286

చల్లలమ్మే వారమైతే సదర మైతిమా నీకు
యెల్ల చోటులకు వచ్చి యేల మొక్కేవయ్యా॥ - కీర్తన 312

చిత్తము వచ్చినట్టల్లాజేయరాదా నీవిఁక
కొత్త కొత్త నేరుపుల కొసరఁగ నేఁటికి ॥ - కీర్తన 391

ఏమి జాజాలాడేవు ఇంతులతోను
కామించి నీతోఁ బెనఁగీ కరుణించవయ్యా॥ - కీర్తన 439

## శృంగార రాయబారిగా అన్నమయ్య చెప్పిన కీర్తనలు

విన్నవించ నెట్టువచ్చు వెలఁది యున్న చంద మిదివో
కన్నులార నీవె చూచి గతులు దెలుసుకోవయా ॥ - కీర్తన 4

విన్నవించితిమి నీకు వెలఁది భావము లెల్లా
మన్నించు నింతట నీకె మరిగె నీరీతిని ॥ - కీర్తన 8

సేయఁగల విన్నపాలు సేసితి మిదివో నీకు
నీయంతనే ఇంతిఁ గరుణించవయ్య ఇపుడు ॥ - కీర్తన 9

ఇంతి పరిణామము నీ కిదివో విన్నవించితి
వింతసేయక లోనికి విచ్చేసి చూడవయ్యా ॥ - కీర్తన 40

చిత్తగించవయ్యా యేమి సిగ్గులు వడేవు నీవు
తత్తరించీ ( దమకము తప్పి తప్పి యిపుడు ॥ - కీర్తన 102

చెలి పరిణామపు సుద్దులు చెప్పితి మిదివో నీకును
యెలమిని మావిన్నపమిది యిఁక నీ చిత్తమయా ॥ - కీర్తన 170

ఏమని విన్నవించేము ఇంతి చందములు నీకు
ఆముకొన్న కరుణతో నాదరింతు గాక ॥ - కీర్తన 197

తెలుసుకోవయ్యా ! యీపె తెఱఁగు విచారించి
వులివచ్చి తమితోడ నుమ్మగిల నేఁటికి ॥ - కీర్తన 248

నెరజాణవన్నిటాను నేరుపరివి
తరుణుల మన్నించే తగ వెఱుఁగుదువు ॥ - కీర్తన 467

ఎంత భాగ్యవంతుఁడవో యీకె నీకు దేవులాయ
వింతలేక యెప్పుడూ వినోదించవయ్యా ॥ - కీర్తన 474

నేరుపవయ్యా ! నాకు నీ తోడి కాఁపురాలు
చేరి నీకు మోహించిన చిన్నదాన నేను ॥ - కీర్తన 592

ఈ చిట్టచివరి పాట అన్నమయ్యయే నాయికయై అన్నట్లున్నది.

## దేవీ దేవర లిద్దరిని కలిపి చెప్పిన కీర్తనలు

ఇద్దరి పొందులు నేఁడు ఇందులోనె కానవచ్చె
కద్దులే మీలోని తారుకాణ లెటువంటివో ॥ - కీర్తన 238

నిన్నూ నాపెనుఁ జూచి నివ్వెరగందితి నేను
యిన్నేసి చేఁతలు మీకు నిద్దరికే తగును ॥ - కీర్తన 246

ఎన్నికాయ లోకమున కివిగో మీ సొబగులు
అన్ని చందముల మీరు అమరివున్నారు ॥ - కీర్తన 251

ఎంచి చూచితే నేము ఇద్దరికి హితులము
కంచపు మోవుల గలగల పాయ వలపు ॥ - కీర్తన 269

నిన్ను మెత్తునో యీపె నేరుపులు మెత్తునో
యిన్నియు మీకే తగు నే మందు నేను ॥ - కీర్తన 276

అన్నిటా జాణవు నీకు నమరు నీ జవరాలు
కన్నుల పండుగ గాను కంటిమి నేఁడిపుడు ॥ - కీర్తన 282

కలిగెను నీ వల్లఁ గంటి మీ వలపు
అలరి చెప్పఁ గతలాయను వలపు ॥ - కీర్తన 332

చూచి చూచి మీ పెండ్లికి సోబాన వాడేము గాక
మీ చేఁత లిట్టివని మే మెంచఁగలమా ॥ - కీర్తన 352

మీ కిద్దరికే తెలుసు మీలోని మర్మములు
పైకొని యెదురెదుర పచ్చిదేరీ సిగ్గులు ॥ - కీర్తన 368

ఏమని చెప్పఁగవచ్చు నిదివో మీ నేరుపులు
ఆముకొని చూచి చూచి అరుదయ్యీ నాక ॥ - కీర్తన 401

అని వేంకటేశు ( డాడె నలమేలుమంగ తోడ
వినరే వో చెలులాల ! వేమారు నీ రీతుల ॥ - కీర్తన 411

(అన్నమయ్య చెలికత్తెలలో నొక చెలికత్తెయై, శృంగార దూతికలలో నొక దూతికయై పరవశించి పాడిన సంకీర్తన మిది)

సరిబేను లాయను మీ సరసము నిద్దరికి
మెరసిన మీ చేతలు మెచ్చితి మిందరము ॥ - కీర్తన 413

నిన్ను మెత్తుమో యాపె నేరుపులు మెత్తుమో
చెన్నుగా మాకేది బుది చెప్పవయ్యా ఇకను ॥ - కీర్తన 431

ఇద్దరి మీసరసము లేమని చెప్పగవచ్చు
చద్దికి వేడికి సంతోసము లెన్నోగాని ॥ - కీర్తన 436

సరసుఁడ వవుదువు జాణ వవుదువు
యిరవైన పనులు మీ కిద్దరికిఁ దగును ॥ - కీర్తన 488

ఎఱఁగ మిన్నాళ్లదాఁకా నిటువంటి మీ పొందులు
మెఱసి యెప్పుడూ నాకు మేలు వాఁడవు నీవు ॥ - కీర్తన 506

ఎటువంటి పొందులో మీ యిద్దరికిని
తటుకున మాకు నేడు తారుకాణలాయను ॥ - కీర్తన 507

ఇటువంటి భాగ్యములు ఇవి మీకె కలిగెను
తటుకున నిద్దరికి దగుఁదగునయ్యా ॥ - కీర్తన 541

తరుణికి నీకూ నొక్క తారుకాణ గాఁబోలు
గరిమ నిద్దరి పొందూ గంటిమి మే మిపుడు ॥ - కీర్తన 563

## నాయక సహాయులు

ఆలంకారికులు శృంగార నాయకానాయక సమాగమాన్ని అనుకూలింప జేయడానికి పీఠమర్ద, విట, చేట, విదూషకులను నల్వురను గూర్చి చెప్పారు. కాని, అన్నమయ్య సంకీర్తనల్లో తానే ఆపని నిర్వహించినాడు. అమ్మవారికి శృంగార దూతికలను మాత్రం చెప్పినాడు.

## అన్నమయ్య వర్ణించిన శృంగార నాయిక

నాయకున కేది లక్షణమో, నాయికకును అదే లక్షణము. ప్రబంధ వ్యాపకత్వం, ప్రధాన ఫల భోక్తృత్వం, మహా కులీనతాదులు నాయికా నాయకుల కుభయులకును సమానములే. నాయకునికి ప్రతినాయకాదు లున్నట్లే నాయికకును ప్రతినాయికాదు లుంటారు. 'నాయికా ప్రతి పూర్వా ఽసా వుప పూర్వాను నాయికా' అని నాయిక, ప్రతినాయిక, ఉపనాయిక, అనునాయిక లను భోజరాజు పేర్కొన్నాడు.

నాయికా భేదములింకా యిలా చెప్పబడినాయి.

I.
1. అగ్ని సాక్షిగ వివాహమాడిన భార్య - స్వీయ లేక స్వకీయ
2. వివాహముకాని పడుచు - కన్య
3. పరుని వివాహమాడిన స్త్రీ - అన్యోఢ లేక అన్య లేక పరకీయ
4. వేశ్య - సర్వసాధారణ స్త్రీ - సామాన్య

II. వయస్సు - కౌశల్యాన్ని బట్టి :-

1. రతియందు ప్రతికూలత జూపునది - ముగ్ధ

2. మధ్యా విచిత్ర సురతా ప్రరూఢ స్మర యౌవనా ।
ఈషత్ప్రగల్భ వచనా మధ్యమ వ్రీడితా మతా ॥ - మధ్య

3. స్మరాంధా గాఢ తారుణ్యా సమస్త రతికోవిదా ।
భావోన్నతా దరవ్రీడా ప్రగల్భాక్రాంత నాయకా ॥ - ప్రౌఢ

III. ధైర్యము వలన :- ధీర, అధీర, ధీరాధీర.
ఇది మధ్య, ప్రౌఢ నాయికలకే వర్తిస్తుంది.
మధ్య-ధీర, మధ్య-అధీర, మధ్య-ధీరాధీర
ప్రౌఢ-ధీర, ప్రౌఢ-అధీర, ప్రౌఢ-ధీరాధీర

IV. గుణమువలన : ఉత్తమ, మధ్యమ, అధమ.

V. ఇతర భేదాలు : ఊఢ, అనూఢ.
ఉదాత్త, శాంత, లలిత
సామాన్య, పునర్భువు, స్వైరిణి
రూపాజీవ, గణిక, విలాసిని మొదలగువారు.

## శృంగార నాయికలు

1. స్వాధీనపతిక - పరస్త్రీలను గాంక్షింపక తనయందే యనురక్తుడైన పతిగలది.

2. వాసక సజ్జిక - భర్తవచ్చు సమయానికి తనువును గృహాన్ని చక్కగా నలంకరించుకొని సిద్ధముగా నుండునది.

3. విరహోత్కంఠిత - పతి చెప్పిన వేళకు రాక యాలస్యము సేయగా మిక్కిలి తహతహపాటు పడునది.

4. విప్రలబ్ధ - సంకేత స్థలమున తన ప్రియుడు లేకుండుటను గాంచి యార్తివహించునది.

5. ఖండిత - ప్రియుడు పరకాంతతో రేయిగడిపి యుదయమున కింటికిరాగా దుఃఖించునది.

6. కలహాంతరిత - కోపగించి భర్తను దూషించి వెడలగొట్టి యాతడు వెళ్లిన తర్వాత పశ్చాత్తాపబడునది.

7. ప్రోషిత భర్తృక - తన ప్రియుడు పరదేశగతుడై నప్పుడు కృశించునది.

8. అభిసారిక - ప్రియుని వద్దకు తానే స్వయముగా పోవునదియు, లేదా ప్రియుని తన యొద్దకు రప్పించుకొను యువతి.

ఈ యభిసారిక జ్యోత్స్నాభిసారిక, తమో భిసారిక, దివసాభిసారిక అని మూడు విధాలు.

జాతి భేదాన్ని బట్టి వింగడిస్తే నాయికలు నాల్గు విధాలు.

1. పద్మిని. 2. చిత్రిణి. 3. శంఖిని. 4. హస్తిని

సరస్వతీకంఠాభరణములో భోజుడు నాయికలు 33 భేదాలతో ఉన్నారని జెప్పగా, సాహిత్య దర్పణంలో విశ్వనాథుడు నాయికాభేదాలు 384 అని చెప్పి సూక్ష్మ పరిశీలనంచే ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని చెప్పాడు.

శ్రీరూపగోస్వామి ఉజ్జ్వల నీలమణిలో నాయకుని ప్రియురాండ్రను స్వకీయ, పరకీయ యని విభజించి స్వకీయలో 16,108 భార్యలున్నారని, పరకీయను కన్య, పరోఢ అని రెండుగా విభజించాడు. వీరిలో సాధనవర, దేవి,

నిత్యప్రియ యని పరోఢలు మూడు విధాలన్నాడు. ఈ విధంగా బహు విభాగాలను కల్పించి భక్తి రసాన్ని విపులంగా వర్ణించడంచే నాయికలలో 360 భేదాలు ఏర్పడ్డాయి.

మధురము, ఆనందజనకమైన శృంగారమే ఆలంబనాది భేదాన్ని బట్టి లౌకికం, అలౌకికం లేదా దివ్యం అని రెండు విధాలుగా ఉన్నాయి. స్థాయిభావమైన రతి కాంతా విషయం కాగా లౌకిక శృంగారాన్ని భగవద్విషయం కాగా అలౌకిక శృంగారం లేదా దివ్య శృంగారంగా అనుభూయమానమౌతుంది.

పై చెప్పబడిన బహువిధనాయికాభేదాలలోని అనంతవైవిధ్యాన్ని అన్నమయ్య సంకీర్తనలు ప్రదర్శిస్తోంది. ఆయన పదకవితా పితామహత్వానికీ, శృంగార సంకీర్తనలు గీటురాయి! అలంకార శాస్త్రం 360, 384 వరకే నాయికా భేదాలను విచారించి చెప్పగా, అన్నమయ్య ఆనాయికల్లోని సూక్ష్మతర సూక్ష్మతమ భేదాలను కూడ పట్టుకొని ఒక నూత్న అలంకార శాస్త్రానికే ఒరవడి పెడుతున్నాడా! అన్నట్లు వేలాదివేల నాయికా వైవిధ్యాన్ని మన ముందు ప్రదర్శించినాడు. 'ఆయన కెందరు భక్తులో అందరు నాయికలు' అన్న రీతిగా స్ఫురిస్తుంది ఆయన శృంగార సంకీర్తనల సాహిత్యం ! ఎవని భక్తి వానిది ! ఎవని మార్గం వానిది ! వారందరూ అన్నమయ్య పదకవితలో ఒక్కొక్క నాయికయైనారు. అన్నమయ్య ఆయా భక్తుల మనోభావాలను తాననుభవించి పదకవితా నిబద్ధం చేశాడు ! ఒక్కమాటలో చెప్పాలంటే, అన్నమయ్య శృంగార సంకీర్తన లోక వినూత్న అలంకారశాస్త్రం ! అది శ్రీమన్నారాయణుని సమ్మోహనాస్త్రం !!

ఇతః పూర్వమే చెప్పినట్లు అన్నమయ్య పదాలలో శ్రీవేంకటపతి నాయకుడు. అలమేలు మంగమ్మ నాయిక. శ్రీభూనీళాదులు యితరసతులు. స్వామి దక్షిణ నాయకుడు. కవియే శృంగార సహకారియైన రాయబారి - తానే దూతిక - ఒక్కొక్కసారి తానే నాయిక కూడా ! వీటన్నిటికీ ఉదాహరణలు చూద్దాం.

**స్వీయనాయిక నాయకునితో పల్కుట**

ఇద్దరము నొక్కటే ఇంతే శాలోయి !
తిద్దుకొని యల్లుకొంటే తీగెలే పొదలు గావా !! - కీర్తన 67

**స్వీయనాయికతో చెలికత్తె పల్కుట**

చెలియరో ! నీ మగఁడు చెప్పినట్టు మెలఁగఁగా
పలు విచారము లేలే భాగ్యవంతురాలవు ! - కీర్తన 283

**కన్య చెలికత్తెతో పల్కుట**

ఏమందునే చెలియ ! ఇంత సేసెను వయసు
నా మనసు చొక్కించి నమ్మించె వయసు ! - కీర్తన 55

ఇన్నిటా ఘనుఁడు తాను యెంచితే నేనెంతదాన
సన్నిధినుండి నాకు చనవిచ్చీ నితఁడు - కీర్తన 53

ననిచి యీతని తోనె నగుత నుండెద గాక !
చనవు గలిగిన వెనుక జరయుఁ దగునటవే ! - కీర్తన 54

**కన్యతో నామె చెలికత్తెలు పల్కుట**

పచ్చిదేరి జవ్వనము పరువము వచ్చె నీకు
విచ్చన విడాయ నేఁడు వేరులు మరేఁటికే ! - కీర్తన 110

మనసులోనే దేవుఁడున్నవాఁడు మరి వేడుకొంటే వరము లిచ్చీని
వినయము తోడ నందరుఁ గూడి విన్నపము సేసి మొక్కరే
- కీర్తన 149

**కన్నెలు నాయకునితో పల్కుట**

చల్లలమ్మే వారమైతే సదరమైతిమా నీకు
యెల్ల చోటులకు వచ్చి యేల మొక్కేవయ్యా ! - కీర్తన 312

**ఒక పరకీయ నాయిక చెలికత్తెతో పల్కుట**

చెప్పగదవె చెలియ ! వినియెద చెవులు చల్లఁగ నతని సుద్దులు
కుప్పలు దెప్పలుగాగ ఁ గూడిన గురుతు లెల్లనుఁ దలఁచునా !
- కీర్తన 56

మగవాఁడొకరి సొమ్మా ! మరఁగులేల పెట్టేవే
తగఁబూగుత్తికి తుమ్మెదలు చేరవలదా ! - కీర్తన 156

పెండి లాడేనని పోఁక వెట్టినాఁడు మొదలనే
అండనుండి యెచ్చరించరమ్మ సారెఁ జెలులు ! - కీర్తన 409

పొందుసేయ నేరుచును పూఁచి మెల్ల మెల్లనే
యెందరిని మరిగించెనో యిట్లానే యీతఁడు - కీర్తన 280

**పరకీయనాయికను గూర్చి సతులు నాయకునితో పల్కుట**

సిగ్గువడ దించుకంతా చెలులెల్లా నుండఁగాను
వెగ్గళించకుండా బుద్ధి వేగమే చెప్పవయ్యా ! - కీర్తన 135

**పరకీయనాయిక నాయకునితో పల్కడం**

ఎంత ఆసోదకాఁడవు యేమి చెప్పేది
బంతి బెట్టి తమకమే పచారించేవు ! - కీర్తన 120

తరితీపు వలపుల తక్కరీడ !
సిరులు ఁ దొలఁక ఁబైపై ఁజెనకేవు నన్నును - కీర్తన 122

అంతచక్కని వాడవు! అన్నిటా జాణవు నీవు
సంతోసాన నుప్పంగీ సారెకు నా మనసు - కీర్తన 146

నాతో పొందులిఁకఁ జాడు నాలికాఁడా !
నీ తలఁపు లెల్లాఁ గంటి నీటుకాఁడా !! - కీర్తన 221

ఆఁడువారిఁ గంటేఁ జాలు ఆస నీకెంతైనా గద్దు
పోడిమితో మన్ననంటేవు పొద్దు వోదా నీకు ! - కీర్తన 224

**ఒక సామాన్య నాయిక నాయకునితో పల్కుట**

చూచి చూచి నాకు గడు సోద్యముగ దయవుట్టీ
యేఁచి నీ సేవ సేసే మాయింటికి రావయ్యా - కీర్తన 46

ఏమయ్యా ! నా గుణము యెఱఁగవా నీ వేమైనా
గోమున నా సంగడినిఁ గూచుందువు రావయ్యా - కీర్తన 445

మా ముందర నింతేసి మతకము లేమిటికి
నీ మాఁటలోని దాన నే నౌత యెఱఁగవా ! - కీర్తన 542

**సామాన్య నాయికను గూర్చి సతులు నాయకునితో పల్కుట**

నెట్టుకొన్న బత్తితోడ నీవు నేను వుండఁగాను
చుట్టమై తానూ నిన్ను సొలయఁ జూచీని - కీర్తన 446

ఇందరముఁ జూడఁగా దానెవ్వతోకాని
ముందే నన్ను నేలితివి మొక్కేఁదాన నీకు - కీర్తన 466

దొరతనములు చేసి దొరకొని చెనకీ
నిరతి నా కాఁగిట నీవుండగాను - కీర్తన 478

**ఒక ముగ్ధ నాయికతో చెలికత్తెలు పల్కుట**

ఎదుట నున్నాడితఁడు యేల సిగ్గుల వడేవే
అదనాయ సంతోసము లడఁచఁగ నేఁటికే ! - కీర్తన 7

సరివయసు లిద్దరికి సతములై వొనగూడె
యెరవులిఁక ఁబచరించ నేఁటికే చెలియ ! - కీర్తన 25

వట్టి సిగ్గు లిఁకనేల వరవాతను
చుట్టపు వరుస నీకుఁజూపుతానె వున్నది ! - కీర్తన 26

అందుకే దయవుట్టు నాతనికిని
యెందును వనితలకు ఇచ్చకమే మేలు! - కీర్తన 43

వీఁడివో నీ యెదుట నున్నాఁడు వేవేలు చందాల నెరజాణఁడు
పోఁడిమి తోడుతఁ గలకాలమును పొదిగి భోగించవే ! - కీర్తన 57

తగును మీ ఇద్దరికి తలఁచుకో నా మాఁట
నెగడె మీ కూటములు నిక్కములు నేఁడు! - కీర్తన 60

బుద్ధి చెప్పేము నీకు పుట్టినయింటివారము
పొద్దువొద్దు మగనికి పొందులు మరుపవే - కీర్తన 117

చిన్నదానవా నీవు సిగ్గులేల పెంచేవు
సన్నలనే మోవితేనె చవిచూపవమ్మా ! - కీర్తన 137

**ముగ్ధ నాయిక చెలికత్తెలతో పల్కుట**

తలఁచితే సిగ్గయ్యీ దగ్గరనున్నాఁ డతఁడు
చెలులాల ! నాకు మీరు చెప్పరే బుద్ధులు ! - కీర్తన 71

**ఒక ముగ్ధ నాయికా విషయము నాయకునితో విన్నవించుట**

విన్నవించ నెట్టువచ్చు వెలఁది యున్న చంద మిదివో
కన్నులార నీవె చూచి గతుల దెలుసు కోవయా ! - కీర్తన 4

విన్నవించితిమి నీకు వెలఁది భావము లెల్లా
మన్నించు నింతట నీకె మరిగె నీరీతిని - కీర్తన 8

నిన్నే నమ్ముకున్నది నీకుఁ గంకణము గట్టి
అన్నీ నీ వెఱుఁగుదువు ఆ(అ?)ననేల ఇఁకను - కీర్తన 157

సిగ్గువడీ సుమ్మీ చిన్న వయసుది
వొగ్గి సారె నెంత వొరసేవయ్యా ! - కీర్తన 370

**ఒక ముగ్ధ నాయికతో నాయకుఁడు పల్కుట**

నీ విఁక నేమన్నను నీకు, నీతోడు
కైవసమాయఁ బనులు కడమ లేలిఁకను - కీర్తన 58

**ఒక ముగ్ధ నాయిక నాయకునితో వంటున్నది**

చిత్త మెఱఁగక లోలో సిగ్గు తోడ నున్నదాన
హత్తి నాకు నన్నిటికి నప్పణియ్యవయ్యా ! - కీర్తన 83

**ఒక ముగ్ధ నాయికను చూచి చెలికత్తెలు తమలో వనుకోవడం**

అడిగినాఁ జెప్పధు అంగన తన చేఁతలు
సుడిగొనీ వలపుల ఁజూడరమ్మా ! - కీర్తన 76

**ఒక మధ్యనాయికా విషయమై చెలికత్తెలు నాయకునితో పల్కుట**

కొమ్మచే నేమి సేయించుకొంటివయ్యా
కమ్మటిఁ దా మొక్కినట్టి కారణ మేమయ్యా ! - కీర్తన 6

**మధ్యనాయికతో చెలికత్తెలు**

నీ వెఱఁగవా తగవు నేము చెప్పేదేమున్నది
కైవశమైతివి నీవే కాదా యితనికి - కీర్తన 12

**మధ్యధీరయైన నాయిక చెలికత్తెలతో**

మేలుమేలే యెంతవాఁడు మిక్కిలి సంతోసించితి
వాలాయముఁ గాదనకు వలతు నేననరే - కీర్తన 18

చెలులాల ! బుద్దులెన్ని చెప్పేరే నాకు
చెలువుఁడే వలెనంటే సేసవెట్టేఁగాక ! - కీర్తన 21

వెంగెము లాడకురే విభుని తోను
సంగతితో నతని కిచ్చకురాల నేను - కీర్తన 29

**మధ్యధీరయైన నాయికతో చెలికత్తె పల్కుట**

పతివద్ద నేఁడే నీవు పచరించేవు
కతకారితనా లెందు గడిఇంచుకొంటివే ! - కీర్తన 44

నీవే నేరుతువే నేరుపులన్నియుఁ జెలి
కైవస మాతని నింతగాఁ జేసుకొంటివే ! - కీర్తన 84

**మధ్య - అధీర యైన నాయిక చెలికత్తెలతో**

తనకు బుద్ధులు చెప్పేదాననా నేను
నను మన్నించి ఇంతేసి నవ్వీ నేమోకాక ! - కీర్తన -/15

చెలులాల ! యేమని చెప్పుదునే యీ సుద్దులు
అలరి యెంత పెద్దరిక మందురంటా గాని ! - కీర్తన 17

**ఒక మధ్య - అధీరనాయికతో చెలికత్తెలు మాటాడుట**

కొంకక చెప్పవే యీ కొత్తలు వినేఁగాని
లంకెగా నితఁడు నీకు లలి జుట్టమటవే ! - కీర్తన 22

చూడ (జూడ వేడుకయ్యీ సుదతి నీ బాగులు
వాడలోన నీసుద్దులు వన్నె కెక్కె (జెప్పవే ! - కీర్తన 39

ఇది మావేడుక గాదా యేల మాకు దాఁచేవు
వెదక (బోయిన తీగె యెదురుగా వచ్చెను - కీర్తన 41

**మధ్య ధీరాధీర నాయికను గూర్చి చెలికత్తె పలుకుట**

ఒక్కటికొక్కటి లంకె లొనగూడెను
చొక్కపు సతిలాగులు చూడరమ్మ చెలులు ! - కీర్తన 28

**ఒక ప్రౌఢ నాయికను గూర్చి చెలికత్తెలు పల్కుట**

పట్టరానిది వయసు పడఁతినేమనవచ్చు
చుట్టమగుపతిఁ దెచ్చి చూపరే సతికి ! -కీర్తన 1

ఎట్టోరుచుకున్నాడవో యీాపె సేసే చేఁతలకు
అట్టె నేము చూచిచూచి ఆఁపలేము నవ్వులు ! - కీర్తన 10

**ప్రౌఢ - ధీరనాయికను గురించి చెలికత్తెలు పల్కుట**

చెలు లందరుఁ జూడఁగా సిగ్గువడ వించుకంతా
కలికితనాల నెంత గయ్యాళించేవే ! - కీర్తన 19

ఏమే నీరమణుఁడు యెదుట నున్నాఁడు వీఁడె !
దోమటిగా మోవి యిచ్చి దొమ్మి రేఁచ గలవా ! - కీర్తన 178

ఉవిదకు నీకు నెట్టి వొడఁబాటులో
జవళి రతుల నీతో సాము సేసీని ! - కీర్తన 523

**ఒక ప్రౌఢ - అధీర నాయిక చెలికత్తెలతో నంటువ్నది**

చెలులాల ! పతిఁ గక్కసించకురే పలుమారు
యెలమి తోడుతఁ దొల్లె యేలినాఁడు నన్నును ! - కీర్తన 30

**ఒక ప్రౌఢ - ధీరాధీరయైన నాయికతో చెలికత్తె పల్కుట**

ఇంకనేల వట్టి గుట్టు లెదిరించె వలపులు
పొంకమాయ నీతనితో పొందులు చేకొనరే ! - కీర్తన 31

నీవు గల చోటనే యన్నియుఁ గలవు
చేవదేరీ నీమేన సింగారాలన్నియును - పాట 101

ఇల్లాలికిఁ దగునటే యింత రట్టడితనము
వొల్లనే మితిమేరతో నొనగూడవలదా ! - కీర్తన 103

ఒక ప్రౌఢనాయిక ముగ్ధనాయికకు శృంగార హితోపదేశము చేయుట

ఆతఁడు నీ రతులకు నాససేయఁగా
చేతులారా సేవ సేసి చిమ్మి రేఁచ వలదా ! - కీర్తన 77

మేలు మేలే నిన్నుఁ జూచి మెచ్చితి నేను
నాలాగు లింతకంటె, నన్నుఁ జూడు మిఁకను ! - కీర్తన 80

చిన్నదానవైతేనేమి చెక్కులు నొక్కి నాతఁడు
చన్నుల నొరసి నీవూ జయము చేకొనవే ! - కీర్తన 227

మఱవకువే చెలియా ! మదనరహస్య మిది
యెఱుఁగు కొంటే మేలు ఇందులోనె వున్నది ! - కీర్తన 32

అమరెఁ గదె నేఁ డన్ని సొబగులును
సమరతి చిన్నలు సతి నీమేనా ! - కీర్తన 419

చింతకాయ కజ్జాయము చెలువునితోడి పొందు
పంతముతో నీతని మోపవే గట్టి చన్నులు ! - కీర్తన 579

## అష్టవిధ శృంగార నాయికలు

I. స్వాధీనపతిక చెలికత్తెతో పల్కుట

ఏమందునే నేను యీతని తోడ
వేమారు నన్ను లాలించి వేడుకొనీ దాను - కీర్తన 183

స్వాధీనపతికతో చెలికత్తె పల్కుట

ఏమినోము నోచితివే యింతక తొల్లి
కామించఁ దగునే నీకు గక్కన నీ విభుఁడు - కీర్తన 129

నీమీఁద బత్తి గలఁడు నీ రమణుఁడు
ఆముకొన్న చేఁతలు నీ కమరునే నేఁడు - కీర్తన 131

ఏమని పొగడవచ్చు నిట్టి మీ జాణతనాలు
భూమిలో చెల్లుబడై పొలుపొందుఁగాక - కీర్తన 130

**స్వాధీనపతిక చెలికత్తె నాయకునితో పల్కుట**

ఎంత బత్తి గలవాఁడ వీకె మీఁదను
వింత మీ పొందులు చూచి వెరగయ్యీ మాకును - కీర్తన 220

బత్తి గల విభుఁడవు భామకు నీవు
యిత్తల నాకె చనవు యీడేరించవయ్యా - కీర్తన 222

ఎంత మన్నించితివో యీకెను నీవు
వింత లెల్లా నీముందర వెదజల్లీ నిపుడు - కీర్తన 417

**స్వాధీనపతికతో తోడిసతులు పల్కుట**

ఇన్నిటా జాణవు నీవే యెఱుఁగుదువు
సన్నలనే పతిని వసము సేసుకొంటివి - కీర్తన 288

చక్కని గుణవంతుఁడు సరినీకు మగఁడాయె
యెక్కువైన నీ భాగ్య మేమని చెప్పుదుమే ! - కీర్తన 361

**II. వాసక సజ్జిక చెలికత్తెలతో పల్కుట**

పిఱువరే నాయకుని ప్రియము లన్నియుఁ జెప్పి
తలఁపులో వేడుకలు దైవారుఁ గాని - కీర్తన 37

అన్నిఁటా నెరజాణఁ డాతఁడే యెఱుఁగును
విన్నపము లెల్లా సేసి వేడుక ఁబొగడరే - కీర్తన 36

ఏమి సేసీనో విభుఁడు యెదురుచూచే నేను
ప్రేమపు సంతోసాలు పెనగొనీ నాకును ॥ - కీర్తన 138

**వాసకసజ్జిక నాయకునితో పల్కుట**

ఇందాఁకా వాకిటనే యెదురు చూచితి నీకు
కందువతో నేఁడు నన్నుఁ గడు మన్నించితివి ॥ - కీర్తన 528

**వాసకసజ్జిక చెలికత్తెలు నాయికతో పల్కుట**

చూడరమ్మ ఇంతులాల ! సుదతి చందము నేఁడు
వేడుక సింగారాలు వింత వింత లాయను ॥ - కీర్తన 285

**వాసకసజ్జిక చెలికత్తెలు నాయకునితో విన్న వించుట**

రాఁపులు సేయక ఇఁక రావయ్యా !
మాపు దాఁకా మాటలేల మరి ఇఁక రావయ్యా ॥ - కీర్తన 69

సేయఁగల విన్నపము సేసితిమి నీతోడ
పాయకిఁక నీయంతిఁ బాలించవయ్యా ॥ - కీర్తన 72

ఇంతట మన్నించరాదా యేమయ్యా !
వింతసేయ కిఁకనైనా విచ్చేయవయ్యా ॥ - కీర్తన 79

ఇప్పుడు నీవు రాఁగాను ఇంత సంతోసించెగాని
వుప్పతిల్లఁ గోరికల నువ్విళ్లూరు చుండును ॥ - కీర్తన 219

చెలియ మోహము నీకుఁ జెప్పఁగ నలవిగాదు
మలసి నీవే యెఱిఁగి మన్నించు మిఁకను ॥ - కీర్తన 225

వెంగెము సేయదు సుమ్మీ వెలఁది
అంగవించి తెలిసితే నంతా నీపై మోహము ॥ - కీర్తన 234

ఇంతలో విచ్చేసితివి యీడకే మగువఁ జూడు
కాంత యిదె నీరాక గాచుకొని వున్నది ॥ - కీర్తన 318

**III ఒక విరహోత్కంఠితయైన నాయిక చెలికత్తెతో పల్కుట**

ఉద్దగిరి కృష్ణుఁడాతఁడొక్కడే జాణఁడంటివి
పొద్దున మా కిద్దరికిఁ బొసఁగునే చెలియా ॥ - కీర్తన 49

మేలు మేలే యితఁడు నేర్పును మెచ్చితి నన్నిటా నీతని కూటమి
కోలుముందై యిటులఁ గోర్కులు కొనలు సాగని దేఁటిదే ॥
- కీర్తన 51

నన్నుఁజూచి నాకు నాకే నవ్వువచ్చీని
మిన్నక నాజవ్వనమే మేరలు మీరఁగను ॥ - కీర్తన 367

**విరహోత్కంఠితయైన నాయికను గూర్చి నాయకునికి చెలికత్తెలు విన్నవించుట**

ఎపుడు వత్తువో యనుచు యెదురు చూచీఁ జెలియ
వుపమించి చెప్పితిమి వువిదఁ జెందవయ్యా ॥ - కీర్తన 52

నీ చిత్త మిటమీఁద నేము చెప్పేటిదేమి
చేచేతఁ గూడి దయ సేయవలెఁ గాక ॥ - కీర్తన 59

ఎంచిచూడ నెన్నిలేవు యీకె తలపోఁతలు
నించిన వేడుక లిఁక నెరవేరుచవయ్యా ॥ - కీర్తన 62

చెలియున్న చందమైతేఁ జెప్పఁగ రాదు
నెలకొని యెట్లా మన్నించేవో కాని ॥ - కీర్తన 82

ఏమని విన్నవించేము ఇంతి చందములు నీకు
ఆముకొన్న కరుణతో నాదరింతు గాక ॥ - కీర్తన 197

ఏమని విన్నవించేము యీపె సుద్దులు
కోమలి కోరికె లివి కోటానఁ గోట్లు ॥ - కీర్తన 271

**విరహోత్కంఠిత నాయకునితో పల్కుట**

తనియదు నామనసు తమితో నీ పొందు సేసి
యెనసిన వేళ గుణమెట్టిదో గాని ॥ - కీర్తన 274

ఏమి సేతురా నా మనసు యెంతైనఁ బట్టఁగలేను
కామించిన దాననై కడుఁగొసరెఁ గాక ॥ - కీర్తన 497

**విరహోత్కంఠితతో నామె చెలికత్తె పల్కుట**

నీవేమి సేతువే నిన్ను నింత సేసిన
భావజుని చెల్లుబడి పెంత మింతే కాక ॥ - కీర్తన 187

ఎంత నేరుపరి యీలేమ
దొంతి వెట్టీ సంతోసముల ॥ - కీర్తన 372

**ఒక విప్రలబ్ధయైన నాయిక చెలికత్తెలతో పల్కుట**

మేటి నేరుపరులాల మెలుఁతలాల !
కూటము లిద్దరికిని గూరుచరె యెపుడు ॥ - కీర్తన 93

ఏమిసేతు నమ్మలాల ! యిదివో నా చందము
వేమరు నాతని కిట్టె విన్నవించరే ॥ - కీర్తన 99

తరుణులాల ! యీ కత తానే యెఱుగుననేరే
సరుస దామన్నించితే సంతోసించే గాక ॥ - కీర్తన 284

సేసేదేమే ! యిఁక వాని చిత్తము నాభాగ్యము
బాస యిచ్చినాఁడు నాకు బత్తి గలఁడతఁడు ॥ - కీర్తన 321

తానెంత మన్నించినాను తన చిత్తమింతే కాక !
నేనే నాయంత వలపు నెరపఁగ వచ్చునా ॥ - పాట 534

**విప్రలబ్ధయైన నాయికను గూర్చి యామె చెలికత్తె నాయకునితో పల్కుట**

ఇన్నిటా సంతోసమాయ నిటు మిమ్మి ద్దరి జూచి
మన్నించిన మన్ననలే మంతుకెక్కె నిపుడు ॥ - కీర్తన 92

**విప్రలబ్ధ నాయకునితో పల్కుట**

నీ చిత్త మెట్టుండునో నే నెఱఁగ నాయకుఁడ
యేచి నా సింగారమే యింత సేసె నన్నును ॥ - కీర్తన 535

నన్నెంత వేఁడుకొనేవు నయాన నీవు
మన్నింపించుకొన్న దాన మరిగించేఁ గాక ॥ - కీర్తన 587

**V ఒక ఖండిత నాయిక చెలికత్తెలతో పల్కుట**

తానూ సవతినంటా తారుకాణ కేల వచ్చీ
మానుమనరే యెమ్మెలు మదిరాక్షులాల ॥ - కీర్తన 106

**ఖండిత నాయికతో చెలికత్తె పల్కుట**

రావే యీతని కడకు రమణి నేఁడు
నీవు నాతఁడుఁ బొందైతే నెమ్మది నుండుదురు ॥ - కీర్తన 48

నమ్మవే నా మాఁటలు నవ్వులు గావు
పమ్మి నీ మీఁద గడు బత్తి గల ( డతఁడు ॥ - కీర్తన 74

నే నెదుట నున్నదాన యీ చేఁతలూఁ జూచెఁగాక !
వీనులారా నీ గుణాలు వినేఁ గాని ॥ - కీర్తన 78

**ఖండిత నాయిక మరొక నాయికతో సపత్నీమాత్సర్యము ప్రదర్శించుట**

ఇతఁడు నా మగఁడౌట యెఱఁగవటే
రతి కెక్కఁ జెనకేవు రమణుని నిపుడే ॥ - కీర్తన 91

– కితఁడు మోహించి నావద్దనే వుండఁగాను
యీాకడ నీ వేకఁరేవు యెంత జాణతనము ॥ కీర్తన 142

ఏమే నీ పంతమెల్లా నిటువంటిదా
నేమముతో నావలెనే నీటు చూపవలదా ॥ - కీర్తన 188

నీ కొలఁది దాననా నీ యంత నే నేరనా
చేకొని యెంతేసి నీవు చేఁతలు సేసేవు ॥ - కీర్తన 201

చెప్పరాదు నీ పగటు సిబ్బితిపడ వేమిటా
అప్పటి మురిసేవు నా యంత దానవా ॥ - కీర్తన 206

ఆతఁడెంత ! నీ వెంత !! అంతరము లెంచుకో
చేతికి దొరకనంటా సేవలు సేసేవు ॥ - కీర్తన 216

ఆతఁడెంత ! నీ వెంత !! ఆదేమే నీవు !
మేతరి తనము లింత ఇతవా నీకు ॥ - కీర్తన 229

మేలు మేలే, నీ కతలు మెచ్చిరి మగువ లెల్లా
యీలాగులు నీ గరిమ లేమని చెప్పుదుమే ॥ - కీర్తన 264

ఆఁట దాని వలపులు అంగడి కెక్కదగునా ॥
నీటు తోనే పంతములు నెరపవలెగాక ॥ - కీర్తన 375

ఏలే యింత పగటు యెరుఁగుకోవే నన్ను
మేలుదాన మొదలనే మిక్కిలి నీతనికి ॥ - కీర్తన 390

చూతము నీ నేరుపులు సుదతు లిందరిలోన
యేతులు నాతో నెంచ నేఁటికే నీవు ॥ - కీర్తన 396

నా యంతటిదాననా నడుమ నీవు
ఆయలేవే యేమి చెప్పే వారడి నీసుద్దులు ॥ కీర్తన 422

పతి కిచ్చకములాడి బతికే వారము మేము
కతకారితనముల కలికివే నీవు ॥ - కీర్తన 433

నా విభునితో నేల నగవచ్చేవే
వావిరి నాకే యితఁడు వసమైయున్నాఁడు ॥ - కీర్తన 440

ఆతఁడేడ నీ వేడ ఆసలేల సేసేవే
కాతరాన నాతఁడు కైవశమై యుండగా ॥ - కీర్తన 486

**ఖండిత నాయిక, నాయకుని వ్యంగ్యోక్తులు పల్కుట**

నీ కింత బాఁతైతిఁగా నేఁ జేసినదే భాగ్యము
కై కొనవయ్యా పాదాలు గడిగే నే నీకును ॥ - కీర్తన 47

ఎంత బిత్తరాలు యిది యేమి చెప్పేది
కాంతుఁడవు నీవు నాకు ఁగలిగి వున్నాఁడవు ॥ - కీర్తన 104

వాకిట నుండే యేమి యడిగేవు వలవని సుద్దులు
యేకతమాయను యింటిలోనికి యేలుదువు రావయ్యా ॥
- కీర్తన 150

తానెంత నీ వెంత తన సుద్దు లివిగో
నేనూ నీవూ జాట్టాలమై నెమ్మది నున్నారము ॥ - కీర్తన 207

అనుమానించఁగ నేలా ! అవిగో నీ చేఁతలు
దినదిన కొత్తలెల్లా దిష్టమాయ మాకును ॥ - కీర్తన 286

ఆనతియ్యవయ్యా ! నాతో నక్కడి సుద్దులెల్లాను
పూని నా కాఁగిట నిట్టె భోగించేవు గాని ॥ - కీర్తన 337

**ఖండితనాయికను గూర్చి చెలికత్తె నాయకునితో పల్కుట**

కంటివిగా వోయి యీపె గయ్యాళితనములు
జంటలకే పెనఁగీని సంగతేమీ నెంచదు ॥ - కీర్తన 533

**ఒక కలహాంతరితయైన నాయిక చెలికత్తెతో పల్కుట**

ఏమని చెప్పుదునే యిట్టిది నా యాందోళము
కామించాతని చిత్త మేగతి నున్నదో ॥ - కీర్తన 75

మరిగిన చోటికి మంచితనమే మేలు
తరువాతి పనులెల్లా తానె అఁగు ననరే ॥ - కీర్తన 86

అడుగవే చెలియా ! ఆతని నీవు
యెడయక తనతో నే నెగసక్కె లాడేనా ॥ - కీర్తన 126

ఇదివో నా మొగమోట మేమని చెప్పుదునమ్మ
కదిసి నా చేఁత లేమీ గాదనఁడే యతఁడు ॥ - కీర్తన 144

దయ నాపైఁ గలిగితే తానే మన్నించీగాక
ప్రియములు రేఁచి రేఁచి పెనఁగఁగ నేఁటికే ॥ - కీర్తన 181

వింటివటే యీతని వేసాల సుద్దులు నేఁడు
అంటే ననరాదు గాని ఆగడీఁడు గదవే ॥ - కీర్తన 369

**కలహాంతరితయైన నాయిక చెలికత్తెతో నాయకునకు చెప్పి పంపుట**

మఱి నేనే చెప్పేనంటే మందెమేళ మందురు
మెఱసెఁ దన గుణాలు మెచ్చితి నేననవే ॥ - కీర్తన 374

**కలహాంతరితయైన నాయిక చెలికత్తె నాయకునితో పల్కుట**

రమణికి నీకుఁ బోదు రావయ్యా
అమరు నిన్నికె యేమనినా నేమాయను ॥ - కీర్తన 303

ఆఁటది మానావతి యాసోదకత్తె
మాఁటాడి మన్నించరాదా మరఁగేల నీకు ॥ - కీర్తన 389

**ఒక కలహాంతరిత యైన నాయికకు చెలికత్తె హితోపదేశము చేయుట**

ఇన్నిటా రట్టడి నౌదు వెఱుఁగుదు నీ జాడలు
మన్ననలు చేకొంటివి మచ్చికలు చల్లవే ॥ - కీర్తన 87

ఇందరి ముందర వలపేల దాఁచేవు నీ
చందము లెఱుఁగుదురు సకులెల్లాను ॥ - కీర్తన 177

మగుమకుఁ బతితోడ మందెమేళ మింతయేలే
తగిలి మంచితనాన దక్కఁ గొనవలదా ॥ - కీర్తన 186

అదివో కాచుకున్నాఁ డప్పటి నుండి నీ వొద్ద
పొదిగొన్న రతులను భోగించరాదా ॥ - కీర్తన 268

ఎడమాఁట లిఁకనేల యెదుట నున్నాఁడతఁడు
పిడికిటి సేసవెట్టి పిలువవె ఇంటికి ॥ - కీర్తన 376

**ఒక కలహాంతరితయైన నాయిక నాయకునితో వ్యంగ్యములు పల్కుట**

నే నిన్ను వద్దనేనా నెపాలు వేసేవు గాక
కాని పనే ఇదియేమి కైకొనఁగ వలదా ॥ - కీర్తన 85

ఇప్పు డెరిఁగితి నేను యీాపె నీకుఁ బ్రియమౌత
ముప్పిరి నన్నేలితివి మొక్కే నే నీపెకు ॥ - కీర్తన 239

నిన్ను నాపెఁ జూచితేను నేఁడు నాకు వెరగయ్యీ
యిన్నిటా నీ మతకము లెంచుకోవయ్యా ॥ కీర్తన 281

గుట్టుతోడి నున్నదాన గొరబేల సేసేవోయి
గట్టిగా సేవ వెట్టితే గాదంటినా నిన్ను ॥ - కీర్తన 297

ఎప్పుడూ నా వాఁడవే ! ఇన్నిటామన్నించితివి
చెప్పరాదా ! యీాపె నుద్ది సిగ్గులేల నీకును ॥ - కీర్తన 471

నీవు నన్ను నేలనది నేఁడు తా నెఱగదేమో !
పూవుల వేసీ నిన్ను బొంచి పొంచి యిపుడు - కీర్తన 472

**VII. ఒక ప్రోషిత భర్తృకయైన నాయిక చెలికత్తెతో తన నాయకునకు వర్తమానము పంపుట**

తానే యెఱుఁగును అన్ని దగవులు దయఁదలంచీ నిపుడె రమణుఁడు
పూని యొక మాఁటెచ్చరించవే పొసఁగునో చెలియా ॥ - కీర్తన 63

రమ్మనవే రమణుని రాఁపులు సేయఁగ నేల
సమ్మతాయఁ బనులెల్లా జాగులిఁక నేఁటికి ॥ - కీర్తన 240

**ప్రోషిత భర్తృకయైన నాయికతో చెలికత్తె పల్కుట**

ఎట్టినోము నోచితివో, ఇదివో నీ భాగ్యము
చుట్టరికము లెల్లాను చూపవమ్మా ॥ - కీర్తన 81

**నాయకుఁడింటికి తిరిగిరాగా ప్రోషిత భర్తృకయైన నాయిక చెలికత్తెలతో పల్కుట**

చెప్పవే నా కొక బుద్ధి చెలియ పూహించి నీవు
యెప్పుడూ నా కోరికలు యీడేరునే కదవే ॥ - కీర్తన 327

ఏమి సేతుఁ జెలియా ! యిదిగో నా చందములు
కామించి యింతలో వచ్చి కరుణించె విభుఁడు ॥ - కీర్తన 586

**అభిసారికయైన నాయిక చెలికత్తెలతో పల్కుట**

ఏమీ తన కెంతచన వెన్నడూ లేమి
కామించి వచ్చీ వావులు గలపుకొంటాను - కీర్తన 127

**అభిసారికా నాయిక చెలికత్తెలు నాయకునితో పల్కుట**

అందులకే వెరగయ్యీ నప్పటి నుండి నాకు
కందువ నెన్నాళ్లనుండి కాచుక వున్నదియో ! - పాట 420

ఆపె చెప్పినట్టె సేసి యాదరించఁ దగు నీకు
కాఁపురము లీడేరె ఁగరుణించవయ్యా ॥ - కీర్తన 441

ఎవ్వరు వద్దనేరు నీవేమి సేసినా
జవ్వని వలచివచ్చెఁ జనవియ్యరాదా ॥ - కీర్తన 259

ఇంటికి రావయ్యా ! నీకు నెదురు చూచీ నింతి
జంటలైన మిము ఁజూచి సంతోసించుకొనేము ॥ - కీర్తన 540

**అభిసారిక నాయకుని తనవద్దకు రప్పించుకొనుట**

ఇందు నిన్నుఁ దెచ్చుకొంటి, నిఁక నేమనీనో కాని
పందేలు వేసి పంతాలు పలికెఁ బో యీకె ॥ - కీర్తన 235

నీవల్ల దోసము లేదు నీవటు వంటివాఁడవా
రావయ్య మాయింటికి రవ్వసేయ నిన్నును ॥ - కీర్తన 551

వాకిట నుండి యెంత వాడికలు సేసేవు
లోకమెల్లా నెరుఁగును లోనికి రావయ్యా ॥ - కీర్తన 463

రమ్మనవే చెలియా ! రమణుని నీడకు
వుమ్మగిలిన వలపు లుట్టిఁగట్టఁ దగదే ॥ - కీర్తన 531

తను నమ్మివున్నదాన తడవేల సేసీనే
ఘనుఁడు తా నిన్నిటాను కరుణించుమనవే ॥ - కీర్తన 532

**అభిసారికతో నామె చెలికత్తెలు పల్కుట**

అమ్మరో ! యెంతటి సాహసివే నీవు
కమ్మర నాతఁడే నిన్నుఁ గరుణించీఁగాక ! - కీర్తన 124

ఎంత లే దీపె నటన లివియుఁ గొన్ని
చెంత నన్నీ గానవచ్చె చెలియ రాగదవే ! - కీర్తన 209

ఎంత నేరుపరి యీాకె యెటువంటి కలికి
మంతనాన నెటువలె మన్నించేవే యికను - కీర్తన 231

చేరి పెండ్లాడరాదా సేసలు వెట్టి
సారెకు నీ మోవి చూపి సన్నలేమి సేసేవే ! - కీర్తన 462

నీ వద్దికి వీఁడే వచ్చె, నీ కోరిక లీడేరె !
కైవసమాయఁ బనులు కళవళించకువే ! - కీర్తన 582

## శృంగార దూతికలు

అమ్మవారి తరపున అయ్యగారి యొద్దకు దూతకార్యం నెరపడానికి వెళ్లే శృంగారదూతికల మధ్య జరిగిన సంభాషణను అన్నమయ్య ఒక సంకీర్తనలో యిలా వర్ణించాడు. (కీర్తన 405)

కంటిలేవే నీసుద్దు లిక్కడ నమ్మతోఁ జెప్పేను
వెంట వచ్చినదానను వెస నన్నెఱఁగవా ॥ ॥ పల్లవి ॥

యెడమాఁట లాడవచ్చి యేల సిగ్గులువడేవే
నడుమ నూరక యేల నవ్వు నవ్వేవే
చిడుముడి నటనతో శిరసువంచనేఁటికే
తొడరి పొందులు సేసే దూతికవు నీవు ॥ ॥ కంటి ॥

చన్నుల మీఁది పయ్యెద జారనేల తోసేవే
సన్నలనే మోవితేనె చల్లనేఁటికే
కన్నులారుచుకొంటాను కతలేమి చెప్పేవే
పన్నిన రాయబారపు పడఁతివి నీవు ॥ ॥ కంటి ॥

నిలుచుండి నీకు నీకే నివ్వెరగులే లయ్యేవే
చెలరేఁగి మేనేల చెమరించేవే

అలమేలు మంగ నేలె నప్పుడే శ్రీ వేంకటేశుఁ
డెలమి ( జెలకత్తెవు యేలంటేవే నీవు ॥ ॥ కంటి ॥

ఈ పాటలో దూతిక, రాయబారపు పడతి, చెలికత్తె అనే మాటలను ప్రయోగించాడు అన్నమయ్య. వీరికే అలంకారశాస్త్ర గ్రంథాలలో దాసి, సకియ, దాది, నటి, పొరుగమ్మ, ఇంటిలోని చిన్నపిల్ల, యోగిని, చాకలి, చిత్ర కర్మ చేయు స్త్రీ వీరు దూతికలుగా ఉంటారని చెప్పబడింది. ఆది శబ్దంచే తాంబూలములమ్మే స్త్రీ, పరిమళ ద్రవ్యాలమ్మే స్త్రీ వంటకత్తె, గానము నేర్పు స్త్రీ వీరు కూడ దూతికలౌతున్నారు.

పై అన్నమయ్య కీర్తనలో నాయిక తరపున దౌత్యకార్యానికి వెళ్లుతున్న దూతికయే మన్మథావస్థకు గురికాగా, ఆమె హావభావలీలాది చేష్టలను చూచిన ఆమె తోడి దూతిక లామెను మందలించుచున్నారు.

జాగులేల సేసేరే సకియలాల !
వేగమె యెచ్చరించరే వేడుక పుట్టుగాని - కీర్తన 289

అనే పాటలో శృంగార దూతికలు తమలోతాము చేస్తున్న జాగు సరైనది కాదని తొందర పడే ఘట్టం వర్ణింపబడింది.

మరో రెండు కీర్తనలు - దూతికలు కూడ స్త్రీలే కావడం వలన స్త్రీ సహజమైన బలీయమైన కోర్కెకులోనై నాయకుని తమ చాతుర్యంతో వశపరచుకొని, లేదా శఠుడైన, ధృష్టుడైన నాయకునికి తాము లొంగిపోయి నాయిక చేత పట్టుపడి ఉపాలంభింపబడటం కనబడుతుంది.

వలపించ బోయి నీవే వలచితివి
యిలనెంత జాణలకు నిట్టుండు ( బనులు ! - కీర్తన 90

నాయకుని మనస్సును నాయికపై మళ్లింపవలసిన దూతికయే నాయకుని మోహించి వలచి వచ్చినది. నాయిక దానిని పసిగట్టి ఆమెను పై కీర్తనలో

మందలించినది. మరో కీర్తన చూడండి -

అతని వద్ది కంపితే నన్ని గడించుకొంటివి
యీతల ( జెప్పవే మాకు ఇ(కనేల దా(చను ॥ పల్లవి ॥

వన్నెల నీ మోవి మీ(ది వసివాళ్లెక్కడివే
యెన్నరాని మోవి కళ లెక్కడివే
సన్నపు( జెక్కుల మీ(ది జారు ( జెమటెక్కడిదే
యెన్న(డూ లేని గురుతు లిప్పుడట్టె కంటిమి ॥ ఆతని ॥

అని నిలదీసి అడుగుతోంది నాయిక! ఇటువంటి శృంగార దూతికలు అలంకార శాస్త్రానికి కొత్తవారేమీ కారు. కాని, వీరికి భిన్నంగా చాల పవిత్రంగా అత్యంత శ్రద్ధతో యీదౌత్యకార్యాన్ని సమర్థంగా నిర్వహించే శృంగార దూతికలు లేకపోలేదు. అటువంటి ఒక శృంగార దూతిక నాయకునితో యిట్లంటున్నది.

ఎంచి చూచితే నేము ఇద్దరికి హితులము
కంచపు మోవుల గలగలపాయ వలపు

యింతి నీ యవసర మెరి(గిరా నంపెనన్ను
కాంత నీవు నున్నారు గద్దె మీ(దను
అంతలోనే రెంట దెప్పు లాయను మీ వలపులు
వింత సుద్దు లింకేమని విన్నవింతునయ్యా ॥ ॥ ఎంచి ॥

- కీర్తన 269

దూతిక నాయకుని యొద్దకు నాయిక తరపున వెళ్లగా అక్కడ నాయికయే నాయకునితో నున్నది. ఇదొక చమత్కారమైన సన్నివేశము! చమత్కారము కాదు, సత్యమైన దాన్ని ఒక శృంగార లీలావిశేషంగా భాసింపజేయడం భగవంతుని కెంత సహజమో ఒక భక్త కవికీ అంతే సహజం!

## నాయికా జాతులు

పద్మిని, చిత్తిణి, శంఖిని, హస్తిని అనేవి స్త్రీ జాతి విశేషాలు. అవస్థా విశేషాలు కావు. ఈ వివిధ జాతుల్ని కామశాస్త్రం సవిస్తరంగా వర్ణించింది. రతి మంజరిలో పై నాల్గు జాతుల స్త్రీల లక్షణాలు చెప్పబడినాయి.

1. పధ్మ పరిమళము గలగిన శీలవతి పద్మిని.
2. నీతి బద్ధమైన శీలముగలిగి రతిరసజ్ఞయైన సుందరి చిత్తిణి.
3. కామోప భోగరసికతతో వెలయు యువతి శంఖిని.
4. కామోత్సుకయై అధికరతిని వాంఛించే సుశీల హస్తిని.

అని వారి వారి అవయవ వర్ణనల్ని శాస్త్రగ్రంథాలు విస్తారంగా చేశాయి.

అన్నమయ్య శృంగారసంకీర్తనలు 5 వ సంపుటంలోని 123 వ కీర్తనలో

అన్ని జాతులు దానె యై వున్నది
కన్నుల కలికికి మాయ (గరచెనోయన(గ ॥

అనుచు శంఖిణి, చిత్తిణి, హస్తిని, పద్మిని అని నాల్గు జాతులు చెప్పి చివరగ " ఇదియు జగదేక మోహిణి దానె కాఁబోలు " అని చెప్పడం గమనింపదగింది " తెలుగున నన్నిచోడుని కుమార సంభవము తరువాత నీ జాతులను గూర్చి యిట్లు విపులీకరించిన కవులు తాళ్లపాక వారే యనవచ్చును " అని డా॥వేటూ ఆనందమూర్తిగారు, (తాళ్లపాక కవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషాల 1976 పుటలు 103-104) చెబుతున్నారు. ' మోహిని ' అనే ఒక కొత్త ( జాతిని అన్నమయ్య సృష్టించినట్లు వారు చెప్పారు. కాని, ' జగదేక మోహి (ణి)' అనేది ఒక సమాసంగా గ్రహిస్తే మంచిదనిపిస్తుంది.

ప్రస్తుత సంపుటంలో

చిత్తిణి యీాపె; సుద్దులు చెప్ప (గొత్తలు
బత్తి నీపై( జేసీ నెంత పగటో గాని ॥ - కీర్తన 23(

అనే పాటలో అలమేల్మంగ చిత్తిణిగా చిత్రింపబడినది. ఆమె 'జగదేకమోహిని' కదా !

### అలమేలుమంగను సూటిగా వర్ణించిన కీర్తనలు

అన్నమయ్య శృంగారసంకీర్తనలన్నీ అలమేలుమంగ నాయికగా గలవని చెప్పబని లేదు. కాని, ఆమెను సూటిగా సంబోధిస్తూ వ్రాసిన కీర్తనలు పదిదాకా ఈ సంపుటిలో కనబడుతాయి.

అలమేలు మంగవు నీవానే పతిఁ జేకొంటివి
నెలకొని యీ చేఁతలు నీవే నేరుతువే ॥ - కీర్తన 118

నీ వెఱఁగవా బుద్ధి నీకు నేము చెప్పేదేమి
దేవులవు నీ విన్నీ దెలసిన వే ॥ - కీర్తన 121

అట్టి నెరవాదివి నీ వలమేలుమంగవు
నెట్టన నీ రమణుఁడు నిన్ను మెచ్చీ నిందుకు ॥ - కీర్తన 123

నిన్ను నెంచి చూచితేను నీకు నెవ్వరు సరి
మన్నించె నీ రమణుఁడు మరియేల కొంకను - కీర్తన 266

అలమేలుమంగ నీ వన్నిటా నౌరపరివి
కలికి నీ వొళ్ల నివి కంటిమే చెలియా ॥ - కీర్తన 279

అలమేల్మంగవు నీవు అక్కున నుందానవు
లలినీ గుణ మెఱిఁగి లాలించీ గాక ॥ - కీర్తన 324

మేలుమేలే వోపుదువే మించి యంత పనికైనా
పోలించి చెలులమెల్లాఁ బొగడేమే నిన్నును ॥ - కీర్తన 590

నీ వలమేలుమంగవు నెరజాణఁ డాతఁడు
వోవరిలో నుండఁగదె వొయ్యారి దానవు ॥ - పాట 449

ఇట్టి నీ మగని సుద్దు లెంతని చెప్పేమమ్మ
వొట్టుకొని పురముపై నుండవమ్మ ఇఁకను ॥ - కీర్తన 498

అని వేంకటేశుఁడాడె నలమేలు మంగతోడ
వినరే వో చెలులాల ! వేమారు నీరీతుల ॥ - కీర్తన 411

## దేవిదేవరల సంవాదము

మగువ నేరుతువే మాటలు నీవు
తగిలి తెలుసుకో తారుకాణలు ॥ - కీర్తన 203

**నాయికానాయక సంవాదాత్మకము**

ఒక్కటంటే నొకటనే వోయి నీవు
వొక్కటైతే మన పొందు చక్కటాయగదవే ॥ - కీర్తన 323

ఏలే జాణతనాలు యింతేసి నీకు
యేలే వాఁడవు నీవే ! యేమని చెప్పుదురా ॥ - కీర్తన 393

**భావసాజాత్యంగల కీర్తనలు**

I 1. ఎంత ఆసోదకాఁడవు యేమి చెప్పేది - కీర్తన 120
2. ఎంత వేగిర కాఁడవు యేమి చెప్పేది - కీర్తన 275
II 1. ఎంత వేగిర కాఁడవు యేమయ్యా ! - కీర్తన 13
2. ఆఁటది యింత కోపునా అంటిమోసువంటిది - కీర్తన 38
III 1. అంత చక్కనివాఁడవు అన్నిటా జాణవు నీవు - కీర్తన 146
2. ఎఱుక గలవాడవు ఇన్నిటా నీవు - కీర్తన 437
IV 1. కాంతల సిగ్గు లింతేసి కాకు సేతురా - కీర్తన 588
2. మచ్చి కెంత గలిగినా మఱఁగు మొఱఁగు లేదా - కీర్తన 24

భావంలో పునరుక్తులు గల కీర్తనలు యిలా మరికొన్ని లేకపోలేదు.

శృంగార రస సామగ్రికి ఎన్ని పరిమితులున్నా దాన్ని విస్తృత పరచిచూపినవాడు అన్నమయ్య !

**అన్నమయ్య పతీపతులకు, శృగారనాయికలకు, రసికులకు బోధించిన హితోపదేశం -**

1. విరహము వలవదు రసికులు వినరో చాటుచుఁ జెప్పెద - కీర్తన 27
2. ఒకటి కొకటికి లంకె వువిదకు ( బతులకును - కీర్తన 34
3. మరిగిన చోటికి మంచితనమే మేలు - కీర్తన 86
4. పొలతులే వలపుల పుట్టుగుల పొలములు - కీర్తన 112
5. మనసులోనే దేవుఁడున్నవాఁడు మరివేఁడుకొంటే వరము లిచ్చు - కీర్తన 149
6. ఇంతులకు (బతులకును నెరవున్నదా
   సంతోసము లీడేరు సమ్మతులైతేను - కీర్తన 278
7. ఇంతు లెంత సేసినాను యియ్యకొనవలెఁగాక
   వంతులు వాసు లెంచుకొంటే వాములై నిలువవా - కీర్తన 287
8. ఇంతులకు (బతులకే ఇరవైనది వలపు
   సంతతపు వేడుకల (జవులైన వలపు - కీర్తన 408
9. ఇదివో ద్రిష్టాంతాలు యెంచి చూడరే చెలులు
   యెదురెదురను మన యింటిలోనె వున్నవి - కీర్తన 571
10. మరిగి పాయకుండితే మంచివై తోఁచు
    సరవి దప్పకురమ్మ సతులాల మీరు - కీర్తన 589

**నాయకునితో అన్నమయ్య**

1. చిత్తాన మఱవక యీ చెలి నిట్టె మన్నించు - కీర్తన 45

2. నీవే ఇది దలఁచి మన్నించితివి జవరాలి - కీర్తన 73

3. నీ వెఱఁగవా తగవు నేరుపరి విన్నిటాను - కీర్తన 247

**అన్నమయ్య అభిమానించి చిత్రించిన శృంగార నాయికలు**

అన్నమయ్య అత్యంతమూ అభిమానించి రసరమ్యంగా చిత్రించిన శృంగారనాయిక లిద్దరు. వారే - ఖండిత, కలహాంతరిత. అందుకే పై ఉదాహరణల్లో తక్కిన నాయికల కంటే వారి కెక్కువ ప్రాధాన్యం చూపబడింది. వీరు ప్రౌఢ నాయికలని చెప్పవలసిన పనిలేదు.

దీనికి రెండు ప్రధాన కారణాలను చెప్పవచ్చు. శృంగార రస నిరూపణంలో సంభోగము, విప్రలంభములకు సమాన స్థానమున్నప్పటికీ విప్రలంభ శృంగారము చేతనే రసము రక్తి కట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక అష్టవిధ శృంగార నాయికలలో విరహోత్కంఠిత తర్వాత ఖండిత, కలహాంతరితలచేత రసపరిపుష్టి ఏర్పడి రసికుల కెక్కువ హృదయంగమంగా ఉంటుంది.

ఇక రెండవ కారణం - శృంగారము - తత్రాపి విప్రలంభ శృంగారము, విశేషించి ఖండిత కలహాంతరితలైన శృంగార నాయికల చేష్టలు, హావభావములు నాట్యమున కత్యంత సన్నిహితమైనవి. అందులో అన్నమయ్య శబ్దము నాట్యాయమానమైనది.

" రస ఏవ నాట్యమ్ ।
రస సముదాయోహి నాట్యమ్ ॥
న నాట్య ఏవ చ రసాః ।
కావ్యే ఽపి నాట్యాయ మాన ఏవ రసః ॥

అని నాట్యశాస్త్ర వ్యాఖ్యానం 'అభినవభారతి' (1-290) లో అభినవగుప్తపాదుల వ్యాఖ్య. నాటకములో సంభాషణవల్ల శబ్దం నటకుడిచే అభినయింపబడుతుంది. మరి కావ్యాలలో సంగీతగతమైన సాహిత్యంలో దీని గతి ఏమిటి? అని ప్రశ్నిస్తే కవి శిల్పియైతే కావ్యశబ్దాన్ని నాట్యాయమానం చేసి ప్రయోగిస్తాడు. అప్పుడది

శ్రవ్య కావ్యమైన నాటకీయ శిల్పంతో కూడి రసము వ్యంజింప బడుతుందని అభినవులంటున్నారు. అన్నమయ్య శబ్దము నాట్యాయమానమైనదని, రసరమ్యమైనదని దానిని ఆయన శృంగార నాట్య శిల్పము ద్వారా సాధించినాడని చెప్పవచ్చును. సర్వత్రా రసవ్యంజకమైన శబ్దాన్ని అన్నమయ్య ఎలా ప్రయోగించగలగాడని ప్రశ్నించవచ్చు.

దీనికి మన ప్రాచీన సంస్కృత సాహిత్యం నుండియే అన్నమయ్య కీలకాన్ని పట్టుకొన్నాడు. సంస్కృత సాహిత్యంలో విశేషించి నాటక సాహిత్యంలో స్త్రీలకు ప్రాకృతాన్ని వాడట్టం పరిపాటి. స్త్రీ సహజమైన మృదు ప్రకృతి, లలితమైన వర్తనకు ప్రాకృతం ఎంతో సహజ సుందరంగా ఒదిగి వుంటుంది. క్రీ॥పూ 1 శతాబ్దికి చెందిన గాథాసప్తశతి శృంగార రసభూయిష్ఠమై గ్రామీణ వాతావరణాన్ని ప్రతిఫలించే గాథలు ప్రాకృతంలోనే ఉండటం గమనింపదగింది. ఇవన్నీ అన్నమయ్యకు ప్రేరకాలు కాగా గ్రామీణ, జానపదుల జనజీవితానికి అత్యంత సన్నిహితుడైన తాను భక్తినీ, శృంగారాన్నీ ఆ జానపదుల భాషలోనే రంగరించి సంకీర్తనలుగా మలిచాడు. అచ్చుత, స్వచ్ఛత సహజత తో కూడిన రసవ్యంజక శబ్దం మనకు గ్రామీణుల జీవనంలోనే స్పష్టంగా ప్రతి ఫలిస్తుంది. ఈ రహస్యం తెలుసుకొన్న అన్నమయ్య సంకీర్తనలలో వారినీ, వారి భాషనూ పొదిగినాడు.

## శృంగార చేష్టలు

ఇవి పదునెనిమిది. వీనిలో కొన్ని మానసిక చేష్టలు. కొన్ని కాయిక చేష్టలు. మొత్తం మీద అన్నీ అనుభవాలే. కొందరు ప్రాచీనాలంకారికులు వీనిని ఉద్దీపన విభావాలన్నారు.

**1. భావము** :- బాల్య యౌవనముల సంధిలో గలుగు రసజ్ఞాన యోగ్యత యౌవనారంభ దశలో శృంగార విషయంగా అంతఃకరణంలో కలిగే ఒకానొక వికారము భావము.

**2. హావము** :- అంగవికారము ఏకొంచెమైనా బయటపడిన భావమే

హావము.

3. హేల :- అంగవికారము స్పష్టంగా కనబడే భావమే హేల.

4. ధైర్యము :- సంప్రదాయం, సౌశీల్యం మొదలైన వానిని ఉల్లంఘింపక ఉండటం.

5. మాధుర్యము :- ఆభరణాలు లేకున్నా అందంగానే ఉండటం.

6. లీల :- పలుకులోను, నడకలోను, పనుల్లోను ప్రియుణ్ణి అనుకరించడం.

7. విలాసము :- ప్రియుణ్ణి చూడటంతోనే కలిగే అంగవికారం.

8. విచ్ఛిత్తి :- అల్పమైన ఆభరణాలతో వున్నా ఎంతో అందంగా కనబడడం.

9. విభ్రమం :- ప్రియుడు వచ్చేవేళ తెలిసికొని ఆ సంబరంతో పొరపాటున మార్పిడిగా ఆయా శరీరాంగాలకు ఆభరణాలు పెట్టుకోవడం.

10. కిలికించితము :- రోషము, దుఃఖము, భీతి, సిగ్గు మొదలైనవి కలిసి వుండటం.

11. మొట్టాయితము :- ప్రియుని గుణాలను చెప్పుకొనేటప్పుడు తన అభిలాషను సూచించడం.

12. కుట్టమితము :- రతికాలంలో నఖక్షతాధర దంశనాదులనే సమ్మర్దం గలిగినా మనస్సులో ఆనందించుట.

13.బిబ్బోకము :- ప్రణయ కోపంలో ప్రియుని కథాలాపం పట్ల అనాదరం చూపడం.

14. లలితము :- సుకుమారమైన యంగవిన్యాసము.

15. కుతూహలము :- రమ్యవస్తు సందర్శనమునకై త్వరపడుట.

16. చకితము :- వెఱపుచే గలత నొందుట.

**17. విహృతము** :- లజ్జావశమున అవసరమైనప్పుడు కూడ మాట్లాడక వుండటం.

**18. హసితము** :- జవ్వనపు పొంగున కారణములేకయే కలుగు నవ్వు.

వీటన్నిటికీ ఉదాహరణలు చూపడంలేదు.

## మన్మథావస్థలు

విప్రలంభ శృంగారంలో బీజం తొలుత మొలకెత్తి, చిగిర్చి, పూచి, ఫలించినట్లు, రతి కూడా క్రమంగా విభావాది సామగ్రితో అంకురించి, పల్లవించి, కుసుమించి, ఫలించి రసభావాన్ని పొందుతుంది. ఈ క్రమవికాసానికి హేతువులైన దశలు పన్నెండు. వీటికే మన్మథావస్థలనిపేరు.

1. **చక్షుఃప్రీతి** : ప్రత్యక్షంగానో, చిత్రపటముద్వారానో, స్వప్నంలోనో నాయికను నాయకుడుగాని, నాయకుని నాయికగాని మక్కువతో చూడటం.
2. **మనస్సంగము** : ఎల్లవేళలా ప్రియుని యందే మనస్సు నిల్పి వుండటం.
3. **సంకల్పము** : ప్రియుని గురించిన కోర్కె.
4. **ప్రలాపము** : ప్రియుని గుణాలను ఎల్లప్పుడు కొనియాడుట.
5. **జాగరము** : ప్రియుని విరహమున నిదుర లేమి.
6. **కృశత** : ప్రియ చింత వలన మేను చిక్కిపోవుట.
7. **అరతి** : ప్రియ వ్యతిరిక్తమగు విషయంలో ఇచ్ఛలేకుండుట.
8. **వ్రీడాత్యాగము** : సిగ్గువదలి వర్తిల్లుట.

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో పై యెనిమిది అవస్థలైన తర్వాత సంభోగము సూచింపబడినది. అంతేతప్ప, మన్మథావస్థల్లో చివరివైన జ్వరము, ఉన్మాదము, మూర్ఛ, మరణములు వర్ణింపబడలేదు.

## విప్రలంభ శృంగారము

శృంగారం - సంభోగ శృంగారమని, విప్రలంభ శృంగారమని రెండు విధాలు. నాయికానాయకులొకచో కలిసి వుండడం సంభోగమని, ఎడబాటు పొందియుండటం విప్రలంభమని చెప్పబడుతుంది. అన్నమయ్య సంకీర్తనలన్నీ విప్రలంభ శృంగారానికి ఉదాహరణలే. చివరి చరణంలో సంభోగం సూచింపబడడం ఉంటుంది. భక్తికీ, శృంగారానికీ అభేద ప్రతిపత్తిగా నిరూపించిన అన్నమయ్య నాయికను జీవునిగా, నాయకుని భగవంతునిగా భావించి రచించిన కీర్తనలలో విపులమైన విప్రలంభ శృంగారమే చోటుచేసికోవడంలో వింత లేదు.

విప్రలంభ శృంగారం నాల్గు విధాలు.

1. అభిలాష : నాయికా నాయకులకు తాము కలియుటకు ముందుగా మనస్సులో కలిగే కోరిక.
2. ఈర్ష్య : నాయకు డన్యాసక్తుడు కావటం తెలిసికొని నాయిక మనస్సులో అసూయ పడుట.
3. విరహము : కలిసియున్న నాయికానాయకులకు ఏదో ఒక కారణంచే ఎడబాటు కల్గడం.
4. ప్రవాసము : నాయికా నాయకులు ఒకరి నొకరు విడిచి దేశాంతరానికి పోవడం.

అష్టవిధ శృంగారనాయికా భేదాలలో అభిలాష అందరికీ సామాన్యమైనది కాగా, ఈ లక్షణము ఎక్కువగా వాసకసజ్జికలోను, అభిసారికలోను, స్వాధీన పతికలోను కనబడగా, ఈర్ష్య - ఖండిత, కలహాంతరితల్లో కనబడుతుంది. అలాగే, విరహం - విరహోత్కంఠిత, విప్రలబ్ధలలో స్పష్టమౌతుంది. ప్రవాసము ప్రోషిత భర్తృకలో కనబడుతుంది. ఆయా ఉదాహరణాలు ముందే యివ్వబడినాయి.

శృంగార రస నిరూపణంలో అష్టవిధ సాత్త్వికభావాలు అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో కనబడుతాయి. ఇవి నాట్యాయమాన శబ్దానికి ప్రేరకం, ప్రోద్బలకమై నాయిక రంగస్థలంలో నర్తకియై అభినయించడానికి వలసిన శృంగారరసభావసామగ్రిని పుష్కలముగా అందిస్తూ వుంది.

ఇక వ్యభిచారిభావాలు 33గా చెప్పబడినవి. వీటిలో వ్యాధి, ఉన్మాదము, మరణమును మూడు భావాలు తప్ప తక్కిన ముప్పది వ్యభిచారి భావాలకు ఉదాహరణాలు అన్నమయ్య సంకీర్తనల్లో చూడవచ్చు.

## సంభోగ శృంగారము

విలాసవంతులైన నాయికా నాయకులెక్కడ ఆనుకూల్యము గలిగి పరస్పర మభీష్టములైన దర్శన స్పర్శనాదులను సేవింతురో అది సంభోగమని చెప్పబడింది. ఈ సంభోగము పరస్పరా లోకనము, ఆలింగనము, చుంబనము లనే రూప భేదాలతో అనంతము, అపరిచ్ఛేద్యమై సంభోగమనే ఏకైక నామంతో వ్యవహరింపబడుతూవుంది. ఇది సప్త విధాలుగా చెబుతారు.

1. ప్రేమ : రమ్య పదార్థముల పట్ల ఆలంబనాలైన నాయికా నాయకుల్లో జనించే దర్శనేచ్ఛ ప్రేమ.
2. అభిలాష : తద్విషయక చింత.
3. రాగము : తత్సంగబుద్ధి.
4. స్నేహము : తదేకధ్యానము.
5. ప్రేమము : తద్వియోగాసహనము.
6. రతి : తత్సహవర్తనము.
7. శృంగారము : తన్మయక్రీడ.

దిదృక్ష మొదలుకొని తన్మయక్రీడ వరకు క్రమక్రమంగా అభివృద్ధి చెందే యీ సంభోగం క్రీడారూపమైన శృంగారమనే పేరుతో నాయికా నాయకుల కభీష్టసిద్ధి కలిగించునది కాబట్టే దీనికి సంభోగ శృంగారమని పేరు.

భూపాలుని మతంలో యిది సంక్షిప్తము, విస్తృతమని రెండు విధాలు. వాత్స్యాయనుడు కామసూత్రాలలో -

బాహ్యమాభ్యంతరం చేతి ద్వివిధం రతముచ్యతే
తత్రాద్యం చుంబనా శ్లేషనఖదంతక్షతాదికం
ద్వితీయంతు రతం సాక్షా న్నానాకరకం మతమ్ ॥

చుంబనాశ్లేషాది రూపంబున బాహ్యారత మనియు, సాక్షాన్నానాకరణ విశేషాత్మకమైనది ఆభ్యంతర రతమని చెప్పబడింది.

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో బాహ్యారత వర్ణనమేతప్ప, ఆభ్యంతరరత వర్ణనము లేదు. సంకీర్తనాంత పాదంలో ఏలితివి, కూడితివి, కలిసితివి వంటి సూచక శబ్దాలేతప్ప సంభోగ శృంగారములోని రెండవ దశ వాచ్యము కాలేదు. ' ఓవరి ' వంటి శబ్దముల ప్రయోగము అనుమేయా భ్యంతర రతవర్ణన గర్భితాలైన బాహ్యారత వర్ణనలే అని మనం గ్రహింపవచ్చు.

భగవత్పరమైన శృంగారరస నిరూపణము, వర్ణనము కత్తిమీద సాము వంటిది. " క్షురస్యధారానిశితా దురత్యయా " అన్నట్లుగా, ఔచిత్యాన్ని ఆదరించి, అనౌచిత్యాన్ని పరిహరించి 'ఖడ్గ ధారాపథేనైవ సుభటానాం మనోరథః' అన్న విధంగా అన్నమయ్య మనోరథ సిద్ధి పొందాడు. " భద్రైషాం లక్ష్మీర్నిహితాధి వాచి" అనే ఋగ్వేద మంత్రానికి ప్రమాణంగా నిలిచిన సుభద్రమైన - సుష్ఠుభద్రమైన - వాక్కు గల్గిన అన్నమయ్య పదకవిత మహత్వ కవిత్వపటుత్వ సంపదలచే లక్ష్మీసనాథమైనది.

అన్నమయ్య నిరూపించిన శృంగార నాట్యరసావర్తమున కిదియొక సూచిక ! శబ్దాన్ని నాట్యాయమానము చేసిన రసవ్యంజక శబ్ద బ్రహ్మ కిదియొక విజయ వైజయంతిక !

" నేరుపవయ్యా నాకు నీతోడి కాఁపురాలు
చేరి నీకు మోహించిన చిన్నదాననేను " - కీర్తన 592

❀ ❀ ❀

శ్రీరస్తు

# శ్రీ తాళ్ళపాక
# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు, తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను, అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ *నిరుధానకు తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు.

**రేకు1801** శంకరాభరణం

పట్టరానిది వయసు పడఁతి నేమనవచ్చు
చుట్టమగుపతిఁ దెచ్చి చూపరే సతికి ॥ పల్లవి ॥

దుమ్ముమెగయఁగ వలపు దూరుపెత్తీఁ జెలియ
నుమ్మగిలుచున్న నిట్టూరుపులను
చిమ్మిరేఁగుచునున్న సిగ్గులు నానఁగఁ బెట్టె
చెమ్మఁ జెమటల నేమిసేతమే ఇఁకను ॥ పట్ట ॥

వుడివోనితమకముల నుమురఁబెట్టీఁ జెలియ
పొడవు దమకముల తలపోఁతలోన
యెడనెడల జిరునవ్వు లెండఁబోసీ నదివొ
కడలేని విరహపుఁగాఁకలనుఁ జెలఁగి ॥ పట్ట ॥

---

అధస్సూచిక"నిరుధానకు"

1. ఈ శబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారిక రూపముగా గానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అనియర్థము. ఆనాడు కడపటి దినమని తాత్పర్యము. కీ॥శే॥ ప్రభాకరశాస్త్రి గారూహించిన "సరియగు" అను నర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అను నర్థములో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబ గారి ప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్యఅకాడమీ వారి విష్ణు పారిజాతము 55 పుట. నేనీ ప్రయోగ మివ్వగ శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు 'నిఱుత్తం' అను అరవ పదము కూడా "నిలుపు" నర్థముతో దీనికి సహాయపడుననిరి.

గుదిగొన్న కోరికలఁ గూడపెట్టీఁ జెలియ
తుద నెదురుచూపుల కన్నుదోయి యందు
అదనెరిఁగి శ్రీవేంకటాధిపుఁడు గూడఁగా
సదమదపుకాఁగిటను సమరతులఁ బెనఁగె ॥ పట్ట ॥ 1

## సామంతం

మే మెఱఁగమా యేమి మీ సుద్దు లిన్నియును
ప్రేమములు దమకములు పెనగొనీ మీకు ॥ పల్లవి ॥

పలుకవే పతితోడ పగడవాతెరనోర
కులుకవే మచ్చికలు కొసరి కొసరి
చిలుకవే మోహములు సెలవినవ్వులతేట
నెలకొన్న వేడుకలు నీయందె కలవు ॥ మేమె ॥

చూడవే నిడువాలుసోగచూపుల నితని
ఆడవే సరసంబు లంటివుట్టి
కూడవే కాఁగిటను గుబ్బచనుఁగవనొత్తి
వాడికెలు మిగుల నీవలననే కలవు ॥ మేమె ॥

కలయవే పొన్పుపై కళలు మోమునఁ బొదల
వెలయవే [1] రతిరాచవిభవములను
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁ డిపుడె నిను నేలె
కలికి చందములు నీకతననే కలవు ॥ మేమె ॥ 2

## గౌళ

పతిముందర నెంతేసి పగటులు చూపీనే
కతకారి చేఁతలనే కడుఁబరగినది ॥ పల్లవి ॥

1. 'రతిరాజ విభవము' అనుటకు 'రతిరాచ విభవము' అనుట స్వాతంత్ర్యమునకు గురుతేమో ? /

మాటలఁ దేనెలు గారీ మగువ నేరుపులను
తేటల వెన్నెలగాసీ తెలిఁగన్నుల
కోటిసేయఁ గొప్పువెట్టి కొనలు వేళ్ళఁ దురిమె
యీటులేదు దీనియెమ్మె లేమని చెప్పుదమే ॥ పతి ॥

నవ్వుల ముత్యాలు రాలీ నలినాక్షి చేఁతలను
[1] జవ్వనపుఁబోడి చిందీ చన్నుఁగవను
పువ్వువంటి చీర గట్టి పొందుగా సొమ్ములు వెట్టి
ఇవ్వల నీకె సింగారా లేమని చెప్పుదమే ॥ పతి ॥

సన్నల మచ్చికలూరీ సతిసేయు నేస్తముల
వన్నెల కళలు దేరీ వదనమున
యిన్నిటాను తొల్లె నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
యెన్నరా దీపెయాసోదా లేమని చెప్పుదమే ॥ పతి ॥ 3

## శంకరాభరణం

విన్నవించవెట్టు వచ్చు వెలఁదియున్నచంద మిదివో
కన్నులార నీవె చూచి గతులు దెలుసుకోవయా ॥ పల్లవి ॥

తరుణి నిన్నుఁ దలఁచి తలఁచి తమకమాఁప నలవిగాక
శిరసు వంచి చింతలందు చిగురుగోయఁ దొడఁగెను
పురిగొనంగ నిన్నుఁబాసి పొద్దుగడపలేక కెరలి
సరుగ గాలిమంటపమున సొముశాయఁదొడఁగెను॥ విన్న ॥

వలపు నిలుపలేక కోరికలను [2] తాడు వేఁడిపేఁడి
అలరి వేగుదాఁక ముత్తియములు గుచ్చఁదొడఁగెను

---

1. 'జవ్వనము యొక్క పోడిమి' అని విగ్రహవాక్యము కాబోలు. 'పోడిమి' లోని 'మి' వర్ణమునకు సామాసిక విధిచే లోపము కావచ్చు.

2. తాడు+పేఁడి= తాడువేఁడి

కలయుదాఁక నోర్వలేక కడుఁబరాకు సేసుకొనుచు
నెలఁత తమ్మికొలఁకులకును నీరు నించఁదొడఁగెను ॥ విన్న ॥

దప్పిదేర నీగుణాలు దడవి విరహ మార్చుకొనఁగ
కప్పురంపుఁ బలుకులెల్ల గాదెఁ బోయఁ దొడఁగెను
యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
చెప్పరాని ననలఁ బూజసేయ నిన్నుఁ దొడఁగెను ॥ విన్న ॥ 4

## రామక్రియ

మగువలకుఁ బతులకును తొల్లె మరుఁడువ్రాసినవ్రాఁత లివి యీ -
తగులుగలిగినవారికే భువిఁ దారుకా ణవుఁగాక ॥ పల్లవి ॥

మచ్చికలుసతమైనవారికి మఱపు లేడవి యెంచిచూడఁగ
విచ్చనవిళ్ళయినవారికి వెఱపు లేలుండు
యిచ్చకములలవడినవారికి యెగ్గుసిగ్గులు వెదకనేఁటికి
చెచ్చెరను సేసినవెచేఁతలు చెల్లుబళ్ళవుఁగాక ॥ మగు ॥

మనసులేకములయినవారికి మరియు సంశయమేల కలుగును
వినయములు నేరిచినవారికి వెగటులే లేవు
చనవులనె పెనఁగేటివారికి సరసవేళలఁ గొంకవలవదు
అనుఁగుఁబ్రియముల నాడినవియే ఆట లవుఁగాక ॥ మగు ॥

పొందులకు లోనయినవారికి పొలయలుక లవి యేల చెందును
యెందు గపటములేనివారికి నీసులే లేవు
కందువల శ్రీవేంకటేశునిఁగలసి పాయకవున్నవారికి
యిందరికి రతిఁ బలుకుఁ బంతము లేకమవుఁ గాక ॥ మగు ॥ 5

## రేకు 1802 దేసాళం

కొమ్మచే నేమి సేయించుకొంటివయ్యా
కమ్మటిఁ దా మొక్కినట్టి కారణ మేమయ్యా ॥ పల్లవి ॥

వెలఁది విన్నపములు వేమారుఁ జేసీ (సె?) నీకు
సొలపుఁ జూపుల నిన్నుఁ జూచి చూచి
చెలరేఁగి యప్పటి నీచెక్కు నొక్కి వేఁడుకొనె
యెలమి మీ మునగస లేఁటివయ్యా ॥ కొమ్మ ॥

ఇంతగా నిన్ను నవ్వించి వేడుక లెల్లాఁ బుట్టించె
చెంతనుండి కొనగోరఁ జిమ్మి చిమ్మి
పంతపుగుబ్బల నొత్తి బలిమిఁ గాఁగిట నించె
అంతలేసినీపను లవి యేఁటివయ్యా ॥ కొమ్మ ॥

కప్పురపులప్ప నీకుఁ గానుకగాఁ జేతికిచ్చె
చొప్పుగాఁ బ్రియాలు మోవిఁ జూపి చూపి
ఇప్పుడె శ్రీవేంకటేశ యిటు నన్నుఁగూడితివి
అప్పటి నీసుద్దుల నెయ్యము లేఁటివయ్యా ॥ కొమ్మ ॥ 6

## ఆహిరి

ఎదుట నున్నాఁ డితఁడు యేల సిగ్గులు వడేవే
అదనాయ సంతోసము లడఁచఁగ నేఁటికే ॥ పల్లవి ॥

మనసు దెలుసుకొంటే మాటలాడఁగవలె
ననుపు గలిగితేను నగవలెను
పెనఁగనేరిచితేను పిలిచి పైకొనవలె
చనవు గలిగితేను సాదించవలెను ॥ ఎదు ॥

తగులాయ మైతేను తమకము చూపవలె
మొగమోట లబ్బితేను మొక్కవలెను
చిగిరించే యాసలకు చెప్పినట్టు సేయవలె
తగ వావులొనరితే దక్కివుండవలెను ॥ ఎదు ॥

వేడుకలు వుట్టితేను విడెము లందుకోవలె
యీడైన వయసులైతే నెనయవలె
కూడె నిన్ను నిప్పుడే చేకొని శ్రీవేంకటేశుఁడు
వాడిక లిట్టే కలితే వలవఁగవలెను ॥ ఎదు ॥ 7

## రామక్రియ

విన్నవించితిమి నీకు వెలఁదిభావములెల్లా
మన్నించు నింతట నీకె మరిగె నీరీతిని ॥ పల్లవి ॥

అతివ ముంగిలెల్లాను అడుగిడుగాఁ దొక్కె
తతి నీ కెదురువచ్చే తమకానను
కతలుగా మోమెల్లాఁ గన్నులు చేసుక చూచె
రతి నీ వింటికివచ్చే రాకలకును ॥ విన్న ॥

జలజాక్షి వురమెల్లాఁ జన్నులుగానే పెంచె
చెలఁగి నిన్నుఁ గాఁగిలించే యాసల
పొలమెల్లానుఁ జిలుకపలుకులే వెదవెట్టె
నెలవుకు నిన్నుఁ బిలిచే నేరుపులను ॥ విన్న ॥

కొమ్మ దననిలువెల్లాఁ గొప్పుగానే నిక్కిచ్చె
నెమ్మి సేసవెట్టించుకొనే వేడుకలు
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలో వచ్చి కూడితి
వెమ్మెల నీకె వెలసె నిందుకే యిన్నిటాను ॥ విన్న ॥ 8

## భైరవి

సేయఁగల విన్నపాలు సేసితి మిదివో నీకు
నీయంతనే ఇంతిఁగరుణించవయ్య ఇపుడు ॥ పల్లవి ॥

నివ్వటిల్ల నేపొద్దు నీకే యెదురుచూచీ
జవ్వని యింతేసి ఇఁక జాలిఁబెట్టకు
పువ్వువలెఁ బానుపుపైఁ బొరలీని విరహాన
రవ్వసేయక చూతువురావయ్య లోనికి ॥ సేయఁ ॥

తలఁచితలఁచి నీకే తమకించీ రతులకు
వలచినముద్దరాలి వడి నేఁచకు
అలసి కాఁకలచేత నసురుసురై వున్నది
నెలకొని ఇంతట మన్నించవయ్య యీకెను ॥ సేయఁ ॥

కందువల నీకే కంకణము గట్టుకున్నది
యిందుముఖి కడుగోల యెలఇంచకు
చెందితి వీకె నింతలో శ్రీవేంకటేశుఁడ వచ్చి
యెందు నిట్టె కలకాల మేలవయ్య చెలఁగి ॥ సేయఁ ॥ 9

## ముఖారి

ఎట్టోరుచుకున్నాఁడవో యీపె సేసే చేఁతలకు
అట్టె నేము చూచి చూచి ఆఁపలేము నవ్వులు ॥ పల్లవి ॥

నెత్తము పందెముతోడ నేను నీవు నాడఁగాను
యెత్తుచెప్పీ నీకు నాపె యెవ్వతోకాని
హత్తుక వద్దఁగూచుండి ఆటచూచేపరాకున
గుత్తపుగుబ్బల నొత్తీ కుమ్మెలుగా నీమేను ॥ ఎట్టో ॥

నేను నీవు నెదురు కిన్నెరలు వాఇంచుకోఁగా
తానాలు నీకు నేరిపీఁ దానెవ్వతో
వీనుల నీవాద్యాలు వినేటివేడుకలను
మేను బిగ్గెఁ గాఁగిలించి మెచ్చీ పిరివీకుగా ॥ ఎట్టో ॥

కందువ నిద్దరమును కతలు చెప్పుకోఁగాను
సందడి నూఁకొనీఁ దా నీసతి యెవ్వతో
చెంది నన్ను నేలితివి శ్రీవేంకేశుఁడ
అందె యెచ్చరికకు గోరంటించీ నీమేనను ॥ ఎట్టో ॥ 10

## పాడి

ఆతని యిచ్చలోదాన నన్నిటా నేను
కాతరించవద్దు నన్నుఁ గరుణించీఁ దానే ॥ పల్లవి ॥

చేరి యాతనిగుణాలే చెలులాల పొగడరే
దూరకురే సారె సారె తొయ్యలులాల
కోరి కోరి వినయాన గుట్టుతోడ వేఁడుకొనరే
బీరానఁ గొంగువట్టి పెనఁగకురే ॥ ఆత ॥

ఆసలఁ గాచుకుండరే యవసరమైనదాఁకా
వేసటలు చూపకురే వెలఁదులాల
రాసికెక్కి వినయాన రమ్మని పిలువరే
గాసిఁబెట్టి గొబ్బునఁ గక్కసించకురే ॥ ఆత ॥

కలపుకో లెటిఁగించి కానుకలే యీయరే
చలపట్టకురే మీరు సతులాల
చెలఁగి తానే వచ్చి శ్రీవేంకేశుఁడే కూడె
బలిమి నింకా నతని పైపైఁ గొసరకురే ॥ ఆత ॥ 11

**రేకు 1803** **ముఖారి**

నీవెఱఁగవా తగవు నేము చెప్పే దేమున్నది
కైవశమైతివి నీవే కాదా యితనికి ॥ పల్లవి ॥

చేరి చేరి యతఁడు నీచెఱఁగు వట్టెనంటాను
సారెకు బొమ్మల నెంత జంకించేవే
యీరీతి నీ వెదుటికి నెలఇంచవచ్చితేను
నేరుపుతోఁ జెనకితే నేరమా ఇతనికి ॥ నీవె ॥

వచ్చి వచ్చి యతఁడు నీవద్దఁ గూచుండెనంటాను
కొచ్చిచూ చతనినేల గుంపించేవే
ఇచ్చుట నీ చుట్టరిక మిటు నీవు నెరపఁగా
తచ్చి నీతోఁ బొందుసేయఁదగదా ఇతనికి ॥ నీవె ॥

నొక్కి నొక్కి నీ చెక్కులు నునుగోర నూఁదెనంటా
వెక్కసముగా నేమి వెంగేలాడేవే
యిక్కడ శ్రీవేంకటేశునెదపై నీవుండఁగాను
చిక్కించుక రతిఁ గూడఁ జెల్లదా యితనికి ॥ నీవె ॥ 12

**మాళవిగౌళ**

ఎంతవేగిరకాఁడవు యేమయ్యా
కాంతుఁడవు ఆఁటదానిఁ గాకుసేయఁదగునా ॥ పల్లవి ॥

చనవుగలదుగాన సరసములాడెఁ జెలి
పెనఁగి కుచము లింత పిసుకుదురా
ననిచి వావి చెప్పఁగా నవ్వులు నీతో నవ్వె
చెనకి ఇంతేసి నీవు సిగ్గుపడఁ జేతురా ॥ ఎంత ॥

నీవు మన్నింతువుగాన నిమ్మపంట వేసె నింతి
మోవి గంటిసేసి పంతములాడుదురా
దేవులుగనక నిన్నుఁ దిలకించి కాలుదొక్కి
సోవలుగ మానముపై సోఁకఁగఁ దిట్టుదురా ॥ ఎంత ॥

చుట్టమవుగాన నిన్ను సొలసి సలిగె చూపె
అట్టె రతిఁ గూడికూడి అలఞింతురా
నెట్టన శ్రీవేంకటేశ నీకుఁ దననేర్పు చెప్పె
బట్టబయలుగా దిట్టె పచ్చిగా నాడుదురా ॥ ఎంత ॥ 13

## సాళంగం

చెప్పరాని సుద్దు లివి చెలులాల మా పొందులు
తప్పక సూచించరే తలఁపయ్యీఁ బతికి ॥ పల్లవి ॥

నా మోహము తా నెరుఁగు నమ్మితిఁ దనమాటలు
యేమని విన్నవించేనే ఇంకాఁ దనకు
చేముంచి సేసలు వెట్టె శిరసెల్లా నిండె నాకు
ఆమేలు మఱవఁ దనయానతిలోదాననే ॥ చెప్ప ॥

ఇన్నిటా మన్నించెఁ దాను ఇచ్చకురాలను నేను
సన్నల నెంతని తన్ను సాదించేనే
కన్నులఁ దప్పకచూచె కడు సంతోసించుకొంటి
యెన్నికలెల్లా నీడెరె నితవాయ ననరే ॥ చెప్ప ॥

కంకణము దాఁ గట్టె కరము చాఁచితి నేను
పొంకమాయఁ బనులెల్లాఁ బొదిగేదేమే
అంకెల శ్రీవేంకటేశుఁ డట్టె తా నన్నేలె నేఁడు
సంకెలెల్లాఁ బాసె నిట్టె చనవు లొసఁగెను ॥ చెప్ప ॥ 14

## వరాళి

తనకు బుద్దులు చెప్పేదాననా నేను
నను మన్నించి ఇంతేసి నవ్వీ నేమోకాక ॥ పల్లవి ॥

ఆడుకోలు మాటలెల్లా నాపెరుఁగు తానెరుఁగు
యీడనున్నసాకిరు లేమడిగీనే
యీడుజోడై చుట్టరికాలెనసినవారు తాము
కూడిమాడి వుండినదే గురుతులు గాక ॥ తన ॥

మనసులు మర్మములు మరి తమకే తెలుసు
ననిచి నాకేమిసన్నలు సేసీనే
పొనుఁగ కిన్నాళ్ళదాఁకా పొందైవున్నవారు తాము
పెనగొని పాయనిదే పెద్దరికము గాక ॥ తన ॥

చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడు తాను
నలిఁ దమవలపెంత నాకుఁ జూపీనే
అలరి నన్నేలినాఁడు అన్నిటా జాణలు తాము
నిలుకడై మెలఁగుటే నేరుపులుగాక ॥ తన ॥ 15

## సాళంగనాట

[1] సేవించరో మొక్కరో చెలులాల నరులాల
కైవశమై వున్నవాఁడు కరుణాకరుఁడు ॥ పల్లవి ॥

బాసికము గట్టుకొని బంగారుగద్దెమీఁద
లాసి కూచున్నాఁడదివో లకిమమ్మతో
సూసకపువనితలు సోబానఁ బాడఁగాను
భాసురమై యొప్పె నదె ప్రహ్లాదవరదుఁడు ॥ సేవిం ॥

---

1. ఇది స్వామి కల్యాణము గావున అధ్యాత్మచ్ఛాయలోనిది కావచ్చు.

మునులు చదువఁగాను ముంజేతికంకణాలతో
యెనసి నవ్వులు నవ్వీ నిందిరతో
అనయముఁ బేరఁటాం డ్లారతులెత్తఁగాను
పనివూని వరాలిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు ॥ సేవిం ॥

పొలఁతులు వడ్డించఁగా బువ్వానఁ గూచుండి
చెలఁగి సరసమాడీ శ్రీదేవితో
యెలమి శ్రీవేంకటాద్రి నీతఁడే యెందుచూచినా
బలవంతుఁడై వున్నాఁడు ప్రహ్లాదవరదుఁడు ॥ సేవిం ॥ 16

## భైరవి

చెలులాల యేమనిచెప్పుదునే యీ సుద్దులు
అలరి యెంతపెద్దరిక మందురంటాఁగాని ॥ పల్లవి ॥

మరిగినట్టె యాపెతో మాటలాడీఁగాని
కరుణ నాపై నున్నది కాంతునికి
సిరులతోఁ గొలువులు సేయించుకొనీఁగాని
సొరిదిఁ బతి కున్నవి చూపులు నామీఁదనే ॥ చెలు ॥

బలిమి నందరివిన్నపములు వినీఁగాని
తలఁపు నామీఁదనే యాతని కున్నది
అలరి నాటకసాలయాటలు చూచుఁగాని
నెలకొన్నకోరికలు నెట్టన నాయందునే ॥ చెలు ॥

పెక్కుసతుల నూరకె పెండ్లాడుఁగాని తాను
అక్కర నామీఁదనే యాతనికిని
చొక్కి శ్రీవేంకటేశుఁ డెచ్చోటనైనా నుండుఁగాని
యిక్కడ వచ్చి నన్నేలె యిరవు మాయింటనే ॥ చెలు ॥ 17

## రేకు 1804 గౌళ

మేలు మేలే యెంతవాఁడు మిక్కిలి సంతోసించితి
వాలాయముఁ గాదనకు వలతు నేననరే ॥ పల్లవి ॥

పొగడితి తనగుణంబులు చెవులారా విని
తగిలితిఁ దనచక్కఁదనాలు చూచి
తెగడితిఁ దనతోను తేరి సరసాలాడఁగ
నిగ్గిడి తా నిన్నిటాను నెరవాది యగునే ॥ మేలు ॥

మెచ్చితిఁ దననేర్పులు మిగులా వేడుకతోడ
ఇచ్చితిఁ దనకు మోవి ఇతవెరిఁగి
యిచ్చితిఁ గాఁగిట తనుగురుతైన మన్ననకు
అచ్చముగ నెంచితేఁ దా నన్నిటాను జాణఁడే ॥ మేలు ॥

చొక్కితిఁ దననెయ్యపుసొంపుగురుతులకును
దక్కితిఁ దనవాడికతరితీపుల
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డేనలమేలుమంగను
నిక్కముగఁ దా నన్నిటా నేరుపరిగదవే ॥ మేలు ॥ 18

## వరాళి

చెలులిందరుఁ జూడఁగా సిగ్గువడ వించుకంతా
కలికితనాల నెంతగయ్యాళించేవే ॥ పల్లవి ॥

మాటలాడనేర్తునంటా మగనితో సారెసారె
తాటించి యంతేసికతలు చెప్పేవే
సూటిదప్పకుండాను సొలసి యట్టె యతని
కాటుకకన్నులఁ జూచి కరఁగించేవే ॥ చెలు ॥

సాముసేయనంటా జమళి నీతనితోను
ఆముక యం(యెం?)త పెనఁగులాడేవే నీవు
గామిడితన మునఁ బక్కన నవ్వి యీతనికి
మోముచూపి యెంతేసి దిమ్ములు రేఁచేవే ॥ చెలు ॥

తానాలు నేరుతునంటా తగిలి యీతనిఁ బాడి
పూని చేఁతలెల్లా నెంత పోగువోసేవే
యేనలమేలుమంగను యేలె శ్రీవేంకటేశుఁడు
ఆనించి నీవింకా నెంత ఆసలఁబెట్టేవే ॥ చెలు ॥ 19

## బౌళి

మంచితనమువారికి మారుకొననేమిటికి
మించినవేడుకతోనే మెరయవలెఁగాక ॥ పల్లవి ॥

సారెకు మాఁటాడనేల చలము సాదించనేల
కేరడము లాడనేల కెలయనేల
వూరకె కొసరనేల వొడ్డించుకొననేల
చేరి సతి కిచ్చకమే సేయఁగరాదా ॥ మంచి ॥

బలిమి చూపఁగనేల పంతములాడఁగనేల
సొలయనేల మనసు సోదించనేల
మలసి దూరఁగనేల మర్మము లెత్తఁగనేల
చెలువుని కింపుగానే చెనకరాదా ॥ మంచి ॥

వెంగెము లాడఁగనేల వేఁడుకోనప్పటినేల
ముంగురులంటఁగనేల మొక్కఁగనేల
సంగడి శ్రీవేంకటేశు సతి వలమేల్మంగవు
సంగతిగాఁ గూడితివి సరసమాడరాదా ॥ మంచి ॥ 20

## గౌళ

చెలులాల బుద్ధులెన్ని చెప్పేరే నాకు
చెలువుఁడే వలెనంటే సేసవెట్టేఁగాక ॥ పల్లవి ॥

తలఁపోకచో నుండఁగా తమి యెట్టు రేఁచవచ్చు
పిలుపు లాలించఁగాను పెనఁగుటెట్టు
పలుపొ(కొ)కచో నుండఁగా భావమెట్టు గరఁగీని
బలిమి నే నెటువలెఁ బైకొందునే యతని ॥ చెలు ॥

నవ్వు లొకచో నుండఁగా ననుపెట్టు సేయవచ్చు
మువ్వంకలాఁ జూడఁగా మొక్కుట యెట్టు
వువ్విళ్ళొక్కచో నుండఁగా వొడివట్టి యియ్యనేల
రవ్వసేసి నేనెట్టు రతికిఁ బిలుతునే ॥ చెలు ॥

వేడు పొ(కొ)కచో నుండఁగా వెస నంట నెట్టువచ్చు
వాడికలు చూపఁగాను వద్దనుటెట్టు
పాడితో నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
కూడె నన్ను నింకానెట్టు కొసరుదునే ॥ చెలు ॥ 21

## పళవంజరం

కొంకకచెప్పవే యీకొత్తలు వినేఁగాని
లంకెగా నితఁడు నీకు లలిఁ జుట్టమటవే ॥ పల్లవి ॥

తగిలి తగిలి నీవు తప్పకిట్టె చూచేవు
మగువరో నీకితఁడు మగఁడటవే
నగుతా నప్పటి నీవు నంటుఁ గడు నెరపేవు
పగటున నీకు మేనబావ యటవే ॥ కొంక ॥

సంకెలేక యితనితో సారెకు మాఁటలాడేవు
కంకణము గట్టినట్టి కాంతుఁడటవే
అంకె నేపొద్దూ నీతని యండనే కూచుండేవు
బింకము తోడుత నీపెండ్లికొడుకటవే ॥ కొంక ॥

సంతతము నీతనితో జాణతనాలే యాడేవు
మంతుకెక్క నీతఁడు మరవియటవే
యింతట శ్రీవేంకటేశుఁ డేనలమేలుమంగను
వింతగా నన్నేలె నీకూ విభుఁడటవే ॥ కొంక ॥ 22

## శంకరాభరణం

ఎంతని పొగడవచ్చు నింతటి నీదేవులను
సంతోసానఁ గూడితివి జాణవౌదువయ్యా ॥ పల్లవి ॥

జిగిమించ ముద్దుగారే చిలుకపలుకులే
మగవ నోరనుడిగే మాఁట లెల్లాను
వెగటు లేని యట్టి వెన్నెలలపోగులే
చిగురుఁ బెదవులపై చిరునవ్వులెల్లాను ॥ ఎంత ॥

తొలుకరికాలపు తొరపు మెఱుఁగులే
సొలసి రమణిచూచే చూపులెల్లాను
పెలుచు గండుఁదుమ్మిదలపిల్లల మూఁకలే
విలువుఁ గొప్పువెట్టినవెరులెల్లాను ॥ ఎంత ॥

కడలేవికాంతుల కనకపుఁ గుండలే
పడఁతిగట్టిచన్నుల బాగులెల్లాను
అడరి శ్రీవేంకటేశ యలమేలుమంగయీకె
యెడయని నీభాగ్యమే యీగురుతులెల్లాను ॥ ఎంత ॥ 23

రేకు 1805 భైరవి

మచ్చికెంతగలిగినా మఱఁగు మొఱఁగులేదా
ఇచ్చ యెరిఁగి లోలోనే యెనయుటగాక ॥ పల్లవి ॥

గుట్టుతోడ జవరాలు కుచములు దాఁచుకోఁగా
చుట్టమువలెనే తొంగిచూడవచ్చేవు
చిట్టకములు సేయఁగా సిబ్బితిగలయాఁటది
వొట్టువెట్టక మానునా వూరకె జంకించేవు ॥ మచ్చి ॥

వాసితోడ ముద్దరాలు వదనము వంచుకొంటే
సేసకొప్పు జారఁదీసి చెక్కునొక్కేవు
బేసబెల్లిచేఁతలకు పేరుకలపూవుఁబోణి
యీసడించవలదా నీవేల తమకించేవు ॥ మచ్చి ॥

వోజతోడ చదురాలు వోవరిలో నుండఁగాను
రాజసానఁ బచ్చిదేర రతిఁగూడేవు
తేజముతో మన్నించఁగా తేఁకువగల కోమలి
సాజపు శ్రీవేంకటేశ సంతోసించకుండునా ॥ మచ్చి ॥ 24

బౌళి

సరివయసు లిద్దరికి సతములై వొనగూడె
యెరవులేఁకఁ బచరించనేఁటికే చెలియ ॥ పల్లవి ॥

వెన్నవంటిది మనసు వెడకాఁకలకే కరఁగు
వెన్నెలవంటిది నవ్వు వేడుకొదవు
తన్నుదా నెఱఁగునీవు తతిగొన్నతమకములు
యెన్నిలాగులఁ జలములేఁటికే చెలియా ॥ సరి ॥

విందువంటిది వలపు వింతలై చవిచూపు
మందువంటిదిచూపు మరిగించును
అంది పాయఁగనీవు అడియాసకోరికలు
ఇందులకుఁ బొలయలుకలేఁటికే చెలియా ॥ సరి ॥

(జి)చిగురువంటిది వావి చిక్కించిపెనఁగించు
(జి)చిగురువంటిది చెలిమి చెంగలించు
జిగిమించి నిన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
యెగసక్కెములసొలపులేఁటికే చెలియా ॥ సరి ॥ 25

## లలిత

వట్టిసిగ్గులిఁకనేల వరవాతాను
చుట్టపువరుస నీకుఁ జూపుతానే వున్నది ॥ పల్లవి ॥

యెక్కడపరాకు నీకు నింతిఁ జిత్తగించరాదా
చొక్కపుఁ జూపుల నిన్నుఁ జూచీనదె
మక్కువతోడుత నిట్టె మాటపలుకాడరాదా
ఇక్కువ లరసుకొంటా ఇంటికి వచ్చినది ॥ వట్టి ॥

కోరివేఁడి నీదండనుఁ గూచుండఁ బెట్టుకోరాదా
నేరుపునఁ గొలువులో నిలుచున్నది
చేరవచ్చి ఆదరించి చేత నందుకోరాదా
మేరతో విడెమియ్యఁగ మీఁదెత్తుక వున్నది ॥ వట్టి ॥

చనవిచ్చి కొంతగొంత సరసమాడఁగరాదా
గొనకొని నీతో నవ్వుకొంటానున్నది
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలో నన్ను
పెనఁగరాదా యీపెతో ప్రియమున నున్నది ॥ వట్టి ॥ 26

## శ్రీరాగం

విరహము వలవదు రసికులు వినరో చాటుచుఁ జెప్పెద
తరితీపనుచెఱకున నిత్తరిఁ బండువండె నిదె ॥ పల్లవి ॥

బగి వాయఁగరా దిఁక దంపతులకు నెక్కడ చూచిన
చిగురుకుఁ జేఁగలు వచ్చెను చిత్తజారాజ్యమున
తగిలి తగిలి కోవిలకూఁతలు మొగసాలలకెక్కెను
జగమున విరసపుఁబవనుఁడు చల్లనివాఁడాయ ॥ విర ॥

పొసఁగఁగ నెవ్వరికైనను పొందులె జరపఁగ వలసెను
పసిమొగ్గలు వాడెక్కెను వసంతకాలమున
ముసగస లాడెడు తుమ్మెద మోతల చలములు చెల్లెను
సుసరమునవె పగరాజును చుట్టమువాఁడాయ ॥ విర ॥

కలఇకలే కలకాలము కాఁణాచులుగాఁ బరగెను
ఇలలో శ్రీవేంకటపతియిచ్చిన సంపదను
యెలమిని పదారువేలకు ఇతఁడే మగఁడై నిలిచెను
కలగొని మనసనియెడి చెలికాఁడునుఁ దోడాయ ॥ విర ॥ 27

## పాడి

ఒక్కటికొక్కటి లంకె లొనగూడెను
చొక్కపుసతిలాగులు చూడరమ్మ చెలులు ॥ పల్లవి ॥

వుమ్మగిలు తలపోత లుల్లములో నుండఁగాను
చెమ్మఁజెమటలు గారీ చెక్కులవెంట
కమ్మమోవిఁదేనెలు కడు నిండుకొనఁగాను
తుమ్మెదకురులు వాలీఁ దొయ్యలిమోమునను ॥ ఒక్క ॥

కాఁగిటికిఁ గోరికలు కాచుకొని వుండఁగాను
మూఁగీ నిట్టూరుపులు ముక్కున నిట్టె
లోఁగక యెదురుచూపులు కన్నులనుండఁగా
చేఁగలెక్కి పులకలు చిమ్మిరేఁగీ మేనను ॥ ఒక్క ॥

నెట్టన నివ్వెరగులు నిలువున నుండఁగాను
చుట్టరికములు నోర సుద్దులాయను
ఇట్టె శ్రీవేంకటేశుఁ డింతి నేలుకొనఁగాను
దట్టమై యొప్పె రతులు తగులై చన్నులను ॥ ఒక్క ॥ 28

## గౌళ

వెంగెము లాడకురే విభునితోను
సంగతితో నతని కిచ్చకురాల నేను ॥ పల్లవి ॥

అద్దమరేతిరికాడ నాతఁ డింటికి విచ్చేసె
గద్దెపీఁట వెట్టరే కాంతలాల
వొద్దికతో మాటలాడనోపుఁ గడునేరుపరి
సుద్దులెల్లా నడుగరే చుట్టపు వరుసను ॥ వెంగె ॥

అలసినచెమటతో నదె నిలుచున్నవాఁడు
జెలకము వట్టరే సతులాల
నెలకొన్న కన్నులను నిద్దురదేరీఁ దనకు
లలిఁ బానుపు వరచి లాలించరే ॥ వెంగె ॥

అందు నిందుఁ దిరిగాడి ఆఁకలిగొన్నాఁడేమో
విందువెట్టరే పతికి వెలఁదులాల
చెందె నన్ను నింతలోనె శ్రీవేంకటేశుఁడితఁడు
పొందు లిందరికిఁ జేసీఁ బొగడరే మీరు ॥ వెంగె ॥ 29

**రేకు 1806** **శ్రీరాగం**

చెలులాల పతిఁ గక్కసించకురే పలుమారు
యెలమితోడుతఁ దొల్లె యేలినాఁడు నన్నును ॥ పల్లవి ॥

మరిగించి వొకమాఁటు మనసు పెట్టితేఁ జాలు
తరవాతిపనులెల్లా తా నెరుఁగును
గరిమ నాసలతోడఁ గన్నులఁ జూచితేఁ జాలు
వెరవులు పచరించి విన్నవించవలదు ॥ చెలు ॥

మిక్కుటమైన వయసు మీఁదుకట్టితేఁ జాలు
మక్కువఁ దానే మరి మన్నించీని
అక్కరతో నేపొద్దునండ నుండితేఁ జాలు
పక్కన నిండుమోహము పచారించవలదు ॥ చెలు ॥

సేయఁగల చేఁతలెల్లా సెలవు సేసితేఁ జాలు
చాయకువచ్చి తానే సతమయ్యీని
యీయెడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నేలినాఁడు
చేయి చాఁచి సారెసారెఁ జెనకఁగ వలదు ॥ చెలు ॥ 30

**పాడి**

ఇంకనేల వట్టిగుట్టు లెదిరించె వలపులు
పొంకమాయ నీతనితో పొందులు చేకొనరే ॥ పల్లవి ॥

చెంతనుండి రమణుఁడు చెక్కునొక్కి వేఁడుకొనీ
యెంతటిపనికైనాను యియ్యకొనవే
వింత వింతమాటలాడి వేమారును లాలించీ
సంతోసాన నందుకును సమ్మతించరే ॥ ఇంక ॥

సారె సారె వేడుకతో సన్నలు నీకుఁ జేసీ
మేరతోడ నన్నిటికి మేకొనరే
వూరడించి వూరడించి వొడఁబరచీ నిన్ను
ఆరీతి నాతనిచేఁత లంగవించరే ॥ ఇంక ॥

చెంది నిన్ను బుజ్జగించి సేసవెట్టి చనవిచ్చీ
కందువల నీవు నిట్టె కానిమ్మనవే
యిందరిలో శ్రీవేంకటేశుఁ డీతఁడే నిన్నేలె
మందలించి ఇప్పుడిట్టె మనసు చొక్కవే ॥ ఇంక ॥ 31

## కాంబోది

మఱవకువే చెలియ మదనరహస్య మిది
యెఱుఁగుకొంటే మేలు ఇందులోనే వున్నది ॥ పల్లవి ॥

సేయరాని వినయము సేసితే దంపతులకు
పాయనిచుట్టరికమై పైకొనును
యేయెడా మొగమోటము లెప్పుడు గలిగితేను
మోయరానిమోపులై మునుకొను మోహము ॥ మఱ ॥

యేపొద్దు మంచితనాన నెనసితే జాణలకు
దాఁపురాలై వేడుకలు తతిగొనును
కాఁపురపుసరవులే కడుఁగడు కరపితే
ఆఁపరాని తమకము లలవడివుండును ॥ మఱ ॥

తిరమైన రతులద్దితే నేరుపరులకు
సరససల్లాపములు చవులు మించు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
వరుసతో మెలఁగితే వలపు లీడేరును ॥ మఱ ॥ 32

## వాట

[1] పారరో యసురులు పంచబంగాళమై
వీరనృసింహుఁడు వెదకీ నదివో ॥ పల్లవి ॥

వాఁడులై వున్నవి వజ్రనఖంబులు
మూఁడవక న్నదె ముంచీ మంటలు
వేఁడిమి చల్లీ వెస నిట్టూర్పులు
వీఁడె నృసింహుడు వేదాద్రిమీఁద ॥ పార ॥

కత్తులు నూరీ కఠినపుఁ గోరలు
కొత్తనురుగులటుఁ గురిసీ లాలల
కుత్తికలోపలఁ గులికీ నురుములు
హత్తె వీఁడె గరుడాచలమందు ॥ పార ॥

శుభములు సురలకుఁ జూపీ పాదముల
త్రిభువనంబులును తిరుమేన నివిగో
విభవంబుల శ్రీ వేంకటనాయకుఁ -
డభయంబొసఁగీ నహోబలమున ॥ పార ॥ 33

## సామంతం

ఒకటి కొకటికి లంకె వువిదలకుఁ బతులకును
మొకమిచ్చులనుఁ గలసి మొనయవలెఁగాని ॥ పల్లవి ॥

పెనగొన్న చుట్టరికము ప్రియములకుఁ గారణము
వనువులకుఁ గడలేని నవ్వులు గారణము
తనవోనియాసలకు తలపోఁతఁగారణము
మనసు లెనయుటకు సమ్మతులు గారణము ॥ ఒక ॥

---

1. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండదగినది.

మరిగి తగులుటకు నెడమాట లవి గారణము
సరసముల కొడ(బడినచనవు గారణము
సురతములవాడికకు పొలపు లిటు గారణము
గరిమ( జెనకులకు తమకములు గారణము ॥ ఒక ॥

సంతతపు వేడుకకు జవ్వనము గారణము
మంతనపు( గూటమికి మనసు గారణము
ఇంతిరో శ్రీవేంకటేశు( డిట్టె నిన్ను( గూడె
చెంత మీకిద్దరికి చెలిమి గారణము ॥ ఒక ॥ 34

## లలిత

అదివో లకిమమ్మ అహోబలేశ్వరుతోడ
పదివేలు చందముల పరగీ రతులను ॥ పల్లవి ॥

సరుసనే కూచుండి జవళి( గొండలమీ(ద
యిరులు చల్లులాడీ విభు(డు(దాను
పరిపరివిధముల భవనాశి దరులను
సరసములాడీని సాటికి చేటికిని ॥ అది ॥

యెదురు(గా(గిళ్ళతోడ నెనసి మా(కులనీడ
పెదవితేనె లానీని ప్రేమమునను
నిదినిధానాలవలె నిచ్చ వానపడలను
సదమదమై నవ్వీని చతురత మెఱసి ॥ అది ॥

తొడ(దొడ( గదియ(గ దోమటి గద్దెల నుండి
జడియక పెన(గీని సమరతిని
యెడయక శ్రీవేంకటేశు(డే నరసింహు(డై
అడర(గ( బెండ్లాడీ నతి సంతోసమున ॥ అది ॥ 35

రేకు 1807 **పళవంజరం**

అన్నిటా నెరజాణఁ డాతఁడే యెరుఁగును
విన్నపములెల్లాఁ జేసి వేడుకఁ బొగడరే ॥ పల్లవి ॥

ఆసలు రేఁచినవాఁడు అండకు రాకుండునా
సేసలు వెట్టినవాఁడు చెనకఁగ మానీనా
వాసులెక్కించినవాఁడు వన్నెకెక్క మన్నించఁడా
గోసనాసఁ బతినేమీఁ గొసరకురే ॥ అన్ని ॥

తమి వుట్టించినవాఁడు దయ నాపైఁదలఁచఁడా
మమత లెంచినవాఁడు మరుగక మరచీనా
నెమకి వచ్చినవాఁడు నేఁడు నన్నుఁ గైకొనఁడా
సముకాన నాతని జరయకురే ॥ అన్ని ॥

చెక్కులు నొక్కినవాఁడు సిగ్గులు దేరుచఁడా
మొక్కకు లోనైనవాఁడు మునుకొని మెచ్చఁడా
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
తక్కినచేఁత లిఁకఁ దడవకురే ॥ అన్ని ॥ 36

**ఆహిరి**

పిలువరే నాయకుని ప్రియములన్నియుఁ జెప్పి
తలఁపులో వేడుకలు దైవారుఁగాని ॥ పల్లవి ॥

తనివోనిమోహములో తరవాయఁ జెలియకు
వినుకలి కథలెల్ల విరులాయను
గొనకొన్న కోరికలు కొమరాఁకలాయ నవె
యెనలేనివెడజాగు లిఁక నేఁటికే ॥ పిలు ॥

పొదిగి యెడమాటలే పోదులై పనిగొనియ
యెదురుచూపులయాస లెదురు దొట్టె
ముదురుఁ దమకమెల్ల ముప్పిరిఁ బెనగొనియె
పొదిగొన్నవట్టి తలపోఁత లిఁక నీలే ॥ పిలు ॥

తగులైనమచ్చికలు తరితీపు లెసగించె
మొగమోట తాలిములు మొలపించెను
సొగిసి శ్రీవేంకటేశుఁడు తానె సతినేలె
నిగిడి దినకొత్తలు నెరపనేమిటికే ॥ పిలు ॥ 37

## పాడి

ఆఁటది యింత కోపునా అంటిమోసువంటిది
మాఁటలనే లాలించి మరపుకోవయ్యా ॥ పల్లవి ॥

సిగ్గరితనాన నాపై శిరసు వంచుకుండఁగా
యెగ్గుపట్టి వున్నదంటా యేల లోఁచేవు
నిగ్గుదేరఁ జేతులెత్తి నీకు నిట్టె మొక్కఁగాను
బెగ్గిలఁ గుచములేల పిసికేవయ్యా ॥ ఆఁట ॥

ముగుదతనాన నాపె మోనముతో నుండఁగాను
నగుమంటా గోరనేల నాఁటించేవు
తగిలి నీపాదాలపై తానె యానవెట్టఁగాను
తెగడి కొప్పువట్టేల తీసేవయ్యా ॥ ఆఁట ॥

గోలతనమున నాపె గుట్టుసేసుకుండఁగాను
చేలకొంగువట్టి యెంత చిమ్మిరేఁచేవు
యీలీల శ్రీవేంకటేశ యింతి పాదాలొత్తఁగాను
తాలిమితోఁ గూడి యెంత మేలమాడేవయ్యా ॥ ఆఁట ॥ 38

## పాడి

చూడఁ జూడ వేడుకయ్యీ సుదతి నీబాగులు
వాడలోన నీసుద్దులు వన్నె కెక్కెఁ జెప్పవే ॥ పల్లవి ॥

కొలఁది మీరిన నీ కోరికె లీడేరెనటే
కళలుదేరీ మోమునఁ గలికి నీకు
బలిమి నీవాడిన పంతములు చెల్లెనటె
సెలవుల నవ్వులు చిందీ నేఁ డిపుడు ॥ చూడ ॥

మున్ను నీవు నోఁచిన నోములు ఫలియించెనటె
వున్నతి సంతోసాన నోలలాడేవు
తన్నుఁదానె నీ యెన్నిక తారుకాణ వచ్చెనటె
పున్నమచంద్రుని వలెఁ బొదలీ నీ మోము ॥ చూడ ॥

మగువలలోన నీ మనసొక్కటాయనటె
మిగులాసొంపుల నీవు నెరసేవు
జిగి నిన్నుఁ గూడెనటె శ్రీ వేంకటేశుఁడు
నిగిడి రతిచిహ్నాలు నిలువెల్లా నిండెను ॥ చూడ ॥ 39

## భైరవి

ఇంతి పరిణామము నీ కిదివో విన్నవించితి
వింతసేయక లోనికి విచ్చేసి చూడవయ్యా ॥ పల్లవి ॥

అలరి నీవు సతితో నాడినమాఁట దలఁచి
నలుగడ నవ్వినవ్వు దలఁచి
చెలిమి మిగుల నీవిచ్చినమన్నన దలఁచి
వులివచ్చి సిగ్గులతో నోలలాడుచున్నది ॥ ఇంతి ॥

చేరి నీవు చెనకిన చెనకులెల్లాఁ దలఁచి
సారెకు నాడిన సరసము దలఁచి
కూరిమి మీరఁగ నీవు కొప్పుదువ్వుట దలఁచి
మీరాక కెదురుచూచి నెమ్మదిఁ దానున్నది ॥ ఇంతి ॥

యేకతానఁ జేసిన నీ యిచ్చకములు దలఁచి
చేకొన్న కాఁగిటిలో మచ్చిక దలఁచి
యేకమై శ్రీవేంకటేశ యీరతిముందె తలఁచి
మేకొన్న సంతోసమున మెచ్చుకొంటానున్నది ॥ ఇంతి ॥ 40

## సాళంగం

ఇది మా వేడుక గాదా యేల మాకు దాఁచేవు
వెదకఁ బోయిన తీగె యెదురుగా వచ్చెను ॥ పల్లవి ॥

చిప్పిలుఁగళలతోడ చిరుఁ జెమటలతోడ
దప్పిదేరే వదేమె తరుణి నీవు
యెప్పటి చందము గాదు ఇప్పుడున్న నీ భావము
చెప్పఁగదవే మాతోను సిగ్గులేల ఇఁకను ॥ ఇది ॥

చొక్కుదేరే కన్నులతో సొరిది నిట్టూర్పులతో
మిక్కిలి యలసేవేమే మెలుఁత నీవు
యెక్కడ నబ్బెనోకాని యిటువంటి నీ సొబగు
నిక్కము చెప్పఁగదవే నీవేలకొంకేవు ॥ ఇది ॥

వీడిన తురుముతోడ వెన్నెల వవ్వులతోడ
వేడుక నెరసేవేమే వెలఁదినీవు
నే(నేఁ)డు శ్రీవేంకటేశుఁడు నిన్ను రతిఁ గూడెనటె
వోడక చెప్పఁగదవే వొద్దికతో మాకు ॥ ఇది ॥ 41

**రేకు 1808** **శ్రీరాగం**

విన్నవించితిమి నీకు వెలఁది భావములెల్లా
మన్నించుటే ఇఁక మంచి జాణతనము ॥ పల్లవి ॥

మరిగి పాయఁగలేక మగువ చెనకఁగాను
సరసము లాడేది జాణతనము
విరుల వేసి సన్నల వేమారుఁ బిలువఁగాను
మరుకేలిఁ బెనఁగేదే మరి జాణతనము ॥ విన్న ॥

ననుపులు పచరించి నవ్వులు నవ్వఁగాను
చనవిచ్చి పైకొనేది జాణతనము
తనివోక సారె మోము తప్పక చూడఁగాను
మనసు చొక్కించేదే మరి జాణతనము ॥ విన్న ॥

చెంతఁ గూడి చెప్పరాని సేవలెల్లాఁ జేయఁగాను
సంతోసించుకొనియెడి (యేది ?) జాణతనము
ఇంతలో శ్రీవేంకటేశ నీకె నిన్ను వేఁడఁగాను
మంతనానఁ గలసేదే మరి జాణతనము ॥ విన్న ॥ 42

**ఆహిరి**

అందుకే దయవుట్టు నాతనికిని
యెందును వనితలకు ఇచ్చకమే మేలు ॥ పల్లవి ॥

గాఁటమున రమణుని గడవనాడుటకంటె
మాఁట మాఁటగాఁ బొగడే మచ్చికే మేలు
సాటిబేటికి బొమ్మల జంకించుటకంటే
సూటిగా మోము దప్పక చూచుటే మేలు ॥ అందు ॥

మోనముతోడ మొగము మునుచుకవుండుకంటే
నానఁబెట్టి సెలవుల నవ్వుటే మేలు
ఆనవెట్టుక పెనఁగి అదలించుటకంటే
కానుకిచ్చి వూరకుండే ఘనతే మేలు ॥ అందు ॥

చేరువనుండి లోలోనే సిగ్గులు వడుటకంటే
కూరిమితోఁ గాఁగిలించుకొనుటే మేలు
గారవించి నిన్ను శ్రీవేంకటేశుఁడు మెచ్చి యేలె
నేరుపుగలదానవు నీకు నిదే మేలు ॥ అందు ॥ 43

## బౌళి

పతివద్ద నేఁడే నీవు పచరించేవు
కతకారితనా ; లెందు గడిఇంచుకొంటివే ॥ పల్లవి ॥

చిగురాకుమోవి మీఁది చిన్నలేఁతమాటలు
నిగిడి యెన్నఁడు నీవు నేరిచితివే
మొగమిచ్చలకుఁ జూచే ములువాఁడి చూపులు
తగిలి ఇన్నాళ్ళు యెందు దాఁచుకవుండితివే ॥ పతి ॥

గుత్తపు చెక్కుఁ జెమట కొనగోరి చిమ్ములు
బిత్తరాన నెట్టు గూడపెట్టుకొంటివే
చిత్తిణితనములోని చిరిసిగ్గులనవ్వులు
తిత్తిఁగట్టి యేడనుండి తెచ్చుకొంటివే ॥ పతి ॥

కదిసినయట్టిరతికళలలో గురుతులు
పొదపెట్టి యెట్టు గూడపోసుకొంటివే
అదన శ్రీవేంకటేశుఁ డట్టె నిన్ను నన్నూఁ గూడె
చదురుఁదనము లెన్ని సవరించుకొంటివే ॥ పతి ॥ 44

## భైరవి

చిత్తాన మఱవక యీచెలి నిట్టె మన్నించు
వొత్తి విన్నవించే మీపె కొత్తపెండ్లికూఁతురు ॥ పల్లవి ॥

సెలవుల నవ్వుదురు చేసన్నలు సేతురు
వలపులు చల్లుదురు వనితలు
అలతురు సొలతురు ఆయములంటుదురు
బలిమినెంతైనా నెగ్గుపట్టరాదు పతికి ॥ చిత్తా ॥

చనవులు మెరతురు జంకింతురు బొమ్మలను
కనుఁగవ చూపులు కాఁడింతురు
పెనఁగుదు వూరకైనా బిగుతురు పంగింతురు
యెనసి యెంతైనా నేరాలెంచరాదు పతికి ॥ చిత్తా ॥

మందెమేళాన నుందురు మనసులుఁ గరతురు
కందువ రతికిఁ దీసి కాఁగిలింతురు
ఇందుముఖి నేలితివి ఇంతలో శ్రీవేంకటేశ
విందువలెఁ బాయకుండు వీడరాదు పతికి ॥ చిత్తా ॥ 45

## దేసాళం

చూచి చూచి నాకు గడుసోద్యముగ దయవుట్టీ
యేచి నీసేవే సేసే మా ఇంటికి రావయ్యా ॥ పల్లవి ॥

వెలలేని వేడుకతో వేగినంతా నవ్వితివి
అలవోక సరసాల నాపెతోను
పలుకుఁదేనె తీపులు పైపైఁ జవి చూపితివి
అలపుదేర్చేఁగాని మాయాడకు రావయ్యా ॥ చూచి ॥

మనసు దనియలేక మాపుదాఁకాఁ బెనగితి -
వనేకరీతులా గోరి యాపెతోడను
వినోదించితివి చాలా విచ్చనవిడి నక్కడ
నిను సేదదీర్చేను మానెలవుకు రావయ్యా ॥ చూచి ॥

ఇక్కువలంటి యాసల నిందాఁకా భోగించితి -
వక్కజమైన రతుల నాపెతోడను
నెక్కొని శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
నిక్కము నిన్ను మెప్పించే నిచ్చలు రావయ్యా ॥ చూచి ॥ 4

**లలిత**

నీకింత బాఁత్రైతిఁగా నేఁజేసినదే భాగ్యము
కైకొనవయ్యా పాదాలు గడిగే నే నీకును ॥ పల్లవి ॥

వేడుక కొకమాఁట వెలఁదిచేఁ జెప్పిపంపి
వాడికల కిందాఁకా వచ్చితివేమో
యీడవారితోడ పొందు యెంతగద్దు అయినాఁగాని
వీడె మందుకోవయ్యా విచ్చేసితి వీడకు ॥ నీకింత ॥

చనవిచ్చినటువలె సారెకుఁ దప్పక చూచి
మనసు సోదించ మాతో మాఁటాడేవేమో
చెనకిన్నాళ్ళు సరకు సేతువా నేఁ డేమికొత్తో
ఘనతఁ గూచుండవయ్యా గద్దెపీఁట మీఁదను ॥ నీకింత ॥

సమ్మతి నోవరిలోన సరుస నన్నుఁ బెట్టుక
నమ్మికగా నాతోడ నవ్వేవేమో
యిమ్ముల శ్రీ వేంకటేశ యెనసితి వందుకేమి
పమ్మి నీకుఁ జేత మొక్కే బాయకుండవయ్యా ॥నీకింత॥

రేకు 1809 **వరాళి**

రావే యీతనికడకు రమణి నేఁడు
నీవు నాతఁడుఁ బొందైతే నెమ్మది నుండుదురు ॥ పల్లవి ॥

చేరి తనరమణుఁడే చేకొంటేఁ జాలుఁగాక
సారె సారె దూరనేల సవతులను
ఆరితేరి యాతఁడే మాటాడితేఁ జాలుఁగాక
వీరిడై కోపించనేల వెడచిలుకలను ॥ రావే ॥

అక్కరగలవిభుఁడు యాసిచ్చితేఁ జాలుఁగాక
కక్కసించనేల చెలికత్తియలను
చొక్కి తనది క్కాతఁడు చూచితేఁ జాలుఁగాక
గక్కన జంకించనేల కంతునిబాణాలను ॥ రావే ॥

అడరి శ్రీవేంకటేశుఁ డబ్బితేఁ జాలుఁగాక
తడవనేల పెంచినదాదులను
యెడయ కింతలో వచ్చి యీతఁడే నిన్నుఁగూడె
కడు సగినాలు చూడఁగానేల యనులను ॥ రావే ॥ 48

**పాడి**

ఉద్దగిరికృష్ణుఁ డాతఁ డొక్కఁడే జాణఁడంటివి
పొద్దున మాకిద్దరికిఁ బొసఁగునే చెలియా ॥ పల్లవి ॥

వెలఁ దాతనిగుణాలు వేగినంతాఁజెప్పితివి
వెలయ నెందున్నాఁడే వెలఁది వాఁడు
కలఁ దాతఁ డందరికంటెఁ జక్కనివాఁ డంటి -
వలరఁ దోడితేవే నాయుండకు నేఁడు ॥ ఉద్ద ॥

పొది గాతనినేర్పులు పొగడితి విందాఁకా
సుదతి మొక్కే విట్టె చూపవే నాకు
చదురుఁదనము రాజసము గలవాఁడంటివి
యెదిటికిఁ దానెప్పుడెపుడు వచ్చీనే ॥ ఉద్ద ॥

వడి నాతనికి నాకు వలపు వుట్టించితివి
కడఁగి నాతోఁ జుట్టరికము సేయవే
యెడయక శ్రీవేంకటేశుఁడే తానట నన్నుఁ
దడవి యేలినాఁడొనె తప్పదు నీమాట ॥ ఉద్ద ॥ 49

## నాట

నీపొందులెల్లా గంటిమి నేఁడు నీపంతాలుచెల్లె
భూపతిచెరువుచెంత భోగింపుచున్నాఁడవు ॥ పల్లవి ॥

ముచ్చట లాడుకొంటా మొగములు చూచుకొంటా
హెచ్చి యెంతచనవిచ్చే వింతులకును
తచ్చనలు చూపుకొంటా తమకము లేఁ (లెం?)చుకొంటా
కొచ్చి యెంతనవ్వేవు కొలువులోను ॥ నీపొందు ॥

పువ్వులను వేసుకొంటా పుప్పొడి చల్లుకొంటా
రవ్వలేమి సేసేవు రమణులను
వువ్విళ్ళూరించుకొంటాను వొడివట్టి తీసుకొంటా
చివ్వన నెంత పచ్చిగాఁ జెనకేవు నీవు ॥ నీపొందు॥

సన్నలు సేసుకొంటా చవులు వుట్టించుకొంటా
మన్నించి యెంతకూడేవు మగువలను
యెన్నికతో నన్నేలితి వింతలో శ్రీవేంకటేశ
చన్నులేల పట్టేవు సరసము లాడుతా ॥ నీపొందు॥ 50

## భైరవి

మేలు మేలే యితఁడు నేర్పును మెచ్చితి నన్నిటా నీతనికూటమి
కోలుముందై యిటులఁ గోర్పులు కొనలుసాగని దేఁటిదే ॥ పల్లవి ॥

మనసు గరఁగఁగఁ జేయఁ జాలనిమాఁట లిన్నియు నేఁటివే
చనవు మిగులఁగ నోలలాడనిసరసములు మరియేఁటివే
తనివిఁ బొందఁగ రతులఁ గలయని తాలిముల గొడ వేఁటిదే
చెనకి చెనకించుకొని కొసరినిచేఁత లేమియు నేఁటివే ॥ మేలు ॥

పెదవి తేనియ లొలుకఁ జెప్పని ప్రియము చేకొన నేఁటిదే
యెదురుచూపులయాసలను బయలీఁదని వల పేఁటిదే
సదమదంబుగఁ బుక్కిటితమ్ములము చవులుగొననిది యేఁటిదే
ముదురుఁ దమకము మీఁదఁ జల్లుచు మొక్కులాడని దేఁటిదే॥ మేలు॥

చెలపచెమటలుగార సొలయుచు చిమ్మిరేఁగని దేఁటిదే
తలఁపుఁదలఁపునుఁ దారుకాణై తగిలి చొక్కని దేఁటిదే
యెలమితో శ్రీవేంకటేశ్వరుఁ డేలె నన్నిపు డతిముదంబున
చెలియ నీతో నిట్టివేడుక చెప్పి చూపని దేఁటిదే ॥ మేలు॥ 51

## ముఖారి

ఎపుడు వత్తువోయనుచు యెదురు చూచీఁ జెలియ
వుపమించి చెప్పితిమి వువిదఁ జెందవయ్యా ॥ పల్లవి ॥

నెలఁతకనుఁగలువలకు నీమోముఁ జందురుని -
నలరంగఁ జూపగదవయ్య నేఁడు
కలికి చక్కఁదనంబు కడఁగి ప్రతిబింబించ
తళుకు నీచెక్కుటద్దములు చూపవయ్యా ॥ ఎపు ॥

నిరతి మెఱఁదీగెకును నీబాహుశాఖ లివి
అరడుగాఁ జూపఁగదవయ్య నేఁడు
సరిఁ జన్నుజక్కవలు జంటవాయకయుండ
తొరల తనుసూర్యకాంతులు చూపవయ్యా ॥ ఎపు ॥

గళనాద పికములకు కడునీజవ్వనమదము
అలమి చోటుగఁ జూపవయ్య నేఁడు
వలచి శ్రీవేంకటేశ్వర యీకెఁ గూడితివి
కలకాలమును నిట్టులఁ గరుణ చూపవయ్యా ॥ ఎపు ॥ 52

**రేకు 1810** **వేళావళి**

ఇన్నిటా ఘనుఁడు తాను యెంచితే నే నెంతదాన
సన్నిధినుండి నాకు చనవిచ్చీ నితఁడు ॥ పల్లవి ॥

చక్కనిదాననంటాను సారెసారెఁ బొగడీని
చెక్కునొక్కి వలపురేఁచీ నితఁడు
యెక్కడ నేరిచినాఁడో వేడలేని మాటలాడి
గక్కన నా మనసెల్లాఁ గరఁగించీ నితఁడు ॥ ఇన్ని ॥

నా మొగము చూచి చూచి నవ్వులెల్లా నవ్వీని
ఆముకొని చనుగుబ్బలంటీ నితఁడు
యేమి దలఁచుకున్నాఁడో ఇచ్చకములెల్లాఁ జేసి
కామించి మెచ్చులు మెచ్చి కాఁగిలించీ నితఁడు ॥ ఇన్ని ॥

కప్పురపువిడె మిచ్చి కడు నన్ను మన్నించీని
చెప్పరాని చేఁతలెల్లాఁ జేసీ నితఁడు
ముప్పిరి నెంతజాణఁడో మోహములెల్లాఁ జల్లి
ఇప్పుడే శ్రీవేంకటేశుఁ డింతసేసె నితఁడు ॥ ఇన్ని ॥ 53

## శ్రీరాగం

ననిచి యీతనితోనే నగుత నుండెదఁగాక
చనవుగలిగినవెనక జరయఁదగునటవే ॥ పల్లవి ॥

భావ మాతని మీఁదఁ బాదుకొలిపినవెనక
చేవదేరఁగ నలుగఁ జెల్లునటవే
కావరపువలపు లొడిఁగట్టుకుండిన వెనక
వావాతమచ్చికలు వదలఁదగునటవే ॥ ననిచి ॥

మిగుల నతనికి మోవి మీఁదుకట్టిన వెనక
జిగిమించి ఇఁకఁ బలుకఁ జెల్లునటవే
పగటుతో వయసు తనపాలఁ బెట్టినవెనక
మగిడి మొగమోట లటు మానఁదగునటవే ॥ ననిచి ॥

లవి భోగ మతనితో లంకెసేసిన వెనక
చెలిమి సేయక మరవఁజెల్లునటవే
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో నమఁగూడె
వెలలేనితమక మిఁక విడవఁదగునటవే ॥ ననిచి ॥ 54

## సామంతం

ఏమందునే చెలియ ఇంతసేసెను వయసు
నామనసు చొక్కించి నమ్మించె వయసు ॥ పల్లవి ॥

పుడివోని తమకముల నుబ్బురేఁచెను వయసు
కడఁగి యలుకలు దేర్చి కలపె వయసు
అడియాసలే పెంచి యారడిఁ బెట్టెను వయసు
బడిఁ గోరికలబయలు వాఁకించె వయసు ॥ ఏమందు ॥

సొగిసి రాకల కెదురుచూడఁ జేసెను వయసు
తగిలించి రతుల కెడతాకించె వయసు
వెగటుగాఁ దెగుపలకు వెఱపుఁదెలిపెను వయసు
జిగిమించి తలపోఁతఁ జిక్కించె వయసు ॥ ఏమందు ॥

వొకరి కొకరికి లంకె లొనరఁజేసెను వయసు
మొకమోటలనె ననుపు ముంచె వయసు
వెకలియై కూర్చె శ్రీవేంకటేశుతో వయసు
ప్రకటమై నాకిట్ల ఫలియించె వయసు ॥ఏమందు॥ 55

## ఆహిరి

చెప్పఁగదవె చెలియ వినియెద చెవులు చల్లఁగ నతని సుద్దులు
కుప్పలుఁ దెప్పలు గాఁగఁ గూడిన గురుతు లెల్లనుఁదలఁచునా ॥పల్లవి॥

తనకు నాకును తొల్లిటి మాఁటల తారుకాణలు దలఁచునా
చెనకి చెనకి మర్మములంటఁగ సిగ్గులు వడుట దలఁచునా
చనవుతోడుత నడ్డాఁకలేక సరసమాడుట దలఁచునా
దినదినమును మోములు చూచుక తెప్పలఁదేలుట తలఁచునా॥ చెప్పఁ॥

పానుపుమీఁదట మిద్దర మొక్కటై పాయకవుండేది దలఁచునా
ఆనలు మీరుచు సరికిబేసికి ఆయము లంటుట దలఁచునా
మేనులఁ జెమట లుప్పతిల్లఁగ మించిపెనఁగుట దలఁచునా
తానకమయినబోగములను దైలువారుట దలఁచునా ॥ చెప్పఁ ॥

యెప్పుడుఁ దానును నేనును నెనసి యెరవులేనిది దలఁచునా
చొప్పుకఁ గలసిమెలసివుండేటి చుట్టరికములు దలఁచునా
తప్పక ..... [1] నా ఇంటికి విచ్చేసి తానే నన్ను మన్నించి ఏలెను
ఇప్పటివలెనే శ్రీవేంకటేశుఁడు యింతటానన్నుఁ దలఁచునా॥చెప్పఁ॥56

1. ఈ ఖాళీ స్థలములో రేకులో ఏవో మూడక్షరములు వున్నట్లు తెలియుచున్నది. అది బాగ చిలుమెక్కినది. రెండక్షరములు బాగా అరిగినవి కూడ. "మన్నింప" ఇత్యాదిగా వుండవచ్చునని ఊహ. ఆ పదము లేకపోయినను అన్వయమునకు బాధ లేదు.

## రామక్రియ

వీఁడివో నీయెదుట నున్నాఁడు వేవేలుచందాల నెరజాణఁడు
పోఁడిమితోడుతఁ గలకాలమును పొదిగి భోగించవే ॥ పల్లవి ॥

సేసపాల పెండ్లికూఁతురవు చినదానవటవే నీవు
మోసులువార నవ్వుచుఁ బతికి మోముచూపవే
నీసరివారిఁజూచి చేఁతలు నేరుచుకొనవే కడమలేల
ఆసలురేఁగ సరసమాడి ఆయములంటవే ॥ వీఁడి ॥

పోఁకలంతలుచన్నులదానవు బుద్దులు నేరుపవలెనా నీకు
యేఁకటవాయ మనసుఁగరఁచి యింపులు చల్లవే
వాఁకమైన జవ్వనపాయము వచ్చెను మతిలోఁదలఁచుకొనవే
తేఁకువతోడుత ముద్దుబలుకుల తేనెలు గురియవే ॥ వీఁడి ॥

చక్కఁదనముల చక్కెరబొమ్మవు చవులు చూపఁగవలెఁగదవే
గక్కన శ్రీవేంకటేశుఁడు గూడె కాఁపురము సేయవే
మిక్కుటమైన కలికితనాల మెరసి దిక్కులమెప్పించుకొనవే
వెక్కసముగను రతుల మెప్పించి వేడుక సేయవే ॥ వీఁడి ॥ 57

## రేకు 1811 ఆహిరి

నీ విఁక నేమన్నాను నీకు నీతోడు
కైవసమాయఁ బనులు కడమ లే లిఁకను ॥ పల్లవి ॥

వలిపెపయ్యెదలోని వాసనగుబ్బలతోడు
పలుకవే చలములు పచరించక
పలచనైన నీ పచ్చికెమ్మోవితోడు
సొలసి తలవంచక చూడవే నాదిక్కు ॥ నీవిఁక ॥

సిగ్గులుదాఁచికట్టి చెంగావి చీరతోడు
వొగ్గి పట్టవే విడెము వుద్దండాలేల
దిగ్గనఁ గస్తూరి యలఁదిన నీచంకలతోడు
దగ్గరి కూచుండవే వింతలేల నీకు ॥ నీవిఁక ॥

తరితీపు చూపుల నీతళుకుఁ గన్నులతోడు
గిరిగొన నిట్టె కాఁగిట నించవే
చిరిఁజెమటలతోడి శ్రీవేంకటేశుఁడ నేను
మెరసె నీనా పొందు మితిమీరి యిపుడు ॥ నీవిఁక ॥ 58

## రామక్రియ

నీ చిత్త మిటమీఁద నేము చెప్పేటిదేమి
చేచేతఁ గూడి దయసేయవలెఁ గాక ॥ పల్లవి ॥

పేరుకొని యొకమాఁటు పిలుచు వూరక నిన్ను
కోరు మనసునను నీకూటంబులు
దూరు దైవంబు నటు తుదరెప్ప లందుఁ గ -
న్నీరు నించును సారె నెలఁత నినుఁ దలఁచి ॥ నీచి ॥

భావించి యొకమారు పలకపై నిను వ్రాసు
వేవేగఁ దలయూఁచ వెరగుపడును
నీవు రాఁగలుగను నిట్టూర్పు నిగుడించు
పూవుఁ బాన్పునఁ బొరలు పొలతి నినుఁ దలఁచి ॥ నీచి ॥

పక్కనను నొకమాఁటు బయలు నీతో నవ్వు
చెక్కు చేతనుఁ జేర్చు చింతించును
ఇక్కడనె శ్రీవేంకటేశ ఇదె కూడితివి
వెక్కసంబుగఁ బొగడు వెలఁది నినుఁ దలఁచి ॥ నీచి ॥ 59

## శ్రీరాగం

తగును మీ ఇద్దరికి తలఁచుకో నా మాఁట
నెగడె మీ కూటములు నిక్కములు నేఁడు ॥ పల్లవి ॥

వదలఁదగునా ప్రియము వలపుగలవారికిని
యెదురుకొని వినయములు హెచ్చవలెఁగాక
చెదరఁదగునా మనసు చెలిమిగలవారికివి
పొదలి ఇచ్చకములనే పొరలవలెఁగాక ॥ తగు ॥

విడువఁదగునా యాస వేడుకగలవారికిని
వుడివోని తమకమున నుండవలెఁగాక
కడవఁదగునా మాట కైవసపువారికిని
కొడిసాగఁబను లియ్యకొనఁగవలెఁగాక ॥ తగు ॥

మఱవఁదగునా మేలు మమతగలవారికిని
మెఱసి రతులను నేర్పు మించవలెఁగాక
వెఱవఁదగునా చనవు వెలఇంచువారికిని
యెఱిఁగి శ్రీవేంకటేశు నెనయవలెఁగాక ॥ తగు ॥

## ఆహిరి

వీనికేలే వెఱవ నీకును విభునిపొందే సేయు మింకను
మానవే యింక చింత యీతని మన్ననలు చేకూరెను ॥ పల్లవి

తలఁపుఁ దలఁపునుఁ దారుకాణై తగిలి యుండినఁ జాలుఁగాక
కలువలునుఁ దామరలు నెవ్వరి గాఁడిపారీనే
పలుఁకుఁబలుఁకునుఁ బొసఁగనాడుక పదరకుండినఁజాలుఁగాక
చిలుకలునుఁ గోవిలలుఁ జేసేటిచేఁత లేమింక నున్నవె ॥ వీని ॥

మొగము మొగమునుఁ జూచుకొని యిటు ముచ్చటాడినఁ జాలుఁగాక
చిగురులునుఁ దీగెలును యెవ్వరిఁ జెనకవచ్చీనే
నగవునగవునుఁ గలయనవ్వుచు ననిచివుండినఁ జాలుఁగాక
తగిలి చంద్రుడు చల్లగాలియుఁ దడవుపనులేమున్నవే ॥ వీని ॥

కరముఁగరమును సోఁక రతులనుఁ గాఁగిలించినఁ జాలుఁగాక
మరుఁడు బలములుఁ గూడి యెవ్వరి మచ్చరించేరే
యిరవుకొని శ్రీవేంకటేశ్వరుఁ డింతలోఁ దా నిన్ను నేలెను
తిరుగఁ దిరుగను విన్నవించేటి తెరఁగు లిఁక లేమున్నవే ॥ వీని ॥ 61

## భైరవి

ఎంచి చూడ నెన్నిలేవు యీకె తలపోఁతలు
నించినవేడుక లిఁక నెరవేరుచవయ్యా ॥ పల్లవి ॥

వూర నూర నూటలాయ నుడివోని తమకము
నీరుకొద్దితామరాయ నిండుమోహము
గోరగీర నేరులాయ కొమ్మకోరికలెల్లాను
గారవించి యిఁకనైనాఁ గరుణించవయ్యా ॥ ఎంచి ॥

పట్టఁ బట్టఁ బాములాయ పరగ నడియాసలు
ముట్టినదే ముయ్యాయ ముంచినేస్తము
చెట్టడువఁ జేటఁడాయ చెలరేఁగి వావులు
గుట్టుతోనే యిఁకనైనాఁ గొమ్మనేలుకోవయ్యా ॥ ఎంచి ॥

చెప్పఁ జెప్పఁ గొత్తలాయ చెలియవిరహమిది
తెప్పపై వోలాయఁ దరితీపు లెల్లాను
యిప్పుడు శ్రీవేంకటేశ యింతి నిట్టె యేలితివి
తప్పక నీవిఁకనైనాఁ దగ మన్నించవయ్యా ॥ ఎంచి ॥ 62

## రేకు 1812 పాడి

తానే యెఱుఁగును అన్నిదగవులు దయఁదలంచీ నిపుడెరమణుఁడు
పూని యొకమాఁ టెచ్చరించవే పొసఁగు నోచెలియా ॥ పల్లవి ॥

మచ్చికలుగలచోటిపొందులు మఱవనెటువలె వచ్చునే
ఇచ్చకముతోమెలఁగు సరసము లెరవు లే లగునే
పెచ్చువెరిగిన ననుపులెల్లను పెనలుగొనకే లుండునే
నచ్చుకొట్టక యిట్లనే విన్నపము సేయవే యతనికి ॥ తానే ॥

మరిగి పాయఁగరాని తగులమి మాననెటువలె వచ్చెనే
దొరసివుండినవయసు లేగతిఁ దొలఁగ దొబ్బేనే
సరవిగలవాడఁబాటుమాఁటలు చవులురేఁచకవుండునటవే
వెరవుతోడుత విన్నపము వేవేగఁ జేయవె యతనికి ॥ తానే ॥

తనివిదీరనిరతులసొంపులు తాళనెటువలె వచ్చునే
తనకుఁగా మీఁదెత్తుకుండినతమక మెటువలె దాఁతునే
యెనసె నను శ్రీవేంకటేశ్వరుఁ డిటకుఁ దానే వచ్చికరుణను
వినయమున నాసంతసంబులు విన్నవించవె యతనికి ॥ తానే॥ 63

### శంకరాభరణం

నీకు నతనికిఁ బోదు నేము చెప్పేటిదేమి
కైకొన్న మీకతలు కంటిమే చెలియా ॥ పల్లవి ॥

తెగరాని పొందులకు తెలిసి వోరువఁగవలె
మొగమోట కిచ్చకము ముంచవలెను
నగనేర్చినందుకును నంటు చూపఁగవలెను
తగులయిన రతులకును తరితీపువలెను ॥ నీకు ॥

యెనయు నడియాసలకు లెడమాఁట లాడవళ్లె..
నసుపులకుఁ గనుచూపు నాఁటవలెను
పెనగొన్నవేడుకకు ప్రియము చూపఁగవలెను
తనివిఁ బొందినయెడకు తగ మెచ్చవలెను ॥ నీకు ॥

సమ్మతించినపనికి సరినియ్యకొనఁగవలె
నమ్మినందుకు నిజము నడపవలెను
యిమ్ములను శ్రీవేంకటేశుఁ డిటు నినుఁగూడె
పమ్మికొనుచేఁత లిఁకేఁ బచరించవలెను ॥ నీకు ॥ 64

## ఆహిరి

ఎంతమోహమో కాని ఇతఁడు నీమీఁదను
సంతతముఁ బాయకిటు సరుస నున్నాఁడు ॥ పల్లవి ॥

పలుకవే పతితోడ పగడవాతెర దెరచి
చిలుకవే సెలవులను చిరునవ్వులు
మొలకసిగ్గులివేల మోనంబు లింకనేల
కలయికకు వచ్చి ఇదె కాచుకొన్నాఁడు ॥ ఎంత ॥

కనుఁగొనవె వొకమాఁటు కలువకన్నుల నితని
పెనఁగవే క్క(క?)రములను ప్రియము చల్లి
పొనిఁగేటి తమకమేల పొసఁగి గుట్టేఁకనేల
నినుఁగదియువేడుకను నిలుచున్నవాఁడు ॥ ఎంత ॥

కొసరవే యీవేళ కూరిములు సారెకును
విసరవే సణఁగు లిటు వేమారును
వెస రతుల మరిగి శ్రీవేంకటేశుఁడుఁ గూడి
సుసరమున నీతోడ ఁజొక్కుచున్నాఁడు ॥ ఎంత ॥ 65

## ముఖారి

నీవల్ల నే మైనాను నెరుసులు గలవో
వేవేలు నీ చందాలకు వెరగయ్యీ మాకు ॥ పల్లవి ॥

బత్తితోడ నాపె నీకు పచ్చడము గప్పితేను
చిత్తగించి నవ్వనేల చిఱునవ్వును
కొత్తగాఁ బూవులు దెచ్చి కొప్పు నీకుఁబెట్టితేను
హత్తి తప్పక చూచేవు అది యేమి యీకెను ॥ నీవ ॥

అట్టె నీవద్దనుండినయద్దము చూడుమంటేను
చిట్టంటుఁదనాల నీకు సిగ్గులేఁటికి
గుట్టున సింగారాలు కొచ్చి కొచ్చి మెచ్చితేను
నట్టనడుమనేల ఆనలు వెట్టుకొనేవు ॥ నీవ ॥

చేరి చేరి నీమేని చెమట దుడిచితేను
[1]గారవిం చెంతలోనెంత కాఁగిలించేవు
యీరీతి శ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
కూరిములు సారెనేమి గొసరేవు చెలిని ॥ నీవ ॥ 66

## దేసాళం

ఇద్దరము నొక్కటే [2] ఇంతేశాలోయి
తిద్దుకొని యల్లుకొంటే తీగెలే పొదలుగావా ॥ పల్లవి ॥

చలము సాదించితేను చట్రాయి నుగ్గులౌను
యిల గోరగీరితేను యేరైపారు
వలపు రేఁచవచ్చేవు వద్దు సుమ్మీ వోయి నీవు
మొలకలే పెరిగితే మూకమాకులుగావా ॥ఇద్ద ॥

---

1. గారవించి + అంతలోనే + ఎంత
2. ఇంతేసి + ఏల + ఓయి

పంతములాడుకొంటేను బయలెల్లా బందిలౌను
చింతించితేను మంచము చెంతనే నుయ్యి
యెంత చెనకవచ్చేవు యేఁటికోయి వేసాలు
అంతటా పూపలైతేనే యట్టె పిందెలు గావా ॥ ఇద్ద ॥

కోరికలు వెంచితేను కోటానఁగోట్లౌను
పేరఁబెట్టితే పాలే పెరుగౌను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నేరుపింత గలిగితే నీవే నేఁగానా ॥ ఇద్ద ॥ 67

**రేకు 1813** **ముఖారి**

చెలుల మోములు చూచి చిరునవ్వు లేమిటికి
చెలఁగి యాతనిసేవ సేయవే ఇఁకను ॥ పల్లవి ॥

మనసు లేకములైన మరియేల యెడమాఁట
వినయమే కలిగితే వింతలేదు
చెనకులకు లోనైన సిగ్గులకుఁ బనియేమి
వొనగూడి యతనితో నుండవే ఇఁకను ॥ చెలు ॥

తేరిచూచిన మీఁద తెరమఱఁగు లవి యేల
కూరిములు దొరకితేఁ గొసరవలదు
తారుకాణైనచో తగవులడుగఁగనేల
చేరి చుట్టరికంబుసేయవే ఇఁకను ॥ చెలు ॥

సేసవెట్టినవెనకఁ జెప్పనేఁటికి వావి
బాసలే వొనరితేఁ బాయనేల
యీసరిని శ్రీవేంకటేశుఁ గూడితి విపుడు
వాసితో నీవితని వదలకువే ఇఁకను ॥ చెలు ॥ 68

## పాడి

రాఁపులు సేయక ఇఁక రావయ్యా
మాపుదాఁకా మాటలేల మరి ఇఁక రావయ్యా ॥ పల్లవి ॥

కొచ్చి కొచ్చి సతిచేత కొలువుసేయించుకోఁగా
రచ్చకెక్కేవలపులు రావయ్యా
తచ్చి యాపె నిన్నుఁ బాసి తమకించీఁ బానుపుపై -
నిచ్చట నేమిసేసేవు ఇఁక రావయ్యా ॥ రాఁపు ॥

ఆయనాయ జాగులేల అంగనఁ జూచితేను
రాయైనాఁ గరఁగును రావయ్యా
చేయి మీఁదాయ నీకును చెల్లెను పంతములెల్లా
కాయజుపై యాన నీకు గక్కన రావయ్యా ॥ రాఁపు ॥

సముకాన విన్నవించఁ జాలక చెలులచేత
రమణి విలువనంపె రావయ్యా
తమితో శ్రీవేంకటేశ [1]తగవచ్చికే నేలితి
సమరతిఁ గూడ నిట్టె సంతతము రావయ్యా ॥ రాఁపు ॥ 69

## బౌళి

అంత నీకు వేడుకైతే నట్టే పెండ్లాడరాదా
ఇంతిసిగ్గులు రచ్చనేల వేసేవు ॥ పల్లవి ॥

కాటుక కన్నుల నిన్నుఁ గాఁడఁ జూచెనంటాను
ఆఁటదానినేల నీవు అద్దలించేవు
గాఁటపుగుబ్బలు చూపీ గబ్బితనాన నంటాను
నీటున నీకెపైనేల నెపాలు వేసేవు ॥ అంత ॥

---

1. "తగవచ్చితేనే" అని వుండవచ్చునా ?

నిక్కి మోచినే మాటాడి నిన్ను నోరూరించెనంటా
గక్కన మానినినేల కాకు సేసేవు
చక్కఁదనములు చూపి చవులు వుట్టించెనంటా
చిక్కించుక గోరనేల చిమ్మవచ్చేవు ॥ అంత ॥

మలసి నీముందరను మనసు గరఁచీనంటా
కలికి నెంతేసి బిగ్గఁ గాఁగిలించేవు
యెలమి శ్రీవేంకటేశ యేలితి వీవనితను
నలిరేఁగి యెంతవడి నవ్వులు నవ్వేవు ॥ అంత ॥ 70

## వరాళి

తలఁచితే సిగ్గయ్యీ దగ్గరనున్నాఁ డతఁడు
చెలులాల నాకు మీరు చెప్పరే బుద్దులు ॥ పల్లవి ॥

వినయమే సేసితే వెగటైతోఁచదు గదా
ననిచి పాదాలొత్తితే నవ్వఁడుగదా
తనుఁ దప్పక చూచితే దంట యిదెనఁడుగదా
చెనకి పతికి నెట్టు సేవలు సేతునే ॥ తలఁ ॥

కదిసి కూచుండితేను గర్వమి దెనఁడు గదా
యెదుట నుండితే నెలయించడు గదా
అదనఁ దలవంచితే నట్టె పెనఁగడుగదా
పొదిగి యాతనితోడ పొందులెట్టుసేతునే ॥ తలఁ ॥

చేవల్లఁ గాఁగిలించితే సిగ్గులు రేఁచఁడు గదా
మోవెడిగితేఁ బల్లు మోపఁడు గదా
యీవేళ శ్రీవేంకటేశుఁ డిందువచ్చి నన్నుఁ గూడె
యే వరుసల నితని నెంతని నే మెత్తునే ॥ తలఁ ॥ 71

## కేదారగౌళ

సేయఁగల విన్నపము సేసితిమి నీతోడ
పాయ కిఁక నీయింతిఁ బాలించవయ్యా ॥ పల్లవి ॥

అడియాసలనుఁ గొంత ఆతుమను తనివొందు
యెడమాఁటలనుఁ గొంత ఇంపొందును
కడుఁదమకములఁ గొంత కడవుఁ పొద్దులు సారె
పడఁతిచందంబు లివి పరికించవయ్యా ॥ సేయఁ ॥

యెదురుచూపులఁ గొంత యెసఁగి సంతోసించు
మదరాగమునఁ గొంత మనసుపట్టు
వెదకేటిగతులఁ గొంత వేడుకలఁ జెలరేఁగు
సుదతిభావంబు లివి చూడఁగదవయ్యా ॥ సేయఁ ॥

తలపోఁతలనుఁ గొంతదడవు మిక్కిలి చెలఁగు
వలపులను వొకకొంత వాడుదేరు
యెలమిఁ గూడితివి నీవిపుడె శ్రీవేంకటేశ
చెలియ నిటువలెనె దయసేయఁ గదవయ్యా ॥ సేయఁ ॥ 72

## లలిత

నీవే ఇది దలఁచి మన్నించితివి జవరాలి
భావించి యెంతని మెచ్చి పలికేము నిన్నును ॥ పల్లవి ॥

నయాన గారవించితే నంటుసేతురు చెలులు
ప్రియములు చూపితేను బెరయుదురు
నియతమే నడపితే నెట్టుకొని వలతురు
క్రియెరిఁగి మగవాఁ డంకెల నేలవలెను ॥ నీవే ॥

ఇచ్చగించి కూడితేను ఇంపుసేతురు సతులు
మచ్చికలు చల్లితేను మరుగుదురు
అచ్చలాన నవ్వితేనే ఆయాలు గరఁగుదురు
కచ్చుపెట్టి నాయకుఁడే కరుణించవలెను ॥ నీవే ॥

చనవిచ్చి యేలితేను సతమౌదురు కాంతలు
ననుపు నటించితేను నమ్ముదురు
యెనసితివి శ్రీవేంకటేశ యింతలో నీకెను
వనితకుఁ బతి విటువలెనే కావలెను ॥ నీవే ॥ 73

రేకు 1814 భైరవి

నమ్మవే నామాఁటలు నవ్వులు గావు
పమ్మి నీమీఁదఁ గడు బత్తిగలఁ డతఁడు ॥ పల్లవి ॥

చింతించ నీకేఁటికే చెక్కుచె య్యిదేఁటికే
వంతుకు నీరమణుఁడు వచ్చీఁగాక
సంతోసమే కలిగీని సగినాలు మంచివయ్యీ
వింతవేడుకసుద్దులే వినేవు నీవు ॥ నమ్మ ॥

యేకతాలాడనేఁటికే యెవ్వరిదూరనేఁటికే
కైకొని యాతఁడే నిన్నుఁ గలసీఁగాక
నీకోరిక లీడేరీ నీవున్నదిక్కు మంచిది
జోక నన్నిసోబనాలు చూచేవు నీవు ॥ నమ్మ ॥

తలపోఁత లేఁటికే తలవంచనేఁటికే
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
వలపులు ఫలియించీ వచ్చినవేళ మంచిది
చెలరేఁగి సేవలింకాఁ జేసేవు నీవు ॥ నమ్మ ॥ 74

## నాదరామక్రియ

ఏమని చెప్పుదునే యిట్టిది నాయాఁ(యాం?)దోళము
కామించాతని చిత్త మేగతి నున్నదో ॥ పల్లవి ॥

మాటలాడినట్లుండు మరి నవ్వినట్లుండు
తాటించి విభునిరూపు దలఁచుకొంటే
గాఁటాన వచ్చినట్లుండు కరము చాఁచినట్లుండు
పాటించాతని సుద్దులు పలుమారు వింటేను ॥ ఏమ ॥

సరుసఁ గూచున్నట్లుండు సారెఁ జెనకినట్లుండు
ఇరవై తనమన్నన లెంచుకొంటేను
విరుల వేసినట్లుండు వేఁడుకొని నట్లుండు
గరిమఁ దనచేఁతలు గనుఁగొంటేను ॥ ఏమ ॥

చెక్కులు నొక్కినట్లుండు చేరికూడినట్లుండు
నెక్కొని పానుపుమీఁద నెలకొంటేను
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
దక్కె నా కితఁడు నేఁడు తానే గతి యంటేను ॥ ఏమ ॥ 75

## పాడి

అడిగినాఁ జెప్పదు అంగన తనచేఁతలు
సుడిగొనీ వలపులఁ జూడరమ్మా ॥ పల్లవి ॥

చెక్కునఁబెట్టినచేయి చిరుఁజెమటనొసలు
చుక్కలు గాసేటి మోవి చూడరమ్మా
జక్కవ చన్నులమీఁద జారిన పయ్యెదకొంగు
చొక్కపుకళలమోము చూడరమ్మా ॥ అడి ॥

నెరులు చెదరుఁ గొప్పు విరులు రాలేటి చొప్పు
సొరిది లేఁతనవ్వులు చూడరమ్మా
గరిమతోడఁ జిట్లుగందాల ముంజేతి
సురతపు సింగారాలు చూడరమ్మా ॥ అడి ॥

పెనఁగే హారాలు మెడ ప్రేమఁ జొక్కేఁటి తనువు
జానిఁగే శిరసు వంపు చూడరమ్మా
యెనసె శ్రీవేంకటేశుఁ డిందాఁకాఁ దను రతుల
చొనిపీ నేరుపులెల్లాఁ జూడరమ్మా ॥ అడి ॥ 76

## సౌరాష్ట్రం

ఆతఁడు నీరతులకు నాససేయఁగా
చేతులారా సేవ సేసి చిమ్మిరేఁచ వలదా ॥ పల్లవి ॥

సెలవి నేమినవ్వేవే సిగ్గులేల పెంచేవే
చెలిమిసేసి విభుఁడు చెక్కునొక్కఁగా
తలవంచుకొననేలే తమకమేల దాఁచేవే
కలికితనాల మతి గరఁగించవలదా ॥ ఆతఁ ॥

తొరలకేల లోఁగేవే తొంగి తొంగేమి చూచేవే
తెరయెత్తి యీతఁడు నీదిక్కు చూడఁగా
సరితేమి వెనఁగేవే చన్నులేల మూసేవే
సరసముల నతని సాదించవలదా ॥ ఆతఁ ॥

మొక్కులేల మొక్కేవే ముసుఁగేల పెట్టేవే
వొక్కటై శ్రీవేంకటేశుఁ డొడివట్టఁగా
గక్కన నెంత మెచ్చేవే కాఁగిట నెంత మించేవే
ఇక్కువలంటి నీగోర నెచ్చరించవలదా ॥ ఆతఁ ॥ 77

## వరాళి

నే నెదుట నున్నదాన యీ చేఁతలూఁ జూచేఁగాక
వీనులారా నీగుణాలు వినేఁగాని ‖ పల్లవి ‖

వంతువెట్టుక మగని వలపించవలెఁ గాక
[redacted] పంతాలు సవతులతోఁ బలుకనేలే
యింతే కలితే నతని నీయింటికి రప్పించుకోవే
కాంతవు నీపగటెల్లాఁ గానవచ్చీఁ గాని ‖ నేనె ‖

సరుస నుండి యతని జట్టిగొనవలెఁగాక
పరివారితోనేలే సాదింపులు
నెరవాదివైతేను మరుపుకోవలెఁగాక
తెరవ నీనేరుపెల్లాఁ దేటపడీఁ గాని ‖ నేనె ‖

ప్రేమ శ్రీవేంకటేశుతోఁ బెనగఁగవలెఁగాక
యేమిటికే తమికించ యేరాండ్లతో
మోము చూడవే ఇతనిమంద్రై నన్ను నీతఁడేలె
లేమవు నీకోరికలు లెక్కకెక్కీఁ గాని ‖ నేనె ‖ 78

## రామక్రియ

ఇంతట మన్నించరాదా యేమయ్యా
వింతసేయ కిఁకనైనా విచ్చేయవయ్యా ‖ పల్లవి ‖

వేడుకతో వచ్చేవంటా వెలఁది గాచుకున్నది
యీడ నేమిసేసేవు యేమయ్యా
యేడలేని పనులును యెన్నైనాఁ గలవు నీకు
వీడె మందుకొందువు విచ్చేయవయ్యా ‖ ఇంత ‖

అందందే చెలులనెల్లా నంపె నిన్నుఁ బిలువఁగ
యెందాఁకా నవ్వులు నవ్వే వేమయ్యా
సందడిఁ గొలువుసేసే సతులు దరచు నీకు
విందారగింతువుగాని విచ్చేయవయ్యా ॥ ఇంత ॥

మనసు నీపై నిలిపి మరిగి యెదురుచూచీ
యెనయరాదా యిట్టె యేమయ్యా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి వింటిలోన
వినయము చేకొందువు విచ్చేయవయ్యా ॥ ఇంత ॥ 79

రేకు 1815 ముఖారి

మేలుమేలే నిన్నుఁ జూచి మెచ్చితి నేను
నాలాగు లింతకంటె నన్నుఁ జూడు మిఁకను ॥ పల్లవి ॥

చన్నులను దాఁపురాలు సరసాన గాఁపురాలు
పన్నుక యెంతసేసేవే పతితోను
కన్నులను జాగరాలు కాఁగిటికి వేగిరాలు
చిన్నదాన వెంతేసి నేర్చితివే నీవు ॥ మేలు ॥

చెలులతో మంతనాలు చేసన్నల బొంతనాలు
వెలయించే వేమిటికే విభునివొద్ద
కలసేటి కారణాలు పులకల దోరణాలు
కలగె నీకత లెట్టు గడిఇంచుకొంటివే ॥ మేలు ॥

చదురుల బిత్తరాలు సమరతి తత్తరాలు
వెదచల్లేవవునే శ్రీవేంకటేశుతో
వుదుటుల పోతరాలు వుడివోని కాతరాలు
అదన నన్నియు నీకు నమరెనే నేఁడు ॥ మేలు ॥ 80

## మాళవిగౌళ

ఎట్టినోము నోఁచితివో ఇదివో నీభాగ్యము
చుట్టరికము లెల్లాను చూపవమ్మా ॥ పల్లవి ॥

యెంతబత్తో నీమీఁద నింటికి వచ్చె నతఁడు
చెంతనుండి వూడిగాలు సేయవమ్మా
వంతుకు నీమీఁద నిదె వలపులు చల్లీని
వింతలు సేయక ఇఁక విడెమియ్యవమ్మా ॥ ఎట్టి ॥

యేమివేడుకోకాని యేకతాలు నీతో నాడి
వేమారు సుద్దులడిగీ వినవమ్మా
దోమటిఁ బాదాలు నీతొడలపైఁ జాఁచీని
మోము చూచి వేఁడుకతో మొక్కవమ్మా ॥ ఎట్టి ॥

యేరీతిమన్ననో నేఁడు ఇన్ని చందముల నేలె
చేరి ఇచ్చకములెల్లాఁ జేయవమ్మా
గారవించి నిన్ను శ్రీవేంకటేశుఁడు గరుణించె
కూరిమి నిటువలెనే కూడివుండవమ్మా ॥ ఎట్టి ॥ 81

## ఆహిరి

చెలియున్నచందమైతేఁ జెప్పఁగరాదు
నెలకొని యెట్లా మన్నించేవో కాని ॥ పల్లవి ॥

వేమారు చెలిసుద్దులు విన్నపాలు సేయఁగాను
యేమని వున్నదో చిత్త మెఱఁగమయ్యా
కామిని యంపినయట్టి కానుక నీకిచ్చితిమి
చేముట్టి కైకొంటి వేమిసేసేవో కాని ॥ చెలి ॥

సతికడకు రమ్మని సారె నిన్నుఁ బిలువఁగా
ఇతవు నీకెట్టున్నదో యెఱఁగమయ్యా
అతివమొక్కులు నీకు నప్పగించితి మాపె -
కతలూ వింటి వెప్పుడు గలసేవో కాని ॥ చెలి ॥

గుట్టుతోడ నింతికిఁగాఁ గొచ్చికొచ్చి కొసరఁగా
యెట్టున్నదో నీయెన్నిక యెఱఁగమయ్యా
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
చుట్టమ నైతివి యెంత చొక్కేవో కాని ॥ చెలి ॥ 82

## దేశాక్షి

చిత్తమెఱఁగక లోలో సిగ్గుతోడ నున్నదాన
హత్తి నాకు నన్నిటికి నప్పణియ్యవయ్యా ॥ పల్లవి ॥

సందడించి నీతోను సరసములాడఁగాను
అందరిలో మందెమేళ మనవుగదా
చెందినవూడిగాలు నీకుఁ జెలరేఁగి సేయఁగాను
యెందుకో లాచీనని యెంచవుగదా ॥ చిత్త ॥

గుట్టుతోడ నేపొద్దు కొలువులు సేయఁగాను
అట్టె వలపించవచ్చె ననవుగదా
చుట్టి చుట్టి నీతోను సుద్దులెల్లాఁ జెప్పఁగాను
బట్టబయ లీఁతలని భావించవు గదా ॥ చిత్త ॥

సరుస గూచుండి మోవిచవులు నిన్నడుగఁగా
అరుదంది యాసకత్తె ననవుగదా
ఇరవై నన్ను శ్రీవేంకటేశ ఇట్టె కూడితివి
వొరసితే చన్నులకు నొడ్డించుకోవుగదా ॥ చిత్త ॥ 83

## బౌళి

నీవే నేరుతువే నేరుపులన్నియుఁ జెలి
కైవస మాతని నింతగాఁ జేసుకొంటివే ॥ పల్లవి ॥

తలఁపులో మెలఁగితే తగులాయమౌఁగాక
చలములు సాదించితే చవిపుట్టీనా
చెలుములు సేసితేనే చెల్లుబడియౌఁగాక
బలుములు చూపితేను భావము గరఁగునా ॥ నీవే ॥

నవ్వులు నవ్వితేనే నాటుఁగాక ప్రియములు
రవ్వసేసితే సేవలు రతికెక్కీనా
వువ్విళ్ళూరఁ బెనఁగితే వొనరుఁగాక వేడుక
దవ్వులను మాఁటాడితే తనివయ్యీనా ॥ నీవే ॥

వినయమే సేసితేను విచ్చనవిడియౌఁగాక
మనసియ్యకుండితేను మర్మమంటీనా
యెనసెను శ్రీవేంకటేశుఁ డింతలో నిన్ను
ననుపింత గాకుండితే నమ్మిక ఇంతౌనా ॥ నీవే 84

## వరాళి

నే నిన్ను వద్దనేనా నెపాలు వేసేవు గాక
కానిపనే ఇది యేమి కైకొనఁగవలదా ॥ పల్లవి ॥

వనిత కూఁచిపట్టుక వావులెల్లాఁ జెప్పఁగాను
వినవద్దా నీకేల వెడసిగ్గులు
పెనఁగి విడెమియ్యఁగా ప్రేమ నందుకోవద్దా
పనిలేనియాచారాలు పచారించవలెనా ॥ నేని ॥

వుప్పిళ్ళూర బుజ్జగించి వొడఁబరచఁగా మెచ్చి
నవ్వవద్దా నీకేల నాలితనాలు
నివ్వటిల్లు సోబనాలు నెరపేది మేలు గాదా
జవ్వనితో చలములు సాదించవలెనా ॥నేని ॥

నెయ్యపుఁ జుట్టరికము నెరపఁగా నీవునట్టె
ఇయ్యకొనవద్దా నీకేల యెదురాడను
యియ్యెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నాకె -
నొయ్యనే నిన్ను బోదించు టుచితమే కాదా ॥ నేని ॥ 85

**రేకు 1816 ఆహిరి**

మరిగినచోటికి మఱచితనమే మేలు
తరవాతి పనులెల్లా తానెఱుఁగు ననరే పల్లవి ॥

తను నేమి దూరరాదు తమక మాపగరాదు
వినయాన మొక్కేనని విన్నవించరే
పెనఁగఁగరాదు మరి ప్రియము చెప్పకపోదు
తనర్పూపే మనసులో తలపోసే ననరే ॥ మరి ॥

వచ్చి కక్కసించరాదు వలపు నిలుపరాదు
ఇచ్చట నుతించేనని యెచ్చరించరే
కొచ్చి కోపగించరాదు కోరిక నుడువరాదు
నిచ్చాఁ దనకతలే వినేనని యనరే ॥ మరి ॥

చెనకరాదు చెనకి సిగ్గులు పడఁగరాదు
తనమేలు దాననని తలఁపించరే
యెనసి శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా వచ్చి నన్ను
తనిసితిఁ దా నాకు తగులాయ ననరే ॥ మరి ॥ 86

## రామక్రియ

ఇన్నిటా రట్టడివౌదు వెఱఁగుదు నీ జాడలు
మన్ననలు చేకొంటివి మచ్చికలు చల్లవే ॥ పల్లవి ॥

పంతా లాడవద్దుగాని పడఁతి విభునితోడ
చెంతనుండి విన్నపాలు సేసుకొనవే
వింతసేయవద్దుగాని వేడుకతో విడెమిచ్చి
సంతోసాలు రేఁచి మోవి చవిచూపవే ॥ ఇన్ని ॥

గబ్బితనా లొద్దుగాని కదిసి వినయముతో
వుబ్బురేఁ చూరక పాదాలొత్తఁగదవే
సిబ్బితింత వొద్దుగాని చెలరేఁగి పొందుచూపి
గుబ్బలనొత్తి వలపు గుమ్మరించవే ॥ ఇన్ని ॥

గయ్యాళించవొద్దుగాని కాఁగిట శ్రీవేంకటేశు -
నియ్యెడఁ బొదిగి కడునింపులు చూపవే
కొయ్యతనా లొద్దుగాని కూడె నిన్నితఁడు నేఁడె
వొయ్యనొయ్యనే నేరుపు లొనరించవే ॥ ఇన్ని ॥ 87

## బౌళి

ఎందాఁకా జూజాలాడే వింతులతోను
పొందెరిఁగి యీపెనిట్టె బుజ్జగించవలదా ॥ పల్లవి ॥

సొలసి చెలియ నిన్నుఁ జూచి చూచి వేసారె
వెలినుండి విరులను వేసి వేసారె
పలుమారు నీపదాలు పాడిపాడి వేసారె
కలికిఁ దలెత్తి చూచి కరుణించవలదా ॥ ఎందాఁ ॥

నవ్వుచు నీ యెదుట సన్నలు సేసి వేసారె
వువ్విళ్ళూరఁ గొనగోర నూఁది వేసారె
చివ్వనఁ బన్నీరు నీపైఁ జిమ్మి చిమ్మి వేసారె
జవ్వనితో మాఁటలాడి చనవియ్యవలదా ॥ ఎందాఁ ॥

సంగడి వచ్చి కూచుండి చన్నుల నొత్తి వేసారె
చెంగటఁ దొడపై తొడచేర్చి వేసారె
యింగితము శ్రీవేంకటేశ యెరిఁగి వచ్చి
అంగనఁ గూడితి వింకా నప్పటి రావలదా ॥ ఎందాఁ ॥ 88

## హిజ్జిజి

ఇంకనేలదాఁచేవే యెరిఁగిన పనులకు
పొంకపు సంతోసాలఁ బొదలేమే నేము ॥ పల్లవి ॥

సెలవుల నవ్వుదేరెఁ జెక్కులఁ జెమటగారె
తెలిగన్నులచూపులనుఁ దెల్లవారెను
వులివచ్చి మోవితేనె లువ్వుచు నువ్విళ్ళూరె
మలసి నీపతి నీతో మాఁటాడె నటవే ॥ ఇంక ॥

అట్టె తురుము వీడె నంగమెల్లా వసివాడె
దట్టపు సిగ్గులెల్లానుఁ దలకూడెను
రెట్టించి నిద్దురలదె రెప్పలనె యల్లాడె
నెట్టన నీరమణుఁడు నిన్నేలెనటవే ॥ ఇంక ॥

నీమైగురుతులు నిండె నిలువు నూరువండె
ఆము కాతనిసొమ్ము నీ కమరుండెను
యేమి నోము నోఁచితివో యిదివో నీపక్కఁబండె
ప్రేమ శ్రీవేంకటేశుఁడు పెండ్లాడెనటవే ॥ ఇంక ॥ 89

## సామంతం

వలపించఁబోయి నీవే వలచితివి
యిల నెంత జాణలకు నిట్టుండుఁ బనులు ॥ పల్లవి ॥

ఆఱడిఁ బెట్టి యాతని నాసలేల కొలిపేవే
జాఱుఁ గొప్పంతక చక్కఁ బెట్టవే
మీఱి మీఱి యప్పటిని మేలము లేమాడేవే
జోఱునఁ గారీఁ దుడుచుకొనవే చెమట ॥ వల ॥

మాఁటలఁ జొక్కించాతని మర్మమేల కరఁచేవే
గాఁటపు నీచీర లెస్స కట్టుకొనవే
నాఁటఁజూచి యాతని మనసెంత మరిగించేవే
పాటించి నీగుబ్బలపై పయ్యద గప్పుకోవే ॥ వల ॥

చేతులు చాఁచి యతని సిగ్గులేల వరచేవే
నీతలపులోని తమి నీవెంచుకోవే
యీతఁడే శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నునేలె
కాతరమేల రేఁచేవే కడుమోహించితివి ॥ వల ॥ 90

## పాడి

ఇతఁడు నామగఁడౌట యెఱఁగవటే
రతికెక్కఁ జెనకేవు రమణుని నిపుడే ॥ పల్లవి ॥

పొందులు చూపే వెదుటఁ బుకి(క్కి?)టఁ దమ్మదాపేవు
యిందుఁగాని యీపగటు యెరఁగరటే
కందువకు వచ్చేవు కానుకలు నిచ్చేవు
యిందరిలోనా నీకు నెంత పని గలదే ॥ ఇతఁ ॥

సారె సారెఁ బొలసేవు చనవుతో సొలసేవు
నేరుపు లిందునఁగాని నెగడవటే
మేరమీరి నవ్వేవు మేలములు దవ్వేవు
వూరకే వలపులెల్లా నుమ్మగిలీ నటవే ॥ ఇతఁ ॥

జిగ్గిచన్నులఁ గమ్మేవు చెమట గోరఁ జిమ్మేవు
తగులు నీకిందుఁగాని దాకొనదటే
నిగిడి శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నునేలె
మొగము చూచేవు నీకు మోహమెంత గలదే ॥ ఇతఁ ॥ 91

**రేకు 1817** **సామంతం**

ఇన్నిటా సంతోసమాయ నిటు మిమ్మిద్దరిఁ జూచి
మన్నించినమన్ననలే మంతుకెక్కె నిపుడు ॥ పల్లవి ॥

కలువ లెవ్వరిఁ గాఁడీ కంతుఁడెక్కడ నేసీ
నెలఁతను నీవు గరుణించితేఁ జాలు
చలువలే వేఁడియౌనా సతులకుఁ బతులకు
వలచినవలపులే వడిగొనీఁగాక ॥ ఇన్ని ॥

చందురుఁ డెవ్వరు నేఁచీ చల్లగాలేమి సాదించీ
ఇందువదనను నీవేలితేఁ జాలు
గందము మొగచాటౌనా కాయములఁ బూసితేను
పొందుసేసినపొందులే పోదిసేసీఁ గాక ॥ ఇన్ని ॥

తుమ్మిదల కేడపగ దూరనేల చిలుకల
కొమ్మ నీవూ నిట్లానే కూడితేఁ జాలు
యిమ్ముల శ్రీవేంకటేశ యిచ్చక మెరవులౌనా
నెమ్మిఁ గోరినకోరిక నెట్టుకొనీఁగాక ॥ ఇన్ని ॥ 92

## పాడి

మేటి నేరుపరులాల మెలుఁతలాల
కూటము లిద్దరికినిఁ గూరుచరె యెపుడు ॥ పల్లవి ॥

చెప్పఁగానే నోరూరీ చెలువునిచేఁతలు
[1]చొప్పులెత్తెతని నాకుఁ జూపఁ గదరే
కుప్పవడీ గోరికలు గుణములు వింటేను
వొప్పుగాఁ బొందులు నాకు నొనరించరే ॥ మేటి ॥

వినవే వేడుకపుట్టీ విభుని చక్కఁదనాలు
అనువుగా నిద్దరి మాటాడించరే
మనసయ్యీ నాతనిమంచితనాలు చూడఁగా
యెనయఁగ నాతని నింటికిఁ దోడితేరే ॥ మేటి ॥

తలఁచఁగానే వచ్చె తానె శ్రీవేంకటేశుఁడు
తెలుపరే నామోహము దేవునికిని
తిలకించి చూచి ఇట్టె తిరముగాఁ బెండ్లాడె
కలకాలమును నన్నుఁ గరుణించుమనరే ॥ మేటి ॥ 93

## దేసాళం

నీవెఱఁగవా చెలియ నెరజాణ విన్నిటాను
వావిరి నేఁ జెప్పనేల వలపుజాడ లివి ॥ పల్లవి ॥

వినయము గలిగితే వేడుకలు సమకూరు
మనసెనసితేను ప్రేమము వుట్టును
ననుపు గలిగితేను నాఁటుకొను మోహము
వనితకుఁ బతికిని వలపుజాడ లివి ॥ నీవె ॥

---

1. చొప్పులెత్తి + అతని

వోరుపు గలిగితేనే వొనరుఁ జుట్టరికాలు
నేరుపే కలిగితేను నేస్తమీడేరు
కూరిమి గలిగితేను కొనసాగు భోగములు
వారక యెవ్వరికైనా వలపుజాడ లివి ॥ నీవె ॥

యిచ్చకము గలిగితే నింపులెల్లా నిండుకొను
ముచ్చట లొనరితేను ముదమలరు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనె
వచ్చి యిదె వున్నాఁడు మీవలపుజాడ లివి ॥ నీవె ॥ 94

## ధన్నాసి

కంకణము గట్టితివి కాంత నీకు దేవులాయ
ఇంక నిట్టె వుండరయ్య ఇది మా విన్నపము ॥ పల్లవి ॥

దయతో మన్నించవయ్యా తరుణి నీకెప్పుడును
ప్రియురాలు సేసపాలపెండ్లికూఁతురు
నియతాన నేలవయ్యా నేరాలు వేయకువయ్య
నయగారి పాయరాని ననుపైనచుట్టము ॥ కంక ॥

కులశీలము గలది గుణవంతురాలు యీకె
నలినాక్షి నీకు మేనమఱఁదలు
తలఁపునఁ బెట్టవయ్య తగులు వాయకువయ్య
ఇలువరుసగలది యీడుజోడైనది ॥ కంక ॥

గరిమ నెల్లకాలము కాఁపురము సేయవయ్య
ఇరవైన జవరాలు ఇల్లాలు యీకె
మరిగి శ్రీవేంకటేశ మంచివేళఁ గూడితివి
తరుణి నీమీఁద సంతతభక్తి గలది ॥ కంక ॥ 95

## వరాళి

తరవాతి పనులెల్లాఁ దనచిత్తమే యెఱుఁగు
ఇరవై వున్నాఁడు తన కెచ్చరించేదేమే ॥ పల్లవి ॥

పిలువఁగాఁ బిలువఁగా ప్రియములు సమకూరు
తలఁచఁగాఁ దలఁచఁగా తమి వుట్టును
చలపట్టి వలెనంటే సాదించవచ్చువలపు
కొలఁదిమీరి తన్ను నేఁ గొసరేదేమే ॥ తర ॥

చెనకఁగాఁ జెనకఁగా చిత్తములు గరఁగును
పెనఁగఁగా బెనఁగఁగా బెరయుఁ (యుఁ?) బొందు
తనకే సమ్మతి యైతే తగులుఁ జుట్టరికము
వెనువెంటఁ దనకు నే విన్నవించేదేమే ॥ తర ॥

చూడఁగాఁ జూడఁగాను సురతకాంక్షలు వుట్టు
కూడఁగాఁ గూడఁగా గందుకొను ముదము
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నునేలె
జోడువాయ మిఁక మరి చొక్కించే దేమే ॥ తర ॥ 96

## బౌళి

ఎన్నేసి చేఁతలు చేసీ నీపె నీముందరను
సన్నలా చాయలా నీకు చవులు చూపీని ॥ పల్లవి ॥

అతివ నీమోము చూచీ నదె చిత్తగించవయ్య
కతచెప్పీ వినవయ్య కమ్మటి నీవు
తతెరిఁగి బత్తిసేసీ తగిలి చేకొనవయ్య
మతిలో నీ యాసోదము మరినెంతగలదో ॥ ఎన్నే ॥

పొలఁతి నీముందరను పొలసీ నదిగోవయ్య
కొలువులుసేసీఁ జే కొనవయ్యా
సెలవుల నవ్వీని చేరి చనవియ్యవయ్యా
తలకొన్న వలపులు తనకెంత గలదో ॥ ఎన్నే ॥

'దిసి కూచున్నది కాఁగిలించుకొనవయ్యా
వొదిగి రతుల నిట్టె బోగించవయ్యా
అదన నన్నేలితివి యన్నిటా శ్రీవేంకటేశ
పొదలిన యీపె తలపోఁత లెంతగలదో ॥ ఎన్నే ॥ 97

**రేకు 1818 కాంబోది**

ఒరపు నేరుతువే వోయమ్మా
సరగున నతని నాసలఁబెట్టేవే ॥ పల్లవి ॥

కలువకన్నులను కాఁటుకలొలుకఁగ
సొలసి యెంత పతిఁ జూచేవే
సెలవులఁ జిందేటిచిరునవ్వులతో
పలుకు లెంతవడి పచరించేవే ॥ ఒర ॥

శిరసుపై నెరులు చెంపల జారఁగ
సరసము లెందాఁక జరపేవే
అరిమురి గళబెళమను పయ్యెదతో
విరుల నే లతని వేసేవే ॥ ఒర ॥

చనుమొనలఁ జెమట జడిగొని వడియఁగ
వొనరఁ బాదము లెట్లొత్తేవే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నను నిదె
పెనఁగుచు నాతని బెరసేవానే ॥ ఒర ॥ 98

## తెలుఁగుఁగాంబోది

ఏమిసేతు నమ్మలాల యిదివో నాచందము
వేమరు నాతని కిట్టె విన్నవించరే ॥ పల్లవి ॥

చెలరేఁగీఁ బులకలు చిగిరించీఁ గోరికలు
తలఁపులో నాతనిఁ దలఁచితేను
నిలువెల్లాఁ జెమరించీ నెట్టుకొనీఁ దమకము
చెలులచే నాతనిచేఁతలు వింటేను ॥ ఏమి ॥

నిరతిఁ గరఁగీ మతి నిట్టూర్పు లెచ్చీ ముక్కున
బెరయ నాతని నిట్టె పేరుకొంటేను
వెరగు లుప్పతిల్లీ వెక్కసమయ్యీ నాసలు
తిరిగి యాతనియింటి దిక్కు చూచితేను ॥ ఏమి ॥

పచ్చిదేరీఁ జెనకులు పైకొనీ సెలవినవ్వు
మెచ్చి యాతనిసొమ్ములు మేనఁ బెట్టితే
యిచ్చటికి వచ్చి నిన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
మచ్చికతో వేడుకయ్యీ మంతనాన నుంటేను ॥ ఏమి ॥ 99

## వరాళి

ఇప్పుడే కంటిమి నేఁడు యీకొత్తలు
కుప్పలుఁ దెప్పలునాయ గురుతు లన్నియును ॥ పల్లవి ॥

ముప్పిరి నీ సెలవుల ముదురువెన్నెలగాసీ
చొప్పుగా మోవిమీఁదఁ జుక్కలు గాసీ
కొప్పున నుండి మెల్లనె కురిసీఁ బువ్వులవాన
చెప్పవే నీకతలెల్లా సిగ్గులేల ఇఁకను ॥ ఇప్పు ॥

జిగిఁ జన్నుగొండలపై సెలయేరులు వారీ
మొగముపై జారిజారి మొయిలువారీని
మిగులాఁ జెక్కులమీఁద మెరుఁగుఁగళలు మించీ
తగ నాకు సూచించవే తలవంచనేఁటికి ॥ ఇప్పు ॥

మఱి నీకనుఁగొనల మాణికము లుప్పతిలీ
వుఱక మై జాజినన లుప్పతిలీని
జఱసి శ్రీవేంకటేశ్వరుఁడు నిన్నేలఁబోలు
యెఱిఁగించవే నాకు నిట్టె సంతోసించేను ॥ ఇప్పు ॥ 100

## ముఖారి

నీవుగలచోటనే యన్నియుఁ గలవు
చేవదేరీ నీమేన సింగారాలన్నియును ॥ పల్లవి ॥

నిమ్మపండు కానుకగా నీవేమి ఇచ్చేవే చెలి
నిమ్మపండ్లంతలే కావా నీ చన్నులు
తమ్మిపువ్వులెల్లాను తలనేలముడిచేవే
తమ్మిపువ్వులే నీహస్తములు గావా ॥ నీవు ॥

చిలుక ముంజేతఁబట్టి చేరి పలికించనేలే
చిలుకపలుకే కాదా చెలి నీమాఁట
కొలువు సేసేవేమే కోరి వేఁడినంగజాని
కొలువుకూటమే కాదా కొమ్మరో నీ కాఁగిలి ॥ నీవు ॥

చిగురుల నేల వేసేవే నీవు పలుమారు
చిగురువంటిదే కాదా చెలి నీమేను
జిగి నన్నుఁ గూడేవేమే శ్రీవేంకటేశుఁడనని
జిగిబిగి పొందులే మంచి కూటమి గాదా ॥ నీవు ॥ 101

## భైరవి

చిత్తగించవయ్యా యేమి సిగ్గులు వడేవు నీవు
తత్తరించీఁ దమకము తప్పితప్పి యిపుడు ॥ పల్లవి ॥

పువ్వువంటి జవ్వనము పొలఁతి మేనఁ బెట్టుక
వుప్పిళ్ళూరీ నీయెదుట నుండి యిదివో
నవ్వులు సెలవులను నానవేసి నానవేసి
కువ్వవోసీ వలపులు గురుతుమాటలను ॥ చిత్త ॥

కడలేని కాంక్షలను కన్నులలో నించుక
పడఁతి నీమోము చూచీఁ బలుమారును
గుడిగొన్నసరసాలు కొనగోర నించి నించి
చిడుముడి మూటగట్టీ చిమ్ముఁ జెనకులను ॥ చిత్త ॥

కందువైన రతులెల్లా కాఁగిటలో నిలుపుక
చిందీ మోవితేనెలు చేరి నీవద్ద
పొంది శ్రీవేంకటేశ భోగములఁ గూడికూడి
అందిచ్చీ నీకు సంతోసా లాసలాసలను ॥ చిత్త ॥ 102

## గౌళ

ఇల్లాలికిఁ దగునటే యింతరట్టడితనము
వొల్లనే మితిమేరతో నొనగూడవలదా ॥ పల్లవి ॥

రవ్వలుగా నవ్వేవు రతికిట్టె లాచేవు
చివ్వన పతిముందర సిగ్గువడవు
వుప్పిళ్ళూరఁ జన్నులను వూఁదేవాతని వీఁపున
ఇవ్వలఁ గొంచించవు యెంత మందెమేళమే ॥ ఇల్లా ॥

తప్పక మోము చూచేవు తగుల మాటాడేవు
కుప్పళించేవు మోహము గుట్టెరఁగవు
ముప్పిరి నేడనైనాను మోవితేనె లడిగేవు
చెప్పరాదే వెరగయ్యీ చెల్లఁబో నీ పగటు ॥ ఇల్లా ॥

త్రొక్కే వాతని పాదము దోమటికిఁ బెనఁగేవు
తక్క వాతని ఘనత దలఁచుకోవు
యిక్కడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
చక్కఁ జూడవే నీవు జాణవౌదు విపుడు ॥ ఇల్లా ॥ 103

**రేకు 1819 పళవంజరం**

ఎంతబిత్తరాలు యిది యేమిచెప్పేది
కాంతుఁడవు నీవు నాకుఁ గలిగివున్నాఁడవు ॥ పల్లవి ॥

కూరిములు నీమీఁద గుప్పలు వోసిపోసి
తూరుపెత్తి పోలిచుట్టీఁ దోడుతోడనె
నేరుపునఁ జెమటతో నిలువుఁగొలువునేసి
వూరఁబోసీఁ దమకము లుబ్బరితనానను ॥ ఎంత ॥

మంతనాన నీతోను మాటలెల్లా నాడి యాడి
దొంతిఁబెట్టీ వలపులు తోడుతోడనె
సంతోసాన నీవద్ద సారెకు నవ్వులెల్లాను
సంతఁబెట్టి యమ్మఁజూపి చవులు సేసీని ॥ ఎంత ॥

వొడ్డారాన జన్నుల నిన్నొత్తి పైపైఁ గూడి కూడి
దొడ్డిఁ బెట్టీ వలపులు తోడు తోడనె
జిడ్డుదేర మోవి యాని శ్రీవేంకటేశ మెప్పించె
వడ్డిగొనీ మన్ననల వనిత ని న్నిపుడు ॥ ఎంత ॥ 104

## శ్రీరాగం

కంటిమే నీయందు నేఁడు కన్నుల పండుగగాను
పెంటలైన సంతోసాలు పెనగొనీ నీకును ॥ పల్లవి ॥

కలికితనాల మంచికనుఁగొనచూపులు
సెలవినవ్వులలోని చిరిసిగ్గులు
బలుచన్నులమీఁది పయ్యెదజారులును
వలపుఁదేనెమోవి వసివాడులు ॥ కంటి ॥

సమ్మతించ నాడేటి సణఁగులమాటలు
చెమ్మఁ జెమటలలోని చే సన్నలు
వుమ్మగిలేవూరుపుల వుబ్బరిమోము కళలు
తమ్మల పుక్కిళ్ళ తరితీపులు ॥ కంటి ॥

గుట్టుతోనే వెదచల్లే కొసరుల సళుపులు
దట్టమైన యాసల తమకముటు
యిట్టె శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గూడఁగాను
నెట్టుకొనె రతులలో నేరుపుల సిరుల ॥కంటి॥ 105

## సౌరాష్ట్రం

తానూ సవతినంటా తారుకాణకేల వచ్చీ
మానుమనరే యెమ్మెలు మదిరాక్షులాల ॥ పల్లవి ॥

చెప్పరాని మాటలు చెవియొగ్గి వినరాదు
పిప్పిలోనిరసములు పిండుకోరాదు
వుప్పాఁ జప్పాగాని చవులుట్టిఁ బెట్టుకొనరాదు
చెప్పరే యాపెకు బుద్ధి చెలియలాల ॥ తానూ ॥

వలవని వలపులు వంచి వొడిఁగట్టరాదు
పిలువని పేరఁటము పెనచరాదు
మొలవనిమొలకలు మోపులు గట్టఁగరాదు
తెలుపరే యీవిధము తెరవలాల ॥ తానా ॥

ఆఁపరానికోరికలు అంగడిఁ బెట్టఁగరాదు
చూపరాని గుఱుతులు చూడఁగరాదు
యేపున శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
మాపొందులు వొగడరే మగువలాల ॥ తానా ॥ 106

## హిందోళవసంతం

పోలిచితే నీబాగులు పొద్దొక వింతలాయ
మేలు మేలు నిన్నుఁ జూచి మెచ్చేరే నీ చెలులు ॥ పల్లవి ॥

ముచ్చటలాడీఁ దుమ్మిదమూఁకలు నీనొసలిపై
రచ్చకెక్కీ జక్కవలు రాసీ నక్కున
పచ్చిదేరీఁ జిగురాకు పలుకులవాతెరను
గచ్చులనీసింగారాలు కతలాయఁగదవే ॥ పోలి ॥

వెన్నెలలుగాసీని వేడుకనీసెలవుల
కన్నులఁ జకోరా లేకతమాడీని
మిన్నక జాజితీగె మేకొనుచు నవలొత్తి
కన్నెరో సింగారాలు కతలాయఁగదవే ॥ పోలి ॥

నెట్టుకొని చలిగాలి నిగిడీ నీముక్కునను
తొట్టీ నీపై వెరగులు తోడు తోడనె
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
గట్టిగ నీసింగారాలు కతలాయఁగదవే ॥ పోలి ॥ 107

## మాళవిగౌళ

ఏమని పొగడవచ్చు నిద్దరి నీ నేరుపులు
ఆముకొన్న జాణతనా లమరు నీకెపుడు ॥ పల్లవి ॥

నాఁటుకొన నీవాడే నయగారితనముల -
మాఁటలకే వలచెను మగువ
చీటికి మాటికి నీవు చెందమ్మికన్నులఁ జూచే -
జూటరిచూపులకే చొక్కి మరిగినది ॥ ఏమ ॥

వుప్పిళ్ళూర నేపొద్దూ నీవుడివోని సెలవుల -
నవ్వులకే తగులాయ నలినాక్షి
రవ్వలుగాఁ జెక్కు నొక్కి రతివేళ నీవిచ్చేటి -
నివ్వటిల్లు మోవికే నిన్ను మరిగినది ॥ ఏమ ॥

హత్తి నీవు పాయలేక ఆసయిచ్చి లాలించే -
బత్తికే నీపాలఁ జిక్కి పడఁతి
యిత్తల శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
కొత్తగు నీచేఁతలకే కూడి మెచ్చినది ॥ ఏమ ॥ 108

## తెలుఁగుఁగాంబోది

ఎంత నీపై వలపో యెటువంటి కూటములో
వింత వింత వినోదాల విచారాల వెలసె ॥ పల్లవి ॥

గుట్టుతోడ నిన్నెదురుకానేటిపరాకున
గట్టిచన్నులఁ బయ్యెద గప్ప మఱచె
చుట్టి చుట్టి నీమొగము చూచేటి వేడుకను
అట్టె చెలిచేతియాకు అందుకోను మఱచె ॥ ఎంత ॥

మలసి నీతోడుతను మాఁటాడె తమకమున
తిలకము నొసలను దిద్ద మఱచె
నలువంక నీతోను నవ్వే నిబ్బరమున
తొలఁకుఁ జెక్కుఁజెమట దుడుచుకో మరచె ॥ ఎంత ॥

కందువకు నిన్నుఁ దీసి కాఁగిలించీయాసోదాన
ముందు ముందుగాఁ దలుపు ముయ్య మఱచె
యిందుముఖి శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
పంది(దె?)మాడి కొనగోరఁ బచ్చిసేయ మఱచె ॥ ఎంత ॥ 109

రేకు 1820 కన్నడగౌళ

పచ్చిదేరి జవ్వనము పరువము వచ్చె నీకు
విచ్చనవిడాయ నేఁడు వేరులు మరేఁటికే ॥ పల్లవి ॥

వలిపెపయ్యెదలోని వలుద చన్నులకాంతి
వెలికి నురికీఁ గదే వెలఁది
సెలవుల నిండుకొన్న చిరుతనవ్వులసిగ్గు
పులియఁ బెట్టకువే పొద్దుకుఁ బొద్దుకును ॥ పచ్చి ॥

రెప్పలమఱఁగునను రేఁగిన చింకచూపులు
వుప్పరా లెగసీఁగదే వువిదా
ముప్పిరిగొనీ సారె మోవిమీఁదఁబలుకులు
కుప్పలు వేయకువే కొసరులను ॥ పచ్చి ॥

మురిపెపుఁ బిరుదులు మొలనూలిగంటలతో
సురతము చాటీఁ గదే సుదతి
యిరవైన శ్రీ వేంకటేశుఁడ నే నన్నుఁ గూడి
వెరగులు వడకువే వెలసె నీపొందులు ॥ పచ్చి ॥ 110

## రామక్రియ

నేరుపరి తొల్లె చెలి నీవు నెరజాణవు
యేరుపర చింకాఁ గతలేల చెప్పేవయ్యా ॥ పల్లవి ॥

మాఁటలు నీవాడితేనే మన్నించేవని తెలిసె
నాఁట గోరనూఁదితేను నవ్వేవని తెలిసె
చోటిచ్చి రమ్మంటేనే చొక్కించేవని తెలిసె
యేఁటికి నాపెకు బత్తి యెంత చెప్పేవయ్యా ॥ నేరు ॥

కొనచూపులఁ జూచితే కూడేవని తెలిసె
ననిచి చెక్కునొక్కితే నమ్మించేవని తెలిసె
చెనకఁగానే నీచేఁతలన్నియుఁ దెలిసె
యెనసె నీతలఁపులు యేమి చెప్పేవయ్యా ॥ నేరు ॥

లలిఁ జెయివట్టితేనే లాలించేవని తెలిసె
మొలక చన్ను లంటితే మోహమంతయుఁ దెలిసె
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
యెలుగెత్తి నీవేడుక లెన్ని చెప్పేవయ్యా ॥ నేరు ॥ 111

## పాడి

పొలఁతులే వలపులపుట్టుగుల పొలములు
తెలియఁగ నెట్టువచ్చు దేవుఁడే యెఱుఁగును ॥ పల్లవి ॥

సొలపుఁగన్నులు మించుఁజూపులవిత్తనములు
లలి దంతములు నవ్వులమొలకలు
పలుచని పెదవులు పలుకుల చిగురులు
తళుకుఁ జెక్కులు సొంపుఁగళల మారాకులు ॥ పొలఁ ॥

బెరయుఁ జేతులు రతిఁ బెనగొనే తీగెలు
కరములు చేఁతల కంగపు విరులు
సరుస జన్నులు మంచి జవ్వనపుఁ గాయలు
సరవిఁ జక్కఁదనాల సంసారపు పంటలు ॥ పొలఁ ॥

కటిసొబగులు రతికాణాచి కణజాలు
కుటిలకుంతలాలే కొమ్మలబాగు
ఇటువలె శ్రీవేంకటేశ్వరుని వేడుకలు
విటవిటీ జనులందు వెలసె నీకతలు ॥ పొలఁ ॥ 112

## మాళవిగౌళ

చెప్పరాని ముచ్చటల చిన్నదానవు
ఇప్పుడిట్టె యిందరిలో నేమి నేర్చుకొంటివే ॥ పల్లవి ॥

తగులనాడే యట్టి తరితీపు మాఁటలు
చిగురుఁ బెదవిమీఁది చిరుసిగ్గులు
మొగము చూపులలోని ముప్పిరిగొనే నవ్వులు
ఇగురుఁబోఁడివి నీవు యెక్కడ నేర్చితివే ॥ చెప్ప ॥

పంతపు మాఁటల తోడి పచ్చి పచ్చి చేఁతలు
దొంతులు వేరిచేయట్టిదొరతనాలు
మంతనాన రేఁచేటి మఱుఁగుల సొలపులు
యెంతకెంత జవరాల వెట్టు నేర్చుకొంటివే ॥ చెప్ప ॥

తనివోని తమకపు తరితీపుఁ జెనకులు
వినయపు టిచ్చగింపు వేడుకలు
ఘనుఁడు శ్రీవేంకటకడపరాయనిఁ గూడి
యెనలేని సరసము లెందు నేర్చుకొంటివే ॥ చప్ప ॥ 113

## దేసాళం

ఎందాఁకా వట్టిజోలి యేల సేసేవు
కందువకు వచ్చితివి కరుణించు మిఁకను ॥ పల్లవి ॥

కొత్త కొత్త మాట లాడి కొమ్మ నీపదాలు వాడీ
చిత్తగించి వినవయ్య సిగ్గులేఁటికి
గుత్తపుగుబ్బలు చూపి గురుతు నీమై మోపీ
బత్తి,చేకొని యాపెనుఁ బైకొనఁగరాదా ॥ ఎందాఁ ॥

కన్నులఁ దప్పక చూచి కాఁపురములకు లాచీ
మన్నించి ఇంతటనైనా మాటాడరాదా
సన్నలనే మోవి ఇచ్చి సముకాన నిన్ను మెచ్చీ
చెన్నుమీరఁ గాఁపురాలు సేయఁగరాదా ॥ ఎందాఁ ॥

కూరిములు నీపై నించి గుట్టుతో రతికి బొంచీ
గారవించి వేడుకతోఁ గైకొనరాదా
చేరి నన్ను నేలితివి శ్రీవేంకటేశ్వర నేఁడు
నారుకొన నీపెతోడా నవ్వఁగరాదా ॥ ఎందాఁ ॥ 114

## భైరవి

ఇందులకే వెరగయ్యీ నిచ్చట నాకు
చెంది నాపై బత్తు వీడఁ జేసీనే తాను ॥ పల్లవి ॥

చెక్కులచెమటతోనే చెదరినకొప్పుతోనే
యెక్కడనుండి వచ్చీనే యిపుడు తాను
పుక్కిట తమ్మతోనే కొంత నిట్టూర్పులతోనే
ఇక్కువ లేలంటీనే యిదివో తాను ॥ ఇందు ॥

చిప్పిలుఁ గళలతోనే చిట్లుగందాలతోనే
తప్పక యేమి చూచినీ తగిలి తాను
కప్పినరెంటెముతోనే కరఁగుజవ్వాదితోనే
అప్పటి నన్నెంత చేరీ నదివో తాను ॥ ఇందు ॥

ఛిమ్ముఁ జెనకులతోనే చిగురుసిగ్గులతోనే
యెమ్మె లెట్టు చూపీనే యెదుటఁ దాను
అమ్మరో శ్రీవేంకటేశుఁ డట్టె వచ్చి నన్నుఁ గూడె
పిమ్మట నెన్ని చెప్పీనే ప్రియాలు తాను ॥ ఇందు ॥ 115

**రేకు 1821 ఆహిరి**

ఎదురుచూచీఁ జెలియఇంటి కిట్టె రారాదా
ఇదివో ఇక్కడ నీవు యేమి సేసేవయ్యా ॥ పల్లవి ॥

ప్రియములు చెప్పిచెప్పి పిలువనంపనే పట్టె
నయముతోఁ జెలియకు నాథుఁడ నిన్ను
దయవుట్ట మాటలాడి (డ?) తగుల నిందాఁకాఁ బట్టె
నియతాన నెప్పుడు మన్నించేవయ్యా ॥ ఎదు ॥

తమితోడ నీరూపు తలపోయనే పట్టె
మమకారాన సతికి మగఁడ నిన్ను
సముకానకు లేకలు సారె వ్రాయనే పట్టె
జమళిగూడి యెప్పుడు చనవిచ్చేవయ్యా ॥ ఎదు ॥

కాంతలతో నీగుణాలు కడుఁబొగడనే పట్టె
ఇంతికిని శ్రీవేంకటేశుఁడ నిన్ను
యింతలో నీకెఁ గూడితి వీడకే నీవు వచ్చి
వంతుతో దినము నిట్టె వరమియ్యవయ్యా ॥ ఎదు ॥ 116

## సాళంగం

బుద్ధిచెప్పేము నీకు పుట్టినయింటివారము
పొద్దువొద్దు మగనికి పొందులు మరుపవే ॥ పల్లవి ॥

గుత్తపు గుబ్బల నూఁది కొప్పు దువ్వవే పతి -
చిత్తమురా వేళగాచి సేవసేయవే
హత్తి ఇచ్చకపుమాఁట లాడి పైకోవే
కొత్తపెండ్లికూఁతుర యీగుణాలెఱుఁగుకోవే ॥ బుద్ధి ॥

వినయాలు చూపి చూపి వీడె మియ్యవే
ననుపులు సేసుకొని నవ్వు నవ్వవే
తనివారా భోగమిచ్చి తమిరేఁచవే
వొనరినకొమెరెవు వోజ నేరుచుకోవే ॥ బుద్ధి ॥

మోవితేనియ లొసఁగి మోము చూడవే
శ్రీవేంకటేశుఁ గూడి చెలగించవే
కైవసముగ మెలఁగి కాఁగిలించవే
యీవల నలమేల్మంగ విన్నీఁ దెలుసుకోవే ॥ బుద్ధి ॥ 117

## పాడి

అలమేలుమంగవు నీవొనే పతిఁ జేకొంటివి
నెలకొని యీచేఁతలు నీవే నేరుతువే ॥ పల్లవి ॥

మొగము చూడఁగానే ముంచుకొను నగవులు
నగఁగానే పెనగొని నాఁటుఁ దగులు
తగులఁగాఁ దగులఁగాఁ దమకము చిగిరించు
చిగిరింపునాసలు చిమ్మిరేఁచువలపు ॥ అల ॥

వలవఁగా వలవఁగా వడిఁబెట్టుఁ దలఁపులు
తలఁచఁగా నోరికబ్బు తానే పిలుపు
పిలువఁగాఁ బిలువఁగాఁ బెనలుఁగొనుఁజెలిమి
చెలిమిఁ గడుఁ జేయఁగా చెలరేఁగు మనసు ॥ అల ॥

మనసుపెట్టఁ బెట్టఁగా మల్లడిగొను ననుపు
ననుచఁగా ననుచఁగా నంటు లెనయు
యెనయఁగా శ్రీవేంకటేశుఁ డేలేగుట్టు గను
కనుఁగొనఁగానే చెంగలించు మొగము ॥ అల ॥ 118

## దేశాక్షి

వట్టిసిగ్గు లేఁటికి వద్దికి వచ్చె విభుఁడు
గట్టిగా నిద్దరు నిట్టె కాఁపురాలు సేయరే ॥ పల్లవి ॥

చెలిమి పెంచఁజొచ్చితే చేఁగలెక్కును
బలిమిఁ బైకొంటేను పంత మలరు
కలిమి నొనగూడితే కడఁగు నింపు
అలమి చొక్కించవే అదివో నీ మగఁడు ॥ వట్టి ॥

కలికితనాలవంకఁ గళ లుబ్బును
చిలికితే వలపులు చిమ్మిరేఁగును
పలికి బొంకకుండితే బాస లీడేరు
కొలికికిఁ దెచ్చి పతి గూడవే రతులను ॥ వట్టి ॥

కలసి మెలఁగితేను కరఁగు మతి
సొలసి మాటాడితేను సొంపు గలుగు
వలసి నీకాఁగిటిలో నలమేలు మంగ
వెలసీ నిదివో శ్రీవేంకటేశుఁడు ॥ వట్టి ॥ 119

## సింధురామక్రియ

ఎంత ఆసోదకాఁడవు యేమి చెప్పేది
బంతిఁబెట్టి తమకమే పచారించేవు ॥ పల్లవి ॥

చెంగలించి యాపె నీపై సేసపాలు చల్లఁగాను
యెంగిలి నామోవికి యేల లాచేవు
ముంగురు లంటి యప్పటి మొల్లలు ముడువఁగాను
సింగారించేనంటా నాపై చెయ్యేమి చాఁచేవు ॥ ఎంత ॥

కూరిమి గొసరి తాను కొంగవట్టి తియ్యఁగాను
యేరా నా చన్నులకు నీవే(కో)/కారేవు
గారవించి చెక్కు నొక్కి కమ్మటి వేఁడుకోఁగాను
నారుకొన నాతోను నవ్వులు నవ్వేవు ॥ ఎంత ॥

వొద్దిక నలమేల్మంగ వురమెక్కుకుండఁగాను
పెద్దరికమున నన్నుఁ బెండ్లాడేవు
సుద్దులు చెప్పుతా మరి చూపుల నిన్నుఁ జూడఁగా
అద్దుక శ్రీవేంకటేశ యట్టె నన్ను నేలేవు ॥ ఎంత ॥ 120

## దేపాళం

నీవెఱఁగవా బుద్ధి నీకు నేము చెప్పేదేమి
దేవులవు నీ విన్నిఁ దెలిసినవే ॥ పల్లవి ॥

యెగ్గులు పట్టఁగరాదు యేమాడినా బతితోను
కగ్గి యలుగఁగరాదు గబ్బితనాన
సిగ్గులు వడఁగరాదు చేరి కొంగువట్టితేను
వొగ్గి యిచ్చగించి వూరకుండవలెఁగాని ॥ నీవె ॥

పంతము లాడఁగరాదు బలిమిఁ బెనఁగితేను
వింతలు సేయఁగరాదు వెక్కసానను
చింతఁ దలవంచరాదు చెక్కునొక్కి వేఁడుకొంటే
సంతోసాన వలపు పైఁ జల్లవలెఁ గాని ॥ నీవె ॥

కసరులు చూపరాదు కాఁగిలించుకొంటేను
పొసఁగక యాఁపరాదు బూటకానను
యెసఁగి శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగవు
సుసరాన నిన్ను, నిక జొక్కవలెఁగాని ॥ నీవె ॥ 121

**రేకు 1822 శుద్ధవసంతం**

తరితీపు వలపుల తక్కరీఁడ
సిరులుఁ దొలఁకఁ బైపైఁ జెనకేవు నన్నును ॥ పల్లవి ॥

వులివచ్చిమాఁట లాడి వువిద విలువఁగానే
కలువల వేసేవేరా కమ్మటి నన్ను
అలరి ప్రియములెల్లా నాపె నీకుఁ జెప్పఁగానే
చెలిమిసేసి యిట్టే చేరేవు నన్నును ॥ తరి ॥

ముప్పిరిఁగొనఁగ నవ్వి మొక్కులాపె మొక్కఁగానే
తప్పక చూచేవేరా తగిలి నన్ను
చిప్పలుఁ గూరిమితోడ చేతికి విడెమియ్యఁగా
అప్పటి మోవితేనె లడిగేవు నన్నును ॥ తరి ॥

కచ్చుపెట్టి రతులకు గాచు కాపె వుండఁగానే
అచ్చముగఁ గూడేవేరా అంతలో నన్ను
కొచ్చి శ్రీవేంకటగిరి గోవిందుఁడవై యిద్దరి -
మచ్చికలకు లోనై మరిగేవు నన్నును ॥ తరి ॥ 122

### సాళంగనాట

అట్టి నెరవాదివి నీ వలమేలుమంగవు
నెట్టన నీరమణుఁడు నిన్ను మెచ్చీ నిందకు ॥ పల్లవి ॥

ఇయ్యకొంటే మాఁటలెల్లా నింపులై యుండు
నెయ్యముగలిగినట్టి నెలఁతలకు
వొయ్యనే విచారించితే నుపమ వుట్టు
యెయ్యెడా నలుకలేని యింతులకును ॥ అట్టి ॥

వున్నది నేమిసేసినా నొడఁబాటౌను
సన్నయెఱిఁగినయట్టి సతులకును
విన్నకన్న సేఁతలెల్లా వేడుకై తోఁచు
అన్నిటా నోరుపుగల యతివలకు ॥ అట్టి ॥

కందువఁ దెలిసితేఁ గరఁగు మతి
అంది వివేకముగల యాఁడువారికి
యిందరిలో శ్రీవేంకటేశుఁడు గూడె
పొందు లిట్టివి నీవంటి పొలఁతులకును ॥ అట్టి ॥ 123

### నాదరామక్రియ

అమ్మరో యెంతటి సాహసివే నీవు
కమ్మర నాతఁడే నిన్నుఁ గరుణించీఁ గాక ॥ పల్లవి ॥

వుడివోని వలపులు వొడిఁగట్టుకొని వుండి
జడియక పతినెంత జంకించేవే
చిడుముడిఁ దలఁబాలు శిరసుపైఁ బెట్టుకుండి
బడిబడి నతనితో పంతాలే లాడేవే ॥ అమ్మ ॥

గట్టిగా సీతమకము గాదెలఁ బోసుకువుండి
అట్టె బింకాన నెంత యద్దలించేవే
మట్టులేని కోరికలు మనసులోఁ బెట్టుకుండి
నెట్టన నాతనినేల నేరము లెంచేవే ॥ అమ్మ ॥

సమరతి జవ్వనము చన్నులపైఁ బెట్టుకుండి
కొమరెవు యిఁకనేల గుట్టుసేసేవే
అమర శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
తిమిరి యతని నెంత దిష్టించి చూచేవే ॥ అమ్మ ॥ 124

## ఆహిరి

విన్నవించరే యీమాఁట విభుఁడెదుట నున్నాఁడు
ఇన్నిటా నన్నాదరించె నేమనీనో ఇఁకను ॥ పల్లవి ॥

తెగరానిచోట్లను దీమసమే సంగతి
నగరానిచోట్లను నాలి సంగతి
మొగమోడే చోట్లను మోనములే సంగతి
తగవులఁ బెట్టేనా తన చిత్తమిఁకను ॥ విన్న ॥

పాయరానిచోట్లను పదరినిదే సంగతి
తోయరానిచోట్ల పొందులు సంగతి
ఆయము లంటుచోట్ల నంగవించుటే సంగతి
యీయెడఁ దనతో నేను యేమనేనే ఇఁకను ॥ విన్న ॥

సమ్మతించినచోట్ల సరిఁగూడుటే సంగతి
నమ్మి కైనచోట్లను నంటు సంగతి
ఇమ్ముల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
కమ్మి యెంత మన్నించినా గాదనేనా ఇఁకను ॥ విన్న ॥ 125

## శ్రీరాగం

అడుగవే చెలియా ఆతని నీవు
యెడయక తనతో నే నెగసక్కే లాడేనా ॥ పల్లవి ॥

యెందుండి వచ్చితివంటే యేల తలవంచీనే
కందె నీమోవి యంటేను కతలేమి చెప్పీనే
గందము చిట్లెనంటే కడునేల జంకించీనే
చిందీఁ జెమటలంటేను సిగ్గువడ నేఁటికే ॥ అడు ॥

కొప్పు జారెనంటేను కొచ్చి యేల నవ్వీనే
వుప్పతిలీఁ గళలంటే వురిమి యేల చూచీనే
కప్పుకొ నీమేనంటే కందువలేల దాఁచీనే
దప్పి యెంత గొంటివంటే తలపోఁతలేఁటికే ॥ అడు ॥

వింతవాస నేడదంటే వినయాలేల సేసీనే
సంతోసించే వేమియంటే సారె వేఁడుకొనీనేలే
ఇంతసేసి శ్రీవేంకటేశుఁడు నిన్నిటు గూడె
చింత నీకెందున్నదంటే చెక్కునొక్క నేఁటికే ॥ అడు ॥ 126

## గౌళ

ఏమీ తనకెంతచన వెన్నఁడూ లేమి
కామించి వచ్చీ వావులు గలపుకొంటాను ॥ పల్లవి ॥

చేరి చేరి వూడిగాలు సేసీ నాకె నీకు నేఁడు
నేరుపుతో సలిగెలు నెరపుకొంటా
సారెకుఁ దఱచుగాను సరసము లాడీని
పేరడి చుట్టరికము పెనచుకొంటాను ॥ ఏమీ ॥

మళ్ళి మళ్ళి వచ్చి నీతో మనవు లెల్లాఁ జెప్పి
మొల్లల తురుముతోడ మురుసుకొంటా
వెల్లవిరి నేపురేఁగి వికవికనవ్వీని
చెల్లుబడిఁ దరితీపుసేసుకొంటాను ॥ ఏమీ ॥

కొచ్చి కొచ్చి యాసోదాల కొనచూపులనుఁ జూచి
పెచ్చురేఁగీ గర్వములు పెంచుకొంటా
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తచ్చి నిన్ను తానూఁగూడి తగులుకొంటాను ॥ ఏమీ ॥ 127

**రేకు 1823** **గౌళ**

ఆతని మాఁటలోదాన వౌదువుగాక
నాతి నీ విభునితో నాలితనా లేఁటికే ॥ పల్లవి ॥

మంతనాన నిద్దరికి మనసు లొక్కటులైతే
పంతములాడఁగ మరి పనియేమే
వింతలుగా కాఁపురపు వేడుకలు వుట్టితేను
చింతతో చెక్కిటఁబెట్టే చెయ్యేఁటికే ॥ ఆత ॥

సులభాన బాయరాని చుట్టరిక మమరితే
పెలుచుగుంపెనలతో బిగువులేలే
మొలకనవ్వులతోడి ముచ్చట లబ్బితేను
చిలుకుఁ జూపులఁ జూచి సిగ్గువడ నేఁటికే ॥ ఆత ॥

గొనకొన్న కూటములు గొబ్బునఁ బొసఁగితేను
తనివోని తమకము దాఁచనేఁటికే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నిన్నింతలోనె
నినుపు మోనములతో నివ్వెరగులేఁటికే ॥ ఆత ॥ 128

## ద్రావిళభైరవి

ఏమినోము నోమితివే యింతకతొల్లి
కామించఁదగునే నీకు గక్కన నీవిభుఁడు ॥ పల్లవి ॥

వెలఁది నీమాఁటలు విన నింపులు
కలికితనాలు చెప్పఁగడుఁగొత్తలు
తలఁప నీవినయాలు తరితీఁపులు
వలవ,కెట్టుండునమ్మ వడి నీకు విభుఁడు ॥ ఏమి ॥

సూటి నీచక్కదనాలు చూడవేడుక
గాఁటపు నీ చూపులకు కరఁగు మతి
నీటు నీ సింగారమైతే విచ్చపండుగ
కూటమిగా కెట్టుండునే కూరిమి నీ విభుఁడు ॥ ఏమి ॥

నెక్కొన్న నీ చిరునవ్వు నిండువెన్నెల
చొక్కపు నీ మోవితీపు జుంటితేనె
యెక్కుడాయ నీ భావాలిట్టె కాఁగిటఁ
జిక్క కెట్లుండు నిఁక శ్రీవేంకటవిభుఁడు ॥ ఏమి ॥ 129

## పాళంగనాట

ఏమని పొగడవచ్చు నిట్టి మీ జాణతనాలు
భూమిలో చెల్లుబడై పొలుపొందుఁగాక ॥ పల్లవి ॥

చిత్తములో పాయరాని చెలిమి మొలచితేను
కొత్తలైన కోరికలు కొడిసాగును
బత్తితోడి వినయాలు పాదుకొని వుండితేను
పొత్తుల భోగములకుఁ బోది యెక్కును ॥ ఏమ ॥

కన్నులకు మోము చూచే కాంక్షలు గలిగితేను
తన్నుఁదానే మాఁటలాడఁ దమిరేఁగును
అన్నిటా మంచి గుణాలు యలవడి వుండితేను
యెన్నిన వేడుకలెల్లా నీడేరును ॥ ఏమ ॥

యీడు జోడైన మేనుల నింపులు వొడమితేను
తోడఁదోడ సరసాలు తుదముట్టును
కూడి శ్రీవేంకటేశుతోఁ గూరిమి నిట్టె వుండితే
పాడిపంతములు మీలో ఫలియించును ॥ ఏమ ॥ 130

## వరాళి

నీమీఁద బత్తిగలఁడు మీ రమణుఁడు
ఆముకొన్న చేఁతలు నీ కమరునే నేఁడు ॥ పల్లవి ॥

సెలవి నవ్వులముగ్గు చిప్పిలుగళలనిగ్గు
కలికి కన్నులకెంపు కాయముసొంపు
పలుకుదేనెలసోన పరగుఁ జెమటవాన
అలివేణి నీకు నిన్నీ నమరునే నేఁడు ॥ నీమీఁ ॥

ముక్కున అసురుసు మోహపు ముద్దుఁగొసరు
జక్కవ చన్నులతీరు సరాలపేరు
చెక్కిటి జవ్వాదిరంగు జీరేటిపయ్యెదకొంగు
అక్కరో నీసింగార మమరునే నేఁడు ॥ నీమీఁ ॥

కొప్పుపై ముత్తేలసేస గుబ్బతిలే యడియాస
వొప్పయిన తెరచాటు వుండేటి నీటు
ముప్పిరిఁ గాఁగిట నించి ముంచి శ్రీవేంకటగిరి -
యప్పఁడేలె నిన్ని నీకు నమరునే నేఁడు ॥ నీమీఁ ॥ 131

## సామంతం

సేయవే యాతనిసేవ చిత్తము రాను
యీయెడఁ గొంకంగనేలే యిల్లాండ్లకు ॥ పల్లవి ॥

చలములే వద్దుగాని సరసమెంతైనా మేలే
అలుకలే వద్దుగాని ఆసలెన్నియైనా మేలే
బలుములే వద్దుగాని పంతుమ లెన్నైనామేలే
నెలకొనవలచినవెలఁతలకు ॥ సేయ ॥

వాదించవద్దుగాని వాడిక లెన్నైనా మేలే
సోదించవద్దుగాని సొలపులెన్నైనా మేలే
బోదించవద్దుగాని పొరచి యెంతైనా మేలే
ఆదిగొని తమిగలయాఁడువారికి ॥ సేయ ॥

నెపములు వద్దుగాని నేరుపు లెన్నైనా మేలే
వుపములు వద్దుగాని వొద్దిక లెన్నైనా మేలే
ఇపుడే శ్రీవేంకటేశుఁడేలె నిన్ను నీవలనే
తపముసేసిన తరుణులకు ॥ సేయ ॥ 132

## నాదరామక్రియ

చెలియరో నీవెంత చేఁతలాఁడివే
వెలయ నిప్పుడే యెన్నివేసాలు సేసేవే ॥ పల్లవి ॥

పెదవితేనెల తీపు బెరయించి పతితోను
ముదము రెట్టించి యెంతమాఁటలాడేవే
కదలుఁ గన్నుల చూపు కడఁగించి రెప్పలను
వదల కెందాఁకాను వలపు చల్లేవే ॥ చెలి ॥

గొప్ప చన్నుల మెఱుఁగు గులికి యడియాసలు
వుప్పతిల నెంతేసివుబ్బు రేఁచేవే
ముప్పిరి నీలాల కొప్పు మురిపేలు చూపి చూపి
చొప్పులువేసి యెంత చొక్కులఁ బెట్టేవే ॥ చెలి ॥

చక్కని నీమొగమెత్తి సారెకు నయాలు నించి
పక్కన నవ్వుల నెంత భ్రమయించేవే
యిక్కడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
నిక్కి నిక్కి చూచి యేమి నివ్వెరగందేవే ॥ చెలి ॥ 133

రేకు 1824 ముఖారి

ఎంతచుట్టమోకాని యీపె నీకు
వింత వింతవేడుకల విందుచెప్పీ నీకును ॥ పల్లవి ॥

తొంగిచూచి యాకె నిన్నుఁ దొరలఁగ మాటలాడి
అంగన విలిచి వీడెమందుకొమ్మనీ
ముంగిట కప్పటి వచ్చి ముంజేయివట్టి తీసి
చెంగటఁ గూచుండఁ బెట్టి సేవలెల్లాఁ జేసెను ॥ ఎంత ॥

పన్నీరు చల్లిచల్లి పాదాలుగడిగి నీకు
చన్నులపై మొత్తుకొని సారెఁ బూజించీ
కన్నులనే మొక్కు మొక్కి కాఁగిట యాసలు చూపి
అన్నిటాఁ జెప్పరాని ప్రియములెల్లాఁ జెప్పెను ॥ ఎంత ॥

ఆరగించఁజేసి నీకు నండఁ బానుపు వరచి
కోరి బాగాలొసఁగి యాకులు చుట్టిచ్చీ
చేరి నీవు గూడఁగాను శ్రీవేంకటేశుఁడ నేఁడు
నేరుపులెల్లా మెరసి నిన్నిట్టె మెప్పించెను ॥ ఎంత ॥ 134

## పాడి

సిగ్గువడ దించుకంతా చెలులెల్లా నుండఁగాను
వెగ్గళించకుండా బుద్ది వేగమే చెప్పవయ్యా ॥ పల్లవి ॥

వింతలేక నీతోను వేమారు నవ్వీని
కాంత యిదెవ్వతెయ్యా గబ్బితనాన
చెంతనుండి వూడిగాలు సేయవచ్చీ నూరకైనా
ఇంతచేఁతలాఁడి నీకు నెట్టు గలిగెనయ్యా ॥ సిగ్గు ॥

చుట్టమువలెనే నీకు సుద్దులెల్లాఁ జెప్పీని
రట్టడి ఇదెవ్వతెయ్యా రాఁపుఁదనాన
వట్టివావులు సేసుక వలపు నీపైఁ జల్లీ
పుట్టుఁ గతకారి నీకెప్పుడు దొరకెనయ్యా ॥ సిగ్గు ॥

చలపట్టి నీతోను సంగాతాలు సేసీని
నెలఁత ఇదెవ్వతెయ్యా నీటుఁదనాన
కలసితి విటు నన్ను గక్కన శ్రీవేంకటేశ
యెలయింపు నయగారి యెట్టు నీకబ్బెనయ్యా ॥ సిగ్గు ॥ 135

## సామంతం

వెల్లవిరులాయ నేఁడు వేడుకనీచేఁతలెల్లా
యెల్లవారు సంతోసాన నిట్టె మెచ్చిరయ్యా ॥ పల్లవి ॥

ములువాఁడి చెనకులు మోవిమీఁద నుండగాఁనే
వలపేల దాఁచేవు వద్దివారితో
చెలపల చెమటలు చెక్కులపైఁ గారఁగానే
నెలకొన్న సిగ్గులు నీకేలయ్యా ॥ వెల్ల ॥

గుఱుతైన వెడజారు కొప్పున నుండఁగానే
మఱఁగేల పెట్టేవు మగువలకు
కఱఁగిన భావములు కన్నులలో నుండఁగానే
చిఱునవ్వుతోనేల చిమ్మిరేఁగేవయ్యా ॥ వెల్ల ॥

మునుకొన్న కళలెల్లా మోమునఁ దేరఁగానే
కను సన్నేల సేసేవు కడవారికి
యెనసితివి శ్రీవేంకటేశ మమ్ము నిక్కడనే
అనుమానములతోడి ఆన లేఁటికయ్యా ॥వెల్ల॥ 136

## లలిత

చిన్నదానవా నీవు సిగ్గులేల పెంచేవు
సన్నలనే మోవితేనె చవిచూపవమ్మా ॥ పల్లవి ॥

మొక్కేరు చెలులెల్లా మొగమెత్తి చూడవమ్మ
మక్కువ నీపతితోడ మాఁటాడవమ్మా
చక్కనిదాన వింతులచనవు చేకొనవమ్మ
పక్కన నీవాతనికి పాదాలొత్తమమ్మా ॥ చిన్న ॥

వేమారుఁ జేసె చెలుల విన్నపాలు వినవమ్మ
చేముట్టి విభునిసేవ సేయువమ్మా
మామండాటాలకు నీకు మన్నన లొసఁగవమ్మ
నాముదేర మగనితో నవ్వవమ్మా ॥ చిన్న ॥

భావించి నీచెలుల పంతము చెల్లించవమ్మ
శ్రీవేంకటేశుఁ డేలెఁ జెనకవమ్మ
కైవశమై యిందరికిఁ గాఁ గరుణించవమ్మ
నీవు నీవూఁ గూడి యిట్టె నెలకొనరమ్మా ॥చిన్న॥ 137

### మంగళకౌశిక

ఏమి సేసీనో విభుఁడు యెదురుచూచే నేను
ప్రేమపు సంతోసాలు పెనగొనీ నాకును ॥ పల్లవి ॥

మగఁడు దనతోడుత మాఁటలాడినట్టుండు
తగులు మనసులోనఁ దలపోసితే
నగినట్లనేవుండు నను పెట్టిదోకాని
ఇగిరించీఁ గోరికలు యేమిసేతునే ॥ ఏమి ॥

తమితో నొక్కొకమాఁటు తప్పక చూచినట్టుండు
మమత నాపతిమీఁద మరిఁ బెట్టితే
అమరివుండుఁ గాఁగిట నాస యెట్టిదో కాని
తిమిరించీ వేడుకలు దీని కేమి సేతునే ॥ ఏమి ॥

పానుపుపై నాతోను పరగ నవ్వినట్టుండు
మేను మేను సోఁకెనని మెదలించితే
అనుక శ్రీవేంకటేశుఁ డంతలో వచ్చి నన్నేలె
యీనిజ మిప్పుడే కంటి నింకా నేమిసేతునే ॥ ఏమి ॥ 138

### బౌళి

చెలిచిత్త మెఱఁగక చిమ్మిరేఁగే వింతేకాక
తలఁపు లిద్దరికిని తారుకాణే కాదా ॥ పల్లవి ॥

చూపుల సొలసి నిన్నుఁ జూచె నింతేకాక వేరే
కోపగించుకొనెనా కొమ్మ నీతోను
పూఁపునఁ బూఁచి పూఁచి పువ్వులు పైఁజల్లెఁగాక
మోపులు గట్టి వేసెనా ముప్పిరిఁ బంతాలు ॥ చెలి ॥

పొద్దువంక చూపి నీకు బొమ్మలార్చె నింతేకాక
అద్దలించివేసెనా యంగన నిన్ను
పెద్దరికాన నింటికిఁ బిలిచి పెనఁగెఁగాక
వుద్దండాలు సేసి నిన్ను వొడివట్టి తీసెనా ॥ చెలి ॥

తోదోపుల నీతొడపైఁ దొడ వేసె నింతేకాక
పాదము దాఁకించెనా పడఁతి నిన్ను
యీదెస శ్రీవేంకటేశ యెనయఁగా మెచ్చెఁగాక
నాదించి వినోదాలకు నవ్వించెనా నిన్నును ॥చెలి॥ 139

**రేకు 1825 సామంతం**

రావే చూతువుగాని రమణి నీభాగ్యమాయ
నీవిలాసా లితని నేఁ డింతసేసెనే ॥ పల్లవి ॥

కలికితనాల నీ కనుబొమ్మజంకెనలు
పిలిచేపెదవులపై ప్రియములు
సెలవులఁ జిందేటి చిరుసిగ్గునగవులు
వలపించి రమణుని వాకిటికిఁ దెచ్చెనే ॥ రావే ॥

మునుకొని సొలసే నీములువాఁడి చూపులు
ననుపులు దొలఁకేనున్నని మాఁటలు
పెనచిపెట్టిన నీ పెనుఁగొప్పు మురిపేలు
ఘనుఁడైన విభుని నీకైవసము సేసెనే ॥ రావే ॥

కావరపుఁ జెనకుల గయ్యాళి నీ చేఁతలు
తావులు గుబులుకొనే తను సోఁకులు
భావములు గరఁగించే పంతపు సరసములు
శ్రీవేంకటేశ్వరు నిన్నుఁ జిక్కించి కూడించెనే ॥ రావే ॥ 140

## పళవంజరం

తొలుత గుంపెన చూపి తోడనె ప్రియాలు చెప్పి
అలివేణిఁ గరుణించు మాఁపలేదు మనసు ॥ పల్లవి ॥

కాఁతాళించి చూచి నిన్నుఁ గమ్మటి వేఁడుకొనీని
యీఁతలు మోఁతలునాయ నింతి వలపు
బాఁతిపడి నిన్ను దూరి పాదాలకు మొక్కీని
చేఁతలకొలఁదిగావు చెలియపంతములు ॥ తొలు ॥

రాఁపుగ నిన్ను జంకించి రతికిఁ జేసన్నసేసీ
పూఁపలుఁబిందెలునాయ పొలఁతి యాస
యేపుల నిన్ను సొలసి ఇచ్చకములే సేసీ
మోపులకొలఁది గావు ముదిత నేరుపులు ॥ తొలు ॥

గండుమీరి నిన్ను నవ్వి కడువినయము సేసీ
కొండలుఁ గోట్లునాయ కొమ్మల కాఁగిలి
వుండిండి శ్రీవేంకటేశ వుబ్బురేఁచి మోవియానీ
బండ్లకొలఁది గావు భామ కాఁపురములు ॥ తొలు ॥ 141

## పాడి

నా కితఁడు మోహించి నావద్దనే వుండఁగాను
యీకడ నీవేఁకరేవు యెంతజాణతనము ॥ పల్లవి ॥

కచ్చుపెట్టుక పతికిఁ గంకణము గట్టవే
ముచ్చటదీరఁగ నీమోము చూపవే
నవిడితోవచ్చి వీడెము చేతికియ్యవే
ఇచ్చుట నచ్చుటనుండి యేమి దొంగచూచేవు ॥ నాకి ॥

అంతే బత్తిగలిగితే నన్నిసేవలుఁ జేయవే
మంతనాన కిటువచ్చి మాటలాడవే
వింతలుగా నవ్వు నవ్వి వేడుకలు చూపవే
జంతతనాన నందుండి సన్నలేమి సేసేవు ॥ నాకి ॥

అక్కరగలదానవు అక్కునఁ గట్టుకొనవే
చొక్కించి చుట్టరికము చూపఁగదవే
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
తక్కక యెందాఁకాను తగిలి మొక్కేవు ॥ నాకి ॥ 142

## శ్రీరాగం

నీకు మేలుది చెలియ నిను జరయ దెన్నఁడును
చేకొనుము విన్నపము సేసితిమి రతుల ॥ పల్లవి ॥

పంతంబులేమిటికి పతితోడ సతులకును
సంతసము రేఁచుసరసములుండఁగా
వింతవిరసములేల వెంగెంబు లేమిటికి
మంతనపురతులలో మచ్చికలె నేలు ॥ నీకు ॥

పొలయలుక లేమిటికి బొమ్మజంకెనలతో
[illegible]దగిన తరితీపు లమరు
పెలుచుగర్వములేల బిగియుచుఁ బెనఁగనేల
అలమి మెయిసోఁకు లడియాసలే తగులు ॥ నీకు ॥

మొనసి వొల్లములేల మొగమెదుటనే వుండి
తనిసి సిగ్గులతోడ దగులవలయు
యెనసితివి శ్రీవేంకటేశ యూజవరాలి
వినయములతో బెనఁగువేడుకలే సతము ॥ నీకు ॥ 143

## ఆహిరి

ఇదివో నామొగమోట మేమని చెప్పుదునమ్మ
కదిసి నాచేఁత లేమీఁ గాదనఁడే యతఁడు ॥ పల్లవి ॥

అప్పటికి నామాఁట లాడుదుఁగాని యతని
వుప్పతించి కోపగించనోపనే నేను
చెప్పరాని విరహాన జెంది కసరుదుఁగాని
తప్పులెన్ని సేసినాను తమకించఁజాలనే ॥ ఇది ॥

పొంతనుండి యెందుకైనా బొమ్మల జంకింతుఁగాని
అంతలో నాతని వీడనాడనోపనే
చింతతో రాకుండితేను చిట్టకాలు సేతుఁగాని
పంతము లందుకుఁగాను పచరించఁజాలనే ॥ ఇది ॥

వుండుండి యొక్కొకపరి వొట్టులు వెట్టుదుఁగాని
మెండొడ్డి తనమాటలు మీరనోపనే
దండిగా నన్నేలఁగాను తనయిచ్చనుందుఁగాని
అండనే శ్రీవేంకటేశు నలఇంచఁజాలనే ॥ ఇది ॥ 144

## లలిత

ఇప్పుడేల సిగ్గువడే వెరఁగనిదాని వలె
ముప్పిరిగొన నిందరిముందరా నీవు ॥ పల్లవి ॥

పెచ్చురేఁగి యేకతాన పెదవులు పిప్పిగట్ట
మచ్చిక నీతనితోను మాఁటలాడవా
వచ్చి వచ్చి లోలోనే వలపును చల్లి చల్లి
పచ్చిదేర నప్పటిని పకపక నవ్వవా ॥ ఇప్పు ॥

వేడుకతో మంచముపై వేవేలుచందాల
పీడెమిచ్చి మోవితేనె విందువెట్టవా
వాడికతోఁ గొసరుతా వాలికచూపులఁ జూచి
కూడఁబట్టి కాఁగిలించి కుచముల నొత్తవా ॥ ఇప్పు ॥

పరపుపై నీతనితో పచ్చిగాఁ బెనఁగుతాను
పొరలించి పొరలించి పొందుచూపవా
ఇరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్ను నేలె
సరుసకు వచ్చి నీవు సన్నలెల్లాఁ జేయవా ॥ ఇప్పు ॥ 145

## రేకు 1826 సాళంగం

అంతచక్కనివాఁడవు అన్నిటా జాణవు నీవు
సంతోసాన నుప్పొంగీ సారెకు నామనసు ॥ పల్లవి ॥

పొలసి నిన్నొకమారు పూఁచి తప్పక చూచితే
వలవక వుండుదురా వనితలు
నిలువున నెప్పుడైనా నీరూపు దలఁచుకొంటే
వులివచ్చి చెమటల నోలలాడకుందురా ॥ అంత ॥

సముకాన నీతోను సంగాతాలు సేసితే
తమకించకుండుదురా తరుణులు
జమళి మేనులు సోఁక సరసము లాడితేను
మమతల నిన్ను నిట్టె మరుగక వుండుదురా ॥ అంత ॥

యీడుజోడై నిన్నుఁ గూడి యెడవాయ కుండితే
వేడుకఁ జొక్కకుందురా వెలఁదులు
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యేడవారూ నీపొందుల కేఁకరకవుందురా ॥ అంత ॥ 146

## వరాళి

చెనకవే రమణునిఁ జేతులారాను
అనుమానించకు నిన్ను నన్నిటా మన్నించెను ॥ పల్లవి ॥

చెలిమే కలిగితేను చేవట్టి పెనఁగవచ్చు
సలిగే లోన (మ)రితేను సాదించవచ్చు
వలపు సతమైతేను వాడిక సేసుకోవచ్చు
నిలువుకు నిలువే నీకేలే సిగ్గులు ॥ చెన ॥

మనసులు గలసితే మాఁటలాడఁగవచ్చు
వినయము లితవైతే వేఁడుకోవచ్చు
చనవులు నిజమైతే సరసము లాడవచ్చు
యినుమడించెఁ దమక మిఁకనేలే సిగ్గులు ॥ చెన ॥

చుట్టరిక మబ్బితేను సొలసి చూడఁగవచ్చు
గుట్టిచ్చితే కాఁగిలించి కూడఁగవచ్చు
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనె
మట్టుమీరె సంతోసము మరియేలే సిగ్గులు ॥ చెన ॥ 147

## బౌళి

ఎప్పుడు మెచ్చేవోకాని యీకెను నీవు
చెప్పరాని గుట్టుతోడ చిమ్మిరేఁగీని ॥ పల్లవి ॥

చెక్కిటికి మరఁగుగా చేయివెట్టుకొని యింతి
మక్కువలు చూపి నీతో మాఁటలాడీని
పక్కనఁ జన్నులమీఁదఁ బయ్యదఁగప్పుకొంటాను
మిక్కిలి సిగ్గులు నీమీఁదఁ జల్లీని ॥ ఎప్ప ॥

కన్నులు దేలించుకొంటా కానుకలు నీకిచ్చి
వెన్నెలపోగులుగాను వెస నవ్వీని
పన్నుకొన్న బిగువుతో పాపట దువ్వుకొంటాను
వున్నతి నీపొందులకు నూరకె లాచీని ॥ ఎప్పు ॥

పట్టరాని తమితోడ పాదమున వా(వ్రా?)సుకొంటా
అట్టె నీకాఁగిటికి నాస సేసీని
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
పట్టుక తానిప్పుడే నీపాదా లొత్తీని ॥ ఎప్పు ॥ 148

## పాడి

మనసులోనే దేవుఁడున్నవాఁడు మరి వేఁడుకొంటే వరములిచ్చీని
వినయముతోడ నందరుఁగూడి విన్నపముచేసి మొక్కరే ॥పల్లవి ॥

కన్నెకు విభుఁడు మేలువాఁడై కదిసి నవ్వఁగఁగలిగితేను
వెన్నెలముగ్గులు దొక్కుదమనుచు వెలఁదులాలమొక్కరే
చన్నులమీఁదట నాతనిగోరు సతికి నాఁటించఁగలిగితేను
కొన్ననజాజిమొనలపైఁ దపము కొంకక సేయఁగ మొక్కరే ॥మన ॥

వెల్లవిరిగా నింతికి విరహవేదన మాని యతఁడు గూడితే
మల్లెలసేప్పెద్ద[1]కొండాలు [illegible]ఁగ మగువలాల మొక్కరే
బల్లిదుఁ డాతఁడు యీకెతో మాఁటపలుకు లాడఁగలిగితేను
చల్లఁగాఁ గ్రప్రపులప్పల నిట్టె వసంతము లాడఁగ మొక్కరే॥ మన ॥

మోమెత్తి యీతఁడు రమణిఁ జూచి మోహము చల్లఁగఁగలిగితేను
తామరపూవులఁ బూజసేయఁగ తరుణులాల మొక్కరే
గోమున శ్రీవేంకటేశుఁ డీట్లానే కూడి దోమట్లు గలయఁగలిగితే
భూమిలో తేనెలమోవి దొంతరబోనాలు వోయఁగ మొక్కరే ॥ మన ॥
149

1. కొండాలు =

## రామక్రియ

వాకిట నుండే యేమి యడిగేవు వలవని సుద్దులు
యేకతమాయను యింటిలోనికి యేలుదువు రావయ్యా ॥పల్లవి ॥

మగువవూసిన కుంకుమ దుమ్ములో మలసి సాములుసేసినఁగాక
పగటుతో చనుసంగడాలెత్తుచు బలిమి చూపినఁగాక
తగిలి జంకెనబొమ్మలవిండ్లఁ దాఁకఁగఁగురులు యేసినఁగాక
నిగిడి యాపెనేరుపు లూరక నీకు నింతలోఁ దెలుసునా ॥ వాకి ॥

సుదతి జవ్వనగరిడికి నెక్కి సారిది దాళాలు దొక్కినఁగాక
పెదవిమీఁదట గంటిదాఁకుదాఁకఁ బెనఁగినఁగాక
గుదిగొన నీకెసింగారపుమేనిగోఁత మురమునమోచినఁగాక
వుదుటున నీపె జాణతనములు వూరకె నీకుఁదెలుసునా ॥ వాకి ॥

ఇందుముఖి నిట్టె లాలించే మొక్కుల నెక్కుడుదండాలు దోసినఁగాక
పొందిపొంది జగజెట్టిరతులనుఁ బొరలినఁగాక
కందువ శ్రీవేంకటేశ మీరిద్దరు కాఁగిట నిట్టె గెలిచినఁగాక
చెందిన యీకె సేవలలోపలిచేఁత లూరకె తెలుసునా ॥ వాకి ॥ 150

**రేకు 1827** ముఖారి

కన్నెదానవైతేనేమి కాఁపురాలు సేసేవేళ
యెన్నేసి వేసాలు సేసే విదేమే నీవు ॥ పల్లవి ॥

శిరసేల వంచేవే శిగ్గులేల పెంచేవే
సరుస నీరమణుఁడు సారె నవ్వఁగా
పరాకేల సేసేవే భావమేల మూసేవే
మరిగి యాతఁడు నీపై చల్లఁగాను ॥ కన్నె ॥

చెక్కుచెయ్యేల పెట్టేవే చెలులనేల తిట్టేవే
మక్కువతో నీవిభుఁడు మాఁటలాడఁగా
చక్కఁగా నేమి చూచేవే చాఁచి గోరేమి రాచేవే
అక్కరతో యితఁడు నిన్నంటివేఁడుకోగాను ॥ కన్నె ॥

చన్నులేల కప్పేవే సణఁగులేల గుప్పేవే
అన్నిటా శ్రీవేంకటేశుఁ డాదరించఁగా
మిన్నకేల సొలసేవే మెచ్చియంత యలసేవే
మన్నించీతఁడు రతుల మతి చొక్కించఁగాను ॥ కన్నె ॥ 151

## వేళావళి

చుట్టి చుట్టి యారజము చూపనేలంటాఁగాక
నెట్టుకొన్నసతులెల్లా నీయంత నేరరా ॥ పల్లవి ॥

చిలికేవు కొంతగొంత చిరుసిగ్గు లూరకైనా
సలిపే వతనితోడ జాణతనాలు
కలపేవు వావులు కడనుండి యప్పటిని
యెలమి నీనేరుపులు యెంతచూపేవే ॥ చుట్టి ॥

నెరపేవు పలుమారు నీమురిపెము లెల్లాను
వొరసేవు చన్నులను వొద్దఁగూచుండి
గిరిపేవు కన్నులు జంకెనబొమ్మసన్నలతో
వరుసవెట్టుక యెంత వలపుచల్లేవే ॥ చుట్టి ॥

తనిపేవు నీకు నీకే తగిలి సరసమాడి
గునిసేవు ముద్దులు కొంగువట్టుక
యెనసె శ్రీవేంకటేశుఁ డీతఁ డింతలో నన్ను
పెనఁగి నీవింకా నెంత ప్రియము చెప్పేవే ॥ చుట్టి ॥ 152

## కాంబోది

వెలయఁ జేపట్టితివి విడువరా దీఁక నీకు
బలువుఁడవు గనక పంతమిదే సుమ్మీ ॥ పల్లవి ॥

మన్నించితి విన్నిటాను మచ్చికలు సేసితివి
వన్నెల నీకృప యిఁక వదలకుమీ
పిన్నదాన నెఱఁగను ప్రియములు చెప్పేను
యిన్నిటా బుద్దులు చెప్పి యేలుకొమ్మీ నన్నును ॥ వెల ॥

వలపించితివి నన్ను వాసితో నిలిపితివి
చెలిమి యిట్టె నడపఁ జిత్తగించుమీ
పలుకు లంతేసి నేర పదివేలకును మొక్కే
కలకాలమును కీర్తిగద్దుసుమ్మీ నీకును ॥ వెల ॥

చనవిచ్చితివి నాతో సరసము లాడితివి
మనవి చేకొని నన్ను మఱవకుమీ
యెనసితివి శ్రీవేంకటేశ నిన్నుఁ బొగడేను
దినము సంతోసము లందిచుమీ వేడుకను ॥ వెల ॥ 153

## ధన్నాసి

ఎట్టు వలపించితో యీపెను నీవు
నెట్టన నీవిన్నిటాను నెరజాణవయ్యా ॥ పల్లవి ॥

ననుపుసేసుక నీతో నవ్వులు నవ్వీఁ జెలి
పెనఁగి నీపైఁ గూరిమి పెంచీ నిట్టే
తనివోవ కప్పటిని తప్పక చూచీఁ దాను
యెనసె రతుల యాస యెంతోకాని ॥ ఎట్టు ॥

చేరి చేరి వినయాన సేవలు సేసీ నీకు
నేరుపులెల్లా చూపి నిన్నుఁ గొసరీ
సారెకు నీమీఁదను చల్లీఁ దమకములు
కూరి మెంత మూటగట్టుకొనీనో కాని ॥ ఎట్టు ॥

గాఁటపుగుబ్బల నొత్తి కాఁగిలించుకొనీ నిన్ను
మాఁటలే యడుగుతాను మతిఁజొక్కీని
యీఁటున శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
తేటల దానింకా నెంత తెలిపె (పీ?) నో కాని ॥ ఎట్టు ॥ 154

## సాళంగనాట

మా పంతము లీడేరెను మనసొక్కటాయ నీకు
దీపించె మీ వేడుకలు తేవే విడేలు ॥ పల్లవి ॥

తరుణి నీమతిలోని తలఁపులు దలకూడె
నిరతి నీపతివచ్చె నీ యింటికి
యిరవుగ నిదివో నిన్నిద్దరి గూరిచితిమి
పెరమాఁట లిఁకనేల పెట్టవే విడేలు ॥ మాపం ॥

భామ నీ నోమిన నోము ఫలము చేకూడెను
ప్రేమతో నిన్నీతఁడు పెండ్లాడెను
గోమునఁ బానుపుమీఁదఁ గూచుండఁబెట్టితిమి
యేమి మెచ్చే వెందాఁకాను యియ్యవే విడేలు ॥ మాపం ॥

కాంత నీ పిరుదులు కలవెల్లా నొనఁగూడె
యింతలో శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
మంతనాన మీలో మీకు మచ్చికలు సేసితిమి
సంతతము నిట్టె వొసఁగవే విడేలు ॥ మాపం ॥ 155

### లలిత

మగవాఁ డొకరిసొమ్మా మరఁగులేల పెట్టేవే
తగఁ బూగుత్తికి తుమ్మిదలు చేరవలదా ॥ పల్లవి ॥

కన్నులఁ బతిఁ జూచితేఁ గాఁగిలించినట్టయ్యీనా
మిన్నక యేఁటి కీకొడిమెలు గట్టేవే
సన్నలు సేసితేనే చాయలంటుకొనీనా
యెన్నేసి సణఁగులు నీవేల రాలిచేవే ॥ మగ ॥

ఒలాడినంతలోనే మనసు చిక్కుకొనీనా
చాటుతా నీవేల యెగసక్కేలాడేవే
తేటగాఁ గొలువుసేసితే వావిగలసీనా
గాటముగా నీవెంత గయ్యాళించేవే ॥ మగ ॥

అండఁ గూచున్నంతలోనే ఆయములు దాఁకీనా
వుండుండి నీవెంత యిందు వుప్పతించేవే
నిండుకొని శ్రీవేంకటనిలయుఁడు నన్నుఁ గూడె
చెందితోడ నీవేమి సాదించేవే ॥ మగ ॥ 156

**రేకు 1828** ### ఆహిరి

నిన్నే నమ్ముకున్నది నీకుఁ గంకణము గట్టి
అన్నీ నీవెఱుఁగుదువు ఆ(అ?) ననేల ఇఁకను ॥పల్లవి ॥

య నాపెమాఁటలు విన్నపము సేసితిమి
యెలమిఁ గానుకలూను నిచ్చితిమి
పిలిచి పేరుకొని ప్రియములు చెప్పితిమి
నెలఁతభాగ్యము మరి నీచిత్తమిఁకను ॥ నిన్నే ॥

నీ విచ్చిన నమ్మికలు నీకుఁ దలఁపించితిమి
వేవేలు చందాల నిన్ను వేఁడుకొంటిమి
చేవదేర నందరము చేతులెత్తి మొక్కితిమి
దేవులాయ నిన్ను నీవే తెలుసుకొమ్మిఁకను ॥ నిన్నే ॥

యిచ్చుటికి నిన్నుఁ దెచ్చి ఇద్దరిఁ గూరిచితిమి
కచ్చుపెట్టి సంతోసాలు కనుఁగొంటిమి
యిచ్చగించి యేలితివి యిన్నిటా శ్రీవేంకటేశ
మచ్చికాయ నింతి నిట్టె మన్నించు మిఁకను ॥ నిన్నే ॥ 157

## భల్లాటి

నేరుతువు చేఁతలెల్లా నెరజాణవవుదువు
చేరి యీతనికి నీవు సేవలెల్లాఁ జేయవే ॥ పల్లవి ॥

చిక్కనివెన్నెల లేల చిమ్మి కలయఁబెట్టేవే
రెక్కలపిట్టలనేల రేఁచఁజొచ్చేవే
చొక్కపు చిగురులేల చెక్కులపై నదిమేవే
తక్కక నీరమణుని దలయెత్తి చూడవే ॥ నేరు ॥

తుమ్మిదల నెందాఁకా తొరలఁ గూడపెట్టేవే
తమ్మిరేకుల నెంతేసి దండగట్టేవే
ముమ్మరముగా మేన ముత్తే లెంత గురిసేవే
నెమ్మదిఁ బతితో నోరు నిండా మాఁటలాడవే ॥ నేరు ॥

పూవక పూచిన చింతఁ బులుసేల వెదకేవే
కోవలికూఁతలనేల గొణఁగించేవే
యీవేళ నిన్నుఁగూడి ఇన్నిటాను మన్నించె
శ్రీవేంకటేశ్వరునిఁ జేరి మొక్కి మెచ్చవే ॥ నేరు ॥ 158

## గౌళ

పంతములే లాడేవే పతితోను
ఇంతంతని నీకతలు యెట్టు చెప్పవచ్చునే ॥ పల్లవి ॥

నగుతానే వచ్చి వచ్చి నాఁటుకొను వలపులు
మొగము చూడఁగానే ముంచును తమి
చిగురువలెఁ బొడమి చిమ్మిరేఁగు సరసాలు
మగువ యెట్టెరిఁగేమే మనసులో సుద్దులు ॥ పంత ॥

మాట మాట వాసులనే మరిగించుఁ గోరికలు
చీటికి మాటికి వచ్చు సెలవి నవ్వు
చాటి చెప్పి చెప్పి పొందు సాగఁజేయు ననుపులు
యీటువెట్టి మదరాగ మెంచ నెట్టువచ్చునే ॥ పంత ॥

యెదురెదురనే వుండి యెలయించు సింగారాలు
కదిసి పాయనియ్యవు కడురతులు
ఇదివో శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
పదివేలకు వయసు పట్టనెట్టువచ్చునే ॥ పంత ॥ 159

## బౌళి

ఏడలేని సిగ్గుతోడ నేల లోఁగేవు
యీడుజోడాయను మీకు నెప్పుడూఁ బాయకురే ॥ పల్లవి ॥

ఇచ్చగించి వింటేను ఇంపులౌను మాటలు
కొచ్చికొచ్చి కొసరితే కూరిమి నిండు
విచ్చన విడ్పితేను వేడుకలు సమకొను
మెచ్చుదాఁకాఁ బతితోను మేలములే యాడవే ॥ ఏడ ॥

నయమున నవ్వితేను నాఁటుకొను మోహము
ప్రియము చెప్పితే నంటు పెచ్చువెరుగు
ప్రియముట్టఁ జెనకితేఁ గెరలుఁదమకములు
నియతానఁ జొక్కుదాఁకా నేరుపులే చూపవే ॥ ఏడ ॥

మునుకొని పొదిగితే మొగమోట లుప్పతిలు
కనువిచ్చి చూడఁజూడ కరఁగుమతి
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నిన్ననేఁడు
తనివొందుదాఁకా నీతనితోఁ బెనగవే ॥ ఏడ ॥ 160

## శంకరాభరణం

ఏమనిచెప్పుదు మీకెవిలాసము
దోమటిసరసము దొంతరలాయ ॥ పల్లవి ॥

తీగెలుసాగీ తెఱవ యెలుంగుల
సోగమోమునను సొలపడరె
చేగలుదేరీ చెంగలిచూపుల
బాగుల రమణునిబాగ్యంబాయ ॥ ఏమ ॥

తేనెలుగారీ తియ్యనిమాఁటల
నానీ సెలవుల నవ్వులివె
వానలఁ జెమటలు వడిపీఁ జెక్కుల
వూనినవిభునికి నుచితంబాయ ॥ ఏమ ॥

ముప్పిరిఁదొలఁకీ మోవిరసంబులు
కొప్పులోన నవె కుసుమములు
యిప్పుడు శ్రీవేంకటేశుఁడు గూడఁగ
చొప్పుగ నితనికి సోబనమాయ ॥ ఏమ ॥ 161

## రామక్రియ

ఎవ్వరు బలులో చూత మిద్దరిలోనా
నివ్వటిల్ల నేరుపులు నేరుతువు నీవు ॥ పల్లవి ॥

పలుకులనే నిన్ను బయలీఁదించీఁ జెలి
కలికితనాల మతి గరఁగించీని
నిలువుఁగొలువుసేసి నిన్నుఁ గడునెలయించీ
కెలసి నీ వీపె నెట్టు గెలిచేవో కాని ॥ ఎవ్వ ॥

చుట్టరికాలనే నిన్నుఁ జొక్కులఁబెట్టీ జెలి
అట్టడిచేఁతల నిన్నాఆడిసేసీని
గుట్టుతో నవ్వులు నవ్వి కోరి నిన్నాసలముంచీ
యెట్టు నీ వీపెతోఁ బంతా లెక్కించేవో కాని ॥ ఎవ్వ ॥

అందపుఁజూపుల నిన్ను నాసలఁదేలించీఁ జెలి
సందడినే మోవి చూపి చవిరేఁచీని
విందువలె నన్నును శ్రీవేంకటేశ కూడితివి
మందలించి యీపె నెట్టు మరిపేవో కాని ॥ ఎవ్వ ॥ 162

రేకు 1829

## వసంతవరాళి

ఆతనవివద్ది కంపితే నన్ని గడించుకొంటివి
యీతలఁ జెప్పవే మాకు ఇఁకనేల దాఁచను ॥ పల్లవి ॥

వన్నెల నీమోవిమీఁదివసివా ళ్ళెక్కడివే
యెన్నరానిమోవికళ లెక్కడివే
సన్నపుఁ జెక్కులమీఁది జారుఁజెమ టెక్కడిదే
యెన్నఁడూ లేని గురుతు లిప్పుడిట్టె కంటిమి ॥ ఆత ॥

తేలింపుఁ జూపుఁ గన్నులతేట లివి యెక్కడివే
యేలాటపుచిరుసిగ్గు లెక్కడివే
నాలితనపు సెలవినవ్వు లివి యెక్కడివే
యీలీల నీగురుతు లిన్నీ నేఁడు గంటిమి ॥ ఆత ॥

పచ్చిదాలఁకేటి మేనిభావము లివెక్కడివే
హెచ్చిననీసంతోసము లెక్కడివే
యిచ్చటికి వచ్చి నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
యిచ్చకపు నీ గుఱుతు లివీఁగొన్ని గంటిమి ॥ ఆత ॥ 163

## మధ్యమావతి

మందెమేళ మింతయేలే మగనితోను
చెంది యిచ్చకములెల్లాఁ జేయవలెఁగాక ॥ పల్లవి ॥

చెంతనుండి రమణుఁడు చెప్పి చెప్పి పంపఁగాను
యెంత సింగారించుకొనే వెందాఁకానే
అంతేపో వోయమ్మ అద్దమేమి చూచేవే
దొంతివలపుల నీకెదురుచూచీ నతఁడు ॥ మందె ॥

సరసుఁడు మేడలెక్కి సన్నలెల్లాఁ జేయఁగాను
సరు లేమి దిద్దేవే సారె సారెకు
సరవెరఁగవు రాజసములనే పారలేవు
మరిగి నీతోడి పొందే మతిఁగోరీ నతఁడు ॥ మందె ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేవట్టి పెనఁగఁగా
మోవి నేమి మాఁటాడేవే మొక్కుమొక్కేవే
నీవు నాతఁడునుఁ గూడి నెమ్మది నిట్టె వుండితే
కైవసమై నీకెప్పుడూఁ గాణాచాయ నతఁడు ॥ మందె ॥ 164

## పాడి

ఇట్టుండవలదా ఇంపులును సొంపులును
చుట్టమై యీతనిమోమే చూచుకొంటా నున్నది ॥ పల్లవి ॥

మనసులో కరఁగులు మాటలలో మొరఁగులు
వనితకుఁ జూడరే చేవలుదేరీని
తనివోనికోరికలు తత్తరపుటీరికలు
పెనగొనీ బతిమీఁది ప్రియమెట్టిదో ॥ ఇట్టుం ॥

వీనులనే వినుకులు వెడగోరి చెనకులు
తానకమాయఁ జూడరే తరుణికిని
వూనియున్న మక్కువలు వొద్దనుండే ఇక్కువలు
నానఁబెట్టీ నితనిపై ననుపెట్టిదో ॥ ఇట్టుం ॥

సెలవుల నగవులు చేఁతలలో తగవులు
నెలకొనెఁ జూడరే నెలఁతకును
కలసి రతుల మారుమలసీ వినయములే
పలికీ శ్రీవేంకటేశుపై బత్తి యెట్టిదో ॥ ఇట్టుం ॥ 165

## శుద్ధదేశి

లలన నీకెంతైనా లాఁతిదా యేమి
తలఁ పింతగలితే సంతసమాయ మాకును ॥ పల్లవి ॥

యెంత వేడుకొనుచు నీవేమి చెక్కులు నొక్కేవు
కాంతఁ బొత్తుకు రమ్మంటాఁ గాతరానను
చెంతనే బాలకిగాన సిగ్గుతో నుంటే నేమాయ
ఇంత నీకు బత్తెయితే నియ్యరాదా మోవి ॥ లల ॥

ఆన లేలపెట్టేవు ఆసలేల చూపేవు
పూని పక్కఁ బండుమంటా పొంచి యాసతో
మానవతిగన చెలిమాఁటున నుంటే నేమాయ
కానీలే నీకు నిచ్చైతేఁ గాఁగిలియ్యరాదా ॥ లల ॥

కూడి యంత పెనఁగేవు గురుతులేల సేసేవు
వీడె మందుకొమ్మంటా వెక్కసానను
యీడనే శ్రీవేంకటేశ యేలితివి జవరాలి
వేడుకైతే నాకుచుట్టి వెలఁది కియ్యరాదా ॥ లల ॥ 166

## ఆహిరి

ఎడమాఁట లిఁకనేల యెచ్చరింపు లవేల
పడఁతులకుఁ బతుల కొడఁబాటులే కాక ॥ పల్లవి ॥

వినయమే కలిగితే విరసంబు లెక్కడివి
మనసులే యెనసితే మరఁగేడది
చనవు సమకూడితే చలములకుఁ జోటేది
తనివోని మోహములు తావుకొనుఁగాక ॥ ఎడ ॥

మాటలే పొసఁగితే మచ్చరంబెందుండు
కూటమికి లోనైతే గొసరేడది
సూటిగా వలచితే సొలపులకుఁ బనియేమి
గాఁటంపుఁదమకములు కమ్ముకొనుఁగాక ॥ ఎడ ॥

రతులు చేకూడితే రాఁపు మర్
యితవు లిరవైతేను యెరవేడది
పతి నేలితివి నీవు సరుగ శ్రీవేంకటేశ
సతతంబు మీకుఁ గడుసంతసమే కాక ॥ ఎడ ॥ 167

## నాదరామక్రియ

ఇదె తనకోరికె లీడేరె
పదివేలకుఁ దనభాగ్యంబాయ ॥ పల్లవి ॥

కలికి జవ్వనము కారుకొనీ నిదె
వలపులపరువము వచ్చె నిదె
మొలకల చన్నులు మోసులెత్తెనవె
పిలిచి తేఁగదరే ప్రియుని నిచటికి ॥ ఇదె ॥

వువిదమోము కళ లుప్పతిలీ నివె
పవడవాతెరయుఁ బండె యిదె
నవకపు సిగ్గులు ననలొత్తీ నవె
వివరించి పతిని వెసఁదోడితేరె ॥ ఇదె ॥

యింతిచూపు తను నెదురుకొనీ నిదె
వింత చెలువములు వెలసీ నివె
యింతలో శ్రీవేంకటేశుఁడు దానె
కొంతఁ గూడె నెప్పుడు రమ్మనరే ॥ ఇదె ॥ 168

రేకు 1830 **శ్రీరాగం**

తెలియరా దీయింతితెఱఁగులును మొఱఁగులును
అలవాటుగలదుగన కవి నీకే తెలుసు ॥ పల్లవి ॥

తలఁచు నినుఁ గౌఁగిటను తలగడటు బిగియించు
చెలుల మొగములు చూచి సిగ్గువడును
కలయ నినుఁ బేరుకొను కడలఁ జెప్పకుమనుచు
చిలుకఁ గడుబోదించి చిఱునవ్వు నగును ॥ తెలి ॥

పెదవిపై నిను సొలసి బింబఫల మటు మోపు
మదనకళ లెసఁగ దెరమఱఁ గిడుకొను
వుదుటుగుబ్బలను గోరొత్తు లటు వా(వ్రా?)సుకొని
పదకంబు వాఁటిపైఁ బాదుకొనఁజేసు ॥ తెలి ॥

పరపుపై నిను వెదకి బయలు సరసములాడు
మరుచేఁతలని తెలిసి మనసు గరఁగు
నిరతి శ్రీవేంకటేశ నీవు గూడఁగఁ జెలియ
మరిగి యీకతలు వేమరు నెంచుకొనును ॥ తెలి ॥ 169

## శంకరాభరణము

చెలి పరిణామపు సుద్దులు చెప్పితి మిదివో నీకును
యెలమిని మావిన్నప మిది యిఁక నీచిత్తమయా ॥ పల్లవి ॥

మంతనమున నీవాడినమాఁటలు దలఁచుక తలఁచుక
వంతల నొక్కొకపరి నీవలపులఁ జొక్కునయా
వింతలుగా నీవప్పుడు వేడుకఁ జేసిన చేఁతలు
చెంతలఁ దనతో మెలఁగేటి చెలులకుఁ జూపునయా ॥ చెలి ॥

పానుపుపై నీవెనసినబాగులు చెప్పుక చెప్పుక
నానావిధముల లోలో నవ్వులు నవ్వునయా
తానకముగ నీవక్కడఁ దనకిచ్చిన యధరామృత -
మూనినచవు లిటుగొనుచును వుబ్బుచునుండునయా ॥ చెలి ॥

కూడుచు నీవటు చెనకినగుఱుతులు చూచుక చూచుక
వేడుకతోడుత నీరతి వేమరు మెచ్చునయా
యీడకు విచ్చేసి యేలితి వికెను శ్రీవేంకటేశుఁడ
యీడును జోడై నీతో నిటువలె నుండునయా ॥ చెలి ॥ 170

## ముఖారి

మేలుకు మేలేకాక మెరమెర లేమిటికే
పోలికలు మీకుఁ దగు పొందులెల్లాఁ జేయవే ॥ పల్లవి ॥

కరుణించి యాతఁడు కలువల వేయఁగాను
శిరసువంచుకోనేలే చెలియనీకు
సరసములాడి నిన్ను సారెఁ గరఁగించఁగాను
తెరమాఁటు మాఁటలనే తేనెలెంత చల్లేవే ॥ మేలు ॥

చుట్టరికములు నీతో చూచి చెప్పి తగులఁగా
గుట్టుతో నుందానవేమే కోమలి నీవు
నెట్టుకొని యాతఁడు నిన్నుఁజేరి చెనకఁగా
వట్టి సిగ్గుతోనేల వలపుదాఁచేవే ॥ మేలు ॥

కోరి వేఁడి నీతోను కొచ్చి కొచ్చి నవ్వఁగాను
వూరకే వుండఁగ నేలే వువిద నీకు
యీరీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నుమన్నించె
తారుకాణ వచ్చితే నెందాఁకా వెరగందేవే ॥ మేలు ॥ 171

## గౌళ

[1] శిష్టులను మన్నించే శిశు వీతఁడు
దుష్టుల నణఁచి భూమిఁ దుదకెక్కు నీతఁడు ॥ పల్లవి ॥

దేవకీదేవివసుదేవులకు జనియించె
భావించఁ గృష్ణుఁడు పరబ్రహ్మము నేఁడు
శ్రావణ బహుళాష్టమి సమకూడె నడురేయి
యీవేళ రోహిణి యిన్నిటను మంచిది ॥ శిష్ట ॥

1. 172, 173 పాటలు ఆధ్యాత్మపద్ధతికి చేరినవి.

గండముతోఁ బుట్టె నదె కంసునికి మేనల్లుఁడు
పాండవుల కందరికి బావమఱఁది
దుండగపు భూభారము తొలఁగదొబ్బు నీతఁడు
యెండనీడ కన్నులవాఁ డీఁక నింతా మంచిది ॥ శిష్ట ॥

ఆవు లీతనిపేరిట నచ్చివచ్చు లెంచి చూడ
వేవేలు గొల్లెతలకు విటుఁ డవును
శ్రీవేంకటాద్రి నున్నాఁడు చేరి యలమేల్మంగతో
యీవలఁ బెద్దలు చెప్పి రిఁక నింతా మంచిది ॥ శిష్ట ॥ 172

## దేవగాంధారి

వేలఁ గట్టినట్టి వేవేలు చకిలాలు
కోలలెత్తుకొని కొట్టీ వీఁడె ॥ పల్లవి ॥

వుట్టులు జతనము వోవో చెలులాల
రట్టడి కృష్ణుఁడు రావాడీని
గుట్టుతోనే వచ్చి గోపాలులుఁదాము
చుట్టి వెన్నలుఁబాలు జొత్తీ వీఁడె ॥ వేలఁ ॥

దొంతులు జతనము దొడ్డల సతులాల
ఇంతలోఁ గృష్ణుఁడు ఇదె వచ్చీని
రంతుసేసుకొని రయమున వీదుల
వింతగా నడుకులు వెదకీ వీఁడె ॥ వేలఁ ॥

వాడలు జతనము వల్లవాంగనలాల
వేడుకఁ గృష్ణుఁడు వెలసీని
యీడనే శ్రీవేంకటేశుఁ డలమేల్మంగఁ
గూడి నీతో ముద్దు గునిసీ వీఁడె ॥ వేల ॥ 17

రేకు 1831 భైరవి

పయ్యద మఱఁగుసేసి పతినేల మొఱఁగేవు
నెయ్యంపు వేడుకలు నెరవేర్చుకొనవే ॥ పల్లవి ॥

మొలకనవ్వులతేట మూటగట్టఁగరాదు
తలపోఁతజలనిధులు దాఁటరావు
కలువకన్నులచూపు గాదెఁ బోయఁగరాదు
యెలమి నీవలపు లిఁక నెట్ల దాఁచేవే ॥ పయ్య ॥

కుదురుగుబ్బల మెఱఁగు కొలఁది వెట్టఁగరాదు
పెదవితేనెలతీపు పిండరాదు
ముదురుఁ దమకములు మరి మూలకొదుపఁగరాదు
యెదిటి నీచక్కఁదన మెట్ల దాఁచేవే ॥ పయ్య ॥

పరగునీచెలువ మేర్పరచి చెప్పఁగరాదు
మరుచేఁత లెంతైన మరవరాదు
సిరులనలమేల్మంగ శ్రీవేంకటేశుఁ డేలె
ఇరవాయ నీపొందులెట్ల దాఁచేవే ॥ పయ్య ॥ 174

గౌళ

సెలవుల నవ్వనేల సిగ్గులు వడఁగనేల
అలివేణిఁ బోదిసేసి ఆడరాదా మేలము ॥ పల్లవి ॥

కూరిమితో నీకు మొక్కి కొమ్మ నిన్ను సొలసెను
నేరుపుల మాటలెల్లా నీతో నాడెను
చేరి యిఁక దరవాతిచేఁతలు నీచేతి దింతే
ఆరీతినే గారవించి యాడరాదా మేలము ॥ సెల ॥

వినయము లన్నిఁ జూపి వెలఁది నిన్ను మెప్పించె
చనవుసేసుక నీతో సరి వెనఁగె
తనర నిఁక మన్నించే తగవు నీచేతి దింతే
అనువుగా బుజ్జగించి ఆడరాదా మేలము ॥ సెల ॥

మరుగుచు నలమేలుమంగ నిన్ను దమిరేఁచె
సరసము నీతోనాడి చవి వుట్టించె
సరుగ శ్రీవేంకటేశ సరి నీకెఁ గూడితివి
అరిమురి లాలించి ఆడరాదా మేలము ॥ సెల ॥ 175

## పాడి

ఒక్కరికె ఇవియేల వొలపక్షమై తోఁచె
పెక్కువిధముల నతనిఁ బెడరేఁచఁదగదా ॥ పల్లవి ॥

సరసంబులేకదా చవులుసేసెను రతికి
మరుతంత్రములు గదా మనసుఁ గరచె
తరితీపులే కదా తగులాయములు చేసె
తొరలించి తామె పతిఁ దోడితేఁదగదా ॥ ఒక్క ॥

యెడమాటలే కదా యెలఇంచె మమతలకు
అడియాసలేకదా యగడుసేసె
నిడుదచూపులుగదా నెయ్యములు దగిలించె
బెడయకుండఁగ విభునిఁ బిలిచితేఁ దగదా ॥ ఒక్క ॥

మొగమిచ్చలేకదా ముచ్చటలు దొరయించె
నగవు లివియేకదా నమ్మించెను
జిగి నింతలో వచ్చి శ్రీవేంకటేశుఁ డేలె
తగవుతో దిన దిన మితనిఁ గూర్చఁదగదా ॥ ఒక్క ॥ 176

## దేసాళం

ఇందరిముందర వలపేల దాఁచేవు నీ -
చందము లెఱుఁగుదురు సకులెల్లాను ॥ పల్లవి ॥

లేకలేమి వా(వ్రా?) సేవే లేటినేమి దువ్వేవే
వాకిటికి రమణుఁడు వచ్చి వుండఁగా
కాకుగా నెంత నవ్వేవే కతలెన్ని చెప్పేవే
పైకొని పన్నీటను పాదాలు గడుగవే ॥ ఇంద ॥

శిరసేల వంచేవే సిగ్గులెంత చూపేవే
సరస మాతఁడు నీతో సారె నాడఁగా
సరులెన్ని గట్టేవే జాగులేల నెరపేవే
పరగఁ గప్పురముతో బాగా లొసఁగవే ॥ ఇంద ॥

కొ ప్పెందాఁకాఁ బెట్టేవే గుట్టు నీవెంత చూపేవే
కప్పి శ్రీవేంకటేశుఁడు కాఁగిలించఁగా
చిప్పిలి యెంత చొక్కేవే చెమటెంత గురిసేవే
విప్పుచు మోవితేనెల విందు వెట్టవే ॥ ఇంద ॥ 177

## వట్టవారాయణి

ఏమే నీరమణుఁడు యెదుట నున్నాఁడు వీఁడె
దోమటిగా మోవి యిచ్చి దొమ్మిరేఁచఁ గలవా ॥ పల్లవి ॥

సళువుఁ జూపుల నీవు సారెకుఁ జూచేవు నీ -
కులుకు గుబ్బలనేమి కుచ్చి యెత్తేవా
పలుకుఁ బంతాలెల్లాఁ బచరించే వదియేమే
కెలసి రతుల నంత గెలువఁగఁ గలవా ॥ ఏమే ॥

చెనకి బొమ్మల జంకించేవు చలపట్టి నీ -
మొనగోరి వాఁడేమి మోఁచి వచ్చీనా
పెనఁగుచు గుంపెనలఁ బెచ్చువెరిగేవేమె
మనసుమర్మము లంట మరిగించఁ గలవా ॥ ఏమే ॥

తక్కక యాసల గబ్బితనాలు చూపేవు నీ -
యక్కజపుఁ గాఁగిలేమి యంటుకొనీనా
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
మిక్కిలి ఇందుకంటె మితిమీరఁ గలవా ॥ ఏమే ॥ 178

## పాడి

ఇయ్యకోలైనమీఁద యెరవేలమ్మా
నెయ్యమున సంతోసాలు నించుకోరమ్మా ॥ పల్లవి ॥

రమణుఁ డింటికి వచ్చె రతులను నిన్ను మెచ్చె
తమకించి తప్పు లెంచఁదగదమ్మా
చెమటలు మేన నిండె చిత్తములు మీకుఁ బండె
జమళి నిద్దరు సరసము లాడరమ్మా ॥ ఇయ్య ॥

వెలువుఁడు నీకు దక్కె చేరి నీ చెక్కులు నొక్కె
చలము లింతట నీఁకఁ జాలునమ్మా
మొలకనవ్వులు మీరె మోమునఁ గళలు దేరె
కలసిమెలసి మీ రొక్కటియై యుండరమ్మా ॥ ఇయ్య ॥

శ్రీవేంకటేశుఁడు గూడె చెంది నీతో జూజమాడె
యీవేళ పంతాలాడ నేఁటికమ్మా
వావులు మీకు దొరసె వలపు లిట్టె మెరసె
పూవుఁ బరిమళమునై పొసఁగరమ్మా ॥ ఇయ్య ॥ 179

**రేకు 1832** **దేపాళం**

చెలులాల రమణుని చేఁతలెల్లాఁ జెల్లనీరే
కెలనికిఁ జూడ మిక్కిలి వన్నెగాదా ॥ పల్లవి ॥

చెలిమిసేసినవాఁడు సెలవుల నగనీరే
చలపట్టి యందుకెల్లా సాదించేనా
కలసిమెలసివున్న ఘనుఁడు చెనకనీవే
పెలుచనై యాతనితోఁబెనఁగులాడేనా ॥ చెలు ॥

కూరిమిగలుగువాఁడు కొచ్చి కొచ్చి చూడనీరే
గోరనూఁది యందుకు నే గుంపించేనా
చేరి పాయనట్టివాఁడు సిగ్గులెల్లా రేఁచనీవే
దారకురాలనై తన్నుఁ దగ దనేనా ॥ చెలు ॥

చుట్టమైనయట్టివాఁడు సుద్దులెల్లాఁ జెప్పనీవే
దిట్టనై నే నందుకెల్లా దీకొనేనా
యిట్టె శ్రీవేంకటేశ్వరుఁ డెనసె జొక్కించనీవే
అట్టె గర్వపుదాననై యవుఁగాదనేనా ॥ చెలు ॥ 180

**ఆహిరివాట**

దయ నాపైఁ గలిగితే తానే మన్నించీఁ గాక
ప్రియములు రేఁచిరేఁచి పెనఁగఁగ నేఁటికే ॥ పల్లవి ॥

వనువుగలిగితేను నవ్వులు తానే వచ్చు
మనసు లెనసితేను మచ్చికవుట్టు
కనుచూపు నాటితేను కడునాస లుప్పతిలు
వెనుకొని పతినంత వేసరించనేఁటికే ॥ దయ ॥

వలపు లొనగూడితే వాడికలు సమకొను
తలపు సరిదాఁకితే తారుకాణలౌ
చెలిమి సతమైతేను చిమ్మిరేఁగుఁ దమకము
బలిమి నతనితోడఁ బదరఁగ నేఁటికే ॥ దయ ॥

వినుకలి దొరసితే వేడుకలు నెలకొను
చెనకులు దలకొంటే చేఁత లీడేరు
యెనసి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
గునిసి యీతని నిఁకఁ గొసరఁగ నేఁటికే ॥ దయ ॥ 181

## వరాళి

వెఱవకువే చెలియా విభుఁడు బత్తిగలఁడు
యెఱుకతో నిన్ను నేలీ నివి యేమి సేసీనే ॥ పల్లవి ॥

చందమామ పోలిక సకియ నీ నెమ్మోము
చందనపు కొండగాలి చాయ నీ వూర్పు
కందువ చిగురాకులగని మించుకమ్మోవి
యెందుండినా నివి నిన్ను నేమిసేసీనే ॥ వెఱ ॥

జక్కవలతోడి యీడు చక్కని నీచనుఁగవ
చొక్కమైనతామరలజోడు కన్నులు
వక్కణించితే తీగెలవంటివి నీచేతులు
యిక్కువలంటి నిన్నివి యేమి సేసీనే ॥ వెఱ ॥

కోవిలపాట వంటిది కోమలపు నీయెలుఁగు
భావించఁ దుమ్మిదగుంపుబాగు నీకొప్పు
చేవదేర నిన్ను నిట్టె శ్రీవేంకటేశుఁడు గూడె
యేవేళా నివెల్లా నిన్ను నేమి సేసీనే ॥ వెఱ ॥ 182

## వరాళి

ఏమందునే నేను యీతనితోడ
వేమారు నన్ను లాలించి వేఁడుకొనీఁ దాను ॥ పల్లవి ॥

సరివెనఁగ వచ్చీనా సాదించవచ్చునా
దొరతోడ నెంతైనా తొయ్యలులకు
తరుని చూడఁగదె యీతఁడు సారె సారెకు
విరిబంతులను వేసి వీడెమిచ్చీ నాకు ॥ ఏమం ॥

కాలు దాఁకించవచ్చునా కడుఁ జెనకవచ్చునా
యేలికతో వెరవక యింతులకును
తాలిమితో నడుగవే తానెంత నేనెంత
నాలికా డూరకే వచ్చి నవ్వులు నవ్వీని ॥ ఏమం ॥

వావులు చెప్పవచ్చునా వాడిక చూపవచ్చునా
శ్రీవేంకటేశుతో డాసి చెలులకును
యీవేళ వినవే నేఁ డీతఁడే నన్నుఁ గూడె
మోవితేనె మరిగించి ముంచి నమ్మించీని ॥ ఏమం ॥ 183

## హిజ్జిజి

చనవు చెల్లించరాదా సతికి నీవు
ననిచి యీపెతో నెంత నవ్వులు నవ్వేవు ॥ పల్లవి ॥

మేలుగలయాటది మితిమీరవలదా
యేల నీవు కొచ్చి చూచే వీఁకె నిందుకు
వోలివట్టవచ్చినది వొడివట్టవలదా
పేలరితనాననేల పెనఁగులాడేవు ॥ చన ॥

బత్తిగల జవ్వని గుబ్బల నొత్తవలదా
వొత్తినంటా నీవేల వొడ్డుకొనేవు
హత్తిన చుట్టము నీకు నాసపడవలదా
తత్తరించి నిమ్మపంటఁ దాఁక నేలవేసేవు ॥ చన ॥

కామించివచ్చినయాపె కాఁగిలించవలదా
చేముంచి సన్నలెందాఁకాఁ జేసి చూపేవు
ప్రేమముతో నేలితి వీపెను శ్రీవేంకటేశుఁడ
భామినితో రతివేళఁ బంతా లే లాడేవు ॥ చన ॥ 184

## రామక్రియ

వద్దని తోయఁగరాదు వడిఁ దమకించరాదు
సుద్దులెల్లాఁ జెప్పి చెప్పి చొక్కించీ నితఁడు ॥ పల్లవి ॥

చనుఁగవ లంటవచ్చి జారఁదోసీఁబయ్యెద
వినయపుమాఁటలను వేఁడుకొనీని
చెనకి చెక్కులు నొక్కి చిరునవ్వు నవ్వీని
యెనగొని చుట్టరికా లెంతోసేసీ నితఁడు ॥ వద్ద ॥

పొందులు పారెకుఁ జేసి బుజముపైఁ జేయివేసి
విందులుగా మోవి యిచ్చీ వేడుకతోను
గండముపైఁ జల్లిని కనుసన్నలు చూపీని
సందడి రతుల కెంత చవిరేఁచీ నితఁడు ॥ వద్ద ॥

చేరి కాఁగిలించీని చేతికి బాగాలిచ్చీ
నేరుపు లెల్లాఁ జూపీ నేఁడు నాతోను
యీరీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
గారవించి మరీ నెంత కరుణించీ నితఁడు ॥ వద్ద ॥ 185

**రేకు 1833 కాంబోది**

మగువకుఁ బతితోడ మందెమేళ మింత యేలే
తగిలి మంచితనాన దక్కఁగొనవలదా ॥ పల్లవి ॥

నీకొలఁదివారమా నీ యంత నేరమా
యీకడ నీపగటులు యెట్టు చూపేవే
కాకరినవ్వు లెంతేసే గబ్బితనా లిదియేమే
చేకొని పతిముందర సిగ్గువడ వలదా ॥ మగు ॥

దేవులము నేమూఁ గామా దీకొనఁగ నోపమా
చేవదేర నెమ్మెలేమి చెప్పుకొనేవే
కావరపుమాఁట లెన్నే కత లెంత నేరుతువే
వేవేలైనా పతివద్ద వినయమే వలదా ॥ మగు ॥

సవతులము గామా జాణతనా లెఱఁగమా
జవళి సలిగెలేల సారెఁ బెంచేవే
యిల శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నుఁగూడె
కవగూడి పతి కిచ్చకమే సేయువలదా ॥ మగు ॥ 186

**ఆహిరి**

నీవేమి సేతువే నిన్ను నింతసేసిన -
భావజాని చెల్లుబడి పంత మింతేకాక ॥ పల్లవి ॥

మచ్చికలు గెరలఁగా మరి యెంతోరుచుకొన్నా
అచ్చమైన తమకము లడచరావు
పెచ్చురేఁగి కోరికలు పెంటలై పెరుగఁగాను
హెచ్చిన దీమసములు యేడ నుండు నిఁకను ॥ నీవే ॥

తలపోఁత లుండఁగాను తల యెంత వంచుకొన్నా
కులికినవ్వులు దాఁచుకొనఁగరావు
యెలమి నడియాసలు యేరులై వుప్పొంగఁగాను
బలిమిఁ జిరుసిగ్గులపను లెందు కెక్కును ॥ నీవే ॥

జవ్వనము మెఱయఁగా చలమెంత సాదించినా
నివ్వటిల్లు చిత్తము నిలుపరాదు
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
రవ్వలైన విరహపురాఁపు లింకేమున్నవి ॥ నీవే ॥ 187

## బౌళి

ఏమే నీపంతమెల్లా నిటువంటిదా
నేమముతో నావలెనే నీటు చూపవలదా ॥ పల్లవి ॥

చేరి నాతోఁ గాఁపురము సేయఁగా నాతని మీఁద
కూరిమి యెంత చల్లేవే కొత్తఁగా నీవు
నేరు పెంత గలిగినా నెలఁతల వలపులు
యీరీతిఁ గాకుసేసే దెందైనాఁ గలదా ॥ ఏమే ॥

కాతరించి నాతోను కమ్మటి మాటాడేవాని
చేతికి విడెమియ్యఁ జెల్లునా నీకు
పోతరము గలదంటా పొలఁతుల సిగ్గులు
యీతల బాయట వేసే దెందైనాఁ గలదా ॥ ఏమే ॥

చెలఁగి నాకాఁగిటిలో శ్రీవేంకటేశుఁ డుండఁగా
వెలినుండి నీవు నవ్వేవిధ మేఁటిదే
కలిమి గలిగితేను కామినుల భోగములు
యెలమి రవ్వలుసేసే దెందైనాఁ గలదా ॥ ఏమే ॥ 188

## అమరసింధు

ఇంతకంటెఁ బని నీకు నెంతగలదు
కాంత యిచ్చలోనే వచ్చి కరుణించవలదా ॥ పల్లవి ॥

చేతులెత్తి చేతులెత్తి చెలి సన్నసేయఁగాను
ఆతల నేమిచూచే వప్పటినీవు
కాతరించి రతులకు కన్నులనే మొక్కఁగాను
యీతలఁ పెరఁగినీవు యెనయఁగవలదా ॥ ఇంత ॥

యెచ్చరించి యెచ్చరించి ఇంతి పూవుల వేయఁగా
కొచ్చి జాజాలేమాడేవు గుట్టున నీవు
కచ్చుపెట్టుకొనివచ్చి కానుక నీకియ్యఁగాను
అచ్చముగా మాఁటలాడి ఆదరించవలదా ॥ ఇంత ॥

వెడ్డువెట్టి వెడ్డువెట్టి వెలఁది కాఁగిలించఁగా
వొడ్డుక యేమి నవ్వేవు వూరకే నీవు
జిడ్డుదేరఁ జెనకఁగా శ్రీవేంకటేశ కూడితి -
వడ్డాఁక లేక ఇట్టె అంది పొందవలదా ॥ ఇంత ॥ 189

## వరాళి

అందులకె విచారించే నప్పటనుండి
కందువకుఁ బెనఁగఁగా గబ్బి ననవు గదా ॥ పల్లవి ॥

పచ్చిదేర నీతో నేను పక పక నవ్వఁగాను
అచ్చలాన మందెమేళ మనవుగదా
మచ్చికతో సారెసారె మాటపలు కాడఁగాను
రచ్చలోన నిది యెంత [1]రట్టడెనవుగదా ॥ అందు ॥

1. రట్టడి+అనవుగదా

సతమై యే పొద్దూ నే నీ సరుసఁ గూచుండఁగాను
అతిగర్వియంటా నన్ను ననవుగదా
తతిగొని యెప్పుడూ బాదములు నే నొత్తఁగాను
మితిమీరి మిక్కిలి గామిడి యనవుగదా ॥ అందు ॥

గుట్టుతో గాఁగిట నేను గుబ్బల నిన్నొత్తఁగాను
అట్టె యాసోదకత్తె ననవుగదా
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటునన్ను
బట్టువలెఁ [1]గొనేడఁగా [2] బగ్గడెనవుగదా ॥ అందు ॥ 190

## పళపంజరం

సరిబేసివలపులు చవులే కావా
సొరిది నీ నేరుపెల్లాఁ జూపఁరాదా ॥ పల్లవి ॥

కప్పురనా వేసెనంటా కాంతనేల తిట్టేవు
చిప్పిల బన్నీట నీవూఁ జిమ్మరాదా
అప్పటిఁ బాదము దొక్కెనంటానేల జంకించేవు
పిప్పిగాఁ గందువలంటి పెనఁగరాదా ॥ సరి ॥

గోరు సోఁకించెనంటాను కొమ్మ నెంత సాదించేవు
చేరి నీవూ మోవి గంటిసేయరాదా
కేరి కేరి నవ్వెనంటా కెరలి యేమిచూచేవు
మేరతో మారుకుమారు మేలమాడరాదా ॥ సరి ॥

పంతమాడె నీతోనంటా భామనేల గద్దించేవు
చెంత నీవూఁ గుచములు చెనకరాదా
ఇంతలో శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
మంతనాన నీ రతులు మరిగించరాదా ॥ సరి ॥ 191

1. 'కొనియాడు' శబ్దమునకు 'కొనేడు' వ్యావహారికము కావచ్చు.
2. 'ప్రగ్గడ'+శబ్దమునకు 'బగ్గడ' శబ్దము వ్యావహారికము కావచ్చు.

రేకు 1834 శంకరాభరణం

ఎంతవడేయ నిదేమమ్మా
దొంతిరతులకు నెదురుచూచీని ॥ పల్లవి ॥

అలికులవేణి యంబుజపాణి
కలికి మగువ రాఁ గదవమ్మా
మలయజగంధి మదనవిలాసిని
కలయికలకు పతి గాచుకున్నాఁడు ॥ ఎంత ॥

సామజగమనా చక్కెరబొమ్మా
కామిని యిఁక రాఁగదవమ్మా
భూమాతిలకమ పసిఁడిసలాకా
నీమగఁ డదివో నిలుచుకున్నాఁడు ॥ ఎంత ॥

వాడికపు నెలఁతా వొప్పులకుప్పా
కడఁకలసతి రాఁగదవమ్మా
గుడిగొని తెరలోఁ గూడె నిన్నపుడు
యెడయక శ్రీవేంకటేశుఁ డున్నాఁడు ॥ ఎంత ॥ 192

మంగళకౌశిక

చిన్నదాననంటానే సిగ్గులేల పెంచేవు
సన్నసేసి మొక్కవమ్మా చతురుఁ డీతఁడు ॥ పల్లవి ॥

చనవు నీకు నొసఁగి చవులుగా మాఁటలాడీ
వినవమ్మా యిదివో నీ విభుఁడు
చెనకి చెనకి నిన్నుఁ జెక్కునొక్కి వేఁడుకొనీ
పెనఁగకువమ్మా నీపైఁ బ్రేమగలఁ డీతఁడు ॥ చిన్న ॥

1. ఎంతవడి+ఆయన్

కప్పురము నీపైఁ జల్లి కాచుకున్నాఁ డెదుటను
తప్పక చూడమ్మా యీతని మోము
చిప్పిలుమోవి చూపి సెలవుల నవ్వు నవ్వీ
తప్పించుకోకువమ్మా తమకించీ నితఁడు ॥ చిన్న ॥

గారవించి కూడి నిన్నుఁ గరుణతో మన్నించీ
చేరి కాఁగిలించవమ్మా శ్రీవేంకటేశు
సారెకు వలపు చల్లి సరసము లాడీని
మేరలు మీరకువమ్మా మేలుగలఁ డితఁడు ॥ చిన్న ॥ 193

## మాళవిగౌళ

ఏకతపు మీచేఁత లిఁక నెట్టివో
జోకతో మీ సంతోసపు సొంపులెల్లాఁ గంటిమి ॥ పల్లవి ॥

తళుకుఁ జూపుల నీవు తప్పక చూడఁగాను
చెలియమోమున నిండీ చిరునవ్వులు
పలుకుఁ బంతాల వొడఁబడికలు నీకెట్టివో
తెలియవుగాని మీ పొందికలెల్లాఁ గంటిమి ॥ ఏక ॥

జఱసి సన్నలు నీవు సారెకునుఁ జేయఁగాను
మెఱసె బొమ్మజంకెన మెలుతకును
గుఱుతు లొండొరులకు గొనకొన్నవెట్టివో
యెఱఁగముగాని మీ ఇంపులెల్లాఁ గంటిమి ॥ ఏక ॥

సాదించి వచ్చి నీవు చమఁగవ ముట్టఁగాను
ఆదిగొనె నివ్వెరగు లంగనకును
యీదెస శ్రీవేంకటేశ యెన్నికలు మీకెట్టివో
సోదించముగాని మీ సుద్దులెల్లాఁ గంటిమి ॥ ఏక ॥ 194

## వరాళి

ఒకటి కినుమడాయ నువిదసింగారాలు
సకలముఁ జిత్తగించు జాణఁడవు నీవు ॥ పల్లవి ॥

నిలువు దురు మొక్కటే నిండుఁజీఁకటిగాని
నెలఁత నవ్వులైతే వెన్నెల కుప్పలు
పలుచనికెమ్మోవి పచ్చిచిగురింతేకాని
అలరిన దంతములైతే వజ్రములే ॥ ఒక ॥

పట్టరాని నెన్నడుమే భావించసన్నముగాని
గట్టిచన్నలైతేను కడుగొప్పలు
అట్టె మెఱుఁగుఁదొడ లాఁదోఁకలై వుండెఁగాని
మిట్టలైనపిఱుఁదులు మిక్కిలి బటువులే ॥ ఒక ॥

యించుకంతలు పాదాలే యెట్టని [1]వన్నెయఁగాని
యెంచిచూడ మేనెల్లా హేమవర్ణమే
కొంచక శ్రీవేంకటేశ కూడితి వీకెను నేఁడు
మించిన యూపెవలపు మేలుమీఁది మేలు ॥ ఒక ॥ 195

## హిజ్జిజి

అన్నిటా జాణవైతి వప్పుడే నీవు
యెన్నేసిచేఁతలు సేసే విసుమంతదానవు ॥ పల్లవి ॥

మాటలాడనేరుతువే మగనితో సారెసారె
నీటుచూపనేరుతువే నిలుచుండి
గాఁటముగా నిన్నుఁ జూచి కడువెరగయ్యీ నాకు
యీటుతో రట్టడివైతి విసుమంతదానవు ॥ అన్ని ॥

---

1. వన్నె+ఆయన్=వన్నేయన్

చెనకంగనేరుతువే చేతులారా నీవిభుని
వినయాలు నేరుతువే వేవేలుగాను
ఘనముగా నవ్వే నీవు కత గరచినందుకు
యెన సెంత జాటవైతి విసుమంతదానవు ॥ అన్ని ॥

చేరి మొక్కనేరుతువే శ్రీవేంకటేశ్వరునికి
కూరిమితోఁ గాఁగిలించి కూడనేర్తువే
యీరీతి నన్నితఁ డేలె యిందుకే నాకరుదయ్యీ
యేరుపరచకువే నీ విసుమంతదానవు ॥ అన్ని ॥ 196

## ఆహిరి

ఏమని విన్నవించేము ఇంతిచందములు నీకు
ఆముకొన్న కరుణతో నాదరింతు గాక ॥ పల్లవి ॥

వొప్పగు నిన్నుఁ దలఁచి వువిద పాన్పుమీద
నుప్పతిల్లుఁ జెమటల నోలలాడీని
ముప్పిరిగొన్నవయసు ముంచి యాసలు రేఁచఁగా
చెప్పరాని వలపుల జిమ్మిరేఁగీని ॥ ఏమ ॥

వొట్టిన నీగుణములు వొకటొకటే యెంచుక
అట్టె నిట్టూరూపుల నుయ్యాల లూఁగీని
గట్టిగా నీవిచ్చినవుంగరము చూచి చూచి
గుట్టుతో దమకముల గుబ్బతిలీని ॥ ఏమ ॥

గక్కనఁ జెలులు నీకతలు చెప్పఁగా విని
వెక్కసపుఁ బులకల విఱ్ఱవీఁగీని
యిక్కడ వచ్చి శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి
పిక్కటిల్లు సంతోసాలఁ బెనగొనీని ॥ ఏమ ॥ 197

రేకు 1835 రామక్రియ

ఇన్ని నేరుపులు నీయెదుటనే పచరించీ
సన్నలనే నీవికెను సంతోసించవయ్యా ॥ పల్లవి ॥

వలిపె పయ్యెదతోడ వ(ట్రుపగుబ్బలతోడ
కొలువుసేసీ నదె కొమ్మ నీకును
సెలవుల నవ్వుదేర చెమట చెక్కులఁగార
తెలిపీఁ దనవలపు తేరిచూడవయ్యా ॥ ఇన్ని ॥

వాసనపూఁతలు పూసి వన్నెలకుచ్చెల వోసి
ఆసలురేఁచీ నదె యంగన నీకు
లాసేటిచూపులు చూపి లలిఁ గొనగోరుమోపి
సేసీఁ దనచేఁతలు చిత్తగించవయ్యా ॥ ఇన్ని ॥

వాడికలఁ జెలరేఁగి వంతుల నేతులఁ దూఁగి
వీడెము చేతికిచ్చీ వెలఁది నీకు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తోడనె తానూఁ గూడీ పొందులు సేయవయ్యా ॥ ఇన్ని ॥ 198

దేసాళం

చెలియరో యన్నాళ్లైనాఁ జిన్నదానవా
యెలమి నీవిభునికి నియ్యవే విడెము ॥ పల్లవి ॥

నేరుపుగలయందుకు నెట్టుకమాటాడవలె
వోరుపుగల యందుకు వొడఁబడివుండవలె
కూరిమిగల యందుకు కూటమి నెరపవలె
వూరకే గోలతనాన నుందురా జవ్వనులు ॥ చెలి ॥

చనవుగలయందుకు సరసమాడఁగవలె
నినుపుగలయందుకు నవ్వుతానుండఁగవలె
వినయము గలయందుకు వేమారు మొక్కఁగవలె
పెనఁగుతా సిగ్గులెల్లాఁ బెంతురా జవ్వనులు ॥ చెలి ॥

వేడుకగలయందుకు వేరుసేయకుండవలె
వాడిక గలయందుకు వైపుగా మెలఁగవలె
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్ను నేలె
జోడుగూడి వాసులకు జొత్తురా జవ్వనులు ॥ చెలి ॥ 199

## శంకరాభరణం

చిత్తగించుమిదె చెలియవిలాసము
పొత్తులుగలపీ భోగంబులకు ॥ పల్లవి ॥

వెన్నెలరేకులు వెదచల్లీ నదె
సన్నల సెలవుల సకియా
కన్నులమొక్కులు కానుకలొసఁగీ
నిన్నుఁ జూచి యిదె నివ్వెరగులను ॥ చిత్త ॥

జక్కవపిట్టల సంతముసేసీ
అక్కున గప్పుచు నతివా
చక్కనిమోవిని చవులటు గొలిపీ
నెక్కొని నీపై నేస్తంబులను ॥ చిత్త ॥

పలుకుఁ దేనియలు పలుమరుఁ జిలికీ
మెలుపురతుల నలమేల్ముగ్గ (మంగ?)
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
అలరీ నీతో నదె సరసములా ॥ చిత్త ॥ 200

## శుద్ధవసంతం

నీకొలఁదిదానవా నీ యంత నే నేరనా
చేకొని యెంతేసి నీవు చేఁతలు సేసేవు ॥ పల్లవి ॥

సరసములాడి యాడి సంగాతాలు సేసితివి
మరిగి నావద్దనున్న మగనితోను
తెరమరఁగున నుండి తేలించనేల వచ్చేవే
గరిమల నాకతఁడు కడుమేలువాఁడు ॥ నీకొ ॥

వలపులు చల్లి చల్లి వావి గడించుకొంటివి
బలిమి నావసమైన పతితోను
కొలువులోనే వుండి కోరి సన్నసేసేవేలే
కలకాలమితఁడు నాకడ మేలువాఁడు ॥ నీకొ ॥

కొప్పు దువ్విదువ్వి నీ కూటమి నెరపితివి
ఇప్పుడు నాశ్రీవేంకటేశునితోను
వొప్పుగ నన్నితఁ డేలె వొడివట్ట నేమిటికి
నెప్పున నీతఁడు నాకన్నిటా మేలువాఁడు ॥ నీకొ ॥ 201

## మాళవిగౌళ

సిగ్గున దాఁచఁగరాదు చెప్పకపోదు
వొగ్గి వేఁడుకొంటి మిదె వొప్పుగొనవయ్యా ॥ పల్లవి ॥

పువ్వువంటి జవ్వనము పూఁటవూఁట కెచ్చఁగాను
నివ్వటిల్లె వలపులు నెలఁతకును
యివ్వల నింతి సుద్దులు యేమిచెప్పేమిఁక మీకు
రవ్వలు సేయక ఇట్టె రావయ్య యింటికి ॥ సిగ్గు ॥

పొట్టఁ బొరుగు నీ పొందు పోదులే కింపించఁగాను
　　నెట్టుకొని రమణికి నిండువావులు
　　వట్టిజోలి నీ ముందర వరవాతానేమిటికి
　　గుట్టుతోనే రావయ్యా గక్కున నిట్టె యింటికి　　॥ సిగ్గు ॥

చిత్తములోనియాసలు చిమ్మి గడురేఁచఁగాను
　　హత్తుకొనెఁ దమకము లంగనకును
　　కొత్తగా శ్రీవేంకటేశ కూడితి వీకె నింతలో
　　బత్తితో నిట్టె రావయ్యా బడి బడి నింటికి　　॥ సిగ్గు ॥ 202

## తెలుఁగుఁ గాంబోది

[1] మగువ నేరుతువే మాఁటలు । నీవు
　　తగిలి తెలుసుకో తారుకాణలు　　॥ పల్లవి ॥

చెనకేనే వో చెలియా । నీ -
　　చెనకులే కావా చెక్కులవి
　　పెనఁగకు చనుఁగవ పిసికేనే యవి
　　గనములు చేతికిఁ గడు గట్టులురా　　॥ మగు ॥

నవ్వేనే వో నలినాక్షి । నీ -
　　నవ్వులు నిజమైనవి నేఁడు
　　జవ్వాది మేనఁ జమరేనే
　　పువ్విళ్ళయి వలపూరీఁ గదరా　　॥ మగు ॥

తలఁపించేనే తమకములు । అవి
　　తలఁచకతొల్లే తలకెక్కె
　　యెలమిని శ్రీవేంకటేశుఁడనే । నే -
　　నలమేల్మంగను ఆలనే కదరా　　॥ మగు ॥ 203

1. ఇది దేవీ దేవరల సంవాదము

**రేకు 1836** **కాంబోది**

ఎంత యాకరీ నీకు యీతరుణి
పొంతనే వేడుక లెంత పొదిగీనో కాని ॥ పల్లవి ॥

చెక్కులఁ జెమటగార సేసీ నీకు మూడిగాలు
యెక్కుడైనబత్తితో నీ యింతి
లక్కవలెఁ గరఁగుతా లలిరేఁగి నవ్వీని
వుక్కుమీరి వలపెంత వున్నదో కాని ॥ ఎంత ॥

మచ్చికలు చూపి చూపి మాఁటలెల్లా నాడీని
యిచ్చకము సేసుకొంటా యీయింతి
కొచ్చి కొచ్చి సారె సారెఁ గొలువులు సేసీని
పచ్చిదేరేయాస లెంత ప్రబలీనోకాని ॥ ఎంత ॥

కదిసి యేపొద్దు నీచక్కని మొగమే చూచి
యెదుటనే నిలుచుండీ యీయింతి
మొదల నన్నేలితివి మొప్పిరి శ్రీవేంకటేశ
పొదిగీ నిన్ను పొందెంత పొదలీనో కాని ॥ ఎంత ॥ 204

**వారాయణి**

ఎటువంటివాఁడవైతి వేమయ్యా నీవు
తటుకన నాఁడువారి దయఁజూడవలదా ॥ పల్లవి ॥

మంతనాన నే నీతో మచ్చికమాటలాడితే
కాంతలతోఁ జెప్పి చెప్పి కాకుసేతురా
వింతలుగా నిన్నుఁ జేరి వేడుకనవ్వునవ్వితే
అంతలోనే మాచేఁత లంగడిఁ బెట్టుదురా ॥ ఎటు ॥

చనవుతో నీకు నేను సన్నలు సేసితేను
వనితలకుఁ జూపి రవ్వలు సేతురా
వినయాన సరసము వెరవక నే నాడితే
వెనకొని మా గుట్టు వెల్లవిరి సేతురా ॥ ఎటు ॥

కామించి నిన్ను నేనుఁ గాఁగిలించుకొంటేను
భామలకు నెచ్చరించి పచ్చి సేతురా
గోమున శ్రీవేంకటేశ కూడి మొక్కించుకొంటివి
ఆముకొన్న నావలపు లారడిఁ బెట్టుదురా ॥ ఎటు ॥ 205

## వరాళి

చెప్పరాదు నీపగటు సిబ్బితిపడ వేమిటా
అప్పటి మురిసేవు నాయంతదానవా ॥ పల్లవి ॥

యెంతకొప్పు వెట్టితివే యేమి నిక్కి చూచేవే
జంతవలె పతిమోము సారె సారెకు
పంతపు సతులు లాతనిపక్క నిట్టివుండఁగాను
యెంతేసిచేఁతల నీవు యెలయించేవే ॥ చెప్ప ॥

సింగారా లెంత చూపేవే చిరున వ్వేమి నవ్వేవే
అంగడి వీధినుండే యాతనితోను
చెంగట మేటామేటీలు సేవలెల్లాఁ జేయఁగాను
సంగతెఱఁగక యేమి చవులు రేఁచేవే ॥ చెప్ప ॥

పందే లేల వేసేవే పైపై నేల పెనఁగేవే
యిందరిలో శ్రీవేంకటేశుఁ జొక్కించి
కందువఁ గూడిన నేము కాఁపురాలు సేయఁగాను
చెంది నీవప్పటినేల బెనకఁజూచేవే ॥ చెప్ప ॥ 206

## సాళంగనాట

తానెంత నీవెంత తన సుద్దు లివిగో
నేనూ నీవూఁ జుట్టాలమై నెమ్మది నున్నారము ॥ పల్లవి ॥

ముంగిటికి వచ్చి వచ్చి మొకము చూపి నిన్ను
వుంగరమడిగెఁ జెలి వొయ్యనొయ్యనే
సంగడినే కూచుండి జాణతనాలెల్లా నాడి
యెంగిలి సేసె మోవి యీకె యెంత రట్టడి ॥ తానెం ॥

సెలవుల నవ్వి నవ్వి చేతులెత్తి మొక్కి యిట్టె
మెలఁగి చన్నులు చూపె మెల్ల మెల్లనె
చెలుములు సేసి మరిచేరి సన్న నీకుఁ జూపి
యెలమిఁ బాదముదొక్కె నీకె యెంత రట్టడి ॥ తానెం ॥

ఇచ్చకము లాడియాడి ఇంపులు నీపైఁ జల్లి
కొచ్చి కొచ్చి తమిరేఁచెఁ గూడఁగూడనె
యిచ్చట శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
హెచ్చి గోరఁ దా నిన్నంటె యీకె యెంత రట్టడి ॥ తానెం ॥ 207

## పాడి

నా మొగము చూచి యేమి నవ్వులు నవ్వేవు నీవు
యీ మఱఁగు లీడేరె నెంత సేసేవు ॥ పల్లవి ॥

చిత్తరుపతిమవలె చెలి నిలుచుకున్నది
హత్తి దండఁ గూచుండు మనఁగరాదా
బత్తిసేసి నీకు నదె బాగా లందిఇచ్చీని
కొత్తవలపు నీవందుకొనఁగరాదా ॥ నామొ ॥

మేనమఱఁదలి వలె మెలుత సరసమాడీ
వీనులు చల్లఁగా నీవు వినఁగరాదా
ఆనుక గుబ్బల నీకు నాస చూపుకవున్నది
పేనిపట్టి వాఁటితోడఁ బెనఁగరాదా ॥ నామొ ॥

వలరాజుతల్లివలె వనిత నీకుఁ గలిగె
మలసి యన్నిటా నీవు మన్నించరాదా
తలఁపుదెలిసి నన్ను దయఁజూచి యేలితివి
యెలమి శ్రీవేంకటేశ యీకెనూఁ గూడరాదా ॥ నామొ ॥ 208

## దేశాక్షి

ఎంతలే దీపెనటన లివియుఁ గొన్ని
చెంత నన్నీఁ గానవచ్చె చెలియ రాగదవే ॥ పల్లవి ॥

యేతరికాంతల సుద్దు లెవ్వరెరుఁగుదురమ్మా
ఆతఁడు వలచుఁ దనకంటాఁ జెప్పీని
పోతరించి పొద్దువోక బొమ్మల గాటుకవెట్టీ
యీతల నీపె వేసా లేమని చెప్పేదే ॥ ఎంత ॥

జూటు సతులచేఁతలు సోదించేవా రెవ్వరమ్మా
కూటమి నాతనిమేన గోరు చూపీని
కోటిసేయఁ బెదవిపైఁ గూరవండి కసవేరీ
యీటున నీపె గుణము లేమని చెప్పేదే ॥ ఎంత ॥

కావరపింతులజాడ గన్నవారెవ్వరోయమ్మా
శ్రీవేంకటపతివద్దఁ జేరి నవ్వీని
కావించి నన్నితఁడేలె కతకుఁ గాళ్ళడిగీని
యీవేళ యీపెనేరుపు లేమని చెప్పేదే ॥ ఎంత ॥ 209

రేకు 1837 బౌళి

ఈకె నేమూ దేవుళ్ళమై యిట్టె నీ కుండేముగాక
మాకు సమ్మతములాయ మరియేఁటిసుద్దులు ॥ పల్లవి ॥

ముచ్చటలెల్లా నాడె మోహమున జవరాలు
ఇచ్చకము సేసె నీవూ నియ్యకొంటివి
విచ్చనవిళ్ళాయ మీకు వేడుకలు సమకూడె
మచ్చికాయ మాపుదాఁకా మరియేఁటి సుద్దులు ॥ ఈకె ॥

తెలిగన్నులనుఁ జూచె తియ్యనిమోవి చూపె
కలకల నవ్వె నీవూ గైకొంటివి
తలఁపులు సరివచ్చె తనిసె మీమనసులు
మలసె సంతోసాలు మరియేఁటిసుద్దులు ॥ ఈకె ॥

వుదుటగుబ్బల నూఁదె వొరసి నిన్నుఁ జెనకె
కదిసెఁ గాఁగిట నీవూఁ గానిమ్మంటివి
ఇదివో శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
మదిమది నున్నారము మరి యేఁటిసుద్దులు ॥ ఈకె ॥ 210

సౌరాష్ట్రం

ఇటువంటి నీ సుద్దులు యెఱఁగ మిన్నాళ్ళును
తటుకనఁ జెప్పవే వింతలుగా మాకిపుడు ॥ పల్లవి ॥

చెక్కులఁ జెమటలూరీ చెంపలఁ దురుము జారీ
చిక్కని నవ్వులనే సిగ్గు దేరీని
చక్కని రమణి నీవు సాదువలెనే వుంటివి
యెక్కడ గడించుకొంటివే యీవలపు ॥ ఇటు ॥

మోమున గళలు గూడీ మోవి గడువసి వాడీ
కామించి నీపోఁకముడి గక్కన వీఁడీ
సామజగమన నీవు సాదువలెనే వుంటివి
యేవిట గడించుకొంటివే యీవలపు ॥ ఇటు ॥

తావులు మైఁ జోడుముట్టీ తగు నిట్టూర్పులు దొట్టీ
వూవలై పులకలెల్లా గుంపుగట్టీ
నీ వలమేలుమంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ -
డేవల గడించుకొంటివే యీ వలపు ॥ ఇటు ॥ 211

## పాడి

అట్టె నిన్నుఁ జూచి అరుదయ్యీ నా కప్పట నుండి
కట్టుకొని వలపెంత గాదెఁబోసేవే ॥ పల్లవి ॥

పెదవిపై తమ్ములము చేఁటులు రాలఁగాను
కదిసి విభుని కేమి కత చెప్పేవే
అదరు గుబ్బలపై పయ్యద వెడజారఁగా
యెదుటనుండి యాసలు యెంత చూపేవే ॥ అట్టె ॥

వూని చెమటలు మేన నూరుచు వడియఁగాను
పానుపుపై నుండి యేమి పాదాలొత్తేవే
పూనిన కొప్పు విరులు భుజాలపై రాలఁగా
మోనానఁ దప్పక యిట్టె మోమెంత చూచేవే ॥ అట్టె ॥

కరములు చాఁచుకొంటా కాఁగిటిలోఁ బెనఁగుతా
సరికిబేసికి నేమి సాము సేసేవే
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
వరుసకు నీవెంతవడి నాసపడేవే ॥ అట్టె ॥ 212

## దేసాళం

వేడుకలే మీఁద మీఁద వెలయుఁగాక
జోడై మీరిద్ద రొక్కచోటనే వుండఁగాను ॥ పల్లవి ॥

వెన్నెలకెక్కడి వేఁడి విరుల కెక్కడి వాఁడి
కన్నెక విభుఁడ నీవు గలకాలము
సన్నలేల మొగచాటౌ చప్పనేలా మోవితేనె
యెన్నికతో నేపొద్దు నీవెదుట నుండఁగాను ॥ వేడు ॥

చిత్తమున కేడ చింత సిగ్గులకు నేడ వంత
హత్తి నీ వీపె కాఁగిట నలరఁగాను
బత్తియేల విరసమౌ పాయమెట్టు పట్టవచ్చు
కొత్తలుగా నీ వీ రీతిఁ గొమ్మతో నవ్వఁగాను ॥ వేడు ॥

వలపులకేది మితి వాసులకు నేది తతి
చెలిమి మీరిద్దరునుఁ జేయఁగాను
అలమేల్మంగ నేలితి వపుడె శ్రీవేంకటేశ
చెలి యాల మరచు నీచేఁతలు మించఁగాను ॥ వేడు ॥ 213

## శుద్ధదేశి

కంటిమి నీ సింగారాలు కన్నుల పండువుగాను
దంటవైనందుకు నీ చందములెల్లాఁ దగునే ॥ పల్లవి ॥

పువ్వులు కొప్పున రాలె బుజముపై రేకలవె
యివ్వల నామోము చూచి యేమినవ్వేవే
కువ్వలాయఁ బులకలు కురిసె మేనఁ జెమట
జవ్వనివైనందుకు సప (ఫ?)లము లాయనే ॥ కంటి ॥

మోమునఁ గళలు దేరె మోవిమీఁద చేఁటులదె
చేముంచితి వికనేల సిగ్గువడేవే
ఆముకొనె నిట్టూర్పు లంగమునఁ బచ్చిదేరె
యీమేర జాణవైనందు కిన్నియు నమరునే ॥ కంటి ॥

కలగొనె సంతోసాలు కన్నులఁ దేటలవె
అలర మాకెంతేసి ప్రియాలు చెప్పేవే
చెలఁగె నీ వేడుకలు శ్రీవేంకటేశుఁడు గూడె
అలమేలుమంగవు నీకన్నియు నీడేరెనే ॥ కంటి ॥ 214

## ఆహిరి

మేలు గలితే నిందుకు మెచ్చవద్దా నీవిట్టె
యీలేమతో జాణతనా లెంతేశాడేవయ్యా ॥ పల్లవి ॥

కలికితనాలనే కరఁగించె నీమనసు
చిలుకుఁ జూపుల నిన్నుఁ జిమ్మిరేఁచెను
నిలువుఁ గొలువు సేసి నిన్ను మరిగించుకొనె
చెలితో నీవెట్టు సాముసేసేవయ్యా ॥ మేలు ॥

నవ్వుతానే నీతోడ నసుపులు సేసుకొనె
వువ్విళ్ళూర మాఁటాడి వొడఁబరచె
వివ్వటిల్లఁ గళలంటి నిన్ను నిట్టె దక్కఁగొనె
జవ్వని నీవెటువలె సాదించేవయ్యా ॥ మేలు ॥

చుట్టరికముననే చొక్కులఁ బెట్టె నిన్ను
గుట్టుతోనే రప్పించుకొనె నింటికి
గట్టిగా శ్రీవేంకటేశ కందువఁ బెండ్లాడె నీతో
నిట్టె యలమేలుమంగ నెట్టు గెలిచేవయ్యా ॥ మేలు ॥ 215

రేకు 1838 ముఖారి

ఆతఁ డెంత నీవెంత అంతరము లెంచుకోము
చేతికి దొరకనంటా సేవలుసేసేవు ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి సేసేవు విన్నపాలు
వెలయ నాతఁడు సారె వినీ నంటాను
మెలఁగే వెదుట మందె మేళమున నప్పటిని
నలుగడ నీతో నిట్టె నవ్వీనంటాను ॥ ఆతఁ ॥

తగిలి తగిలి యాతనిమోము చూచేవు
నిగిడి నీముందరను నిలిచెనంటా
జిగిమించఁ గొనగోరఁ జెనకఁగ వచ్చేవు
వొగి మొగమాటమున నున్నాఁ డంటాను ॥ ఆతఁ ॥

నానఁబెట్టి నానఁబెట్టి నయగారాలు చూపేవు
కానిమ్మని నీచేఁతలఁ గైకొనీనంటా
యే నలమేల్మంగను నన్నేలె శ్రీవేంకటేశుఁడు
నీ నేరుపులు చెప్పేవు నిన్ను నిచ్చీనంటాను ॥ ఆతఁ ॥ 216

పాళంగం

నీకూ నీపెకుఁ దగును నేరుపు లెంచి చూచితే
చేకొని మెచ్చరయ్యా యీ చెలియ సొబగులు ॥ పల్లవి ॥

చక్కెర మోవిఁ దొలఁక సారెసారె మాటలాడీ
జక్కవచన్నులు చూపి చల్లీవలపు
రెక్కతుమ్మిద విరులు రేఁచిరేఁచి కొప్పువెట్టీ
చక్కఁజూడవయ్యా యీసకియ పగటులు ॥ నీకూ ॥

సిగ్గులు సెలవిఁ బార చిరునవ్వు నవ్వీని
నిగ్గులు మేన నిండ నీతోఁ బెనఁగీ
వెగ్గళించి చూపులనే వెన్నెలలు వెదవెట్టీ
వొగ్గి చిత్తగించవయ్యా వువిద నటనలు ॥ నీకూ ॥

జోకలు కాఁగిటఁ దేర చుట్టరికము చెప్పీని
మేకులు మురిపెమున మెరఇంచీని
యీకెను శ్రీవేంకటేశ యేలితివి నన్ను మెచ్చి
మేకొనవయ్యా అలమేలుమంగ రతులు ॥ నీకూ ॥ 217

గౌళ

నీవెఱఁగవా తగవు నెఱజాణ విన్నిటాను
వేవేలకు నేమూ నీకు విన్నవించే మిపుడు ॥ పల్లవి ॥

వలచినయాటదాని వద్దని తోయఁదగదు
తలకొని వెదకఁగా దాఁచఁదగదు
పిలిచి వేఁడుకోఁగాను పెనఁగ మరి తగదు
చెలియప్రియము లిఁకఁ జేకొనవయ్యా ॥ నీవె ॥

చేయెత్తి నీకు మొక్కఁగా సిగ్గులు వడఁదగదు
ఆయము లంటఁగా నొఁగాదనఁ దగదు
పాయక బత్తి సేయఁగా పరాకుసేయఁదగదు
యీయింతికోరిక లిఁక నీడేరించవయ్యా ॥ నీవె ॥

తాలిమితోఁ జూడఁగాను తలవంచుకోఁదగదు
కేలువట్టి తియ్యఁగా జంకించఁదగదు
యేలితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
నీలాలకిచన విఁక నెరవేరించవయ్యా ॥ నీవె ॥ 218

## మంగళకౌసిక

ఇప్పుడు నీవు రాఁగాను ఇంత సంతోసించెఁగాని
వుప్పతిల్లుఁ గోరికల నువ్విళ్ళూరుచుండును ॥ పల్లవి ॥

మగువతోఁ జెప్పెంపినమాటలు
తగుల నీవు సేసిన తమ్మివాటులు
సొగిసి జాజాలాడిన చోటులు
నిగిడి తలఁచుకొని నీకెదురు చూచును ॥ ఇప్పు ॥

చుట్టమవై నీ వంపిన సొమ్ములు
గుట్టుతో గుబ్బలపై నీగోరి చిమ్ములు
జట్టిగొన్న నీ సరసమ్ములు
నెట్టనఁ దలఁచుకొని నీకెదురుచూచును ॥ ఇప్పు ॥

పొలసి నీవు సేసిన పొందులు
విలసిల్లు నీమోవి విందులు
కలసి శ్రీవేంకటేశ యలమేల్మంగ
నిలిచి తలఁచుకొని నీకెదురు చూచును ॥ ఇప్పు ॥ 219

## వాదరామక్రియ

ఎంత బత్తి గలవాఁడ వీకె మీఁదను
వింత మీ పొందులు చూచి వెరగయ్యీ మాకును ॥ పల్లవి ॥

కప్పురవు లప్పఁ గొని కొంతకొప్పు దాఁక వేసి
అప్పుడే వేఁడుకొనే వదేమయ్యా
రెప్పలెత్తి సారెఁ జూచి రెఁచితిఁగా వలవంటా
దప్పిదేర మోవిచ్చేవు తగుఁదగునయ్యా ॥ ఎంత ॥

మనసు చూడవలసి మర్మము సోఁకఁ దిట్టి
చనవిచ్చి లాలించేవు సంగతౌనయ్యా
కొనగోర గుబ్బలపై గురుతులుగా వా(వ్రా?)ని
వినయాలు సేసే వెంత విద్యావాఁడవయ్యా ॥ ఎంత ॥

బలిమిఁ గాఁగిటఁ గూడి పచ్చిదేర వలపించి
సెలవుల నవ్వేవిది చెల్లునయ్యా
అలమి శ్రీవేంకటేశ యలమేల్మంగ నురాన
నిలిపి మన్నించేవు నెరవాదివయ్యా ॥ ఎంత ॥ 220

## రామక్రియ

నాతో పొందు లిఁకఁ జాడు నాలికాఁడా
నీతలఁపులెల్లాఁ గంటి నీటుకాఁడా ॥ పల్లవి ॥

వేడుకకాఁడవై నీవు వేగినంతా చెలులతో
వాడిక చూపితివిగా వన్నెకాఁడా
వీడెపు సెలవులతో వింత వింత మాఁటలాడి
యేడలేని నవ్వు నవ్వే వెమ్మెకాఁడా ॥ నాతో ॥

వుమ్మడి నందరిమీఁద నువ్వివ్వూర వలపులు
కుమ్మరించితివిగా కోడెకాఁడా
చిమ్ముచుఁ జెనకులనే సిగ్గులు రేఁచిరేఁచి
పమ్మిఁ జూపులఁ జూచేటిపంతగాఁడా ॥ నాతో ॥

చేయిమీఁదుగా నీవు చేరి యొకరొకరినే
ఆయము లంటితివిగా అందగాఁడా
యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కాయజకేలిఁ గూడితి కతలకాఁడా ॥ నాలో ॥ 221

**రేకు 1839** **సామంతం**

బత్తిగలవిభుఁడవు భామకు నీవు
యిత్తల నాకె చనవు యీడేరించవయ్యా ॥ పల్లవి ॥

ముప్పిరివినయముతో మోవితేనె లూరఁగాను
చెప్పీఁ బ్రియాలు నీకుఁ జెలియా
కొప్పు నిక్కఁ బెట్టుకొని కూరిములు చల్లుకొంటా
ఇప్పుడిదె నీకు మొక్కీ నింటికి రావయ్యా ॥ బత్తి ॥

సెలవుల నవ్వుకొంటా చేరి చేరి బుజ్జగించి
సొలసీ సారెకు నిన్ను సుదతి
వలపులు చల్లి చల్లి వాడికలు దలపించి
పిలిచీ నాపె సంగడిఁ బీఁట యెక్కవయ్యా ॥ బత్తి ॥

సన్నలు సేసి నీకు చవులెల్లాఁ గుట్టించి
చన్నులు మోపీ నీకు సకియా
యిన్నిటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కిన్నెర వాయించీఁ గాఁగిట నించవయ్యా ॥ బత్తి ॥ 222

**రీతిగౌళ**

తానే యెఱుఁగు విభుఁడు తన ఇచ్చలోదాన
తానకముగా నన్ను దయఁజూడు మనవే ॥ పల్లవి ॥

తలఁచితే వలపులు తామరదంపరలౌను
సొలసితే మాటలకుఁ జోటు గలుగు
వలెనంటే నాసలు వండవండనట్లవును
పలుమారు నే విన్నపము సేసేదేమే ॥ తానే ॥

యెనసితే దమకము లీఁతలుమోఁతలునౌను
మనసు లేకములైతే మర్మము లంటు
అనువైతే చెనకులు అనలుఁగొనలుసాగు
పెనఁగిపెనఁగి తన్నుఁ బెరరేఁచే దేమే ॥ తానే ॥

కూడితే మొగమిచ్చలు కొండలుఁ గోటులునౌను
జోడువాయ కుండితేను సొంపు లెక్కును
యీడ నన్నలమేల్మంగ నెనసె నింతటిలోనె
వోడక శ్రీవేంకటేశు నొరసే దేమే ॥ తానే ॥ 223

## పాడి

ఆఁడువారిఁ గంటేఁజాలు ఆస నీకెంతైనాఁ గద్దు
పోడిమితోఁ మమ్మంటేవు పొద్దువోదా నీకు ॥ పల్లవి ॥

యెచ్చిన తమకముతో నెదురులు చూచుకొంటా
కచ్చుపెంటి నీకు నాపె గాచుకున్నది
మచ్చికజాణతనాలు మాతో నేమి యాడేవు
అచ్చముగా మాతోపొందు లంతేసి కోపుదువా ॥ ఆఁడు ॥

కందువ నిన్నుఁ బెండ్లాడి కాఁపురము సేసేనంటా
పొందులకు నీతో నాపె పూఁచుకున్నది
చెంది మా చన్నులమీఁద చేతులేమి చాఁచేవు
అందముగ మాతో పొందు లంతేసి కోపుదువా ॥ ఆఁడు ॥

వేడుక నలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
కూడేనంటా నాపె నిన్నుఁ గోరుకున్నది
వాడికగా మమ్ము నీడ వలపించి యేలితివి
ఆడుకోలు మాతోపొందు లంతేసి కోపుదువా ॥ ఆఁడు ॥224

## ఆహిరి

చెలియ మోహము నీకుఁ జెప్పఁగ నలవిగాదు
మలసి నీవే యెఱిఁగి మన్నించుమిఁకను ॥ పల్లవి ॥

యెదురుచూచు నీకు యింతి నీ సుద్దులడుగు
వుదుటుఁ గోరికలతో నువ్విళ్ళూరును
మదిలోనఁ దలపోసు మచ్చికతోఁ జెమరించు
పెదవులఁ దేనెలూరఁ బేరుకొని పిలుచు ॥ చెలి ॥

ఆలకించు నీమాటలు ఆసలు దనలో నించు
వేళ గాచుకొని వుండు వేడుకతోను
మేలుదై తాఁ బొగడు నీమీఁది పదములు వాడు
చాలుకొని నీరాకకు సకినాలు చూచును ॥ చెలి ॥

చేతులెత్తి నీకు మొక్కు సేసచల్లఁ దమకించు
కాత రించలమేల్మంగ కళలు రేఁగు
యీతల శ్రీవేంకటేశ యేలితి వింతలోవచ్చి
రాతిరిఁ బగలు నీ రతులెల్లా మెచ్చును ॥ చెలి ॥ 225

## శ్రీరాగం

ఎటువలె మన్నింతువో యెంత మరిగెనో యీకె
అటువంటి జాణతనా లమరు మీకు మీకె ॥ పల్లవి ॥

ఇంతి నీవాడిన మాట యెదలోన నమ్మకొని
కంతునికి వెరవదు కాఁతాళించదు
మంతనాన నీమీఁది మచ్చికలు దలఁచుక
సంతతము లోలోనె సంతోసించుకొనును ॥ ఎటు ॥

ఇందుముఖి నీచనవు లిట్టె గట్టిసేసికొని
చందమామ గైకోదు జడియదు
చెంది నిన్నుఁ గూడే యాస చిత్తములోఁ బెట్టుకొని
అందెందె చెలులతోడ నాడుకొని మెచ్చును ॥ ఎటు ॥

అలమేలుమంగ నీ నెయ్యపురతులనుఁ జొక్కి
చలిగాలి కలుకదు జాలిబడదు
యెలమి శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
చెలఁగి ఇందుకే నీకు సేవలెల్లాఁ జేసును ॥ ఎటు ॥ 226

## తోండి

చిన్నదానవైతేనేమి చెక్కులునొక్కి నాతఁడు
చన్నుల నొరసి నీవూ జయము చేకొనవే ॥ పల్లవి ॥

చనవిచ్చి కొలువులో సారె సుద్దులడిగీ
మనసురా నాతనితో మాటలాడవే
పెనఁగి పెనఁగి నిన్నుఁ బ్రియమున లాలించీ
చెనకుచు నీవు నిట్టె చిరునవ్వు నవ్వవే ॥ చిన్న ॥

ముచ్చటతో నే పొద్దూ నీ మొగమే తప్పకచూచీ
కచ్చుపెట్టి యెదుటనే కాచుకుండవే
పచ్చడము గప్పి నీకు బాఁతి పడి వేఁడుకొనీ
పచ్చిదేర నియ్యకొని పాదాలు నీ వొత్తవే ॥ చిన్న ॥

లలిమీరి వేడుకతో లాచీ నీపొందులకు
కలపుకోలు సేసుక కాఁగిలించవే
యెలమి శ్రీవేంకటేశుఁడేలె నలమేల్మంగవు
కలకాలమును నీవూఁ గాఁపురము సేయవే ॥ చిన్న ॥ 227

## రేకు 1840 ముఖారి

ఇటువలె నుండవద్దా ఇద్దరి మీ వొరపులు
ఘటియించే మీ వేడుకలు దొరసునయ్యా ॥ పల్లవి ॥

చందురునివంటి మోము సంపెంగ వంటిది ముక్కు
కుందణమువంటిది మేను కోమలికిని
కందువల రూపురేఖ కడుఁగడుఁ జక్కనిది
అందము లెంచితే నీకు నాకెకుఁ దగునయ్యా ॥ ఇటు ॥

చీఁకటివంటి తురుము సింహమువంటి నడుము
పోఁకలవంటి చన్నులు పొలఁతికిని
వేఁకపుఁ బిరుఁదుతోడ వింతసింగారము లవి
యేఁకటతో నీకు నాకె కిట్టె తగునయ్యా ॥ ఇటు ॥

అంచవంటి నడలది అంగజు దీమువంటిది
మించుఁదీగెవంటి దలమేలుమంగ
యెంచఁగ శ్రీవేంకటేశ యేలితివి జవరాలి
అంచెల నీపెకు నీకు నన్నిటా దగునయ్యా ॥ ఇటు ॥ 228

## బౌళి

ఆతఁడెంత నీ వెంత అదేమే నీవు
యేతరితనము లింత ఇతవానీకు ॥ పల్లవి ॥

మొగము చూచి చూచి మొలకనవ్వు నవ్వేవు
యెగసక్కేలకుఁ బతి నిదేమే నీవు
చిగురుమోవిమాటలఁ జిమ్మిరేఁగ సొలసేవు
వెగటుజాణతనాలు వేడుకా నీకు ॥ ఆతఁ ॥

కులుకుగుబ్బ లదరఁ గొసరి సన్నసేసేవు
యెలఇంచే వితని నిదేమే నీవు
చిలుకు గోరికొనలఁ జెనకి వేఁడుకొనేవు
వెలలేని సరసాలు వేడుకానీకు ॥ ఆతఁ ॥

గుట్టుతో వద్దఁ గూచుండి కొప్పు గడుదువ్వేవు
యిట్టె శ్రీవేంకటేశు నిదేమే నీవు
నెట్టన నన్నితఁడేలె నే నలమేలుమంగను
వెట్టికిఁ గూడే వతని వేడుకా నీకు ॥ ఆతఁ ॥ 229

## సాళంగనాట

చిత్తిణి యీపె సుద్దులు చెప్ప గొత్తలు
బత్తి నీపైఁ జేసీ నెంత పగటో తనకు ॥ పల్లవి ॥

మలసి మలసి చూచి మచ్చికతో నీకు లాచీ
పొలఁతికి నీ కెన్నటి పొందోకాని
చెలియకు నీ దిక్కు చే సన్నలనే చూపీ
లలి నెంతటిపని గలదో తనకు ॥ చిత్తి ॥

సిగ్గులు మోమున బెంచి సెలవులనవ్వు నించీ
అగ్గమైన తారుకాణ లవి యెట్టివో
దిగ్గనఁ గనుఁగొనల తేఁకువతో నీకు మొక్కీ
వెగ్గళమై నీపై నెంత [1]లే(వే?)సుకో తనకు ॥ చిత్తి ॥

యే నలమేల్మంగను నన్నేలితి శ్రీవేంకటేశ
తానూఁ గొసరీ నిన్నెంత తగులాయెనో
పానుపుపైఁ బండి నీకు పక్కన నెరుకసేసీ
పూనిన యాస లెంత పొదలీనో తనకు ॥ చిత్తి ॥ 230

1. యతిభంగము

## సామంతం

ఎంత నేరుపరి యీకె యెటువంటి కలికి
మంతనాన నెటువలె మన్నించేవే ఇఁకను ॥ పల్లవి ॥

పొరుగు పోరచిగాను పొలఁతి నీతోడుత
సరసము లాడి యాడి చవిరేఁచెను
తెరలోనికి రమ్మని తెలియ సన్నలుగాను
విరులను వేసి వేసి వేడుక వుట్టించెను ॥ ఎంత ॥

వాడికపొందులు తాను వనిత తేనియలూర
వాడుమోవి చూపి చూపి వలపించెను
వాడలో జక్కఁదనము వడిఁదనకే కద్దని
గోడ నిక్కి చూచి చూచి కోరికవుట్టించెను ॥ ఎంత ॥

చల్లు వెదలుగా నీతో సారెకు నలమేల్మంగ
మొల్లమిగా నవ్వి నవ్వి మోహింపించెను
వెల్లవిరిగా నిట్టె శ్రీవేంకటేశ కూడితివి
యెల్లచోటా మెచ్చి మెచ్చి యింపులు వుట్టించెను ॥ ఎంత ॥ 231

## కాంబోది

నీవు సేసిన చేఁతలే నెలఁతమైఁ గానిపించె
చేవదీ రెందుచూచినాఁ జెలఁగీ గురుతులు ॥ పల్లవి ॥

చెలప చెలపలైన చెమటలతోడుత
వలపులు చెలిమేన వడిసీ నదె
అలపులు నిట్టూర్పులై ముని ముక్కునను
తలఁపులో మచ్చికలు తగిలీ నవె ॥ నీవు ॥

మొనసి మొనసినట్టి మోము కళలతోడుత
పెనగొని తమకము పెరిగీనదె
ననుపుతో సెలవులనవ్వులు చెక్కులమీఁద
నినుపులై సిగ్గులు నిండీ నవె ॥ నీవు ॥

చూడఁగఁ జూడఁగ నేఁడు సొంపగు గుబ్బలయందు
కూడిన మదరాగము గురిసీ నదె
యీడనె శ్రీవేంకటేశ యీకె యలమేల్మంగ
వేడుకలు నీవేలఁగా వెలసీ నవె ॥ నీవు ॥ 232

## దేసాళం

ఒయ్య నొయ్యఁ గానవచ్చె వువిద సొబగులెల్లా
నెయ్యమున మెరసెను నెట్టుకొన్న చేఁతలు ॥ పల్లవి ॥

జలజాక్షి వీనుల జవ్వాది కరఁగులు
చెలువపు చెక్కుచేతిసగ్గులమరఁగులు
మెలుపుఁ గళలమోము మించులమెరుఁగులు
తలకొనెఁ జూడరమ్మ తరుణ లిందరును ॥ ఒయ్య ॥

వనితమోవి మీఁదటి వాడులేనివాళ్ళు
వెనుకొన్న నగవులవెన్నెలపాళ్ళు
తనువుపై చెమటచిత్తడివాన నీళ్ళు
మునుకొనెఁ జూడరమ్మా ముప్పిరిగొని య(యె?)ను ॥ ఒయ్య ॥

అలమేలుమంగమేన నడరెఁ బులకలు
నిలువున జారుకొప్పునెరులమలకలు
యెలమి శ్రీవేంకటేశుఁ డీపె నిట్టె కూడఁగాను
నెలకొనెఁ జూడరమ్మ నిక్కపు గురుతులు ॥ ఒయ్య ॥ 23

**రేకు 1841** **రామక్రియ**

వెంగెము సేయదు సుమ్మీ వెలఁది
అంగవించి తెలిసితే నంతా నీపై మోహము ॥ పల్లవి ॥

చిందేటి నీ మేనిమీఁది చెమటలు వొడగని
గందవొడి వుత్తెంచె కలికినీకు
కందువలఁ దిరిగాడి కడు దప్పిగొంటివని
పొందుగాఁ బన్నీరు చెంబు వుత్తెంచె నీకు ॥ వెంగె ॥

తిద్దుకో కస్తూరిబొట్టు తీరుగా నొసలనని
అద్దమిదె వుత్తెంచె నంగన నీకు
నిద్దురకన్నులకుఁ బూనినతేట లుప్పతిల్లు
పొద్దునఁ బచ్చకప్రము వుత్తెంచె నీకు ॥ వెంగె ॥

ఆవేళఁ గూడి యలపులార ముడుచుకొమ్మని
సేవంతులు వుత్తెంచెఁ చెలియ నీకు
భావింప నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
పోవుల పెండ్లివిడేలు వుత్తెంచె నీకు ॥ వెంగె ॥ 234

**హిందోళవసంతం**

ఇందు నిన్నుఁ దెచ్చుకొంటి నిఁక నేమనీనో కాని
పందేలు వేసి పంతాలు పలికెఁబో యీకె ॥ పల్లవి ॥

నేరుపుల మాఁటలాడి నెరజాణతనాలాడి
చేరి నీతోడుతఁ బొందుసేసెఁబో యీకె
కూరిములు వచరించి గురుతులు చెప్పి చెప్పి
కోరి నిన్ను లోనుసేసెకొనెఁబో యీకె ॥ ఇందు ॥

చుట్టరికములు చూపి చొక్కులను నిన్నుఁ బెట్టి
బెట్టుగాఁ జెనకి వలపించెఁబో యీకె
చుట్టి చుట్టి వచ్చి వచ్చి చూపులనే గిలిగించి
గుట్టుతోడ నిన్ను బాసగొనెఁబో యీకె ॥ ఇందు ॥

కానుకలు నీకొసఁగి కడుఁ గొలువులు సేసి
మోనాన నిన్నాసలను నుంచెఁబో యీకె
యే నలమేల్మంగను నన్నేలితి శ్రీవేంకటేశ
తా నిన్నూ నిన్నాళ్ళదాఁకా దగిలెఁబో యీకె ॥ ఇందు ॥ 235

## పాడి

కూడిన సంతోసమే కొండసేసుకుందానవు
వోడక నిండురతుల నోలలాడవలదా ॥ పల్లవి ॥

సరసమాడనే పట్టె చవులు చూడనే పట్టె
ఇరవై పతితో పొందు లెప్పుడే నీకు
తెరదియ్యనే పట్టె దిష్టించి చూడనే పట్టె
గరిమ నితనితోడి కాఁపురము లెన్నఁడే ॥ కూడి ॥

చిఱునవ్వు నవ్వవట్టె సిగ్గులు వడనే పట్టె
యెఱుకతో మోవిగువ్వా లిఁక నెప్పుడే
గుఱుతులు సేయఁబట్టె గుబ్బలనొత్తనే పట్టె
మఱియు నితనిఁగూడే మంతనము లెన్నఁడే ॥ కూడి ॥

సేవలు సేయనే పట్టె చెమరించనే పట్టె
యీవల గాఁగిటీ చొక్కు లిఁక నెప్పుడే
నీ వలమేలుమంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ
డావటించి పొగడేనీ యలమెచ్చు లెన్నఁడే ॥ కూడి ॥ 236

## పళపంజరం

ఇన్నిటాఁ దగవరివి ఇఁక విన్నవించేదేమి
సన్నలనే మెలఁగుటే సంగతులు గావా ॥ పల్లవి ॥

బత్తితోడ నాపె నీకు పాదా లొత్త రాఁగాను
గుత్తపు గుబ్బ లేఁటికి గోరనొత్తేవు
చిత్తగించి ఇంతేసి సిగ్గులు బయటవేసి
హత్తినయాఁటదాని నారడిఁబెట్టుదురా ॥ ఇన్ని ॥

అట్టె వీడెమిచ్చి నీకు నాకు మడిచియ్యఁగాను
చుట్టి మోవిపైఁ బల్లు సోఁకింతురా
మట్టుమీరి చెనకుచు మానము లంగడిఁ బెట్టి
గుట్టుతోడి యాఁటదాని గోరబుసేతురా ॥ ఇన్ని ॥

మచ్చికతో నలుమేలుమంగ నీతోనవ్వఁగాను
తచ్చి శ్రీవేంకటేశుఁడ తమిరేఁచేవు
మచ్చువేసి యింతలోనె మనసెల్లాఁ గరఁగించి
ముచ్చటైనయాఁటదాని ముంగిటఁ బెట్టుదురా ॥ ఇన్ని ॥ 237

## గౌళ

ఇద్దరిపొందులు నేఁడు ఇందులోనె కానవచ్చె
కద్దులే మీలోని తారుకాణ లెటువంటివో ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చెలి నీతో మాటలాడీ
కులుకుఁ జూపుల నెట్టుకొని చూచీని
వలపులు చల్లుకొంటా వాడికనవ్వులు నవ్వీ
అలర నీపెకు నెంత ఆసలు వెట్టితివో ॥ ఇద్ద ॥

సారెసారెకును నిన్ను చనవునఁ గొసరీని
కూరిమితోఁ గొలువు దాకొని సేసీని
నేరుపులు వచరించి నిండు సరసము లాడీ
యీరీతి సన్నలు నీకూ నీపెకును నెట్టివో ॥ ఇద్ద ॥

చెనకి చెనకి నీకు సేవలెల్లాఁ జేసీని
గొనకొని వద్ద నెలకొని వుండీని
యెనసె శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
వొనరిన మీతొంటివాడఁబాటు లెట్టివో ॥ ఇద్ద ॥ 238

## రామక్రియ

ఇప్పు డెరిఁగితి నేను యీపె నీకుఁ బ్రియమౌత
ముప్పిరి నన్నేలితివి మొక్కే నే నీపెకు ॥ పల్లవి ॥

నిక్కి నిక్కి యీపె నేఁడు నీ మొగమే చూచీని
చొక్కముగ నెటువంటిచుట్టమో నీకు
నెక్కొని సారె సారెకు నీతోనే మాఁటలాడీ
యిక్కువతోడుత నీపై నెంతబత్తో తనకు ॥ ఇప్పు ॥

వద్దికి వచ్చి నీతో వడిగా నవ్వులు నవ్వీ
యిద్దరికి మీలో సన్న లెటువంటివో
కొద్దిమీరి చెక్కునొక్కి కొచ్చికొచ్చి వేఁడుకొనీ
ముద్దు ముద్దువలె నెంతముచ్చటో తనకు ॥ ఇప్పు ॥

మోవితేనె లూరనూర ముంచి వుపారము చూపీ
వేవేలుగా నవి యెంత వేడుకో నీకు
యీవేళ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
దేవులాయ నీకు నెంతతేజమో తనకు ॥ ఇప్పు ॥ 239

**రేకు 1842** **వేళావళి**

రమ్మనవే రమణుని రాఁపులు సేయఁగనేల
సమ్మతాయఁ బనులెల్లా జాగు లేఁక నేఁటికి ॥ పల్లవి ॥

తనివోని తమకము తనమీఁద నుండఁగాను
మనసులో నాడుకోలుమాట లుండఁగా
చెనకిన చెనకులు చెక్కులపై నుండఁగాను
యెనసిన చుట్టరిక మెట్టు వాయనిచ్చునే ॥ రమ్మ ॥

సొరిది నాచూపు తనుఁ జుట్టుకొని వుండఁగాను
సిరులకొప్పున తనసేస వుండఁగా
పొరిఁ దనతమ్ములము పుక్కిట నాకుండఁగాను
మరిగిన నాయాసలు మరవనేలిచ్చునే ॥ రమ్మ ॥

చెప్పిన మనవి తనచిత్తములో నుండఁగాను
చొప్పుగా నామేనఁ దనసొమ్ము లుండఁగా
ఇప్పుడె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
వొప్పుగ నన్నేలె నిఁక వొరయనేలిచ్చునే ॥ రమ్మ ॥ 240

**సామంతం**

చూడనే పిన్నవుగాని సుద్దులెన్నైనాఁ గలవు
యీడువచ్చు నిద్దరికి నిఁకనేల సిగ్గులు ॥ పల్లవి ॥

మొగము చూపవే ముచ్చట దీరఁ బతికి
నగవే వొకమాఁటు నయగారాన
జిగురువంటివలపు చిత్తములో నంటుకొనె
ఇగిరించె జవ్వనము ఇఁకనేల సిగ్గులు ॥ చూడ ॥

కదిసి మాటాడవే కందువలు సోఁకఁగ
గుదిగొనఁ జెనకవే గుబ్బల నొత్తి
ముదరుఁ దేనియ లుబ్బి మోవిపై లుప్పలుగట్టె
యెదిరించెఁ దరితీపు లిఁకనేల సిగ్గులు ॥ చూడ ॥

మొక్కవే శ్రీవేంకటేశుముందర నిలిచి నీవు
అక్కరఁ గాఁగిలించవే యలమేల్మంగ
మిక్కుటపురతులెల్లా మేనితోనే పెనగొనె
యిక్కువలు గరఁగెను యిఁకనేల సిగ్గులు ॥ చూడ ॥ 241

## బౌళి

ఊరకున్నదానినేల వుబ్బురేఁచేవు
నేరుచుఁ జుమ్మీ యాకె నీమతి గరఁచను ॥ పల్లవి ॥

నిక్కిచూచెనంటాను నిమ్మపంటవేసేవు
వుక్కుగుబ్బల నిన్నాకె వొత్తీఁ జుమ్మీ
మొక్కఁగాను కొనగోరు మోచెనంటాఁగెరలేవు
చిక్కించుక నీపైఁ దాను చేఇ చాఁచీఁజుమ్మీ ॥ ఊర ॥

కల కల నవ్వెనంటా కప్పురము చల్లేవు
నెలఁత జవ్వాది నీపైఁ నించీఁ జుమ్మీ
కొలువులో పయ్యదకొంగు దాఁకెనంటాఁ దిట్టే -
వలరి మారుకుమారు అననోపుఁ జుమ్మీ ॥ ఊర ॥

కందువకు వచ్చెనంటా కాఁగిట బిగించేవు
కిందుపడ నిన్ను రతి గెలిచీఁ జుమ్మీ
అందపు శ్రీవేంకటేశ యలమేలుమంగ యీకె
అందికూడితి విట్టె ని న్నగ్గలించేఁ జుమ్మీ ॥ ఊర ॥ 242

## భైరవి

ఇంతులకుఁ బతులకు నిక్కువ లివె
చెంతనున్న యీతనికి సేవ లిట్టె సేయవే ॥ పల్లవి ॥

కనుచూపులలో నుండు కందువైన సన్నలు
పెనగులాటల నుండు ప్రియములెల్లా
వినయములందు నుండు వేడుకైనమొగమోట
ననుపులయందు నుండు నవ్వుల సరసము ॥ ఇంతు ॥

కంచము పొత్తులనుండు కలయుచుట్టరికము
మంచిమాటలనె వుండు మమకారము
వంచెన మొక్కుల నుండు వాడికైన తరితీపు
నించిన నేర్పుల నుండు నెలకొన్న సిరులు ॥ ఇంతు ॥

పచ్చిచేఁతలలో నుండు భావములకరఁగులు
ఇచ్చకములో నుండు ఇంపు లమరి
అచ్చపు శ్రీవేంకటేశునలమేల్మంగవు నీవు
కొచ్చి కొచ్చి యీగతుల కూడిమాడి వుండవే ॥ ఇంతు ॥ 243

## శుద్ధదేశి

ఎన్నైనాఁ గలవు పను లెక్కడ చూచినా నీకు
కన్నుల మాదిక్కు చూచి కరుణించవయ్యా ॥ పల్లవి ॥

వెలఁదిమాటలు నీకు విన్నపము సేసితిమి
అలరి మారుత్తరము లానతీవయ్యా
తలఁపు దెలిసి నీకు తనమారు మొక్కుమనె
చెలఁగి ముమ్మాటికిని చేకొనవయ్యా ॥ ఎన్నై ॥

శేమ నీ కంపినయట్టిలేక లిదె తెచ్చితిమి
మేమరుఁ జదువుకొంటి వేమనేవయ్యా
ప్రేమతోఁ దనకుఁదాను ప్రియములు చెప్పుమనె
మా మనవి చిత్తగించి మన్నించవయ్యా ॥ ఎన్ని ॥

అలమేలుమంగ గురు తదె నీకుఁ జూపితిమి
కలసి లోన నల్లదె కైకొనవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిటువచ్చి కూడితివి
తలఁపు లెల్లా నీడేరె తగులై యుండవయ్యా ॥ ఎన్ని ॥ 244

## పాడి

ఇన్నాళ్ళవలెఁ గాదు ఇప్పుడు నీవున్నజాడ
కన్నులపండుగలుఁగాఁ గానవచ్చె మాకును ॥ పల్లవి ॥

మొగమునఁ గళలెక్కె ముచ్చటలు గడు నిక్కె
మగువ నీపతివచ్చి మన్నించె నటే
నగవు సెలవిఁ దేరె ననిచి సిగ్గులు మీరె
మిగులా నాతఁడు నీకు మేలువాఁ డాయనటే ॥ ఇన్నా ॥

కన్నుల వెన్నెలగాసె కడుఁ గుచములు రాసె
యెన్నికగాఁ జన వాతఁ డిచ్చెనటవే
చిన్నిమోవి దేనెలుబ్బె చెక్కుల గురుతు లబ్బె
వున్నతి నీయింటిలోఁ దానున్నవాఁడటే ॥ ఇన్నా ॥

నొసలెల్లాఁ జెమరించె నునుమేను పులకించె
యెసఁగి శ్రీవేంకటేశుఁ డేలెనటవే
మసలక యలమేలుమంగవు పగలురేలు
వసమైతి వీతఁ డిట్టె వరమిచ్చెనటవే ॥ ఇన్నా ॥ 245

**రేకు 1843** **వరాళి**

నిన్నూ నాపెనుఁ జూచి నివ్వెరగందితి నేను
యిన్నేసిచేఁతలు మీకు నిద్దరికే తగును ॥ పల్లవి ॥

వింత వింత మాటలాడి వెలఁది నీ యెదుటను
దొంతిఁబెట్టీ వలపులు తోడఁదోడను
పంతముతో నేరుపులు పచరించి పచరించి
యెంతకెంత సేసి యీకె యెలయించీ నిన్నును ॥ నిన్నూ ॥

వాడికెగా మోవితేనె వాసనలు చూపి చూపి
కూడపెట్టీ వేడుకలు గుట్టుతోడను
వీడెపు సెలవినవ్వు వెదచల్లి వెదచల్లి
నోడలఁబెట్టీ యీకెంత నోరూరించే నిన్నును ॥ నిన్నూ ॥

సారె సారె రతుకు సమ్మతించ వేఁడుకొని
తూరుపెత్తీఁ దమక మేతులతోడను
కోరి యలమేలుమంగ గూడినశ్రీవేంకటేశ
చేరి నన్నేలితి వాకె చిమ్మిరేఁచీ నిన్నును ॥ నిన్నూ ॥ 246

**లలిత**

నీవెఱఁగవా తగవు నేరుపరి విన్నిటాను
వేవేలుగతుల నేము విన్నవించే దేమి ॥ పల్లవి ॥

చనవుగలుగుసతి సణఁగులు రాలిచితే
యెనసినపతి యెగ్గు లెంచరాదు
తనివోని తమితోడ తరుణులు జంకించితే
వినయముతోడుత వేఁడుకొనవలెను ॥ నీవె ॥

వేడుకగల తరుణి వెక్కసములాడితేను
వాడికైనమగవాఁడు వద్దనరాదు
కూడినమందెమేళాన కొమ్మలు గొసరితేను
పాడిపంతాలు నెరపి బత్తిచూపవలెను ॥ నీవె ॥

ఘట్టమైన జవరాలు సొలసి పెనఁగితేను
జట్టిగొన్న నెరజాణ సాదించరాదు
ఇట్టె యలమేలుమంగ నేలిన శ్రీవేంకటేశ
పట్టపుదేవులఁజేసి పాయకుండవలెను ॥ నీవె ॥ 247

## ఆహిరి

తెలుసుకోవయ్యా యీపె తెఱఁగు విచారించి
వులివచ్చితమితోడ నుమ్మగిలి నేఁటికి ॥ పల్లవి ॥

తేనెలూర పాటవాడి తెరలోన మాటలాడీ
యీ నెలఁత చక్కఁదన మెటువంటిదో
తానాలు వుట్టి వీణెతంత్రులెల్లా బిగిఇంచు
గానవిద్య యీపె యెంత కడునెరవాదియో ॥ తెలు ॥

పంతమున నవ్వు నవ్వి పయ్యదలో దాఁచుకొనీ
యెంతలేసి గొప్పలో యీపె చన్నులు
దొంతిఁ బెట్టి వలపులు తొంగి తొంగి చూచీని
చెంత నిట్టె యీపె యెట్టి చేఁతలాఁడియో ॥ తెలు ॥

చెలులతోఁ జెప్పిపంపి సేసలు నీపైఁ జల్లీ
ఇలఁ గలికితనాల నెంతటిజాణో
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
తెలిపి పెండ్లాడె నెంత దిట్ట కతకారియో ॥ తెలు ॥ 248

## వరాళి

ఇంకా నేమియడిగేవు యిటు మమ్ము సుద్దులు
తెంకినే వినవయ్యా నీ దేవుళ్ళ సుద్దులు ॥ పల్లవి ॥

పొలఁతి సెలవులను పున్నమవెన్నెలగాసె
కలసి చన్నులతో జక్కవలు రాసె
కులుకుఁ గుత్తికలోను కోవిలలు గూసెను
వసితే వినవయ్యా వలపుల సుద్దులు ॥ ఇంకా ॥

పడఁతినోరఁ జిలుకపలుకులు వెడరేఁగె
తడవికొప్పునఁ దుమ్మిదలు మూఁగెను
చిడుముడి నడుమను సింహపుఁగొదమ దాఁగె
యెడయక వినవయ్యా ఇవిగో సుద్దులు ॥ ఇంకా ॥

యీలేమపిరుఁదున నిసుకదిబ్బలు వెట్టె
కోలుముంధై మేన మెఱుఁగులు దొట్టెను
యేలితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
ఆలకించి వినవయ్యా అరుదైన సుద్దులు ॥ ఇంకా ॥ 249

## చాయానాట

సందు గలిగితేఁ జాలు చంకఁ బెట్టేవు
యెందరిఁ బెండ్లాడితివో ఇటువలె నీవు ॥ పల్లవి ॥

వేడుకకు నీకు నాపె విందు చెప్పవచ్చితేను
యీడనే మోవితేనియ లిమ్మనేవు
వాడికకు వచ్చి నీవద్ద నిట్టె కూచుండితే
తోడనే యింతలో నీతొడ యెక్కుమనేవు ॥ సందు ॥

తామరపువ్వులు నీకు తగఁ గానుకిచ్చితేను
చేముంచి యాకెను నీవు చేయివట్టేవు
ప్రేమముతో విడెమిచ్చి ప్రియములు చెప్పితేను
గోమునఁ బెంచేచన్నులు గోర నూఁదేవు ॥ సందు ॥

మలసి యలమేలుమంగ మాటలు నీతో నాడితే
పలుమారు మోమే తప్పక చూచేవు
యెలమి శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
సెలవుల నవ్వితేనే సేసవెట్టేవు ॥ సందు ॥ 25(

## మధ్యమావతి

ఎన్నికాయ లోకమున కివిగో మీ సొబగులు
అన్నిచందముల మీరు అమరివున్నారు ॥ పల్లవి ॥

కొమ్మకును నీకును గూడినవేళ లెట్టివో
పమ్మికొన్న మీనోముఫల మెట్టిదో
కమ్మర మీపొందులు కంతుఁడెట్టు గూరిచెనో
ఇమ్ముల బాలును నీరు నెనసినట్టున్నారు ॥ ఎన్ని ॥

యిద్దరికిఁ బొంతనాలు యెటువలెఁ గూడెనో
అద్దుకొన్నమాటపట్టు లవి యెట్టివో
బుద్ధులు వెన్నతోఁ బెట్టి బోదించినవా రెవ్వరో
వొద్దిక మెరుపుమేఘ మొనరినట్టున్నారు ॥ ఎన్ని ॥

వువ్విళ్ళూర మీమనసు లొక్కజాడ లెట్టాయనో
జవ్వనము లెటువలె సమమాయనో
యివ్వల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
పువ్వుఁబరిమళమునై పొసఁగి యున్నారు ॥ ఎన్ని ॥ 25

**రేకు 1844** **శ్రీరాగం**

ఎంత మన్నించినా నీకు నీడుజోడయినదె
దొంతి సోబనాలతోడి తొయ్యలివో యీపె ॥ పల్లవి ॥

కంకణదారాలు గట్టి కప్పురవిడెము లిచ్చీ
అంకెలఁ గాలుదొక్కిన ఆపెవో యీపె
సుంకులు చెరిగించుక సారిదిఁ దోడనీళ్ళాడి
లంకెఁ బెండ్లిపీఁటెక్కిన లలనవో యీపె ॥ ఎంత ॥

తెరమఱఁగున నుండి దిగ్గన మొగముచూపీ
అరిమురి సేసవెట్టినట్టి ఆపెవో యీపె
సిరులఁ దాళిగట్టుక చేరి బువ్వా లారగించీ
సరి బాసికంబుల సకియవో యీపె ॥ ఎంత ॥

వూరల్లా నేఁగివచ్చి వొగిఁ గట్నా లిప్పించుక
ఆరతులెత్తించుకొన్న ఆపెవో యీపె
యీరీతి నలమేల్మంగ యీకె శ్రీవేంకటేశుఁడ
కూరిమి నీ దేవులైన కొమ్మవో యీపె ॥ ఎంత ॥ 252

**కాంబోది**

మంచితనము సేసితే మచ్చికలు సతమౌను
ముంచి మొకదాకిరిగా మొక్కవే యీతనికి ॥ పల్లవి ॥

సారెసారె మాటలు చవులుగా నాడితే
వోరువనివారికైనా వొడఁబాటౌను
యీరీతులనే పతి యేమిసేసి వచ్చినాను
చేరి చేరి ప్రియములే చెప్పవే యీతనికి ॥ మంచి ॥

కడుఁ జుట్టరికములే కలయ మెలఁగితేను
కడవారికైనాను కరఁగు మతి
గుడిగొని యీతనిమై గురుతు లెన్నుండినాను
చిడుముడి నిచ్చకమే సేయవే యీతనికి ॥ మంచి ॥

పిలిచి ప్రియముచెప్పి పెనఁగఁగఁ జూచితేను
కలయనివారికైనా కడఁగుఁదమి
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగవు
చెలఁగికాఁపురములు సేయవే యీతనికి ॥ మంచి ॥ 253

## బౌళి

ఆతఁ డదె నిలుచున్నాఁ డండకు బిలుచుకోవే
నాతులకుఁ బతితోడి ననుపులే మేలు ॥ పల్లవి ॥

తెగరానిచోటులకు తియ్యనిమాటలే మేలు
మొగదానికిరైన య(యె?)డ మొక్కులే మేలు
తగవు దప్పనియందు తాలిములే మేలు
వెగటేల పతికిఁక వీడె మియ్యవే ॥ ఆతఁ ॥

యెదురాడరానిచోట నియ్యకొనుటే మేలు
వదలనిపొందులకు వాడికే మేలు
చెదరవి యాసలైతే సిగ్గులువడుటే మేలు
పదరకిట్టె పతికిఁ బాదాలొత్తవే ॥ ఆతఁ ॥

గుట్టు విడువనిచోట కూడియుండుటే మేలు
మట్టుమీరరానిచోట మచ్చికే మేలు
నెట్టన నలమేల్మంగ నీకు నిన్నిటామేలు
యిట్టె శ్రీవేంకటేశు కితవుతోఁ గూడవే ॥ ఆతఁ ॥ 254

## సామంతం

ఈవనిత నీకె తగు నెంత భాగ్యమంతురాలో
వేవేలు తెరఁగుల వెలసీ నీకాఁగిట ॥పల్లవి॥

జక్కవ పిట్ట(పిట్ట)లలలోని చక్కఁదనాలు చన్నులు
నిక్కుఁగొప్పు రంగైన నీలాల పుట్టు
ముక్కు సంపెంగపువ్వుల మోహన సింగారము
యెక్కడ గాఁ బొగడేము యీయింతి సొబగులు॥ఈవ॥

చిగురుటాకుల మించు చెలువము కెమ్మోవి
మొగము చంద్రకళలమునిముంగిలి
జగిగలనెన్నడుము సింహపుఁగొదమ యొప్పు
తగ నెట్టు పోలిచేము తరుణి యంగములు ॥ఈవ॥

మరుని బండికండ్ల మహిములు పిరుఁదులు
సరిఁ బాదములు జలజపు సొంపులు
నిరతి శ్రీవేంకటేశ నీదేవు లలమేల్మంగ
అరుదు లేమని చెప్పే మతివ చందములు ॥ఈవ॥ 255

## పాడి

ఎంత కెంత నీసుద్దు లేమనవచ్చు
అంతరంగమైన చెంత (చేఁత?) లంగడిఁబెట్టుదురా॥పల్లవి॥

చెలియ సెలవులను చిరునవ్వు నవ్వఁగానె
యెలమి నీవేకాంతము లేమాడేవు
మొలక సిగ్గులతోడ మోము వంచుకొనఁగానె
అలరి తొంగిచూతురా ఆపె మోము నీవు ॥ఎంత॥

వనిత నీకొలువులు వాడికతోఁ జేయఁగానె
పని చెప్పేవు పానుపు పరచుమని

చనవున గుట్టుతోడ సన్న నీకుఁ జేయఁగానె
పెనఁగి పచ్చిసేతురా ప్రియురాలి నీవు ॥ఎంత॥

అలమేలుమంగ నీయక్కుమీఁద నుండఁగానె
బలిమిఁ గాఁగిట నెంత బత్తి చూపేవు
అలరి శ్రీవేంకటేశ ఆపె నిన్ను మెచ్చఁగానె
పలుకులఁ జెప్పుదురా పంతమెల్లా నీవు ॥ఎంత॥ 256

### ఆహిరి

ఈతలఁ పెరిఁగి నీవే యీకెను మన్నించవయ్యా
కాతరాన నీకుఁగానే కాచుకొని వున్నది ॥పల్లవి॥

సారెసారె నిన్నుఁ జూచి సతి తన లోలోనె
వూరకె తమకమున నువ్విళ్లూరీని
చేరి నీవద్దఁ గూచుండి చిప్పిలు వలపులను
కోరికె తీరికె లెత్తఁ గురిసీఁ జెమటలు ॥ఈత॥

మత్తిలి నీతోడుత మాటలాడి యాడి చెలి
చిత్తజ కేలి రతులఁ జిమ్మిరేఁగీని
హత్తి నిన్నుఁ జెనకేటి యాసలు మిక్కుటమై
కొత్త కొత్త వేడుకల గుబ్బతిలీ మనసు ॥ఈత॥

గుట్టుతోడ మొక్కుమొక్కి కుచ్చి నిన్నుఁ గాఁగిలించి
అట్టె నివ్వెరగందె నలమేల్మంగ
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి వీకె నిట్టె
వొట్టుకొన్న సంతోసాల నోలలాడీ నిపుడు ॥ఈత॥ 257

**రేకు 1845** ### దేవగాంధారి

ఇట్టే నన్నేలితివని యీకెతో నే విన్నవించే
చుట్టమవైన నీతో జోడాయ మీవలపు ॥పల్లవి॥

నీకుఁగానే పూనుకొని నేరుపుమాట లాడఁగా
యీకె నీ దేవులని నే మెరిఁగితిమి
చేకొని నీవుంగరము చేతఁ బెట్టుకుండఁగాను
సాకిరి దెలుపనేల సంగతాయ వలపు ॥ఇట్టే॥

నీవు పూసిన కస్తూరి నెలఁతమేన నుండఁగా
దేవర గురుతులెల్లాఁ దెలిసితిమి
భావ మేర్పరచనేల పచ్చిదేరె వలపు ॥ఇట్టె॥

నెలఁత పుక్కిట నిట్టె నీవు తమ్ముల మిడఁగా
కలసిన నీపొందులు కనుఁగొంటిమి
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిలుకడలై మీకు నెరవేరె వలపు ॥ఇట్టె॥ 258,

## భూపాళం

ఎవ్వరు వద్దనేరు నీవేమి సేసినా
జవ్వని వలచి వచ్చెఁ జనవియ్యరాదా ॥పల్లవి॥

కొమెరవయసుకాంత కోరి నీతో మాటలాడీ
తమితోడ వినవయ్యా తలవంచక
చెమటలు గారఁగాను చేరి నీపాదాలొత్తీ
జమళిఁ దొడల మీఁదఁ జాఁచరాదా ఇపుడు ॥ఎవ్వ॥

ననుపుగలయాఁటది నవ్వుల నవ్వీ నీతో
చెనకి యియ్యకోవయ్యా సిగ్గువడక
వినయముతో నీకు వీడెము చేతికిచ్చీ
కొనగోర (రు?) సోఁక నందుకొనరాదా ఇపుడు ॥ఎవ్వ॥

దేవులలమేల్మంగపతివి నీకు నీకె మొక్కీ
వేవేగ నేలుకోవయ్యా వింతసేయక

యీవేళ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కైవశమై వుండరాదా కలసి నీ విపుడు ॥ఎవ్వ॥ 259

## ధన్నాసి

నీవేఁటికిఁ జింతించేవే నీమగఁడు నిన్ను నేలీ
కావలసిన పనులు కమ్ముకొనీఁగాక ॥పల్లవి॥

తలఁపులో తమకము దట్టమై పెరిగితేను
చెలిమి మిక్కుటమై చేఁగయెక్కదా
తలకొన్న జవ్వనము తతివచ్చి పొదలఁగా
కలయిక రతులు పోఁకకుఁ బుట్టెఁ డమ్మవా ॥నీవేఁ॥

కందువచుట్టరికము కలుగఁ బెనఁగితేను
ముందు ముందే వలపులు మోపులుగావా
సందడించి మాటలు చవులుగా నాడితేను
యిందరికి మోహనరసా లేరులు గావా ॥నీవేఁ॥

తగులైన కోరికలు తారుకాణలైతేను
నగవులు సెలవుల ననలొత్తవా
జిగి నిన్నుఁ గూడె నిదె శ్రీవేంకటేశ్వరుఁడు
నిగిడి కాఁగిటిసొంపు నిచ్చపెండ్లి గాదా ॥నీవేఁ॥ 260

## సౌరాష్ట్రం

చింతించకురే ఇఁకఁ జెలులాల
మంతుకెక్కె నిన్నీ మన్నించీలె కనకా ॥పల్లవి॥

కలికి తుమ్మిదలు కడుఁ జుట్టాలు
పొలసి కురులు వాఁటిఁ బోలుఁగనక
కలదు మొగమోట మిక్కడ శశికి
వెలలేని యీపెనవ్వు వెన్నెలలే కనకా ॥చింతిం॥

పడఁతికి చిలుకలు ప్రాణప్రదము
అడరి యీకె మాఁటలు అవే కనక
విడువరాని పొందు కోవిల లీపెకు
తొడరి యీపె యెలుఁగుతో సరి గనకా ॥చింతిం॥

అతివకు విరులు పాయని చెలిమి
తతి నీపె మేనితావిఁ దగుఁగనక
అతనుఁ దీపెకు నెనరైనవాఁడు
యితవై శ్రీవేంకటేశు నెనయించెఁ గనకా ॥చింతిం॥ 261

## తెలుఁగుఁ గాంబోది

మనవారే యందరును మతి నెంచి చూచితేను
పెనగొన్న సంతోసాలే బెరసీ మీకిఁకను ॥పల్లవి॥

చిత్త పోఁజులే కావా చిలుకలుఁ గోవిలలు
కొత్తవారంటానేల కొంకేవే నీవు
మత్తిలి కొసరితే నీమాఁట పలుకులో నివి
హత్తి వుండవలెఁగాక యట్టె దూర నేఁటికే ॥మన॥

వసంతుని చుట్టాలే కావా తుమ్మెద మూఁకలు
మసలక వీఁటినేల మచ్చరించేవే
సొసఁగఁ దలకెత్తుక పూజించఁదగిన వివి
కొసరుచుఁ గోపగించుకొనకువే నీవు ॥మన॥

చందురు సిరులే కావా జడిగొన్న వెన్నెలలు
నిందించ నేలే యవి నీమోము సొంపు
అందపు శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
పొందుసేయవే మేలు పొదలు సరసము ॥మన॥ 262

## పాడి

ఎన్ని వేసాలు నేరిచె నిదివో యీకె
నిన్నడిగేఁ జెప్పవయ్యా నేఁడు నాతో నన్నియు ॥పల్లవి॥

చెలులచే నాపె నీకుఁ జెప్పిపంపినమాటలు
వెలలేని వేడుకతో వినుకొంటివా
కలికితనాల వారి కానుక నిమ్మపండ్లు
అలరుచుఁ జేతులారా నందుకొంటివా ॥ఎన్ని॥

పొందుగా నాపె నీకుఁ బుత్తెంచిన లేకలు
తుందుడుకులేక చదువుకొంటివా
చెంది తనరూపు వా(వ్రా?)సిన చిత్రపు పటము
కందువగా నీవు లెస్స కనుఁగొంటివా ॥ఎన్ని॥

యిక్కడికిఁ దానే వచ్చి యిచ్చిన యీపె వీడెము
పిక్కటిల్ల నీవుక్కిటఁ బెట్టుకొంటివా
యిక్కువగా శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వుక్కుమీర నాపెచేత నూడిగాలు గొంటివా ॥ఎన్ని॥ 26

### రేకు 1846 భైరవి

మేలు మేలే నీకతలు మెచ్చిరి మగువలెల్లా
యీలాగులు నీగరిమ లేమని చెప్పుదమే ॥పల్లవి॥

చెప్పేవు చుట్టరికాలు సేసేవు వినయాలు
దెప్పరాన పతినెంత తేలించేవే
కుప్పళించేవు ప్రియాలు గుదిగుచ్చేవు చూపులు
ఇప్పు డింతేసి చేఁతలు యెక్కడ నేర్చితివే ॥మేలు॥

చూపేవు నయగారాలు చొక్కించేవు సొలపుల
నీ పంతము నింతేసికా నెరపితివే

రేఁపేవు వలపు లూరించేవు తమకము
యీపాయాన జాణతనా లెన్ని గరచితివే ॥మేలు॥

యిచ్చకములే యాడేవు యింపులే వెదచల్లేవు
గుచ్చల నెన్నాళ్లనుండి కాచియుంటివే
యిచ్చల శ్రీవేంకటేశు నెనసితి విట్లానే
పచ్చిదేర నిన్నిటాను భాగ్యము సేసితివే ॥మేలు॥ 264

## ముఖారి

అందాలు సేసుక నీవూ నాకెతో నవ్వుత గాక
అందరిముందరా నీకూ నాన లింతేశాలయ్యా ॥పల్లవి॥

పాలసివుండి వొచ్చినాపె పలుకు నేమైనా నిన్ను
బాసలెన్ని సేసి వొడఁ బరచేవయ్యా
వాసిగలయాపె మాఁట వట్టి తప్పులెంచఁజూచు
తాసువలెఁ జూచి యెంత తారుకాణించేవయ్యా ॥అందా॥

వలచివచ్చినయాపె వలసినట్టు చేసు
సొలసి యెంత నీ వొడ్డించేకొనేవయ్యా
బలిమి గలిగినాపె పైకొని నీతోఁ బెనఁగు
చలమున బొమ్మలను జంకించనేలయ్యా ॥అందా॥

బత్తిగల యాపె గుబ్బల నొత్తి కాఁగిలించు
కొత్త సిగ్గులతో నేమి గుంపించేవయ్యా
ఇత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చిత్తగించి కూడితివి చెనకఁగ నేలయ్యా ॥అందా॥ 265

## కాంబోది

నిన్ను నెంచి చూచితేను నీకు నెవ్వరు సరి
మన్నించె నీరమణుఁడు మరియేల కొంకను ॥పల్లవి॥

వనిత నీ జవ్వనము వలపుల కొటారు
పనుపడ్డ తుమ్మెదపాళము కొప్పు
గొనకొన్న గండుమీల కొలఁకులు కన్నులు
మనసిజ బలాలు నీమహిమలే కదవే ॥నిన్ను॥

జలజాక్షి నీవురము చక్రవాకములు రచ్చ
మలయుఁ జల్లగాలికి మనికి ముక్కు
పలుకుఁ జిలుకలకు పంజరము నీనోరు
బలుమరు బలాలు నీ భావములే కదవే ॥నిన్ను॥

అలమేలుమంగ నీమో మలచందురుని గీము
తళుపు మైసింగారాల దాఁపరము
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
వలరాచబలాలు నీవసమే కదవే ॥నిన్ను॥ 266

## పాడి

నీవెరిఁగిన బుద్ధులే నేమూ నీకుఁ జెప్పేము
యేవేళాఁ జెలులము నే మెచ్చరిచవలెను ॥పల్లవి॥

పెనఁగుచు సరసము పెంచితేఁ బెరుగును
వినయమే నెరపితే వేడుక వుట్టు
మునుకొని మొక్కితేను మొగమోట సమకూడు
మనసురా మెలఁగితే మగఁడు మన్నించునే ॥నీవె॥

తగులు వాయకవుంటే తనుఁదానె దయవుట్టు
నగితేఁ జుట్టరికము నాఁటుకొనును
తగవు నడిపితేఁ బంతములెల్లా నీడేరు
మగువ వోరుపు గలితే మగఁడు మన్నించునే ॥నీవె॥

ఇచ్చకమే చూపితేను యింపులౌను రతులెల్లా
యెచ్చరించి కూడితేను యితవైయుండు
కొచ్చి యలమేలుమంగఁ గూడె శ్రీవేంకటేశుఁడు
మచ్చిక నీతఁడే నీమగఁడు మన్నించునే ॥నీవె॥ 267

## దేసాళం

అదివో కాచుకున్నాఁ డప్పటనుండి నీవొద్ద
పొదిగొన్న రతులను భోగించరాదా ॥పల్లవి॥

చలపాది తనమేల సాదింపు లిఁకనేల
పిలిచి పతిఁ గాఁగిట బెనఁగరాదా
మొలక సిగ్గులవేల ముసిముసి నవ్వులేల
తలిరుమోవి చూపి దప్పిదేర్చరాదా ॥అది॥

వట్టిగుట్టివియేల వాసి వంతు లింతయేల
వొట్టుక యీతని పాదాలొత్తఁగరాదా
చుట్టి చుట్టి యాడనేల సొలపు జంకెన లేల
చుట్టరికము గలయ సుద్దులు చెప్పరాదా ॥అది॥

తమకము దాఁచనేల తరితీపు సేయనేల
తిమురుచు నీవలపు తెలుపరాదా
అమరు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
మమతఁ గూడితి విట్టె మన్నింపించికోరాదా ॥అది॥ 268

## వరాళి

ఎంత చూచితే నేము ఇద్దరికి హితలము
కంచపు మోవుల గలగలపాయ వలపు ॥పల్లవి॥

యింతి నీయవసర మెరిఁగిరా నంపె నన్ను
కాంత నీవు నున్నారు గద్దెమీఁదను

అంతలోనే రేఁ (రెం?)ట దెప్పులాయను మీవలపులు
వింత సుద్దు లింకేమని విన్నవింతునయ్యా ॥ఎంచి॥

తరుణి నన్నంపె నీ తలఁపు దెలియుమని
పరిమళము వూసెవు పడఁతికిని
సరిబేసులైయున్నవి సంగడి మీ వలపులు
వెరవుతో నేమని విన్నవింతునయ్యా ॥ఎంచి॥

అలివేణి నిన్నుఁ జూడనంపె శ్రీవేంకటేశుఁడ
అలమేలుమంగ వున్నదక్కన నీకు
కలసితివి ముప్పిరిగా నీపెను వలపులు
వెలసితి రేపవలి విన్నవింతునయ్యా ॥ఎంచి॥ 269

**రేకు 1847** **వరాళి**

నావాఁడనేయంటా నాకింత దెలుపనేల
కైవశమై వున్నాఁడవు కాంత లిదెరఁగరా ॥పల్లవి॥

ఆనవెట్టకు నీమీఁద నట్టె వరవాతును
కానీలే నీ నిజమెల్లాఁ గనేముగాక
నానఁ బెట్టకు నవ్వులు నడుమ సెలవులను
యీనీజాణతనము లిందరు నెఱఁగరా ॥నావా॥

పట్టకు మాచన్నులు పైపైఁ బెరిగేపొద్దు
అట్టె దాష్టీకుఁడ వైతే నౌదువుగాని
గుట్టుతోఁ దలవంచకు గుబ్బతిలె వలపులు
నెట్టుకొన్న దొరవౌత నెలఁత లెఱఁగరా ॥నావా॥

పెనఁగులాడ కంతేసి బెట్టుగా మే నలసీని
యెనసితివి కోరికె లీడేరీఁ గాని
ఘనుఁడ నే నలమేల్మంగను శ్రీవేంకటేశ్వర
నను నీవు మన్నించేది నాతులెఱఁగరా ॥నావా॥ 270

## ఆహిరినాట

ఏమని విన్నవించేము యీపె సుద్దులు
కోమలికోరికె లివి కోటానఁ గోట్లు ॥పల్లవి॥

పడఁతుల నీగుణాలు పలుమారు నడుగును
వుడివోని సంతోసాల నుమ్మగిలును
తడయక కొంతవడి తలఁచు నీరూపము
వడియుఁ జెమటతోడ వలలఁ బొరలును ॥ఏమ॥

నిలుచుండి తొంగి తొంగి నీరాక కెదురుచూచు
సొలసి యడియాసల బొద్దు గడపు
పలుకు నీవుండినట్టే భావించి పానుపు మీఁద
అలరి తననీడ నీవని కాఁగిలించును ॥ఏమ॥

ఆకు మడిచి నీకిచ్చేనని నోర నందిచ్చు
పైకొని వోలలాడును భావరతుల
చేకొని ఇంతలో వచ్చి శ్రీవేంకటేశ కూడితి -
వీకె యలమేలుమంగ ఇప్పు డురమెక్కెను ॥ఏమ॥ 271

## సామంతం

ఎవ్వరికిఁ గలవమ్మ ఇటువంటి సొబగులు
నివ్వటిల్ల నన్నియును నీకే తగుఁగాక ॥పల్లవి॥

జక్కవగుబ్బల మీఁద జారేటి పయ్యదకొంగు
చెక్కులపై వడిసేటి చెమటనీరు
పుక్కిటి బంటియైన పొలపనిట్టూరుపులు
ఇక్కువలై కనుపట్టె నేనోము నోఁచితివో ॥ఎవ్వ॥

కడలేని బిత్తరపు కనుచూపుతేటలు
గుడిగొన రాలేటి కొప్పువిరులు

జడియక తొలఁకేటి చక్కని మోముకళలు
అడరి నీవు సేసిన దది యెంత భాగ్యమో ॥ఎవ్వ॥

మొగి సెలవులఁ గమ్మేముసి ముసినగవులు
చిగురుఁబెదవి నూరే చిరుసిగ్గులు
జిగి నలమేల్మంగవు[1] శ్రీవేంకటేశురాణివి
తగిలె నీకీరతులు తపమెంత సేసితివో ॥ఎవ్వ॥ 272

## భైరవి

సుదతికి మీరిందరూఁ జుట్టాలైన ఫలము
మదనుని వేఁడుకోరే మంచిదౌఁగాని ॥ఫలము॥

జలములలో నెల్లా చంద్రకాంతాలు చల్లరే
అలతామరలగర్వ మలణఁగుఁగాని
చలపట్టి వనముల జవ్వాది వాసించరే
మలయుఁ జిలుకలకు మాటుమందౌఁగాని ॥సుద॥

పొదలపై సంపెంగ పువ్వులు వెదచల్లరే
పుదుటఁ దుమ్మిదమూఁక లుడుఁగుఁగాని
పది దిక్కులను రఘుపతిపేరు దడవరే
గుదిగొన్న కోవిలలు కూయకుండుఁగాని ॥సుద॥

పాటలలో శంకరాభరణం మాళాపించరే
నీటు చల్లగాలి సొంపు నిలుచుఁగాని
యీటున శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
చాటించరే యిన్నీఁ దొంటి జాడల నుండుఁగాని॥సుద॥ 273

---

1. 'మణఁగుఁగాని' అనియైనా, "ములణఁగుఁగాని" అని యైనా వుండవచ్చునని తోచుచున్నది.

## వేళావళి

తనియదు నామనసు తమితో నీపొందుసేసి
యెనసినవేళ గుణ మెట్టిదోకాని ॥పల్లవి॥

చేసన్న సేసినప్పుడే చేరె నాకోరిక లెల్లా
పాసి వుండలేక కొంగు వట్టుదుఁగాని
వేసిన పూవులచెండు వెస మర్మములు రేఁచె
బేసబెల్లితనమునఁ బెనఁగుదుఁగాని ॥తని॥

వీడె మిచ్చినప్పుడే వెలసె నీమన్ననలు
వేడుకకు నీపై నోలవేతుఁగాని
వాడిక నీమాటలే వడి నన్ను నమ్మించె
జోడుగూడి యప్పటిని సొలతుఁగాని ॥తని॥

తెరదీసినప్పుడే దిష్టమాయ సోబనము
సరుగ నూరకే సేస చల్లేఁగాని
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సరిమోవిచ్చితి రింకాఁ జవిగొనేఁగాని ॥తని॥ 274

## వాదరామక్రియ

ఎంత వేగిరకాఁడవు యేమి చెప్పేది
మంతనాన బుజ్జగించి మన్నించరాదా ॥పల్లవి॥

అతివ నీవద్దనుండి ఆకుమడిచియ్యఁగాను
కత చెప్పుమని యెంత కక్కసించేవు
మితిమీరి సిగ్గుతోను మెల్లని నీకు మొక్కఁగా
చతురతలు నెరపి చన్నులే లంటేవు ॥ఎంత॥

నెట్టుకొని బత్తితోడ నీకుఁ బాదాలొత్తఁగాను
అట్టె మోవిమ్మని యాల ఆనవెట్టేవు

చిట్టకము లేక నిన్నుఁ జెక్కునొక్కి వేఁడుకోఁగా
వొట్టుక వలపులెంత వొడిఁబెట్టేవు ॥ఎంత॥

అక్కరతో నలపార నాలవట్ట మిడఁగాను
పక్కఁ బండుమని యెంత బాఁతి పడేవు
యిక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
గక్కన వావి చెప్పఁగాఁ గాఁగిలించేవు ॥ఎంత॥ 275

**రేకుఁ 1848** **దేసాళం**

నిన్ను మెత్తునో యీపె నేరుపులు మెత్తునో
యిన్నియు మీకే తగు నేమందు నేను ॥పల్లవి॥

మట్టులేక చేటెఁడేసి మాఁట లాపె యాడఁగాను
వెట్టికి వేసటలేక వినేవు నీవు
పట్టెడంతలు గుబ్బలు పయ్యెదలోఁ జూపఁగాను
చుట్టి చుట్టి రెప్పలెత్తి చూచేవు నీవు ॥నిన్ను॥

పొంచి వావు లీపె నీతో పోఁకకుఁ బుట్టెఁ డమ్మఁగా
వంచక యాసలాసలఁ గూడ పెట్టేవు
కంచపుమోవితేనెలు కానుక నీకియ్యఁగాను
అంచలను చొక్కి చొక్కి యందుకే నోరూరేవు ॥నిన్ను॥

సారెఁ జిరునగవుల జాజర పైఁ జల్లఁగాను
వూరకే వెరగువడి వుమ్మగిలేవు
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మేరతో నిన్నుఁ గూడఁగా మెచ్చేవు నీవు ॥నిన్ను॥ 276

---

1. 'నిలువు+ఎఁడ+ఏసి' కావచ్చు.

## పాడి

కంటిరటే చెలులాల కాంత సొబగులు నేఁడు
జంటల పోలికలు యీ సకియకే కలిగె ॥పల్లవి॥
కొలఁకులనుఁ దిమ్మిదలు కోరి తపములుసేసి
[1] నిలివెఁడేశై ఇంతి నెరులాయను
వలనైన చిలుకలును వనవాసములుసేసి
పలువిధములను ముద్దుఁ బలుకులై నిలిచె ॥కంటి॥
జక్కవలు రాత్రులను సన్యాసములు సేసి
గక్కన నీపెకును చనుఁగవ యాయను
దిక్కులందు హంస లివి తీర్థయాత్రలు సేసి
చక్కని పాదములందు సరగతు లాయ ॥ కంటి ॥
ఇమ్ముల గిరులను సింహా లేకాంతవాసము సేసి
నెమ్మి నలమేల్మంగకు నెన్నడుమాయను
పమ్మిక చంద్రుఁడు భూమి ప్రదక్షిణముగాఁజేసి
తెమ్మల శ్రీవేంకటేశుదేవులమో మాయ ॥కంటి॥ 277

## లలిత

ఇంతులకుఁ బతులకు నెరవున్నదా
సంతోసము లీడేరు సమ్మతులైతేను ॥పల్లవి॥
ముచ్చట లాడఁగవచ్చు మోములు చూడఁగవచ్చు
ఇచ్చకమై మనసులు యెనసితేను
పచ్చిదేర నవ్వవచ్చు పట్టి పెనఁగఁగవచ్చు
కచ్చుక చుట్టరికము గలసితేను ॥ఇంతు॥
సుద్దులు చెప్పఁగవచ్చు చూపుల సొలయవచ్చు
వొద్దికైన నేస్తము లొనరితేను
ముద్దులు గునియవచ్చు మొక్కులాడఁగవచ్చు
పొద్దు వొద్దు సరసాలు పొసఁగితేను ॥ఇంతు॥
వాడికలు చూపవచ్చు వలపులు చల్లవచ్చు
తోడఁడోడ వయసులు దొరసితేను

1. 'నిలువు + ఎఁడు + ఏసి' కావచ్చు.

యీడుజోడై శ్రీవేంకటేశ యలమేల్మంగను
కూడితివి మెచ్చవచ్చు గుణా లిట్టై(ట్ట?) యితేను॥ఇంతు॥ 278

**నాగగాంధారి**

అలమేలుమంగ నీవన్నిటా నొరపరివి
కలికి నీవాళ్ల నివి కంటిమే చెలియా ॥పల్లవి॥

బలిమిగలవారికిని పంతంబు లీడేరు
కలిమిగలవారికిని గర్వమమరు
చలముగలవాఠికిని సరసంబు లనువుపడు
కలదెల్ల నీ వాళ్ల గంటిమే చెలియా ॥అల॥

ననుపుగలవారికిని నవ్వినంతయుఁ జెల్లు
చనవుగలవారికిని జరగుఁ బొందు
మనసుగలవారికిని మలసి పెనఁగఁవచ్చు
ఘనతలివి నీవాళ్ల గంటిమే చెలియా ॥అల॥

వెరవుగలవారికిని వేడుకలు నెలవుకొను
సిరులుగలవారికినిఁ జేరు కీర్తి
యిరవుకొని శ్రీవేంకటేశ్వరుఁడు నిను నేలె
గరిమ లివి నీవాళ్ల గొంటిమే చెలియా ॥అలా॥ 279

**వాదరామక్రియ**

పొందు సేయ నేరుచును పూఁచి మెల్లమెల్లనే
యెందరిని మరిగించెనో యిట్లానే యీతఁడు ॥పల్లవి॥

వూరకున్న నాకుఁ దెచ్చి వుంగరము చేతికిచ్చి
మేరమీరి చెనకినీ మెల్ల మెల్లనే
వోరుచుకున్నా మానఁడు వొంటినుండఁగా నాతో
తేరకొన నవ్వు నవ్వి దిమ్మురేఁచీ నీతఁడు ॥పొందు॥

గుట్టుతోడిదాన నాపె గురిగింజబంతి వేసి
మెట్టీ నాపాదాలు మెల్లమెల్లనే
వొట్టు వెట్టినా విడువఁ డొద్ద నిట్టె కూచుండి
వట్టి జాణతనా లాడి వావి చెప్పీ నీతఁడు ॥పొందు॥

అక్కున నలమేల్మంగనైన నన్ను గారవించి
మిక్కుటమై కాఁగిలించీ మెల్లమెల్లనే
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డిదివో నేఁ బిన్నదాన
అక్కజపు రతులను నాదరించీ నీతఁడు ॥పొందు॥ 280

## శుద్ధదేశి

నిన్ను నాపెఁ జూచితేను నేఁడు నాకు వెరగయ్యీ
యిన్నిటా నీమతకము లెంచుకోవయ్యా ॥పల్లవి॥

కాంత యెవ్వతోకాని కాచుకున్నది వాకిట
మంతనానకుఁ బిలిచి మాఁటాడవయ్యా
వంతులకు నీతోడివావు లందరికిఁ జెప్పీ
యెంత చుట్టమో అది యెరుఁగు కోవయ్యా ॥నిన్ను॥

చెలిమి నీతోఁ దాను సేసెనట యెన్నఁడో
లలి నీ వది యట్టె తలఁచుకోవయ్యా
అలరి నీవిచ్చినట్టి అడియాలములుఁ జూపీ
పిలిచి నీ పీఁటమీఁదఁ బెట్టుకోవయ్యా ॥నిన్ను॥

చెప్పి పంపితివట యే చెలియచేతనో రమ్మని
యిప్పుడే యాపనులు సేయించుకోవయ్యా
అప్పఁడ శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
నెప్పున నన్నేలితివి నీవాకెఁ గూడవయ్యా ॥నిన్ను॥ 281

**రేకు 1849** **సామంతం**

అన్నిటా జాణవు నీకు నమరు నీజవరాలు
కన్నుల పండుగగాను కంటిమి నేఁ డిపుడు ॥పల్లవి॥

సేయని సింగారము చెలియ చక్కఁదనము
మోయనిమోపు గట్టిముద్దుఁ జన్నులు
పూయకపూసిన పూఁత పుత్తడి మేనివాసన
పాయనిచుట్టరికము పైకొన్న చెలిమి ॥అన్ని॥

గాదెఁ బోసినమణులు కనుచూపు తేటలు
వీదివేసిన వెన్నెల వేడుకనవ్వు
పోదితో విత్తినపైరు పొదిలిన జవ్వనము
పొదుకొన్న మచ్చికలు పరగువలపులు ॥అన్ని॥

పుట్టగాఁ బుట్టిన మేలు పోగపు సమేళము
పెట్టెఁ బెట్టిన సొమ్ములు పెనురతులు
యిట్టె శ్రీవేంకటేశ యీ యలమేలుమంగను
నెట్టనఁ గూడితి వీకె నిండిన నిధానము ॥అన్ని॥ 282

**రామక్రియ**

చెలియరో నీమగఁడు చెప్పినట్టు మెలఁగఁగా
పలువచారములేలే భాగ్యవంతురాలవు ॥పల్లవి॥

తలఁచినట్టి (ట్టె?) కాఁగా తమకించ నేమిటికే
పొలసి వలపు గాదెఁ బోతువుగాక
పలికినట్టె కాఁగా పదరఁగ నేఁటికే
పిలిచి విభుని నొద్దఁ బెట్టుకొందువుగాక ॥చెలి॥

సేసినట్టె కాఁగాను చెక్కు చెయ్యేమిటికే
సేసవెట్టి పెండ్లి పీఁట చేకొందుగాక

వా(వ్రా?)సినదె వాఁ(వ్రాఁ?) తగాఁగా వట్టి చలమేఁటికే
ఆసదీర మోవితేనె లానుదువుగాక ॥చెలి

చూచినట్టె కాఁగాను సుద్దు లిఁక నేఁటికే
కాచుక రతులమేలు గందువుగాక
యేచి శ్రీవేంకటేశ్వరుఁ డేలె నలమేల్మంగవు
చేచేత సంతోసాలఁ జెలఁగుదువుగాక ॥చెలి॥ 283

## కేదారగౌళ

తరుణులాల యీకత తానే యెరుఁగుననే(న?)రే
సరుసఁ దా మనిం(న్నిం?)చితే సంతోసించేఁగాక॥పల్లవి॥

అక్కునఁ బోసి చూపేనంటే గొల్లచల్ల గాదు
ఇక్కువైన నావలపు యేమి చెప్పేనే
పుక్కిటఁ బట్టవచ్చునా పొంగే సముద్రము
అక్కర మోవితేనియ లానగించేఁగాక ॥తరు॥

పొంచి యెత్తి చూపేనంటే పూవుల చెండుగాదు
యెంచరాదు నాకోరిక యేమి చెప్పేదే
మంచు కుంచానఁ గొలవ మరి యెట్ల సమకూడు
అంచెఁ దనరాక కెదు రటు చూచేఁగాక ॥తరు॥

బాయిటఁ బెట్టేనంటే పంచవన్నె ముగ్గు గాదు
యీయెడ నాతమకము యేమి చెప్పేనే
చేయి చ్చలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు తాను
పాయపు తన కాఁగిటఁ బాయకుండేఁ గాక ॥తరు॥ 284

### సామంతం

చూడరమ్మ ఇంతులాల సుదతి చందము నేఁడు
వేడుకసింగారాలు వింత వింత లాయను ॥పల్లవి॥

జక్కవ గుబ్బల మీఁది సరులు
వెక్కసపుఁ గొప్పులోని విరులు
చెక్కుటద్దపుఁ గాంతుల సిరులు
చక్కని యీకెకు నెన్ని సమకూడె గురులు ॥చూడ॥

నిలువున నొయ్యారపు నీట్లు
వలపె పయ్యెద వల్లెవాట్లు
మలయు మోము సుగటిమాట్లు
కుటుకునవ్వు లీకెకుఁ గొండలుఁ గోట్లు ॥చూడ॥

కావరపుఁ బిఱుఁదుల కలిమీ
భావములో వలపుల బలిమీ
శ్రీ వేంకటేశుఁడు గూడెఁ జెలియలమేల్మంగను
చేవదేరె నీకెకు చెప్పరాని చెలిమీ ॥చూడ॥ 285

### శంకరాభరణం

అనుమానించఁగనేలా అవిగో నీచేఁతలు
దిన దిన కొత్తలె[1]ల్లా దిష్టమాయ మాకును ॥పల్లవి॥

కొసరి యెవ్వతె నీతో కొంగువట్టి పెనఁగెనో
పసపల్లా నంటె నదె పచ్చడానను
యెసగి చెక్కులువట్టి యెంత వేఁడుకొనెనో
సుసరాన గోరికొన సోఁకులు చూపట్టెను ॥అను॥

1. 'దిన దిన కొత్తలు' వంటి సామాసికములైన చిల్లర దోషములు ఈవాఙ్మయమున కోకొల్లలు.

కమ్మటి నాపె యేరీతి కాఁగిట బిగించెనో
కుమ్మెలువోయి గుబ్బలగురు లున్నవి
యిమ్మల నీవాడివట్టి యెంత వొడఁబరచెనో
నెమ్మదిఁ గానుకిచ్చిన నిమ్మపండ్లు గంటిని ॥అను॥

పాదాలకు మొక్కి యెట్టు పానుపుపైఁ గూడెనో
పోదితో మైతావి నీపైఁ బొలుపొందెను
పొదుగ నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యీదెస నన్నేలితివి యీకె నీకుఁ జట్టము ॥అను॥ 286

## లలిత

ఇంతు లెంత సేసినాను యియ్యకొనవలెఁ గాక
వంతులువాసు లెంచుకొంటే వాములై నిలువవా॥పల్లవి॥

వచ్చి వచ్చి సొలతురు వలచినవారలు
యెచ్చు గుందులు దడవ నేమున్నది
కొచ్చి చూతు రప్పటిని కోరికగలవారలు
పచ్చిసేసి నవ్వఁబోతే పంతములు రేఁగవా ॥ఇంతు॥

వెంగెములే యాడుదురు వేడుకగలవారలు
యింగితా(త?) భావాలు చూడ నేమున్నది
పంగింతు రప్పటిని పాయని పొందులవారు
సంగతులు వెదకితే చలములు మీరవా ॥ఇంతు॥

ఆయము లంటఁజేరుదు రాసగలవారలు
యేయెడ సాదించేమన నేమున్నది
చాయల శ్రీవేంకటేశ సతి యలమేలుమంగ
కాయజకేలిది మీకు ఘనతేకాదా ॥ఇంతు॥ 287

రేకు 1850 వరాళి

ఇన్నిటా జాణవు నీవే యెఱుఁగుదువు
సన్నలనే పతిని వసము సేసుకొంటివి ॥పల్లవి॥

నయాన నాడినమాట నమ్మికలు వుట్టించు
ప్రియాన మొక్కినమొక్కు ప్రేమ రేఁచును
దయతోడి యాదరింపు తగులాయములు సేసు
నియతాన మెలఁగేటి నేరుపు లివి ॥ఇన్ని॥

మఱ్ఱ్కొవఁ జేసినచేఁత మనసులు గరఁగించు
చొక్కుచు నవ్విన నవ్వు సొంపు నిండించు
పక్కనఁ జూచిన చూపు పచ్చిదేర వలపించు
నొక్కొన్న రతులలో నేరుపులివి ॥ఇన్ని॥

పొంచుక యుండిన సిగ్గు పొలఇంచు దరితీపు
మంచముపై కూటములు మరిగించును
యెంచి ని న్నలమేల్మంగ యేలె శ్రీవేంకటేశుఁడు
నించుకొన్న మీగుణాల నేరుపు లివి ॥ఇన్ని॥ 288

పాడి

జాగులేల సేసేరే సకియలాల
వేగమె యెచ్చరించరే వేడుక వుట్టుఁ గాని ॥పల్లవి॥

వెలఁది చెప్పినమాటఁ విన్నవించరే పతికి
చెలులాల విని సంతోసించుఁగాని
మలసి యీజవరాలిమారు సాగిలి మొక్కరే
తిలకించి తానందుకు దీవించుఁగాని ॥జాగు॥

కమ్మటి దేవులంపిన కానుక లొసఁగరే
కిమ్ముల నాపని చిత్తగించుఁగాని

రమ్మని పిలిచి యాపెరతికి విందు చెప్పరే
వుమ్మడిఁ జొట్టరికమై వొనగూడుఁ గాని ॥జాగు॥

తెరలోఁ బెండ్లి కూఁతురు దిక్కు చక్కఁ జూపరే
సరసాలాపాలు జరపుఁగాని
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోఁ దానెకూడె
గరిమలఁ బొగడరే కరుణించుఁగాని ॥జాగు॥ 289

## ముఖారి

ఆలిమగని జాడలు అందరికి నివియే
మేలుమీఁదుగా విభుని మెప్పించవే నీవు ॥పల్లవి॥

వింత లేక మెలఁగితే వేడుక నెరపవలె
సంతోసించితేను మెచ్చఁగవలెను
మంతనానకు లోనైతే మరిగియుండఁగవలె
పంతము లాడఁగరాదు పతితోడఁ జెలికి ॥ఆలి॥

ననుపు గలిగితేను నవ్వులు నవ్వఁగవలె
మనసు లెనసితే సమ్మతించవలె
వినయాలు నేరిచితే వేమారు వేఁడుకోవలె
పెనఁగులాడఁగరాదు ప్రియునితో సతికి ॥ఆలి॥

వావు లేకములైతే వడిఁ బొందుసేయవలె
దేవులైతేఁ దనబత్తి దెలుపవలె
శ్రీవేంకటేశుఁ డేలితే సిగ్గులు మానఁగవలె
కావరించి మీరరాదు కాంతునితో నింతికి ॥ఆలి॥ 290

## ముఖారి

మగవానితోనేల మందేమేళాలు
సొగిసి యిచ్చకములే చూపవలెఁగాక ॥పల్లవి॥

చేతులెత్తి మొక్కితేను చిత్తము గరఁగుఁగాక
యేతులకు జంకించితే నితవులౌనా
నీతితోడ మాటాడితే నిలుచుఁగాక మోహము
పోతరించి పలికితే పొందు లౌన గూడునా ॥మగ॥

నగుతాఁ గొసరితే ననుపులు వుట్టుఁగాక
బిగిసి వూరకుండితే ప్రియములౌనా
మొగమోట గలిగితే ముచ్చట లీడేరుఁగాక
యెగ సక్కేలైతేను ఇంపులౌనా రతులు ॥మగ॥

గట్టిగాఁ గాఁగిలించితే కళలు దైవారుఁగాక
వట్టి సిగ్గున నుంటే కైవసము లౌనా
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనే
నెట్టన నిటు గాకున్న నేరుపులు మించునా ॥మగ॥ 291

## సామవరాళి

చూచితేఁ జిన్నవుగాని సుద్దులు కోటికొండలు
యేచి యీచేఁతలు సేయ నెట్టు నేరిచితివే ॥పల్లవి॥

సెలవుల నవ్వుకొంటా చిత్తము గరఁగుకొంటా
చెలియ విభుని నెంత చిమ్మిరేఁచేవే
వలపుల చల్లుకొంటా వావు లడుగుకొంటా
సొలసి సొలసి యెంత చొక్కులఁ బెట్టేవే ॥చూచి॥

కన్ను లారుచుకొంటాను కడు నెలఇంచుకొంటా
చన్నుల నొరసి యెంత జంకించేవే
సన్నలు సేసుకొటా సరసము లాడుకొంటా
పన్నుక యీతని నెంత పచ్చి సేసేవే ॥చూచి॥

సంగడిఁ గూచుండుకొంటా సమ్మతులు సేసుకొంటా
అంగజ రతుల కెంత ఆస చూపేవే
చెంగట నింతలో నన్ను శ్రీవేంకటేశుఁడు గూడె
యెంగిలిగా నీవూఁ గూడి యెంత లాచేవే ॥చూచి॥ 292

## శ్రీరాగం

ఏమని చెప్పుదునే యివిగో తారుకాణలు
నీమదిఁ దలఁచుకోవే నెలఁత నామాఁటలు ॥పల్లవి॥

కన్నులఁ జూచిన చూపు కడు నాసలు వుట్టించు
విన్న వినుకులు మరి వేడుక రేఁచు
పన్నిన యెడమాఁటలు భావములు గరఁగించు
యెన్నిలేవు మరుతంత్రా లెంచి చూచుకొంటేను॥ఏమ॥

తలఁచిన తలఁపులు తమకము లుప్పతిల్లించు
సెలవి నవ్వినవ్వు చెనకింపించు
వలచిన వలపులు వాడికలు వొడమించు
పిలిచి చెప్పఁగరావు పెండ్లి వేడుకలు ॥ఏమ॥

మంచముపై సరసాలు మర్మములు సోఁకించు
కంచముపొత్తు కాఁగిటఁ గలశించును
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనె
పెంచు జవ్వనమదము ప్రియము లన్నియును ॥ఏమ॥ 293

రేకు 1851 **పాళంగం**

బాస ఇచ్చినవాఁడవై పరగితేనేమి నాకు
ఆసపడ్డదానిఁ గొంత యాదరించరాదా ॥పల్లవి॥

పెనఁగి పెనఁగి నీకు ప్రియము చెప్పె నిందాఁక
ననిచి యాపెతోఁ గొంత నవ్వరాదా

వినయముతో నిన్ను వేఁడుకొనె నప్పటిని
చనవిచ్చి ఇఁక సరసము లాడరాదా ॥బాస॥

మొక్కు మొక్కి తేరకొన మోము చూచీ నేఁకటతో
మక్కువతో నిచ్చగించి మాటాడరాదా
చక్కఁగా నీకూడిగాలు సారె సారెఁ జేసీని
అక్కరతోఁ బాదాలొత్త నప్పణియ్య రాదా ॥బాస॥

కాఁపురాలు సేసేనంటా కాచుకవున్నది తాను
ఆఁపక నీచెలి చన్ను లంటఁగరాదా
చేపట్టి నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
యేపునఁ దనవలపు లియ్యకొనరాదా ॥బాస॥ 294

## సామంతం

ఎరవుసేయ దెంతైనా నిన్నిటా నీదేవులు
పొరసి యీగుణాలతోఁ బొగడొందుఁగాని ॥పల్లవి॥

వేడకకత్తైనది వేసారదు పతిపైని
జాడతో వలపులు చల్లుఁగాని
వాడిక గలిగినది వంతువాసు లెంచదు
కూడిమాడి కూరిములు కొసరుఁగాని ॥ఎర॥

తగులాయమైనది తనియ దెంతైనాను
జిగిమించ నితవులే సేసుఁగాని
మిగులాఁ జుట్టమైనది మీరి పలుక దెప్పుడు
పగటున నోరుపులే పచరించుఁగాని ॥ఎర॥

ఆసకురాలైన[1]ది అలయదు రతులను
పాసి తొలఁగ దెప్పుడు పైకొనుఁగాని

1. 'ఆసకురాలు' వింత ప్రయోగము. ఆసక్తురాలికి గ్రామ్యమైన వికారమేమో?

సేసతో నిల్లాలైనది శ్రీవేంకటేశుఁడ నీకు
రాసికెక్క నిట్టె కాఁపురము సేయుఁగాని ॥ఎర॥ 295

**ఆహిరి**

మనసులో తమకము మాకు నిట్టె కానరాఁగా
నను నెంత తేలించేవు నాటకుఁడ నీవు ॥పల్లవి॥

పువ్వు వంటి జవ్వనము పొద్దోక వింతై రేఁచీ
రవ్వలు సేయక ఇట్టె రావయ్యా నీవు
వువ్విళ్లూరీఁ జెమటలు వూటలై నీమేనను
నవ్వు లేమి నవ్వేవు నాతో నింకా నీవు ॥మన॥

కొడిసాగి కోరికలు గుంపులుగా నల్లుకొనె
అడియాసలేల విడె మందియ్యవయ్యా
కడఁగి నివ్వెరగులు కానవచ్చె నీవల్ల
వాడి యాల పట్టి పాడే వూరకే నీవు ॥మన॥

చిమ్మిరేఁగిన సిగ్గులు చిడుముడి సందడించె
నెమ్మదిఁ గూచుండవయ్యా నీవు నావద్ద
యిమ్ములఁ శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
నమ్మిక లె న్నిచ్చేవు నయాననే నీవు ॥మన॥ 296

**రీతిగౌళ**

గుట్టుతోడిదాన నన్ను గొరబేల సేసేవోయి
గట్టిగా సేసవెట్టితేఁ గాదంటినా నిన్ను ॥పల్లవి॥

చన్నులంట వచ్చేవు జాణతనా లాడేవు
ఇన్నేసి చేఁతలకు నీకేమొదునోయి
సన్న లూరకె సేసేవు సందులకు లాచేవు
కన్నవారెల్లా నిన్ను గామిడివాఁడనరా ॥గుట్టు॥

కప్పురము చల్లేవు కతలెల్లాఁ జెప్పేవు
అప్పుడే నీకుఁ జుట్టమనైతినావోయి
కొప్పు జారఁదీసేవు కొనగోరఁ జెనకేవు
వుప్పతించేవారు నిన్ను నుద్దండీఁడవనరా ॥గుట్టు॥

మోవితేనె లడిగేవు మోము దప్పక చూచేవు
వావు లింత గలపఁగవలెనా వోయి
శ్రీవేంకటేశ నన్నుఁ జెలరేఁగి కూడితివి
యీవలావలివారు యిచ్చకుఁడ వనరా ॥గుట్టు॥ 297

## నాదరామక్రియ

ఎప్పుడు గరుణించేవు యేమయ్యా నీవు
చెప్పరాని వినయాలచే నిన్ను మెప్పించెను ॥పల్లవి॥

చెక్కులవెంటఁ గారే చెమటలతోడనే
పక్కన నిందాఁకాఁ జెలి పాదాలొత్తెను
ముక్కున నిట్టూరుపులు ముంచి బుసకొట్టఁగానే
అక్కరతోఁ గొంతవడి యాలవట్ట మిడెను ॥ఎప్ప॥

గుబ్బలపై రాలేటి కుంకుమ బేంట్లతోనే
వుబ్బునఁ జేసెను నీకు నూడిగా లెల్లా
గుబ్బతిలు విరులతో కొప్పు గొంత జారఁగానే
నిబ్బరాన సారె సారె నిన్నుఁ జూచి మొక్కెను ॥ఎప్ప॥

పెదవులపై నూరే పిచ్చిలు తేనెలతోనే
పదిమారులును విన్నపము సేసెను
యెదుట శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
అదివో తమ్ముమలను ని న్నప్పటి నడిగెను ॥ఎప్ప॥ 298

## భైరవి

పదివేలకు మామాఁట పాలించవయ్యా
ఇదివో చెలికోరిక లీడేరుచవయ్యా ॥పల్లవి॥

చెప్పరాని ప్రియములు చెప్పుమనె జవరాలు
వొప్పుగాని చిత్తగించి వూఁకొనవయ్యా
తప్పక తనపై దయదలఁచుకొమ్మనె నిన్ను
అప్పుడవి యేఁటికో అవధరించవయ్యా ॥పది॥

సేయరాని వూడిగాలు సేసితిఁ దా ననుమనె
ఆయెడ నింపైతే నీ వానతీవయ్యా
చేయెత్తి ముమ్మాటికిని చెలఁగి మొక్కితిననె
పాయక దేవర యిఁకఁ బరాకు మానవయ్యా ॥పది॥

యెన్నరాని తలపోఁత నెదురుచూచితి ననె
విన్నపమిదె పెండ్లికి విచ్చేయవయ్యా
వన్నెగా శ్రీవేంకటేశ వచ్చి యిట్టె కూడితివి
కన్నె నిట్టె పాయక మన్నించవయ్యా ॥పది॥ 299

**రేకు 1852** **పళవంజరం**

గుట్టుతో మంచితనాలే కోరి చూపవలెఁగాక
యెట్ట యెదుటనే వుండి ఇంత యెలఇంతురా॥పల్లవి॥

వొడిఁగట్టినవలపు లుమ్మగిలుచుండఁగాను
సడిఁబెట్టి పతినేమి సాదించేవే
తడిసి పెంజెమటలు తనువులఁ గారఁగాను
పెడరేఁచి యాతనితోఁ బెనఁగులాడుదురా ॥గుట్టు॥

కొప్పునఁ బెట్టిన సేస కొనికల జారఁగాను
కప్పి పయ్యెదతో నేమి గయ్యాళించేవే

చిప్పిల నవ్విన నవ్వు సెలవుల నించఁగాను
వుప్పతించి యాతనితో నొడ్డారా లాడుదురా ॥గుట్టు॥

మనసులో కోరికలు మల్లడిగొనుచుండఁగా
వెనక ముందరలేమి వెసఁజూచేవే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేఁడు
చెనకులు మైనుండఁగా సిగ్గున లోఁగుదురా ॥గుట్టు॥ 300

## వరాళి

మంచితనమే మేలు మగవాని తోడుతను
మించి చెక్కునొక్కఁగానే మేర మీర నేలే ॥పల్లవి॥

చిక్కని వెన్నెలతేట సెలవుల నుండఁగానే
చక్కఁగా విభునినేల జంకించేవే
మక్కువలు నిండుకొని మనసులో నుండఁగానే
చొక్కపు కనుఁగొనలు సొలయఁగ నేలే ॥మంచి॥

పెనగొన్న మంచిమాట పెదవిపై నుండఁగానే
కొనగోరఁ జిమ్మేటి గుంపెన లేలే
నినుపులై మొగమోట నిలువున నుండఁగానే
ననుపుల సిగ్గులు నానఁబెట్ట నేలే ॥మంచి॥

కడలేవి యాసలు కాఁగిటిలో నుండఁగానే
చిడుముడితో జోలిసేయఁగ నేలే
యెడయక శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నేలె
విడెము నీకియ్యఁగానే వేగిరించ నేలే ॥మంచి॥ 301

## దేసాళం

ఎటువంటి వాఁడవయ్యా యేమయ్యా నీవు
తటుకన నీఁక దయదలఁచుకోవయ్యా ॥పల్లవి॥

యెడమాట లాడించి ఇంతితోఁ బొందులు సేసి
తడవవు తాఁకవు తగవా నీకు
అడియాలా లెల్లాఁ జెప్పి ఆసలాసలఁ బెట్టి
వెడవెడగా నవ్వేవు వేడుకా నీకు ॥ఎటు॥

సన్నలు సారెకుఁజేసి చవు లీపెకుఁ బుట్టించి
పన్నుగ జాజాలాడేవు పంతమా నీకు
యెన్నికగాఁ బెండ్లాడి ఇక్కువలు గరఁగించి
వున్నాఁడ వెఱఁగనట్టే వుచితమా నీకు ॥ఎటు॥

తరితీపులను ముంచి తమకము లింత నించి
సరి జాగులఁ బెట్టేవు చలమా నీకు
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
సరులు దిద్దేవు యిదె సఁదా (సందా?) నీకు ॥ఎటు॥ 302

## మధ్యమావతి

రమణికి నీకుఁ బోదు రావయ్యా
అమరు నిన్నికె యేమనినా నేమాయను ॥పల్లవి॥

పంతము లాడుకొందురు పలుమారు సొలతురు
ఇంతులకు నివియెల్లా నెగ్గులు గావు
కొంతగొంత దూరుదురు కూరిమి గొసరుదురు
వింతలేని విభునికి వెగటు గాదు ॥రమ॥

చూపుల నద్దలింతురు చొప్పులు వెదకుదురు
రాపుల నివెల్లా నేరములు గావు
వోపి సరి వెనుగుదు రొట్లెల్లాఁ బెట్టుదురు
పైపై గుంపెనలేకాని పల్లదాలు గావు ॥రమ॥

బలుతురు పిలుతురు బొమ్మల జంకింతురు
తలపోసితే నివెల్లా తప్పులు గావు
యెలమి శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
మలసి వెరగందితే మరపులు గావు ॥రమ॥

**హిందోళ వసంతం**

నామాఁట వినవయ్యా నవ్వులు [1]మరెయ్యీఁగాని
కామించినప్పుడే కలయుటే మేలు ॥పల్లవి॥

పలుకులఁ బెల్లవారె పంతమెల్లా నీడేరె
చెలియిచ్చిన కానుక చేకొనవయ్యా
వలపించినవాఁడవు వట్టి జోలిఁబెట్టవద్దు
పిలిచినప్పుడే వచ్చి బెరయుటే మేలు ॥నామాఁ॥

సింగారించనే పట్టె సిగ్గులెల్లాఁ దుదముట్టె
అంగన నెప్పుడు గూడే వదేమయ్యా
వుంగర మంపిన వాఁడ వూరకే వుండఁగవద్దు
కొంగువట్టినప్పుడే కూడుటే మేలు ॥నామాఁ॥

ముచ్చటలు గడురేఁగె మోవిపండ్లూ మాఁగె
నెచ్చెలిని యిప్పుడే మన్నించవయ్యా
యిచ్చటఁ బెండ్లాడితివి యీకెను శ్రీవేంకటేశ
మచ్చిక లిట్టే సేసి మరుగుటే మేలు ॥నామా॥ 304

**వాగవరాళి**

మరిగి వలచితేను మరి వేసరఁగరాదు
సరసము లాతనితో జరపవే చెలియా ॥పల్లవి॥

---

1. ్యఁగాని

యిచ్చకములే యాడితే యిగిరించు మనసులు
కొచ్చి కొచ్చి కొసరితే కూరిమి వుట్టు
కచ్చుక కాచుకుండితే కైవశములౌఁ బనులు
మెచ్చుఁ బతి తలఁపులో మెలఁగవే చెలియా ॥మరి॥

సారెకు మోము చూచితే సరి నాస లుప్పతిల్లు
చేరి సేవసేసితేను చెల్లుబడౌను
నేరుపుతో నవ్వితేను నిండుకొను సంతోసాలు
కోరి యీతనిఁ బాయక కొలువవే చెలియా ॥మరి॥

ననుపులే నెరపితే నమ్మికలు సతమౌను
వినయమే సేసితేను వేడుకలౌను
యెనసె శ్రీవేంకటేశుఁ డిందుకొరకె నిన్ను
వొనరి యిద్దరూఁ గూడి వుండరే చెలియా ॥మరి॥ 305

**రేకు 1853** **దేసాళం**

అప్పటి మాతోడి పొందు లాసపడేవు
కప్పురము నీ వియ్యఁగా కాదు గూడదనేమా ॥పల్లవి॥

జంకెన చూపులఁ జూచి జాజరపాటలు వాడి
అంకెలకుఁ దెచ్చుకొనె నాపె నిన్నును
కుంకుమ గుబ్బలు సోఁక కొనగోరఁ గొప్పు దువ్వి
కొంకక యిన్నిటా దక్కఁగొనెఁ గదవయ్యా ॥అప్ప॥

సెలవుల నవ్వు నవ్వి చేతులు నీపైఁ జాఁచి
వలపించుకొనెఁగా వనిత నిన్ను
సొలపుల మాటలనే చుట్టరికములు సేసి
యెలమి నిన్నింత యెలయించెఁగదవయ్యా ॥అప్ప॥

విడెము చేతికిచ్చి వేమారు సరసమాడి
వాడికె సేసుకొనెను వైపుగా నిన్ను
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జాడతోఁ దా నీపై సేస చల్లెఁగదవయ్యా ॥అప్ప॥ 306

**మాళవిగౌళ**

ఇప్పుడేల వేగిరించే వెంతలేదు నీ పగటు
కప్పురమువాసన లేకడనైనా దాఁగునా ॥పల్లవి॥

మందలించి నీ యెమ్మెలు మాతో నాడవద్దుగాని
చెంది యాతనితోడనే చెప్పవే నీవు
అందరి ముందరాఁ బంతా లవి యాల నెరపేవే
కందువ నీపతివద్దఁ గానవచ్చీఁ గాక ॥ఇప్ప॥

వాడలోన నీరూపు వర్ణించుకోవద్దుగాని
సూడిదెగా నాతనికే చూపవే నీవు
వీడెవు మోవి సారెకు విచ్చి యేల నవ్వేవే
వేడుక నీపతివద్ద వెలవెట్టీఁగాక ॥ఇప్ప॥

నేరుపు లెక్కడనైనా నెరపఁగ వద్దుగాని
నీరచన లాతనిపై నించవే నీవు
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నేమనేవే
కోరిక నీపతివద్ద గొనసాగీఁ గాక ॥ఇప్ప॥ 307

**కేతా (దా?) రగౌళ**

కక్కసించనేమిటికే కాంతలాల
మక్కువ సేసెను తొల్లె మన్నించీఁగాక ॥పల్లవి॥

నామోము తాఁ జూచితేను నవ్వులు నవ్వేఁగాక
వేమారుఁ బైకొంటేను వేసట గాదా

చేముట్టి చెనకితేను సేవలు సేసేఁగాక
ఆముకొని కొసరితే నందము లయ్యీనా ॥కక్క॥

పేరుకొని పిలిచితే బెట్టి వూఁకొనేఁగాక
వూరకే మాఁటాడితేను వొద్దికయ్యీనా
తారుకాణ వచ్చితేనే తన్ను నెచ్చరించేఁగాక
సారె సారెఁ బెనఁగితే చాయకు వచ్చీనా ॥కక్క॥

కావలెననిన దాఁకా కాచుకవుండేఁగాక
యీవల వేగిరించితే నిచ్చక మౌనా
చేవదేర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు నేఁడు
కావరించితే నిట్లా కళలు రేఁగీనా ॥కక్క॥ 308

## భైరవి

ఎంత బత్తో నీమీఁద యీరమణికి
సంతోసములెల్లా రేఁగ సరసమాడవయ్యా ॥పల్లవి॥

కొప్పులో విరులు రాలఁ గులికి కులికి నవ్వీ
చప్పుడుగాఁ జెలి నీతో సారెసారెకు
కప్పురపు వాసనలు కడు బుగులు కొనఁగా
చెప్పీ నీకు బ్రియములు చిత్తగించవయ్యా ॥ఎంత॥

పయ్యదకొం గిటుజార పలుమారు జెనకీని
వొయ్యారపుఁ జూపులతో వొద్దనే వుండి
వుయ్యాల మంచముపైకి నూరకే సన్నలు సేసీ
చయ్యాన నెంత వేడుకో చన వియ్యవయ్యా ॥ఎంత॥

సింగారించుకొని వచ్చి చేరి కొలువులు సేసి
[illegible]బిగ మాటలాడీ సతి నీతోను

రంగుగ శ్రీవేంకటేశ రతి నన్ను నేలితివి
అంగవించి యాకె నిఁక నాదరించవయ్యా ॥ఎంత॥ 309

**పాడి**

వేగమె రావయ్యా నీవు వెలఁది దినదినము
పోగులైన సంతోసాలు పోదిఁ బెట్టుకున్నది ॥పల్లవి॥

భామ చిగురాకుమోవిఁ బల్లెము వెట్టుకున్నది
ప్రేమపు వలపు దొంతిఁ బెట్టుకున్నది
నేమపుఁ గోరికలెల్లా నీ కెదురంపు కున్నది
కామతంత్రములు వొడిఁ గట్టుకున్నది ॥వేగ॥

కప్పురపుఁ బలుకులు గాదెఁ బోసుకవున్నది
యెప్పుడూ మనసు మీఁదెత్తుకున్నది
కప్పి జక్కవచన్నులు కానిక వట్టుకున్నది
దెప్పరపు సిగ్గునను తెరవేసుకున్నది ॥వేగ॥

కందువకాఁగిలి పాన్పుగాఁ బరచుక వున్నది
పొందుగ రతులు నీకుఁ బూఁచికున్నది
ఇందుకే వచ్చి శ్రీవేంకటేశ ఇంతిఁ గూడితివి
చెంది నవ్వు లింకా నీకు సేస వట్టుకున్నది ॥వేగ॥ 310

**పూర్వగౌళ**

మొగ మిచ్చదానను మొదల నేను
తగులాయ రమ్మనవే దక్కఁ దనపంతము ॥పల్లవి॥

యిచ్చకమాడే పతిని యేమనఁగ వచ్చునే
కచ్చు పెట్టి చెనకఁగా కాదందునటే
కొచ్చి కొచ్చి నవ్వఁగాను గుంపించవచ్చునా
మచ్చికతో రమ్మనవే మాయింటికి నిఁకను ॥మొగ॥

వీడెము చేతికియ్యఁగా వింతసేయవచ్చునా
వాడికలు చెప్పఁగాను వద్దందునటే
జోడు గూడి వుండఁగాను సొలయఁగవచ్చునా
వేడుకతో రమ్మనవే వీఁటిఁ (వింటిఁ?) దనమాఁటలు॥మొగ॥

పిలిచి కాఁగిలించఁగా పెనఁగఁగవచ్చునా
వలచి మోవియ్యఁగాను వంచింతునటే
యెలమి శ్రీవేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
తెలిసితి రమ్మనవే దిష్టమాయఁ బనులు ॥మొగ॥ 311

**రేకు 1854** **ముఖారి**

చల్ల లమ్మే వారమైతే సదరమైతిమా నీకు
యెల్ల చోటులకు వచ్చి యేల మొక్కేవయ్యా ॥పల్లవి॥

అచ్చమైన గొల్లదాన నౌనయ్యా మంచివాఁడవు
పచ్చిమాట లాడుదురా పలుమారును
నిచ్చళమై నీచుట్టాలు నిండ వేగురున్నవారు
యెచ్చరించి సన్నసేసి యేల మొక్కేవయ్యా ॥చల్ల॥

ఆవులు మాఇలవేల్పు లంటకుమన్నాఁ బోనీక
కావరించి చెనకేవు గబ్బితనాన
పూవుల నేల వేసేవు పూఁపలయ్యా నా చన్నులు
యీవేళనే సన్నసేసి యేల మొక్కేవయ్యా ॥చల్ల॥

యీ యేఁడే కొమరెనైతి యెక్కుడైన గరితెను
చేయివట్టి సుద్దు లేమి చెప్పేవయ్యా
పాయపు శ్రీవేంకటేశ పంతాన నన్నేలితివి
యేయడా నీకెదురాడ నేల మొక్కేవయ్యా ॥చల్ల॥ 312

## లలిత

ఎఱఁగనా నీసుద్దులు ఇప్పుడు మాఇంట వచ్చి
మెఱయుచు నన్నునేలి మెప్పించితివి గాక ॥పల్లవి॥

యెవ్వతో మేడెక్కియుండి, యేనుఁగపై నీవు రాఁగా
అవ్వేళ చేయిచ్చి నిన్ను నందుకొనెను
వువ్విళ్లూరె మీలోని వొద్దిక లప్పుడు చూచి
జవ్వనులు మెచ్చి మెచ్చి సంతోసించుకొనిరి ॥ఎఱ॥

తురగము నట్టె నీవు తోలఁగా మానిపైనుండి
విరులుగోసేలేమ నీవెనక నెక్కె
సరుగన మీ ఇద్దరి చందాలు పక్కనఁ జూచి
సరసిజాక్షులు నవ్వి జాణలౌదు రనిరి ॥ఎఱ॥

నిగిడి పల్లకిమీఁద నీవు రాఁగాఁ బన్నాగము
దిగవేసి తనింటికిఁ దెచ్చె నొకతె
తగ శ్రీవేంకటేశ కాంతల నీపొందులు చూచి
మగువలందరు మిమ్ము మచ్చికఁ బొగడిరి ॥ఎఱ॥ 313

## తోండి

అప్పటిఁ బంతాలాడే వాపెతోడను
ఇప్పుడే రతి నలసే వెట్టు గెలిచేవయా ॥పల్లవి॥

మాఁటలనే చెలియ నీమసల్లాఁ గరఁగించె
గాఁటపు గుబ్బల నొత్తి కళ రేఁచెను
చీటికి మాటికి నవ్వి సిగ్గులు జారఁగఁదోసె
యీటు వెట్టుకొని యీకె నెట్టు గెలిచేవయా ॥అప్ప॥

చెనకి చెనకి నినుఁ జేతికి లోఁజేసుకొనె
కనుచూపుల నిన్నుఁ జొక్కఁగఁజేసెను

పెనఁగులాటలనే ప్రియములు పుట్టించె
ఇనుపమడించె నిన్నీకె యెట్టు గెలిచేవయా ॥అప్ప॥

తగులై వద్దఁ గూచుండి తమకము వొడమించె
జగిమోవి చవి చూపి చెంగలించె
నిగిడి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి వలపించె
యిగిరించెఁ గోర్కు లీకె నెట్టు గెలిచేవయా ॥అప్ప॥ 314

భైరవి

ఇన్నిటాఁ దా నేరుపరి యిల్లాల నేను
చిన్నదానఁ బ్రియమెంత చెప్పీనే తాను ॥పల్లవి॥

వొడఁబరచినమాఁట లూఁకొంటిఁగదవే
నడుమఁ దా నేమనినా నవ్వితిఁగదె
అడియాలాలు చెప్పితే నౌఁగాదనఁగదవె
తడవి నన్నేమిటికిఁ దగిలీనె తాను ॥ఇన్ని॥

చలపట్టి వేఁడుకొంటే సమ్మతించితిఁగదవె
సొలసితే తనమోము చూచితిఁగదె
అలరి విడెమిచ్చితే నందుకొంటిఁ గదవె
కొలఁది మీర నన్నెంత కొసరీనే తాను ॥ఇన్ని॥

పాదములు చాఁచితేను పట్టి వొత్తితిఁ గదవే
మోదమున మెచ్చితేను మొక్కితేఁగదే
యీదెస శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
పోదిసేసి నన్నేల పొదిగీనే తాను ॥ఇన్ని॥ 315

నాదరామక్రియ

సేసవెట్టి పెండ్లాడి సిగ్గులు వడితేఁ బోదు
బాస యిచ్చి నీకితఁడు బత్తి సేసీని ॥పల్లవి॥

మనసిచ్చి యాతనితో మాఁటలాడఁగదవే
వినయాన ని న్నతఁడు వేఁడుకొనీని
పెనఁగక ప్రియములే పెంచి పెంచి చూపవే
మునుకొని చుట్టరికములే సేసీని ॥సేస॥

వేడుకతో నీమోవి విందు లిట్టి పెట్టవే
వోడక నీతోపొందు లొనరించీని
జాడతోడ వీనులారా సమ్మతించి వినవే
వాడికెతో మేనబావ వావులు చెప్పీని ॥సేస॥

యింటిలో నీబలమెల్లా నితనికిఁ జూపవే
జంటయై నీకాఁ(కాఁగి?) టిలో సాముసేసీని
నంటు శ్రీవేంకటేశుఁ డున్నతిఁ గూడె మెచ్చవే
పెంటలైన రతులను పెచ్చు పెరిగీని ॥సేస॥ 316

## రామక్రియ

ఇచ్చక మెఱఁగవద్దా యేమే పతి లాలించఁగా
రచ్చ వేసేవు వలపురాఁపులివి యేలే ॥పల్లవి॥

సరుస నాతఁడు నీమై జవ్వాది వూయ రాఁగా
సరి వెనఁగేవు యింత చలములేలే
పరగి జారిన నీ పయ్యద చక్కఁ గప్పఁగా
కరము బిగ్గఁ బట్టేవు కక్కస మింతేలే ॥ఇచ్చ॥

మన్నించి యాతఁడు నీతో మంచి మాఁట లాడఁగాను
సన్నల జంకించేవు యీసణఁగులేలే
మిన్నక కొసరి తనమీఁద నానవెట్టఁగాను
పన్ని నోరుమూసేవు పంతా లింత యేలే ॥ఇచ్చ॥

మొక్కలాన నాతఁడు నీమోవితేనె లానఁగాను
వుక్కు గోర నూఁదే వింత వుద్దండాలేలే.
చెక్కు నొక్కి నిన్ను నిట్టె శ్రీవేంకటేశుఁ డేలఁగా
మొక్కుచు వీఁగేవు వట్టి మొఱఁగు విఁకేలే ॥ఇచ్చ॥ 317

**రేకు 1855** **సామంతం**

ఇంతలో విచ్చేసితివి యిాడకే మగువఁ జూడు
కాంత ఇదె నీరాక గాచుకొని వున్నది ॥పల్లవి॥

వుమ్మగిలు జెమటలు వూరిచి కొనగోరను
చిమ్ముచు నీ సుద్దలే చెలితోఁ జెప్పె
కమ్మటి సంతోసాన కలికి కన్నుల నవ్వు
కుమ్మరించుకొంటా నీగురుతులే చూపె ॥ఇంత॥

పొంచి పొంచి నిట్టూర్పులు పుక్కిళ్ల నాఁచి యాఁచి
నించుకొంటా చెలితోడ నిన్ను సొలసె
వంచిన శిరసుతోడ వలపు పులకలతోఁ
బెంచి పెంచి నిన్ననే పేరుకొని పొగడె ॥ఇంత॥

నిలువు నివ్వెరగుతో నీరూపు మదిలోన
తలఁచి నీకు చెలి ముందరనే మొక్కె
వెలఁదిఁ గరుణతో శ్రీవేంకటేశ కూడితివి
నెలకొన్నరతుల నీనేరుపెల్లా మెచ్చెను ॥ఇంత॥ 318

**శంకరాభరణం**

చల్లరే హరిపై జాజరజాజ
చల్లఁగా సరసపు జాజరజాజ ॥పల్లవి॥

సతతపు వలపుల జాజరజాజ
చతురులమాటల జాజరజాజ

సతమగు నవ్వుల జాజరజాజ
జతనపు సిగ్గుల జాజరజాజ ॥చల్ల॥

సముకపు కొసరుల జాజరజాజ
సమరతికరఁగుల జాజరజాజ
జమళి తమకముల జాజరజాజ
సమయని యాసల జాజరజాజ ॥చల్ల॥

జడియని పంతపు జాజరజాజ
సడఁగుల చేఁతల జాజరజాజ
జడిగొనుచెమటల జాజరజాజ
జడగొను పెనఁగుల జాజరజాజ ॥చల్ల॥

చలముల వొట్ల జాజరజాజ
సలిగెలపగటుల జాజరజాజ
చలువల వినయపు జాజరజాజ
సళుపుల చూపుల జాజరజాజ ॥చల్ల॥

సంగడి మూఁకల జాజరజాజ
జంగిలి మతకపు జాజరజాజ
సంగాత మమరిన జాజరజాజ
సంగతి యెరికల జాజరజాజ ॥చల్ల॥

సారపు మోవుల జాజరజాజ
సారెకుఁ బొలసేటి జాజరజాజ
సొరుచి మెచ్చుల జాజరజాజ
జారతనంబుల జాజరజాజ ॥చల్ల॥

సందడి కొలువుల జాజరజాజ
సందుల వొత్తుల జాజరజాజ

చందురుపాటల జాజరజాజ
సందె చీఁకటుల జాజరజాజ ॥చల్లి॥

ఛాలుకొను సతుల జాజరజాజ
జాలివిరహముల జాజరజాజ
చాలామరిగిన జాజరజాజ
చౌలూరించే జాజరజాజ ॥చల్లి॥

చనుఁగవ గురుతుల జాజరజాజ
చనవుల కొసరుల జాజరజాజ
యెనసెను శ్రీవేంకటేశ్వరుఁ డీతని
చనుమానంబుల జాజరజాజ ॥చల్లి॥ 319

## అమరసింధు

ఎంత ప్రియాలు చెప్పేవే యేడలేని యాసోదాన
వింత లే కాతఁడు గారవించెనంటాను ॥పల్లవి॥

చెక్కులేల నొక్కేవే చిత్తమేల కలఁచేవే
మిక్కిలి పతితో మందెమేళానను
వక్కణ లెన్నడిగేవే వాడికేమి చూపేవే
మక్కువ నాతఁడు నిన్ను మన్నించెనంటాను ॥ఎంత॥

చన్నుల నెంత వొత్తేవే సరసమే మాడేవే
సన్నల నాతఁడేలిన సలిగెలను
విన్నపా లెంత సేసేవే విడే లెన్ని యిచ్చేవే
పన్నుక యాతఁడు నీపై బత్తిగలఁడంటాను ॥ఎంత॥

పచ్చిగా నెంత నవ్వేవే పైకొని యేల చొక్కేవే
యిచ్చ నాతఁడు గూడిన యెమ్మెలను
తచ్చి శ్రీవేంకటేశుఁడు తానే నిన్ను మరిగించె
వచ్చి యెంత తగిలేవే వలచెనంటాను ॥ఎంత॥ 320

## సింధురామక్రియ

సేసే దేమే యిఁక వాని చిత్తము నాభాగ్యము
బాస యిచ్చినాఁడు నాకు బత్తిగలఁ డతఁడు ॥పల్లవి॥

వలెనని వినేనంటే వాని సుద్దు లెన్ని లేవు
పలుకులఁ జెప్పేనంటే బండ్లు నిండు
తలఁచితే మనసులో దగులు జిగురువలె
కొలఁది వెట్టఁగరాక గుట్టుతో నుందాననే ॥సేసే॥

నిక్కి చూచేనంటే వాని నిలువు నూరు వండు
చక్కఁదనా లెంచేనంటే సారె నోరూరు
తక్కక పొందుసేసితే తరితీపులు [1]గనము
ముక్కుపై వే లిడుకొని మోనాన నుందాననే ॥సేసే॥

చెనకే నంటే వాని చేఁతలు మీఁద మిక్కిలి
పెనఁగితే రతులను పెచ్చువెరుగు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేఁడు
వొనరి నివ్వెరగుతో నూరకే వుందాననే ॥సేసే॥ 321

## సౌరాష్ట్రం

చెప్పఁగలమాఁటలెల్లాఁ జెప్పితి నీకు
మెప్పించి నన్నేలితివి మేలుదానఁ జుమ్మీ ॥పల్లవి॥

చలపట్టి వేఁగినంతా సరసములే యాడేవు
వలవని జాగరాలు వద్దు వద్దయ్యా
తలకొని నామేన గందము వూసే వప్పటిని
వులివచ్చి వలపులు వుప్పతిలీఁ జుమ్మీ ॥చెప్పఁ॥

1. 'ఘనము' నకు వికృతి 'గనము' కాబోలు

పిప్పి గట్ట మాపుదాఁకా పెనఁగి పొద్దువుచ్చేవు
చప్పని చెలిమి చాలుఁ జాలునయ్యా
ముప్పిరిఁ బన్నీరు నాపై ముంచి ముంచి చల్లేవు
చిప్పిలు నాజవ్వనము చిగిరించీఁ జుమ్మీ ॥చెప్పఁ॥
పొద్దు వొద్దు తప్పకుండా పొంచి కాఁగిలించేవు
అద్దో యెతనేరుపరి వౌనౌనయ్యా
కొద్దితో శ్రీవేంకటేశ కూడి కప్రాన వేసేవు
వొద్దికై నాకళలంటి వువ్విళ్లూరీఁ జుమ్మీ ॥చెప్పఁ॥ 322

**రేకు 1856** **పాళంగవాట**

ఒక్కటంటే నొకటనేవోయి నీవు
వొక్కటైతే మనపొందు చక్కటాయఁగదవే ॥పల్లవి॥

కన్నులు చూడవోయి కడుగొప్పలు
కన్ను లట్టె వుండనీ నీ చన్నులు చూచేనే
పొన్నపువ్వు లంపవోయి పొద్దు వొద్దున
పొన్నపువ్వు లంపితేనే సన్నలఁ దెలియవే ॥ఒక్క॥

కతలు చెప్పవోయి కడు వినేను
కత లెఱఁగముగాని రతులు చెప్పేనే
తతులు రానియ్యవోయి దానికేమి
తతు లప్పుడే వచ్చె మితులు మీరేనే ॥ఒక్క॥

వావి దెలుసుకో వోయి వలసితేను
వావి నేఁ దెలిసినదే మోవి యానేను
దేవుల నైతిఁగదోయి శ్రీవేంకటేశ
దేవులా(లు?) గాఁగానే నీసేవలు మెచ్చితినే ॥ఒక్క॥ 3

## శంకరాభరణం

అలమేల్మంగవు నీవు అక్కున నుందానవు
లలి నీగుణమెఱిఁగి లాలించీఁగాక ॥పల్లవి॥

కొచ్చి కొచ్చి పలుమారుఁ గొసర నేమిటికే
మచ్చికతో నాతఁడే మన్నించీఁగాక
కచ్చుపెట్టి రతులకుఁ గక్కసించనేఁటికే
యిచ్చకము సేయఁగానే యెనసీఁగాక ॥అల॥

విన్నపాలు నేసి సేసి వేసిరించనేఁటికే
తన్నుఁదానే నీపై దయదలఁచీఁగాక
చన్నుఁ గొండలనే వొత్తి చండిసేయ నేఁటికే
యెన్నికతో వేఁడుకొంటే నియ్యకొనీఁగాక ॥అల॥

పిక్కటిల్లఁ జేయివట్టి పెనఁగఁగ నేఁటికే
యిక్కడ శ్రీవేంకటేశుఁ డేలీఁగాక
తక్క నిన్నుఁ బెండ్లాడీ తమకించ నేఁటికే
చక్కఁగా సేవ చేసితే చనవిచ్చీఁగాక ॥అల॥ 324

## వాదరామక్రియ

ఏమి సేసినాఁ జెలుల కిన్నియు సమరుఁగాక
కోమలి వేడుక లెన్ని కూడపోసేవయ్యా ॥పల్లవి॥

వుప్పతిల్లు గన్ను చూపు వొడ్డించుకోవచ్చునా
ముప్పిరిగొన్న నవ్వులు ముయ్యవచ్చునా
చెప్పరాని మాటలకు చెవులొగ్గవచ్చునా
కప్పురగంది నెంత గరిసించేవయ్యా ॥ఏమి॥

వుడివోని చుట్టరికా లొద్దనఁగవచ్చునా
తడఁ బడే తమకము దాఁచవచ్చునా

జడిగొన్న వలపుల చవుక సేయవచ్చునా
పడఁతితో నీక నెంత పంతమాడేవయ్యా ॥ఏమి॥

వులివచ్చి చెనకుల కోపననవచ్చునా
బలిమిఁ గూడితి వీకఁ బాయవచ్చునా
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
జలజాక్షి నీక నెంత సాదించేవయ్యా ॥ఏమి॥ 325

## సామంతం

చనవు సేసుక మోవిచవులు గ్గొందువు గాక
తనిసితిరి రతుల నీకఁ దలపోఁతలేలే ॥పల్లవి॥

మొగము చూచినయపుడే ముంచుకొనుఁ దమకంబు
నగినయప్పుడే మిగుల ననుపు గులుగు
తగులు గలిగినచోట తరితీపు లుప్పతిలు
పగటుతో నతని మె(మొ?) డఁబరచనీకనేలే ॥చన॥

సరసమాడినయపుడే సతమౌను మచ్చికలు
తెరదీసినప్పుడే తేరు సిగ్గు
తొరలనాడిన వేళ తుదిముట్టుఁ గోరికలు
పెరరేఁచి వలపులనుఁ బెనఁగ నీకనేలే ॥చన॥

యెదుట నుండిన యపుడే ఇచ్చగించును మనసు
కదిసినప్పుడే మదనకళలు వొడము
అదన నలమేల్మంగ నతడు శ్రీవేంకటేశుఁ
డది గదవే నిన్నేలె నడుగ నీకనేలే ॥చన॥ 326

## రామక్రియ

చెప్పవే నాకొక బుద్ధి చెలియ వూహించి నీవు
యెప్పుడూ నాకోరికలు యీడేరునే కదవే ॥పల్లవి॥

అనిశము నాచూపులు ఆతని మైఁ బారఁగాను
మనసులో నన్నతఁడు మరచీనటే
వెనువెంట నాసుద్దులు వీనులలోఁ దగులఁగా
ఘనమైన వలపు రేఁగనేవలెఁగదవే ॥చెప్పు॥

గక్కన నేనంపిన కానుక చే నుండఁగాను
యెక్కడి పరాకులు యేలయ్యీనే
తక్కిన నాతమకము తనపైఁ బొలయఁగాను
కిక్కిరించి నాపై దయ కెరలునే కదవే ॥చెప్పు॥

చేరి నేఁజల్లిన సేస శిరసుపై నుండఁగాను
వేరొకతె పొందులను వెలసీనటే
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
మేరతో నన్నేలే నిఁక మేలొనే కదేవే ॥చెప్పు॥ 327

## శ్రీరాగం

అలమేలు మంగపతివని నిన్నెఱఁగదేమో
కలికి చేఁతలు నీకు గంపల నమ్మీని ॥పల్లవి॥

నెరవాది తనమెంతో నీవెదుట నుండఁగా
తరుణి సిగ్గులనే దడి గట్టీని
గరిమలఁ దా నెన్ని కతలఁ గరచెనో
పెరరేఁచి వినయాలు పేరఁ బెట్టీని ॥అల॥

కచ్చుక యెన్నాళ్లనుండి కాచుకుండెనో నీతో
తచ్చన మాఁటలనే దండగట్టీని
బచ్చెన వేసాలు నెంత పరగినదో కాని
పచ్చి నవ్వులనే తలఁబాలు వోసీని ॥అల॥

తారుకాణగా నిన్నెంత దక్కఁగొనుకొన్నదో
సారె సారె వలపుల జాజరాడీని
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కూరిమిఁ దానూఁ గొంత కొసరి లాచీని ॥అల॥ 328

**రేకు 1857** **ఆహిరి**

ఆసల నెదురుచూచీ అతివ నీకు
సేస చల్లి యిట్టె దయసేయఁగరాదా ॥పల్లవి॥

మాఁటలనే కొంతవొద్దు మంతనాలఁ గొంతువొద్దు
యేఁటికి జంపులఁ బెట్టే విప్పుడు నీవు
ఆఁటదాని నింతేసి అలయించనేమిటికి
వాఁటమాయ వలపుల వచ్చితే రారాదా ॥ఆస॥

పందే లాడ వేళలేదా పాట విన వేళలేదా
ఇందాఁకాఁ గాచుకుండితి నెంతపరాకు
పొందుసేసినట్టి చోట పొరపొచ్చాలు సేతురా
అందుకొంటివి కానుక లాడకే రారాదా ॥ఆస॥

పిలిపించుకోవలెనా పెనఁగ నింట వలెనా
తలఁచుకోవద్దా యీకె తగులాయము
యెలమి శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
తిలకించి ఇట్టె దినదినము రారాదా ॥ఆస॥ 329

**పాడి**

ఏమి చెప్పేదే నీ సుద్దు లెన్ని యయినాఁ గలవు
దోమటి నాగుణాలతో తులఁదూఁగేవటవే ॥పల్లవి॥

చన్ను లెంత చూపినాను సరసమెంతాడినా
నిన్ననేఁటి మానిసివి నీవే కదే

కన్ను లెంత గిరిపినా కతలెంత చెప్పినాను
యెన్నఁగ నాతోడ నీవు యీడువచ్చేవటవే ॥ఏమి॥

సారె నెంత నవ్వినాను సంగాతా లెంత సేసినా
నేరుపులు వచరించ నీవే కదే
చేరి యెంత గాచుకున్నా చేఁత లెన్ని సేసినాను
మేరతో నాతని నీవు మెప్పించే వటవే ॥ఏమి॥

ఇచ్చక మెంత సేసినా నింపు లెన్ని చల్లినాను
నిచ్చలుఁ గూడేదానవు నీవేకదే
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్ను నేలె
పచ్చిరతులకు నీవూఁ బాలిదానవటవే ॥ఏమి॥ 330

## ముఖారి

మఱి యేఁటిమాటలు మాపుదాఁకాను
యెఱఁగవా నీవేమైనా నిఁక నీచిత్తమయా ॥పల్లవి॥

చెప్పరాని ప్రియము చెప్పితి ననియఁ (యెఁ?) జెలి
అప్పటిని వేఁడుకొంటిననియఁ జెలి
తప్పక నీవన్నమాఁట తలఁచుకొమ్మనెఁ జెలి
యెప్పుడు గరుణించేవో యిఁక నీచిత్తమయా ॥మఱి॥

ఇదె నీకు వయసు మీదెత్తితిననియఁ జెలి
అదనాయ నిన్నిట్టె రమ్మనియఁ జెలి
మదిలోనఁ దనబత్తి మరవకుమనెఁ జెలి
యెదురెదురే చూచీ నిఁక నీచిత్తమయా ॥మఱి॥

మచ్చిక దయిలువార మన్నించుమనియఁ జెలి
అచ్చమైన నీదేవుల ననియఁ జెలి
యిచ్చల శ్రీవేంకటేశ యింతలో వచ్చి కూడితి -
వెచ్చరించితి విందాఁకా నిఁక నీచిత్తమయా ॥మఱి॥ 331

## శంకరాభరణం

కలిగెను నీవల్లఁ గంటి మీ వలపు
అలరి చెప్పఁ గతలాయను వలపు ॥పల్లవి॥

పలువురు సొలయక పంతము నెరపక
అలుగక వుండిన దది వలపు
చలములు వెంచక సడఁగులు రాల్చక
కలసి మెలఁగుటే కందువ వలపు ॥కలి॥

వెంగెము లాడక వేసాల బొరలక
అంగము చూపని దది వలపు
చెంగక యేపొద్దు సిగ్గున లోఁగక
సంగడి నుండుటే సతమగు వలపు ॥కలి॥

తగవులు దప్పక తలఁపున మరవక
అగడులు సేయని దది వలపు
జిగి నినుఁ గూడెను శ్రీవేంకటేశుఁడు
మగువ నీకడరె మంచిది వలపు ॥కలి॥ 33

## హిందోళ వసంతం

కోరి యెందుకైనా నియ్యకోవలెఁగాక
తారుకాణలైన మీఁద తప్పించుకోవచ్చునా ॥పల్లవి॥

మక్కువ గలుగుకాంత మరి యేమాఁటలాడినా
అక్కరతో వినవలె నౌ ననవలె
యిక్కడక్కడివారు నిన్నేమందురోయంటా
తక్కక సిగ్గుతో నీకు తలవంచవచ్చునా ॥కోరి॥

చుట్టమైన జవరాలు సొలసి యెంత నవ్వినా
గట్టిగా నోరువవలె కలయవలె

గుట్టుమీరి నీమీఁద గురుతులు మోచీనంటా
వొట్టినవలపు దాఁచి వూరకుండవచ్చునా ॥కోరి॥

బత్తిగల కోమలి పట్టి యెంత వెనఁగినా
చిత్తగించి కూడవలె చే కొనవలె
యిత్తల శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
కొత్తగా నాపె నెనసి కొంక నింకవచ్చునా ॥కోరి॥ 333

## సామంతం

తగులమిగల చోట తగవు నెరపవద్దా
నిగిడి పొందులు సేయ నెరజాణఁ డతఁడు ॥పల్లవి॥

చనవున రమణుని జంకించినదానవు
మనసు రంజిల్లఁ గొంత మాఁటాడవే
కొనచూపులనుఁ గడు కొచ్చి చూచిన దానవు
వినయానఁ జెక్కునొక్కి వేఁడుకొనఁ గదవే ॥తగు॥

యిందాఁకా నాసలఁ బెట్టి యెలయించినదానవు
కందువ లంటి మనసు గరఁగించవే
చెంది చెనకితే గోరఁ జిమ్మినట్టిదానవు
ముందుగానే మొక్కు మొక్కి మోవితేనె లియ్యవే॥తగు॥

సరి వెనఁగి గుబ్బల సారె నొత్తిన దానవు
సురత గతులచేఁత జొక్కించవే
యిరవై శ్రీవేంకటేశు నింతసేసినదానవు
బెరసి చెప్పఁదగిన ప్రియమెల్లాఁ జెప్పవే ॥తగు॥ 334

రేకు 1858 **మంగళకౌశిక**

ఎంత పొందోకాని తొల్లి యీపెకు నీకు
వింతలేక చెనకీని వెల్లవిరిగాను ॥పల్లవి॥

పొంచి పొంచి జవరాలు పూవుల నిన్ను వేసీని
కొంచ కిదె తెరమఱఁగున నుండి
లంచముగ మోవి చూపి లాసి సన్నసేసీనిన్ను
మంచము పైకి రమ్మని, మఱవకు మిఁకను ॥ఎంత॥

బంగారు చిమ్మనఁ గోవిఁ బన్నీరు నీపైఁ జిమ్మి
సంగతిగాను కంబము చాటున నుండి
చెంగట నుండి ముత్యాల సేసలు నీపైఁ జల్లీ
యింగితాన రతులకు నెచ్చరించీ నిన్నును ॥ఎంత॥

కంకణాల చేతులను కప్పురము నీకు నిచ్చీ
పొంకమై చెలి మాఁటునఁ బూఁచుక వుండి
అంకెల శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
కొంకక తా నిన్ను జేరి కొసరీఁ గూరిములు ॥ఎంత॥ 335

### వరాళి

మేలు మేలు నీగుణాలు మెచ్చితి నేను
పోలించి యిలాగులనే భోగించవలెను ॥పల్లవి॥

వేసరఁగరాదు మరి వేగిరపడఁగరాదు
సేసవెట్టిన పతితో చెలులకును
వాసులు పట్టఁగరాదు వంతులడుఁగఁగరాదు
తాసువలె సరిదూఁగి దండ నుండవలెను ॥మేలు॥

కన్నుల జంకించరాదు కరకరిసేయరాదు
మన్నన గలదంటాను మాటిమాటికి
యెన్నైనా వదలరాదు యెగ్గులు పట్టఁగరాదు
సన్నలనే మోవితేనె చవి చూపవలెను ॥మేలు॥

సరివెనఁగఁరాదు చలము సాదించరాదు
మరిగిన రతివేళ మంచము మీఁద
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సరసములాడి ఇట్టె సమ్మతించవలెను ॥మేలు॥ 336

## బౌళి

ఆనతియ్యవయ్యా నాతో నక్కడి సుద్దు లెల్లాను
పూని నాకాఁగిట నిట్టె భోగించేవుగాని ॥పల్లవి॥

ఇందాఁకా నీ వాకె ఇంటనుండి వచ్చితివి
విందు వెట్టెనా నీకు వేడుకతోను
గందము పూసుకొంటివా కానవచ్చీ మేనను
పొందుగ విడెమిచ్చెనా పుక్కిట నీకున్నది ॥ఆన॥

నానిన చెమటలతో నవ్వుతా నున్నాఁడవు
పానుపు వరచెనా పాదాలొత్తెనా
వీనులలో నేమైనా విన్నపాలు సేసెనా
ఆనెనా చన్నులు వురమందు గురుతున్నది ॥ఆన॥

గరిమతో సంతోసాలు కానిపించీ నీమోమున
సరసము లాడెనా చల్లెనా సేస
యిరవై శ్రీవేంకటేశ యీడ నన్ను నేలితివి
మరిగి తాఁ గూడెనా నీమనసులో నున్నది ॥ఆన॥ 337

## ఆహిరి

ఎంతని విన్నవించేము యింతి నీపైఁ గల బత్తి
సంతోసాన నీతో పొందు సారె మాకుఁ జెప్పుడు ॥పల్లవి॥

యెదురెదురే చూచు యేపొద్దు నిన్నే తలఁచు
మదిరాక్షి చెలులతో మంతనమాడు

చెదరిన సరులతో చెక్కు చెమటలతోడ
నిదుర గంటఁబెట్టదు నీపై తమి యెట్టిదో ॥ఎంత॥

నీ మీఁది పాటలు వాడు నిలువునఁ జెంగలించు
ఆముకొని నిట్టూరుపు లడరించును
దీమసపు గుట్టుతోడ తెగని యాసలతోడ
నీమాటలే యాలకించు నీపై తమి యెట్టిదో ॥ఎంత॥

మలగు మీఁద మరగు మదనకళలు రేఁగు
కలలు గను నూరకె కాఁగిలించును
వెలఁది నిందు వచ్చి శ్రీవేంకటేశ కూడితివి
నిలిచి నిన్నుఁ బాయదు నీపై తమియెట్టిదో ॥ఎంత॥ 338

## శ్రీరాగం

ఇంతి విరహము మాన్ప నిదె వుపాయము
దొంతి కత చెప్పరే సంతోసించుఁగాని ॥పల్లవి॥

కలువలు కొప్పునిండా కాంతకు ముడువరే
అలచందురుఁడు చుట్టమై యుండుఁగాని
తలకొని మేన గందము చాలాఁ బూయరే
మలయానిలుఁ డీకెను మన్నించుఁగాని ॥ఇంతి॥

భామ వురమున రవి పడ(ద?)కము వెట్టరే
భూమిఁ జక్రవాకాలెల్లా పొందౌఁగాని
చేముందుగాఁ గమలాలచీర గట్టుకోనియ్యరే
ఆమని తుమ్మిదలు సహాయమౌఁగాని ॥ఇంతి॥

వనిత చేతికి పంచవన్నె చిలుక నియ్యరే
తనిసి మరుఁడు దయదలఁచుఁగాని

యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నీకెను నేఁడు
దినమూ నిట్టె సేయరే తిరమై యుండుఁగాని ॥ఇంతి॥ 33′

## పాడి

ఆతని కితవై యటు నీవుండఁగా
కాతరించి నినుఁ గాదననేలే ॥పల్లవి॥

చక్కని వనితకు సలిగెలు చెల్లును
మక్కువ గలిగిన మగనియెడ
వెక్కసమాడిన వేడుకయై తోఁచు
కక్కసించి నినుఁ గాదన నేలే ॥ఆత॥

ననుపుల ఇంతికి నగవులు చెల్లును
యెనసిన తన ప్రాణేశునెడ
పెనఁగి బిగిసినా ప్రియమై తోఁచును
కనుసన్నల నిను గద్దించనేలే ॥ఆత॥

జవ్వనపుసతికి సరసము చెల్లును
రవ్వగ వలచిన రమణు నెడ
యివ్వల శ్రీవేంకటేశుఁడు నన్నేలె
చివ్వన నీవాని చెప్పఁగనేలే ॥ఆత॥ 340

## ముఖారి

ఆపెమఱఁగున నీవేమైనాఁ జేసినది గద్దో
పూఁప సన్నలనే కడుఁబొద్దులు వుచ్చెను ॥పల్లవి॥

బత్తిసేసి యాకె నీపై పదములు వాడఁగాను
యిత్తల నీవింతలోనే యేమి నవ్వేవు
కొత్తగా సింగారించుకొన్నందుకు మెచ్చఁగాను
చిత్తగించి నీవెంత సిగ్గువడేవు ॥ఆపె॥

కాయపు గురుతులపై కస్తూరి యలఁదరాఁగా
చేయివట్టి ప్రియాలెంత చెప్పవచ్చేవు
చాయల నీవలపులు సారెసారెఁ బొగడఁగా
ఆయములు మోచీనంటా నానలేల పెట్టేవు ॥ఆపె॥

ముచ్చటతో నాపె నీమోవితేనె లానఁగాను
ఇచ్చగించి పలుసోఁకు లేల దాఁచేవు
పుచ్చుక శ్రీవేంకటేశ కొమ్మ నినుఁ బెండ్లాడఁగా
విచ్చన విడాయ నేల వేఁడుకొనేవు ॥ఆపె॥ 341

## రామక్రియ

నీవేల సిగ్గువడేవే నెలఁతలలో
కావించి యందరికినిఁ గలిగిన సాజమే ॥పల్లవి॥

చిగిరించుఁ గోరికలు చిమ్మరేఁగు వలపులు
మగనిపై బత్తిగలమగువకును
మొగానఁ గళలునిండు మునుకొను నాసలు
తగ నిన్నియు నీయందే తారుకాణ వచ్చెనే ॥నీవే॥

సెలవుల నవ్వుదేరు చెక్కులఁ జెమటలూరు
తలఁపు పతిపైనున్న తరుణికిని
పులకలు జాజుకొను పొడము నిట్టూరుపులు
కలవెల్లా నీయందే కనుఁగొంటిమే ॥నీవే॥

తమకము నుప్పతిలు దైవారు వేడుకలు
రమణుని పొందుగల రామకును
అమర శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నుఁగూడె
జమళి మీయందే ఇవి సరివచ్చెనే ॥నీవే॥ 342

## పాడి

ఇంతిగుణ మెఱఁగవా యేమైనా నీవు
చింతసేయక లోనికి విచ్చేయవయ్యా ॥పల్లవి॥

సేసినసీచేఁతలకు చెలి యేమీ నలుగదు
రాసికెక్కె నీ వేడుక రాఁగదవయ్యా
ఆసుద్ది దడవనని యానవెట్టె నీమీఁద
చేసూటితో నీపె నీచిత్తములోనిదయా ॥ఇంతి॥

యెటువలె నీవుండినా నెదురుమాఁటాడదు
సటగాదు రావయ్యా సమ్మతించెను
తటుకన లేచివచ్చి తానే మొక్కీ నీకు నదె
యిటుచూడు మీాపె నీకు నిచ్చకురాలయ్యా ॥ఇంతి॥

యెచ్చటనుండి వచ్చినా నెరవు సేయదు నిన్ను
చొచ్చి రావయ్యా యీడేరె చుట్టరికము
ఇచ్చటఁ గాఁగిలించె నిన్నిట్టె శ్రీవేంకటేశ్వర
పచ్చిదేరె నీకె నీపట్టపు దేవులయా ॥ఇంతి॥ 343

## దేసాళం

ఎవ్వరెరుఁగుదురయ్యా ఇట్టివి నీసుద్దులు
జవ్వనపు వేడుకల సరినోలలాడేవు ॥పల్లవి॥

తలఁపునఁ బారెనో తరుణి తమగుబ్బలు
పలుమారు నిమ్మపండే పట్టియాడేవు
కలలోనవచ్చెనో కలికి చక్కనిరూపు
మలసి చిత్తరుపతిమల వా(వ్రా?)సేవు ॥ఎవ్వ॥

విని నట్టాయనో నీకు వీనుల నాపె యెలుఁగు
అనుమానించక యట్టె యాలకించేవు

మునుకొని యాపై నీ మోమునఁ గట్టినట్టాయనో
పనివూని వేమారు భావించి చూచేవు ॥ఎవ్వ॥

కూరిమి నాకెమోవిపై కోరికలు రేఁగెనో
సారె సారె గుక్కిళ్లు చవిగొనేవు
యీరీతి శ్రీవెంకటేశ యేలితివి నన్ను నేఁడు
గారవించి నాకొరికే కాదుగదా నవ్వేవు ॥ఎవ్వ॥ 344

## నాదరామక్రియ

ఎందాఁకా జాజాలాడేవేమే నీవు
అందంది నీతోడిపొందు లాసగించు నితఁడు ॥పల్లవి॥

చక్కని నీమోము చూపి సరసము లాడవే
నిక్కి నిక్కి చూచీని నీరమణుఁడు
చెక్కు కొనగోర నొక్కి చిరునవ్వు నవ్వవే
మిక్కిలి నీతోఁ గడుమేలుగలఁ డితఁడు ॥ఎందా॥

సరుసనే కూచుండి చనుఁగవ నొత్తవే
విరులబంతుల వేసీ విభుఁడు నిన్ను
సరుగ మోవి యొసఁగి చవులు మరపవే
మరగ నేపొద్దూ నీపై బత్తిసేను నితఁడు ॥ఎందా॥

జోడుగాఁ గాఁగిట నించి సొంపులెల్లా రేఁచవే
వేడుకతో నున్నాఁడు శ్రీ వేంకటేశుఁడు
యీడైన రతులఁ గూడె యిచ్చకమే సేయవే
వాడికమకముల వలచు నీ కితఁడు ॥ఎందా॥ 345

## సామవరాళి

ఏమని వున్నాఁడోకాని యిప్పుడు తనమతిలో
కామించినదాన నన్నుఁ గరుణించుమనవే ॥పల్లవి॥

యిచ్చకమాడుదుఁగాని యెంచి వెంగేలాడవే
హెచ్చి తనసుద్దులు యెన్ని విన్నాను
మచ్చికలే సేతుఁగాని మరి నే నలుగనే
కొచ్చి తనమేన నెన్ని గురుతులున్నాను ॥ఏమ॥

కడు సంతోసింతుఁగాని కన్నుల జంకించనే
నడుమఁ దా నెవ్వతెతో నవ్వినాను
యెడయక మెత్తుఁగాని యెగ్గులు నేఁబట్టనే
తొడిబడ నెచ్చటఁ బొందులు సేసినాను ॥ఏమ॥

వినయమే సేతుఁగాని వెక్కసము చూపనే
పెనఁగుచు రతు లెంత పెంచినాను
యెనసె శ్రీవేంకటేశుఁ డిఁక ననుమానించనే
ననిచి తా నేటువలె నడచినాను ॥ఏమ॥ 346

**రేకు 1860** **దేసాళం**

సేసిన నా చేఁతలెల్లాఁ జెల్లుఁగాక
వాసులకు నాయీడు వత్తురా కామినులు ॥పల్లవి॥

కందువ నారమణుఁడు గలఁడు నన్ను మన్నించు
యెందరు సవతు లున్నా నేమాయనే
చెంది నా శిరసుమీఁద సేసపా లితఁడు వెట్టె
మందలించి నాతో మారుమలయఁగఁగలరా ॥సేసి॥

ఘనుఁడు వేడుకతోడుతఁ గట్టె నాకుఁగంకణము
యెనలేని విరసము లేమిసేసీనే
వొనరఁగఁ దనముద్దుటుంగరము నాకు నిచ్చె
పనులెల్లా నీడేరె పరులు నాకెదురా ॥సేసి॥

శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ జిత్తగించి యేలినాఁడు
యీవలావలి సుద్దులు యెంత చెప్పేరే
కైవశమై నాతోనే కాఁపురము సేయఁజొచ్చె
దేవులనైతి నిఁకఁ దెలుపఁగవలెనా ॥సేసి॥ 347

## బౌళి

ఏమనినాఁ దనతో నే నెదురాడేనా
వేమారుఁ దనకతలు వెలఇంచేఁగాక ॥పల్లవి॥

చెప్పితిఁ గదవే తన చేఁతలెల్లా నీతోను
చొప్పుగా మేన గురుతు చూపితిగదే
తప్పక వద్దిచెలులఁదారుకాణించితిగదే
అప్పటి నింకానేల ఆనవెట్టుకొనీనే ॥ఏమ॥

పట్టిఇచ్చితిఁగదవే భామ కంపినలేకలు
పెట్టిన సొమ్ములఁ దెలిపితిఁ గదవే
ఇట్టె చుట్టిరికము లేరుపరచితిగదే
నెట్టనఁ దగవు లెంత నెరప వచ్చీనే ॥ఏమ॥

పందే లాపెతో నాడఁగా పడితాళించితిఁ గదే
చిందినకప్పుర మొప్పించితిఁ గదవే
విందువలె వచ్చి శ్రీవేంకటేశుఁడు నన్నేలె
సందడిలోఁ దానెంత చందాలు సేసీనే ॥ఏమ॥ 348

## ముఖారి

వచ్చి యెంతదడవాయ వనిత నీవున్నాడకు
యిచ్చితివి మన్ననలు యీడేరించవయ్యా ॥పల్లవి॥

చుట్టరికములు చెప్పి సుదతి నీకు మొక్కీ
అట్టె నీదండఁ గూచుండఁబెట్టుకోవయ్యా

---

1. ఇందు దశావతార సమన్వయము గలదు. ఇది ఒకపాటి ఆధ్యాత్మకీర్తనయే.

నెట్టుకొని కానుకగా నిమ్మపండు చేతికిచ్చి
గుట్టుతోడ నీవందుకొనవయ్యా ॥వచ్చి॥
వివరించి సుద్దులెల్లా వెలఁది నిన్నడిగీని
చెవిలో నేకాంతము చెప్పవయ్యా
తివిరి మోవిసన్నలఁ దేనియలు గురిసీని
చవులుకొనుచు నీవు చనవియ్యవయ్యా ॥వచ్చి॥
కోరికోరి జవరాలు కొలువులు నీకుఁ జేసీ
నేరుపుతోఁ గాగిట నించవయ్యా
చేరి పూనితి వింతలో శ్రీవేంకటేశుఁడ నీవే
సారె నిన్నికె చెనకీ సరసమాడవయ్యా ॥వచ్చి॥ 349

**సాళంగనాట**

ఈతఁడొక్కఁడే యన్నిటా నెన్నిక కెక్కినవాఁడు
చూతమురారో చక్కని రీతి గలవాఁడు ॥పల్లవి॥
సారెకుఁ బుటమెగరి సాముచేసినవాఁడు
ఆరితేరిన చిప్పలహరికెవాఁడు
పోరి కొమ్ముదారతోడి పోటుబంటయినవాఁడు
చేరి రిపులఁ జెండాడే చేకత్తులవాఁడు ॥ఈత॥
పొంచి యడుగడుగుకుఁ బొదలేవాఁడు
చెంచలించక పగలు సాదించేవాఁడు
పెంచి శరణంటేఁ గాచే బిరుదువాఁడు
మించి గెలువఁగరాని మేటి బలువాఁడు ॥ఈత॥
పరులనుఁ గడు సిగ్గు వరపించేవాఁడు
తొరలి తొక్కని చోట్లు దొక్కేటివాఁడు
సురలకు నేలికై సూడువట్టేవాఁడు
నిరతి శ్రీవేంకటాద్రి నెలకొన్నవాఁడు ॥ఈత॥ 350

## పళవంజరం

మెచ్చి రిందరును నిన్ను మేలు మేలే
కచ్చుపెట్టి చెలులము కంటిమే నీమేలు ॥పల్లవి॥

చెలువుఁడు నిన్ను మెచ్చ సింగారించుకొంటి వౌనే
కొలువులో విడెమందుకోంటి వవునే
వలిపె పయ్యెద పల్లెవాటు వేసికొంటి వౌనే
మెలఁగి నీ పగటులు మెరసితి వవునే ॥మెచ్చి॥

పతికి నింపులు వుట్ట పాటలు వాడితివౌనే
కతచెప్పి మతిఁ గరఁచితి వవునే
రతికి సన్నలుసేసి రప్పించుకొంటి వౌనే
చతురత లెల్లాను సాదించితి వవునే ॥మెచ్చి॥

మాటాడి శ్రీవేంకటేశు మరిగించుకొంటి వౌనే
కూటములు (ల?) మన్నన చేకొంటి వవునే
తేట తెల్లమిఁ బట్టపుదేవులవైతి వౌనే
నీటున నీతనివద్ద నెలకొంటి వవునే ॥మెచ్చి॥ 351

## దేవగాంధారి

చూచి చూచి మీ పెండ్లికి సోబాన వాడేముగాక
మీచేఁత లిట్టివని మే మెంచఁగలమా ॥పల్లవి॥

చెక్కులు నొక్కేవు నీవు సెలవుల నవ్వేనాపె
యిక్కువలు మీలోనివి యెట్టు దెలుసు
తొక్కేవు పాదాలు నీవు దొరకొని మొక్కీనాపె
పక్కన మీ భావా లేరుపరచఁ గఁ గలమా ॥చూచి॥

చెనకఁచూచేవు నీవు సిగ్గులు వడీనాపె
యెనసిన నీసన్న లెట్టు దెలుసు

పెనఁగే వప్పటి నీవు ప్రియములు చెప్పి నాపె
వెనుకొన్న మీ సుద్దులు వివరించఁగలను ॥చూచి॥
సరసమాడేవు నీవు చన్నుల నొత్తి నాపె
యిరవైన మీ చయ్యాటా లెట్టు దెలు
గరిమ శ్రీవేంకటేశ కలసితివిటునన
తెరలోని మీ  ులు తెలుపఁగఁగలను ॥చూచి॥ 352

రేకు 1861 వరాళి

ఎన్నఁడు నెఱఁగమయ్య యిటువంటివలపులు
విన్నకన్నవారికెల్లా వెరగయ్యీ నిపుడు ॥పల్లవి॥
వెలఁది నీగుణములు వినివిని తనియదు
తలపోసి తలపోసి తనియదు
సొలసి కన్నుల నిన్నుఁ జూ  తనియదు
యెలమి నీపై మోహ మింకా నెంతోకాని ॥ఎన్నఁ॥
అట్టె నీతోడుత మాటలాడియాడి తనియదు
తట్టి తట్టి పాదాలొత్తి 
చిట్టకపు కొనగోరఁ జిమ్మి చిమ్మి తనియదు
యిట్టె నిన్నుఁ గూడే వేడు కింకా నెంతోకాని ॥ఎన్నఁ॥
అచ్చపు నీమోవితేనె లానియాని తనియదు
తచ్చి తచ్చి నవ్వి నవ్వి తనియదు
కొచ్చి శ్రీవేంకటేశ్వర కూడిమాడి తనియదు
యిచ్చల నీపై తమక మింకా నెంతో కాని ॥ఎన్నఁ॥ 353

**సామంతం**

ఏల లోఁగేవు నీచేఁత నీకె యెరిఁగీనంటా
తాలిమిగల దాపెకు తగ నిన్నుఁబాయదు ॥పల్లవి॥

చనవు సేసుక వచ్చి సతి నిన్నుఁ జెనకఁగా
పెనఁగి యేమిటికిఁ దప్పించుకొనేవు
కనుఁగొని యిట్టె నీ చక్కఁదనాలు వొగడఁగా
ననిచి సెలవులను నవ్వులేల నవ్వేవు ॥ఏల॥

పలుమారు నీవున్న బాగులకు మెచ్చఁగాను
చెలఁగి నీవిందుకెంత సిగ్గువడేవు
మలసిమలసి నీతో మంచిమాట లాడఁగాను
తిలకించి చూచి పచ్చితిట్టు దిట్టనేఁటికి ॥ఏల॥

ఖూరిమి నీ సుద్దులకు కుచ్చికాఁగిలించుకోఁగా
తారుకాణించుమనేల తలవంచేవు
యీరీతి శ్రీవేంకటేశ యీకే నిన్నుఁ బెండ్లాడె
గారవించి ఇపు డెంత కప్పుర మిచ్చేవు ॥ఏల॥ 354

## లలిత

ఎంతేసి వేసాలు సేసీ నీతఁడు నేను
వింత వింత సుద్దులెల్లా వినరమ్మ చెలులు ॥పల్లవి॥

మచ్చిక నా చూపులు మర్మములు గాఁడెనంటా
కొచ్చి కొచ్చి తనకొనగోర నూఁదీనే
కచ్చుపెట్టి నామాఁటలు కళలు రేఁగించెనంటా
కుచ్చితాన నందరిలో కొంగేల పట్టీనే ॥ఎంతే॥

సెలవుల నా నవ్వులు సిగ్గులు వరచెనంటా
చలపాదితనమున చన్నులంటీనే
కలికి నాచేఁతలు కడు వలపించెనంటా
పెలుచు నామోవి యెంత పిప్పిసేసీనే ॥ఎంతే॥

ఇట్టి నా చక్కఁదనము యెలయించెనంటాను
బెట్టుగాఁ గాఁగిట సారె బిగించీనే
గుట్టుతోడ నారతులు గొనకొని మించెనంటా
వొట్టుక శ్రీవేంకటేశుఁ డోలలెట్టు వేసీనే ॥ఎంతే॥ 355

## కాంబోది

రమ్మనవే వో చెలియా రమణుని మా యింటికి
కమ్మర నడుగనేల కాదనేనా నేను ॥పల్లవి॥

కనుసన్నలనే వట్టికాఁక రేఁచవద్దుగాక
మనసారా మాటాడితే మంచిదే కదే
పెనఁగుచు నూరకే బిగియఁగవద్దుగాక
చనవిచ్చి మన్నించుటే సమ్మతానే కదవే ॥రమ్మ॥

నాలిసేసి నాఁటకము నడపఁగవద్దుగాక
మేలము నాతో నాడితే మేలే కదే
వోలవేసి వలపించి వోరసేయవద్దుగాక
వేళతో వచ్చి కూడితే వేడుకే కదే ॥రమ్మ॥

గుట్టుతోడ నెలయించి గోర సేయవద్దుగాక
యిట్టే వొద్దికై వుండితే నితవే కదే
చిట్టకము వద్దుగాక శ్రీవేంకటేశుఁడు నన్ను
నెట్టనఁ బెండ్లాడినాఁడు నేరుపిదొఁగదవే ॥రమ్మ॥ 356

## మధ్యమావతి

ఎంతలేదు చుట్టరిక మెక్కడ చూచినా నీకు
మంతుకెక్కఁగ నామాఁట మన్నించి రావయా ॥పల్లవి॥

విందుచెప్పి యాపె నీకు వేళగాచుక వుండఁగా
ఇందువచ్చి జాజాలు నీవేమాడేవు

పొందు లెన్నైనాఁ గలవు పూఁచి నీవు వెదకితే
ఇందుముఖి యాన నీకు ఇట్టే లేచి రావయా ॥ఎంత॥
ఇంతి నీకుఁ బోఁకవట్టి యెదురెదురే చూడఁగ
పంతాన నిక్కడకు వచ్చి పాట వినేవు
వింతలైన విద్యలకు వేడుకకాఁడ వౌదువు
దొంతుల నాకెపై యాన తోయకిట్టె రావయా ॥ఎంత॥
వరుసకు వచ్చి యాపె వాకిట నిలుచుండఁగా
పొరుగువారితో నెంత పొద్దు సేసేవు
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వింటికి వచ్చి
తరుణిపై యాన లిఁక దాఁట కిట్టె రావయా ॥ఎంత॥ 357

## బౌళి

ఈకెకు నీకును దగు యిన్నిటా నెంచి చూచితే
వాకుచ్చి యెంతని మిము వర్ణించవచ్చునయా ॥పల్లవి॥
చెలి నీ గుణాలు విని చేతులెత్తి నీకు మొక్కె
అలరి నీ తోడి పొందు లాపగించెను
వలచి నీపేర లేక వా(వ్రా?) యఁబూని సిగ్గువడి
కలికి సుద్దులు చెప్పఁ గతలాయనయ్యా ॥ఈకె॥
చక్కని నీమోము చూచె సతులతోడఁ బొగడె
అక్కరతో నాడనుండే యారతి యెత్తె
చొక్కి నీకుఁ గానుకియ్యఁ జూచి తనలోనే నవ్వె
మక్కువ చందమెంతని మరి చెప్పేమయ్యా ॥ఈకె॥
యింటికి నిన్ను రమ్మనె నింతలోనే కాఁగిలించె
జంటయై పానుపుమీఁద సరిఁ గూచుండె
వొంటి నీతో మాటలాడె నొద్దికై శ్రీవేంకటేశ
వింటిమి మీమచ్చికలు వేడుకాయనయ్యా ॥ఈకె॥ 358

**రేకు 1862** **దేశాక్షి**

మగువకుఁ జనవిచ్చి మన్నింతువు గాక ఇఁక
మగిడి మగిడి యేమి మమ్మడిగేవయ్యా ॥పల్లవి॥

యెలుత గుబ్బలు నీకు మీఁదెత్తుకవున్నది
పలచనిమోవి జన్నె వట్టుకున్నది
పలుకుఁదేనెలు నీకుపారము సేసుకున్నది
యెలమి నింకా సుద్దులు యేమడిగేవయ్యా ॥మగు॥

వుమ్మగిలి సింగారాలు వుడుపావట్టుకున్నది
తమ్మిమోము సూడిదెగా దాఁచుకున్నది
కమ్మిన మొక్కులు చేతఁ గానుకవట్టుకున్నది
ఇమ్ముల నింకా సుద్దులు యేమడిగేవయ్యా ॥మగు॥

నెట్టుకొన్న జవ్వనము నీసొమ్ము సేసుకున్నది
గుట్టున వలపు వొడిఁగట్టుకున్నది
నెట్టన శ్రీవేంకటేశ నీవె యీకెఁ గూడితివి
ఇట్టె యింకా సుద్దులు యేమడిగేవయ్యా ॥మగు॥ 359

**ఆహిరి**

నీవాపెకు వలచుట నే మెఱఁగమా
కైవసమై యివీఁ గొన్ని గడించేముగాక ॥పల్లవి॥

వినుమని నీ కప్పుడే విన్నవించనానేను
వనిత తానే యీడ' వచ్చునని
నినుఁబాసి మరి యాకె నిమిష మెరువఁగద్దా
మనసెరిఁగియు గుట్టు మానవైతివి గాక ॥నీవా॥

హత్తి తారుకాణించనా ఆపె నీకు నేపొద్దూ
చిత్తమురా నూడిగాలు సేసునని

బత్తి నీపైఁ బెట్టినది పంతాలు నెరపునా
కొత్తరాజసము చూపి కొసరితివి గాక ॥నీవా॥

ఒరుస దిష్టము చూపి సాకిరివెట్టనా నీకు
బెరసి నిన్నిట్టె యీకె పెండ్లాడునని
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వికఁ గొంకునా
సొరిది నాపె నేరుపు చూచితివి గాక ॥నీవా॥ 360

## రామక్రియ

చక్కని గుణవంతుఁడు సరి నీకు మగఁడాయ
యెక్కువైన నీభాగ్య మేమని చెప్పుదమే ॥పల్లవి॥

నెలఁత నీ నోములు నేఁడె ఫలిఇంచెఁగదే
కలలు నీకిపుడె నిక్కలలాయెనే
పలికిన సగినాలు పతి వచ్చెఁగదవే
తలఁచఁగానే విభుఁడు తానే ఇందు వచ్చెను ॥చక్క॥

తొల్లిటి మీ పూజలు తుదకెక్కెఁగదవే
యెల్లగా నీకోరికలు యీడేరెనే
చెల్లు బడి నీ పంతము చేకూడె గదవే
యిల్లిదివో నీరమణుఁ డెదుటనున్నాఁడు ॥చక్క॥

నీ వెంచిన యెన్నికలు నెరవేరెఁగదవే
కావలసినవి తారుకాణలాయెనే
దేవుల వయితివి వావి దిష్టములాయఁ గదవే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరికూడినాఁడు ॥చక్క॥ 361

## గౌళ

నీ కొలఁదివారమా నేమెల్లాను
చేకొని పంతాలు మీతోఁ జెప్పుకోముగాక ॥పల్లవి॥

చుట్టమైన పతితోడ సొలతుము కాంతలము
గుట్టుతోనే జంకించి కొసరుదుము
అట్టె నీవంతటిలోనే యాతని దవులనంటా
బట్టబయలు నీవెంత పట్టిపెనఁగేవే ॥నీకొ॥

చనవుగ మగని సాదింతు మిల్లాండ్లము
నునుపునఁ గొనగోరు నాటింతుము
పనివడి నీవే కడు బత్తిగలదాననంటా
పొనుఁగ కాతని కెంత పూనుక వచ్చేవే ॥నీకొ॥

యేలిన శ్రీవేంకటేశు నెనతుము సతులము
కాలు దొక్కి రతులనుఁ గరఁగింతుము
మేలమాడి యాతనితో మేలుదాన నైతినంటా
చాలా నీవాతని కెంత చాయలు దిద్దేవే ॥నీకొ॥ 362

## సామంతము

ఎంత భాగ్యవంతుఁడవో యీకె నీకు దేవులాయ
వింతలుగా నీకుఁగానే వెదకి తెచ్చితిని ॥పల్లవి॥

అలివేణి జవరాలు అన్నిటానుఁ జక్కనిది
చిలుకపలుకుల దీ చెలియ
కలిగె నీకుఁ గన్నుల గలికి యీకె యొక్కతె
అలరి ఇట్టె పెండ్లి యాడుదువు రావయ్యా ॥ఎంత॥

యిందుముఖి కంబుకంటి[1] యిన్నిటా నందమైనది
చందనగంది యీసకియ
పొందుగా దొరకె నీకు పువ్వుఁబోణి యొక్కతె
అంది యీకె నిట్టె పెండ్లి యాడుదువు రావయా(య్యా?)॥ఎంత॥

1 "కంబుకంఠి" కి "కంబుకంటి" వ్యావహారికమా?

జక్కవ చన్నులలేమ చక్కెరబొమ్మ బిత్తరి
చొక్కపు సింగారాల దీ సుదతి
దక్కె శ్రీవేంకటేశ యీతరణి నీకు నొకతె
అక్కరతో నిట్టె పెండ్లి యాడుదువు రావయ్యా ॥ఎంత॥ 363

## ముఖారి

ఇందరిముందరా నీవు యెంత సేసేవు
కందువైన యేకతానఁ గరుణించరాదా ॥పల్లవి॥

ముసి ముసి నవ్వులతో మోహన నుండినదాని
కొసరి కొసరి యేల కొంగువట్టేవు
కసుఁగాటు సిగ్గుతోటి కాంత నలయింతురా
యెసగి వొయ్యనే వీడెమిచ్చీఁగాక ॥ఇంద॥

చెక్కుల చెమటతోడ శిరసు వంచినదాని
కక్కసించి యిప్పుడేమి కాలు దొక్కేవు
పక్కనను గుట్టుతోడ భామను ఒట్టుసేతురా
గక్కనఁ దానే వూడిగము సేసీఁగాక ॥ఇంద॥

చనుఁగవ భారముతో సరసమాడేటి దాని
పెనఁగి కాఁగిట నెంత బిగియించేవు
ననిచి శ్రీవేంకటేశ నాతి నింత పైకొందురా
యెనసి రతిఁ నిన్ను నిఁ(విం?) కా మెప్పించీఁగాక॥ఇంద॥ 364

రేకు 1863

## దేశాక్షి

కూరిమి నీతోడిపొందే కోరుకున్నాఁడు
తారుకాణగా నాతనితలపీడేరించవే ॥పల్లవి॥

జక్కవ చన్నులమీఁద సగినాలు చూచీఁ బతి
మొక్కుచుఁ బయ్యెద నేల మూసి దాఁచేవే

ఇక్కువఁ బలుకు చిల్క లేలుపురొప్పులు వినీ
మక్కువఁ గోమలి నీవు మాఁటలాడవే ॥కూరి॥

కొప్పుఁదేఁటి నల్లఁబులుగులతీరు చూచీని
వొప్పుగఁ జెలిమాఁటున నొదుగ నేలే
కప్పుకొని కనుపెంటిగరిమలే వెదకీని
యిప్పుడు నీమోము వంచ నిఁక నేఁటికే ॥కూరి॥

మించు నడపు నెమళ్ల మెట్లు గతులు చూచీ
మంచి సు(శు?) భసూచనల మలయఁగదే
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
పొంచీ యెలుఁగుగోవిల పోచిళ్ల దెలుపవే ॥కూరి॥ 365

## బౌళి

నంటున నెవ్వతెతోనో నవ్వెనంటాను
జంటవాయ కెంతేసి సాదించేవే ॥పల్లవి॥

చిగురువంటిది మోవి చిలుకపలుకు మాట
వెగటు లే కే లతని వెంగె మాడేవే
మొగము తమ్మివంటిది ముద్దుఁజెక్కు లద్దములు
అగడుసేసి నీవెంత అద్దలించేవే ॥నంటు॥

కలువలే నీకన్నులు కారుమెరుఁగులే చూపు
చలపట్టి నీవెంత జంకించేవే
లలిఁ దీగెలు చేతులు లావణ్యము నీమేను
పెలుచు ఁదనాన నెంత పెనఁగులాడేవే ॥నంటు॥

పూవుఁబంతులు కన్నులు పులినాలు పిరుఁదులు
శ్రీవేంకటేశ్వరు నేమి చిమ్మిరేఁచేవే
వేవేగ నిన్నితఁడేలె వెలసె నీజవ్వనము
లావుగాఁ గాఁగిటు నెంత లంకించేవే ॥నంటు॥ 366

## రామక్రియ

నన్నుఁజూచి నాకు నాకే నవ్వు వచ్చీని
మిన్నక నాజవ్వనమే మేరలు మీరఁగను ॥పల్లవి॥

వలచిన వలపులే వలలై తగులుకోఁగా
చెలుల దూరితే నేమిసేయఁగలవే
పలికిన పలుకులే బాసలై తొడరఁగాను
చలపట్టి బొమ్మలను జింకించఁబనేమే ॥నన్ను॥

కనుఁగొన చూపులే కడునాస వుట్టించఁగా
వెనక మరుని మీఁద వేసారనేలే
మనసు కోర్కెలే మర్మములు రేఁచఁగాను
పెనచి చెక్కిటఁ జేయిపెట్టఁగ మరేలే ॥నన్ను॥

కందువ చుట్టరికమే కాఁగిటఁగూరుచఁగా
సందడి సిగ్గులతోడ జరయనేలే
యిందుకే వచ్చి శ్రీవేంకటేశుఁ డిప్పుడే నన్నేలె
అందుకోను సరసాల నంత యనఁగనేలే ॥నన్ను॥ 367

## పాళంగవాట

మీకిద్దరికే తెలుసు మీలోని మర్మములు
పైకొని యెదురెదుర పచ్చిదేరీ సిగ్గులు ॥పల్లవి॥

ముక్కల గదలఁగాను ముసి ముసి నవ్వు నవ్వీ
చెక్కిటఁ జేయివెట్టుక చెలి నీతోను
యిక్కువలు గరఁగ నీ వేమంటివోకాని
పక్కన నడుగరాదు పచ్చిదేరీ సిగ్గులు ॥మీకి॥

కంకణాలు గల్లనఁగా కాంత చేసన్నలు సేసీ
కుంకుమ చెమట కొనగోరఁ జిమ్ముతా

వుంకువ మీకెటువంటి వొడఁబాటులోకాని
పంకించక మీలోమీకు పచ్చిదేరీ సిగ్గులు ॥మీకి॥

చిత్తము గరఁగఁగాను చేరి కాఁగిలించుకొని
గుత్తపు గుబ్బల నొత్తి కొసరుకొంటా
పొత్తుల శ్రీవేంకటేశ పొందినరతు లెట్టివో
బత్తితో మీభావములఁ బచ్చిదేరీ సిగ్గులు ॥మీకి॥ 368

## శుద్ధవసంతం

వింటివటే యీతని వేసాల సుద్దులు నేఁడు
అంటే ననరాదుగాని ఆగడీఁడుగదవే ॥పల్లవి॥

ఇంటికి వచ్చినాఁడు నా ఇచ్చలోనే వుండుఁగాక
నంటున వింతవారితో నవ్వఁగనేలే
జంటవాయుకున్నవాఁడు చనవెల్లా నిచ్చుఁగాక
వొంటి వేరొకతెఁ జూపి వొట్టువెట్టనేలే ॥వింటి॥

మొగము చూచినవాఁడు ముచ్చటలాడుటగాక
తగ నచ్చటిపొందీడఁ దలఁచనేలే
మిగులాఁ జుట్టపువాఁడు మేలువాడై యుండుఁగాక
జగములో నాకోరిక సరి యెంచనేలే ॥వింటి॥

నాతో మాఁటాడినవాఁడు నన్ను నిట్టె యేలుఁగాక
యేతుల నాపెచే పంతమిప్పించనేలే
యీతల శ్రీవేంకటేశుఁ డింత మన్నించినవాఁడు
చేతికి లోనవుఁగాక సిబ్బితి మరేలే ॥వింటి॥ 369

## శంకరాభరణం

సిగ్గువడీ సుమ్మీ చిన్నవయసుది
వొగ్గి సారె నెంత వొరసేవయ్యా ॥పల్లవి॥

వలచి యేపొద్దు వద్దనున్నదంటా
        చెలినేల కాకు సేసేవయ్యా
        చెలిమి సేయఁగా చెమరించెనంటా
        నలిరేఁగి యేమి నవ్వేవయ్యా ॥సిగ్గు॥

కనుఁగొని మతి గరఁగెనంటాను
        చెనకేల గోరఁ జిమ్మేవయ్యా
        వినయాన నిన్ను వేఁడుకొనెనంటా
        గునిసి యేమాడుకొనేవయ్యా ॥సిగ్గు॥

కందువల నిన్నుఁ గాలు దొక్కెనంటా
        చెంది యేమి సన్నసేసేవయ్యా
        యిందుకె శ్రీవేంకటేశ కూడితివి
        అంది మఱ్ఱ్మముల అంటేవయ్యా ॥సిగ్గు॥ 370

**రేకు 1864** **పాళంగవాట**

[1]ఏమని చెప్పఁగవచ్చు నీతని ప్రతాపము
        భూమిలో నారదాదులు పొగడే రీతనిని ॥పల్లవి॥

పిడుగులు రాలఁజొచ్చె పెనుఁగంభము వగిలే
        వెడలె నందులోల వీరసింహము
        కడుపుచించి పేగులు గక్కన జంధ్యాలువేసె
        పడె హిరణ్యదైత్యుఁడు పగదీరె నదివో ॥ఏమ॥

ఘోర చక్రము గెరలె కోలువెల్ల బెదరెను
        ఆరభటి గావించె నాదిసింహము
        ధీరుఁడై నెత్తురు నలుదిక్కులకు వెదచల్లె
        పారిరి రాకాసులెల్ల పగదీరె నదివో ॥ఏమ॥

1. ఇది అధ్యాత్మ సంకీర్తనలలో నుండదగినది.

సురలు జయవెట్టిరి శుభములు భువి నిండె
తిరమాయ శ్రీవేంకటదేవ సింహము
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచె దాసుల రక్షించె
పరసేనలు సమసె పగదీరెనిదివో ॥ఏమ॥ 371

## శంకరాభరణం

ఎంతనేరుపరి యీాలేమ
దొంతివెట్టే సంతోసముల ॥పల్లవి॥

వెలఁది సెలవులను వెన్నెలగాసీ
చెలులు నీసుద్దులు చెప్పఁగను
తలపోఁతలనే దండలు గుచ్చీ
నెలకొని యెదుటను నీవుండగను ॥ఎంత॥

వనిత చెక్కులను వానలు గురిసీ
తనియని విరహపుఁ దమకమున
కనుచూపులనే కలువలు చల్లీ
నినుపుల వలపుల నీరాకలకు ॥ఎంత॥

తెఱవ పెదవులను తేనెలు చిందీ
మఱి నీవాడిన మాఁటలను
నెఱి శ్రీవేంకటనిలయ కూడితివి
జఱసీ నీతో జాణతనముల ॥ఎంత॥ 372

## ఆహిరివాట

కొత్త పెండ్లి కూఁతురువై కొంకుదేర వింతేకాక
యిత్తల నీతోడివారి నిటు చూడవే ॥పల్లవి॥

చనవిచ్చి రమణుఁడు సన్నలు నీకుఁ జేసితే
చెనకి యేమి చూపేవే చెలులకును

యెనసి యాతఁడు నీతో నేకాంతము లాడఁగాను
పెనఁగుచు నెంతేసి బెట్టిమాట లాడేవే ॥కొత్త॥

యిక్కువకు వీడె మాతఁ డెఱఁగనట్టె యంపఁగా
అక్కర నేఁటికిఁ జెప్పే వందరితోను
నిక్కి చూచి గుట్టుతోడ నిమ్మపంట వేయఁగాను
చక్కఁగా నందరి నేమి సాకిరి వెట్టేవే ॥కొత్త॥

మూసి దాఁపిరెము గాఁగ మోవి యాతఁ డడిగితే
రాసి కొలువులో నేల రవ్వసేసేవే
ఆసతో శ్రీవేంకటేశుఁ డంతలోనే నిన్ను నేలె
సేసపాలు చల్లి యేల సిగ్గువడేవే ॥కొత్త॥ 373

## రామక్రియ

మఱి నేనే చెప్పేనంటే మందెమేళ మందురు
మెఱసెఁ దనగుణాలు మెచ్చితి నే ననవే. ॥పల్లవి॥

అతనిఁ గంటే చెలియ అడిగితివనవే
తతి దప్పకుండా తనుఁ దలఁతు నేననవే
మతిలోఁ దనపొందులు మరిగితి ననవే
చతురుఁ డీడకువచ్చి చనవు లిమ్మనవే ॥మఱి॥

మొదలనే తనకు నే మొక్కిలి నే ననవే
పదివేలకుఁ దనపై బత్తి గలననవే
చెదరక తనమేలు చెప్పుకొందు ననవే
కదిసి న న్నిందరిలోఁ గరుణించుమనవే ॥మఱి॥

మిక్కిలిఁ దనకు నేను మేలు దాన ననవే
చక్కఁగాఁ దన రతులు సారె మెత్తుననవే

1.2. ఇట్టి పునరుక్తులక్కడక్కడ గలవు.

అక్కరో శ్రీవేంకటేశుఁ దంతలో దా వచ్చి కూడె
యిక్కడనే వుండి నన్ను నెడయకు మనవే ॥మతి॥ 374

## హిందోళవసంతం

ఆఁటదాని వలపులు అంగడి కెక్కఁదగునా
నీటుతోనే పంతములు నెరపవలెఁగాక ॥పల్లవి॥

ఆలు మగఁడును లోలో నట్టె మాఁటలాడుకోఁగా
ఆలించి యేమి వినేవే ఆసతో నీవు
చాలుకొని తమలోన సరసములాడఁగాను
తాలిమితో నీవెట్టు దండనే వుందానవే ॥ఆఁట॥

మునుకొని వొండొరుల మొగములు చూచుకోఁగా
కనుఁగొని ఇఁకనేమి కత చెప్పేవే
చెనకుచు నిద్దరూను చే సన్నలు గావించఁగా
కొనకెక్క నీ వెంత కొలువు సేసేవే ॥ఆఁట॥

ఆకెఁ దానూఁ గూడుకొని యట్టె తెరవేసుకోఁగా
సాకిరిదాన్వై యేమి నమ్మితించేవే
యీకడ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడినాఁడు
చేకొని నన్నూ నేలె సిగ్గులేల పెంచేవే ॥ఆట॥ 375

## సాళంగం

ఎడమాఁట లిఁకనేల యెదుట నున్నాఁ డతఁడు
పిడికిటిసేస వెట్టి పిలువవే ఇంటికి ॥పల్లవి॥

వినయాలే పచరించి వేడుకలు వుట్టించి
మనసురా నతనితో మాటలాడవే
చనవు సేసుక కడుసరసము లెల్లా నాడి
పెనఁగి పెనఁగి యిట్టె పిలువవే యింటికి ॥ఎడ॥

చల్లని చూపులఁ జూచి చక్కని మోము చూపి
వెల్లవిరిగా మొక్కి వీడెమియ్యవే
పుల్లము గరఁగ మేన వుదుటుగుబ్బల నూఁది
పెల్లునఁ బ్రియము చెప్పి పిలువవే ఇంటికి ॥ఎడ॥

చుట్టరికములు చెప్పి సొంపుగా నవ్వులు నవ్వి
గట్టిఁగా గొసరి యిచ్చకము చూపవే
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
పెట్టరాని యాన వెట్టి పిలువవే యింటికి ॥ఎడ॥ 376

**రేకు 1865** **ఆహిరి**

అటువలెనైతే నాయాసలు నెరవేరును
తటుకన మమ్మిద్దరిఁ దగఁ బెండ్లి సేయరే ॥పల్లవి॥

కనువిచ్చి చూచిచూచి కాఁకలఁ బొరలరాదు
మనస్సుపెట్టి మరి మరవరాదు
తనువు సోఁకఁ జెనకి తమక మాఁపఁగరాదు
పెనఁగి యీతని నాకుఁ బెండ్లి సేయరే ॥అటు॥

తలపోసి తలపోసి తాలిమి గైకొనరాదు
వలపుల కొడిగట్టి వదలరాదు
సెలవుల నవ్వి కడుఁజింతలఁబొరలరాదు
పిలిచి యీతని నాకుఁ బెండ్లిసేయరే ॥అటు॥

చేముట్టి చేముట్టి సన్న సేసిసేసి మానరాదు
వేమారు సరసమాడి వీఁగఁగ రాదు
కామించి నన్నేలినాఁ డిక్కడ శ్రీ వేంకటేశుఁడు
ప్రేమతో నీతని నాకుఁ బెండ్లిసేయరే ॥అటు॥ 377

## సాళంగనాట

ఎంత లేదు నీ పగటు యేమి చెప్పేదే
        రంతుగా మాఁటాడితేనే రతికి నెక్కితివా ॥పల్లవి॥
కంకణాలచేత నీవు కైదండ ఇచ్చినంతలో
        అంకెల నీ వీతనికి నాలవైతివా
        కుంకుమ గుబ్బలు చూపి కొలువులు సేసితేనే
        సంకె లేక నీవిప్పుడు చనవరివైతివా ॥ఎంత॥
సింగారించుకొని వచ్చి సెలవుల నవ్వితేనే
        అంగజకేలికి నెక్కుడైనదానవా
        సంగడిఁ గూచుండి నీవు సరసము లాడితేనే
        సంగతెరిఁగిన యట్టి జాణవైతివా ॥ఎంత॥
చెక్కుల జవ్వాది గార సేసలు పైఁజల్లితేనే
        మిక్కిలి దొరతనాన మేటివైతివా
        యిక్కడ శ్రీవెంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
        నిక్కి నిక్కి చూచితేనే నేరుపరివైతివా ॥ఎంత॥ 378

## వాదరామక్రియ

కొత్త పెండ్లి కూఁతురవు కొమ్మ నీకు బుద్ధి చెప్పే
        యిత్తల నామాఁట లివి యెప్పుడూఁదలఁచవే ॥పల్లవి॥
చేరి చేరి చెనకితే చెలిమి మొగచాటౌను
        సారెకుఁ గొసరితేను చవుకలౌను
        మేరమీరి నవ్వితేను మిగులా వేసట వుట్టు
        కూరిమిఁ బతి పొందులు గుట్టుతోనే సేయవే ॥కొత్త॥
సొలయఁగా సొలయఁగా సూటి పడదు నేరుపు
        పలుమారు మాటాడితే పలచనౌను

పిలచి వూరకుండితే ప్రియములు జరగవు
కొలఁది యెరిఁగి పొందు గుట్టుతోనే సేయవే ॥కొత్త॥

వచ్చి వచ్చి తగులఁగా వలపు కొద్దీ నుండదు
పచ్చిదేరఁ గూడితేను బయలౌ సిగ్గు
యెచ్చరించి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను ఁగూడె
కొచ్చిన రతుల పొందు గుట్టుతోనే సేయవే ॥కొత్త॥ 379

## భైరవి

వినయమే నెరపితే వేడుక వుట్టీఁగాక
వనిత నీ వీతనితో వాసులెంచనేలే ॥పల్లవి॥

తెగరాని యెడలకు తియ్యనిమాఁటలే మేలు
మొగమోట గలిగితే మొక్కులే మేలు
తగులు వాయనిచోట తామిలి చూపుటే మేలు
మగువ నీ వీతనితో మారుమలయనేలే ॥విన॥

యెరవులేని పొందుల తియ్యకొనుటే మేలు
మరిగి పాయనివేళ మచ్చికే మేలు
విరసము లేకుండితే వినోదములే మేలు
తరుణి యీతనితో పంతాలు నీకు నేలే ॥విన॥

కడు సిగ్గులెక్కుడైతే కందువ నవ్వులే మేలు
వుడివోనిరతులకు వొద్దికే మేలు
యెడయక శ్రీవేంకటేశుఁ దిట్టె నిన్ను నేలె
పడఁతి నీ వీతనితో పచారింపు లేలే ॥విన॥ 380

## ముఖారి

సిగ్గులనే పొరలీని చింత నొడిఁ గట్టుకొని
అగ్గలపు వినయా న నడు//రమ్మా ॥పల్లవి॥

చెక్కులఁ జెమటలవె చిత్తము దెలియరాదు
ముక్కున నిట్టూర్పు లవె ముచ్చటాడదు
పక్కనఁ దురుమువీడె కలమర్మము చెప్పదు
అక్కరతో సతికోర్కు లడుగరమ్మా ॥సిగ్గు॥

పులకలు మేన నవె పొందు లేమీఁ దెలుపదు
సెలవుల నవ్వుదేరీ చేఁత చూపదు
కళలు మోమున నవె కాననీదు తన గుట్టు
అలరి యింతికోరిక లడుగరమ్మా ॥సిగ్గు॥

నిండెఁ గన్నులఁ గెంపులు నెప మెరఁగఁగనీదు
పండుమోవి గురుతదె భావించనీదు
మెండుగాఁగఁ దనుఁ గూడె మెచ్చి శ్రీవేంకటేశుఁడు
అండనే యీకె కోరికె లడుగరమ్మా ॥సిగ్గు॥ 381

## వరాళి

తానెంత నేనెంత తగుల నేమాడీనే
తానకమయిన తన దయలోని దానవు ॥పల్లవి॥

కందువ నాచూపులు కడు వాఁడులంటాను
యిందరితో సారె నీతఁ డేమిచెప్పీనే
పొందైన నాకొప్పు గడుఁబొడవాయనంటాను
చెంది నన్ను నెంత రట్టు సేసీనే తాను ॥తానెం॥

కూరిమి నాచన్ను లివి కొండలఁబోలునంటా
వూరకే నన్నేమిటికి నుప్పతించీనే
గారవపు నామేను బంగారు చాయలదంటా
ఆరితేరి నాకెంత పచ్చారీనే తాను ॥తానెం॥

బలిమి నాపిఱుఁదులు బండికండ్లవంటి వంటా
పలుమారు నన్నేమి తప్పక చూచీనే
యెలమి శ్రీవెంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
తలకొని యింకానెంత తమిరేఁచీనే ॥తానెం॥ 382

**రేకు 1866** **మాళవిగౌళ**

ఇన్నిటాఁ జక్కనిదేవు లిదివో నీకు దొరకె
చెన్నుమీర వేడుకతోఁ జిత్తగించవయ్యా ॥పల్లవి॥

వలిపెపయ్యెద లోని వలుదచనుగుబ్బలు
కలికి కాటుక సోగకన్నులసొంపు
తలకొన్న పూవులదండల నిలువుఁగొప్పు
చెలియ సొబగులెల్లాఁ జిత్తగించవయ్యా ॥ఇన్ని॥

కప్పురపు విడేలచేఁ గడునెఱ్ఱనగుమోవి
చిప్పిలుఁగళలచేఁ జెన్నగుమోము
అప్పళించిన జవ్వాది నలరిన చెక్కులును
చెప్పరా దీపెవొరపు చిత్తగించవయ్యా ॥ఇన్ని॥

బంగారు మొలనూళ్లతో బాగై యుండిన పిఱుఁదు
అంగమైన పాదములు హస్తములను
సింగారమయిన కొమ్మ శ్రీవేంకటేశ వురము -
చెంగట నీకున్న దిట్టె చిత్తగించవయ్యా ॥ఇన్ని॥ 383

**ముఖారి**

సేసవెట్టెను విభుఁడు సిగ్గులిఁక నేమిటికి
ఆసలాసల నోలలాడుచున్నాఁడు ॥పల్లవి॥

పలుకఁగదె జవరాల పతితోడ నెదిరించి
చిలుకఁగదె చిరునవ్వు సెలవి నిండ

కులుకఁగదె నీ సొలపు కొసరుఁజూపులఁజూచి
కలయికకు నీవద్దఁ గాచుకున్నాఁడు ॥సేస॥

ఆడఁగదే వొకమాట ఆయములు గరఁగఁగ
పాడఁగదె నీయెలుఁగు పస దొలంక
కూడఁగదె సమరతుల గుచ్చి నీకాఁగిటను
వాడికల నీకుఁ గడు వలచివున్నాఁడు ॥సేస॥

కురియఁగదె ముద్దు లిటు కొదలేని కోరికల
మురియఁగదె మేనఁగలమురిపంబులు
యిరవై శ్రీవెంకటేశుఁ డిటు నిను నేలె
మరిగి నీమచ్చికల మలయుచున్నాఁడు ॥సేస॥ 384

## పాడి

మిక్కిలి వేడుకయ్యీని మెచ్చుల నీకతలకు
చొక్కముగాఁ జెప్పవయ్య సొంపుగ వినేము ॥పల్లవి॥

చెంత నీవు నిక్కమూఁ జేసితివో సేయవోకాని
వింతలైన సద్దులెల్లా వింటిమి నేము
అంతలోనె దోసముగా దందుకేమీఁ గొంచించక
సంతోసానఁ జెప్పవయ్య చల్లఁగా వినేము ॥మిక్కి॥

కందువ నీవల్ల నవి కలవో లేవో కాని
చెంది నీ గుణములెల్లాఁ జెప్పిరి నేఁడు
అందరికిఁ గలచాలే అనుమానించఁగనేల
పొందుగానుఁ జెప్పవయ్య పొంచుక వినేము ॥మిక్కి॥

వుమ్మడి నీ తలఁపున నున్నదో లేదోకాని
నెమ్మది నీ విద్య లెల్లా నెగడెనేఁడు
నమ్మి లచ్చి శ్రీవెంకటేశ నన్ను నిట్టె యేలితివి
సమ్మతిగాఁ జెప్పవయ్యా చక్కఁగా వినేము ॥మిక్కి॥ 385

## సౌరాష్ట్రం

ఎంతని విన్నవించేము యింతి నీపైఁగల బత్తి
చింతదీర నాదరించి సేవగొనరాదా ॥పల్లవి॥

రెప్పలకొలఁధులాయ రేతిరెల్లా జాగరాలు
కుప్పలుఁదెప్పలు నాయ కోరికలు
చెప్పరాని తమితోడ చెక్కుచేతితో నున్నది
కప్పురగంది నిట్టె కరుణించరాదా ॥ఎంత॥

కొండలుఁ గోటులు నాయ గుబ్బతిలి వలపులు
దండిమూఁకలు గట్టెను తమకములు
నిండు నిధానమువలె నీ యెదుట నున్న దింతి
చండిసేయ కిఁకనైనాఁ జనవియ్యరాదా ॥ఎంత॥

వూర నూర నూఁటలాయ వుట్టిపడి మోవితేనె
తారుకాణలాయ లోలో తరితీపులు
యీరీతి శ్రీవేంకటేశ యింతలోనే కూడితివి
చేరి యీకె నిట్లానే చిత్తగించరాదా ॥ఎంత॥ 386

## దేశాక్షి

ఈకెమీఁద బత్తిగలఁ డిప్పుడే మన్నించీఁగాక
చేకొని వోచెలులాల చెప్పరమ్మా ॥పల్లవి॥

చెక్కుపై నున్నది చేయి చిత్తములోనిది నాయి
యెక్కడ వేగించునమ్మ యీకొమ్మ
ముక్కుపైఁ బెట్టెను వేలు ముంచెను చెమటజాలు
గక్కనఁ బతికిఁ జెప్పఁగదరమ్మా ॥ఈకె॥

వీడియు వీడని కొప్పు విరవేదనచొప్పు
యేడకేడ వోపునమ్మ యీకొమ్మ

వాడుదేరేఁ గెమ్మోవి వచ్చెఁ గన్నులకుఁగావి
చేడెభావ మాతనికిఁ జెప్పరమ్మా ॥ఈకె॥

నీవి వదలిన జారు నివ్వెరగుమేనితీరు
యీవిధాన నున్నదమ్మ యీకొమ్మ
భావించి తాఁ గూడినాఁడు పంతముతో వచ్చి నేఁడు
శ్రీవేంకటేశుని కింకాఁ జెప్పరమ్మా ॥ఈకె॥ 387

## శంకరాభరణం

ఎటువంటి సన్నలో ఇంతికి నీకు
తటుకన మీ పొందులు దాఁచనేఁటికయ్యా ॥పల్లవి॥

తారుకాణగా నాపె తనమోము నీకుఁ జూపె
కూరిమితో నిందాఁకా నీ కొలువు సేసె
సారె సారెఁ గుంచె వేసి చన్నులనిన్నునొరసె
ఆరీతినే చనవిచ్చి యాదరించవయ్యా ॥ఎటు॥

మనసు గరఁగ నీతో మాఁటలన్నియు నాడె
వినయముతో నీకు వీడెమిచ్చెను
పెనఁగుతా నీచెక్కులు పెదవులు దాఁకించె
యెనసి యాపె కోరిక లీడేరించవయ్యా ॥ఎటు॥

పూసిన కమ్మఁబూఁత బగులుకోఁ గాఁగిలించె
సేసవెట్టి పెండ్లాడెఁ జేతులారాను
ఆసయిచ్చి నన్నే లితి వప్పటి శ్రీ వేంకటేశ
రాసికెక్క నీపె నిట్టె రతిఁగూడవయ్యా ॥ఎటు॥ 388

**రేకు 1867** **సామంతం**

ఆఁటది మానావతి యాసోదకత్తె
మాఁటాడి మన్నించరాదా మరఁగేల నీకు ॥పల్లవి॥

సొలసిసొలసి సారెఁ జూచీ నాకె నిన్ను
యెలమి నల్లంతనుండి యెంతపనికో
పిలిచి యడుగరాదా ప్రియమున బుజ్జగించి
చెలఁగి పరాకేల సేసుకవున్నాఁడవు ॥ఆఁట॥

సూటికిఁ జెలికి తనజుట్టలేలఁ జూపీ నిన్ను
గాటముగా నది యేమి కారణానకో
నీటుతోడఁ గొంగువట్టి నీవు దెలుపుకోరాదా
యేఁటికి మూసిదాఁచే విప్పుడు నీవు ॥ఆఁట॥

వరుసగా వీణెలోన వాయించి పాడీ నిన్ను
సొరిది నీకెటువంటి చుట్టమైనదో
యిరవై శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
సరి నాపెఁ గూడరాదా జాగులేల సేసేవు ॥ఆఁట॥ 389

## రామక్రియ

ఏలే యింతపగటు యెరుఁగుకోవే నన్ను
మేలుదాన మోదలనే మిక్కిలి నీతనికి ॥పల్లవి॥

ననుపుదానఁగనక నవ్వితి నాపతితోడ
కొనచూపుల నీవేమి కొచ్చి చూచేవే
చనవు నా కిచ్చినాఁడు సరసము నే నాడితి
పని గద్దా నీకేమైన పంతాలు చూపేవు ॥ఏలే॥

చుట్టపు వరుసలను సుద్దు లడిగే నాతని
కట్టఁగడ నుండి యేల కాఁతాళించేవే
గుట్టుసేయ నిఁకనేల కూడును మాఇద్దరికి
బట్టబయ లీఁదఁగాను ప(ఫ?) లమేమి నీకు ॥ఏలే॥

వరుసఁ గూచుండి నేను సారెఁ బాదా లొత్తఁగాను
గరిమల నీవేల కాఁక రేఁగేవే
ఇరవై శ్రీ వెంకటేశుఁ డిన్నిటాను ని (న?) న్ను నేలె
శిరసు వంచుక యెంత సిగ్గువడేలే ॥ఏలే॥ 390

## లలిత

చిత్తము వచ్చినట్లల్లాఁ జేయరాదా నీవిఁక
కొత్త కొత్త నేరుపుల కొసరఁగనేఁటికి ॥పల్లవి॥

వేడుక సింగారాలు వెలవెట్టవచ్చునా
పాడిపంతాలు చేతులఁ బట్టవచ్చునా
చూడఁజూడ చూపులకు సుంకము గొనవచ్చునా
ఆడనేల జాణతనా లాపెతోడ నీవు ॥చిత్త॥

వుప్పతిల్లుఁ దరితీపు లుట్టిఁబెట్టవచ్చునా
కప్పురపునవ్వు మోపు గట్టవచ్చునా
చెప్పరాని మాఁటలకు చెవు లొగ్గవచ్చునా
యిప్పు డిట్టె వొట్టువెట్టనేల చెలిని ॥చిత్త॥

పానుపుపై చేఁతలు బాయిట వేయవచ్చునా
తేనె మోవిలంకె వెడతెగవచ్చునా
పూని శ్రీవేంకటేశుఁడు పొలఁతి నేలితి విట్టె
వూని సన్నసేయనేల వొనగూడెఁ బనులు ॥చిత్త॥ 391

## ఆహిరి

ఎలయింపుఁజేఁత లివి యెందాఁకానే
కలయికరతులఁ జొక్కంగఁ జేయఁగదవే ॥పల్లవి॥

సన్నలనే పతితోడ సాములేమి సేసేవే
కన్నుల చూపుల నెంత కరఁగించేవే

చిన్ని పెదవుల మీఁది సిగ్గు లెంత చల్లేవే
పన్ని పానుపుపైనుండి పాదాలొత్తఁగదవే ॥ఎల॥

బొమ్మలజంకెనలనే పొందులేల జరపేవే
కుమ్మరింపుఁజెనుటల గోరఁ జిమ్మేవే
నిమ్మపంటివాట్లను నేరుపెంత చూపేవే
యిమ్మలఁ గప్పురవిడె మిప్పు డియ్యఁగదవే ॥ఎల॥

యెదరెదురనె సారె యేలాటా లేలాడేవే
ముదురుఁదమకమే మూసిదాఁచేవే
ఇదివో శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సదమదముగ సరసము లాడఁగదవే ॥ఎల॥ 392

## వరాళి

[1]ఏలే జాణతనాలు యింతేసి నీకు
యేలేవాఁడవు నీవే యేమని చెప్పుదురా ॥పల్లవి॥

సెలవుల నవ్వేవేమే చెలియా నీకె
సెలవుసుమీ యది చెప్పితి నేను
పలుకులు నేరుతువే పసలుగాను। ఆ -
పలుకులు కర్పూరపుబరణివే కదరా ॥ఏలే॥

మనసు దెలుపవే మగువా। అవులే
మనసుద్దు లెల్లాను మరుఁడెఱుఁగు
మొనలుగాఁ బెంచితివేమే ముద్దులగోళ్లు
మొనలు చూడరా జాజిమొగ్గలలో నున్నవి ॥ఏలే॥

పేరు చెప్పఁగదవే పిన్నదానా। పాలు
పేరుఁ దోడంటు వెట్టితే పెరుగువెలెనే

1. ఈపాట నాయికా నాయకా సంవాదాత్మకము

సారెసారెఁ బెనఁగేవే సమరతుల
సారెలు శ్రీవేంకటేశ చక్కఁగా నాడించరా ॥ఏలే॥ 393

## భైరవి

సేయఁగలపని మరి చెప్పవుగాని
చాయలా సన్నలా సరసములాడవయ్యా ॥పల్లవి॥

నెలఁత నెత్తములాడి నీవు రాఁగా సిగ్గుపడి
చెలిమాటున నున్నది చెక్కుచేతితో
కలికిఁ గాఁగిటఁబట్టి గక్కనఁ దోడితెచ్చి
యెలమి నాపెకు నీవు యెత్తు చెప్పవయ్యా ॥సేయఁ॥

యింతి కిన్నెర వాయించి యిట్టె నిన్నుఁగని వేచి
చెంతనే నిలుచున్నది శిరసు వంచి
సంతోసాన నాపెఁ దెచ్చి సరుసఁ గూచుండఁ బెట్టి
పంతమెక్కించి వాయించి పాడించవయ్యా ॥సేయఁ॥

భామ పరపుపైనుండి పక్కన నిన్ను జూచి
మోమెత్తి నవ్వులు నవ్వే ముదమలర
కామించి శ్రీవేంకటేశ కాఁగిలించి కూడితివి
చేముట్టి పవ్వళింపించి సేదదేరుచవయ్యా ॥సేతుఁ॥ 394

రేకు 1868 ## వరాళి

పొందుసేసి రతులను భోగించుటే మేలు
[1]సందడెంటా బొమ్మలను జంకించనేఁటికి ॥పల్లవి॥

నాము లెక్కి నీ సిగ్గు నవ్వులై వెడలఁజొచ్చె
మోమునఁ గళలై మించె మోహమెల్లాను
గోమునఁ బులకలై కోరికె లీరికెలెత్తె
కోమలి నీపతితోడ గుట్టు చూపనేఁటికే ॥పొందు॥

1. సందడి+అంటా : ఇట్టి సందు లీవాఙ్మయమున కొల్లలు.

చిత్తము నీరై కరఁగి చెమటలై వెళఁ (ళ్లఁ?) జొచ్చె
గుత్తపు వయసు చనుగుబ్బలాయను
మొత్తపుఁ దమకములు ముఁ(ముం?) గుర్భులై పెనగొనె
హత్తిన అడియాసలు అడఁచుకోనేఁటికే ॥పొందు॥

నెలకొన్న నీ వలపు నివ్వెరగులు గాఁజొచ్చె
లలి నీమదము కన్నులకుఁ గెంపాయ
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నినుఁగూడె
పలుకుఁ బంతము చెల్లె పరాకు లిఁకేఁటికే ॥పొందు॥ 395

బౌళి

చూతము నీ నేరుపులు సుదతు లిందరిల్లోన
యేతులు నాతో నెంచనేఁటికే నీవు ॥పల్లవి॥

నాతో విభుఁడు నవ్వితే నను నేల దూరేవు
ఆతనిదే యేమైనా నాడవే నీవు
యీతల నాకు వలచి ఇంటికిఁ బోకుండితేను
నీతు లేమైనాఁ గొన్ని నేరుపవే నీవు ॥చూత॥

చక్కఁగా నామాటకు జవదాఁటకుండితేను
చెక్కునొక్కి కొంత బుద్ధి చెప్పవే నీవు
మక్కువ నామీఁది బత్తి మరిగి పాయకుండితే
దిక్కుల నాతని వోజ దిద్దవే నీవు ॥చూత॥

ఇత్తల శ్రీవేంకటేశుఁ డేలె నీ కబ్బితే
చిత్తము గరఁగ పన్న సేయవే నీవు
హత్తి సేసవెట్టి పెండ్లాడినాఁ డీఁతడు నేఁడు
కొత్త లేల యిఁక నియ్యకొనవే నీవు ॥చూత॥ 396

## రామక్రియ

ఈకె నీకు వలచును ఇన్నిటా జాణవు నీవు
కైకొన్న మీవేడుకల కందువలే మంచివి ॥పల్లవి॥

సలిగెగల సతులు జంకింతురు సొలతురు
యెలమిఁ బతికి నెగ్గు లెంచఁగరాదు
తలఁపులుఁ దలఁపులు తాఁకుకాణాలై యుండితే
మొలకనవ్వులతోడి మోనములే మంచివి ॥ఈకె॥

ప్రేమము గలుగువారు బిగుతురు గుంపింతురు
యేమైనా నందు కెగ్గు లెంచఁగరాదు
మోము మోముఁ జూచుకొంటే మొగమోట లుప్పతిలు
దీమసముతోడి తరితీపులే మంచివి ॥ఈకె॥

సంతమైన చుట్టములు సాదింతురు బోదింతురు
ఇతవులేకాని యెగ్గు లెంచఁగరాదు
**తతితో శ్రీవేంకటేశ తరుణి నేలితి విట్టె**
చతురత మీకు సరసములే మంచివి ॥ఈకె॥ 397

## సామంతం

సేసితి నిప్పుడే నేను సేయఁగలవిన్నపాలు
లాపి లాసియం(యెం?) తేసి వలపు చల్లీఁ దాను ॥పల్లవి॥

చుట్టరికము దగిలి సుద్దు లేమి చెప్పీనే
పట్టి చూడనేలే చెక్కు పాలుగారీని
పెట్టకు మనవె యాన పిందెలు దిగేపొద్దు
నెట్టుకొన్న దొర తాను నే బాఁతే తనకు ॥సేసి॥

నారుకొనీఁ బులకలు నవ్వు లేమి నవ్వీనే
సారె నంటనేలే కొప్పు మూరెడయ్యీని

గోర గీరవద్దనవే యేరులువారే కాలము
నేరుపరి తా నిన్నిటా నే బాఁతే తనకు ॥సేసి॥
వుమ్మగిలీఁ దమకము వొరసి యేమి చూచీనే
దొమ్మిఁ జన్నులంటనేలే తుదకెక్కీని
నమ్మి కిమ్మనుమనవే ననిచి కూడేవేళ
నెమ్మి శ్రీవేంకటేశుఁడు నే బాఁతే తనకు ॥సేసి॥ 398

## నాదరామక్రియ

కాంతలలోనెల్లా యెట్టు కలికివైతివే నీవు
యెంతని పొగడవచ్చు నిటువంటి నిన్నును ॥పల్లవి॥
మాటలాడి రమణుని మనసెంత గరఁచేవే
పాటలు వాడి యేల భ్రమయించేవే
సూటిగాఁ జూచిచూచి చొక్కుల నేమి వెట్టేవే
నీటున నీకత లెందు నేర్చుకొంటివే ॥కాంత॥
అక్కరతో నవ్వు నవ్వి ఆసలెంత కొలిపేవే
చెక్కు గోరనూఁది యేల సిగ్గు రేఁచేవే
తక్కకు వద్దఁ గూచుండి తమి యెంత వుట్టించేవే
ఇక్కువ యీచేఁతలకు యెంత జాణవైతివే ॥కాంత॥
సన్నలెల్లాఁ జేసి యెంత చాయకు దెచ్చుకొంటివే
చన్నుల నొరసి యేమి సాముసేసేవే
అన్నిటా నలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁ -
డెన్నికగాఁ బెండ్లాడితి వెంత వొసపరివే ॥కాంత॥ 399

## శంకరాభరణం

చూడరె చూడరె సుదతులాల యివి
వేడుక లీకెకు వేవేలాయ ॥పల్లవి॥

---

1. నమ్మిక+ఇమ్మనుము+అనవే.

చెలియకుఁ జెమటలు చెక్కులఁ గారీ
మలయుచు జవ్వనమదము వలె
కళలు మోమునకు కడుఁగడుఁ దొలఁకీ
తళుకుల మెఱుఁగుల తరచువలె ॥చూడ॥

సవరని పులకలు సకియకుఁ బొడమీ
నవకపు జాజుల ననలవలె
తివురుచుఁ గెంపులు దేరీ కన్నుల
కవ గూడిన చెంగలువలవలెను ॥చూడ॥

ముక్కున నతివకు ముంచీ నూర్పులు
మిక్కుటమగు తెమ్మెరలవలె
చొక్కి శ్రీవేంకటేశుని యలమేల్మంగ
పక్కనఁ గూడెను భాగ్యము వలెను ॥చూడ॥ 400

**రేకు 1869** గౌళ

ఏమని చెప్పఁగవచ్చు నిదివో మీనేరుపులు
ఆముకొని చూచి చూచి అరుదయ్యీ నాకు ॥పల్లవి॥

వలచివచ్చినరాక వాడికలు వుట్టించు
పిలిచి యిచ్చేవిడెము ప్రియమందించు
నిలిచి చూచిన చూపు నెమ్మనము నాటించు
బలిమి మొక్కిన మొక్కు పంత మీఁగేరించును ॥ఏమ॥

వినుకలి యెడమాట వేడుకలు గలిగించు
నసుపైన సరసము నవ్వింపించు
తనువు సోఁకిన పొందు తమకము గడురేఁచు
చెనకి చేసిన చేఁత సిగ్గులు మీరించును ॥ఏమ॥

చేయారాఁ జేసిన సన్న చిత్తములు గరఁగించు
పాయరాని కూటములు బాస సేయించు

యీయెడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మీయిద్దరి కూటములు మెచ్చి పొగడించును ॥ఏమ॥ 401

## దేసాళం

వాఁడివో నీరమణుఁడు వచ్చివున్నాఁడు
వేఁడుకొని వినయాలు వేవేలుఁ జేయవే ॥పల్లవి॥

మంచిమాట లాడతెనె మనసులు గరఁగును
వంచనతో మొక్కితేనే వాడిక వుట్టు
ముంచి కాఁగిలించితేనే మొగమోట సతమౌను
యెంచి రమణునికి నీవిచ్చకమే సేయవే ॥వాఁడి॥

కన్నులఁ జూచితేనే కలయఁగ బుద్ధియౌను
సన్నలు సేసితేనే సమ్మతులౌను
చిన్ని నవ్వు నవ్వితేనే చిప్పిలుఁ దమకములు
ఇన్నిటాఁ బతికి నీవు ఇంపులే రేఁచవే ॥వాడి॥

కైవసమై యుండితే కడఁగుఁ జుట్టరికము
చేవదేరఁ బెనఁగితే చేఁత లీడేరు
యీవేళ నలమేల్మంగ విన్నిటాను నిన్ననేలె
శ్రీవేంకటేశుఁ డితఁడు సేవలెల్లాఁ జేయవే ॥వాఁడి॥ 402

## బౌళి

ఎంతని చెప్పేము నేము ఇవిగో మీగుణములు
ఇంతా నీ వెరిగినదే ఇంటికి రావయ్యా ॥పల్లవి॥

రాసులౌను మీఁది మీఁది రచ్చలో మాప్రియములు
ఆసలు వుట్టించు వినయము లైతేను
నేసిన నేఁతలై మించు నెరజాణతనములు
యీ సుద్దల కోపితేను ఇంటికి రావయ్యా ॥ఎంత॥

వుట్టిపడుఁ దేనియలు వూరకే మామాటలు

చుట్టుకొను వలపులు చూడఁగానే
బట్టబయలీఁదించు పరగఁ జక్కఁదనాలు
ఇట్టె ఇంత కోపితేను ఇంటికి రావయ్యా ॥ఎంత॥
కురిఇంచు మదములు కూడిన మా కాఁగిళ్లు
గరిమలఁ దమిరేఁచు కనుసన్నలు
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యిరవైతి నోపితే నీవింటికి రావయ్యా ॥ఎంత॥ 403

## శ్రీరాగం

ఇన్నాళ్లు నెఱఁగము ఇటువంటి సుద్దులు
కన్నుల పండుగఁ గాగఁ గన్నఁగొంటి మిపుడు ॥పల్లవి॥
వెలఁది నీసెలవుల వెన్నెల లెంత గాసీనే
పలచని మోవి యేల పచ్చిదేరీనే
నిలువు నివ్వెరగులు నీకెందుండి వచ్చెనే
తెలపి చెప్పవే మాకు తేటతెల్లమిగను ॥ఇన్నా॥
తొయ్యలి నీ నొసలిపై తుమ్మెదలేల మూఁగీనే
నెయ్యపుఁగన్నులఁ దొట్టె నిద్దులయేలే
చయ్యనఁ జన్నుల నిండె చందమామపిల్లలేలే
వొయ్యనే యెరిఁగించవే వొప్పుగా నీకతలు ॥ఇన్నా॥
వనిత నీ చెంపలకు వానలెందుండి వచ్చెనే
తనువుపై హారాలేల తడఁబడీనే
యెనసెనో శ్రీవేంకటేశు నలమేల్మంగవు
మనసారా నానతీవే మగువ నీ పొందులు ॥ఇన్నా॥ 404

## పాడి

కంటిలేవే నీసుద్దు లిక్కడ నమ్మతోఁ జెప్పేను
వెంట వచ్చినదానను వెస నన్నెఱఁగవా ॥పల్లవి॥

యెడమాఁట లాడవచ్చి యేల సిగ్గులు వడేవే
నడుమ నూరక యేల నవ్వు నవ్వేవే
చిడుమూడి నటనతో శిరసు వంచనేఁటికే
తొడరి పొందులు సేసే దూతికవు నీవు ॥కంటి॥

చన్నులమీఁది పయ్యెద జారనేల తోసేవే
సన్నలనే మోవితేనె చల్లనేఁటికే
కన్ను లారుచుకొంటాను కతలేమి చెప్పేవే
పన్నిన రాయభారపు పడఁతివి నీవు ॥కంటి॥

నిలుచుండి నీకు నీకే నివ్వెరగులే లయ్యేవే
చెలరేఁగి మేనేల చెమరించేవే
అలమేలుమంగ నేలె నప్పుడే శ్రీ వేంకటేశుఁ -
డెలమిఁ జెలికత్తెవు మేలంటి (టే?) వే నీవు ॥కంటి॥ 405

## హిందోళ వసంతం

ఇంతి నేరుపులు నీతో నెంతని చెప్పఁగవచ్చు
వింతలెల్లాఁ జాతువు వేగమె రావయ్యా ॥పల్లవి॥

చిమ్మిరేఁగే వలపులు చెలియ గాదెలఁబోసె
వుమ్మగిలుఁ దమకము నొడిఁగట్టెను
కుమ్మరింపుఁ గోరికలు కూడబెట్టుకొని విన్ను
రమ్మని పిలువనంపె రామయ్య ఇఁకను ॥ఇంతి॥

గుదికొన్న విరహము కుప్పలుగా వేసుకొనె
ముదురుఁ దలపోఁతలు మూటగట్టెను
పొదలుఁ జొట్టరికాలు పుక్కెట నించుకొనె
యెదురు చూచీ నీకు నిట్టె రావయ్యా ॥ఇంతి॥

కడలేని యాసలఁ గంకణము గట్టుకొని
సుడిగొన్న వావులకుఁ జోటిచ్చెను
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగనేలితి -
వెడయక రావయ్య్య ఇట్టె దినదినము ॥ఇంతి॥ 406

**రేకు 1870** **శ్రీరాగం**

అలమేలుమంగపతి వన్నిటా నెరజాణవు
చెలరేఁగి చూడవయ్య చేతులెత్తి మొక్కేను ॥పల్లవి॥

వాడలోన నిన్నుఁ బాసి వలపు నిలుపరాక
ఆడరానిమాట లెల్లా నాడితి నిన్ను
పాడిపంతాలు నెరపఁబనిలేదు ఇంత నీవు
యీడుజోడై యేలవయ్యా ఇంతి నింతే నేను ॥అల॥

పాయము దానఁగనక పక్కనుండి వేడుకకు
సేయరాని చేఁతలెల్లాఁ జేసితి నేను
నాయము లెంచఁగఁబోతే నగుఁబాట్లిందరిలో
యీయెడ మన్నించవయ్యా ఇంతి నింతే నేను ॥అల॥

నివ్వటిల్లు నాసతోడ నీమీఁది బత్తిఁజేసి
నవ్వఁగలరీతినెల్లా నవ్వితి నేను
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
యివ్వలఁ బాయకువయ్యా యింతి నింతే నేను ॥అల॥ 407

**కేదారగౌళ**

ఇంతులకుఁ బతులకే ఇరవైనది వలపు
సంతతపు వేడుకలఁ జవులైన వలపు ॥పల్లవి॥

జోకతోడ నిట్టినది చూపఁగరాదు వలపు
వాకుచ్చి చెప్పఁగరాదు వలపు

దాకొని ఇట్టిరూపని తలఁచరాదు వలపు
యేకడ నెవ్వరికిని యెంచరాదు వలపు ॥ఇంతు॥

యెదుట నున్నట్టె వుండు యెఱఁగరాదు వలపు
వదలించి తియ్యరాదు వలపు
గుదిగొని మదిలోన కుచ్చుకవుండు వలపు
సదరాన నేరుపరచఁగరాదు వలపు ॥ఇంతు॥

పెంచఁబెంచ నెంతైనాఁ బెరుగుచుండు వలపు
వంచించి పొలుగనీఁదు వలపు
అంచెల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁగూడె
పంచసాయకుని రాజ్యపదవి యీవలపు ॥ఇతు॥ 408

## పాడి

పెండిలాడేనని పోఁకవెట్టినాఁడు మొదలనే
అండనుండి యెచ్చరించరమ్మ సారెఁ జెలులు ॥పల్లవి॥

అంగనకొప్పు చీఁకటి యమాస వెనక నదె
చెంగటికి నెప్పుడు వచ్చీనే విభుఁడు
చంగన విరహపువేసవికాల మదె వచ్చె
రంగుగ జాగుసేయక రమ్మనవే యిఁకను ॥పెండ్లి॥

నెలఁతమోముకళల నిండుఁ బున్నమ యెదిరె
మెలఁగుచుఁ గాముని నోమేదెపుడే
అలరి నిట్టూరుపుల ఆయిటి విసరఁజొచ్చె
వెలయఁ దనవలపు వెదవెట్టుమనవే ॥పెండి॥

సతిపిరుఁదుల రథసప్తమి నేఁడె కలిగె
తతి శ్రీవేంకటేశుఁడు తగిలెఁగదె

రతి కలమేలుమంగ రప్పించెను తను నీకె
మితిమీరఁ గూడె నిట్టె మెప్పించుమనవే ॥పెండి॥ 409

## సామంతం

కంటిమి నీ వెడుకలు కాదనేనా నే నిన్ను
యింటివద్ద నుంచుకొని యేలుకొనవయ్యా ॥పల్లవి॥

కన్నులఁ జూచినప్పుడే కాంతపై నాసలురేఁగె
యెన్నికలు మూసిదాఁచ నిఁక నేలయ్యా
చన్నుల నొరసుకొంటా సంగడికి వచ్చినాకె
నన్నుఁ జూచి వలపెంత నానఁబెట్టేవయ్యా ॥కంటి॥

మాటలాడినప్పుడే మనసాకపైఁబారె
యేఁటికి సిగ్గులువడే విది యేమయ్యా
గాఁటపు గోళ్ల సోఁక కానుక దానికిచ్చె
నాఁటకుఁడ నాతో నెంత నవ్వు నవ్వేవయ్యా ॥కంటి॥

యేకతమైనప్పుడే యీకెకు నీకుఁ బొందాయ
యీకడనేల కొంకేవు యిందుకేమయ్యా
కైకొని యలమేలుమంగను నన్ను నేలితివి
నాకెంత శ్రీవేంకటేశ నమ్మి కిచ్చేవయ్యా ॥కంటి॥ 410

## సాళంగనాట

అని వేంకటేశుఁ డాడె నలమేలుమంగతోడ
వినరే వోచెలులాల వేమారు నీరీతుల ॥పల్లవి॥

తప్పక చూచితే నేమే తరగీనా నీ పంతము
కప్పనేలే నీ చన్నులు గరివడీనా
చెప్పవే నీపేరు మోవి చిల్లులువో నింతలోనే
యిప్పుడు నన్నింతసేసి యేమిగట్టుకొనేవే ॥అని॥

వద్దఁ గూచుండితే నేమే వాసి ముక్కవోయినా
గద్దించే వింతలోఁ గండ గట్టుకొంటివా
పొద్దువోదు నవ్వఁగదే పోదు నీ బీరమెంతైనా
యిద్దెస నన్నింతసేసి యేమి గట్టుకొనేవే ॥అని॥

సేవలు సేసితే నేమే సిగ్గులు నీకు ముంచీనా
దేవులవైతివి వావి తిరమాయను
నీ వలమేలుమంగవు నేను శ్రీ వేంకటేశుఁడ
యీవల నన్నింతసేసి యేమి గట్టుకొనేవే ॥అని॥ 411

### వరాళి

నవ్వేవారి నెఱఁగవు నడుమ నీవు
రవ్వ సేసుకొనకువే రమణులలోనను ॥పల్లవి॥

చనువు గలితేఁ బతిసరుసఁ గూచుండవే
ఘనముగా మన్నించితే కాలు దొక్కవే
పెనఁగులాడ నోపితే పిరిదూరి చెనకవే
యెనసి మాతోనేల యీడు వెట్టుకొనేవు ॥నవ్వే॥

వయసు మిక్కుటమైతే వడిగాఁ గొసరవే
నయగారాలు నేర్చితే నమ్మించుకోవే
ప్రియము నీకైతేను పెదవి తేనె లానవే
నియతాన మాతోపొత్తు నీవేల కలసేవు ॥నవ్వే॥

వలచితే నాతనికి వావిచెప్పి వేఁడుకోవే
కలయ వేడుకైతే గక్కన మొక్కవే
అలమేలుమంగను నే నతఁడు శ్రీవేంకటేశుఁ -
డెలమి నన్నేలె నిఁక నిచ్చకమేమాడేవు ॥నవ్వే॥

రేకు 1871 శుద్ధవసంతం

సరిబేసులాయను మీసరసము నిద్దరికి
మెరసిన మీచేతుఁలు మెచ్చితి మిందరము ॥పల్లవి॥

చెలి నీయెదుట నుండి సేసిన చేసన్నలకు
అలరులదండ వేసి తాకె మీఁదను
సొలసి కమ్మటి [1]నిన్నుఁ (న్ను?) సోఁకగఁజూచినందుకు
తలకొని మర్మములు దగుల నాడితివి ॥సరి॥

ఆపె నీకు మొక్కు మొక్కి యాసలు రేఁచినందుకు
తీపులమోవి చూపి తేలించితివి
రాపున నిన్నంటఁబట్టి రతికిఁ దీసినందుకు
యేపునఁ జనవిచ్చి నీవిట్టె ఇయ్యకొంటివి ॥సరి॥

మరిగించుక నిన్నాపె మతి చొక్కించినందుకు
బెరసి నీవురమునఁ బెట్టుకొంటివి
యిరవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సరుగనఁ గూడి సంతోసములు నించితివి ॥సరి॥ 413

ముఖారి

ఇందుకు మెచ్చవద్దా యీపెను నీవు
కందువ సేవలు సేసి కరఁచీ నీ మనసు ॥పల్లవి॥

కలికి చేఁతలు సేసి కప్పురము మోవిఁ జూపి
బిలిచీ సన్నల నాకెఁ[2] (కె?) బ్రే (ప్రే?) మతో నిన్ను
మొలక నవ్వులు నవ్వి మొగము దప్పక చూచి
తలఁపించీఁ దనపొందు తమ్మిపూవాట్ల ॥ఇందు॥

1. ఈ ఆరసున్న ప్రామాదికము.

కతకారిమాట లాడి కానుకలు చేతికిచ్చి
రతికి నాసలురేఁచీ రచ్చలో నిన్ను.
చతురతలఁ జెనకి చవులు నీకుఁ బుట్టించి
అతిమోహము దెలిపీ నంగపు సోఁకులను ॥ఇందు॥

సరుసనే కూచుండి జమళిఁ జన్నుల నూఁది
తరితీపులెల్లాఁ జేసి తగిలీ నిన్ను
ఇరవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సరిఁగూడి బుజ్జగించీ చల్లువలపులను ॥ఇందు॥ 414

## వరాళి

చూతము మనమూరకె చుట్టపువరుసలను
కాతరించి తముఁదామె కలసేరుగాక ॥పల్లవి॥

కామించి వచ్చినకాంత కాఁతాళించి రమణుని
యేమేమి సేసినాను యెగ్గులయ్యీనా
ఆముక ఇందుకు మన మడ్డాలు చెప్పఁగనేల
తాముఁదామే తెలిసి సంతములయ్యేరుగాక ॥చూత॥

గాఁటమైన విరహిణి కాఁకల కోరువలేక
మాఁటలెన్ని యాడినాను మానీనా పొందు
యీటైన సవతులము ఇట్టె బుద్ధి చెప్పనేల
పాటించి మొగమోటానఁ బైకొనేరుగాక ॥చూత॥

వాడికైన యాసతోడ వరుసకు వచ్చినది
వేడకకెంత నవ్వినానే (ను?) వేసటయ్యీనా
యీడనె శ్రీవేంకటేశు ఁడేలె మనల నిందరి
జోడుగూడి యీపెఁ[1] దానూఁ జొక్కేరు గాక ॥చూత॥ 415

1. ఈ అరసున్న ప్రామాదికము. అన్వయ విరుద్ధము

## కాంబోది

మునుపఁ బదరితేను వెనక వేఁడుకోవలె
ఘనుఁ డేమిసేసినానుఁ గైకొనుటే మేలు ॥పల్లవి॥

కొలువు సతులతోడ కొచ్చికొచ్చి నవ్వెనంటా
చలపట్టి పతి నెంత సాదించేవే
అలరి నాటకసాల యాలలు చూచెనంటా
నెలయ నేఁ డెంతలేసి వెంగే లాడేవే ॥మును॥

యెరవుల కాంతలను యింటికిఁ దెచ్చెనంటాను
సరికి బేసికి నెంత జంకించేవే
పోరుగిరుగులవారి పొందులు మరిగెనంటా
పురిగొన నిమ్మపంటఁ బూఁచి యేల వేసేవే ॥మును॥

వూడిగాల చెలులతో వొంటిమాటలాడెనంటా
వాడలోన నేఁటికి రవ్వలు సేసేవే
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
జాడతో నీతని నేమి సంతోసించేవే ॥మను॥ 416

## మధ్యమావతి

ఎంత మన్నించితివో యీకెను నీవు
వింతలెల్లా నీ ముందర వెదచల్లీ నిపుడు ॥పల్లవి॥

వనిత నీపైఁ జూపీ వాడికలు
వినవయ్యా విన్నపాలు వేడికలు
అనిశముఁ జెలులతో నాడికలు
వెనక చూడవయ్యా వేనలి పీడికలు ॥ఎంత॥

---

1. "ఆపెన్" "ఆపెయున్"లో 'యు' లోపించిన రూపము కావచ్చు.

వెలఁది పయ్యెదకొంగు విసరులు
కులుకు నవ్వులలోని కొసరులు
కలికి సిగ్గులలోని కసరులు
తెలుసుకోవయ్యా తరితీపుల యసరులు ॥ఎంత॥

సుదతి నీపైఁ జల్లిన సొలపులు
అదన నిన్నుఁ గూడిన యలపులు
వదలని కాఁగిళ్ల వలపులు
యిదె శ్రీవేంకటేశ మీయిచ్చయ్యా గెలుపులు ॥ఎంత॥ 417

## నాదరామక్రియ

చెప్పితి బద్దులు నేను చెలియ నీకు
యెప్పుడూ మఱవకువే యెడయదు మనసు ॥పల్లవి॥

పంతమాడవచ్చునా పడఁతికి మగనితో
చెంతనుండి యిచ్చకమే సేయుటగాక
యెంత గోరనూదినాను యియ్యకోలే సేసుకొని
వింత సేయకుండితేను వేడుక లీడేరును ॥చెప్పి॥

జంకించ వచ్చునా సరసము లాడే చోట
సంకెలేక వలపులు చల్లుటగాక
పంకించక చనుఁగవ పట్టి యెంత దీసినా
పొంకముగ నవ్వితేనే పొందులు చేకూరును ॥చెప్పి॥

సిగ్గువడవచ్చునా చేరి కాఁగిలించుకొంటే
వొగ్గి రతులకు లోనైవుండుటగాక
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలయఁగ నిన్నుఁగూడె
వెగ్గళించకుండితేనే వెలయు సోబనము ॥చెప్పి॥ 418

**రేకు 1872** **దేవగాంధారి**

[1]అమరెఁ గదె నేఁ డన్నిసొబగులును
సమరతి చిన్నలు సతి నీమేనా ॥పల్లవి॥

చెలపల చెమటలు చెక్కిళ్ల
మొలకల నవ్వులు మొక్కిళ్ల
సొలపుల వేడుకలు చొక్కిళ్ల
తొలఁగని యాసలు తొక్కిళ్లా ॥అమ॥

నెఱవగు చూపులు నిక్కిళ్ల
మెఱసెను తమకము మిక్కిళ్ల
గుఱుతగు నధరము గుక్కిళ్ల
తఱచగు వలపులు దక్కిళ్లా ॥అమ॥

నును గోరికొనలు నొక్కిళ్ల
పొనుఁగని తములము పుక్కిళ్ల
ఘనుఁడగు శ్రీవేంకటపతికాఁగిట
యెనసెను పంతము లెక్కిళ్లా ॥అమ॥ 419

**తెలుఁగుఁగాంబోది**

అందులకే వెరగయ్యీ నప్పటనుండి నాకు
కందువ నెన్నాళ్లనుండి కాచుకవున్నదియో ॥పల్లవి॥

కొత్త కొత్త మాఁట లాడీ కోమలి నీ తోడుత
యిత్తల వావిని నీకు నేమౌనోకాని
హత్తి కొలువులు సేసీ నప్పటి వేడుకతోడ
బత్తి నీపై నెంతగద్దో భావించితేఁ దనకు ॥అందు॥

1. ఈపాటలో మొక్కిళ్లు, చొక్కిళ్లు, మిక్కిళ్లు, దక్కిళ్లు, వంటి పదములు స్వతంత్రముగ వాడబడినవి.

సొలసి సొలసి నిన్నుఁ జూచీని పలుమారు
పొలుపుగ నేనాఁటిపొందుగాని
చెలరేఁగి సేయరాని సేవలెల్లాఁ జేసీ నీకు
కొలఁదిమీర నిన్నేమి గోరీనో తాను ॥అందు॥

నవ్వి నవ్వి మేలమాడీ ననుపున నీతోను
నివ్వటిల్లఁ దనయాస నీపై నెంతో
యివ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
రవ్వగాఁ దాఁ గాఁగిలించి రతికెక్కె నిపుడు ॥అందు॥ 420

## భైరవి

చెలులముందర నింత సేసేవుగాక
వలపు లోడిఁగట్టుక వట్టి బీరమేఁటికే ॥పల్లవి॥

చేరఁడేసి కన్నుల చెలియవు మొదలనె
వూర కాతనిఁ జూడ కెట్టుండఁగలవే
మూరెఁడు దురుముతోడ మురిసేటిదానవు
యీరీతిఁ జెలిమాఁటున నెట్టు దాఁగేవే ॥చెలు॥

పట్టెఁడేసి గుబ్బల పంతగత్తె విటమీఁద
గుట్టుతోడ నెటువలె గుబ్బతిలేవే
వొట్టిన జవ్వనమున నువ్విళ్లూరేదానవు
దట్టపు టాసల నెట్టు తప్పఁదోసేవే ॥చెలు॥

సెలవి నవ్వులతోడఁ జిప్పిలేటిదానవు
వులివచ్చి సిగ్గుల నెట్టోలలాడేవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నుఁగూడె
తలపోఁగరతి నెట్టు తనియకుండేవే ॥చెలు॥ 421

### దేసాళం

నా యంతటిదానవా నడుమ నీవు
ఆయలేవే యేమిచెప్పే వారడి నీ సుద్దులు ॥పల్లవి॥

మక్కువలు వెదచల్లి మాఁటలనే కరఁగించి
దక్కఁగొంటివే పతిని తరుణి నీవు
పక్కన నేనైతేను పాదరము తొక్కుడులనే
చొక్కించి నాయింటికిఁ దెచ్చుకొంటి నే నితని ॥నాయం॥

సరసములాడి మోవిచవులు చూపి చూపి
మరిగించుకొంటివానే మగని నీవు
సొరిది నేనైతేఁ గనుచూపులనే యెలయించి
తరితీపులఁబెట్టి పంత మిప్పించుకొంటిని ॥నాయం॥

వూరకే చన్నుల నొత్తి వొడిఁగట్టి వలపులు
కూరిమి రతికిఁ దెచ్చుకొంటిని(వి?) తని
గారవించి నేనైతే కాఁగిటిలో సన్నలనే
చేరి యిట్టే పెండ్లాడితి శ్రీవేంకటేశ్వరుని ॥నాయం॥ 422

### మాళవిగౌళ

అతనికి నాకు నైతే నమరుఁగాక
రతికెక్కఁ బాయపువారము మమ్ముఁ జూడవే ॥పల్లవి॥

పొలఁతి నీవురమునఁ బోఁకలంతలే చన్నులు
యెలమి నాతనితోడ నెమినవ్వేవే
వులివచ్చి సిగ్గులెల్లా నొడిఁగట్టుకుందానవు
సొలసి సొలసి యేమి చూచేవే నీవు ॥అత॥

నిన్ననే కన్నెవు మరి నేఁడే జవ్వనివైతివి
యెన్నేసి మాఁట లాడేవే యీతనితోడి

వెన్నవంటిది మనసు వేళమే కరఁగు నీకు
సన్నలా చాయలా నెంత సరసమాడేవే ॥అత॥

దొండపండు నీమోవి తొడమ యిఁ(యిం?) కాఁ బచ్చన
అండనుండి నీకెం(వెం?) త ఆసచూపేవే
దండిగా నన్నేలినాఁడు తానే శ్రీవేంకటేశుఁడు
మెండుగాఁ జెనకే వెంత మేలుదానవే ॥అత॥

**ముఖారి**

చిన్నదాన నంటాను సిగ్గులేల పెంచేవు
మన్నించె నితఁడు మఱఁగేల యిఁకను ॥పల్లవి॥

చక్కెర పెదవులతో సకియ మాఁటాడవే
నెక్కొని సుద్దు లడిగీ నీ రమణుఁడు
జక్కవ చన్నులదాన సంగడిఁ గూచుండవే
అక్కరతోఁ గాఁగిటికి నంగవించీ నితఁడు ॥చిన్న॥

కలువకన్నుల యమ్మ కాంతునిదిక్కు చూడవే
అలరుచు నీకు మొగమై యున్నాఁడు
సెలవి నవ్వుల చెలి చేరి సరసమాడవే
కలసేనంటా నీవేళ గాచుకున్నాఁడు ॥చిన్న॥

కనకపు బొమ్మ శ్రీవేంకటేశుఁ గాఁగిలించవే
మనసు నీకే మీఁదెత్తి మరిగేఁదాను
ననిచి తమ్మిచేతుల నాతి విడెమియ్యవే
వొనరి నీరత్నులలో నోలలాడీ నిపుడు ॥చిన్న॥ 424

**రేకు 1873** **వాళంగవాట**

కంటివిగా వోయి యీకె గర్వమెల్లాను
యింటఁ బెట్టుకొని యాపె కింతేసి నేర్పితివి ॥పల్లవి॥

వంచెనలు సేసుకొంటా వలపులు చల్లుకొంటా
మంచముపై నాపె నీతో మాటలాడీని
లంచముగా మోపి చూపి లావునఁ గాఁగిటఁ బట్టి
యెంచరాని వేడుకల నెంతవారలీని[1] ॥కంటి॥

విడెపు సెలవులతో వికవికనవ్వుకొంటా
తొడపైఁ దొడ వేసుక దువ్వీఁగొప్పు
వెడఁగు గుబ్బల నొత్తి వింత చేఁతలెల్లాఁ జేసి
బడివాయ కెమ్మె లెంత పచారించీని ॥కంటి॥

ఇక్కువ లంటుకొంటాను ఇచ్చకాలు నెరపుతా
చెక్కుఁజెక్కు మోవ నెంత సేవసేసీని
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మిక్కిలి తా నెంత నీతో మేలమాడీని ॥కంటి॥ 425

## గౌళ

కాఁగల మేలెల్లా నేఁడే కలిగీఁగాన
మాఁగిన మోవుల మీరు మచ్చికఁ బొగడరే ॥పల్లవి॥

చిత్తమే చిమ్మిరేఁగితే చెలువుఁ డేమిసేసునే
హత్తి మీరు కేరడము లాడేరుగాక
బత్తి నేఁ జేసినదే పైకొని యలయించఁగా
కొత్తలుగాఁ జందమామఁ గొసరఁగ నేఁటికే ॥కాఁగ॥

జవ్వనమే తరవైతే సకు లేమిసేతురే
ఇవ్వల మీరేల నేరాలెంచుకొనేరే
నవ్విన నానవ్వులే నన్నుఁ బెనఁగించఁగాను
పువ్వు వంటి మరునిఁ దప్పులు వట్టనేఁటికే ॥కాఁగ॥

---

1. ఎంత+పారలీని

చుట్టరికమే మించితే చూచి నే నేమిసేతునే
గుట్టుతోడనే ఇయ్యకొనఁదగును
ఇట్టి శ్రీవేంకటేశుఁ డేలి నన్ను మన్నించఁగా
చుట్టి నానోము ఫలము సోదించ నేఁటికే ॥కాఁగ॥ 426

**పాడి**

చేఁత యెన్నేసి సేసీని చిన్నది తాను
లేఁత నవ్వులనే పాదలించీ వలపులు ॥పల్లవి॥

పొలఁతి కెవ్వరు తొల్లి బుద్దులు చెప్పిరోకాని
సొలసిసొలసి నిన్నుఁజూచీని
కలికి తనాలు యెంతగా నేరిచెనోకాని
చెలరేఁగి నీమీఁదఁ జేతులు చాఁచీని ॥చేఁత॥

వినయాలెల్లా నీపెకు వెన్నతోఁబెట్టిరోకాని
గనముగా సారెసారెఁ గడు మొక్కీని
మనసులో నెటువంటి మర్మము గనెనోకాని
కొన చన్నుల నొరసి కూరిమి గొసరీని ॥చేఁత॥

గుట్టు తనలో నెంత కూడపోసెనోకాని
నెట్టుకొన్న సిగ్గుతోడ నిండుకున్నది
యిట్టి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చుట్టమై తా నిన్నుఁ గూడి సుద్దులు చెప్పీని ॥చేఁత॥

**ఆహిరి**

చెప్పరే యీమాఁటలు చెలువునికి
అప్పసము నాకునాకె ఆడుకొనరాదు ॥పల్లవి॥

కలువ ననవేల కంతుని దూరఁగనేల
తలఁచితే మతిలోనఁ దా నున్నాఁడు

చిలుకఁ గసరనేల చింతపై విసుఁగ నేల
పిలిచితే నోరఁ దనపేరున్నది ॥చెప్ప॥
చందురుఁ దిట్టనేల వసంతుని సొలయ నేల
చెంది నా కొప్పుపైఁ దన సేసలుండఁగా
నిందించనేల వెన్నెల నేరా లలులపై నేల
అందమై తన గురుతు లంగముపై నుండఁగా ॥చెప్ప॥
పూవులపై వెగటేల పుప్పొడి గాదన నేల
శ్రీవేంకటేశుఁడు తానే చేరి కూడఁగా
కోవిలఁ గొసరనేల గుంపించ నేల చెలుల
తావై వలపులు నాకూఁ దనకు నుండఁగను ॥చెప్ప॥ 428

## మధ్యమావతి

వింటి నేఁ గొన్ని సుద్దులు వీరి వారి చేతనెల్లా
నంటున నానతీవయ్యా నాతో నేఁడు ॥పల్లవి॥
చెలరేఁగి చెలరేఁగి సేసె నాపె విన్నపాలు
వెలయఁగఁ జెవులార వింటివా నీవు
చలువగా వలపులు చల్లుతా గొలువు సేసె
తలఁపెల్లా నిందువంకఁ దనివందెనా ॥వింటి॥
తమిరేఁచి తమ(మి?) రేఁచి తా నీకుఁ బాదము లొత్తె
అమరఁ జొట్టరికము లబ్బెనా నీకు
తిమురుచు సన్నలనే తియ్యనిమోవి చూపె
సమమోహముల నీకుఁ జవులాయనా ॥వింటి॥
కరఁగించి కరఁగించి కాఁగిట సేవలుసేసె
ఇరవుగా నన్నియును నియ్యకొంటివిగా
గరిమ సేలితివి గక్కన శ్రీ వేంకటేశ
తొరలించి యాపె పొందు దొరకెనా నేఁడు ॥వింటి॥ 429

## వరాళి

పంతమాడితి విందాఁకా పతితోడను
వింతలుగా మేలమాడి వీడెమిచ్చె నిపుడు ॥పల్లవి॥

[1]నెట్టుకొన్న వలపులు నేరము లెంచఁగ నీదు
చుట్టరికములే రేఁచి చొక్కించుఁగాని
పట్టరాని జవ్వనము పాసి యోరువఁగ నీదు
బెట్టుగాఁ బ్రియములే చెప్పించుఁగాని ॥పంత॥

యెనసిన మనసైతే యెరవు సేయఁగ నీదు
పెనఁగించి కోరికలే పెంచుఁగాని
మునుకొన్న తమకము మోనాన నుండఁగ నీదు
అనిశము మోవితేనె లడిగించుఁగాని ॥పంత॥

చెదరని యడియాస సిగ్గులువడఁగ నీదు
కొదలేక కాఁగిటనుఁ గూరుచుఁగాని
యిదివో శ్రీవేంకటేశు నెనసి మెప్పించితివి
యెదుట నీగుణాలే నిన్నింత సేసుఁగాని ॥పంత॥ 430

రేకు 1874 **దేసాళం**

నిన్ను మెత్తుమో యీపె నేరుపులు మెత్తుమో
చెన్నుగా మాకేది బుద్ధి చెప్పవయ్యా ఇఁకను ॥పల్లవి॥

ఇంతి నీవు వచ్చేవంటా నిందాఁకా పందేలు వేసె -
నంతలోనే వచ్చితివి ఆయ నిజము
అంతటి నీ వాడఁబా ట్లాపెకు నీకు నెట్టివో
చెంతఁ దారుకాణలు వచ్చెను మాకిందరికి ॥నిన్ను॥

1. "వలపులు - నేరము లెంచఁగ నీదు" వంటి క్రియా వచన వ్యత్యయములు అక్కడక్కడ గలవు. ఇది వ్యావహారిక ధోరణి.

ఇచ్చేవు సొమ్ములంటాను ఇందరికి సాకిరి వెట్టె
తెచ్చితి వవియుఁ దేట తెల్లమాయను
మెచ్చుల మీ సన్నలు మీలో మీకే తెలుసును
అచ్చపు మీచేఁత లొక్కటాయ మాకిందరికి ॥నిన్ను॥

తనకే వలతునని తప్పని బాసలు చెప్పె
చెనకి కూడితి విట్టె చెల్లెఁ బంతము
తనిసి శ్రీవేంకటేశ తగులాయ మిద్దరికి
ఇనుమడించె సంతోసా లిట్టె మాకిందరికి ॥నిన్ను॥ 431

## పాడి

పొద్దు వోనివాఁడుగాక పొలఁతులాల
ఇద్దరిలోన నేఁ దన కిరవౌ తెలుఁగఁడా ॥పల్లవి॥

నిన్నా మొన్నా నెందుండెనో నేఁడు మాఇంటికి వచ్చె
యెన్నాళ్ల కెన్నాళ్లపొందు ఇదేమే తాను
యెన్నిక నెవ్వతెనో నాయీడు సేయఁ జూచీని
పున్నమానమాసా నొక పోలికై నుండునటే ॥పొద్దు॥

వొప్పె రేపే బాస ఇచ్చె నూరకె మధ్యాహ్నమెక్కె
యెప్పటి కెప్పటిమాఁట ఇదేమే తాను
చొప్పులెత్తి యాపె సుద్దులే యప్పటిఁ జెప్పీ
కప్పురములో నుప్పు గలపఁగ నేఁటికే ॥పొద్దు॥

యేచి నాపై సేస చల్లె ఇంతలోనె కాఁగిలించీ
యేచేఁత కేచేఁత ఇదేమే తాను
యీ చాయ శ్రీవేంకటేశుఁ డింతిచే నాకు మొక్కించీ
పూచిన పూవునఁ బిందె బొడమించుఁ గదవే ॥పొద్దు॥ 432

## బౌళి

పతి కిచ్చకములాడి బతికే వారము నేము
కతకారితనము కలికివే నీవు ॥పల్లవి॥

చక్కదనా లెంత లేదే సరసా లెవ్వ రాడరే
పెక్కు లాగుల నెమ్మెలు పెంచనేఁటికే
మక్కళించి నీవాడేదిమాటల కేమివచ్చెనే
నిక్కి మమ్ము నెంచితేను నీ కొలఁదివారమా ॥పతి॥

వేసాలకు దుద యేదే వేడుకలు [1]బాఁతెఁటవే
వాసులనుఁ బొరలనివా రెవ్వరే
రాసికెక్కెఁ బనులెల్లా రచన లింకానేలే
నీసుద్దులన్నీ వింటి నీ కొలఁదివారమా ॥పతి॥

వినయా లెరఁగమటె వింత లెన్ని చూపేవే
యెనసిన మీఁద నిఁక నెరవులేలే
ననిచి మన్నించి యేలె నను శ్రీ వేంకటేశుఁడు
నినుఁ బెండ్లాడితే నేమే నీ కొలఁదివారమా ॥పతి॥ 433

## వరాళి

ఇంకా నీదేవులసుద్దు లేమి యడిగేవు మమ్ము
పొంకముగా నీగుణాలే పొగడుతా నుండును ॥పల్లవి॥

నెలఁతను నీవు మన్నించే మన్ననలెల్లా
చెలులతోఁ జెప్పి జెప్పి చెలరేఁగును
నిలుకడగాఁ దనతో నీవాడిన యేకాంతాలు
తలఁచుక తలఁచుక దైవారును ॥ఇంకా॥

1. బాఁ(తి+అఁ(టవే

సొరిది నీవిచ్చినట్టి సొమ్ములు దనమేనను
సరుగనఁ జూచి చూచి సంతోసించును
అరుదుగఁ దనకడకంపిన నీలేకలు
వురముపై నిడుకొని వుప్పొంగును ॥ఇంకా॥

చిత్తురు పటాన వ్రాసిన నీరూపము చూచి
హత్తి సరసములాడి యంగవించును
కొత్తగా శ్రీవేంకటేశ కూడితి వింతలోవచ్చి
యిత్తల నిన్ను మఱవ కేకాలము మెచ్చును ॥ఇంకా॥ 434

**సాళంగనాట**

గద్దెమీఁద నున్నవాఁడు కరుణా నిధైనవాఁడు
గద్దరివాఁడుగదె యీ ఘనుఁడు వో చెలియా ॥పల్లవి॥

వెన్నెలమొగముతోడ వేడక నవ్వులతోడ
చెన్నుమీరీ నిదె నరసింహదేవుఁడు
వున్నది తొడమీఁదట న్యొద్దికతో లకిమమ్మ
ఇన్నిటా జాణఁడుగదె యీతఁడు వోచెలియా ॥గద్దె॥

అంగవుఁ గాంతులతోడ నల్లాడే జడలతోడ
చెంగలించీఁ గదె నరసింహదేవుఁడు
ముంగిటఁ బ్రహ్లాదుఁడు మొక్కుతాఁ బాటలువాడి
సంగతైనవాఁడుగదె చనవిచ్చీఁ జెలియా ॥గద్దె॥

బీరపు మాటలతోడ పెలుఁగిరీటముతోడ
చేరి నిన్నుఁ గూడె నరసింహదేవుఁడు
యీరీతి శ్రీవేంకటేశుఁ డితడై వరములిచ్చీ
ధారుణి కాంతుఁడు గదె తానితఁడు చెలియా ॥గద్దె॥ 435

## లలిత

ఇద్దరి మీ సరసము లేమని చెప్పగవచ్చు
చద్దికి వేడికి సంతోషములెన్నోకాని ॥పల్లవి॥

ఇదె చనవు మనవు లిన్ని నీతోఁ జెప్పీని
సుదతి నీకెటువంటి చుట్టమోకాని
గుదిగొని సారెసారెఁ గొలువులు సేసీని
పొదిగి నీయెడ కెంత పొందోకాని ॥ఇద్ద॥

మునుకొని సన్నలు నీముందరనే సేసీని
యెనసిన పను లవి యెట్టివోకాని
పెనఁగుచు వేఁడుకొని ప్రియములు చెప్పీని
వొనరిన దెటువంటి వొడఁ బాటోకాని ॥ఇద్ద॥

నగుతానే సొలయుచు నయములు చూపీని
మొగమోట మెటువంటి ముచ్చటోకాని
ఆ (అ?) గపడి శ్రీ వేంకటాధిప నిన్నుఁ బెండ్లాడె
మగువకు నీకూ నెంత మచ్చికోకాని ॥ఇద్ద॥ 436

**రేకు 1875** 

## సామంతం

ఎఱుక గలవాఁడవు ఇన్నిటా నీవు
తఱితోడ గారవించి దయఁజూడరాదా ॥పల్లవి॥

చెలియ చెక్కులఁ గారే చెమట దుడువవయ్య
అలరి సురటివీచి యలసినది
కలువలకొప్పు జారీ కాంతకు ముడువవయ్య
సెలవుల నవ్వి నవ్వి చీకాకయినది ॥ఎఱు॥

తరుణి మోవి వాడె తములమొసఁగవయ్య
పారిఁ గత చెప్పి దప్పిఁ బొరలినది

సరు నురానఁ జెదరీ చక్కఁబెట్ట గదవయ్య
సరుగనఁ బాదాలొత్తి సదమదమైనది ॥ఎఱు॥

ఇంతి చన్నులపై కొంగు యెడలెను కప్పవయ్య
ఇంతవడి నీరతుల నెనసినది
పంతపు శ్రీ వేంకటేశ పాయక కూడుండవయ్య
సంతోసాన నీపె నీకు చాలా వలచినది ॥ఎఱు॥ 437

## ఆహిరి

తెలిపి చెప్పర నా తెరఁగు లాతనికిని
యెలమి నన్నెపుడును యెడయకుండుఁగాని ॥పల్లవి॥

గుత్తపు గుబ్బలమీఁది గురుతులు చూచుకొని
బత్తితోఁ దనరూపము భావించుకొని
హత్తి తన వుంగరము లక్కున నదుముకొని
వొత్తి విరహతాపము వోరుచుకుందాననే ॥తెలి॥

మచ్చికఁగా నాడిన మాటలు దలఁచుకొని
తచ్చి తనపేరు నోరఁ దడవుకొని
అచ్చమైన తనగుణా లందరిచే వినుకొని
కొచ్చి కొచ్చి తనరాక గోరుకవుందాననే ॥తెలి॥

పక్కనఁ దానొసఁగిన బాసలెల్లా నమ్మికొని
ఇక్కువఁ దవ రతుల కెదురుకొని
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నేలఁగా
వొక్క మనసున వచ్చి వూరకె వుందాననే ॥తెలి॥ 438

## దేసాళం

ఏమి జాజాలాడేవు ఇంతులతోను
కామించి నీతోఁ బెనఁగీ కరుణించవయ్యా ॥పల్లవి॥

వలపు నీపైఁ జల్లి వద్దనే కాచుకున్నది
చెలితోడ నిట్టె పొందుసేయరయ్యా
కలువలు గానుకిచ్చి కడుఁ బ్రియములు చెప్పీ
యెలమి నీపెకు జనవియ్యవయ్యా ॥ఏమి॥

వేడుకలు వెదవెట్టి వియ్యమందవచ్చె నీతో
జోడు గూడి యీపెరతిఁ జొక్కవయ్యా
వాడికలు వచరించి వచ్చి వచ్చి వేడుకొనీ
యీడ నిట్టె విన్నపము లియ్యకొనవయ్యా ॥ఏమి॥

ఆసలు తోడంటువెట్టి యట్టె కాఁగలించీ నిన్ను
సేన వెట్టితివి ఇఁకఁ జెనకవయ్యా
వాసితో శ్రీవేంకటేశ వనిత నేలితి విట్టె
వేసరక నీకు మొక్కే విడె మియ్యవయ్యా ॥ఏమి॥ 439

## శ్రీరాగం

నా విభునితో నేల నగవచ్చేవే
వావిరి నాకే యితఁడు వసమైయున్నాఁడు ॥పల్లవి॥

కొత్త కొత్త మాటలు కొనచూపు తేటలు
హత్తి చెల్లాటాలయాట పాటలు
యెత్తల నేరిచితివో యిటువంటి బిన్నాణాలు
మత్తిలి నీవైతే నిసుమంత దానవు ॥నావి॥

పచ్చి పచ్చి చేఁతలు వుబ్బరి బయలీఁతలు
తచ్చున నివ్వెరగుల తలపోఁతలు
గచ్చుల నెన్నాళ్లమండి గడియించుకొంటివో
కచ్చుపెట్టి నిన్నెంచితే కడు గోలదానవు ॥నావి॥

సారె సారె జంకెలు సమరతి యంకెలు
ఆరితేరికూడి పాయనిలంకెలు
యేరీతినబ్బె శ్రీవేంకటేశుతోడి పొందు నీకు
చేరి మొలక చన్నుల చిన్నారిదానవు ॥నావి॥ 440

## మాళవిగౌళ

ఆపె చెప్పినట్టె సేసి యాదరించఁదగు నీకు
కాఁపురము లీడేరెఁ గరుణించవయ్యా ॥పల్లవి॥

అందెలుఁ బాయవట్టాలు అట్టె గల్లు గల్లనఁగ
యిందుముఖి వచ్చెను నీ యింటికి నేఁడు
గందము బేంట్లు మేనఁ గమ్ముకొని రాఁగాను
ముందుగానే చేతులెత్తి మొక్కీ నీకు నిపుడు ॥ఆపె॥

కట్టిన చెంగావి చీరఁ గళబెళమనఁగాను
చుట్టమై బాగాలు దెచ్చె సూడిదెగాను
గట్టి కొప్పులో విరులు కడు బుగులుకొనఁగా
గుట్టుతోడ నీ సంగడిఁ గూచున్న దిపుడు ॥ఆపె॥

చన్ను మెరుఁగులు నీపై సారెఁ జౌకళించఁగాను
యెన్నికగాఁ గాఁగిలించె నింపులు రేఁగ
మన్నించి శ్రీ వేంకటేశ మరి నన్ను నేలఁగాను
సన్నలనే మోవి చూపీ చవితోఁ దా నిపుడు ॥ఆపె॥ 441

## పాడి

ఏఁకరీ నప్పట నుండి ఇదివో నీకు
ఆఁక వలపులు చల్లీ నడుగరాదా ॥పల్లవి॥

నిన్నుఁ జూచి సారెసారె నెలఁత
కన్నచోటనెల్లా నిచ్చకము సేసీని

చన్నుల నొరసుక నీ సంగడి నుండీ
తిన్నఁగా నాపె తలఁపు దెలుసుకోరాదా ॥ఏఁక॥
మొగమెత్తి కనుఁగొంటే మొక్కుమొక్కీని
తగిలి తగిలి యాకతము లాడీని
నగీ నంతలోనె నిన్ను నంటుసేసుక
సొగిసి యాపె గుట్టు సోదించరాదా ॥ఏఁక॥
వావి నీతోఁ జెప్పవచ్చీ వక్కణగాను
యేవేళాఁ గొలువుసేసీ యెదుటనుండి
శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జిత్తగించి కూడితివి
కావించి యాపె చుట్టరికమూఁ జేయరాదా ॥ఏఁక॥ 442

## రేకు 1876 ముఖారి

నన్నేల పిలిచేవు నగుతా నాపె యింటికి
విన్న సుద్దులే చాలు వేడుకాయ నాకును ॥పల్లవి॥
సరుసఁ గూచుండి యాపె సారె నిన్ను జంకించఁగా
విరులనుఁ బూఁచి పూఁచి వేయఁగాను
తురుము కొనగోళ్లను దువ్వి దువ్వి తియ్యఁగాను
నిరతి నివెల్లాఁ జూచి నే నోరువఁ గలనా ॥నన్నే॥
తొడమీఁద దొడ వేసి దొరతనాలు చూపఁగా
కడఁగి నీమోవి యాకె గంకి సేయఁగా
గుది(డి?) గొన రాకొట్లు గొట్టి నిన్నుఁ బిలువఁగా
వొడఁబడి నేనిందుకు వోరువఁగఁగలనా ॥నిన్నే॥
నమమొనలు నాఁటించి సదమదము సేయఁగా
పెనఁగులాడి నీమేను పిప్పిసేయఁగా
ననిచి శ్రీవేంకటేశ నాకాఁగిట నీవుండఁగా
వొనరి యాపె చేఁతలు కోరువఁగఁగలనా ॥నన్నే॥ 443

## శంకరాభరణం

జాణ వలపుల తెంకి జవాదివంకి
నాణెమైన పతితోడ నవ్వు నవ్వఁగదవే ॥పల్లవి॥

కాటుక కనుచూపుల కలికీ
గాఁటపు మాఁటల చిలుకలు కొలికీ
చాటువ కెక్కిన యట్టి జాజి ములికీ
పాటించి నీ విభునికి బాగా లియ్యఁగదవే ॥జాణ॥

నెలకొన్న నవ్వుల వెన్నెలతేట
కులుకుఁ గుత్తికలోని కోవిలపాట
వెలయఁ జిత్తజకేళి వేడుక కోట
తలకొని నీమగనిపాదము లొత్తఁగదవే ॥జాణ॥

గుడి(ది?) కొన్న లేఁతసిగ్గుల దొంతి
వెదచల్లుఁ బులకవిరులబంతి
పదిలపు నడపుల పట్టపుదంతి
యిదె శ్రీవేంకటేశ్వరుఁ డెనసె మెచ్చఁగదే ॥జాణ॥

## సామవరాళి

ఏమయ్యా నాగుణము యెఱఁగవా నీవేమైనా
గోమున నా సంగడినిఁ గూచుండువు రావయ్యా॥పల్లవి॥

వోడక నిన్నంతేసి వొరసేటిదాననా
వాడికలు చెప్పుకొని వచ్చేదాననా
యేడ నుండయినా నిన్ను నెలఇంచేదాననా
కూడుమని నిన్ను వేఁడుకొనేదానఁగాక ॥ఏమ॥

పంతమాడి నిన్ను నిట్టె బాస గొనేదాననా
చెంతఁ బెక్కుచీరలు దీసేటిదాననా

రంతుసేసి ని న్నింటికి రప్పించుకొనేదానవా
సంతోసాన మొక్కి సేస చల్లేదానఁగాక ॥ఏమ॥

బయలు వందిలి వెట్టి భ్రమయించేదానవా
క్రియ యెఱఁగక పలికేటిదానవా
నియతి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
నయమున నిఁక నీతో నవ్వేదానఁగాక ॥ఏమ॥ 445

## దేసాళం

నెట్టుకొన్న బత్తితోడ నీవు నేను వుండఁగాను
చుట్టమై తానూ నిన్ను సొలయజూచీని ॥పల్లవి॥

వలిపె పయ్యెద వల్లెవాటుతోడ నిలుచుండి
నెలఁత తొంగిచూచీని నిన్ను నిదివో
నలువంకఁ గమ్మవాసనలు బుగులు కొనఁగా
చలువగా సురటి విసరు కొనీఁ దాను ॥నెట్టు॥

దంతకాంతులు సెలవిఁ దళుకున మెరువఁగా
ఇంతి నిన్ను పిలిచీని యెలయింపుడ
రంతులుగాఁ గంకణాలు రాసి రాసి మొరయఁగా
చెంత నిదె మొక్కీని చేతులెత్తి నీకు ॥నెట్టు॥

తురుము చెంగలువలు తొట తొట రాలఁగాను
తరుణి నిన్ను వేసీని తామరలను
ఇరవై శ్రీవేంకటేశ ఇంతలోఁ గాఁగిలించితి -
వరిది నీమోవితేనె లానీఁ దానిపుడు ॥నెట్టు॥ 446

## ఆహిరి

వెల్లవిరులై యిఁక వెలసివుందువుగాక
చెల్లఁబో యింకానేలే చిడుముడి సిగ్గులు ॥పల్లవి॥

చన్నులపై నిండినవి చందమామ పిల్లలు
పన్నీటి కాలువలు పారీఁ జెక్కులు
వున్నతి పెండ్లివిడే లొద్దికఁ బుక్కిట నిండా
వన్నెలాఁడి ఇఁకనేలే వలవనిసిగ్గులు ॥వెల్ల॥

యెదిరించి తోఁచె నదె యెరసంజ కన్నులను
చెదరీ సెలవులను చిరుముత్యాలు
గుదిగొని మేన నిండె గుంపులై జాజి ననలు
మదిరాక్షి యిఁక నేలే మాయదారి సిగ్గులు ॥వెల్ల॥

తతిఁ దురుముపై నవె తలఁబాల వజ్రాలు
కతమాయఁ దెమ్మెరలు సారెసారెకు
ఇతవై శ్రీవేంకటేశుఁ డీతఁ డిదె నన్నుఁ గూడె
కతకారి ఇఁక నేలే కాయకపు సిగ్గులు ॥వెల్ల॥ 447

బౌళి

గుట్టుగల రమణినిఁ గొనియాడుదు రిందరు
చుట్టరికము నెరపి జోడై యుండుటే మెలు ॥పల్లవి॥

వీసమంత పనికైనా వేగిరపడఁగవద్దు
వాసితోడ మెలఁగేటి వనితలకు
ఆసతోడి మగవాఁడు ఆయములంటవచ్చితే
చేసూటికిఁ బెనఁగి సిగ్గువడుటే మేలు ॥గుట్టు॥

సరసములోన నైనా జంకించి కెలయవద్దు
దొరతనమెరిఁగిన తొయ్యలులకు
మరిగినవాఁడు తనమర్మము సోఁకనాడితే
సొరిది దప్పక చూచి చొక్కుటే మేలు ॥గుట్టు॥

కలలోనఁ గూడినాను గర్వము చూపవద్దు
వలవ నేరిచినట్టి వనితలకు
ఆ (అ?) లమేలు మంగవు నీ వతఁడు శ్రీవేంకటేశు -
డెలమి నిన్నేలె నిఁక నియ్యకొనుటే మేలు ॥గుట్టు॥ 448

**రేకు 1877** **సామంతం**

నీ వలమేలుమంగవు నెరజాణఁ డాతఁడు
వోవరిలో నుండఁ గదె వొయ్యారిదానవు ॥పల్లవి॥

గరిమ నీరమణుఁడు కైదండ వట్టితేను
శిరసేల వంచేవే చిన్నారిదాన
మరిగి నీ కతఁ డాకుమడిచి చేతి కిచ్చితే
వెరగు వడఁగనేలే వియ్యపుదాన ॥నీవ॥

తగ్గకుండా నీతొడలు తలగడఁ బెట్టుకొంటే
సిగ్గులేల పెంచేవే చేఁతలదాన
యెగ్గులేక నీ చెవిలో నేకతము లాడితేను
వెగ్గళించి దూరనేలే వేడుకదాన ॥నీవ॥

గక్కన నీ చన్నులు కాఁగిట నదుముకుంటే
మిక్కిలి యాల చొక్కేవే మేనదాన
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
చక్కెరమో వియ్యఁగదె చనవరిదానా ॥నీవ॥ 449

**పాడి**

వాఁడువో నీ రమణుఁడు వరసుకు వచ్చినాఁడు
పోడిమితోఁ గాఁపురాలు పొందుగాఁ జేయఁగదె ॥పల్లవి॥

చెలిమి చెమటలు నిండు సేయఁగఁ జేయఁగాను
కలిమి గంపల కెక్కు కైకొంటేను

బలిమి బండ్ల వచ్చు పలుమారుఁ బెనఁగితే
నిలువు [1]నూరువండీని నీకేలే చింతా ॥వాఁడు॥

వేడుక వెల్లివిరుసు వినోదాలు జరపితే
వాడికలు గుంపుగట్టు వలెనంటేను
కూడిక రతికి నెక్కు కొంకక చెనకితేను
యీడు జోళ్లొక్కటాయ ఇఁకనేలే చింతా ॥వాఁడు॥

ఆసలు పైపైఁ బెరుగు నంగములు సోఁకితేను
బాసలెల్లా నెట్టుకొను బత్తి గలితే
సేసవెట్టి కూడినాఁడు శ్రీవేంకటేశుఁడు నిన్ను
తాసువలె మీరున్నారు తగదేలే చింతా ॥వాడు॥ 450

## బౌళి

చిన్నదానవు గనక చెప్పితి నీకీ బుద్ధులు
పన్నుక నీపొందులివి పాయకిట్టె సేయవే ॥పల్లవి॥

తప్పక చూచితేనే తగులాయములు వుట్టు
చిప్పిలఁగ నవ్వితేనే చిత్తములంటు
చొప్పుఁగా మాటలాడితే చుట్టరికములు రేఁగు
యెప్పుడూను పతిపొందు లేమరక సేయవే ॥చిన్న॥

కొలువులు సేసితేను కోరికలు కొనసాగు
వెలినుండి వేఁడుకొంటే వేడుకగల్గు
తలకొని చెనకితే తమకము లుప్పతిలు
మలసి నీపతిపొందు మఱవక సేయవే ॥చిన్న॥

వావులు దలపెట్టితే వాడికలు సమకూడు
మోవితేనె చూపితేను మోహము మెండు

1. మారు+వండీని

యీవేళ నిన్నుఁగూడె ఇదియే యలవాటౌను
శ్రీవేంకటేశ్వరుపొందు సేనలుగాఁ జేయవే ॥చిన్న॥ 451

## ఆహిరి

వేతొకటిఁ గాదు సుమ్మీ వెలఁది నీకు మేలుది
మీఱిన సంతోసాన మిక్కిలి మన్నించుమీ ॥పల్లవి॥

కన్నుల సొలయుఁగాని కడవ మాఁటాడదు
చన్నుల నొరయుఁగాని జంకించదు
సన్నలఁ గొసరుఁగాని చలము సాదించదు
ఇన్నిటాఁ జెలికి నీపై నెటువంటి ప్రియమో ॥వేతొ॥

బలిమిఁ బెనఁగుఁగాని పంతములు నెరపదు
మలసి చెనకుఁగాని మచ్చరించదు
అలరుల వేయుఁగాని ఆస నీపై వదలదు
యెలమి నీపెకు నీపై నెటువంటి ప్రియమో ॥వేతొ॥

చుట్టి నీతో నవ్వుఁగాని చూపదు యెగసక్యాలు
గుట్టుతోడ నుండుఁగాని గుంపించదు
నెట్టన శ్రీవేంకటేశ నెలఁతనుఁ గూడితివి
యిట్టె మెచ్చి నీపైఁ దన కెటువంటి ప్రియమో ॥వేతొ॥ 452

## గౌళి

చెల్లుబడియైన మీఁద చేఁతలు మరేమిటికి
చల్లఁగా నామోవి యాని చవులెంచుఁగాక ॥పల్లవి॥

మొగము చూచినవాఁడు ముచ్చటకు రమ్మనవే
నగినవాఁ డిమ్మనవే నాకుఁ జనవు
తగులనాడినవాఁడు దగ్గరఁగ రమ్మనవే
నగిడి నన్నిఁక నెంత మరసు సోదించీని ॥చెల్లు॥

చెలిమి సేసినవాఁడు చేతికి లోఁగమ్మనవే
కలయ వచ్చినవాఁడు కైకొమ్మనవే
వలపించినవాఁడు కైవసము గమ్మనవే
లలి నెందాఁకాను నాలాగులు చూచీని ॥చెల్లు॥
సరసమాడినవాఁడు సతమై యేలుమనవే
తెరవేసినవాఁడు సందించు మనవే
ఇరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ బెండ్లాడె
సురతవేళల నేమి చొప్పులు వెదకీని ॥చెల్లు॥ 453

## హిజ్జిజి

వాసులకే బతికేటి వనితలము
సేసవెట్టి యేలితివి చేరి మన్నించవయ్యా ॥పల్లవి॥
కలికితనము లెల్లా కాంతలకు సాజము
మొలకనవ్వులు వన్నె మోములకును
వలపులకును బోది వాడికైన చేఁతలు
చెలఁగి మమ్మేల రట్టుసేయ వచ్చేవయ్యా ॥వాసు॥
వినయపు సరసాలు వేడుకలకు మూలము
చెనకులకుఁ దగులు చిరుసిగ్గులు
పెనఁగులాటకు లంకె ప్రియవాది తనములు
వొనరి మమ్మిఁకనేల వుప్పతించేవయ్యా ॥వాసు॥
కాఁగిటిరతిసన్నలు కనుబొమ్మ జంకెనలు
మాఁగిన మోవియిూగులు మతి చొక్కులు
చేఁగ దేరఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ నన్ను
తోఁగి చూచి యేల మాసుద్దులు మెచ్చేవయ్యా ॥వాసు॥ 454

**రేకు 1878** **వరాళి**

ఏమి చెప్పేది నీసుద్దు లిందరిలోన
వేమరుఁ జూచి చూచి వెరగయ్యీ నిపుడు ॥పల్లవి॥

మగువరో పతితోడ మాఁటలాడఁ జాలను
చిగురువంటి నీమోవి చిల్లులయ్యీనా
నిగిడి వద్ద గూచుంటే నీకేమే వలపులు
జిగురువలె నంటుక చిమ్మిరేఁచీనా ॥ ఏమి॥

చెనకి యీతనితోడఁ జేరి పెనఁగ వదేమే
ఘనమైన నీ చన్నులు కాయగాచీనా
మొనసి వేడుకతోడ మోమెత్తి చూచితే నేమే
ననుపుల తమకము నామునెక్కీనా ॥ఏమి॥

యెరవు సేయక బాగా లీతనికిచ్చితే నేమే
వరుస నీకొనగోళ్లవాఁడి వొయ్యీనా
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నివ్వెరగందేవు
కరఁగి నీమనసిట్టె కాలువ గట్టీనా ॥ఏమి॥ 455

**కన్నడగౌళ**

ఇటువంటి మానావతి నింతసేతురా
తటుకన లాలించి దయఁజూడు మిఁకను ॥పల్లవి॥

చెప్పరానిమాఁట లేమి చెప్పితివో చెలితోను
అప్పటనుండి బొమ్మల నద్దలించీని
రెప్పల తుదలను యేరీతి సన్నసేసితివో
చప్పుడుగా విరులను సారెకు వేసీని ॥ఇటు॥

గుట్టుతోడ నెట్లా నిక్కువలు సోఁకించితివో
దట్టించి పెదవులుగదల దూరీని
చిట్టంటుఁజేఁతల నేడ సిగ్గులు రేఁచితివో
చుట్టి చుట్టి ములువాఁడి చూపులఁ జూచీని ॥ఇటు॥

వేడుకరతులు యెంత వెల్లవిరి సేసితివో
వోడక పెనఁగుతా నీ వొడివట్టీని
యీడనె శ్రీవేంకటేశ యీపె నెంత యేలితివో
జోడు గూడి నిన్నిప్పుడు చొక్కుతా మెచ్చీని ॥ఇటు॥ 456

**లలిత**

మేలు మేలు జాణవు మెచ్చితి నాపెను నేను
నీలాగులెల్లా నాపె నేరిపినవేకా ॥పల్లవి॥

కనుసన్నలనే మొక్కి కాంత సేవలు సేసి
తనువు సోఁకుల నిన్ను దమిరేఁచెఁగా
చెనకులఁ బొద్దు వుచ్చి చెక్కు కొనగోర నూఁది
పెనఁగులాటల నీకుఁ బ్రియము వుట్టించెఁగా ॥మేలు॥

చుట్టరికములు చెప్పి సొలసి వద్దఁ గూచుండి
నట్ట నడుమనే నిన్ను నవ్వించెఁగా
గుట్టుతోనే మేలమాడి కొప్పు దువ్వి బుజ్జగించి
పట్టపగలే నిన్ను భ్రమయించెఁగా ॥మేలు॥

చన్ను లురమున నాని చవులెల్లా మోవిఁ జూపి
వన్నెలాఁడి ఇంత నిన్ను వలపించెఁగా
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తిన్నని రతులఁ దానూఁ దేలించెఁగా ॥మేలు॥

## పళవంజరి (రం?)

వెరగయ్యీ నీపెసేసే వేసాలకు
యిరవైన నీచిత్త మిఁక నెట్టోకాని ॥పల్లవి॥

వాసులకే పెనఁగీని వంతులకే చెనకీని
వేసరదెంతైనా నీతో వేడుకలను
ఆసలనే కెరలీని అందాలకే లాచీని
చేసూటి నీకె యెంత చేఁతలాఁడోకాని ॥వెర॥

చూపులనే సొలసీని చుట్టి చుట్టి మలసీని
వోపననదు నీతోడి వొరపులను
తీపులుగా మాఁటలాడి తేనెలు మోవిఁ జూపి
కాఁపురాల కీపె యెంత కతకారో కాని ॥వెర॥

చనువులకే వచ్చీ సరసములకే పొంచీ
తనియదు నిన్నుఁ గూడే తలపోఁతల
యెనసితివి శ్రీవేంకటేశ యింతలో నన్ను
ననుపుల కీకె యెంత నయగారోకాని ॥వెర॥ 458

## ఆందోళి

మురిపెములెల్లా నీముందరనే పచరించీ
నెరవాది తనమెంత నేరుచునో తాను ॥పల్లవి॥

కట్టుకొనె మెడనిండా గట్టి ముత్తెపు సరులు
పెట్టుకొనెఁ గొప్పున సంపెంగవిరులు
దట్టముగఁ బయ్యెదలో దాఁచెను కుచగిరులు
అట్టె చిత్తగించి చూడవయ్యా యీపెదిక్కు ॥మురి॥

పూసెను గందము మేన పొంచి నెరవూఁతను
ఆసలనే చూపీ నొయ్యారి చేఁతలు

వేసరక మొరయించీ వెస మట్టెల మోఁతలు
సేసవెట్టి యేలవయ్యా చెలి నీకుఁ గలిగె ॥మురి॥

మెలుపున నించుకొనె మేనెల్లా సొమ్ములు
కులికీ వీణెలోఁ గొనగోరి చిమ్ములు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పిలిచి మాఁటాడవయ్య ప్రియురాలు నీకు ॥మురి॥ 459

**ఆహిరి**

ఇటువంటి వేడుకలు యిదె నీకుఁ గలిగెను
తటుకన వరమిచ్చి దయసేయవయ్యా ॥పల్లవి॥

కలికి చూపులు నీకు కలువలదండలాయ
సెలవినవ్వులు మంచిసేవంతులాయ
పిలిచిన యధరము పెనుమంకెనపూవాయ
కొలఁది భారము నిండుఁ బూజలాయను ॥ఇటు॥

ముక్కు నిట్టూర్పులు నీకు మొనసి సంపెఁగలాయ
తక్కక చేసన్నలు తామరలాయ
చెక్కుమీఁది పులకలు చెలరేఁగి జాజులాయ
నెక్కొన్న యీపె చందము నీకుఁ బూజలాయను ॥ఇటు॥

మచ్చిక నీపెకాఁగిలి మరువపు ననలాయ
కొచ్చి కాఁగిటిరతులు కురివేరాయ
యిచ్చట శ్రీవేంకటేశ యింతి నీవూఁ గూడఁగాను
పచ్చిదేరి ఘన్నిటాను బలు పూజలాయను ॥ఇటు॥ 460

**రేకు 1879 గౌళ**

ఇటువలె నుండుభాగ్య మేమని చెప్పఁగవచ్చు
కుటిలకుంతలి నిన్నుఁ గోరి దక్కఁగొనెను ॥పల్లవి॥

పెంచ పెంచ రమణికిఁ బెద్దలాయఁ గుచములు
యెంచ నెంచ గుణములు యెన్నికలాయ
ఇంచుకంత పడుచంటా నిన్నాళ్లు నుంటిమి నేఁడు
మంచముపై రతులను మరిగించె నిన్నును ॥ఇటు॥

చూడఁ జూడ మగువకు చూపులెల్లా వాఁడెక్కె
ఆడనాడ మాటలలో నందాలు వుట్టె
యీడుగాని పడుచంటా నెఱఁగమైతి మిన్నాళ్లు
వాడలో నెందు చూచినా వలపించె నిన్నను ॥ఇటు॥

కాయఁగాయ వెన్నెలాయ కాంతసెలవుల నవ్వు
సేయఁజేయ వేడుకాయ చేఁతలెల్లాను
పాయక శ్రీవేంకటేవ పడుచంటాఁ జూచితిమి
చాయలా సన్నలాఁ గూడి సాదించె నిన్నును ॥ఇటు॥ 461

## పాడి

చేరి పెండ్లాడరాదా సేసలు వెట్టి
సారెకు నీమోవి చూపి సన్నలేమి సేసేవే ॥పల్లవి॥

పిప్పిగట్ట నాతనితో పెనఁగులాడి యం(యెం?) దాఁకా
వుప్పతిలుఁ జెమటల నోలలాడేవే
తప్పక చూచి యప్పటి తమి యెంత పెంచేవే
కుప్పగాఁ గోరిక లెంత కూడపోసేవే ॥చేరి॥

గుట్టుతోడ నిలుచుండి కొలువుసేసి యందాఁకా
చిట్టంటుఁ బులకలను చిమ్మిరేఁగేవే
బట్టబయలు వలచి భావమెంత గరఁగేవే
దట్టపు సిగ్గుల నెంత దడి గట్టేవే ॥చేరి॥

పానుపుపైఁ గూచుండి బాఁతిపడి యందాఁకా
నానఁబెట్టి నానఁబెట్టి నవ్వు నవ్వేవే
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలోనే నిన్ను ఁగూడె
పూని సంతోసాలెంత పొగువెట్టేవే ॥చేరి॥ 462

## లలిత

వాకిట నుండి యెంత వాడికలు సేసేవు
లోకమెల్లా నెరుఁగును లోనికి రావయ్యా ॥పల్లవి॥

పడఁతి వినయముల బయలు వందిలి వెట్టె
తడఁబాటు సిగ్గులను దడి గట్టెను
వుడివోని తమకము నొడినిండా నీకు నించె
యెడమాట లిఁకనేల ఇంటికి రావయ్యా ॥వాకి॥

కలికి కనుచూపులకానుకలు నీకు నిచ్చె
సులభాన వలపుల సూడిదె లంపె
సెలవుల నవ్వులనే చిత్తమెల్లాఁ గరఁగించె
వెలినుండి జంపులేల విడిదికి రావయ్యా ॥వాకి॥

భామ తమ్మి మొగ్గలనుపాన్పు నీకుఁ బరచె
వేమరు మోవితేనెల విందులు వెట్టె
ఆముక శ్రీవేంకటేశ యట్టె యీకెఁ గూడితివి
దామెలసన్న లవేల తావుకు రావయ్యా ॥వాకి॥ 463

## కాంబోది

అప్పటనుండి నవ్వీ నాతఁడు నీతో
యిప్పుడు సిగ్గు లివేలే యియ్యకొంటగాక ॥పల్లవి॥

చలపాదితనమేల సరసమాడేటి వేళ
చెలరేఁగి సొలపుల చేఁతలేకాక

బలిమి బిగియనేల పట్టిపెనఁగేటివేళ
చెలిమి చూపి ప్రియము చెప్పుటే కాక ॥అప్పు॥
పంతము లాడఁగనేల పానుపుపైనున్న వేళ
సంతోసాన వలపులు చల్లుటగాక
వింతలు సేయఁగనేల విచ్చనవిడైన వేళ
చెంతనే వలసినట్టు చెనకుటగాక ॥అప్పు॥
ముంచి మాఁట లాడనేల మోవి చవిగొనేవేళ
కంచపు పొత్తుల మేలు గైకొంటగాక
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనే నినుఁగూడె
పొంచి పొంచి వేడుకల భోగించుటగాక ॥అప్పు॥ 464

## కేదారగౌళ

తెలుసుకోరాదా తెలివ తలఁపులెల్లా
వెలినుండి ముందే యాల వేగిరించేవు ॥పల్లవి॥
వాసితోడ మదిరాక్షి వచ్చినపని వుండఁగా
నీ సుద్ది లేమి చెప్పేవు నేరుపులను
మూసిన ముత్తెమువలె మొనసి నిన్ను ఁజూడఁగా
సేసవెట్టిన సతులఁ జెలి యేమి చూపేవు ॥తెలు॥
లలితాంగి నీరతికి లాచి కాచుకుండఁగాను
యెలమి జాజాలాడ నేమి నేర్చేవు
బలిమిఁ జన్నులొరయఁ బాదాలొత్తరాఁగాను
మలసి వట్టివనులు మరియేల చెప్పేవు ॥తెలు॥
పడఁతి నీకాఁగిటిలోఁ బాదుకొని వుండఁగాను
యెడయక కంఠహారా లెన్ని గట్టేవు
నడుమ శ్రీవేంకటేశ నన్ను నేలితివిప్పుడు
వొడఁబరచి యాపెను వొడి యేల పట్టేవు ॥తెలు॥ 465

### బౌళి

ఇందరముఁ జూడఁగాఁ దానెవ్వతో కాని
ముందే నన్ను నేలితివి మొక్కేఁ దాను నీకు ॥పల్లవి॥

తెల్లమిగా నీతోను తేనేగారే మోవితోడ
చెల్లుబడిమాఁట లాడీఁ జెలియ
గొల్లెతఁగాబోలు నీపై గొప్పగొప్ప చన్నులతో
కెల్లురేఁగి పైకొనీని కిందుమీఁదెఱఁగదు ॥ఇంద॥

పెంచెపుఁ బయ్యెదతోడఁ బెడమరలి నీదిక్కు
పొంచుక సారెకుఁ జూచీఁ బొలఁతి
చెంచెతగాఁబోలు నీకె చెక్కుల జవ్వాది నీపై
యించుకించుకే చమరీ నెడ్డతనమునను ॥ఇంద॥

సరసపుఁ జేఁతలను సగినాలు చెప్పుకొంటా
నిరతిఁ జేతులు చాఁచీ నీపై వనిత
యెరికెత గాఁబోలు నిన్నికె శ్రీవేంకటేశుఁడ
మరిగించుకొనె నిట్టె మంచితనములను ॥ఇంద॥ 466

**రేకు 1880** **కాంభో(బో?)ది**

నెరజాణ వన్నిటాను నేరుపరివి
తరుణుల మన్నించే తగ వెఱుఁగుదువు ॥పల్లవి॥

కొచ్చి కొచ్చి బత్తితోడఁ గొలువులు సేసి నీకు
ఇచ్చకములాడెఁ జెలి ఇందాఁకాను
మచ్చికతోఁ గొప్పు దువ్వి మనసెల్లాఁ గరఁగించె
మెచ్చవయ్యా ఇఁకనైనా మేలెరిఁగి నీవు ॥నెర॥

పయ్యెద చెరఁగు జార పలుమారు బాదాలొత్తె
నెయ్యములే పచరించె నిన్నటనుండి

వొయ్యనే గందమువూసి వుచిత మెల్లా నెరపె
యియ్యవయ్యా వుడుగర లితవెరిఁగి నీవు ॥నెర॥

వీడెమిచ్చి మోవితేనె విందువెట్టి లాలనతో
వేడుకలే పచరించె వేగి నంతాను
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీకెఁ
గూడవయ్యా పొందుల గురుతెరిఁగి నీవు ॥నెర॥ 467

## ఆహిరి

ఏల దూరేవే వూరకే యెవ్వరినైనా
తాలిమితో నీవిభుఁడే దయఁజూచీఁగాక ॥పల్లవి॥

అంది నీలోనివలపు లారడిఁ బెట్టీఁగాక
చంద్రమామ నిన్ను వచ్చి సాదించీనా
కందువైన నీకోరికె కడు గుబ్బతిలీఁగాక
మందానిలుఁడు నీపై మచ్చరించీనా ॥ఏల॥

తలపోఁతలే నిన్ను తడఁబరచీఁగాక
చిలుకలు వచ్చి నేఁడు చిమ్మిరేఁచీనా
యెలమి నీ వయసే యింతగాఁ జేసీఁగాక
కలువపువ్వులు నిన్ను గాసిఁబెట్టీనా ॥ఏల॥

చేవదేరి నీచింత చెక్కుకుఁ జేయిచ్చెఁగాక
కోవిలకూఁతలు నిన్ను గుంపించెనా
శ్రీవేంకటేశుఁడు తానే చేరి నిన్నుఁ గూడెఁగాక
యీవలఁ దుమ్మిదగుంపు లెడమాట లాడెనా ॥ఏల॥ 468

## భైరవి

కూడఁజూడఁ గొత్తలాయ సుదతిభావము నేఁడు
కూడి నీకూటమికిఁ గొలకొల నవ్వెను ॥పల్లవి॥

పక్కన నన్నుఁ జూచి పడఁతి శిరసు వంచె
చెక్కిటఁ జేయిడుకొని సిగ్గువడెను
జక్కన చన్నులమీఁద జారినపయ్యెదకొంగు
అక్కున నదుముకొని యంతలోనే నవ్వెను ॥చూడ॥

ఆలించి నీమాఁట విని యాసతోడ ముక్కుఁమీద
వేలువెట్టుకొనుచు నివ్వెరగందెను
మేలిమితురుము వీడి మెడమీఁద గమ్ముకోఁగా
కేలఁ జిక్క నొత్తుకొంటా కిలకిల నవ్వెను ॥చూడ॥

కొచ్చి నీవద్దఁ గూచుండి గొబ్బునఁ జెమరించఁగా
మచ్చికఁ గరఁగుకొంటా మదిఁజొక్కెను
యిచ్చట శ్రీవేంకటేశ పచ్చిచేఁత [1]సేయుగాని
పచ్చడము గప్పుకొని పకపక నవ్వెను ॥చూడ॥ 469

## *శ్రీరాగం

ఇచ్చకములే సేసి యీడేరవలెఁగాక
పచ్చిగా బలిమిసేసి పదరఁగవచ్చునా ॥పల్లవి॥

వోపరించి వేడుకల కొడిగట్టినవారికి
వేసరఁగవచ్చునా వేగినంతాను
ఆసలనే తుదకెక్కి ఆఱడైనవారికి
గోసనాసగాఁ బతిని గుంపించవచ్చునా ॥ఇచ్చ॥

చూపులకే లాచి లాచి చొక్కియుండేవారికి
వోపననవచ్చునా వూరకైనాను
యేపున మోవితేనెకు నేఁకరేటివారికి
మాపుదాఁకా జోలిసేసి మఱవఁగ వచ్చునా ॥ఇచ్చ॥

తనివోని కాఁగిట దగులైనవారికి
చెనక కుండవచ్చునా చేతులారాను
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేఁడు
పెనఁగులాటకాక పిరితియ్యవచ్చునా ॥ఇచ్చ॥ 470

## వరాళి

ఎప్పుడూ నావాఁడవే ఇన్నిటా మన్నించితివి
చెప్పరాదా యీపె సుద్ది సిగ్గులేల నీకును ॥పల్లవి॥

వింతవింత మాఁట లాడి వేడుకలు నీకుఁ జేసీ
యింతి నీకు వావిని యేమౌనోకాని
దొంతరవలపు చల్లి దోమటి దొడుకవచ్చీ
యెంతగద్దో చుట్టరిక మీపెకు నీకు ॥ఎప్పు॥

సరసపుఁ జేఁతలను జాజర నీతో నాడీ
తరుణికి నీకు నెంత తగునో కాని
పొరుగు పొరచి మోవిఁ బొసఁగ విందులు వెట్టీ
యిరవైన మచ్చికెంతో యీపెకు నీకు ॥ఎప్పు॥

చతురతలు నెరపి సారెకుఁ జేతులు చాఁచీ
సతికి నీయెడ నెట్టి సన్నలోకాని
తతి నిన్ను బెండ్లాడె తగిలి శ్రీవేంకటేశ
యితవైన తమి యెంతో యీపెకు నీకు ॥ఎప్పు॥ 471

## కురంజి

నీవు నన్ను నేలినది నేఁడు తా నెఱఁగదేమో
పూవుల వేసీ నిన్నుఁ బొంచిపొంచి యిపుడు ॥పల్లవి॥

1. "సేయఁగా నీ - పచ్చడము" అని యుండవచ్చునేమో?

చెక్కు కొనగోర నొక్కి చిమ్మిరేఁగ వేఁడుకొని
అక్కరతో విడెమిచ్చీ నంగన నీకు
జక్కవ చన్నుల మీఁది చవులుగా మోవితేనె
పుక్కిట బంటి గాఁగఁ బోసీ వేడుకను ॥నీవు॥

వాడివట్టుకొని నీతో నుబ్బరిమాఁట లాడీ
వడిగా నవ్వులు నవ్వీ వాడికగాను
తొడమీఁదఁ దొడవేసి తొరలించి వలపులు
జడివానలుగ నీపైఁ జల్లీ సరసము ॥నీవు॥

నెమ్మదిఁ గాఁగిట నించి నేరుపులు వచరించి
వుమ్మడి రతులఁ గూడీ వొద్దికతోను
యిమ్ముల శ్రీవేంకటేశ యెదురెదురనే యీకె
కుమ్మరించీ నీపైఁ బత్తి కోరికలు మీరను ॥నీవు॥ 472

**రేకు 1881** **ముఖారి**

ఎఱఁగ మిన్నాళ్ల నేము యిటువంటి సుద్దులు
గఱ గరగా నేఁడు కానవచ్చె మాకును ॥పల్లవి॥

మంతనాన నిన్నుఁజేరి మాటలు సారెకు నాడీ
యెంతచన విచ్చితివో యీపెకు నీవు
సంతోసాలు రేఁచుకొంటా సరుసనే కూచున్నది
ఇంతికి నీకునుఁ జూడ నేనాటి పొందులో ॥ఎఱఁ॥

వరుస నీవూడిగాలవారికిఁ బనులు చెప్పీ
సిరులఁ బారుపత్య మిచ్చితివో నీవు
సరసములాడుకొంటా చల్లీ వలపులు నీపై
మరఁదలి వావి యెందు మరి తెచ్చుకొనెనో ॥ఎఱఁ॥

సెలవుల నవ్వి నవ్వి చేతులు నీపైఁ జాఁచీ
సలిగె యెట్లిచ్చితివో చక్కఁగా నీవు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి వీకె నెట్టు గలిగెనో నీకు ॥ఎఱఁ॥ 473

## పాడి

ఎంత భాగ్యవంతుఁడవో యీకె నీకు దేవులాయ
వింతలేక యెప్పుడూ వినోదించవయ్యా ॥పల్లవి॥

కన్నుల కొలుకులను కడఁగీ మదరాగము
చన్నుల తుదల రేఁగీ జవ్వనము
నున్నని చెక్కుల వెంట నూలు కొనీని కళలు
పిన్నది నీకె తగు బెండ్లాడవయ్యా ॥ఎంత॥

నెట్టుకొని మొగమున నిండెను చక్కఁదనము
అట్టె తేనియ లూరీ నాకె మోవిని
తెట్టలై వినయమెల్లాఁ దేరీ నిలువునను
పెట్టెను సొమ్ములు నిండాఁ బెండ్లాడవయ్యా ॥ఎంత॥

పిరుఁదు బటువునను బెనగొనీ సింగారము
కరకమలమునుఁ గైకొనె సేస
యిరవై శ్రీవేంకటేవ యెదఁబెట్టితి వీకెను
బెరసితివి నిచ్చలు పెండ్లాడవయ్యా ॥ఎంత॥ 474

## రామక్రియ

ఎఱుఁగుదుఁ దనసుద్దు లిన్నియు నేను
గుఱుతులెల్లాఁ దెలిపె కోరి చూడుమనవే ॥పల్లవి॥

యెంచినవే యెంచితేను యెడతెగవు లెక్కలు
పొంచి యెందాఁకా నాతోఁ బొద్దు వుచ్చీనే

కొంచి దవ్వులఁ జూచితే కొండలు నున్ననైయుండు
వంచెనతో మొక్కఁగాని వచ్చితే రమ్మనవే ॥ఎఱు॥
చెప్పినవే చెప్పితేను సేనలౌను మాటలు
చిప్పిల నన్నెంత తాను చిమ్మిరేఁచీనే
వుప్పు గప్పురమువలె నుండు పరికించితేను
తిప్పరాదు తనయాస తెమ్మనవే విడెము ॥ఎఱు॥
సేసినవే సేసితేను చేతికిఁ జిక్కఁ బనులు
వేసటలేక యెంత వెడ్డు వెట్టీనే
సేసవెట్టి నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు తాను
మూసిన ముత్తెమై యుండె మోవి నాకిమ్మనవే ॥ఎఱు॥ 475

## నాదరామక్రియ

చూడరమ్మా యీకొత్తలు సుదతులాల
వేడుకలన్నియు వెల్లవిరులాయ నిదివో ॥పల్లవి॥
కొండలవంటి వలపు కుప్పలయ్యే కాలమున
కొండలంతేసి చన్నులు కొమ్మకమరె
దిండుకట్టి యాసలు తీగెలుసాగే కాలాన
గుండుఁజేతుల తీగెలు కొమ్మ కొప్పె నిదివో ॥చూడ॥
చీఁకటివంటి చిత్తము చిమ్మిరేఁగే కాలమున
చీఁకటి గొనే తురుము చెలికి మించె
వేఁకమైన సిగ్గుల వెన్నెల కాలమున
మూఁక నవ్వు వెన్నెలలు మొలచె నేఁడిదివో ॥చూడ॥
పంట వండే జవ్వనము ఫలియించేకాలమున
పంటమోవి యింతికి ఫలియించెను
నంటు శ్రీవేంకటేశుతో ననిచినకాలమున
జంట పులక ననలు జాజుకొనె నిదివో ॥చూడ॥ 476

## వసంతం

పొద్దొక వింతలు యీ పొలఁతి బిన్నాణాలు
సుద్దు లేమని చెప్పేము చూడరమ్మ చెలులు ॥పల్లవి॥

వేసినది వల్లవాటు వెలఁది పయ్యదకొంగు
వూసినది కస్తూరి బుజాలదాఁక
మూసినది చెక్కు చేఁత ముసిముసి నవ్వులతో
యీసతి వొయ్యారాలు యేమని చెప్పుదమే ॥పొద్దొ॥

కట్టినది చెంగావి కడు నెరులు విరిచి
పట్టినది సేవంతి బంతి చేఁతలు
పెట్టినది విరులతో పెనచుక పెనుఁగొప్పు
ఇట్టి యీకె సింగారాలు యేమని చెప్పుదమే ॥పొద్దొ॥

మించినది మేనునిండా నిచ్చళోపు సొమ్ములు
పెంచినది కుచములు పెద్దలుగాను
అంచల శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్ను నేలె
యెంచి యీకె మురిపెము లేమని చెప్పుదమే ॥పొద్దొ॥ 477

## శంకరాభరణం

దొరతనములు చేసి దొరకొని చెనకీ
నిరతి నాకాఁగిట నీవుండఁగను ॥పల్లవి॥

కొత్తలుగా నదె కొల్లున నవ్వీ
గుత్తల గుబ్బల గొల్లెత
బిత్తరి చూపులఁ బెనఁగొనఁ జూచీ
జొత్తుల విడేల జాటు గొల్లెతా ॥దొర॥

మంకుల మాఁటలు మలయుచు నాడీ
కుంకుమ చెమటల గొల్లెత

కొంచి దవ్వులఁ జూచితె కొండలు నున్ననైయుండు
వంచెనతో మొక్కఁగాని వచ్చితే రమ్మనవే ॥ఎఱు॥
చెప్పినవే చెప్పితేను సేనలౌను మాటలు
చిప్పిల నన్నెంత తాను చిమ్మిరేఁచీనే
వుప్పు గప్పురమువలె నుండు పరికించితేను
తిప్పరాదు తనయాస తెమ్మనవే విడెము ॥ఎఱు॥
సేసినవే సేసితేను చేతికిఁ జిక్కఁ బనులు
వేసటలేక యెంత వెడ్డు వెట్టీనే
సేసవెట్టి నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు తాను
మూసిన ముత్తెమై యుండె మోవి నాకిమ్మనవే ॥ఎఱు॥ 475

## వాదరామక్రియ

చూడరమ్మా యీకొత్తలు సుదతులాల
వేడుకలన్నియు వెల్లవిరులాయ నిదివో ॥పల్లవి॥
కొండలవంటి వలపు కుప్పలయ్యే కాలమున
కొండలంతేసి చన్నులు కొమ్మకమరె
దిండుకట్టి యాసలు తీగెలుసాగే కాలాన
గుండుఁజేతుల తీగెలు కొమ్మ కొప్పె నిదివో ॥చూడ॥
చీఁకటివంటి చిత్తము చిమ్మిరేఁగే కాలమున
చీఁకటి గొనే తురుము చెలికి మించె
వేఁకమైన సిగ్గుల వెన్నెల కాలమున
మూఁక నవ్వు వెన్నెలలు మొలచె నేఁడిదివో ॥చూడ॥
పంట వండే జవ్వనము ఫలియించేకాలమున
పంటమోవి యింతికి ఫలియించెను
నంటు శ్రీవేంకటేశుతో ననిచినకాలమున
జంట పులక ననలు జాజుకొనె నిదివో ॥చూడ॥ 476

## వసంతం

పొద్దొక వింతలు యీ పొలఁతి బిన్నాణాలు
సుద్దు లేమని చెప్పేము చూడరమ్మ చెలులు ॥పల్లవి॥

వేసినది వల్లవాటు వెలఁది పయ్యదకొంగు
పూసినది కస్తూరి బుజాలదాఁక
మూసినది చెక్కు చేఁత ముసిముసి నవ్వులతో
యీసతి వొయ్యారాలు యేమని చెప్పుదమే ॥పొద్దొ॥

కట్టినది చెంగావి కడు నెరులు విరిచి
పట్టినది సేవంతి బంతి చేఁతలు
పెట్టినది విరులతో పెనచుక పెనుఁగొప్పు
ఇట్టి యీకె సింగారాలు యేమని చెప్పుదమే ॥పొద్దొ॥

మించినది మేనునిండా నిచ్చళపు సొమ్ములు
పెంచినది కుచములు పెద్దలుగాను
అంచల శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్ను నేలె
యెంచి యీకె మురిపెము లేమని చెప్పుదమే ॥పొద్దొ॥ 477

## శంకరాభరణం

దొరతనములు చేసి దొరకొని చెనకీ
నిరతి నాకాఁగిట నీవుండఁగను ॥పల్లవి॥

కొత్తలుగా నదె కొల్లున నవ్వీ
గుత్తల గుబ్బల గొల్లెత
బిత్తరి చూపులఁ బెనఁగొనఁ జూచీ
జొత్తుల విడేల జాటు గొల్లెతా ॥దొర॥

మంకుల మాఁటలు మలయుచు నాడీ
కుంకుమ చెమటల గొల్లెత

అంకులు గాజాలు నటు మొరయించీ
జంకెన బొమ్మల జాణ గొల్లెతా ॥దొర॥

చాడెల చల్లలు సారెకు నమ్మీ
కూడేటి వేడుక గొల్లెత
యీడనె శ్రీవేంకటేశ నీ వేలఁగ
తొడనె మెచ్చీ దొడ్డి గొల్లెతా ॥దొర॥ 478

**రేకు 1882** **దేసాళం**

ఎన్నిఁ గతలఁ గఱచె నీవనిత
సన్నలెల్లా దొంతి వెట్టి జట్టి సేసె వలపు ॥పల్లవి॥

చేరి వద్ద గూచుండి చెవి కింపుగా నీతో
నేరుపుల మాఁట లాడీ నెలఁత
తేరకొన మోము చూచి తీగెలు సాగఁబెట్టి
కేరికేరి నవ్వు నవ్వి కెరిలించీ వలపు ॥ఎన్ని॥

మచ్చికలు వచరించి మనసు గరఁగ నీకు
యచ్చకము లెల్లాఁ జేసీ నింతి
పచ్చిదేనియలు గార పగడవాతెర మోపి
ముచ్చటలఁ జూపి చూపి ముదిరించీ వలపు ॥ఎన్ని॥

కుంకుమ గుబ్బల నొత్తి కుచ్చి కుచ్చి కాఁగిలించి
లంకెలకు నిన్నుఁ దీసి లలన
అంకెల శ్రీవేంకటేశ యన్నిటా నన్నేలితివి
పొంకముగ మొక్కిమొక్కి పూఁచీ నీకె వలపు ॥ఎన్ని॥ 479

**పాళంగం**

ఆపె వంకఁ గడవలే దన్నియు నీమహిమలే
కాఁపురము సేసే యింతి గర్వించవలదా ॥పల్లవి॥

మన్నించి యీకెతో నీవు మంతనము లాడఁగాను
వున్నతిఁ బీఁటపైఁ బెట్టుకుండఁగాను
చన్నులంటి యప్పటిని సరసములాడఁగాను
కన్నులకలికి యీపె గర్వించవలదా ॥ఆపె॥

సారెసారె యీపె మోవిచవి నీవు గొనఁగాను
నేరుపరితనాలెల్లా నీవెంచఁగాను
కోరి మేలువాడవై గుణాలు వొగడఁగాను
గారవపు జవరాలు గర్వించవలదా ॥ఆపె॥

పచ్చిగా నీవాపెతోను పకపక నవ్వఁగాను
కుచ్చి కాఁగిటను నీవు గూడఁగాను
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కచ్చుపెట్టి చూచి కాంత గర్వించవలదా ॥ఆపె॥ 480

## బౌళి

వేవేలకు నీకు మొక్కి వేఁడుకొనేము
చేవదేరె వలపులు చిత్తగించిరావయ్యా ॥పల్లవి॥

మంతనాలఁ గొంతసేఁపు మాఁటలనే కొంతఁసేపు
యెంత జోలిఁబెట్టేవు యేమయ్యా
వంతుతో నిన్నుఁ బిలువవచ్చి తడవాయ నేము
ఇంతి నీకెదురుచూచీ నింటికి రావయ్యా ॥వేవే॥

నవ్వులనే కొంతసేఁపు నమ్మికలఁ గొంతసేఁపు
యివ్వల బరాకు నీకు నేమయ్యా
నివ్వటిల్ల విన్నపాలు నీకిన్నియుఁ జేసితివి
జవ్వని గాచుకున్నది సరుగరావయ్యా ॥వేవే॥

మేలములఁ గొంత సేఁపు మేకులనే కొంతసేఁపు
యేలాటము లెంతచూపే వేమయ్య
మేలితివి శ్రీవేంకటేశ ఇంతలో వచ్చి
బాలను మన్నించి కలకాలము రావయ్యా ॥వేవే॥ 481

## సామంతం

ఎనసిన చోటికి నిచ్చకములే మేలు
వినయములెల్లాఁ జేసి వేడుకలే చూపవే ॥పల్లవి॥

పగడవాతెర నొక్కి పతి నిన్ను వేఁడుకొనీ
మగువరో యితనితో మాఁటలాడవే
మొగమెత్తి లాలించి ముద్దుటుంగరము వెట్టీ
తగు నీచన్నులు సోఁక దండనే కూచుండవే ॥యెన॥

చేతిమీఁదఁ జేయివేసి చెప్పీ నీకుఁ బ్రియములు
నాతిరో నీవితనితో నవ్వు నవ్వవే
కాతరానఁ గాలు దొక్కి కప్పురము నీకు నిచ్చీ
ఆతుమారాఁ గాఁగిలించి యాస లీడేరించవే ॥యెన॥

పొలయలుక దేరిచి పొత్తుకు నిన్ను పిలిచీ
చెలియరో యితనితోఁ జెలరేఁగవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
తలఁచి నట్లానే యీతనితో భోగించవే ॥యెన॥ 482

## గౌళ

ఏ పరాకున నున్నాఁడో యేమి సేసీనో తాను
చేపట్టి మన్నించుఁగాని చెప్పరే యీకతలు ॥పల్లవి॥

పొలఁతి మెయి వలపులే పులకలై మొలచెను
కలసేటి కోరికలె కతలాయను

తలపోఁత లుమ్మగిలి తరచుఁ జెమటలాయ
చెలులాల విభునికిఁ జెప్పరే యీకతలు ॥ఏప॥

కామిని తమకములె గట్టి చన్నులై పెరిగె
నాముకొన్న సరసాలే నవ్వులాయను
తేమరేఁగే కరఁగులే తేనియలై మోవినూరె
చేముంచి యాతనితోడఁ జెప్పరే యీకతలు ॥ఏప॥

నొరిది నాసలు కనుచూపులై యెదురుకొనె
పెరరేఁపు నుప్పతిల్లి పిలుపులాయ
ఇరవై శ్రీవేంకటేశుఁ డిట్టె వచ్చి యింతి నేలె
సిరుల నితని కింకాఁ జెప్పరే యీకతలు ॥ఏప॥ 483

## రామక్రియ

ఇంకా నెంతసేసేనంటా నీపె గాచుకున్నదో
సంకెలేక నీపంత మిచ్చుట మెఱయవయ్యా ॥పల్లవి॥

కన్నులఁ దప్పకచూచి కలువల నిన్నువేసి
సన్నలనే నీపొందులు సాదించెఁగా
చన్నులమీఁది పయ్యెద జారఁగ సరసమాడి
ఇన్నేసిచేఁతల నిన్ను నెలయించెఁగా ॥ఇంకా॥

చక్కఁదనములు చూపి సరుసనె కూచుండి
ఇక్కువ లంటుచు నీకె యెలయించెఁగా
పిక్కటిల్లఁ బెనఁగుచు పెదవులనే నవ్వి
తక్కించి నిన్నిన్నిటాను తమ రేఁచెఁగా ॥ఇంకా॥

వింత వింత మాఁట లాడి వేడుకలు పచరించి
మంతనపు రతులను మరిగించెఁగా
యింతలో శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వంతు వెట్టుక నిన్నిట్టె వరుసఁ జొక్కించెఁగా ॥ఇంకా॥ 484

**రేకు 1883** **ముఖారి**

ఒకటి కొకటికిని వొడగాయ
సకలంబునకును సమరసమాయ ॥పల్లవి॥
కలికినెమ్మోము కళల మెరుగులకు
లలిఁ దురుము మొగులు లావాయ
తొలి తొలి వలపుల తొలుకరికాలము
వలనుగ నిదిగో వచ్చెను నేఁడు ॥ఒక॥
రమణి కంకణపురవళి వురుములకు
చెమటల సోనలు చెలరేఁగె
తమకపు టాసల తగువెదకాలము
తమలపు ముదమునఁ దలకొనె నేఁడు ॥ఒక॥
పడఁతి బొమల సురపతి చాపములకు
సడులని ప్రియముల జడి వట్టె
బడి శ్రీవేంకటపతిరతికాలము
తొడరి యింతట నెదురుకొనె నేఁడు ॥ఒక॥ 485

**రామక్రియ**

ఆతఁడేడ నీవేడ ఆసలేల సేసీవే
కాతరాన నాతఁడు కైవశమై యుండఁగా ॥పల్లవి॥
చనువులు సేసుకొవి సంగాతపుమాట లాడి
[1]యెనాసె నాపతినేల యెలయించేవే
వినయము లెల్లాఁ జేసి వేడుకలు పుట్టించి
పనిలేని పనికేల బాఁతిపడేవే ॥ఆతఁ॥
వట్టివావులఁ జెనకి వలవని నవ్వు నవ్వి
చుట్టి చుట్టి పతినేల సొక్కు రేఁచేవే

1. 'యెనసిన పతినేల', కావచ్చు

గుట్టుతోడ మోవి చూపి కొలువులో నిలుచుండి
గట్టువాయతనమునఁ గరఁగ నీకేలే ॥ఆతఁ॥

పైకొని సరసమాడి పక్కఁ బండి యంతలోనె
యీకడ శ్రీవేంకటేశు కేల లాచేవే
నీకితఁడు మేలువాఁడు నన్నిట్టె మన్నించినాఁడు
కాకరి విద్యలనేల కాఁతాళించేవే ॥ఆతఁ॥ 486

## మాళవిగౌళ

[1]కంటిఁగంటి మిదె కలిగె మాపాలిట
యింటి వేలుపై యేలీ వీఁడె ॥పల్లవి॥

శ్రీ నరసింహుఁడు చిన్మయ రూపుఁడు
నానామహిమల నాటరుఁ(కుఁ?) డు
దానవాంతకుఁడు దైవశిఖామణి
పూని యహోబలపురపతి వీఁడే ॥కంటి॥

పరమ పూరుషుఁడు ప్రహ్లాదవరదుఁడు
హరి లోకోన్నతుఁ డనంతుఁడు
దురిత విదారుఁడు దుష్టభంజకుఁడు
సిరుల నహోబలశ్రీపతి వీఁడే ॥కంటి॥

చెలువుఁడు వరదుఁడు జీవాంతరాత్మ్ముఁడు
నిలిచె శ్రీవేంకట నిధియందు
బలువుఁడు సులభుఁడు భక్తరక్షకుఁడు
లలి నహోబలవిలాసుఁడు వీఁడే ॥కంటి॥ 487

1. ఇది యొక అధ్యాత్మ సంకీర్తన

## లలిత

సరసుఁడ వవుదువు జాణ వవుదువు
యిరవైన పనులు మీరిద్దరికిఁ దగును ॥పల్లవి॥

కళలు మోమున నిండె కన్నులఁ జెంగావి మించె
సెలవులఁ జిరునవ్వు చిమ్మిరేఁగెను
యెలమి నేకతమున నింతి నేమిసేసితివో
వులివచ్చి సిగ్గులను వోలలాడీని ॥సర॥

చెమట చెక్కులఁ గారె చిత్తము సంతసమందె
తమి మేనఁ బులకలు దైవారెను
రమణితో నీవెంత రతిసాము సేసితివో
తిమురుచు సంతోసాన తెప్పలఁ దేలీని ॥సర॥

మోవిపైఁ దేనియ లూరె ముచ్చటలు నోరికబ్బె
పూవులు కొప్పున నుండి పొందుగ రాలె
శ్రీవేంకటేశుఁడు కాంతఁ జెంది యం(యెం?) త చేసితివో
వేవేలు వేడుకలను వినోదించీని ॥సర॥ 488

## రామక్రియ

పడఁతులాల సోబానఁ బాడరమ్మా
అడరి పెండ్లాడీని అహోబళేశుఁడు ॥పల్లవి॥

యెదురుఁ గొండలమీఁద యిందిరాఁ దానుఁగూచుండి
మదనకళలు రేఁగ మాఁటలాడి
పదిలపుఁ జూపులనే బాసికము గట్టుక
అదివో పెండ్లాడీ నహోబలేశుఁడు ॥పడఁ॥

కను సన్నల మెల్లనె కాఁగిటికిఁ జేరి చేరి
చెనకుల నవ్వులనే సేసలు చల్లి

వెనుకొని మోవులను విందులు వెట్టుకొంటాను
అనిశముఁ బెండ్లాడీ నహోబళేశుఁడు ॥పడ॥

సందడింపు వేడుకల సమరతులనుఁ గూడి
కందున పెండ్లి పీఁటైన గద్దె మీఁదను
అందమైన శ్రీవేంకటాద్రి గరుడాద్రిని
అందుకొని పెండ్లాడీ నహోబళేశుఁడు ॥పడ॥ 489

**శంకరాభరణం**

[1]ఇహపరములకును యేలికవు
బహురూపంబుల ప్రహ్లాదవరదా ॥పల్లవి॥

వేయిగరంబుల వివిధాయుధంబుల
దాయల నడఁచిన దైవమవూ
నీయందు నున్నవి నిఖిల జగంబులు
పాయక మమ్మేలు ప్రహ్లాదవరదా ॥ఇహ॥

కదిమి దుష్టులను గతము సేసితివి
త్రిదశులఁ గాచిన దేవుఁడవు
వదల కిందరికి వరము లొసంగఁగ
బ్రదికితి మిదివో ప్రహ్లాదవరదా ॥ఇహ॥

శ్రీ వల్లభుఁడవు చిత్తజగురుఁడవు
కావలసినచోఁ గలుగుదువు
శ్రీవేంకటాద్రిని శ్రీయహోబలానను
భావింతు నీమూర్తి ప్రహ్లాదవరదా ॥ఇహ॥ 490

1. ఇదియు అధ్యాత్మ కీర్తనయే. 2. ఇదియు అధ్యాత్మ కీర్తనయే.

**రేకు 1884** **రామక్రియ**

[1]కలశాపురముకాడ కందువతోటలనీడ
వెలయుచు నున్నవాఁడు వీఁడె హనుమంతుఁడు॥పల్లవి॥

తాటించి పండ్లగొల దాపరి చేతఁ బట్టక
వాటమై దైత్యులఁ గొట్ట వలచె యెత్తి
గాఁటాన శిరసుపైకి గక్కనఁ దోఁక నిక్కించి
యేటిమై నిలుచున్నాఁడు మించి హనుమంతుఁడు॥కల॥

బాలసూర్యబింబమును పండుగాను భావించి
చాలుకొనఁ బాదముల జంగ చాఁచి
కోలుముందుగా సత్వ గూడ నుర ముబ్బించి
నేలా మిన్నూ మోచినాఁడు నిండి హనుమంతుఁడు ॥కల॥

మించిన ప్రతాపమున మొగము బిగించుకొని
అంచెల నన్నిటాను జయమునఁ బొంది
యెంచఁగ శ్రీవేంకటేశు కితవరి దాసుఁడై
మంచి వరము లిచ్చీని మాకు హనుమంతుఁడు ॥కల॥ 491

**బౌళి**

[1]మూఁడు మూరుతులకెల్ల మూల మీతఁడు
వీఁడె పెక్కు మహిమల విట్టలేశుఁడు[2] ॥పల్లవి॥

గోవరుదన మెత్తిన గోవిందుఁ డీతఁడు
గోవులఁ గాచిన యట్టి గోవాళుఁడు
భావించు సురలపాలి పారజాత మీతఁడు
వేవేలు మహిమల విట్టలేశుఁడు ॥మూఁడు॥

---

1. ఇదీ అధ్యాత్మ కీర్తనయే. 2. 'విఠల' అనియే రేకు

చక్కని గొల్లెతలకు జారపురుషుఁడీతఁడు
అక్కజపు వెన్నలకు నాసోదకాఁడు
పక్కన ద్రౌపదిఁగాచే పాచిక విద్య యీతఁడు
వెక్కసపు మహిమల విట్ఠలేశుఁడు ॥మూఁడు॥

బలువుఁడు పాండవపక్షపాతి యీతఁడు
వలసిన వారికెల్లా వరదుఁడు
అలరి శ్రీవేంకటేశుఁడై పొడచూపె నీతఁడు
వెలసిన మహిమల విట్ఠలేశుఁడు ॥మూఁడు॥492

**లలిత**

దొరతనము సేసెఁ దుంగభద్రాతటమున
సిరుల సుగ్రీవనర [1]సింహదేవుఁడు ॥పల్లవి॥

ఇందిరనుఁ దొడమీఁద నిడుకొని
పొందులసన్నల లోలోఁబొసఁగుకొని
అంది సరసపు మాఁ టలాడుకొని
చెంది నవ్వీ నిదె నరసింహదేవుఁడు ॥దొర॥

అదె పెండ్లి కూఁతురుఁ దానలముకొని
సదరాన మోవితేనె చవులుగొని
మదనకేలి యీపెతో మరుగుకొని
చెదరకున్నాఁడు నరసింహదేవుఁడు ॥దొర॥

దేవులుఁ దానుఁ దెప్పలఁదేలుకొని
వోవరిలో సంతోసాల నొనరుకొని
శ్రీవేంకటాద్రిమీఁద జెలఁగుకొని
చేవమీరి చొక్కీ నరసింహదేవుఁడు ॥దొర॥ 493

[1] 'సింహ్వా' అనియే రేకు

## సాళంగనాట

వినయాలు సేసేవు వేంకటేశుఁడ
వెనువెంటఁ బాయక వేంకటేశుఁడ ॥పల్లవి॥

విరుల వేసే వదేమో వేంకటేశుఁడ
వెరగయ్యీ నీ చేతఁకు వేంకటేశుఁడ
విరివాయ నీసుద్దులు వేంకటేశుఁడ
అరుదుగ వింటిమోయి అన్నీ వేంకటేశుఁడ ॥విన్న॥

వేడుకకాఁడ వౌదువు వేంకటేశుఁడ
వీడుదోడాడేవు మాతో వేంకటేశుఁడ
వీడెపు మోవి నవ్వేవు వేంకటేశుఁడ
జాడలెల్లా గంటిమోయి సారె వేంకటేశుఁడ ॥విన॥

వేసాల వాఁడవుగదో వేంకటేశుఁడ
వేసారవు రతులను వేంకటేశుఁడ
వేసేవు నాపైఁ జేయి వేంకటేశుఁడా నన్ను
సేసవెట్టి పెండ్లాడేవు శ్రీవేంకటేశుఁడా ॥విన॥ 494

## మాళవిగౌళ

శరణు శరణు నీకు జగదేకపతి కృష్ణ
వరము నొసఁగవయ్యా వాసుదేవ కృష్ణ ॥పల్లవి॥

మద్దులు విరిచినట్టి మాధవ కృష్ణ
సుద్దులు చెప్పవయ్యా అచ్యుత కృష్ణ
వొద్దు రాఁగదవయ్యా ఉపేంద్రకృష్ణ
ముద్దులు గురియవయ్యా ముకుందకృష్ణ ॥శర॥

గొల్లెతల మరిగిన గోవింద కృష్ణ
చెల్లునయ్యా నీచేఁతలు శ్రీధరకృష్ణ

అల్లన దొంగాడవయ్య హరికృష్ణ
మల్లుల గెలిచినట్టి మధుసూదన కృష్ణ ॥శర॥
గోవులఁగాచినయట్టి గోపాలకృష్ణ
కైవశమై మమ్మేలు శ్రీకరకృష్ణ
నా విన్నపమాలించు నారాయణ కృష్ణ
సేవకుఁడఁ జామ్మీ నీకు శ్రీవేంకటకృష్ణా ॥శర॥ 495

## ఆహిరినాట

త్రివిక్రమమూర్తియైన దేవునివలె నున్నాఁడు
భువి సేవించేవారిపాలి పుణ్యఫల మీతఁడు ॥పల్లవి॥
అంచె నుదయాస్త గిరులందు నొక జంగ చాఁచి
వంచించక మిన్ను దాఁక వాలమెత్తి
ముంచి బ్రహ్మలోకము మోవఁగఁ బ్రతాపమున
పెంచినాఁడు తనమేను పెద్దహనుమంతుఁడు ॥త్రివి॥
తిరముగ హస్తములు దిక్కులు నిండఁ బరపి
వరుసఁ గర్ణము లిరువంకఁ జిక్కించి
దుర దుర మస్తకము ధ్రువమండలము సోఁక
పెరిగినాఁ డిదివో పెద్దహనుమంతుఁడు ॥త్రివి॥
అక్కజపు రోమము లన్నిలోకము లొరయ
మొక్కుచు శ్రీవేంకటేశుమోహపు బంటై
పక్కన నజాండ కప్పరము నిండాఁదాను
పిక్కటిల్లినాఁడిదివో పెద్దహనుమంతుఁడు ॥త్రివి॥ 496

రేకు.1885

## దేసాళం

ఏమిసేతురా నామనసు యెంతైనాఁ బట్టఁగలేను
కామించిన దాననై కడుఁ గొసరేఁగాక ॥పల్లవి॥

సేసవెట్టిన పతివి చేరి నన్ను మఱచేవా
పాసివుండనోపక పదరేఁగాక
నా సొమ్మయినవాఁడవు నన్ను నీవు యెడసేవా
[1]ఆసలాసలను నీకు నేఁకరేఁగాక ॥ఏమి॥

చేపట్టినవాఁడవు చిత్తానఁ బెట్టకుండేవా
ఆఁపలే కెచ్చరించి మాఁటాడేఁగాక
నాపొందు సేసేవాఁడవు నాకు వింతయయ్యేవా
తీపుల నీమోవి చూచి తిమిరేఁగాక ॥ఏమి॥

సేవగొనేటి వాఁడవు చేసన్నకు లోనుగావా
కావరపుఁ దమితోడఁ గదిమేఁగాక
నావాఁడవైవాఁడవు నన్నిప్పుడు గూడవా
శ్రీవేంకటేశుఁడ బత్తిఁ జెనకేఁ గాక ॥ఏమి॥ 497

**బౌళి**

ఇట్టి నీమగని సుద్దు లెంతని చెప్పేమమ్మ
వొట్టుకొని వురముపై నుండవమ్మ ఇఁకను ॥పల్లవి॥

కలికి తనవు నీకనుచూపు లంటాను
కలవ దండలు మేనఁ గప్పుకొనును
పలచని మోవితేనె పలుకులేయంటాను
చిలుకలు సారెసారెఁ జేరి మాఁటాడించును ॥ఇటి॥

చక్కని నీ సొబగైన నీచనుగుబ్బలంటాను
పక్కన నిమ్మపండు చేఁబట్టి చూచును
అక్కజమయిన నీయందపుఁ జేఁతలంటాను
నిక్కి నిక్కి యద్దముల నీడలు చూచును ॥ఇట్టి॥

1. 'ఆసలాసలను నీకు యాఁకరేఁగాక' అని యుండవచ్చునేమో? లేకున్న యతి భంగము

నినుపుఁ గాంతులతోడి నీ కొప్పు నెరులంటా
మునుకొని నీలాలసొమ్ములే పెట్టును
యెనసె నిన్ను శ్రీవేంకటేశుఁ డిట్టె యిందాఁకా
నిను వ్రాసిన రూపము నీవంటా మాఁటాడును ॥ఇట్టి॥ 498

## ఆహిరి

సరసుఁడ వన్నిటాను చతురుఁడవు
తరుణి నీకు మేలుది దయఁజూడఁదగును ॥పల్లవి॥

తలపోసి తలపోసి తనలోనె నవ్వు నవ్వు
చెలి నీసుద్దు లడిగి చెమరించును
సొల్లసి నీకెదురులు చూచి నివ్వెరగందు
కలఁతెల్లాఁ జెప్పితిమి కరుణించఁదగును ॥సర॥

చేతులెత్తి యెత్తి మొక్కు సిగ్గువడు నంతలోనె
దూతికల నీకు నెదురుగా నంపు
రాతురులు వేగించు రతులకు నాసపడు
కాతరాన నున్న యింతిఁ గరుణించఁదగును ॥సర॥

పిలిచి పిలిచి నీకుఁ బ్రియములు సారెఁ జెప్పు
అలరఁగ వ్రాసి లేకలంపు నీకును
యెలమి శ్రీవేంకటేశ యింతలోనె వచ్చి కాంత
గలసితి విట్లానే కరుణించఁ దగును ॥సరు॥ 499

## భైరవి

మచ్చరవు దానఁగాను మన్నించు చిత్తానఁ బెట్టి
మచ్చికలు రేఁచి నిన్ను మరుగుదుఁగాని ॥పల్లవి॥

చనవుగలదంటాను సాదించనేను
ననపు గలదంటాను నాటించ గోరు

మనసెరుఁగుదునంటా మందెమేళము సేయను
వినయముతోడుతను వేడుకొందుఁగాని ॥మచ్చ॥

పంతగత్తెనంటాను బలిమి చూపను నేను
అంతరంగురాలనంటా నట్టె సొలయ
యింతటి దాననంటాను యెమ్మె నెరప
చెంతనుండి వావి చెప్పి చెనకుదుఁగాని ॥మచ్చ॥

చుట్టపు దాననంటాను సొలయనేను
దిట్టనంటా మొక్కలాన దీకొన నేను
యిట్టె శ్రీవేంకటేశ నన్నేవితివంటా గర్వించ
పట్టపు దేవులనై నీ బడినుందుఁగాని ॥మచ్చ॥ 500

## వరాళి

వలపు దాఁచవచ్చునా వడి నెవ్వరికైనాను
కలికాలమును నిట్టె కాఁపురాలు సేయవే ॥పల్లవి॥

తనివారా నాతని దగ్గర గూచుండవే
గునియుచునేల సిగ్గున నుండేవు
మనసారా వొకమాటే మాఁటలెల్లా నాడవే
గొనకొని వీవేల గుక్కుకొనేవు ॥వల॥

కన్నులారాఁ దేరకొవ గక్కనఁ జూడవే
సన్నలా చాయలా నేల జాలిగొనేవు
చన్నులారా నాతని చరణము నొత్తుకోవే
చెన్నుమీర లోలోనేల చిమ్మిరేఁగేవు ॥వల॥

చేతులారా వేడుకతో చేరి కాఁగిలించుకోవే
కాతరించి రతినేల కడుఁగొంకేవు

ఆతునూరాఁ గూడె నిన్ను నదె శ్రీవేంకటేశుఁడు
నాతో నెంత నీవు యిఁక నవ్వుతాఁ జెప్పేవు ॥వల॥ 501

## సామంతం

ఇన్నీ నీవే యెఱుఁగుదువు యేమని చెప్పేము నేము
నిన్నిందరూఁ బొగడేరు నేరుతువే చెలియా ॥పల్లవి॥

మచ్చికలు చూపి పతిమనసురా మాఁటలాడి
యిచ్చకమే సేయవలె నింతులకును
మెచ్చఁ గొలువులు సేసి మేలములు వచరించి
ముచ్చటలనే కడు మోహింపించవలెను ॥ఇన్నీ॥

కన్నులఁ దప్పకచూచి కానుకలు చేతికిచ్చి
సన్నలనే నవ్వవలె సతులకును
తిన్నఁగా మొక్కులు మొక్కి తేనెమోవినే గొసరి
విన్నపముల నేరుపు లెలయించవలెను ॥ఇన్నీ॥

అంగములు సోఁకించి ఆయములు గరఁగించి
సంగతితో నుండవలె సతులకును
యింగిత మెరిఁగి నిన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
రంగుగ నీ స ౹వినే రమియించవలెను ॥ఇన్నీ॥ 502

రేకు 1886

## రామక్రియ

[1]రాముఁ డీతఁడు లోకాభిరాముఁ డీతఁడు
కామించిన విభీషణుఁ గాచినవాఁ డీతఁడు ॥పల్లవి॥

శ్రీదైవారినయట్టి సీతారాముఁ డీతఁడు
కోదండ దీక్షా గురుఁ డీతఁడు

---

1. ఇది అధ్యాత్మ కీర్తనలలో నుండదగినది.

మోదమున నబ్ధి యమ్ముమొనకుఁ దెచ్చె నీతఁడు
పాదుకొని సుగ్రీవు పగ దీర్చె నీతఁడు ॥రాము॥

ఘోర రావణుని తలగుండు గండఁడీతఁడు
వీరాధి వీరుఁడైన విష్ణుఁ డీతఁడు
చేరి యయోధ్యాపతియై చెలఁగినవాఁ డీతఁడు
ఆరూఢి మునుల కభయము లిచ్చె నీతఁడు ॥రాము॥

తగ నందరిపాలిటి తారకబ్రహ్మ మీతఁడు
నిగమములు నుతించే నిత్యుఁ డీతఁడు
జగములో శ్రీవేంకటేశ్వరుఁడైనవాఁ డీతఁడు
పగటున లోకమెల్లాఁ బాలించె నీతఁడు ॥రాము॥ 503

## గౌళ

ఇంతిరో పాయపువారి ఇంపు లిటువంటివి
మంతనపు వేడుకలు మర్మములు సోఁకించు ॥పల్లవి॥

మతిలోని తమకము మచ్చికలు పుట్టించు
సతతము సంగాతము చవులు రేఁచు
అతిసరసము గడు నాసలకు లోనుసేసు
రతి వినోద మెపుడు [1]రచ్చలఁ బొందించును ॥ఇంతి॥

కొనగోరి చెనకులు గుబ్బతిల్లుం(లిం?) చు మనసు
కనుచూపులు చుట్టరిక మంటించును
పెనఁగులాటలు లోలో బెరశించుఁ బంతములు
ననుపు లెల్లకాలము నమ్మికలు నెరపు ॥ఇంతి॥

---

1. రచ్చలు = (ఇక్కడ) ఉత్సాహములు కావచ్చు.

జవ్వనపు మదములు సరివెనఁగింపించు
నవ్వు లట్టె వలపులు నాము లెక్కించు
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నేలినాఁడు
మవ్వపు వినయములు మరుఁగఁగఁ జేయును ॥ఇంతి॥ 504

## వరాళి

చెప్పఁ జెప్పఁ గొత్తలాయ చెలియ నీ సొబగులు
కుప్పలుఁదెప్పలునై గురుతులు మీరెనే ॥పల్లవి॥

కన్నులపండుగ గదే కలికి నీరూపము
జన్నె పాఁడిగదే నీచక్కని మోవి
వెన్న (న్నె?)ల తేటలుగదే వేడుక నీనవ్వులు
వన్నెగా నిన్నుఁ బొందినవాఁడే భాగ్యవంతుఁడే ॥చెప్ప॥

ముంగిట ముగ్గులు గదే ముదిత నీ సింగారము
తంగేటి జున్ను గదే దంట మాఁటలు
కొంగుఁ బాలు గదవె పూఁటవూఁట నీసిగ్గులు
అంగన నిన్నేలేవాఁడు అతిభాగ్యవంతుఁడే ॥చెప్ప॥

పెట్టెలో సొమ్ము గదవే ప్రియురాలు నీవయసు
కట్టిన ముడుపుగదే కాఁగిటి రతి
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
దట్టమై నీపాలివాఁ డితఁడే భాగ్యవంతుఁడే ॥చెప్ప॥ 505

## మంగళకౌశిక

ఎఱఁగ మిన్నాళ్లదాఁకా నిటువంటి మీ పొందులు
మెఱసి యెప్పుడూ నాకు మేలువాఁడవు నీవు ॥పల్లవి॥

వలవని వేసాలతో వావులెల్లాఁ జెప్పీని
సొలసి సొలసి యీపె చుట్టమా నీకు

పలుమారు నీతోడ పచ్చిగానే నవ్వీని
తొలుతనే తనకాలు దొక్కితివా నీవు ॥యెఱ॥

చనవు సేసుక వచ్చి సరసము లాడీని
గొనకొని మేనమామ కూఁతురా నీకు
చెనకి చెనకి నిన్ను జె(జి?) మ్మిరేఁచీ మాఁటలను
వనిత కేమైనాను వలతువా నీవు ॥యెఱ॥

కప్పురము నోరికిచ్చి కాఁగిలించ (త?) లిచ్చీని
చెప్పరానఁ బట్టపు దేవులా నీకు
యిప్పుడు శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
చెప్పరాని బాసలెల్లాఁ జేసితివా నీవు ॥యెఱ॥ 506

## కేదారగౌళ

ఎటువంటి పొందులో మీ యిద్దరికిని
తటుకన మాకు నేఁడు తారుకాణ లాయను ॥పల్లవి॥

ముసి ముసి నవ్వులతో ముచ్చట చెప్పీ నాకె
విసుగక చెవులారా వినవయ్యా
కొసరుచుఁ జెలి నిన్నుఁ గొంగువట్టి పెనఁగీని
సుసరాన లోనైతే సూటికి రావయ్యా ॥ఎటు॥

సిగ్గులు వడక నిన్నుఁ జెక్కు నొక్కి వేఁడు కొనీ
దిగ్గన నందుకు సమ్మతించవయ్యా
వెగ్గళపుఁదమి తోడ వీడెము నీకిచ్చీని
వొగ్గి యందుకొని సేవవొప్పు గొనవయ్యా ॥ఎటు॥

వెక్కసముగా నీకు వినయాన మొక్కీని
చొక్కుచు మోము దప్పక చూడవయ్యా

యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తక్కక యాకె చెనకీ తప్పించుకోవయ్యా ॥ఎటు॥ 507

## సాళంగనాట

ఏడ నుండెనో తాను యిన్నాళ్ల దాఁకా
యీడు జోడయిన సుద్దు లీతని నడుగరే ॥పల్లవి॥

పూసగుచ్చినటువలె పొలఁతి మాఁటలాడీని
వేసర దెంతైనాను విభునితోను
రాసివోసినటువలె రవళితో నవ్వు నవ్వీ
యీసుదతి [1]యెవ్వతెని యీతని నడుగవే(రే?) ॥ఎడ॥

వడ్డి కిచ్చినటువలె వచ్చి వచ్చి కొసరీని
వొడ్డారాలు నెరపుతా నూరకె తాను
దిడ్డి దీసినటువలె తేరకొనఁ జూచీని
యెడ్డ యిది యెవ్వతెని యీతని నడుగరే ॥ఏడ॥

గంపఁ గమ్మినటువలె కాఁగిట బిగించీని
చెంపల చెమటలతో సిగ్గువడదు
దింపక నన్నేలినాఁ డిదివో శ్రీవేంకటేశుఁడు
యింపుల ని౦వ్వతెని యీతని నడుగరే ॥ఎడ॥ 508

**రేకు 1887** **ఆహిరి**

ఏల తమకించేవే యింతిరో నీవు
వాలాయించి యెప్పుడూ నీవద్దనున్నాఁ డితఁడు ॥పల్లవి॥

చిన్నఁబోయి యుండకువే చెలియ నీవు
మన్నించీ నాతఁడు నిన్ను మచ్చికతోను

1. యెవ్వతే+అని

యిన్నేసి నివ్వెరగులు యేఁటికే నీకు
పన్ని యెప్పుడూ నీపై బత్తిగలఁ డితఁడు ॥ఏల॥

తల వంచుకొనకువే తరుణి నీవు
పిలువక తొల్లే వచ్చీఁ బ్రియముతోను
యెలమిఁ జెక్కిటి చెయ్యేఁటికే నీకు
మలసి యెప్పుడూ నీకు మరిగినాఁడితఁడు ॥ఏల॥

వసివాడకువే లోలో వనిత నీవు
యెసగ శ్రీవేంకటేశుఁ డేలెను నిన్ను
యిసుమంత చిరుసిగ్గు లేఁటికే నీకు
వసమై యెప్పుడూ నీకు వలచినాఁ డితఁడు ॥ఏల॥ 509

## దేవగాంధారి

ఇవిగో నీ చెలిసుద్దు లిఁకఁ గరుణించవయ్యా
వివరముగా విన్నవించితిమి నీకు ॥పల్లవి॥

తలపోఁతఁ గొంతవడి తరుణి పొద్దు గడపు
చెలులతోఁ గొంతువడి చెప్పుఁ గతలు
నెలకొని కొంతవడి నీరూపు పటాన వ్రాసు
నిలుచుండి కొంతవడి నీకెదురు చూచును ॥ఇవి॥

నేరుపుతోఁ గొంతవడి నీమీఁది పాటలు వాడు
కూరిములఁ గొంతవడి గుబ్బతిలును
పారితెంచి కొంతవడి బయలు గాఁగిట నించు
సారెఁ గొంతవడి లోలో సరసములాడును ॥ఇవి॥

నెట్టుకొని కొంతవడి నిన్నుఁ బేరుకొని పిల్చు
అట్టె కొంతవడి నీకు నాసపడును

గుట్టున శ్రీవేంకటేశ కూడితి వింతలో వచ్చి
గట్టిగాఁ గొంతవడి నీగరిమ లడుగును ॥ఇవి॥

### గౌళ

చెప్పితిఁ జూమ్మి నీకు, చెలికత్తె నే నాపెకు
యెప్పుడూను మఱవకు యీగురుతు లిపుడు ॥పల్లవి॥

చేరఁడేసి కన్నులాపె సెలవుల నవ్వులాపె
మూరెఁడు గొప్పాపె నీకు మొక్కితే నని
తోరపుఁ బిరుఁదులాపె తొండపుఁ దొడలయాపె
తారుకాణలైపొందు దలఁచుకొమ్మనెను ॥చెప్పి॥

పట్టెఁడేసి గుబ్బలాపె పలచని మోవియాపె
అట్టె నీపరిణామ మడుగుమనె
జొట్టెఁ డేశడుగులాపె సోయగపుఁ జేతులాపె
చుట్టరికపు వావు లెంచుకొమ్మనె నిన్నును ॥చెప్పి॥

కొడిఁగెఁడు మొగమాపె కోమలపు మేనియాపె
అడరి నీవు తన్నుఁ బెండ్లాడితివని
పిడికెడు నడుమాపె పెనఁగి శ్రీవేంకటేశ
యెడయక ఇట్లానె యేలుకొమ్మనెను ॥చెప్పి॥ 511

### లలిత

ఆపె నీకు మేలుది నీవాపెపై బత్తిగలవు
చేపట్టి కరుణతోడఁ జిత్త గించవయ్యా ॥పల్లవి॥

వెలఁది మాఁటలు నీకు విన్నపము సేసితివి
సొలసి గురుతు లెల్లాఁ జూపితిమి
పిలిచితి మింటికిని ప్రియములు చెప్పితిమి
అలరి మారుత్తరము లానతియ్యవయ్యా ॥ఆపె॥

కమ్మటి నాకె యంపిన కానుకలు నిచ్చితిమి
ముమ్మాటి దాఁకా నీకు మొక్కితిమి[1]
నెమ్మది నీబాసలు నీకుఁ దలఁపించితిమి
యిమ్మల నీచిత్త మిఁక నెట్టున్నదయ్యా ॥ఆపె॥

చుట్టపు వరుసలెల్లా సొంపుగాఁ దెలిపితిమి
బెట్టుగా నాపెచే సేస వెట్టించితిమి
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి; తా సిగ్గుతో
గుట్టున నున్నది తనగుణము మెచ్చవయ్యా ॥ఆపె॥ 512

## శంకరాభరణం

కాదనేనా నేనిన్ను కన్నులారాఁ జూచితి
పొదిసేసి నన్ను నెట్టు బుజ్జగించేవయ్యా ॥పల్లవి॥

విన్నపములు వింటివి వీడె మింతి కిచ్చితివి
పన్నుక నన్నెంత వొడఁ బరచేవయ్యా
సన్న సేసితి వాపెతో సరసమూ నాడితివి
చన్నులంటి నాతో నేమి సరి వెనఁగేవయ్యా ॥కాద॥

తప్పక చూచితి వాపె దగ్గరఁ గూచుండితివి
అప్పటి నా పొందుసేసే వది యేమయ్యా
కొప్పు దువ్వి పెట్టి కాంతకొంగు వట్టుకున్నాడవు
ముప్పిరి నాకిట్టె యెంత మోవి యిచ్చేవయ్యా ॥కాద॥

పొసఁగ నవ్వితి వాపె పొత్తుకుఁ బిలిచితివి
కొసరి నన్నెంత వేఁడుకొనేవయ్యా

1. ముమ్మారు, మొక్కుట, ముమ్మాటికి మొక్కుట సహజమేకాని "ముమ్మాటి దాఁకా" అనుట వింత, వడగల సంప్రదాయమేమైన చొప్పించినాడా? అని సందేహము.

యెసగ శ్రీవేంకటేశ యేలితివి మమ్మిద్దరి
రసికుఁడ వలపెంత రచ్చ వేసేవయ్యా ॥కాద॥ 513

**బౌళి**

ఆయనాయ నీసుద్దులు అన్నియుఁ గనుఁగొంటిని
పాయపుమదానవేల బయలీఁదించేవు ॥పల్లవి॥

సేవంతి విరుల వేసి చెలికొంగువట్టి తీసి
వావులు చెప్పుతా నెంతవడి నవ్వేవు
నీవూ నాపె చుట్టాలవుత నేనది యెఱఁగనా
యివల నాముందర నీవెంత పచారించేవూ ॥ఆయ॥

చెక్కు కొనగోర నూఁది చిమ్మి తమ్ముల మొసఁగి
మక్కువ నించి యందు కా మాటలాడేవూ
అక్కరతో నాఁడే మీయడియాలలు చూడనా
యిక్కడ నాకేల నీవు యెమ్మెలు చూపేవూ ॥ఆయ॥

కాలుదొక్కి యంతలోనే కాఁగిటను బిగియించి
వేలువట్టుకొని యిట్టె వేఁడుకొనేవు
మేలిమి శ్రీవేంకటేశ మీ గుణాలు వినమా
యేలితివి న"న్ను మీలో యింపులుఁ జూపేవూ ॥ఆయ॥ 514

**రేకు 1888** **సాళంగనాట**

ఏమని పొగడవచ్చు నిదివో నీదేవులను
ఆముకొని చక్కఁ జూడ నవధరించవయా ॥పల్లవి॥

పొలఁతి చిరునవ్వులు పున్నమ వెన్నెలపొళ్లు
కలికి కనుచూపులు కన్నెలేళ్లు
మలయు మోవితేనెలు మరుని గుజ్జనగూళ్లు
అలరి యీకె పొందులు అవధరించవయా ॥ఏమ॥

గరిమనాడే మాటలు కప్పురపుమూటలు
పరగుఁ జక్కఁదనాలు బండిబాటలు
తెరమరఁగు సిగ్గు లొద్దికఁ బెట్టనికోటలు
అరిముఠి వేడుకతో నవధరించవయా ॥ఏమ॥

చెక్కుమీఁది చెనకులు సింగారపుఁగళుకులు
నిక్కుఁగొంతులు పైఁడి వన్నె తళుకులు
ఇక్కువ శ్రీవేంకటేశ యీకెనిట్టె యేలితివి
అక్కజనపు సరసము లవధరించవయా ॥ఏమ॥ 515

## పాడి

కానీలేవే యందుకేమి కంటిమి నీజాడలెల్లా
నానేరుపు లెఱఁగవా నావాఁడాయ నితఁడు ॥పల్లవి॥

మూసిన ముత్తెమువలె ముందరను నిలుచుండి
ఆసలు వుట్టించే వేమే యతనికిని
పూస గుచ్చినటువలె పొసఁగఁగ మాఁటలాడి
లాసిలాసి యతని మెల్లనె దక్కఁగొంటివే ॥కానీ॥

వనము కోవిలవలె వరుసఁ బాటలు వాడి
మనసు గరఁచే వేమే మగవానిని
పెనచి యటువలె పీఁటమీఁదఁ గూచుండి
చెనకి చెనకి లోను చేసుకొంటివే ॥కానీ॥

పాయని చుట్టము వలె పక్కఁ బండి యీతని
మాయలఁ బెట్టేవేమే మాఁటి మాఁటికి
యీయెడ శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁ గూడె
చాయలా సన్నలా నీవూఁ జవులు చూపితివే ॥కానీ॥ 516

## సామంతం

చిత్తగించు మగువను సిగ్గులు వడక నీవు
హత్తి బాగాలు చేతికి నంది యిచ్చీ నీకు ॥పల్లవి॥

జక్కవ గుబ్బలమీఁద జారినపయ్యద తోడ
నిక్కి నిక్కి చూచీని నెలఁత నిన్ను
చెక్కులఁ జెమటఁగారఁ జెంగలించుకొంటాను
యిక్కువ నుండి చేతులెత్తి మొక్కీ నీకు ॥చిత్త॥

మొలనూలు దిరిగిరా మోసేటి గంటలతోడ
లలి నీసేవలు సేసీ లలన యిదె
పెలకలు మేన నిండ బుసకొట్టు కొంటాను
పలుమారు నిట్టె విన్నపాలు సేసీ నీకు ॥చిత్త॥

కొప్పున నుండి రాలేటి గొజ్జంగ విరులతోడ
వొప్పుగ నీతో నవ్వీ నువిద
నెప్పున శ్రీవేంకటేశ నీవింతలోఁ గూడఁగాను
చెప్పరాని తలఁపెల్లాఁ జెప్పి చూపీ నీకు ॥చిత్త॥ 517

## ఆహిరి

చిత్తగించి చూడవయ్యా చెలా(ల?) రే (రేఁ?) గి దేవులను
యిత్తల నీకె సుద్దులు [1]యెన్నెని చెప్పేమయా ॥పల్లవి॥

కలికి నెమ్మొగమునఁ గాఁపుర ముండుఁ జంద్రుఁడు
వెలయ సెలవులను వెన్నెలగాయు
పలుకుల నేపొద్దు పచ్చి దేనియలుగారు
యిల నింతి చక్కఁదన మెంతని చెప్పేమయా ॥చిత్త॥

1. యెన్ని+అని

నిక్కి చనుఁగవతోడ నేస్తము సేయుఁ గొండలు
చొక్కపు మరుతూపులు చూపుల జోడు
నెక్కొని తురుమునందు నిండుఁ జీఁకట్లు గప్పు
యెక్కువ చెలిసింగారా లెంతని చెప్పేమయా ॥చిత్త॥

పడఁతి మేనిపై నెల్లా బంగారుపంటలు వండు
చిడుముడి బాదాలకు చిగురు దాపు
కడఁగి శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి విట్టె
యెడయ నీసతిభావా లెంతని చెప్పేమయా ॥చిత్త॥ 518

**బౌళి**

గక్కనఁ జెప్పవే యెన్నికతలఁ గరచితివి
చొక్కమ్ముగా నిన్నుఁ జూచి సోద్యమయ్యీ నాకు ॥పల్లవి॥

చిన్ని పెదవుల నట్టె చెప్పేవు సుద్దులెల్లా
యెన్నిక నీతనికి నీ వేమౌదువే
కన్నులఁ దప్పక చూచి కరఁగేవు మనసున
పన్నినవల పతనిపై నెంత గలదే ॥గక్క॥

మలయుచు నూడిగాలు మాపు దాఁకాఁ జేసేవే
ఇల నితనికి నీకు నెన్నటి పొందే
పెలుచుఁ జన్ను లదర పెనఁగి వేఁడుకొనేవు
చలిమి బలిమి నీకు సలిగెంత గలదే ॥గక్క॥

వాటకపు ప్రేమతోడ నవ్వు లెల్లా నవ్వేవు
యీటుతో నీయాస ఇంకా నెంతగలదే
చాలువగా శ్రీవేంకటేశ్వరుఁ డిట్టె నన్ను నేలె
చాటుననే మొక్కేవు నీసలిగెంత గలదే ॥గక్క॥ 519

## నాదరామక్రియ

వెఱవకువే నీవు వెల్దది వీని కివెల్లా
మెఱయ నొండొకటికి మిక్కిలి పొందేకదే ॥పల్లవి॥

జలజాక్షి నీమొగమే చందురుఁడై యుండఁగాను
యెలమిఁ గలువబాణా లేమిసేసీని
తళుకు నీకన్నులే తామరలై యుండఁగాను
బలిమి తుమ్మిదలు నీపైఁ బంతము చూపీనా ॥వెఱ॥

యింతి నీ జవ్వనవన మిట్టె నీమై నుండఁగాను
చెంతఁ గోవిలేఁటికిఁ జిమ్మిరేఁచీనే
మంతనపు నీపెఱుఁదే మరురథమై యుండఁగా
రంతుల చిలుక లేమి రవ్వ సేసీనే ॥వెఱ

అందపుఁ జన్నులు కొండలై నీకు నుండఁగాను
మందానిలుఁడేల మారుకొనీనే
యిందు నిట్టె శ్రీవేంకటేశుఁడు నిన్నేలఁగాను
కందువఁ జిత్తజుఁ డిట్టె కాకు సేసీనా ॥వెఱ॥ 520

రేకు 1889

## శ్రీరాగం

ఇటువంటి మనోరథా లింతికి సఫలమాయ
తటుకన నీపె నిట్టె దయఁజూడవయ్యా ॥పల్లవి॥

తలపోసు నీతోడి తనుభోగములు చెలి
మలయుచు నూరకే మాఁటలాడును
చిలుకు కొనగోరను చిమ్ము నిన్ను భావించి
తలిరుఁ జేతుల నీతముల మడుగును ॥ఇటు॥

బయలు గాఁగిట నించు పక్కనే ఉన్నాఁడవంటా
ప్రియములు చెప్పు నినుఁ బేరఁ బిలుచు
నియతిఁ బరపు చూచి నీవని పాదము చాచు
నయగారి తనాల సన్నలుసేసి కొసరు ॥ఇటు॥

సేసవెట్ట నుంకించు సిగ్గువడు నంతలోనే
ఆసతో నవ్వు రతికి నట్టె కొసరు
చేసూటి నంతలో వచ్చి శ్రీవేంకటేశ కూడితి
నీసుద్దు లెల్లాఁ దెలిసి నిక్కముగా మెచ్చును ॥ఇటు॥ 521

## పాడి

గుఱుతులెల్లాఁ గంటిమి గుట్టు సేయ నిఁకనేల
మఱఁగులు వెట్టకిఁక మాతోఁ జెప్పవయ్యా ॥పల్లవి॥

చెలియ ముడుచుకొన్న చెంగలువ పువ్వులు
యెలమి నీకొప్పులోని కేల వచ్చెను
పొలుపుగాఁ జన్నులపై బూసిన గందము నీమై
వెలయఁగ నంటుకొన్న విధ మానతీవయా ॥గు॥

ఆకాంత గట్టుకొన్న యట్టి చంద్రగా (కా?) వి చీర
నీకు దట్టియైనట్టి నెప మేఁటిది
మేనాని యాపెపాదాల మించులును మెట్టెలును
యీకాడ నీవేళ్లనున్న దిదేమి చెప్పవయా ॥గు॥

సుదతి చెవిలోనున్న సొంపైన తట్టుపుణుఁగు
చెదరి నీపచ్చడానఁ జెందియున్నది
అదన శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
పొదలీ మోము కళలు బొంకక చెప్పవయా ॥గు॥ 522

## సౌరాష్ట్రం

ఉవిదకు నీకు నెట్టి వొడఁబాటులో
జవళి రతుల నీతో సాముసేసీని ॥పల్లవి॥

నలుగడలను నీవు నవ్వఁగాను
జలజాక్షి సిగ్గునను జంకించీని
బలిమిఁ గొంగు సెలసి పట్టఁగాను
నిలుచుండి లోలోనే నివ్వెరగందీని ॥ఉవి॥

అట్టె నీవు సరసము లాడఁగాను
వొట్టువెట్టి నిన్ను గోర నొరసీని
చిట్టంటుఁజేఁతల నీవు చెనకఁగాను
గుట్టుతోనే వలపులు గుబ్బతిలీని ॥ఉవి॥

చన్నులపై నీవు చేయిచాఁచఁగాను
సన్నలనే తనమోవిని చవిచూపీని
యిన్నిటా శ్రీవేంకటేశ యేలుకొంటివి
మన్నించఁగా నీతోఁ దాను మాఁటలాడీని ॥ఉవి॥ 523

## వరాళి

ఇప్పుడే చెప్పితి నీకు నెఱుకగా బుద్దులెల్లా
చిప్పిలఁ బెనఁగేవేళ సిగ్గులు వడకువే ॥పల్లవి॥

మగఁడు లాలించితేను మాఁటలెల్లా నాడవే
మొగము చూచితేను మొక్కవే నీవు
నగితే నాతనితోడ నపుపు సేసుకొనవే
జిగిఁ గూడే రతివేళ సిగ్గులు వడకువే ॥ఇప్పు॥

పిలిచితేనే పలికి ప్రియములు చెప్పవే
తలఁచినప్పుడే మతిఁ దమిరేఁచవే
యెలమి సన్నచేసితే నిచ్చలో మెలఁగవే
చెలరేఁగి పైకొంటేను సిగ్గులు వడకువే ॥ఇప్పు॥

పరపుపైఁ గూచుండితే పాదాలు నీవొత్తవే
గరిమ నాసపడితేఁ గాఁగిలించవే
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
శిరసెత్తి వేఁడుకొంటే సిగ్గులు వడకునే ॥ఇప్పు॥ 524

## ఆహిరి

తనకు నాకునుఁ బోదు తరుణు లెందరున్నాను
యెనసి నావిన్నపము లిటు చేకొమ్మనవే ॥పల్లవి॥

తా నాతో నాడినమాఁట తలఁచుకొమ్మనవే
ఆనవెట్టి చెలినైనా నడుగుమని యనవే
మోనాన వరుసదినములు యెంచుకొమ్మనవే
తానిఁక నాపై దయదలఁచుమని యనవే ॥తన॥

వాకిట నేఁవ్రాసిన వ్రాలు చూచుకొమ్మనవే
కాక తన నామేనరికము నడపుమనవే
చేకొన్న నా వుంగరము చేతఁ జూచుకొమ్మనవే
యేకాలము నన్ను నిఁక నెడయకు మనవే ॥తన॥

నాయింటి వంక చూచి మనసు గరఁగుమనవే
సేయరాని నాసేవలు చిత్తమెరుఁగుననవే
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
పాయక యెప్పుడును నాబత్తి చేకొమ్మనవే ॥తన॥ 525

## శంకరాభరణం

అందుకే వెరగయ్యీ నా కప్పటనుండి
కందువలెల్లా నెట్టు గడియించుకొంటివే ॥ పల్లవి ॥

సెలవి నవ్వులలోని చిరుసిగ్గులు
పలుకులలోపలి పచ్చి తేనెలు
తళుకు గన్నుచూపుల తరితీపులు
కలికితనా లెన్ని గడియించుకొంటివే ॥ అందు ॥

మొనసి చెలులతోడి ముసగసలు
చెనకుల కొనగోరి చిట్టంటులు
పెనఁగేటి సరసపు పెడరేఁపులు
గనమాయ నెందుండి గడియించుకొంటివే ॥ అందు ॥

సారె బొమ్మ జంకెనల సాదింపులు
యీరీతి నీకేలే యెలయింపులు
కోరి శ్రీవేంకటేశుఁడు గూడెను నన్ను
కారనాలు నీ వెంధు గడియించుకొంటివే ॥ అందు ॥ 526

## రేకు 1890 దేసాళం

నాఁడే యెఱుఁగుదుము నీ నటనలెల్లా
పోఁడిమితో మేలుమమ్ము పొసఁగితి విపుడు ॥ పల్లవి ॥

యెంత సింగారించుకొంటి వేతరీఁడవు
కాంతలఁ గంటే ( జాలు కాతరీఁడవు
పంతాన మమ్మేల యింత పచ్చిసేసేవు
వింతలా నేఁడు మాకు నీవిద్య లెల్లాను ॥ నాఁడే ॥

సరసపు మాటల సటకాఁడవు
మరుతంత్రముల యలమటకాఁడవు
చెరుఁగువట్టి నన్నెంత చెనకేవు
సొరది విన్నవేకా నీసుద్దులెల్లాను ॥ నాఁడే ॥

తనివోని వలపుల దాయఁగాడవు
ననిచి వొడఁబాటుల నాయగాఁడవు
యెనసితివి శ్రీవేంకటేశుఁడ నన్ను
పెనగొనెఁగా నీ పెద్దరికాలెల్లాను ॥ నాఁడే ॥ 527

## నాదరామక్రియ

ఇందాఁకా వాకిటనే యెదురుచూచితి నీకు
కందువతో నేఁడు నను( గడు మన్నించితివి ॥ పల్లవి ॥

సేసిన నావిన్నపాలు చిత్తాన ( బట్టెనా నీకు
ఆసుద్దులెల్లా నితవాయనా నీకు
పోసరించి నాపై దయపుట్టెనా యిప్పుడు నీకు
ఆసతో నాయింటికి రా నవధరించితివి ॥ ఇందాఁ ॥

సారె నంపిన లేకలు చదువుకొంటివా నీవు
కోరి నీమాఁట దలఁచుకొంటివా నీవు
తేరకొన నావలపు తెలిసితివా నీవు
ఆరీతి నాయింటికి రా నవధరించితివి ॥ ఇందాఁ ॥

కొంకక నేనుండేచోటు గురుతెరిఁగితివా
[1] లంకై నాతో ఁగూడ ( గలలు గంటివా
పొంకమై శ్రీ వేంకటేశ పొంచి నన్నేలి దినమూ
నంకెల నాయింటికి రా నవధరించితివి ॥ ఇందా ( ॥ 528

[1] లంకె + ఐ

## వరాళి

నమ్మి కిచ్చిన వాఁడవు నన్నేల మఱచేవు
యిమ్ములఁ గలకాలము యేలేవు నన్నును ॥ పల్లవి ॥

చిత్తమురా మాఁటలాడి చేతులెత్తి నీకు మొక్కి
హత్తి నీసేవ సేసేదే యది నా వోజ
బత్తితోడ నీరూపు భావించి సంతోసాన
యిత్తల నేనుండఁగానే యేలేవు నన్నును ॥ నమ్మి ॥

కనుసన్నల మెలఁగి కాఁపురము నీకుఁజేసి
వినయము చూపేది వేడుక నాది
మనసు నీపైఁబెట్టి మచ్చికలు నీకుఁజేసి
యెనసి నీతో నవ్వఁగా యేలేవు నన్నును ॥ నమ్మి ॥

పాయక నీవద్ద నుండి పైకొని నిన్నుఁబొగడి
నీ యిచ్చలో మెలఁగుటే నేరుపు నాకు
కాయజకేలి ( బెనఁగి కాఁగిటిలో నుండఁగాను
యేయెడా శ్రీవేంకటేశ యేలేవు నన్నును ॥ నమ్మి ॥ 529

## పాళంగం

చిత్తమురా నాతని సేవలు నే ( జేసేను
కొత్తగాఁ జుట్టరికపు గురుతులు చూపవే ॥ పల్లవి ॥

యెంత విన్నా ( దనివోదు యెలయించీ నాయాసలు
కాంత చెప్పవే యాతనికత లింకాను
దొంతర కోరికెలకు తుదమొదలెంచరాదు
చింతదీర నాతని చేఁత లెఱిఁగించవే ॥ చిత్త ॥

చూడఁ జూడ వేడుకయ్యీ సుదతి యాతని రూపు
తోడితేవే నీతనిఁ దొయ్యలి నీవు
వాడిక గలుగుచోట వలపు నిలుపరాదు
యేడనున్నాఁ డాతని యిక్కువ దెలుపవే ॥ చిత్త ॥

మనసులోఁ దలఁచితే మర్మములు గరఁగీని
యెనఇంచ ( గదవే మా యిద్దరి పొందు
తనుఁదానే వచ్చికూడె తగ శ్రీవేంకటేశుఁడు
ఘనుఁ డాతనికి నాకుఁ గట్టవే కంకణము ॥ చిత్త ॥ 530

## బౌళి

రమ్మనవే చెలియా రమణుని నీడకు
వుమ్మగిలిన వలపు లుట్టిఁగట్టఁదగదే ॥ పల్లవి ॥

సంగాతాలు సేయనేల జంపులఁ బెట్టఁగనేల
కొంగువట్టి తియ్యనేల కొంకఁగ నేల
అంగము చెనక నేల అవ్వలిమోము గానేల
ముంగిటనున్న వలపు మూలవేయఁదగదే ॥ రమ్మ ॥

ఆసలు రేచఁగనేల అనుమానించఁగ నేల
సేసలు వెట్టఁగనేల సిగ్గులేల
పోసరించి నవ్వనేల పొద్దులు గడపనేల
వాసితోఁ గూడే వలపు వలఁబెట్టఁదగదే ॥ రమ్మ ॥

సన్నలు సేయఁగనేల సారె గుట్టు చూపనేల
కన్నుల మొక్కఁగ నేల గరువమేల
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
యెన్నికకెక్కిన వల పెడయఁగఁదగదే ॥ రమ్మ ॥ 531

### శంకరాభరణం

తను నమ్మివున్నదాన తడవేల సేసీనే
ఘనుఁడు తానిన్నిటాను కరుణించు మనవే ॥ పల్లవి ॥

చనవులు సేసుకొని సరసములాడితి
ననుపున ( బతితోను నువ్వనవ్వితి
పెనఁగి పెనఁగి కడుఁ బ్రియములెల్లాఁ జెప్పితి
యెనయఁగఁ దనమన సెప్పుడు గరఁగీనే ॥ తను ॥

యిచ్చకములే నెరపి యింటికి రమ్మంటివి
విచ్చన విడిగా మొక్కితి వేఁడుకొంటిని
అచ్చపుఁ జుట్టరికము లన్నియు విన్నవించితి
తచ్చి నాపై నెన్నఁ డిఁక దయ దలఁచీనే ॥ తను ॥

చెలరేఁగి చెటరేఁగి సేవ లిట్టె సేసితి
కలపు కోలుతనానఁ గాఁగిలించితి
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
తలకొని నన్ను నెందాఁకా నెలయించీనే ॥ తను ॥ 532

**రేకు 1891** ### శుద్ధవసంతం

కంటివిగా వోయి యీపె గయ్యాళితనములు
జంటలకే పెనఁగీని సంగతేమీ నెంచదు ॥ పల్లవి ॥

యెంగిలిమోవితోడ నెదిరించి నీతోను
సంగాతపు మాటలాడీ పకియ
ముంగిటనే నిలుచుండి ములువాఁడి చూపులను
తొంగి తొంగి నిన్నుఁజూచీ దోసమేమీ నెంచదు ॥ కంటి ॥

చెమటచేతులతోడ సిబ్బితిపడక తాను
సముకాన నీకు మొక్కీ సారె సారెకు
తమితో బాదాలు నీముందర నిలువఁ బెట్టుక
అమరఁ గొలువుసేసీ నౌఁగాము లెంచదు ॥ కంటి ॥

పీఁడినతురుముతోడ విరులు పై రాలఁగాను
వోడక కాఁగిట నించీ వొరసి నిన్ను
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యీడువెట్టుకొని నవ్వీ నీకె తగవెంచదు ॥ కంటి ॥ 533

## పాడి

తానెంత మన్నించినాను తన చిత్తమింతే కాక
నేనే నాయంత వలపు నెరపఁగవచ్చునా ॥ పల్లవి ॥

తలఁపు గలిగితేను తానే వచ్చీఁగాక
బలిమిఁ దన్నుఁ బిలిచేపాటి దానవా
అలరి దయవుట్టితే నాదరించీఁగాక నన్ను
కలికితనాల దన్ను గరఁగించ నేర్తునా ॥ తానెం ॥

చుట్టరిక మెంచి నన్ను సొరిది నేలీఁగాక
వట్టి వినయాలఁ దన్ను వంచఁగలనా
అట్టె తనవేడుకకు నంటిపెనఁగీఁగాక
గుట్టుతోడ మెప్పించి కొసర నావసమా ॥ తానెం ॥

మొగమోటమునఁ దానే ముంచి కాఁగిలించీఁగాక
నగుతాఁ గొనగోరఁ జెనకవచ్చునా
తగ శ్రీవేంకటేశుఁడు తానే నన్ను నేలెఁగాక
జిగిమించి తన్ను రట్టు సేయఁగ సంగతా ॥ తానెం ॥ 534

## ఆహిరి

నీ చిత్త మెట్టుండునో నేనెఱఁగ నాయకుఁడ
యేచి నాసింగారవే యింతసేసె నన్నును ॥ పల్లవి ॥

గొప్పకన్నులనే రంటా కోరి తలవంతుఁగాని
తప్పక చూచె యందుకు ( దమకింతును
కొప్పు జారీనంటాను గుట్టుతో నుండుదుఁగాని
ముప్పిరిఁ జేతులెత్తి మొక్క నుంకింతను ॥ నీచి ॥

అలరి చన్నులు పొడవైవున్నదంటాఁగాని
కొలువుసేసే యందుకుఁ గోరుకుందును
చిలుకుమోవితేనెలు చిందునోయంటాఁగాని
పలుమారు మాటలాడ బాఁతి పడివుందును ॥ నీచి ॥

సొరిదిఁ గొనగోళ్లు సోఁకునోయంటాఁగాని
వొరసి సరసమాడ నూహింతును
ఇరవై శ్రీవేంటేశ ఇంతలో నన్నేలితివి
మరిగితి వంటా నొక్క మనసుతో నుందును ॥ నీచి ॥ 535

## ముఖారి

ఎఱుఁగుదుఁ జెప్పవే నీ కితవరిదాన నేను
నెఱియా నీసుద్దు లివి నిన్ననే వింటిని ॥ పల్లవి ॥

మనసులో తమకము మాఁటలోనే కానవచ్చు
కనుచూపులోనే యాసగానవచ్చును
మునుకొన్న రతికళ మోములోనే కానవచ్చు
యెనసిన పతి పొందు లేల దాఁచేవే ॥ ఎఱుఁ ॥

నిబ్బరపు వలపులు నిలువున ( గానవచ్చు
 గుబ్బలపైఁ గానవచ్చు గురుతులెల్లా
 వుబ్బరిసంతోసాలు వుల్లసానఁ గానవచ్చు
 అబ్బురపు నీ పొందు లడఁచనేమిటికే ॥ ఎఱుఁ ॥

సెలవుల నవ్వులోనే చేఁతలెల్లాఁ గానవచ్చు
 సొలపులఁ గానవచ్చు చుట్టరికము
 యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
 కలిగిన నీపొందులు కప్పిపెట్ట వలదే ॥ ఎఱుఁ ॥ 536

**బౌళి**

ఎంతటి బిటారి యీపె యెటువంటి వొయ్యారి
 కాంతను సంతోసించి పొగడరమ్మ చెలులు ॥ పల్లవి ॥

కొమ్మవురమున మించెఁ గుచగిరులు
 తెమ్మలాయ నందుపై ముత్తెపుసరులు
 కమ్మకొనెఁ గొప్పులోనఁ గమ్మవిరులు
 సొమ్ములతో విఱ్ఱవీఁగీఁ జూడరమ్మ చెలులు ॥ ఎంత ॥

దోమటి తట్టు పుణుఁగు తోడి చెక్కులు
 కామించిన వలపుల కనుచొక్కులు
 కోమలి మోవిఁ బలసోఁకుల పక్కులు
 యీమేటి సింగారాలు యెంచరమ్మ చెలులు ॥ ఎంత ॥

కలికి కరముల చక్కని గోరులు
 నిలువున మొలనూలి నీవి జారులు
 యెలమి శ్రీవేంకటేశుఁ డీకెఁ గూడెను
 మెలుఁత చందములెల్లా మెచ్చరమ్మ చెలులు ॥ ఎంత ॥ 537

## భైరవి

నీతలనే వేగెనా నెలఁతరో యీకతలు
నాతుల సాజము లివి నవ్వు లింతేసేఁటికే ॥ పల్లవి ॥

వుడివోని తమకము లుమ్మగిలుతా నుండఁగా
పడఁతుల వయసులు పట్టవచ్చునా
అదియాస లేపు రేఁగి ఆయములు గరఁచఁగా
తడఁబాటు వలపులు దాఁచవచ్చునా ॥ నీతి ॥

పెనగొన్న వేడుకలు పెరుగుతానుండఁగాను
మునుకొన్న సిగ్గులు ముయ్యవచ్చునా
వొనరి మోవితేనియ లూటలెత్తి వడియఁగా
చెనకుచు కాఁపురాలు సేయకుండవచ్చునా ॥ నీత ॥

చిప్పిలి రతివింతలు చెలఁగి చవులైవుండఁగా
చొప్పైన పొందులు తప్పించుకోవచ్చునా
ఇప్పుడు శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
కప్పిన యీసంతోసము కాదనఁగ వచ్చునా ॥ నీత ॥ 538

**రేకు 1892** 

## వరాళి

ఎన్నటి చుట్టరికమో యీపెకు నీకు
విన్నవించీ నీకెమాఁట వినఁగరాదా ॥ పల్లవి ॥

చలిమి బలిమి నిన్ను సారెసారెఁ గొసరీని
లలన నీవింతటను లాలించరాదా
సొలసి మలసీఁ దనచుట్టరికములు చెప్పి
తెలుపుకొనీ నీవాపె దిక్కు చూడరాదా ॥ ఎన్న ॥

అనఁగి పెనఁగి నీకు నాసపడి మొక్కీని
మునుకొన్నవలపుల ముంచఁగరాదా
చనవి మనవీఁ జూపి సరసములాడీని
ననుపున నీపెతోను నవ్వఁగరాదా ॥ ఎన్న ॥

కలసి మెలసి నిన్నుఁ గాఁగిటికి నేఁకరీని
తలకొన్న మన్ననలఁ దనుపరాదా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
నెలకొని యీకెనూ మన్నించఁగరాదా ॥ ఎన్న ॥ 539

## ఆహిరివాట

ఇంటికి రావయ్యా నీకు నెదురుచూచీ నింతి
జంటలైన మిమ్ముఁ జూచి సంతోసించుకొనేము ॥ పల్లవి ॥

చెలియ చిరునవ్వులు సెలవులఁగారఁజొచ్చె
మొలకల చన్నులు మోపులాయను
కలికి కనుచూపులు కడుఁగడువాండ్లెక్కె
నిలువు నూరు వండె నెలఁత జవ్వనము ॥ ఇంటి ॥

భామ జఘన సంపద పైకొని బండ్లు నిండె
మోమున జంద్రకళలు ముప్పిరిగొనె
ఆముకొన్న సిగ్గులెల్లా నంత నంతఁ జిగిరించె
తామర దంపరలాయ తరుణి జవ్వనము ॥ ఇంటి ॥

కాంత తురుము మొయిలు కారుకమ్మె తలకూడె
చింతలోన నడియాస చిమ్మిరేఁగెను
ఇంతలోనె శ్రీవేంకటేశ యీకెఁగూడితివి
దొంతరభోగము లాయ తొయ్యలిజవ్వనము ॥ ఇంటి ॥ 540

## శ్రీరాగం

ఇటువంటి భాగ్యములు ఇవి మీకె కలిగెను
తటుకన నిద్దరికి దగుఁదగునయ్యా ॥ పల్లవి ॥

విననింపులైనవి వెలఁదులమాఁటలు
తనువుకింపైనది గుత్తపుఁగాఁగిలి
మనసుకింపైనవి మచ్చికైన పొందులు
పనిగొనే మగవాని భాగ్యము లివియయ్యా ॥ ఇటు ॥

కోరుమోప నింపైనవి గొప్పలైన చన్నులు
నోరికి నింపైనది మనుఁగెమ్మోవి
కోరిచూడ నింపైనది కోమలపు నెమ్మోము
సారెకు మగవానికి సంపద లివియయ్యా ॥ ఇటు ॥

నవ్వులకు నింపైనవి ననుపులచేఁతలు
జవ్వనాన కింపైనది చక్కఁదనము
యివ్వల శ్రీవేంకటేశ యీకె నిట్టెకూడితివి
నివ్వటిల్లు మగవాని నేర్పు లివియయ్యా ॥ ఇటు ॥ 541

## సాళంగనాట

మాముందర నింతేసి మతకము లేమిటికి
నీమాఁట లోనిదాన నే నౌత యెఱఁగవా ॥ పల్లవి ॥

చుట్టము గాఁబోలు నీకు చూచీ నల్లాడమండి
పట్టెఁడేసి చన్నుల పడఁతి
వట్టి సిగ్గులేమిటికి వలపే కలిగితేను
గట్టిగాఁ జేయరాదా కాఁపుర మాపెతోను ॥ మాముం ॥

తారుకాణలు గాఁబోలు తగిలి సన్నలు సేసీ
చేరఁడేసి కన్నుల చెలియ
పూరకుండనేల నీకు వొన గూడ వేడుకైతే
చేరి కాఁగిలించరాదా చేయిముందుగాను ॥ మాముం ॥

పొఁగిన పొందు గాఁబోలు పాటవాడి నీమీఁద
కాఁగెఁడేసి పిఱుఁదుల కలికి
చేఁగెదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
మాఁగిన మోవియ్యరాదా మన్నించి యాకెకును ॥ మాయం ॥ 542

## బౌళి

ఎరవులులేనిచోట యెట్టున్నా మేలే
తరగని కోరికలు తారుకాణ గనక ॥ పల్లవి ॥

బిరుదునని నీతోను పెనఁగులాడినా మేలే
సొరిది మేనును మేను సోఁకుఁగనక
తెరలి సారె సారెకుఁ దిట్లాడినా మేలే
తొరలి నీపేరు నోరఁ దొట్టుకొనుఁ గనక ॥ ఎర ॥

పదరి నిన్ను జంకించి పగ చాటినా మేలే
కదిసి నామోము చూడఁగద్దు గనక
వుదుటున మారుమోమై వూరకలిగినా మేలే
యెదలోనఁ దలపోసి యింపురేఁగుఁగనక ॥ ఎర ॥

గక్కన ( గాఁతాళించి కరము చాఁచినా మేలే
మక్కువలంటి కోపాలు మానుఁగనక
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
దక్కెఁ బనులన్నీ నేలే తగులాయఁగనక ॥ ఎర ॥ 543

## ఆహిరి

తన్నుఁదానే రమణుఁడు తగిలి మన్నించీఁగాని
సన్నలా చాయలానే చల్లవే వలపులు ॥ పల్లవి ॥

బలిమి సేయఁగవద్దు పతితోఁ బెనఁగవద్దు
మొలకనవ్వులు నవ్వి మోము చూపవే
చలము సాదించవద్దు సణఁగులు రాల్చవద్దు
తళుకుఁ జూపులఁ జూచి దండ నిలుచుండవే ॥ తన్ను ॥

పంతాలాడఁగవద్దు పైకొని వాదించవద్దు
మంతనాన శిరసెత్తి మాఁటలాడవే
గంతులుసేయఁగ వద్దు రాఁగతనములు వద్దు
కొంత గొంత సిగ్గుతోడ గుట్టున మెలఁగవే ॥ తన్ను ॥

రవ్వలు సేయఁగవద్దు రచ్చలఁ బెట్టఁగ వద్దు
యివ్వలి మోమై చేతులెత్తి మొక్కవే
చివ్వన నన్నింతలోనె శ్రీవేంకటేశుఁడు గూడె
నివ్వటిల్ల మోవితేనె నీవు చలిచూపవే ॥ తన్ను ॥ 544

## రేకు 1893 ముఖారి

నీవు నాకు వలతువు నే నీకు మేలుదాన
కావరపు నీ చేఁతలు కడుమంచివయ్యా ॥ పల్లవి ॥

అంత నీకు బాఁతైన ఆసలమోసమే కాక
యెంతైనా నీకు మోసమేడయ్యా
మంతనాన మిమ్ము రేఁచే మరునినేరమిగాక
పంతముతో నీనేరాలు పట్టఁగ నేలయ్యా ॥ నీవు ॥

మగువుకు మోహించిన మనసు దోసము గాక
జగములో నీవల్ల దోసమేదయ్యా
మొగమోడించి మరిపే మోవిదే కొరతగాక
తగవెంచి నీకొరత దడవనేలయ్యా ॥ నీవు ॥

ఇదే నన్నుఁ బెండ్లి సేసిరి (న?) చుట్టాలనవ్వేఁగాక
మది మది నిన్ను నవ్వ మాకేలయ్యా
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
మొదల వెంగెమాడితి మొక్కు మొక్కేనయ్యా ॥ నీవు ॥ 545

## వరాళి

ఇప్పటి మన్నన నాయం దిట్టే నిలుపుమీ
తప్పక మిగులా నాపై దయదలఁచితివి ॥ పల్లవి ॥

చుట్టరికములు చెప్పి సోబానఁ బాడించి
అట్టె నన్ను లాలించి పెండ్లాడితివి
గట్టిగా నాముఁ(ముం?) జేతను కంకణము నీవేకట్టి
గుట్టుతో నీసంగడినే కూచుండఁబెట్టితివి ॥ ఇప్ప ॥

చాయలు సన్నలు జూపి చక్కఁదనాలు వొగడి
సేయరాని బాసలెల్లాఁ జేసితివి
చేయి గుబ్బలపైఁ జాఁచి సిగ్గులు జారఁగఁజేసి
కాయజకేలిని మది గరఁగించితివి ॥ ఇప్ప ॥

చెలిమి వచారించి సెలవినవ్వులతోడ
అలరి [1]పొత్తులనిడు కారగించితి
యెలమి శ్రీవేంకటేశ యింతసేసి కూడితివి
వలిపించితివి నన్ను వదలకుమీ ॥ ఇప్ప ॥ 546

[1] పొత్తులన్ + ఇడుక + ఆరగించితి.

## మాళవిగౌళ

తెలిసితి నీసుద్దులు తేటతెల్లమిగ నేను
మలసి నన్నిఁక నీవు మన్నించవయ్యా ॥ పల్లవి ॥

వువ్విళ్లూర మాఁటలాడి వొడఁబరచేవు నీవు
యెవ్వతె నేరిపె నీకు నింతేసి యయ్యా
నవ్వినవ్వి వేఁగినంతా నలిఁ బొద్దులువుచ్చేవు
అవ్వల నీవల పెందు నాహివెట్టితివయ్యా ॥ తెలి ॥

వొద్దికె నేఁ జెనకితే నొడ్డించుకొనేవు యీ -
విద్దెలు యేపల్లెఁ జదివితివయ్యా
చద్దికి వేఁడికి నాపై సరసాలే నెరపేవు
అద్దుక నీకాఁగిలి యేయంగడి నమ్మేవయ్యా ॥ తెలి ॥

ముందుగానే పెండ్లాడి మోవి చవు లడిగేవు
యెందరిని బెల్లించితి విట్లానయ్యా
కందువ శ్రీవేంకటేశ గట్టిగా నన్నేలితివి
యిందుకే నీవయసు మీఁదెత్తుకుండితివయ్యా ॥ తెలి ॥ 547

## వసంతవరాళి

అన్నిటా నేర్పరివి నీ కాతఁడు మేలువాఁడు
నిన్ను ( బాయకుండి యిట్టె నెలకొనుఁగాక ॥ పల్లవి ॥
నినుపులై తేనెలూరే నీమాఁటలు విని
యెనసి మన్నించక యెట్టుండునే
చెనకుల కొనగోరి చేతి మొక్కు లందుకొని
వొనరి మతిగరఁగ కూర కెట్ల నుండునే ॥ అన్ని ॥

పసిఁడి కుండలవంటి బలు నీగుబ్బలు సోఁకి
వసమౌనే కదే నీకు వలచి తాను
ముసిముసి నీనవ్వులు ముందరఁ బొలసితేను
పొసఁగి మరుగుఁ గదె పొంతనుండి నీకు ॥ అన్ని ॥

నెమ్మి శ్రీ వేంకటేశుఁడు నీ చక్కఁదనము చూచి
వుమ్మడిఁ బెండ్లాడినది వొప్పిద మౌనె
సమ్మతించి నీమోవి చవిగొనినట్టివాఁడు
కమ్మటి నీకాఁగిటికే కాణాచియౌనే ॥ అన్న ॥ 548

## మంగళకౌసిక

ఎనసేటి వేళను యెగ్గులు లే దెవ్వరికి
వానర నీకు మొక్కితి నోరుచుకోవయ్యా ॥ పల్లవి ॥

కూడిన మందె మేళాన కొసరి నిన్నేమంటినో
పాడి పంటా లెంచ కెంత పదరితినో
యీడు వెట్టుకొని నీతో నెమ్మెలెంత సేసితినో
వోడక మొక్కే నీకు నోరుచుకోవయ్యా ॥ ఎన ॥

పరవుపైఁ బండి యెంత పాదము దాఁకించితినో
సరసమాడుతా నెంత జంకించితినో
గొరబుసేసి యెప్పుడు కొనగోర గీరితినో
వారిమెతో మొక్కేనీకు నోరుచుకోవయ్యా ॥ ఎన ॥

కడుఁదమితో నెంత కాఁగిట బిగించితినో
పెడరేఁచి రతి నెంత పెనఁగితినో
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వాడికాన మొక్కే నీకు నోరుచుకోవయ్యా ॥ ఎన ॥ 549

## నాదరామక్రియ

సిగ్గులు వడకువే చెలియ నీవతనితో
వొగ్గి కలసిమెలసి వుండుదువుగాని ॥ పల్లవి ॥

యెడమాటలవల్లనే యింపులెల్లాఁ బొడమేవి
తడవే చే సన్నలనే తమి రేఁగేది
కడకంటి చూపులనే కడునాసలు వుట్టేవి
గడుసుపడి వుండితే కలిగే దేమున్నదే ॥ సిగ్గు ॥

పొలసే నేరుపులనే చుట్టరికము లయ్యేది
సెలవినవ్వులనే చిమ్మిరేఁగేది
కలకిచేఁతలనే నిక్కపుపొందు దగిలేది
వలవని గుట్టునను వచ్చేదేమున్నదే ॥ సిగ్గు ॥

చేసేటి వినయాలనే చెలిమి సతమయ్యేది
వేసరిని రతులనే వేడుకెక్కేది
ఆసతో శ్రీవేంకటేశు ఁడంతలోనె నిన్నుఁగూడె
మూసిదాఁచే సంతోసాన ముచ్చట యేమున్నదే ॥ సిగ్గు ॥ 550

రేకు 1894

## దేసాళం

నీవల్ల దోసములేదు నీ వటువంటివాఁడవా
రావయ్య మా యింటికి రవ్వసేయ నిన్నును ॥ పల్లవి ॥

వెక్కసాన నాపె నిన్ను విరుల వేయఁగాను
నిక్కి చూచితివి గాక నీ నేరమేమి
చక్క(క్కె?)రమోవి చూపి సన్నలుసేయఁగాను
చొక్కిన యందుకు నిన్ను పొలయఁగనేఁటికి ॥ నీవ ॥

చయ్యన నాపె వచ్చి చన్నులు దాఁకించఁగాను
ఇయ్యకొంటివిఁగాక నీవేమిసేతువు
వొయ్యనే పిలిచి నిన్ను నొడివట్టి తియ్యఁగాను
నెయ్యానఁ గూడినందుకు నిన్ను దూరనేఁటికి ॥ నీవ ॥

కలికి తనాల నాపె కాఁగిలించుకొనఁగాను
కలసితి వింతేకాక కాతరీఁడవా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
యెలయింపు సుద్దు లవి యెంచఁగ నేఁటికి ॥ నీవ ॥ 551

## పాడి

నీ మగఁ డిందుకేకదే నీకు మేలువాఁడాయ
యేమని పొగడవచ్చు నిటువంటి నిన్నును ॥ పల్లవి ॥

తీగెయెలుఁగులు వార తేరకొన నూఁకొనేవు
సొగకనుచూపులను సొలసేవు
లాగులుగా దంతకాంతులను వెన్నెల గాసేవు
చేగదేర నీచేఁతలు చెప్పనెట్టువచ్చునే ॥ నీమ ॥

వొయ్యారిబాగుగాను [1]వొదకిలి కూచుండేవు
గయ్యాళితనమున ( బక్కన నవ్వేవు
చెయ్యి చెక్కిటఁ బెట్టుక సిగ్గులు వెదచల్లేవు
నెయ్యపు విలాసములు నీవే నేరుతువే ॥ నీమ ॥

పలచని కెమ్మోవి ( బంచదారలు చిందేవు
నిలువెల్లా మురిపేలే నిగిడించేవు

---

[1] నేటివ్యవహారము ' వొతికిల బడుట . అన్నమయ్య కాలములో 'వొదకిలి' అని ధాత్వర్థరూపము తోచెడిని.

యెలమి శ్రీవేంకటేశు నిన్నిటాఁ జొక్కించితివి
కలికితనాలెల్లాఁ గంటిమే నీవల్లను ॥ నీమ ॥ 552

## ఆహిరి

ఏల నన్నొడఁబరచే వెఱఁగనా నీగుణము
కోటుముందుగాఁ దానే కొసరీఁగాక ॥ పల్లవి ॥

[2]వలెన నెవ్వతెకైనా వలచేటివాఁడవా
చెలి తాఁ జుట్టరికాలు చెప్పీఁగాక
పిలిచి వట్టి పొందులఁ బెనఁగేటివాఁడవా
చెలఁగి నీకాపె సేవసేయవచ్చీఁగాక ॥ ఏల ॥

నంటుసేసి వొకరితో నవ్వేటివాఁడవా
అంటిముట్ట (ట్టి?) తా సరసమాడీఁగాక
వెంట వెంటఁ జెక్కు నొక్కి వేఁడుకొనే వాఁడవా
దంటతనమునఁ దానే తగిలీఁగాక ॥ ఏల ॥

చేరి నీవు కెలనికిఁ జేయిచాఁచేవాఁడవా
కోరి తానే కాఁగిలించుకొనీఁగాక
కూరిమి శ్రీవేంకటేశ కూడితిని నన్ను నేఁడు
పోరచికి వచ్చి తానే పాదిగీఁగాక ॥ ఏల ॥ 553

## పాడి

ఈతని నాపొందులు యిఁకఁ జూడవే నీవు
నీతి నెక్కుడైనదాన నీకంటె నేను ॥ పల్లవి ॥

వట్టి మాఁకు లిగిరించ వాడికమాఁటలాడి
కట్టుకొంటివి గదే మగనిమన్నన

---

[2] వలెన్ + అని + ఎవ్వతెకైనా

బట్టబయలు నవ్వుల పందిళ్లుగాఁ బెట్ట
చుట్టమువైతివి గదే సులబాల(న?) నీవు ॥ ఈత ॥

ఆలకు గిలిగింతలు ఆట్టుగ గుబ్బలనొత్తి
ఆలవైతివిగదే యాతనికిని
గాలిబుడియలు గట్టి కలికితనాలు చూపి
వోలి గొంటివిగదే వుదుటున నీవు ॥ ఈత ॥

చెఱకునఁ బండువండ చిత్తజకళలు రేఁచి
గుఱియైతివి గదే గక్కునఁ బతికి
మఱి శ్రీవేంకటేశ్వరు మరిగించుకొంటి నేను
వెఱగందితివి గదే వేడుకతో నీవు ॥ ఈత ॥ 554

## ద్రావిళభైరవి

ఇప్పుడే విన్నవించితి మిదిగో నీకు
తప్పక మాలాగు లివి తలఁచుకోవయ్యా ॥ పల్లవి ॥

చూపులకొనల నుండు చొక్కులు మాకు
తీపులమోవిపైఁ గారు తేనియలు
పూపచన్నులంటిమా పుట్టుఁగొండలు
వోపితేనే మాపొందుల కొడిగట్టవయ్యా ॥ ఇప్ప ॥

సరుస బొమ్మలనుండు జంకెనలు
తురుమ వట్టితే రేఁగుఁ దుమ్మిదలు
గరిమఁ గొనగోరులు కడువాఁడులు
మరుగ వలసితేను మావద్దికి రావయ్యా ॥ ఇప్ప ॥

నాలిక తుదలనుండు నయగారాలు
పోలించితే నిలువునఁ బుట్టించునాస

యేలితివి శ్రీవేంకటేశుఁడు నన్ను
యీలాగులు యితవైతే నిట్టెమన్నించవయ్యా ॥ ఇప్పు ॥ 555

## నాదరామక్రియ

తా నేమిసేసినాఁడు తనకేలే వట్టిసిగ్గు
పూనిన తన చేఁతలు వొప్పుగొంటి నేను ॥ పల్లవి ॥

మొగము చూపుమను మొక్కులు మొక్కేఁదనకు
నగుమను బత్తితోఁ జెనకే నేను
సొగిసి మాఁటాడుమను చుట్టరికము చెప్పేను
తగులాయఁ దనకేలే దాఁగి యున్నాఁడిపుడు ॥ తానే ॥

సరుసఁ గూచుండుమను సమ్మతించి విడెమిచ్చే
తెర యెత్తుమను నే బందెము లాడేను
సిరులఁ జేకొమ్మను సేవలెల్లాఁ జేసేను
గరిమ నింకేలే యాడికపు లోఁగఁదనకు ॥ తానే ॥

పవ్వళించియుండుమను పాదములొత్తేఁ దనకు
చివ్వనరమ్మను తన చెక్కు నొక్కేను
ఇవ్వల శ్రీవేంకటేశుఁడింతలోఁ దావచ్చికూడె
కువ్వలాయ వలపులు కొంకఁదనకునేలే ॥ తానే ॥ 556

రేకు 1895

## శుద్ధవసంతం

సటకాఁ డేమిటికి వేసాలు సేసీనే
ఇటు నాపై బత్తిగల దెరుఁగుదు నవవే ॥ పల్లవి ॥

పెనఁగి నేఁ బిలువఁగా బిగిసి రాకుండేవాఁడు
తన తమి యెక్కడఁ బాఁతరఁ బెట్టీనే

చెనకఁగా నాతోను సిగ్గులు వడేటివాఁడు
మనసు మర్మము లెట్టు మట్టు పరచీనే ॥ సట ॥

సరసము నే నాడఁగా చాయసేసుకొనేవాఁడు
కురిసేటి చెమట లేగొంది దాఁచీనే
విరుల నే వేయఁగాను వెసనొడ్డుకొనేవాఁడు
యిరవైనపులకలు యెట్టు మానిపీనే ॥ సట ॥

గోరికొనఁ జిమ్మఁగాను గుట్టున నుండేవాఁడు
వూరేటి మోవితేనె లేవుట్టఁ బెట్టీనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
తారుకాణసంతోసా లెందాఁకాఁ జెప్పీనే ॥ సట ॥ 557

## ముఖారి

నాపాటిదానవా నానారీతుల నీవు
యేపున నీమనసులో నెంచి చూచుకొనవే ॥ పల్లవి ॥

మగఁడు మన్నించునంటా మాఁట జవదాఁటఁడంటా
పగటు లేమి చెప్పేవే పలుమారును
బిగువులు చూపుకొంటా పెద్దకొప్పు వెట్టుకొంటా
నగవు లెంత నవ్వేవే నడుమ నీవు ॥ నాపా ॥

చక్కని దాననంటా సరిగె గలదంటాను
వెక్కసి వెంతైతివే వెల్లివిరితో
నిక్కి నిక్కి చూచుకొంటా నీటులు నెరపుకొంటా
చొక్కి యేమి మురిసేవే జాటరివై నీవు ॥ నాపా ॥

పాయపు దాననంటా బలిమి కత్తెనంటా
మాయలేమి సేసేవే మతకానను

యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
ఆయము లేలంటేవే యాతని ముట్టి నీవు ॥ నాపా ॥ 558

## కేదారగౌళ

నేరుపరి వన్నిటాను నీవే యెఱుఁగుదువు
కూరిములు తొల్లి మీకుఁ గొనసాగి వున్నవి ॥ పల్లవి ॥

చెప్పఁగల ప్రియములు చెప్పఁజెలియ
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కె నీకును
కప్పముగాఁ బట్టెఁ దన కమ్మని మోవి
యెప్పుడు మన్నించేవో ఇఁకఁ జూచేము ॥ నేరు ॥

వలవఁగలట్టల్లా వలచె నింతి
మెలుపున జవ్వనము మీఁదెత్తె నీకు
నెలకొన్న చూపులను నివాళి యిచ్చె
చెలరేఁగి యెట్టు దయసేసేవో యిఁకను ॥ నేరు ॥

బెరసిన దాఁకాను పెనఁగెఁ గాంత
సరములనే సేస చల్లెనునీకు
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
సరవితో నిఁక నెట్టు చనవువిచ్చేవో ॥ నేరు ॥ 559

## సామంతం

వింతవాఁడా తానేమి వేగిరించ నేమిటికి
చెంతనుండి యెప్పుడైనా సేవసేసేతనకు ॥ పల్లవి ॥

సమ్మతించితేనే మాట చవులై యుండునే
ఇమ్ముల నేమనఁగాను యెట్టుండునో
కమ్మరఁ దానే వచ్చి కరుణించినప్పుడయ్యీ
ముమ్మాఁటికి నీవేళ మొక్కేనే తనకు ॥ వింత ॥

తగులైన పొందులే తమకము రేఁచునే
మొగమిచ్చులెల్లా ప్రియములు రేఁచీనా
తగిలి నాయింటికి తానే వచ్చిన దాఁకా
పగటు మోహము జన్నెవట్టుకుండే ( దనకు ॥ వింత ॥

పానుపుపై నుండితేనే పంతము లీడేరునే
నానినఁగాని కొంత నయమెక్కదు
తానే శ్రీవేంకటేశుఁడు తగఁ బేలకుర్తిలోన
పూని చెన్నుఁడై నన్నేలె పొంచుకుండేఁ దనకు ॥ వింత ॥ 560

## పాడి

'పేలకురితి ' చెన్నుఁ డిదె పెనఁగీ నే మొక్కఁగాను
చేలకొంగు వట్టి నన్ను ( జెక్కునొక్కీనే ॥ పల్లవి ॥

వేవేలు సతులవాఁడు వేడుకకాఁ డితఁడు
నావంక చూచి యెంతనవ్వు నవ్వీనే
భావజగురుఁడు తాను పచ్చిమోవివాఁడు తాను
వావులెల్లాఁ జెప్పి యెంత వలపించేనే ॥ పేల ॥

అతిరాజసపువాఁడు అన్నిటా వినోదకాఁడు
కతలు చెప్పి నన్నెంత గారవించీనే
చతురుఁ డన్నిటాఁ దాను చక్కనివాఁడు తాను
మతిఁగరఁగ నెంతేసిమాఁట లాడీనే ॥ పేల ॥

నెరవాది కోడెకాఁడు నెయ్యపు ( జేఁతలవాఁడు
గరిమ నన్నెంత సేసి కాఁగిలించీనే
అరిది శ్రీవేంకటాద్రియందు [1] బేరకుర్తిలోన
తిరమై నన్నేలి యెంత తెలిపి మెచ్చీనే ॥ పేల ॥ 561

---

[1] బేలకుర్తికే = బేరకుర్తి అనికూడ వ్యవహారముండినదేమో.

## ఆహిరి

మునుపనే వేఁడుకొని మొక్కితి నీకు
వొనరి మన్నించుమీ నా వొద్ద బాయక నీవు ॥ పల్లవి ॥

మనసున ( దలఁచుమీ మరి నా విన్నపములు
పనులెన్ని గలిగినాఁ బరాకు గాక
కనుకొమ్మీ ముందర నేకావించు సేవలెల్లా
అనుమానించకుమీ నీ వప్పు డెందుండినాను ॥ మును ॥

మఱవకుమీ నా మచ్చిక చుట్టరికము
జఱసి సంపద లెంత సందడించినా
గురుతువెట్టుకుండుమీ గుబ్బితిల్లు నావలపు
తఱచు సతులెందరిఁ దగిలినాను ॥ మును ॥

యెంచుకొమ్మీ నా కాఁగిటి యెరవులేనిరతులు
పొంచి యేకాంతాన వినోదించేటి వేళ
అంచెల శ్రీవేంకటేశ అట్టే నన్ను (గూడితివి
కొంచకుమీ నీ కెంత గుట్టు గలిగినాను ॥ మును ॥ 562

## రేకు 1896 సామంతం

తరుణికి నీకూ నొక్క తారుకాణఁ గాఁబోలు
గరిమ నిద్దరిపొందూ గంటిమి నే మిపుడు ॥ పల్లవి ॥

ఇంత తడవు నీరాక కెదురులుచూచెఁ జెలి
రంతుతో నీపై ( బదాలు రంగుగాఁ బాడె
కొంతవడి చెలులచే కోరి నీగుణాలు వినె
చింతించఁగానే విచ్చేసితివి నీవీడకు ॥ తరు ॥

బట్టబయల నిన్నిట్టి భావించి మాటలాడె
గుట్టుతోడ లోలోనే గుబ్బతిలెను
నెట్టనఁ జిలుకలతో నీచుట్టరికము చెప్పె
ఇట్టె విచ్చేసితి ఇంతలో నీ వీడకు ॥ తరు ॥

తన నీడ నీవంటా తగిలి కాఁగిట నించె
వినయాన మోవిమ్మని వేఁడుకొనెను
యెనసితివి సతిని యింతలో శ్రీవేంకటేశ
మునుపై విచ్చేసితివి మొనసి నీ వీడకు ॥ తరు ॥ 563

## ఆహిరినాట

నీ చిత్తము వచ్చినట్టు నీవు నన్ను మన్నించు
యేచి నీకు నెదురాడ నియ్యకొందుఁగాని ॥ పల్లవి ॥

కంటకములాడనేర కసరులు నే నేర
నంటున నీమోము చేచి నవ్వుదుఁగాని
దంటనై జంకించనోప తప్పులు వట్టఁగనోప
వెంట వెంటాఁ జెక్కునొక్కి వేఁడుకొందుఁగాని ॥ నీచి ॥

కొచ్చి కొచ్చి చూడ ఁ జాల కోపగించుకొనఁజాల
ముచ్చటతోఁ జేతులెత్తి మొక్కుదుఁగాని
కుచ్చితా లెంచ నెరఁగ గుంపించ నెన్న ఁ డెరఁగ
ఇచ్చకపుదాననై ఇంపు చూపుదు ఁ గాని ॥ నీచి ॥

యెలయించెదానఁ గాను యెగ్గుపట్టేదానఁగాను
చెలరేఁగి సేవలెల్లాఁ జేతుఁగాని
యెలమి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సొలపుల వొడిగట్టఁ జొక్కింతుఁగాని ॥ నీచి ॥ 564

## రామక్రియ

ఎట్టు సాదించవచ్చునే యిటువంటి మగవాని
నెట్టనఁ దనంతనే మన్నించితేఁ గాక ॥ పల్లవి॥

సెలవినే నవ్వుఁగాని చెప్పఁడే తనగుట్టు
సొలసి యెంత వొరసి చూచినాను
చెలి మేలేసేసుఁగాని చేతికి లోనుగాఁడే
పిలిచి పైకొని యెంత పెనఁగినాను ॥ ఎట్టు ॥

మాటలే యాడుఁగాని మనసు గరఁగఁడే
చీటికి మాటికి యెంత చెనకినాను
తేటలనే తేలుఁగాని తెమలి యసమియ్యఁడే
కూటమికి నే నెంత కొసరినాను ॥ ఎట్టు ॥

ఆసలే పుట్టించుఁగాని అంకెకు తాఁ జిక్కఁడే
వేసరక యం(యెం?) తేసి వేఁడుకొనినా
బాసయిచ్చి శ్రీవేంకటపతి నన్నుఁదానే కూడె
పాసిపోఁడే యిఁక నెంత బలిమిసేసినాను ॥ ఎట్టు ॥ 565

## వరాళి

ఈకె నీకు చెలికత్తో యిల్లాలో కాని
దాకొని యడుగరా దీతలఁపు లెవ్వరికి ॥ పల్లవి ॥

సెలవి నవ్వులతోనే చెలి నీ మొగము చూచీ
యెలమి నీ మర్మ మాకె యెరఁగఁబోలు
బలిమి నప్పటి నీతో పంతములే యాడీని
తెలియదు మీలోని తెరఁగు లెవ్వరికి ॥ ఈకె ॥

చిక్కించుక కొలువులో సిగ్గువడుతా మొక్కీ

గక్కన నాకె నీగుట్టు గనఁగ బోట
యెక్కడెక్కడో చూపి యెలయించవచ్చీని
వక్కణించరాదు మీ వరుస లెవ్వరికి ॥ ఈకె ॥

కనుబొమ్మలనే నీకుఁ గదిసి సన్నలు సేసీ
వెనకటి గుణా లాకె వినఁగఁబోలు
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
వినకెట్టుండవచ్చు మీ వేడుక లెవ్వరికి ॥ ఈకె ॥ 566

## దేసాళం

ఎంత నేరుచుకొంటివి యేమందు నిన్ను
మంతుకెక్క నెంచేఁగాని మతకము గాదు ॥ పల్లవి ॥

తరుణులఁగంటే నీవు తగిలేయాసోదానను
వెర్రై వుందానఁగాని వేసాలు గావు
మరిగించి నీవాడేటిమాఁట నయగారాలకు
అరుదందేఁగాని నీపై నాగడము గాదు ॥ ఎంత ॥

తోడనే నీ మొగమునఁ దొలఁకేకళలు చూచి
వేడుకకు నవ్వేఁగాని వెంగెము గాదు
యేడనుండైనా వచ్చి ఇంపులు సేసేయందుకు
జాడతో మొక్కేఁగాని సటలు గావు ॥ ఎంత ॥

ఇచ్చకము లెల్లాఁ జేసి ఇట్టె నన్నుఁ గూడఁగాను
రచ్చకెక్కి మెచ్చేఁగాని రవ్వలు గావు
మచ్చిక శ్రీవేంకటేశ మన్నించితి విటు నన్ను
కొచ్చి సంతోసించేఁగాని కొసరు గాదు ॥ ఎంత ॥ 567

## బౌళి

నెరజాణ వన్నిటాను నీవే నన్ను మన్నించేవు
వెరవెరిఁగి మా(మొ?)క్కేను వేగిరించనేఁటికి ॥ పల్లవి ॥

కలికితనాల నిన్ను గరఁగించవసమా
బలిమితో నీ చిత్తము పట్టవసమా
వలపించి నిన్ను నిట్టే వంచుకొనవసమా
చెలఁగి నీకుఁ బ్రియము చెప్పఁగలఁగాక ॥ నెర ॥

మాటలాడి నిన్నుఁ గడు మరిగించవసమా
యీటు వెట్టుకొని యెలయించవసమా
మేటిరతులను నిన్ను మెప్పించవసమా
సూటితో నా వినయమే చూపఁగలఁగాక. ॥ నెర ॥

బెరసి నీతో సరిఁ బెనఁగఁగ వసమా
తిరమే(మై?) నేర్పున సాదించవసమా
గరిమ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
వొరయ వసమా కూడుండఁగలఁగాక ॥ నెర ॥ 568

## రేకు 1897 సామంతం

మొకదాకిరిదానను మొదల నేను
యెకసక్కెమాడనేర నేమి సేతునయ్యా ॥ పల్లవి ॥

పొంచి నీవు నవ్వఁగాను బొమ్మల జంకించరాదు
కొంచక చెక్కు నొక్కఁగా కోపించరాదు
మంచిమాఁటలాడఁగాను మలసి తిట్టఁగరాదు
యెంచరాని నీ చేఁతల కేమి సేతునయ్యా ॥ మొక ॥

ఇచ్చకము సేయఁగాను యెరవు సేసుకోరాదు
కొచ్చి నీవు పెనఁగఁగా గుంపించరాదు
మచ్చిక గాఁగిలించగఁగా మరి యలుగఁగరాదు
యెచ్చటనుండి వచ్చేవో యేమి సేతునయ్యా ॥ మొక ॥

పైకొని విడేమియ్యఁగా పరాకు సేసుకోరాదు
జోకతో వేఁడుకోఁగాను సొలయరాదు
నీకు నీవే శ్రీవేంకటనిలయ నన్నేలితివి
యీకడ నీసంతోసాన కేమి సేతునయ్యా ॥ మొక ॥ 569

## శ్రీరాగం

ఇప్పుడుగా రమణుఁడ యీడేరె నా కోరికలు
తప్పక నాపై దయ దలఁచితివి నీవు ॥ పల్లవి ॥

కామించి నిన్నుఁ బాసిన కడలేని విరహాగ్ని
నీమేని చెమట పన్నీటఁ జల్లారె
ప్రేమఁ దలపోఁతలఁ బెనగొన్న చీఁకటి
వేమరు నీ చిరునవ్వు వెన్నెలచే బాసెను ॥ ఇప్పు ॥

గక్కన నిన్నుఁ జూడని కలువకన్నులవాడు
చొక్కి నీవదనచంద్రు ఁ జూచి తేరెను
నిక్కి కొప్పువీడిన నెరిఁదేఁటుల కలఁక
తక్క కిట్టె నీకరపద్ద(ద్మ?) ము లంటి జారెను ॥ ఇప్పు ॥

చేరి నిన్ను నెయని సిగ్గుల చిత్తజు చొక్కు
దారకపు నీ మాఁట మంత్రాలఁ దెలిసె
యీరీతి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
గారవపు వలపుల కాఁపురా లమరెను ॥ ఇప్పు ॥ 570

## పాడి

ఇదివో ద్రిష్టాంతాలు యెచి చూడరే చెలులు
యెదురెదురను మనయింటిలోనే వున్నవి ॥ పల్లవి ॥

మాటలెల్లా మంచివే మనసు లెనసితేను
చాటువకెక్కు పొందులు సమ్మతించితే
వాటమౌనుఁ దమకము వలపులు మించితేను
పాటించి కూరిమిగలపతికి సతికిని ॥ ఇది ॥

చేసినవెల్లాఁ జేఁతలే చేరి చుట్టాలై యుండితే
ఆసలు రేఁగు నెప్పుడూ నండనుండితే
బాసలెల్లా నీడేరు పాయని తగులైతేను
సేసవెట్టి పెండ్లాడిన చెలికి మగనికి ॥ ఇది ॥

భావించిన వెల్లా నౌను బత్తి కడుఁగలిగితే
చేవదేరుఁ గోరికలు చెనకి తేను
వావులౌనఁగూడీ నిదేవరుసఁ బెండ్లాడఁగాను
శ్రీవేంకటేశునకు శ్రీమహాదేవికి ॥ ఇది ॥ 571

## ముఖారి

తారుకాణ లిఁకనేలా తగులైన పనులకు
నేరుతు వన్ని విద్యలా నెరజాణ వౌదువు ॥ పల్లవి ॥

సారిది నీమోవిమీఁది సూదివాటులే చెప్పీ
గరిమల నీవు సేసే కాఁపురాలెల్లా
కురులు చెదరినట్టి గురుతులే చెప్పీని
సుతవిభవముల చొప్పులెల్లాను ॥ తారు॥

చెక్కులమీఁదటి నీ చిరుఁ జెమటలే చెప్పీ
గక్కన నీవు గడించే కలిమెల్లాను
చక్కని నీమోము కళలే చాటిచాటి చెప్పీని
మక్కువతో నీమనసుమర్మములెల్లాను ॥ తారు ॥

మనుకొన్న నీ ముసిముసి నవ్వులే చెప్పీ
పనివోని పొందులదాఁపురాలెల్లా
[1]యు(మొ?) నసిన శ్రీవేంకటేశ నీకాఁగిలే చెప్పీ
జొనగని నీనా సంది చుట్టరికా లెల్లాను ॥ తారు ॥ 572

## నాదరామక్రియ

వినవే నాబుద్ధి యిఁక వెలఁది
వొనరి యాతఁడు నీవూ నుండవే యీ కొలఁది ॥ పల్లవి ॥

చన్నులపై జారె నవె సరులు
వున్నతి రాలీఁ గొప్పులోనున్నవిరులు
మిన్నక నిండెఁగదె నీమేన గురులు
యెనఁడులేనిది యింత యేలే యీమరులు ॥ విన ॥

రాసికెక్క ఁ గదె యీకరతలు
యీసమంతైనా వొద్దే యీవెతలు
లాసి చాఁచేవేలే బాహులతలు
మోసపోకు మన్నిటికి మూలమే యీకతలు ॥ విన ॥

ముంచి తగులములకు మొదలు
అంచెల నలిగితేను అదవదలు
పొంచి వలసితేఁ గదుఁబొదలు
కొంచక శ్రీవేంకటేశుఁగూడిన సంపదలు ॥ విన ॥ 573

[1] యతిభంగము

## తెలుఁగుఁగాంబోది

తానేల మూసి దాఁచీనే తన వలపు
ఆనతిమ్మనవే నాతో నట్టె నవ్వే నేను ॥ పల్లవి ॥

వీనులఁ దన సుద్దులు వింటే నేమాయనే
నేనేమైనాఁ దన్ను నిఁక నేరమెంచేనా
తానేమి సేసినా ( జెల్లు దగ్గరి రమ్మనవే
మోనముతోఁ జెక్కు నొక్కి మొదమందే నేనూ ॥ తానే ॥

కన్నుల ( దనచేఁతలు కంటె నేమాయనే
చిన్నదానఁ దన్ను రట్టుసేసి చెప్పేనా
యిన్నీ నేరుచు నన్ను మోమెత్తి చూడుమనవే
సన్నలఁ దనగుణాలు సంతోసించే నేనూ ॥ తానే ॥

వొట్టి తనమై గుఱుతులుంటే నేమాయనే
పట్టి సోదించి తనతో పంగించేనా
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను మేలనవే
గుట్టుతో ( దనరతులు కోరి మెచ్చే నేనూ ॥ తానే ॥ 574

రేకు 1898 **శంకరాభరణం**

ఎదుర నీతఁ డుండఁగా నిదేమమ్మా
పొదిగి నీకూటమికే పూఁచుకున్నాఁడితఁడు ॥ పల్లవి ॥

చెక్కుచే యిదేఁటికమ్మా సిగ్గువడ నేఁటికమ్మా
అక్కరతో మగఁడు మాఁటాడఁగాను
చక్కఁ జూడఁ గదవమ్మా సరసము లాడవమ్మా
గక్కన నీరతులకే కాచుకున్నా ( డితఁడు ॥ ఎదు ॥

శిరసు వంచనేలమ్మా సెలవి నవ్వ నేలమ్మా
బెరసి విభుఁడు మీతోఁ బెనఁగఁగాను
తెరదియ్యఁ గదవమ్మా తెచ్చి విడేమియ్యవమ్మా
పరగ నీకే బతిమి పట్టుకున్నాఁ డితఁడు ॥ ఎదు ॥

వూరకుండనేలమ్మా వొడ్డుకొన నేలమ్మా
చేరి శ్రీవేంకటేశుఁడు చెనకఁగాను
గారవించఁ గదమ్మా కడు సంతోసించవమ్మా
కూరిమి నీరతులకే కోరుకున్నా ( డితఁడు ॥ ఎదు ॥ 575

## పాడి

ఇటువంటి నీ సుద్దులు యెవ్వఁడెరుఁగు
నటనలే సేసేవు నడుమ నీవు ॥ పల్లవి ॥

పలుకుఁ బంతాలనే పలుమారు మాఁటాడేవే
చెలఁగి యెన్నఁడు నేరిచితివోకాని
కలికితనాలనే కాఁపురాలు సేసేవే
మెలుపునఁ బతి నెంత మెప్పించేవోకాని ॥ ఇటు ॥

దారకపుఁదనాలనే దండనుండి బిగిసేవే
బీరము లింకా నెన్ని పెంచేవో కాని
నేరుపులే పచరించి నీటు లెంత చూపేవే
పేరఁబెట్టి యెమ్మె లెంత పెనచేవోకాని ॥ ఇటు ॥

మఱఁగు మొఱఁగులనే మంతనా లేమాడేవే
కఱత లెన్ని నీవల్లఁ గలవోకాని
యెఱుకతోనే శ్రీవేంకటేశుఁడు నన్నిట్టె యేలె
మఱి నీవితని నెంత మరిపేవోకాని ॥ ఇటు ॥ 576

## నాదరామక్రియ

ఎదుటికి రాఁగదవే యిట్టె నిన్ను మెచ్చేను
పొదిగొన నీనేరుపు పొగడేను నేను ॥ పల్లవి ॥

సలిగేలే మెరసేవు చనవులకే వచ్చేవు
నలి విభుఁడు నీతోను నవ్వెనంటాను
యెలమి నాతోఁ జెప్పవే యెంత గద్దో నీపగటు
వెలియఁగాఁ జెవులార వినేఁగాని ॥ ఎదు ॥

సాటులకే పెనఁగేవు సారె వావులు చెప్పేవు
సూటిగా నిన్నీతఁ డిట్టె చూచె నంటాను
పాటించి నాముందరను పచారించవే నీయెమ్మె
తేటలుగా నీ గుట్టు తెలిసేఁగాని ॥ ఎదు ॥

వంతులకే తగిలేవు వాసులెల్లా నెరపేవు
యింతలో శ్రీవేంకటేశుఁడేలెనంటాను
మంతుకెక్క నన్నీతఁడు మన్నించినాఁడు తొల్లె
సంతోస మెరిఁగించవే సమ్మతించే ఁగాని ॥ ఎదు ॥ 577

## ముఖారి

తడవము తాఁకము తానే చెనకీ నన్ను
కడఁగి యీతనిలాగు కంటివటే చెలియ ॥ పల్లవి ॥

పొరిఁబొరి వనములో పూవులు నేఁగోయ ఁగాను
సరసము లేమాడీనే జాజరకాఁడు
సరస నే నింతులతో జలకేలి సేయఁగాను
దరిమం డేమినవ్వీనే తచ్చనకాఁడు ॥ తడ ॥

మేడలోనుండి జవ్వాది మేనఁ బూసుకొనఁగాను
వీడె మేవియ్య వచ్చీనే వేడుకకాఁడు
నీడ చూచి కస్తూరిని నే బొట్టు వెట్టుకోఁగాను
వోడక యెంత మెచ్చీనే వుబ్బరికాఁడు ॥ తడ ॥

యెన్నికతోఁ గిన్నెర వాయించుకొంటా నే నుండఁగా
చన్నులేల చూచీనే జాణకాఁడు
ఇన్నిటా శ్రీవేంకటేశు ( డింతలోనె నన్నుఁ గూడె
కన్ను లెంత జంకించీనే గద్దరి కాఁడు ॥ తడ ॥ 578

## లలిత

చింతకాయ కజ్జాయము చెలువునితోడిపొందు
పంతముతో నీతని మోపవే గట్టిచన్నులు ॥ పల్లవి ॥

కొచ్చి కొచ్చి పెనఁగఁగా గుబ్బతిలె వలిపులు
తచ్చి తచ్చి మాఁటాడఁగా తమి రేఁగెను
హెచ్చి రారాఁపులవంక నింకా నెంత పెరుగునో
ఇచ్చకమే సేసి పతి కియ్యఁగదే విడెము ॥ చింత ॥

చిమ్మి చిమ్మి చూడఁగాను చీఁదరగొనె ఫెడుర(క?)
కమ్మి కమ్మి చెనకఁగా కళదాఁకెను
యెమ్మెలఁ బొరలఁగాను యెట్టుండి యెట్టౌనో
వుమ్మడి నీతనిఁజేరి వొత్తవే పాదాలు ॥ చింత ॥

[1] మో(మీ?) టి మీటి జంకించఁగా మిక్కుటమాయఁదగులు
తూటి తూటి నవ్వఁగా బొత్తులు గలసె
జాటక శ్రీవేంకటేశు సంగాతమెంత మేలౌనో
ఆటడి గాఁగిలించవే అలమేలుమంగవు ॥ చింత ॥ 579

## శ్రీరాగం

ఎఱఁగవా నీవేమైనా ఇన్నిటా జాణఁడవు
[2]మ(మె?)ఱసి మీ మహిమలు మెచ్చుకొంటగాక ॥ పల్లవి ॥

వలపు దలకెక్కితే వారించేవా రెవ్వరు
మలసి మోవితేనెలే మందులౌఁగాక
తలఁపే చీఁకటిగొంటే తగదన నెట్టువచ్చు
తెలినవ్వు వెన్నెలచే తేటవారుఁగాక ॥ ఎఱఁ ॥

విరహమే వేఁడైతే విడిపించ వెరవేది
సరససల్లాపములే చలువౌఁగాక
వొరపులే తఱమైతే వొడ్డుకొనే దెటువలె
అరిది రతుల నోలలాడుత(ట?) గాక ॥ ఎఱఁ ॥

పాయమే మరిగించితే బడివాయ నెపమేది
కాయజకేలి కాఁగిలే గతిగాక
యీయెడ శ్రీవేంకటేశ యీకె నీవూఁ గూడితిరి
పాయని సంతోసాలఁబరగుట గాక ॥ ఎఱఁ ॥ 580

**రేకు 1899** **ఆహిరి**

ఎటువంటి రసికుఁడు యేమని సంతోసింతు
తటుకన నావలపు తానే ఫించెను ॥ పల్లవి ॥

కూరిమితోఁ దనమంచిగుణాలే చెప్పుకోఁగాను
తారుకాణ్మై మాయింటికి తానే విచ్చేసి
గారవించి తా మన్నించే కతలే తలఁచగాను
చేరి వేఁడుకొని చెక్కునొక్కె నిపుడు ॥ ఎటు ॥

---

[1] యతి భంగము. [2] యతి భంగము.

ఆముకొని తనమాఁట లాలకించుకుండఁగాను
ప్రేమతోడఁ దానే నన్నుఁ బిలిచినాఁడు
గోమున సరసమాడఁగోరుక నేనుండఁగాను
చేముట్టి నాతోఁ బెనఁగి చిమ్మిరేఁచె నన్నును ॥ ఎటు ॥

నెమ్మిఁ దనకాఁగిటికి నే గాఁచుకుండఁగాను
వుమ్మడి నాచన్నులు మేనొత్తుకొనెను
నమ్మితే మనసుకు మనసే సాకిరిగాఁబోలు
ఇమ్మల శ్రీ వేంకటేశుఁ డిన్నిటా నన్నేలెను ॥ ఎటు ॥ 581

## పాడి

నీ వద్దికి వీఁడే వచ్చె నీకోరికె లీడేరె
కైవసమాయఁ బనులు కళవళించకువే ॥ పల్లవి ॥

పన్నీటికాలువసుమ్మీ బాసటపుటేరు గాదు
పున్నమ చంద్రుఁడు సుమ్మీ భూతము గాఁడు
వెన్నెల లివె సుమ్మీ వేసవి యెండలు గావు
కన్నెరో విభునిఁ బాసి కళవళించకువే ॥ నీవ ॥

కప్పురము సుమ్మీ యది కంతుపెట్లుప్పు గాదు
పుప్పొడి సుమ్మీ చొక్కు బూడిదె కాదు
వొప్పగుఁదేఁటులు సుమ్మీ వుంటవింటి గుండ్లుగావు
కప్పిన విరహమున ఁ గళవళించకువే ॥ నీవ ॥

గందపు మాఁకులు సుమ్మీ కారడవి యది గాదు
అందపు మొగ్గలు సుమ్మీ అమ్ములు గావు
ఇందువచ్చి శ్రీవేంకటేశుఁడు నిన్నిదెకూడె
కందువ మన్నన లిచ్చె గళవళించకువే ॥ నీవ ॥ 582

## శ్రీరాగం

ఎలయించి జవరాలి నెంత సేసేవు
వలవని వైరాలు వారింతువు రావయ్యా ॥ పల్లవి ॥

వెలఁది నిన్నుఁబాసి విరహాన ముంజేతి -
చిలుక ( బారఁదోలె చిగురు ( దిట్టి
పొలసిన కోవిలల పూఁచి వుంటవింటవేసి
చెలఁగి యీాపెకు బుద్ధి చెప్పుదువు రావయ్యా ॥ ఎల ॥

వెల్లవిరి నీ వాడకు విచ్చేయని కాఁతాళాన
చల్లగాలిఁ గోపగించె జాజులు గోసె
పల్లదానఁ దుమ్మిదలపై సంపెఁగలు చల్లె
మల్లాడి యీాపె కినుక మాన్పుదువు రావయ్యా ॥ ఎల ॥

తమకించి నీవు వచ్చుదాఁకా వేగిరమై
కమలము లెండఁబెట్టె కంతు సాదించె
మమతతోఁ గూడితివి మన్నించి శ్రీవేంకటేశ
ప్రమదాన నీకె నొడఁబరతురు రావయ్యా ॥ ఎల ॥ 583

### బౌళి

ఇన్నిటాను నేరుపరి యెంచి చూచితే నీతఁడు
చిన్నదాన నేనే బుద్ధి చెప్పఁగదే చెలియా ॥ పల్లవి ॥

యిచ్చకమే సేసినంటే యెరపరికమై యుండు
పచ్చిగాఁ జెనకేనంటే పంతమై యుండు
కొచ్చి కొసరేనంటే గొరబుసేసినట్టుండు
ఇచ్చట నీతనిమన సెట్టు గరఁగింతునే ॥ ఇన్ని ॥

మాటలే యాడేనంటే మందెమేళమైనట్టుండు
సాటికిఁ బ(బె?) నఁగే నంటే చలమైయుండు
నీటున నూరకుండితే నిండురాజసమైయుండు
యీటు వెట్టుక యీతని నేరీతిఁ జొక్కింతునే ॥ ఇన్ని ॥

చుట్టమనై మొక్కేనంటే జూటుఁదనమైయుండు
గుట్టున నుండేనంటే సిగ్గులైయుండు
గట్టిగా నన్నేలినాఁడు గక్కనఁ దానే వచ్చి
ఇట్టె శ్రీ వేంకటేశ్వరు నేనిట మెప్పింతునే ॥ ఇన్ని ॥ 584

## భైరవి

వినరమ్మ చెలులాల వేడుక లివిన్నియును
ఘనమైనవలపులు కడులాబమాయను ॥ పల్లవి ॥

ముత్తెపుఁ జెమటలెల్లా ముంచి ఏరులైపారె
బత్తితోడి పులకలపైరు లెక్కె
కొత్తకొత్త వయసుల కోరికలు పాలుకొనె
హత్తిన వలపులెంత అగ్గువ లౌనో ॥ విన ॥

మొగములోని కళలు మొనసిరాసులాయ
తెగని సంతోసాల గాదెలు నిండెను
అగపడ్డసరసము లామనిపై నామనాయ
తగిలి వలపులెంత దారణగలుగునో ॥ విన ॥

అచ్చమైన కాఁగిళ్లు అంగళ్లు ముంగిళ్ళునిండె
ముచ్చట చెనకులనే లచ్చెనలాయ
యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతలు నిట్టెకూడె
పెచ్చురేఁగి వలపుల చేరా లెంత యెచ్చునో ॥ విన ॥ 585

## తెలుఁగుగాంబోది

ఏమిసేతు ( జెలియా యివిగో నా చందములు
కామించి ఇంతలో వచ్చి కరుణించె విభుఁడు ॥ పల్లవి ॥

కొత్త కొత్త సిగ్గులతో గుట్టున నుందానఁగాని
చిత్త మాతనిఁదలఁచి చిమ్మిరేఁగీనే
హత్తిన తమకములు అడఁచు కుందానఁగాని
గుత్తపు వలపు లోలో గుబ్బతిలీనే ॥ ఏమి ॥

నడుమనే సెలవుల నవ్వులు నవ్వేఁగాని
వుడినోనితలపోఁత లుమ్మగిలీనే
వడదేరక బీరాన వట్టిమాఁట లాడెఁగాని
నిడువాలుఁజూపులైతే నివ్వెరగందీనే ॥ ఏమి ॥

కమ్మటి నూరకే మోముకళలు దేరీఁగాని
కమ్మఁ జెమటలు మేనఁ గారుకొనీనే
యిమ్మల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను ఁగూడె
కమ్ముకొన్న సంతోసాలు కావరించీనే ॥ ఏమి ॥ 586

**రేకు 1900** **వరాళి**

నన్నెంత వేఁడుకొనేవు నయాన నీవు
మన్నింపించుకొన్నదాన మరిగించేఁగాక ॥ పల్లవి ॥

వెగ్గటై యేమిసేసినా వెంగెమాడేనా నిన్ను
మొగమోట గలదాన మొక్కేఁగాక
నిగిడి యెంత మీరినా నీతో మారుమలసేనా
తగులు గలవానను దక్కివుందుఁగాక ॥ నన్నెం ॥

యెత్తలనుండి వచ్చినా నెగ్గుపట్టినా నిన్ను
చిత్తములోదాన సేవసేసేఁగాక
బత్తి యెందుఁగలిగినా పదరిసాదించేనా
హత్తుగడైవున్నదాన నట్టె మెచ్చేఁగాక ॥ నన్నెం ॥

సందడివలపు లెంత చల్లుకొనివున్నా నిన్ను
పొందైవున్నదానఁ దమివుట్టించే ఁగాక
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కందువైనదాన నీకు గళరేఁచేఁగాక ॥ నన్నెం ॥ 587

## సాళంగనాట

కాంతల సిగ్గు లింతేసి కాకుసేతురా
యింత వేగిరమేఁటికి యెనసేవుగాక ॥ పల్లవి ॥

విందువెట్టి యాపె నీకు విడెము చేతికియ్యఁగా
సందడించి పయ్యదలో చన్నులంటేవు
గందము పూసి వూడిగములు నీకు ఁ జేయఁగా
అంది మోవితేనెలకు నట్టె లాచేవు ॥ కాంత ॥

పువ్వులు ముడిచి నీకుఁ బూఁచి కొప్పువెట్టఁగాను
పవ్వళించుమని కొంగువట్టి తీసేవు
నివ్వటిల్ల సింగారించి నీకు సొమ్ములు వెట్టఁగా
చివ్వన నీకొనగోరు చెక్కున నూఁదేవు ॥ కాంత ॥

చొక్కించి యీపె నీకు సురటి విసరఁగాను
గక్కనఁ దమకమునఁ గాఁగిలించేవు
ఇక్కడ శ్రీవేంకటేశ నీకె సేస చల్లఁగానే
మక్కువఁ గూడి సదమదమయ్యేవు ॥ కాంత ॥ 588

## ముఖారి

మరిగి పాయకుండితే మంచివైతోఁచు
సరవిదప్పకురమ్మ సతులాల మీరు ॥ పల్లవి ॥

చెప్పరాని విరహాన చిత్తము చిక్కువడితే
కప్పురము దిన్నాను కారమై తోఁచు
దెప్పరపు వయసే దిమ్మరేఁచ దొరకొంటే
కొప్పులోని విరులైన కొంతములై తోఁచును ॥ మరి ॥

పన్నుకొన్నవలపుల పసలబారిఁ బడితే
వెన్నెలలు గాసినాను వెట్టయి తోఁచు
వున్నతపు ఁ కో(గో?)రికల నోలలాడ దొరకొంటే
చన్నులపై గందమే వేసటలై తోఁచును ॥ మరి ॥

తెగరాని సిగ్గులలో తెప్పల ఁదేలితేను
చిగురు ఁ బానుపైనా చేగలైతోఁచు
నిగిడి శ్రీ వేంకటాద్రి నిలయుఁడు గూడితేను
వెగటు లెల్లాఁబాసి వేడుకలై తోఁచును ॥ మరి ॥ 589

## సామంతం

మేలుమేలే వోపుదువే మించి యంతపనికైనా
పోలించి చెలులమెల్లా ఁ బొగడేమే నిన్నును ॥ పల్లవి ॥

వాసి గలదానికి వలపులీడేరునే
వేసరనిదానికి వినయము చెల్లునే
మోసపోనిదానికి ముచ్చటలొనరునే
బేసబెల్లిదానికి పెనఁగఁదగునే ॥ మేలు ॥

చుట్టమైనదానికి సొలయఁ బొసఁగునే
గుట్టుగలదానికి సిగ్గులు వడఁగూడునే
దిట్టయైనదానికి తిట్టినా నమరునే
గుట్టవాయదానికి ( గరఁగించవచ్చునే ॥ మేలు ॥

చెల్లుబడైన దానికి చేఁతలు దగవౌనే
యిల్లాలైన దానికి నెనయ నేరుపౌనే
వెల్లవిరిగాను శ్రీవేంకటేశుఁడేలె నిన్ను
యెల్లగా నీవంటిదాని కిన్నియు ( జొప్పడునే ॥ మేలు ॥ 590

## ఆహిరి

చిత్తమురా ( దనసేవ సేసేఁగాక
హత్తి నన్ను మోవి చవు లడుగఁగవలెనా ॥ పల్లవి ॥

యెప్పుడు దా నేమనినా నియ్యకొని నిచ్చేఁగాక
తప్పులు వెదకేనా తనతో(లో?) నేను
ముప్పిరి దనకు నేను మోహించివున్నదాన
చొప్పులెత్తి నామనసు సోదించవలెనా ॥ చిత్త ॥

గక్కనఁ జన్నులంటితే కానిమ్మని చొక్కేఁగాక
తక్కరినై పెనఁగేనా తనతోనేను
అక్కరఁ దనకు నేనాలనైతి నప్పుడే
పక్కన నన్నింత వొడఁ బరచఁగ వలెనా ॥ చిత్త ॥

వొత్తి నన్నుఁ జెనకితే వొప్పుగొని వుండేఁగాక
తత్తరించి కొసరేనా తనతో నేను
యిత్తల శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁదగులైతి
కొత్తలుగా నన్ను వేఁడుకొన నింత వలెనా ॥ చిత్త ॥ 591

## సింధురామక్రియ

నేరుపవయ్యా నాకు నీతోడి కాఁపురాలు
చేరి నీకు మోహించిన చిన్నదాన నేను ॥ పల్లవి ॥

కామించి నీకు నేను కడుబత్తి సేతును
యేమని వున్నదో చిత్త మెఱఁగ నేను
చేముట్టి సరసమాడి చెక్కునొక్కి వేఁడుకొందు
నేమముతో జొక్కించనేరను నేను ॥ నేరు ॥

చనవుసేసుక నీతో సారెకు మాఁటాడుకొను
వొనరిన నీ గుణము లూహించ నేను
పెనఁగి పెనఁగి నీపైఁ బ్రియములు చల్లుదు
తనిసి నీవుద్యోగము దలఁచ నేను ॥ నేరు ॥

చక్కని నీమోము చూచి సంతొసించుకొందును
యెక్కుడైన నీమన్నన లెంచనునేను
గక్కన శ్రీవేంకటేశ కాఁగిలించుకొందు నిన్ను
చొక్కపు నీవేళలు సోదించనేను ॥ నేరు ॥ 592

శ్రీః శ్రీః శ్రీః

1వ అనుబంధము

# అకారాదిగ రాగ - సంకీర్తన సంఖ్యా సూచి

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| అమరసింధు | : | 189, 320 |
| ఆందోళి | : | 459 |
| ఆహిరి | : | 7, 37, 43, 56, 58, 61, 65, 82, 86, 116, 125, 144, 157, 167, 187, 197, 215, 225, 248, 257, 296, 329, 338, 360, 377, 392, 428, 438, 447, 452, 460, 468, 499, 509, 518, 525, 535, 544, 553, 562, 581, 591 |
| ఆహిరినాట | : | 181, 271, 373, 496, 540, 564 |
| కన్నడగౌళ | : | 110, 456 |
| కాంబో(భో)ది | : | 32, 98, 153, 186, 204, 232, 253, 266, 356, 416, 464, 467 |
| కురంజి | : | 472 |
| కేదారగౌళ | : | 72, 284, 308, 408, 465, 507, 559 |
| గౌళ | : | 3, 18, 21, 29, 103, 127, 128, 159, 172, 175, 218, 238, 362, 401, 426, 453, 461, 483, 504, 511 |
| చాయానాట | : | 250 |
| తెలుఁగుఁగాం(కాం)బోది | : | 99, 109, 203, 262, 420, 574, 586 |
| తోండి | : | 227, 314 |
| దేవగాంధారి | : | 173, 258, 352, 419, 510 |
| దేశా(సా)క్షి | : | 83, 119, 209, 359, 365, 387 |

దేసాళం : 6, 46, 67, 94, 114, 121, 177, 180, 199, 213, 233, 268, 276, 302, 306, 344, 347, 402, 422, 431, 439, 446, 479, 497, 527, 551, 567

ద్రావిళ భైరవి : 129, 555

ధ(ద) న్నాశి(సి) : 95, 154, 260

నట్టనారాయణి : 178

నాగగాంధారి : 279

నాగవరాళి : 305

నాట : 33, 50

నాదరామక్రియ : 75, 124, 133, 168, 220, 275, 280, 298, 316, 325, 345, 379, 399, 418, 476, 520, 528, 550, 556, 573, 577

నారయణి : 205

పడ(ళ)వంజరం : 22, 36, 104, 141, 191, 237, 300, 351, 458

పాడి : 11, 28, 31, 38, 39, 49, 63, 69, 76, 91, 93,112, 118, 135, 142, 149, 165, 176, 179, 208, 212, 224, 236, 245, 256, 263, 267, 277, 289, 310, 330, 340, 343, 385, 405, 409, 427, 432, 442, 450, 462, 474, 516, 522, 534, 552, 554, 561, 571, 576, 582

పూర్వగౌళ : 311

బౌళి(భవుళి) : 20, 25, 44, 70, 84, 88, 97, 139, 148, 160, 188, 210, 229, 242, 254, 337, 348, 358, 366, 396, 403, 433, 448, 451, 466, 481, 492, 498,514, 519, 531, 537, 543, 568, 584

భల్లాటి : 158

భూపాళం : 259

భైరవి : 9, 17, 24, 40, 45, 51, 62, 74, 102, 115, 174, 243, 264, 273, 299, 309, 315, 380, 394, 421, 469, 500, 538, 585

మంగళకౌసిక : 138, 193, 219, 335, 506, 549

మధ్యమావతి : 164, 251, 303, 357, 417, 429

మాళవిగౌళ : 13, 81, 108, 113, 194, 202, 307, 383, 423, 441, 487, 495, 547.

ముఖారి : 10, 12, 52, 66, 68, 80, 101, 134, 151, 171, 216, 228, 265, 290, 291, 312, 331, 341, 349, 364, 381, 384, 414, 424,443, 473, 485, 536, 545, 558, 572, 578, 589.

రామక్రియ : 5, 8, 57, 59, 79, 87, 111, 150, 162, 185, 198, 221, 234, 239, 283, 297, 317, 327, 342, 361, 367, 374, 390, 397, 475, 484, 486, 489, 491, 503, 565.

రీతిగౌళ : 223.

లలిత : 26, 35, 47, 73, 137, 145, 156, 247, 278, 287, 313, 355, 391, 436, 457, 463, 488, 493, 512, 579.

వరాళి : 15, 19, 48, 71, 78, 85, 96, 100, 131, 147, 182, 183, 190, 195, 206, 246, 249, 269, 270, 288, 301, 336, 353, 382, 393, 395, 412, 415, 430, 434, 455, 471, 501, 505, 524, 529, 539, 546, 566, 587.

వసంతం : 477.

వసంతవరాళి : 163, 548.

వేళావళి : 53, 152, 240, 274.

శంకరాభరణం : 1, 4, 23, 64, 161, 170, 192, 200, 286, 319, 324, 332, 370, 372, 388, 400, 444, 478, 490, 513, 526, 532, 575.

శ్రీరాగం : 27, 30, 42, 54, 60, 105, 126, 143, 169, 226, 252, 293, 328, 339, 404, 407, 440, 470, 521, 541, 570, 580, 583

శుద్ధదేశి : 166, 214, 244, 281.

శుద్ధవసంత : 122, 201, 369, 413, 533, 557.

సామంతం : 2,34, 55, 90, 92, 132, 136, 140, 222, 231, 241, 255, 272, 282, 285, 295, 318, 326, 334, 354, 363, 389, 398, 410, 437, 449, 482, 502, 517, 560, 563, 569, 590.

సామవరాళి : 292, 346, 445.

సాళంగనాట : 14, 41, 117, 217, 294, 376, 480, 530

సాళంగనాట : 16, 123, 130, 155, 207, 230, 323, 350, 368, 371, 378, 411, 425, 535, 494, 508, 515, 532, 588.

సింధురామక్రియ : 120, 321, 592.

సౌరాష్ట్రం : 77, 106, 211, 261, 322, 386, 523.

హిందోళవసంతం : 107, 235, 304, 333, 375, 406.

హిజ్జిజి : 89, 184, 196, 454.

## 2వ అనుబంధము

# అకారాదిగ సంకీర్తన రాగ సంఖ్యా సూచి

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అంత చక్కని | సాళంగం | 146 |
| అంత నీకు | బౌళి | 70 |
| అందాలు సేసుక | ముఖారి | 265 |
| అందుకే దయ | ఆహిరి | 43 |
| అందుకే వెరగయ్యా | శంకారాభరణం | 526 |
| అందులకే విచారించే | వరాళి | 190 |
| అందులకే వెరయ్యా | తెలుగుఁ గాఁ ంబోది | 420 |
| అటువలెనే | ఆహిరి | 377 |
| అట్టి సెరవాది | సాళంగనాట | 123 |
| అట్టె నిన్నుఁ జూచి | పాడి | 212 |
| అడిగినాఁ జెప్పదు | పాడి | 76 |
| అడుగవే | శ్రీరాగం | 126 |
| అతనికి | మాళవిగౌళ | 423 |
| అదివో కాచుకు | దేసాళం | 268 |
| అదివో లకిమమ్మ | లలిత | 35 |
| అనివేంకటేశుఁడాడె | సాళంగనాట | 411 |
| అనుమానించఁగ | శంకరాభరణం | 286 |
| అన్నిటా జాణవు | సామంతం | 282 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అన్నిటా జాణవైతి | హిజ్జిజి | 196 |
| అన్నిటా నెరజాణ | పళవంజరం | 36 |
| అన్నిటా నేర్పరివి | వసంతవరాళి | 548 |
| అప్పట నుండి | కాంబోది | 464 |
| అప్పటిఁ బంతా | తోండి | 314 |
| అప్పటి మాతోడి | దేసాళం | 306 |
| అమరెఁగదె | దేవగాంధారి | 419 |
| అమ్మరో | నాదరామక్రియ | 124 |
| అలమేల్మంగవు | శంకరాభరణం | 324 |
| అలమేలుమంగ నీ | నాగగాంధారి | 279 |
| అలమేలుమంగపతివని | శ్రీరాగం | 328 |
| అలమేలుమంగపతివన్నిటా | శ్రీరాగం | 407 |
| అలమేలుమంగవు | పాడి | 118 |
| ఆఁటదాని | హిందోళ వసంతం | 375 |
| ఆఁటదిమానాపతి | సామంతం | 389 |
| ఆఁటదియింత | పాడి | 38 |
| ఆఁడువారిఁగంటేఁజాలు | పాడి | 224 |
| ఆతఁడదె | బౌళి | 254 |
| ఆతఁడు | సౌరాష్ట్రం | 77 |
| అతఁడెంత | ముఖారి | 215 |
| ఆతఁడెంత | బౌళి | 229 |
| ఆతఁడేడ | రామక్రియ | 486 |
| ఆతని కితవై | పాడి | 340 |
| ఆతని మాఁట | గౌళ | 128 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఆతని యిచ్చలో | పాడి | 11 |
| ఆతని వద్ది | వసంతవరాళి | 163 |
| ఆనతియ్యి | బౌళి | 337 |
| ఆపె చెప్పినట్టె | మాళవిగౌళ | 441 |
| ఆపె నీకు | లలిత | 512 |
| ఆపె మఱఁగు | ముఖారి | 341 |
| ఆపె వంకఁగడమ | సాళంగం | 480 |
| ఆయనాయ | బౌళి | 514 |
| ఆలిమగని | ముఖారి | 290 |
| ఆసలనెదురు | ఆహిరి | 329 |
| ఇంకనేల దాఁచేవే | హిజ్జిజి | 89 |
| ఇంకనేల వట్టి | పాడి | 31 |
| ఇంకా నీ దేవుల | వరాళి | 434 |
| ఇంకానెంత | రామక్రియ | 484 |
| ఇంకానేమి | వరాళి | 249 |
| ఇంటికిరావయ్యా | ఆహిరినాట | 540 |
| ఇంతకంటెఁబని | అమరసింధు | 189 |
| ఇంతటా | రామక్రియ | 79 |
| ఇంతలో | సామంతం | 318 |
| ఇంతి గుణ | పాడి | 343 |
| ఇంతి నేరుపులు | హిందోళవసంతం | 406 |
| ఇంతి పరిణామ | భైరవి | 40 |
| ఇంతిరో | గౌళ | 504 |
| ఇంతి విరహము | శ్రీరాగం | 339 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇంతులకుఁబతులకు నిక్కువ | భైరవి | 243 |
| ఇంతులకుఁబతులకు నెరవు | లలిత | 278 |
| ఇంతులకుఁ బతులకే | కేదారగౌళ | 408 |
| ఇంతులెంత | లలిత | 287 |
| ఇందరము ( జూడఁగాఁదా | బౌళి | 466 |
| ఇందరి ముందర | దేసాళం | 177 |
| ఇందరి ముందరా | ముఖారి | 364 |
| ఇందాఁకా | సౌదరామక్రియ | 528 |
| ఇందుకు | ముఖారి | 414 |
| ఇందు నిన్నుఁ దెచ్చు | హిందోళవసంతం | 235 |
| ఇందులకే | భైరవి | 115 |
| ఇచ్చకము | శ్రీరాగం | 470 |
| ఇచ్చక మెఱఁగ | రామక్రియ | 317 |
| ఇటువంటి నీ సుద్దులు | సౌరాష్ట్రం | 211 |
| ఇటువంటి నీ సుద్దులు | పాడి | 576 |
| ఇటువంటి భాగ్యములు | శ్రీరాగం | 541 |
| ఇటువంటి మనోరథా | శ్రీరాగం | 521 |
| ఇటువంటి మానాపతి | కన్నడగౌళ | 456 |
| ఇటువంటి వేడుకలు | ఆహిరి | 460 |
| ఇటువలె నుండ | ముఖారి | 228 |
| ఇటువలె నుండు | గౌళ | 461 |
| ఇట్టి నీమగని | బౌళి | 498 |
| ఇట్టుండవలదా | పాడి | 165 |
| ఇట్టే నన్నేలితివి | దేవగాంధారి | 258 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇతఁడు నా | పాడి | 91 |
| ఇదిత మావేడుక | సాళంగం | 41 |
| ఇదివో ద్రిష్టాంతాలు | పాడి | 571 |
| ఇదివో నామొగ | ఆహిరి | 144 |
| ఇదె తనకోరికె | నాదరామక్రియ | 168 |
| ఇద్దరము | దేసాళం | 67 |
| ఇద్దరి పొందులు | గౌళ | 238 |
| ఇద్దరి మీ | లలిత | 436 |
| ఇన్నాళ్లవలె ఁగాదు | పాడి | 245 |
| ఇన్నాళ్లు నెఱఁగము | శ్రీరాగం | 404 |
| ఇన్నిటాఁ జక్కని | మాళవిగౌళ | 383 |
| ఇన్నిటాఁదగ | పళవంజరం | 237 |
| ఇన్నిటాఁదా | భైరవి | 315 |
| ఇన్నిటా ఘనుఁడు | వేళావళి | 53 |
| ఇన్నిటా జాణవు | వరాళి | 288 |
| ఇన్నిటాను | బౌళి | 584 |
| ఇన్నిటా రట్టడి | రామక్రియ | 87 |
| ఇన్నిటా సంతోస | సామంతం | 92 |
| ఇన్ని నేరుపులు | రామక్రియ | 198 |
| ఇన్నీ నీవే | సామంతం | 502 |
| ఇప్పటి | వరాళి | 546 |
| ఇప్పుడుగా | శ్రీరాగం | 570 |
| ఇప్పుడు నీవు | మంగళకౌసిక | 219 |
| ఇప్పుడెరిఁగితి | రామక్రియ | 239 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇప్పుడే కంటిమి | వరాళి | 100 |
| ఇప్పుడే చెప్పితి | వరాళి | 524 |
| ఇప్పుడేల వేఁగిరించే | మాళవిగౌళ | 307 |
| ఇప్పుడేల సిగ్గు | లలిత | 145 |
| ఇప్పుడే విన్న | ద్రావిళ భైరవి | 555 |
| ఇయ్యకోలైన | పాడి | 179 |
| ఇల్లాలికిఁదగు | గౌళ | 103 |
| ఇవిగో | దేవగాంధారి | 510 |
| ఇహపరము | శంకరాభరణం | 490 |
| ఈకెకు | బౌళి | 358 |
| ఈకె నీకు చెలి | వరాళి | 566 |
| ఈస నీకు వలచు | రామక్రియ | 397 |
| ఈకె నేమూ | బౌళి | 210 |
| ఈకెమీఁద | దేశాక్షి | 387 |
| ఈతఁడొక్కఁడే | సాళంగనాట | 350 |
| ఈతని నా | పాడి | 554 |
| ఈతలఁపెరిఁగి | ఆహిరి | 257 |
| ఈవనిత | సామంతం | 255 |
| ఉద్దగిరి | పాడి | 49 |
| ఉవిదకు | సౌరాష్ట్రం | 523 |
| ఊరకున్న | బౌళి | 242 |
| ఎంచిచూచి | వరాళి | 269 |
| ఎంచి చూడ | భైరవి | 62 |
| ఎంత ఆసోద | సింధురామక్రియ | 120 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎంతకెంత | పాడి | 256 |
| ఎంత చుట్టమో | ముఖారి | 134 |
| ఎంతటి బిటారి | బౌళి | 537 |
| ఎంతని చెప్పేము | బౌళి | 403 |
| ఎంతని పొగడ | శంకరాభరణం | 23 |
| ఎంతని విన్నవించే | సౌరాష్ట్రం | 386 |
| ఎంతని విన్నవించే | ఆహిరి | 338 |
| ఎంత నీపై | తెలుఁగుగాంబోది | 109 |
| ఎంత నేరుచు | దేసాళం | 567 |
| ఎంత నేరుపరి యీకె | సామంతం | 231 |
| ఎంత నేరుపరి యీలేమ | శంకరాభరణం | 372 |
| ఎంత ప్రియాలు | అమరసింధు | 320 |
| ఎంత పొందో | మంగళకౌసిక | 335 |
| ఎంత బత్తి | నాదరామక్రియ | 220 |
| ఎంత బత్తో | భైరవి | 309 |
| ఎంత బిత్తరాలు | పళవంజరం | 104 |
| ఎంత భాగ్యవంతుఁడ | సామంతం | 363 |
| ఎంత భాగ్యవంతుఁడ | పాడి | 474 |
| ఎంత మన్నించితి | మధ్యమావతి | 417 |
| ఎంత మన్నించినా | శ్రీరాగం | 252 |
| ఎంత మోహమో | ఆహిరి | 65 |
| ఎంత యాకరీ | కాంబోది | 204 |
| ఎంత లేదీపె | దేశాక్షి | 209 |
| ఎంత లేదు చుట్టరిక | మధ్యమావతి | 357 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎంతలేదు నీపగటు | సాళంగనాట | 378 |
| ఎంత వడేయ | శంకరాభరణం | 192 |
| ఎంత వేగిర | మాళవిగౌళ | 13 |
| ఎంత వేగిర | నాదరామక్రియ | 275 |
| ఎంతేసి | లలిత | 355 |
| ఎందాఁకా జూజా | బౌళి | 88 |
| ఎందాఁకా జూజా | నాదరామక్రియ | 345 |
| ఎందాఁకా వట్టి | దేసాళం | 114 |
| ఎటువంటి పొందు | కేదారగౌళ | 507 |
| ఎటువంటి రసికుఁడు | ఆహిరి | 581 |
| ఎటువంటి వాఁడవయ్యా | దేసాళం | 302 |
| ఎటువంటివాఁడవైతి | నారాయణి | 205 |
| ఎటువంటి సన్న | శంకరాభరణం | 388 |
| ఎటువలె మన్నింతు | శ్రీరాగం | 226 |
| ఎట్టి నోము | మాళవిగౌళ | 81 |
| ఎట్టువలపించి | ధన్నాసి | 154 |
| ఎట్టు సాదించ | రామక్రియ | 565 |
| ఎట్టోరుచు | ముఖారి | 10 |
| ఎడమాఁట | ఆహిరి | 167 |
| ఎడమాఁట | సాళంగం | 376 |
| ఎదుట | ఆహిరి | 7 |
| ఎదుటికి | నాదరామక్రియ | 577 |
| ఎదుర | శంకరాభరణం | 575 |
| ఎదురు | ఆహిరి | 116 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎనసిన | సామంతం | 482 |
| ఎనసేటి | మంగళకౌసిక | 549 |
| ఎన్నఁడు | వరాళి | 353 |
| ఎన్నటి | వరాళి | 539 |
| ఎన్నిఁగత | దేసాళం | 479 |
| ఎన్నికాయ | మధ్యమావతి | 251 |
| ఎన్నివేసాలు | పాడి | 263 |
| ఎన్నేసి చేఁతలు | బౌళి | 97 |
| ఎన్నైనా ఁగలవు | శుద్ధదేశి | 244 |
| ఎపుడు వత్తువో | ముఖారి | 52 |
| ఎప్పుడు గరుణించే | నాదరామక్రియ | 298 |
| ఎప్పుడు మెచ్చేవో | బౌళి | 148 |
| ఎప్పుడూ నావాఁడ | వరాళి | 471 |
| ఎరవులు | బౌళి | 543 |
| ఎరవుసేయ | సామంతం | 295 |
| ఎఱఁగనా | లలిత | 313 |
| ఎఱఁగమిన్నాళ్ల | మంగళకౌసిక | 506 |
| ఎఱఁగ మిన్నాళ్లు | ముఖారి | 473 |
| ఎఱఁగవా | శ్రీరాగం | 580 |
| ఎఱుఁగుదు ఁజెప్ప | ముఖారి | 536 |
| ఎఱుఁగుదుఁదన | రామక్రియ | 475 |
| ఎఱుకగల | సామంతం | 437 |
| ఎలయించి | శ్రీరాగం | 583 |
| ఎలయింపు | ఆహిరి | 392 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎవ్వరికిఁగల | సామంతం | 272 |
| ఎవ్వరు బలులో | రామక్రియ | 162 |
| ఎవ్వరు వద్ద | భూపాళం | 259 |
| ఎవ్వరెరుఁగుదు | దేసాళం | 344 |
| ఏఁకరీనప్పట | పాడి | 442 |
| ఏకతపు | మాళవిగౌళ | 194 |
| ఏడనుండెనో | సాళంగనాట | 508 |
| ఏడలేని సిగ్గు | బౌళి | 160 |
| ఏ పరాకున | గౌళ | 483 |
| ఏమందునే చెలియ | సామంతం | 55 |
| ఏమందునే నేను | వరాళి | 183 |
| ఏమని చెప్పఁగ | గౌళ | 401 |
| ఏమని చెప్పఁగ | సాళంగనాట | 371 |
| ఏమని చెప్పుదునే యిట్టి | నాదరామక్రియ | 75 |
| ఏమని చెప్పుదునే యివి | శ్రీరాగం | 293 |
| ఏమని చెప్పుదు మీకె | శంకరాభరణం | 161 |
| ఏమనినాఁదన | బౌళి | 348 |
| ఏమని పొగడవచ్చునిట్టి | సాళంగనాట | 130 |
| ఏమని పొగడవచ్చు నిది | హెళంగనాట | 515 |
| ఏమని పొగడవచ్చు నిద్దరి | మాళవిగౌళ | 108 |
| ఏమనివిన్నవించేము ఇంతి | ఆహిరి | 197 |
| ఎమని విన్నవించేము యీాహె | ఆహిరినాట | 271 |
| ఎమని వున్నాఁడో | సామవరాళి | 346 |
| ఏమయ్యా | సామవరాళి | 445 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఏమిచెప్పేది | వరాళి | 455 |
| ఏమిచెప్పేదే | పాడి | 330 |
| ఏమి జాజా | దేసాళం | 439 |
| ఏమినోము | ద్రావిళభైరవి | 129 |
| ఏమిసేతు జెలి | తెలుఁగుఁగాంబోది | 586 |
| ఏమిసేతునమ్మ | తెలుఁగుఁగాంబోది | 99 |
| ఏమి సేతురా | దేసాళం | 497 |
| ఏమిసేసినాఁజెలుల | నాదరామక్రియ | 325 |
| ఏమిసేసీనో | మంగళకౌసిక | 138 |
| ఏమీ తన | గౌళ | 127 |
| ఏమే నీపంత | బౌళి | 188 |
| ఏమే నీరమణుఁడు | నట్టనారాయణి | 178 |
| ఏల తమకించే | ఆహిరి | 509 |
| ఏలదూరేవే | ఆహిరి | 468 |
| ఏల నన్నొడఁబరచే | ఆహిరి | 553 |
| ఏల లోఁగేవు | సామంతం | 354 |
| ఏలే జాణ | వరాళి | 393 |
| ఏలే యింత | రామక్రియ | 390 |
| ఒకటి కినుమ | వరాళి | 195 |
| ఒకటికొకటికిని | ముఖారి | 485 |
| ఒకటికొకటికిలంకె | సామంతం | 34 |
| ఒక్కటంటే | సాళంగనాట | 323 |
| ఒక్కటికొక్కటి | పాడి | 28 |
| ఒక్కరికె | పాడి | 176 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఒయ్యనొయ్యఁగాన | దేసాళం | 233 |
| ఒరపు నేరుతు | కాంబోది | 98 |
| కంకణము | ధన్నాసి | 95 |
| కంటిఁగంటి | మాళవిగౌళ | 487 |
| కంటిమి నీ వేడుక | సామంతం | 410 |
| కంటిమి నీ సింగా | శుద్ధ దేశి | 214 |
| కంటిమే నీ | శ్రీరాగం | 105 |
| కంటిరటే | పాడి | 277 |
| కంటిలేవే | పాడి | 405 |
| కంటివిగావోయి యీకె | సాళంగనాట | 425 |
| కంటివిగావోయి యీపె | శుద్ధవసంతం | 533 |
| కక్కసించ | కేదారగౌళ | 308 |
| కన్నెదాన | ముఖారి | 151 |
| కలశాపురము | రామక్రియ | 491 |
| కలిగెను | శంకరాభరణం | 332 |
| కాంతలలో నెల్లా | నాదరామక్రియ | 399 |
| కాంతలసిగ్గు | సాళంగనాట | 588 |
| కాఁగలమేలెల్లా | గౌళ | 426 |
| కాదనేనా | శంకరాభరణం | 513 |
| కానీలేవే | పాడి | 516 |
| కూడిన సంతోస | పాడి | 236 |
| కూరిమి | దేశాక్షి | 365 |
| కొంకకచెప్ప | పళవంజరం | 22 |
| కొత్త పెండ్లికూఁతురవు | నాదరామక్రియ | 379 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| కొత్త పెండ్లికూఁతురవై | ఆహిరినాట | 373 |
| కొమ్మచే నేమి | దేసాళం | 6 |
| కోరియెందు | హిందోళవసంతం | 333 |
| గక్కనఁజెప్ప | బౌళి | 519 |
| గద్దెమీఁద | సాళంగనాట | 435 |
| గుట్టుగల | బౌళి | 448 |
| గుట్టుతోడి | రీతిగౌళ | 297 |
| గుట్టుతోమంచి | పళవంజరం | 300 |
| గుఱుతు | పాడి | 522 |
| చక్కని గుణ | రామక్రియ | 361 |
| చనవుచెల్లించ | హిజ్జిజి | 184 |
| చనవుసేసుక | సామంతం | 326 |
| చల్లరే హరిపై | శంకరాభరణం | 319 |
| చల్లలమ్మే | ముఖారి | 312 |
| చింతకాయ | లలిత | 579 |
| చింతించకురే | సౌరాష్ట్రం | 261 |
| చిత్తగించవయ్యా | భైరవి | 102 |
| చిత్తగించి | ఆహిరి | 518 |
| చిత్తగించుమగువ | సామంతం | 517 |
| చిత్తగించుమిదె | శంకరాభరణం | 200 |
| చిత్తమురాఁదన | ఆహిరి | 591 |
| చిత్తమురా నాతని | సాళంగం | 530 |
| చిత్తము వచ్చి | లలిత | 391 |
| చిత్త మెఱఁగక | దేశాక్షి | 83 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చిత్తాన | భైరవి | 45 |
| చిత్తిణి | సాళంగనాట | 230 |
| చిన్నదాననంటాను | ముఖారి | 424 |
| చిన్నదాననంటానే | మంగళకౌసిక | 193 |
| చిన్నదానవా | లలిత | 137 |
| చిన్నదానవు | బౌళి | 451 |
| చిన్నదానవైతే | తోండి | 227 |
| చుట్టి చుట్టి | వేళావళి | 152 |
| చూచి చూచినాకు | దేసాళం | 46 |
| చూచి చూచి మీ | దేవగాంధారి | 352 |
| చూచితేఁజిన్న | సామవరాళి | 292 |
| చూడఁజూడకొత్త | భైరవి | 469 |
| చూడఁజూడవేడక | పాడి | 39 |
| చూడనే పిన్న | సామంతం | 241 |
| చూడరమ్మ | సామంతం | 285 |
| చూడరమ్మా | నాదరామక్రియ | 476 |
| చూడరె చూడనె | శంకరాభరణం | 400 |
| చూతము నీ | బౌళి | 396 |
| చూతము మన | వరాళి | 415 |
| చెనకవే | వరాళి | 147 |
| చెప్పఁగదవె | ఆహిరి | 56 |
| చెప్పఁగల | సౌరాష్ట్రం | 322 |
| చెప్పఁజెప్పఁగొత్త | వరాళి | 505 |
| చెప్పరాదు | వరాళి | 206 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చెప్పరాని ముచ్చట | మాళవిగౌళ | 113 |
| చెప్పరాని సుద్దు | సాళంగం | 14 |
| చెప్పరే యీమాఁట | ఆహిరి | 428 |
| చెప్పవే నాకొక | రామక్రియ | 327 |
| చెప్పితిఁజుమ్మీ | గౌళ | 511 |
| చెప్పితిబుద్దులు | నాదరామక్రియ | 418 |
| చెలిచిత్త | బౌళి | 139 |
| చెలిపరిణామ | శంకరాభరణం | 170 |
| చెలియమోహము | ఆహిరి | 225 |
| చెలియరో నీమగఁడు | రామక్రియ | 283 |
| చెలియరోనీవెంత | నాదరామక్రియ | 133 |
| చెలియరో యన్నాళ్లె | దేసాళం | 199 |
| చెలియున్నచంద | ఆహిరి | 82 |
| చెలులిముందర | భైరవి | 421 |
| చెలులమోములు | ముఖారి | 68 |
| చెలులాలపతిగక్క | శ్రీరాగం | 30 |
| చెలులాల బుద్దు | గౌళ | 21 |
| చెలులాల యేమని | భైరవి | 17 |
| చెలులాల రమణుని | దేసాళం | 180 |
| చెలులిందరుఁ జూడఁగా | వరాళి | 19 |
| చెల్లుబడి | గౌళ | 453 |
| చేఁతయెన్నేసి | పాడి | 427 |
| చేరి పెండ్లాడ | పాడి | 462 |
| జాగులేల | పాడి | 289 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| జాణవలపు | శంకరాభరణం | 444 |
| తగును మీ | శ్రీరాగం | 60 |
| తగులమి | సామంతం | 334 |
| తడవము | ముఖారి | 578 |
| తనకు నాకు | ఆహిరి | 525 |
| తనకు బుద్ధులు | వరాళి | 15 |
| తనియదు | వేళావళి | 274 |
| తను నమ్మి | శంకరాభరణం | 532 |
| తన్ను దానే | ఆహిరి | 544 |
| తరవాతి | వరాళి | 96 |
| తరితీపు | శుద్ధవసంతం | 122 |
| తరుణికి | సామంతం | 563 |
| తరుణులాల | కేదారగౌళ | 284 |
| తలఁచితే | వరాళి | 71 |
| తానూ | సౌరాష్ట్రం | 106 |
| తానెంత నీవెంత | సాళంగనాట | 207 |
| తానెంత నేనెంత | వరాళి | 382 |
| తానెంత మన్నించి | పాడి | 534 |
| తానేమి సేసి | నాదరామక్రియ | 556 |
| తానే యెఱుఁగును | పాడి | 63 |
| తానే యెఱుఁగు విభుఁడు | రీతిగౌళ | 223 |
| తానేల మూసి | తెలుఁగుగాంబోది | 574 |
| తారుకాణ | ముఖారి | 572 |
| తెలిపిచెప్పరే | ఆహిరి | 438 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| తెలియరాదీ | శ్రీరాగం | 169 |
| తెలిసితి | మాళవిగౌళ | 547 |
| తెలుసుకోరాదా | కేదారగౌళ | 465 |
| తెలుసుకోవయ్యా | ఆహిరి | 248 |
| తొలుత గుంపెన | పళవంజరం | 141 |
| త్రివిక్రమ | ఆహిరినాట | 496 |
| దయనాపైఁగలిగి | ఆహిరినాట | 181 |
| దొరతనములు చేసి | శంకరాభరణం | 478 |
| దొరతనములు సేసెఁదుంగ | లలిత | 493 |
| నంటున నెవ్వతె | బౌళి | 366 |
| ననిచి | శ్రీరాగం | 54 |
| నన్నుఁజూచి | రామక్రియ | 367 |
| నన్నెంత | వరాళి | 587 |
| నన్నేల | ముఖారి | 443 |
| నమ్మవే | భైరవి | 74 |
| నమ్మికిచ్చిన | వరాళి | 529 |
| నవ్వేవారి | వరాళి | 412 |
| నాఁడేయెఱుఁగు | దేసాళం | 527 |
| నాకితఁడు | పాడి | 142 |
| నాతోపొందు | రామక్రియ | 221 |
| నాపాటిదాన | ముఖారి | 558 |
| నామాఁట | హిందోళవసంతం | 304 |
| నామొగము | పాడి | 208 |
| నాయంతటి | దేసాళం | 422 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నావాఁడనే | వరాళి | 270 |
| నావిభుని | శ్రీరాగం | 440 |
| నిన్ను నాపెఁజూచి | శుద్ధదేశి | 281 |
| నిన్ను నెంచి | కాంబోది | 266 |
| నిన్ను మెత్తునో | దేసాళం | 276 |
| నిన్ను మెత్తుమో | దేసాళం | 431 |
| నిన్నూ నాపె | వరాళి | 246 |
| నిన్నేనమ్మి | ఆహిరి | 157 |
| నీకింత బాఁతై | లలిత | 47 |
| నీకు నతని | శంకరాభరణం | 64 |
| నీకు మేలది | శ్రీరాగం | 143 |
| నీకూ నీపె | సాళంగం | 217 |
| నీ కొలఁదిదాననా | శుద్ధ వసంతం | 201 |
| నీ కొలఁదివారమా | గౌళ | 362 |
| నీచిత్తమిట | రామక్రియ | 59 |
| నీచిత్తము | ఆహిరినాట | 564 |
| నీచిత్తమెట్టుండు | ఆహిరి | 535 |
| నీతలనే | భైరవి | 538 |
| నీపొందులెల్లా | నాట | 50 |
| నీమగఁడిందుకే | పాడి | 552 |
| నీమీఁద బత్తి | వరాళి | 131 |
| నీవద్దికి | పాడి | 582 |
| నీవలమేలు | సామంతం | 449 |
| నీవల్లదోసము | దేసాళం | 551 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నీవల్లనేమైనా | ముఖారి | 66 |
| నీవాపెకు | ఆహిరి | 360 |
| నీవిఁక | ఆహిరి | 58 |
| నీవుగల | ముఖారి | 101 |
| నీవునన్ను | కురంజి | 472 |
| నీవునాకు | ముఖారి | 545 |
| నీవు సేసిన | కాంబోది | 232 |
| నీవెరిఁగిన | పాడి | 267 |
| నీవెఱఁగవా చెలియ | దేసాళం | 94 |
| నీవెఱఁగవా తగవు నెఱజాణ | గౌళ | 218 |
| నీవెఱఁగవా తగవు నేము | ముఖారి | 12 |
| నీవెఱంఁగవా తగవు నేరుపరి | లలిత | 247 |
| నీవెఱంగవా బుద్ది | దేసాళం | 121 |
| నీవేఁటికిఁ జింతించే | ధన్నాసి | 260 |
| నీవే ఇది | లలిత | 73 |
| నీవే నేరుతు | బౌళి | 84 |
| నీవేమిసేతువే | ఆహిరి | 187 |
| నీవేల సిగ్గు | రామక్రియ | 342 |
| నెట్టుకొన్న | దేసాళం | 446 |
| నెరజాణవన్నిటాను నీవే | బౌళి | 568 |
| నెరజాణ వన్నిటాను నేరుపరి | కాంబోది | 467 |
| నే నిన్నువద్ద | వరాళి | 85 |
| నేనెదుట | వరాళి | 78 |
| నేరుతువు | భల్లాటి | 158 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నేరుపరి తొల్లె | రామక్రియ | 111 |
| నేరుపరి వన్నిటా | కేదారగౌళ | 559 |
| నేరుపవయ్యా | సింధురామక్రియ | 592 |
| పంతమాడితి | వరాళి | 430 |
| పంతములే | గౌళ | 159 |
| పచ్చిదేరి | కన్నడగౌళ | 110 |
| పట్టరానిది | శంకరాభరణం | 1 |
| పడఁతులాల | రామక్రియ | 489 |
| పతికిచ్చక | బౌళి | 433 |
| పతిముందర | గౌళ | 3 |
| పతివద్ద | బౌళి | 44 |
| పదివేలకు | భైరవి | 299 |
| పయ్యెద | భైరవి | 174 |
| పారరో | నాట | 33 |
| పిలువరే | ఆహిరి | 37 |
| పెండిలాడే | పాడి | 409 |
| పేలకురితి | పాడి | 561 |
| పొందుసేయ | నాదరామక్రియ | 280 |
| పొందుసేసి | వరాళి | 395 |
| పొద్దువోని | పాడి | 432 |
| పొద్దొకవింత | వసంతం | 477 |
| పొలఁతులే | పాడి | 112 |
| పోలిచితే | హిందోళవసంతం | 107 |
| బత్తిగల | సామంతం | 222 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| బాసఇచ్చిన | సాళంగం | 294 |
| బుద్ధి చెప్పేము | సాళంగం | 117 |
| మంచితనము వారికి | బౌళి | 20 |
| మంచితనముసేసితే | కాంబోది | 253 |
| మంచితనమే | వరాళి | 301 |
| మందెమేళ | మధ్యమావతి | 164 |
| మగనాఁడొకరి | లలిత | 156 |
| మగవానితో | ముఖారి | 291 |
| మగువకుఁజనవిచ్చి | దేసాక్షి | 359 |
| మగువకుఁబతితోడ | కాంబోది | 186 |
| మగువ నేరుతువే | తెలుఁగుఁగాంబోది | 203 |
| మగువలకుఁబతుల | రామక్రియ | 5 |
| మచ్చరపు | భైరవి | 500 |
| మచ్చికెంత | భైరవి | 24 |
| మనవారే | తెలుఁగుఁగాంబోది | 262 |
| మనసులో తమక | ఆహిరి | 296 |
| మనసులోనే | పాడి | 149 |
| మరిగిన | ఆహిరి | 86 |
| మరిగిపాయకుండి | ముఖారి | 589 |
| మరిగి వలచితే | నాగవరాళి | 305 |
| మఱవకు | కాంబోది | 32 |
| మఱి నేనే | రామక్రియ | 374 |
| మఱియేఁటి | ముఖారి | 331 |
| మాపంతము | సాళంగనాట | 155 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| మాముందర | సాళంగనాట | 542 |
| మిక్కిలివేడుక | పాడి | 385 |
| మీరిద్దరికే | సాళంగనాట | 368 |
| మునుపఁబదరి | కాంబోది | 416 |
| మునుపనే | ఆహిరి | 562 |
| మురిపెములెల్లా | ఆందోళి | 459 |
| మూఁడు మూరుతుల | బౌళి | 492 |
| మెచ్చిరిందరు | పళవంజరం | 351 |
| మేటి నేరుపరు | పాడి | 93 |
| మేమెఱఁగమా | సామంతం | 2 |
| మేలుకు మేలే | ముఖారి | 171 |
| మేలుగలిగితే | ఆహిరి | 215 |
| మేలుమేలు జాణవు | లలిత | 457 |
| మేలుమేలు నీగుణాలు | వరాళి | 336 |
| మేలు మేలే నిన్నుఁజూచి | ముఖారి | 80 |
| మేలు మేలే నీకతలు | భైరవి | 264 |
| మేలుమేలే యితఁడు | భైరవి | 51 |
| మేలు మేలే యెంత | గౌళ | 18 |
| మేలు మేలే | సామంతం | 590 |
| మొకదాకిరి | సామంతం | 569 |
| మొగమిచ్చ | పూర్వగౌళ | 311 |
| రమణికి | మధ్యమావతి | 303 |
| రమ్మనవే చెలి | బౌళి | 531 |
| రమ్మనవే రమణుని | వేళావళి | 240 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| రమ్మనవే వో చెలి | కాంబోది | 356 |
| రాఁపులుసేయక | పాడి | 69 |
| రాముఁడీతఁడు | రామక్రియ | 503 |
| రావే చూతువు | సామంతం | 140 |
| రావే యీతని | వరాళి | 48 |
| లలన నీకెంతైనా | శుద్ధదేశి | 166 |
| వచ్చె యెంత | ముఖారి | 349 |
| వట్టి సిగ్గులిఁక | లలిత | 26 |
| వట్టి సిగ్గులేఁటికి | దేశాక్షి | 119 |
| వద్దని తోయఁగ | రామక్రియ | 185 |
| వలపించఁబోయి | సామంతం | 90 |
| వలపుదాఁచ | వరాళి | 501 |
| వాఁడివో | దేసాళం | 402 |
| వాఁడువో | పాడి | 450 |
| వాకిటనుండి | లలిత | 463 |
| వాకిటనుండే | రామక్రియ | 150 |
| వాసులకే | హిజ్జిజి | 454 |
| వింటివేఁగొన్ని | మధ్యమావతి | 429 |
| వింటివటే | శుద్ధవసంతం | 369 |
| వింతవాఁడా | సామంతం | 560 |
| వినయమే | భైరవి | 380 |
| వినయాలు | సాళంగనాట | 494 |
| వినరమ్మ | భైరవి | 585 |
| వినవే నాబుద్ధి | నాదరామక్రియ | 573 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| విన్నవించనెట్టు | శంకరాభరణం | 4 |
| విన్నవించరే | ఆహిరి | 125 |
| విన్నవించితిమి | శ్రీరాగం | 42 |
| విన్నవించితిమి | రామక్రియ | 8 |
| విరహము | శ్రీరాగం | 27 |
| వీఁడివో | రామక్రియ | 57 |
| వీనికేలే | ఆహిరి | 61 |
| వెంగెములాడ | గౌళ | 29 |
| వెంగెముసేయ | రామక్రియ | 234 |
| వెరగయ్యా | పళవంజరం | 458 |
| వెఱవకువే చెలియా | వరాళి | 182 |
| వెఱవకువే నీవు | నాదరామక్రియ | 520 |
| వెలయఁజేపట్టి | కాంబోది | 153 |
| వెల్లవిరులాయ | సామంతం | 136 |
| వెల్లవిరులై | ఆహిరి | 447 |
| వేగమెరావయ్యా | పాడి | 310 |
| వేడుకలే | దేసాళం | 213 |
| వేఱొకటిఁగాదు | ఆహిరి | 452 |
| వేలఁగట్టి | దేవగాంధారి | 173 |
| వేవేలకు | బౌళి | 481 |
| శరణు శరణు | మాళవిగౌళ | 495 |
| శిష్టులను | గౌళ | 172 |
| సందుగలిగి | చాయానాట | 250 |
| సటకాఁడేమిటి | శుద్ధవసంతం | 557 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| సరసుఁడ వన్నిటా | ఆహిరి | 499 |
| సరసుఁడవవుదువు | లలిత | 488 |
| సరిబేసి వలపులు | పళవంజరం | 191 |
| సరిబేసులాయను | శుద్ధ వసంతం | 413 |
| సరివయసు | బౌళి | 25 |
| సిగ్గునదాఁచఁగ | మాళవిగౌళ | 202 |
| సిగ్గులనే | ముఖారి | 381 |
| సిగ్గులు వడకు | నాదరామక్రియ | 550 |
| సిగ్గువడ | పాడి | 135 |
| సిగ్గువడీ | శంకరాభరణం | 370 |
| సుదతికి | భైరవి | 273 |
| సెలవుల | గౌళ | 175 |
| సేయఁగలపని | భైరవి | 394 |
| సేయఁగలవిన్నపము | కేదారగౌళ | 72 |
| సేయఁగలవిన్నపాలు | భైరవి | 9 |
| సేయువే యాతని | సామంతం | 132 |
| సేవించరో | సాళంగనాట | 16 |
| సేసవెట్టి | నాదరామక్రియ | 316 |
| సేసవెట్టెను | ముఖారి | 384 |
| సేసితి నిప్పుడే | సామంతం | 398 |
| సేసిన నా చేఁత | దేసాళం | 347 |
| సేసేదేమే | సింధురామక్రియ | 321 |